A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com t



సూర్యదేవర రామ మోహనరావు


| | | |
|---|---|---|
| 24. | స్త్రీ విజయం వెనుక పురుషుడు | 75.00 |
| 25. | అనూహ్యం | 75.00 |
| 26. | మానవయజ్ఞం | 75.00 |
| 27. | విజయం | 75.00 |
| 28. | ఐశ్వర్యరాయ్ పర్సెస్ ఆకలి | 75.00 |
| 28. | సౌందర్యలహరి | 75.00 |
| 30. | మనోగతం | 75.00 |
| 31. | ఆమె-అతడు-ఆమె | 75.00 |
| 32. | అజేయుడు | 75.00 |
| 33. | ఆత్మాగమనం | 80.00 |
| 34. | బ్లాక్ అండ్ వైట్ | 60.00 |



త్వ ర లో !

మధుబాబు

బై రా గి

(స్వాతి వీక్లీ సీరియల్)



కాపీలకు :

శ్రీ శ్రీనివాస పబ్లికేషన్స్

4/4 ఎ. టి. అగ్రహారం. గుంటూరు 520204

ఫోన్ : 0863_2357945


# అతను

గుండెలు ఝల్లుమనే వేగంతో వచ్చి, సడన్ బ్రేకుతో తాంతియానగర్ మధ్యలో ఆగింది ఆ పోలీస్ వ్యాన్.

పొడుగాటి లాఠీలు పట్టుకుని, పుట్టలోనుంచి వెలువడుతున్న చీమలమాదిరి స్పీడ్‌గా బయటికి దూకారు పాతికమంది కానిస్టేబిల్స్.

పేదప్రజలు నివసించే ప్రదేశం ఆ తాంతియా నగర్. రెక్కాడితే గాని డొక్కాడని బడుగుజీవులు మాత్రమే కనిపించే మఫ్సల్ ఏరియా.

తూర్పుదిక్కు తెల్లబడకముందే మిడతలదండులా వచ్చిపడిన ఆ కానిస్టేబిల్స్‌ని చూసి ఖంగారుపడిపోయారు అక్కడ వున్నవారందరూ.

"ఏమయింది సాబ్? ఎందుకు వస్తున్నారు సాబ్? ఎవరు కావాలి సాబ్?" వణుకుతున్న కంఠంతో వినయాతివినయంగా ఒక కానిస్టేబిల్‌ని అడిగాడు అప్పుడే తన కాకాహోటల్‌ని తెరిచి, చాయ్ తయారుచేసే ప్రయత్నంలో నిమగ్నమై వున్న యాదగిరి.

"నోరుమూసుకుని నీ పనేదో నువ్వు చేసుకోరా బేవకూఫ్.... నోరెత్తావంటే నాలుక చీరేస్తాను" కర్కోటకుడి మాదిరి గయ్యమని అరిచి, కాకాహోటల్ వెనుకభాగంలో నిట్టనిలువుగా పెరిగివున్న ఒక గంగరావి చెట్టు వెనుక కాపలా కాశాడు ఆ కానిస్టేబిల్.

చిన్నబోయిన ముఖంతో చటుక్కున అవతలికి జరిగాడు యాదగిరి. గబగబా తలవంచుకుని తన పనిలో తాను బిజీ అయిపోతుండగా, ఠీవిగా అడుగులువేస్తూ అక్కడకు వచ్చాడు ఇన్స్పెక్టర్ సాబ్.

"చాయ్ ఇవ్వు....దొరగారికి వెంటనే మంచి స్ట్రాంగ్ చాయ్ చేసివ్వు...." ఆయన వెనుకనుంచి యాదగిరిని హెచ్చరించాడు మరో కానిస్టేబిల్.

అధికం అయిపోయింది యాదగిరి మనసులో అడుగుపెట్టిన ఆందోళన. చలి అధికం అయిపోయినట్టు వణుకుతున్న చేతులతో క్షణాలమీద రెడీ చేశాడు వేడి వేడి చాయ్ని. శుభ్రంగా తోమివున్న ఒక కప్పులో పోసి ఇన్స్పెక్టర్ సాబ్ చేతికి అందించాడు.

"ఎంతకాలం నించి ఈ హోటల్ బడ్డీని నడుపుతున్నావ్?" చాయ్ని నెమ్మదిగా సిప్‌చేస్తూ హుందాగా అడిగాడు ఇన్స్పెక్టర్ దొర యాదగిరిని.

"వ....పదేళ్ళనించీ నడుపుతున్నాను సాబ్....రేపు రెండో తారీకుకి సరిగ్గా పది నిండి పదకొండు వస్తాయి...." చేతులు కట్టుకుని సమాధానమిచ్చాడు.

"వాడు ఆ జగజీత్‌గాడు ఇక్కడికి వస్తూంటాడా?" చేతిలో వున్న కప్పుమీదినించి దృష్టిని మరలించకుండానే, చాలా క్యాజువల్‌గా అడిగాడు ఇన్స్పెక్టర్.

"జగజీతా? ఎవరు? మా పహిల్వాన్ జగజీతేనా? తను ఇక్కడికి రాకుండా ఇంకెక్కడికి పోతాడు సాబ్? ఉదయం రెండుసార్లు, సాయంత్రం నాలుగుసార్లు వచ్చి చాయ్ తాగందే తనకి ఏమీ తోచదు సాబ్...." సంతోషంగా చెపుతూ సడన్‌గా మాటల్ని ఆపేశాడు.

పనికట్టుకుని పోలీసులు ఎవరి పేరునైనా పలకడం అంటూ జరిగితే, ఆ పేరున్న మనిషి పని అక్కడితో ఖతం అయిపోయినట్టే అంటారు అందరూ.



గొంతుకు ఏదో గులకరాయి అడ్డుపడిన సెన్సేషన్ వెంటనే కలిగింది యాదగిరికి. "ఎందుకు సార్ అడుగుతున్నారు? వాడు ఏం చేశాడు సార్?" చిన్న కంఠంతో వినయాతివినయంగా అడిగాడు ఇన్స్పెక్టర్‌ని.

"వాడు మామూలోడు కాదు. పెద్ద చోర్ బద్మాష్....దామా నగర్‌లో సేట్‌సిబ్రమాన్ దగ్గిర పదిలక్షలు దొంగతనం చేశాడు. వాణ్ణి వదిలిపెట్టం" ఖాళీ అయిన కప్పును పక్కన పెడుతూ అన్నాడు ఇన్స్పెక్టర్ దొర.

తన తల గిర్రున తిరిగిపోతున్నట్టు అనిపించింది యాదగిరికి. "సాబ్....మీకు ఎవరో చాలా తప్పుగా చెప్పారు. మా జగజీత్ అట్టాంటోడు కాదు. ఎప్పుడో చాలా చిన్నగా వున్నప్పుడు తను చిల్లర దొంగతనాలు చేసినమాట నిజమే. అయితే అందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. జైల్లోనుంచి బయటికి వచ్చిన తర్వాత అప్పటినించీ ఇప్పటివరకూ అట్టాంటి పనులేవీ చేయడంలేదు. మోండా మార్కెట్‌లో మూటలు మోసి బతుకుతున్నాడు" తడబడుతున్న కంఠంతో నచ్చచెప్పడానికి చాలా ప్రయత్నం చేశాడు.

"అరే బేవకూఫ్....ఒకసారి చోర్ బద్మాష్ అయినవాడు ఎప్పుడూ చోర్ బద్మాష్‌కిందే లెక్క. కుక్కతోక సాపుగా ఎప్పుడూ వుండదు. వంకరగానే వుంటుంది" అంటూ బడ్డీ బయటికి పోయాడు ఇన్స్పెక్టర్ దొర.

"అదికాదు సాబ్....మీరు కావాలంటే ఈ అడ్డాలో వున్నవాళ్ళనెవరినైనా అడగండి. మంచివాడు మా జగజీత్. వాడు అట్టాంటోడు కాదు సాబ్" అంటూ అతని వెనుకే తనూ బడ్డీ బయటికి పోబోయాడు యాదగిరి. అంతలోనే చాయ్ బడ్డీ వెనుకభాగంలో వున్న గుడిసెలమధ్య చెలరేగింది దారుణమైన గందరగోళం.

"పారిపోతున్నాడు.... చోర్‌బద్మాష్ పారిపోతున్నాడు. పట్టుకోండి" అని గావుకేకలు పెడుతూ తిరిగి రోడ్డుమీదికి పరిగెత్తుకువచ్చారు లోపలికి పోయిన కానిస్టేబిల్స్‌లో కొంతమంది.

"ఇదుగో....ఇదుగో....ఇదుగిదుగో" అని అరిచాడు బడ్డీ వెనుక గంగరావిచెట్టు చాటున మాటువేసి వున్న కానిస్టేబిల్. పెద్దపులుల మంద మాదిరి అటుకేసి తిరిగారు అందరూ. లాఠీలను గాలిలోకి ఎత్తి ఘొల్లున

అరుస్తూ ముందుకు దూకబోతుండగా, రాకెట్ మాదిరి వారి మధ్యలోకి దూరింది ఒక పర్సనాలిటీ. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో రోడ్డు క్రాస్‌చేసి ఆవలివైపున వున్న కట్టడం మధ్యకు వెళ్ళి మాయమైపోయింది.

"పోయాడు....పారిపోయాడు....ఇంతమందిమి ఇక్కడ వుండగా అందరినీ వెర్రోళ్ళను చేసి వెళ్ళిపోయాడు...." కచ్చిగా అంటూ తన బూటుకాలితో నేలను కోపంగా బలంగా తన్నాడు ఇన్స్‌పెక్టర్ దొర.

"వాడు పట్టి జలగలా వున్నాడు సాబ్. వాడి గుడిసె చుట్టూ నిలబడ్డాం. తలుపు పగలగొట్టి లోపలికి పోకముందే మమ్మల్ని ఏమార్చాడు. వాడు పట్టి లఫూట్....బద్మాష్" తాము పడిన కష్టాన్ని వివరించి చెప్పబోయి, అకస్మాత్తుగా ఆగిపోయాడు ఒక కానిస్టేబిల్.

చేతికి దొరికినట్టే దొరికి చిటికెలో చేజారిపోయిన ఆ దొంగ రాస్కెల్ జగజీత్‌ని తలుచుకుని ఆ క్షణంలో పళ్ళు పటపటలాడిస్తూ వుండవలసిన ఇన్స్‌పెక్టర్ దొర, అట్టాంటి పని ఏదీ చేయడంలేదు.

"ఎక్కడికి పోతాడు? ఈ సాయంత్రం లోపల మన చేతికి చిక్కతీరతాడు...." అంటూ తన వెనుకపక్కన నిలబడివున్న ఇంకో కానిస్టేబిల్‌వైపు చూశాడు.

"తీసుకురండి....ఈ హోటల్లో వున్న బద్మాష్‌ని తీసుకువచ్చి వ్యాన్ ఎక్కించండి. వీడికి, ఆ జగజీత్‌గాడికి దోస్తీ....వీడిని రెండు ఉతికితే, వాడు ఎక్కడ దాక్కునేదీ మనకి తెలిసిపోతుంది. తీసుకురండి హోటల్ బద్మాష్‌ని...." అని ఆర్డర్ ఇచ్చాడు అతను.

నోరు తెరుచుకుని చూస్తున్నాడు యాదగిరి. ఇన్స్‌పెక్టర్ సాబ్ ఇచ్చిన ఆర్డర్‌ని వినేసరికి కాళ్ళకింద వున్న భూమి కంపిస్తున్నట్టు అనిపించి, చాయ్ కౌంటర్‌ని ఆనుకున్నాడు, కిందపడిపోతానన్న భయంతో.

"రారా....స్టేషన్‌కి పోదాంరా...." అంటూ యాదగిరి షర్టును ఒడిసి పట్టుకున్నాడు రెండు అంగల్లో అతని దగ్గిరికి వచ్చిన కానిస్టేబిల్.

"సాబ్....ఇది అన్యాయం. నాకేమీ తెలియదు. నన్ను స్టేషన్‌కి తీసుకుపోవడం అన్యాయం సాబ్...." చేతులు జోడించి ఖంగారుగా వేడుకున్నాడు యాదగిరి.

"అన్యాయం గిన్యాయం అన్నీ స్టేషన్లో తేలతాయి.పచ్చి వ్యానెక్కు-బే



....రా...." కర్కశంగా అంటూ అతన్ని బలవంతంగా లాక్కుపోయి వ్యాన్‌లోకి నెట్టాడు ఆ కానిస్టేబిల్. పొగలు విడుస్తూ కదిలింది వ్యాన్.

గుడిసెల మధ్యకి పోయిన కానిస్టేబిల్స్ అందరూ వచ్చి ఎక్కగానే, వేగంగా ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టింది.

## 2

అలసిపోయిన పాదాల్ని అతిప్రయత్నంమీద కదిలిస్తూ ఉదయం ఎనిమిది గంటల సమయంలో బీబీచౌక్‌ని చేరుకున్నాడు జగజీత్. వేగంగా వచ్చి అతనిముందు ఆగింది ఒక ఆటో.....

"అరే జగజీత్ భాయ్....నువ్వు ఇక్కడ వున్నావా?" అంటూ స్టీరింగ్‌ని వదిలి కిందికి దిగాడు డ్రయివర్.

"ఏంటి బే? ఏమయింది??" అతని ముఖంలోకి అనుమానంగా చూస్తూ అడిగాడు జగజీత్.

"ఏమవకూడదో అదే అయింది. నువ్వు పోలీసులకు దొరక్కుండా పారిపోయివచ్చావ్. వాళ్ళు మన యాదగిరిని పట్టుకుపోయారు. స్టేషన్లో పడేసి మక్కెల్ విరగేస్తున్నారంట...." గొంతు తగ్గించి చెప్పాడతను.

"యాదగిరిని పట్టుకుపోయారా? యాదగిరిని ఎందుకు పట్టుకుపోవడం?" ఆశ్చర్యంగా అడిగాడు జగజీత్.

"ఆడు నీ దోస్తని ఆళ్ళకు తెల్సిపోయింది. ఆడిని ఇరగేస్తే నువ్వు బైటికొచ్చేస్తావని అర్థమైవుంటుంది" అని చెప్పి, ఎంత సడన్‌గా వచ్చాడో, అంతే సడన్‌గా ఆటోని నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

వేపాకు నమిలినట్టు చేదుగా తయారైపోయింది జగజీత్ నోరు.... ముఖంమీది చెమట బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ నడక మొదలుపెట్టాడతను.

రెండు గంటలు పట్టింది అతనికి సిటీ కాలేజీ దగ్గిరికి చేరుకోవడానికి.

కాలేజీ గేటును దాటి లోపలికి పోయాడు.

"హేయ్....ఎవరు నువ్వు? ఎందుకు వస్తున్నావ్ ఇక్కడికి?" అతన్ని, అతని అవతారాన్ని చూసి అసహ్యంగా నొసలు విరుస్తూ అడిగాడు ఒక పెద్దమనిషి.

అతనెవరో జగజీత్‌కి తెలియదు. అయినా నమస్కారం చేశాడు. "దీపక్‌బాబు ఇక్కడ చదువుకుంటున్నాడు. ఆ బాబుకోసం వచ్చాను...." వినయంగా చెప్పాడు.

"దీపక్‌బాబూ....తను క్లాసులో లేడు....అడుగో.... క్యాంటీన్ దగ్గిర వున్నాడు" ఒక పక్కగా వున్న పెద్ద రేకులషెడ్‌ని చూపిస్తూ చెప్పాడు ఆ పెద్దమనిషి. ఆయనకు ఇంకో నమస్కారం చేసి, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ షెడ్ దగ్గిరికి బయలుదేరాడు.

పదిమంది దోస్తులు తన చుట్టూ నిలబడివుండగా, ఎవరో చేసిన కామెంట్‌కి విరగబడి నవ్వుతున్నాడు దీపక్.

"ఎవరో కాళ్ళు ఈడ్చుకుంటూ వస్తున్నారు. ఎవరికోసమో ఎవరికైనా తెలుసా?" ఉన్నట్లుండి అన్నాడు అతని దోస్తుల్లో ఒకతను. అందరితోపాటు తను కూడా తల తిప్పి, ఆశ్చర్యంగా నొసలు ఎగరవేశాడు దీపక్.

"అతని పేరు జగజీత్. మోండా మార్కెట్‌లో మూటలు మోస్తూ వుంటాడు. బహుశా నాకోసమే అయివుంటుంది" అంటూ ముందుకు బయలుదేరాడు.

"నీ ఫ్రెండ్స్ సర్కిల్ చాలా వింతగా వుంటుందిరా....మూటలు మోసేవాళ్ళు, కాపుసారా బాటిల్స్ సప్లయ్‌చేసేవాళ్ళు అందరూ నీకు స్నేహితులే. అసలు నీకు దోస్తులు కానివాళ్ళు ఈ సిటీ చుట్టుపట్ల ఎవరైనా వున్నారా?" నవ్వుతూ అడిగాడు ఒక ఫ్రెండ్.

ఆ మాటల్ని దీపక్ వినిపించుకోలేదు. కాళ్ళల్లో ఓపిక లేకపోయినా వేగంగా రావడానికి ప్రయత్నిస్తున్న జగజీత్‌కి ఎదురు వెళ్ళి, అభిమానంగా అతని భుజంమీద చెయ్యి వేశాడు.

ఒక్కసారిగా బ్రేక్‌డౌన్ అయిపోయాడు జగజీత్. తనకు తెలియకుండానే ఉబికివచ్చిన కన్నీటిని దాచుకోవడం చేతకాక, నాపురుసుటూం కూర్చుండిపోయాడు.



"అరెరే....ఏమైంది జగజీత్....ఏమైందో నాకు చెప్పు" అతని భుజంమీద చెయ్యివేసి అనునయంగా అంటూ, వెనక్కి చూసి క్యాంటీన్‌లోని వెయిటర్‌కి సైగ చేశాడు దీపక్. మాటల్లో చెప్పాల్సిన అవసరం లేకుండానే అర్థం చేసుకుని, రెండు గ్లాసుల్లో మంచినీళ్ళను తీసుకుని అతని దగ్గిరికి పరిగెత్తుకువచ్చాడా వెయిటర్.

బలవంతంగా మంచినీళ్ళు తాగించి, ముఖం కడిగించాడు దీపక్.

"వేడిగా మంచి చాయ్ తీసుకురా....వెళ్ళు" అని వెయిటర్‌ని పంపించి, తను జగజీత్ పక్కన కూర్చున్నాడు.

"అయ్యయ్యో....మీరు కింద కూర్చోవడం ఏమిటి బాబూ.... అయ్యయ్యో....లేవండి....త్వరగా లేవండి...." కంగారుగా అంటూ తను పైకి లేచి, దీపక్‌ని కూడా లేపడానికి ప్రయత్నం చేశాడు జగజీత్.

"లేవకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏమీ లేదుగాని, నువ్వు ఎగ్‌స్ట్రాలు చేయకుండా కూర్చో...." అతని చేతిని మృదువుగా పదిలించుకుంటూ అన్నాడు దీపక్.

అతన్ని పైకి లేపే ఉద్దేశ్యాన్ని వెంటనే విరమించుకున్నాడు జగజీత్. అయితే తను మాత్రం కూర్చోలేదు.

సెగలు పొగలు వెలువరుస్తున్న చాయ్ కప్పును తీసుకువచ్చి జగజీత్‌కి ఇచ్చాడు వెయిటర్. దీపక్‌కి ఎదురుగా నిలబడకుండా ఒక పక్కకు తిరిగి మూడు గుక్కల్లో ఆ కప్పును ఖాళీచేసేశాడు జగజీత్.

"నీ వరస చూస్తుంటే లేచిన దగ్గిర్నించీ ఒక్కటే హడావుడి పడుతున్నట్టు కనిపిస్తోంది. ఇప్పుడు చెప్పు....ఏం జరిగింది? మోండా మార్కెట్‌లో ఏదైనా గొడవ జరిగిందా?" ప్యాంటుజేబులోనుంచి ఒక సిగరెట్‌ని తీసి వెలిగించుకుని అడిగాడు దీపక్.

"పోలీసులు నాకోసం వెతుకుతున్నారు బాబూ. సిమ్రాన్ సేట్ దగ్గిర పదిలక్షలు దొంగతనం చేశానుట" అంటూ జరిగింది ఏమిటో చెప్పాడు జగజీత్.

సగంవరకూ కాలిన సిగరెట్‌ని అవతలకు విసురుతూ, కనులు చిట్లించాడు దీపక్.

అంతలోనే అతివేగంగా కాలేజీ గేటునుదాటి, అటుకేసి దూసుకు

వచ్చింది ఖరీదైన కారు ఒకటి.

"అదిగో మీ రాంసింగు వచ్చేశాడు....మీకు భోజనం క్యారేజీ తీసుకువచ్చాడు" వెంటనే చెప్పాడు జగజీత్.

అతనికి పది అడుగుల దూరంలో ఆగింది లోపలికి వచ్చిన కారు.

స్టీరింగ్‌ని వదిలి, తళతళా మెరుస్తున్న పెద్ద క్యారేజీని పట్టుకుని కిందికి దిగాడు డ్రయివర్ రాంసింగ్.

"అదేంటి చిన్నబాబూ....అసయ్యంగా అలా కింద కూర్చున్నారేంటి? లేవండి పైకి. మీకు ఇష్టమైన చేమదుంపల వేపుడు చేసింది సీతమ్మ....వేడివేడిగా తింటేనే బాగుంటుందిట....తొందరగా తిని నాకు క్యారేజీ ఇచ్చేయండి. మళ్ళీ సాయంత్రం మూడుగంటలకి తాతగారు మైదాన్‌పూర్ వెళ్ళాలని అన్నారు....తొందరగా తినండి...." అంటూ చేయి పట్టుకుని పైకి లేపాడు.

"తాతగారు మైదాన్‌పూర్ వెళ్ళాలా? ఎందుకు? అక్కడ మనకి తెలిసినవాళ్ళు ఎవరైనా వున్నారా?" లేచి నిలబడిన తర్వాత అడిగాడు దీపక్.

"తెలిసినవాళ్ళు కాదు బాబూ....పొలం బేరం చేయడానికి....ఎవరిదో పాతిక ఎకరాలు అమ్మకానికి వచ్చిందిట....కొందామని అనుకుంటున్నారు....ఏదో ఫ్యాక్టరీ కట్టి దానికి మిమ్మల్ని మేనేజింగ్ డైరెక్టర్‌గా పెడతారట" నవ్వుతూ చెప్పాడు రాంసింగ్.

"అటువంటి పనులు మన ఒంటికి సరిపడవుగాని, నువ్వు ఒక పని చెయ్యి....ఈ జగజీత్ ఫ్రెండ్ యాదగిరిని పోలీసులు పట్టుకుపోయారట. అతన్ని బయటికి తీసుకురావాలి....ఎలా తీసుకురావాలో ఆలోచించి చెప్పు...." అతని చేతిలోని క్యారేజీని తీసుకుని క్యాంటీన్ వైపు నడుస్తూ అన్నాడు దీపక్.

"వాడి ముఖం పడిలిపోయివుంది. బాగా ఆకలి వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. వాడిని ఏదైనా తినమని చెప్పండి" జగజీత్ వైపు తల ఊపుతూ అన్నాడు రాంసింగ్.

వెయిటర్ కుర్రాడిని పిలిచి ఒక ఖాళీ ప్లేటు తెప్పించాడు దీపక్. తన క్యారేజీలో నుంచి కొంచెం అన్నం, ఇతర పదార్థాలు పెట్టి జగజీత్



వైపు తల తిప్పాడు.

"మీరు తినండి చిన్నబాబూ...నేను ఏదైనా టిఫిన్ తీసుకుంటాను" అన్నాడు జగజీత్.

"ఏడిచావ్....చిన్నబాబు తినమని అంటుంటే నకరాలు పోతావేంటి? తీసుకుని తిను...." అంటూ అతన్ని కసురుకుని, "వాడిమాట నిజం చిన్నబాబూ....మీ క్యారేజీలో నుంచి పెడితే, మళ్ళీ మీకు సరిపోదు.... ఇట్టాంటి పని ఇంకెప్పుడూ చేయకండి" లోగొంతుకతో దీపక్‌ని మందలించాడు రాంసింగ్.

"అది సరేగాని ఆ యాదగిరి సంగతి చెప్పు...వాడిని బయటికి తీసుకురావడం ఎలా?" సెగలు వెలువరుస్తున్న చేమదుంపల వేపుడును రుచి చూస్తూ అన్నాడు దీపక్.

"అదేమీ పెద్దపనికాదు చిన్నబాబూ. మన జడ్జీ ప్రతాప్‌వర్మగారితో ఒకమాట చెపితే చిటికెలో బయటికి వచ్చేస్తాడు..." తాపీగా అన్నాడు రాంసింగ్.

* * * *

చేమదుంపల వేపుడును రుచి చూసి మెచ్చుకోలుగా తల ఊపుతున్న దీపక్ ముఖం గప్పున వెలిగింది...వెయ్యి క్యాండిల్ బల్బుమాదిరి.

"నిజంగా భలేమాట చెప్పావు. నువ్వు చెప్పేటంతవరకూ నాకు గుర్తురాలేదు. ఆయన ఇప్పుడు ఎక్కడున్నాడో- ఒకసారి ఫోన్ చెయ్యి" అంటూ తన జేబులోనుంచి సెల్‌ఫోన్‌ని తీసి అతని చేతికి అందించాడు.

ఫోన్‌నయితే తీసుకున్నాడుగాని, దాన్ని ఉపయోగించలేదు రాంసింగ్. "ఇప్పుడు ఆయన ఇంటిదగ్గిర వుండడు. కోర్టులో వుంటాడు. ఇట్టాంటి పనుల్ని గురించి మాట్లాడటానికి మనం ఫోన్లు చేయకూడదు. స్వయంగా పోయిరావడం బెస్టు" నిదానంగా చెప్పాడు.

"అంతేనంటావా? ఐతే అలాగే పోయివద్దాం" అంటూ రెండు నిముషాల్లో క్యారేజీని ఖాళీచేశాడు దీపక్.

ఖాళీగిన్నెల్ని వాష్‌బేసిన్ దగ్గిరికి తీసుకుపోయాడు జగజీత్. శుభ్రంగా కడిగి రాంసింగ్‌కి అందించాడు.

"మనం ఇప్పుడు జడ్జి ప్రతాప్‌వర్మ దగ్గిరికి పోవాలి....ముఖం

కడుక్కొని కాస్తంత నీట్‌గా కనిపించు...." అంటూ అతనికి చెప్పి సిగరెట్ వెలిగించుకుంటూ తమ కారు దగ్గిరికి అడుగులు వేశాడు దీపక్.

వేగంగా కదిలింది కారు. రెండుక్షణాల్లో గేటును క్రాస్‌చేసి మెయిన్ రోడ్డుమీదికి వెళ్ళింది. పదిహేను నిముషాల్లో కోర్టు బిల్డింగ్‌ల ముందు ఆగింది.

దీపక్ కంటె ముందు దిగి, పరుగులాంటి నడకతో ఒక బిల్డింగ్ దగ్గిరికి పోయాడు రాంసింగ్.

* * * *

అప్పటికి అరగంటనుంచీ తన ముందుకు వచ్చిన ఒక క్రిమినల్ కేసులోని వాదోపవాదాల్ని ఓపికగా వింటున్నాడు జడ్జి ప్రతాప్‌వర్మ. కోర్టు గది గుమ్మంలో ప్రత్యక్షమై, నమస్కారంచేసిన రాంసింగ్‌ని ఓరకంటితో చూశాడు.

"పదినిముషాలు బ్రేక్ తీసుకుని ఆ తరువాత వింటాను" అంటూ అప్పటికప్పుడు తన నిర్ణయాన్ని వినిపించి సీట్లోనుంచి లేచాడు. ఆయనతో పాటు లేచి నిలబడిన లాయర్స్‌ని, క్లయింట్లను అందర్నీ తప్పించుకుని ఆయన ఛాంబర్ దగ్గిరికిపోయాడు రాంసింగ్.

రెండుగంటల క్రితమే సురేంద్రగారితో మాట్లాడాను. మళ్ళీ నువ్వు వచ్చావేమిటి? నాతో పని ఏమైనా పడిందా?" లోపలికి రమ్మని సైగచేసి అడిగాడు జడ్జి.

"పెద్దయ్యగారి పని కాదు సార్....చిన్నబాబు వచ్చారు. మీతో అర్జెంటుగా మాట్లాడాలని అంటున్నారు...." వినయంగా చెప్పాడు రాంసింగ్.

"చిన్నబాబు వచ్చాడా? ఎక్కడ వున్నాడు? తీసుకురా....వెంటనే ఇక్కడకు తీసుకురా...." క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే చెప్పాడు జడ్జి.

పరుగులాంటి నడకతో తమ కారు దగ్గిరికిపోయి, ఒకే ఒక నిముషం తర్వాత దీపక్‌ని, జగజీత్‌ని వెంటబెట్టుకుని వచ్చాడు రాంసింగ్.

ఛాంబర్ గుమ్మం దగ్గిరికి వచ్చి, సాదరంగా దీపక్ భుజంమీద చెయ్యివేసి లోపలికి తీసుకుపోయాడు జడ్జి.



"మీ తాతగారి దయవల్ల చదువుకున్నాను నేను. ఆయన చలువ మూలకంగానే జడ్జిని అయ్యాను. మీ తాతగారివంటి మనిషి ఈ భూమిమీద అరుదుగా పుడుతూవుంటారు" అంటూ ఒక కుర్చీలో కూర్చోబెట్టి, "ఏం తీసుకుంటావ్? కాఫీ, టీ" అంటూ టేబిల్‌మీది కాలింగ్‌బెల్లును నొక్కబోయాడు.

"వద్దు సార్....ఇప్పుడే భోజనంచేసి వచ్చాను....మీతో ఒక చిన్న పని పడింది" అంటూ ఆయన్ను ఆపి, గుమ్మంలో నిలబడిన జగజీత్‌ని చూపించాడు దీపక్....అతని కథను కూడా వినిపించాడు.

అందరిమాదిరిగా జగజీత్ ఒక దొంగ అని తెలిసినప్పుడు నొసలు విరువలేదు జడ్జి.

"వీడు వెళ్ళి పోలీసులకు లొంగిపోతే ఆ యాదగిరిని వాళ్ళు వదిలి పెట్టేస్తారు. ఈ మాత్రందానికి నాదాకా రావాల్సిన అవసరంలేదు...." అన్నాడు తాపీగా.

"ఇతను ఆ దొంగతనం చేయలేదు సార్....చేయని దొంగ తనాన్ని ఒప్పుకోవడం దారుణం" అన్నాడు దీపక్.

"ఆమాట నువ్వు, నేను చెప్పకూడదు. ఒకసారి దొంగ అయిన వాడు ఎప్పుడూ దొంగే అని పోలీసుల నమ్మకం. మేము కూడా అంతే.... వాడు దొంగతనం చేసివుండడని అనుకోవద్దు" తడుముకోకుండా అన్నాడు జడ్జి.

"జగజీత్ చాలా మంచివాడు....అబద్ధం చెప్పడు...." మరోసారి తన నమ్మకాన్ని బహిర్గతం చేశాడు దీపక్.

"అయితే ఒకపని చెయ్యి....నేను చెప్పానని ఆ పోలీస్‌స్టేషన్ ఎస్సైకి చెప్పు....జగజీత్ కనిపించిన వెంటనే పోలీసులకు ఇన్‌ఫాం చేస్తా నని యాదగిరితో లెటర్ రాయించుకుని వదిలేస్తారు....తర్వాత ఈ జగజీత్ కోసం ఇంకా గట్టిగా వెతుకుతారు....ఇవ్వాళ కాకపోయినా రేపయినా ఇతను వాళ్ళకి దొరికిపోవడం డెఫినెట్...." అన్నాడు జడ్జి.

"దొరకడు అంకుల్....ముందు ఆ యాదగిరిని బయటికి తీసుకు వస్తే, తర్వాత ఇతను దొంగతనం చేయలేదని ప్రూవ్ చేస్తాం...." నమ్మకంగా చెప్పాడు దీపక్.

"అలాచేస్తే ఇంక కావాల్సింది ఏముంది? చాలా బాగుంటుంది. మీ తాతగారు మైనాన్‌పూర్‌లో పొలం ఖరీదుచేస్తే ఎలా వుంటుందని నన్ను అడిగారు....ఇంకో రెండు మూడేళ్ళలో నేషనల్ హైవేకి బైపాస్ రోడ్డు ఆ పొలాల పక్కనుంచే వేయాలని ఒక ప్రపోజల్ వుందిట....వెంటనే వెళ్ళి కొనేయమన్నానని చెప్పు....

బైపాస్ రోడ్డు పడిందంటే ఆ పొలాల వేల్యూ దారుణంగా పెరిగిపోతుంది. ఆలస్యం చేయవద్దని చెప్పు...." అంటూ కుర్చీలోనుంచి లేచాడు జడ్జి. తను కూడా లేచి నమస్కారం చేశాడు దీపక్.

"నీ మీద మీ తాతగారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మీ అమ్మానాన్న నీ చిన్నతనంలో కారు యాక్సిడెంట్‌లో చనిపోయిన దగ్గిర్నుంచీ నిన్ను గుండెలమీద పెట్టుకుని పెంచారు. మీకున్న ఆస్తిపాస్తులు ఈ నగరంలో మరెవరికీ లేవు. చక్కగా చదువుకుని మీ తాతగారి పేరు నిలబెట్టాలి. ఇటువంటి చిల్లరమల్లర స్నేహాలు చేస్తూ చదువును చెడగొట్టుకోకు. మీ తాతగారు చాలా బాధపడతారు" అని అతని భుజంమీద చేయి వేస్తూ, లోగొంతుకతో ఆప్యాయంగా చెప్పాడు జడ్జి.

* * * *

అలాగే చదువుకుంటాను అంకుల్. తప్పకుండా" అంటూ ఇంకోసారి నమస్కారంచేసి ఛాంబర్‌లోనుంచి బయటికి వచ్చేశాడు దీపక్.

"నా మూలంగా మీరు అందరితోనూ మాటలుపడాల్సి వస్తోంది నాకు బాధగా వుంది చిన్నబాబూ" జడ్జి మాటలు చెవినపడటంవల్ల చిన్నబుచ్చుకుంటూ అన్నాడు జగజీత్.

"అందరితోనూ మాటలుపడ్డానా? ఎవరితో? జడ్జిగారితోనేకదా!" అన్నాడు దీపక్.

"ఇందాక రాంసింగ్ కూడా అలాగే అన్నాడు."

"రాంసింగ్ ఎప్పుడూ అలాగే అంటుంటాడు. అతని మాటల్ని మనం లెక్కచెయ్యం. నువ్వు సిటీబస్ ఎక్కి నెమ్మదిగా మెట్రోకేఫ్ దగ్గిరికి రా....మేము స్టేషన్‌కిపోయి అక్కడికే వస్తాం" అంటూ జేబులోనుంచి వాలెట్‌ని తీసి అతనికి ఒక కరెన్సీనోటును అందించాడు దీపక్.

"మొండా మార్కెట్‌లో మూటలు మోసుకుంటూ బతికే నావంటి



బద్మాష్ మీద మీరు చూపిస్తున్న అభిమానం నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోను చిన్నబాబూ....మీ ఋణం ఎలాగోలా తీర్చుకోవాలి...." తడి అయిన కనుల్ని తన షర్టు భుజానికి అద్దుకుంటూ గద్గదస్వరంతో అన్నాడు జగజీత్.

"పిచ్చిపిచ్చి డైలాగులువేసి ప్రాణాలుతీయకు. పోయి బస్సు ఎక్కు" అంటూ కారులో కూర్చున్నాడు దీపక్. ఇంజన్‌ని ఆన్‌చేసి రెడీగావున్న రాంసింగ్ యాక్సిలేటర్‌ని అదిమి ఒక్కసారిగా ముందుకు దూకించాడు.

"జడ్జిగారిని కలవడం అయిపోయింది. నెమ్మదిగా పోవచ్చు....అంత స్పీడు అనవసరం" అన్నాడు దీపక్.

"మూడు గంటలకు నేను మళ్ళీ మైదాన్‌పూర్ వెళ్ళాలి. ఆలస్యం అయితే తాతగారు నా పీక పిసికి చంపేస్తారు. టైమ్ ప్రకారం పనులు జరగకపోతే ఆయనకి పిచ్చికోపం వచ్చేస్తుందని మీకు తెలుసుగా చిన్నబాబు" అంటూ వేగంగా నడిపాడు రాంసింగ్.

● ● ● ●

అప్పుడే పోలీస్‌స్టేషన్‌లోనుంచి బయటికివచ్చి తన వెహికల్ వైపు అడుగులు వేస్తున్నాడు యాదగిరిని అరెస్ట్‌చేసి పట్టుకువచ్చిన ఇన్స్‌పెక్టర్.

సిటీ స్పీడ్ లిమిట్స్‌ని దాటి దూసుకువస్తున్న కారును గమనించి నొసలు ముడివేస్తూ అటుకేసి చూశాడు. కీచుధ్వనులుచేస్తూ స్టేషన్‌ముందు ఆగింది కారు.

"సురేంద్రసాబ్ మనవడు చిన్నబాబు మిమ్మల్ని కలుసుకోవడానికి వచ్చారు" స్టీరింగ్ ముందునుంచి కిందికి దూకి అతని దగ్గిరికి పోతూ చెప్పాడు రాంసింగ్.

"సురేంద్ర సాబ్ మనవడు చిన్నబాబు నాకోసం వచ్చాడా? వాడెవడు?" ఆశ్చర్యంగా అడుగుతూ కారువంక చూశాడు ఇన్స్‌పెక్టర్.

అప్పుడు కారులోనుంచి దిగాడు దీపక్.

తాపీగా అడుగులువేస్తూ అతని దగ్గిరికిపోయి, తను ఎందుకు వచ్చాడో చెప్పాడు.

"యాదగిరిని వదిలిపెట్టాలా? నథింగ్ డూయింగ్. జడ్జి ప్రతాప్ వర్మగారు చెప్పినాసరే వదలడానికి వీలుపడదు. సిక్రమాన్‌సేట్ మా మీద చాలా వత్తిడి తీసుకవస్తున్నాడు. పదిలక్షల దొంగతనం అంటే మాటలు కాదు. టీవీ ఛానెల్స్ వాళ్ళకి తెలిస్తే మాకు మాట వస్తుంది...." నిర్మొహమాటంగా చెప్పాడు ఇన్స్‌పెక్టర్.

"జడ్జిగారు చెప్పినట్లు యాదగిరితో కాయితం రాయించుకుని అతన్ని వదిలేయండి. ఆ తర్వాత జగజీత్ మీకు దొరికితే చావగొట్టి చెవులు మూయండి. యాదగిరిని వదిలిపెట్టకపోతే మాత్రం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది" చాలా నెమ్మదిగా అన్నాడు దీపక్.

విపరీతమైన కోపంతో ఎర్రగా కందిపోయింది ఇన్స్‌పెక్టర్ ముఖం. "ఇబ్బందులు పడాల్సి వస్తుందా? ఎలా పడాల్సివస్తుందో నేనూ చూస్తాను. ఎవర్రాఅక్కడ? ఇతన్ని తీసుకుపోయి యాదగిరి పక్కనే కూర్చోబెట్టండి. ఇతన్ని కూడా రెండు తీతలుతీద్దాం" అంటూ స్టేషన్లో నిలబడి వున్న కానిస్టేబిల్స్‌కి సైగజేశాడు.

రావడం అయితే పరిగెత్తుకుంటూ అతని దగ్గిరికి వచ్చారు కానిస్టేబిల్స్. కాని, దీపక్‌ని పట్టుకోవడానికి మాత్రం ఉత్సాహం చూపించలేదు వాళ్ళు.

"సార్! ఇతను సురేంద్రగారి మనవడు సార్. ఈ బాబును మనం స్టేషన్లో కూర్చోబెట్టకూడదు. ఏమైనా వుంటే సురేంద్రగారితో మాట్లాడాలి" చిన్న కంఠంతో సర్దిచెప్పడానికి ట్రై చేశాడు ఒక కానిస్టేబిల్.

ఆ మాటలు అస్సలు తన చెవులకు చేరనట్లే గొంతు చించుకుని గావురుమని అరిచాడు ఇన్స్‌పెక్టర్.

* * * *

"సురేంద్ర అంటే ఏమైనా కొమ్ములు మొలిచిన మనిషా? ఆయన మనవడిని లోపలికి నెడితే ఏం చేస్తాడు? తలతీసి మొలవేస్తాడా? ముందు నేను చెప్పిన పని చేయండి. కమాన్‌మూవ్...." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ పాస్ చేశాడు. దిగులు నిండిన కళ్ళతో దీపక్‌వంక చూశారు కానిస్టేబిల్స్ అందరూ.

"మీ పని మీరు చేయండి. మీ అధికారి చెప్పినప్పుడు చేయక



తప్పదుకదా....నన్ను తీసుకుపోయి లోపల కూర్చోబెట్టండి...." వారితో పాటు లోపలికి పోవడానికి రెడీ అవుతూ అన్నాడు దీపక్.

కొంచెం వెనుకగా నిలబడి ఆ మాటలన్నీ వింటున్న రాంసింగ్ వెంటనే తన దగ్గిరవున్న సెల్‌ఫోన్‌ని బయటికి తీసి, ఒక నెంబర్‌ని ప్రెస్ చేశాడు. "హల్లో ఎవరు? ఎస్.పి. కోదండపాణిగారి నెంబరేనా ఇది?" అవతలి పక్కనుంచి వినవచ్చిన కంఠాన్ని వినగానే అడిగాడు.

అవునని చెప్పింది కాబోలు ఆ కంఠం. "అవునుసార్....నేను సురేంద్రగారి డ్రైవర్ రాంసింగ్‌ని మాట్లాడుతున్నాను. ఇక్కడ మీ ఇన్స్‌పెక్టర్ మా చిన్నబాబుగారిని స్టేషన్లో కూర్చోబెడుతున్నాడు. మీరు వెంటనే రావాలి. ఆలస్యం అయితే ఈ విషయాన్ని నేను మా పెద్దబాబు గారితో చెప్పాల్సివస్తుంది...." అన్నాడు.

అవతలి కంఠం చెప్పిన మాటల్ని వినగానే పెట్రోమాక్స్ లైటు మాదిరి వెలిగింది అతని ముఖం. "ఇస్తున్నాను సార్....ఫోన్ మీ ఇన్స్‌పెక్టర్‌గారికి ఇస్తున్నాను" అంటూ ఆ ఫోన్‌ని ఇన్స్‌పెక్టర్‌వైపు జాపాడు.

అతనివంక చాలా ఆశ్చర్యంగా చూస్తూ, యాంత్రికంగా ఆ ఫోన్‌ని అందుకుని, అవతలినించి పిడుగులు పడిన శబ్దం వినవచ్చినట్టు అదిరి పడ్డాడు ఇన్స్‌పెక్టర్. "అలాగే సార్. వదిలేస్తాను సార్. అబ్బెబ్బే.... అటువంటిదేమీలేదు సార్. కాయితం రాయించుకోవాల్సిన అవసరమూ లేదు సార్. ఇప్పుడే పంపించేస్తాను సార్" అంటూ ఫోన్‌ని ఆఫ్‌చేసి రాంసింగ్‌కి ఇచ్చేశాడు.

"మా చిన్నబాబు ఎండలో నిలబడే వున్నాడు...." క్లుప్తంగా కామెంట్ చేశాడు రాంసింగ్.

"అరే....ఇంకా అలాగే చూస్తూ నిలబడతారేమిటి? ఆ యాదగిరిని వదిలేయండి...." అంటూ కానిస్టేబిల్స్‌కిచెప్పి, "మీరు వెళ్ళిపోండిసార్.... వాడిని వదిలేస్తాను అని దీపక్‌తో అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"మీకు అనవసరమైన శ్రమ ఇచ్చినందుకు నేను చాలా బాధపడుతున్నాను. మీరు అన్యథా భావించకపోతే యాదగిరిని నేను వెంటబెట్టుకు పోతాను "ఇన్స్‌పెక్టర్‌తో సౌమ్యంగా చెప్పాడు దీపక్.

స్టేషన్‌లోపలికి పోతున్న కానిస్టేబిల్స్ వెనుకే తను కూడా

లోపలికి పోయాడు ఇన్స్పెక్టర్.

లాకప్‌లో కూర్చునివున్న యాదగిరిని స్వయంగా బయటికి పంపించి తన కుర్చీలో కూలబడ్డాడు.

"తలనొప్పిగా వుందా సార్? చాయ్ తెప్పించమంటారా?" వినయంగా అడిగాడు అతన్ని హెడ్‌కానిస్టేబిల్.

"ఎవరు ఈ చిన్నబాబు? ఎవరు ఈతని తాత? ఆఫ్టరాల్ ఒక దొంగ కోసం జడ్జీగారితోను, మన ఎస్.పి.గారితోను రికమెండేషన్ చేయించడం ఏమిటీ? అసలు వాళ్ళు ఎవరు?" తల పట్టుకుంటూ అడిగాడు.

"మీరు త్వరగా పని పూర్తిచేశారు కాబట్టి ఇక్కడితో ఆగిపోయింది కథ. ఆలస్యం చేసివుంటే మన డి..జి.పి.గారే స్వయంగా వచ్చివుండేవాళ్ళు. సురేంద్రసాబ్ అంటే సామాన్యుడు కాదు సార్. ఆయన తలచుకుంటే ఏమైనా చేయగలడు...." చెప్పాడు హెడ్‌కానిస్టేబిల్.

● ● ● ●

"ఆల్‌రైట్. యాదగిరిని స్టేషన్లోంచి బయటికి తీసుకురావడం సక్సెస్‌ఫుల్‌గా పూర్తి అయింది. ఐయామ్ హ్యాపీ....ఇక నీ విషయం మాత్రమే మిగిలిపోయి వుంది.

ఒకసారి మనం మీ మార్కెట్ దగ్గిరికి పోయివస్తే చాలా బాగుంటుందని అనిపిస్తోంది. ఏమంటావ్?" పేవ్‌మెంటుమీద వున్న ఒక కరెంట్‌పోల్ దగ్గిర నిలబడి సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు దీపక్.

"ముందు యాదగిరిని వాళ్ళ ఇంటికి పంపించేద్దాం చిన్నబాబూ.... ఇంటిదగ్గిర ఇతని భార్య గగ్గోలు పెట్టేస్తోందిట...." నెమ్మదిగా అన్నాడు జగజీత్.

వాలెట్‌ని మరోసారి బయటికి తీసి, ఒక కరెన్సీ నోటును యాదగిరి చేతుల్లో అతిబలవంతంగా పెట్టాడు దీపక్. "ఆటోలో వెళ్ళు. ఇప్పడున్న పరిస్థితుల్లో సిటీ బస్సులో పోలేవు. కళ్ళుతిరిగి కిందపడిపోతావ్. ఏదయినా మెడికల్ షాపులో ఒళ్ళునొప్పులకు మంచి మాత్రలు తీసుకో. నీ నొప్పులు నాలుగైదురోజులు వుంటాయి" అంటూ అతన్ని రోడ్డుమీదికి నెట్టాడు.

"మనం కూడా ఆటోలో వెళదాం చినబాబూ...." ఉన్నట్టుండి



ఒక్కసారిగా అన్నాడు జగజీత్.

"ఆటోలో వెళదామా? నీకు కూడా కళ్ళు తిరుగుతున్నాయా ఏమిటి?" చివరికంటా కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరేస్తూ అడిగాడు దీపక్.

"అయ్యయ్యో....అలాంటిది ఏమీలేదు చిన్నబాబూ....మీరు ఈ చెత్తరోడ్డుమీద లెఫ్టరైటు కొట్టడం నామోషీ....మోండా మార్కెట్ ఇంకా చాలాదూరం. అంతదూరం మీరు నడవడం కష్టం...." అన్నాడు.

"ఆటోలో వద్దు. సిటీబస్‌లో పోదాం...." దగ్గిర్లో కనిపించిన బస్‌స్టాప్ వైపు తిరుగుతూ అన్నాడు దీపక్.

"సిటీబస్సా? మీరు సిటీబస్సులో ఎక్కడమా? మీ రాంసింగ్‌కి ఈ మాట తెలిస్తే పక్కనే వున్నందుకు నా పీక పిసికి చంపేస్తాడు. వద్దు బాబూ" ఆందోళన అధికం అయిపోతుండగా అన్నాడు జగజీత్.

అతని మాటలు అస్సలు తనకు వినబడనట్లు బస్‌స్టాపు దగ్గిరికి పోయాడు దీపక్. అప్పుడే అటుగా వస్తున్న ఒక బస్‌ని చూసి "కమాన్....అది చాలా రష్‌గా వుంది. ఈ స్టాప్‌లో ఆగదు....అయినా సరే మనం క్యాచ్ చేయాలి...." అంటూ ఎదురు పరుగెత్తాడు.

అబద్ధం అంటూ ఏమీలేదు అతని మాటల్లో. కిటకిటలాడిపోతున్నది ఆ బస్సు ప్రయాణీకులతో.

అరడజను స్టాపుల్ని దాటిన తర్వాత లోపలికి పోయి నిలబడే వెసులుబాటు లభించింది వారిద్దరికీ. అప్పుడు టిక్కెట్లు తీసుకున్నాడు దీపక్.

ఆ తరువాతి స్టాప్‌లో దిగిపోయాడు.

అతని వెనకే కిందికి దిగిన జగజీత్‌ని గమనించి, "అరె భాయీ... పోలీసులు నీకోసం వెతుకుతున్నారు. కనిపించావంటే కాళ్ళు, చేతులు విరగేసి వెంట తీసుకుపోతారు. వెళ్ళిపో....ఇక్కడినుంచి" అంటూ హెచ్చరించాడు అతనితోపాటు మూటలుమోసే కూలీ ఒకతను.

"సిగ్రామ్‌సేట్ ఇప్పుడు ఎక్కడ వున్నాడు? మార్కెట్‌లో వున్నాడా?" విసుగ్గా అడిగాడు జగజీత్.

"అవ్....మార్కెట్‌లో వున్నాడు. మార్కెట్‌లో వుండకుండా

ఇంకెక్కడికి పోతాడు లే" అన్నాడు ఆ కూలీ.

అతన్ని మింగేసేలా చూడటం మొదలుపెట్టిన జగజీత్ చేతిని పట్టుకుని ముందుకు తీసుకుపోయాడు దీపక్. పదినిముషాల తరువాత వచ్చీపోయే కస్టమర్స్‌తో విపరీతమయిన రద్దీగా వున్న సి(మాన్ సేట్ ఆఫీసును దూరంనుంచే అతనికి చూపించాడు జగజీత్.

ఆఫీసుముందు కూర్చునివున్న జమాజెట్టీల వంటి ముఠాకూలీలను కూడా చూపిస్తూ, "ఆళ్ళు ఆడి చెంచాలు చిన్నబాబూ....అవసరమైతే ఎంతటికైనా తెగిస్తారు. నాటుసారా పోయించి, పందెపుపుంజుల్ని మేపినట్టు మేపుతూ వుంటాడు. నన్ను చూశారంటే నా పని గల్లంతే" దీపక్ వెనకాల నిలబడుతూ చిన్నకంఠంతో చెప్పాడు.

* * * *

"పదిలక్షల్ని నువ్వు దొంగిలించావని అతను నీమీద కేసు ఎలా పెట్టాడు? నిన్న అతనికి ఆ డబ్బు ఎక్కడ్నించైనా వచ్చిందా?" సిగరెట్ పొగను రింగులు రింగులుగా వదులుతూ అడిగాడు దీపక్.

"నిన్న ఉదయం ముంబయి మార్కెట్‌వాలాలు ఆ నోట్లకట్టల్ని తీసుకువచ్చి ఇవ్వడం నేను కళ్ళారా చూశాను బాబూ....అంత డబ్బు క్యాష్ రూపంలో తీసుకోవడం తప్పని కూడా అనిపించింది" అన్నాడు జగజీత్.

"నువ్వు ఆ డబ్బును చూశాకే నీ కూలి సరిగ్గా ఇవ్వమని గొడవ పెట్టుకున్నావా?" అడిగాడు దీపక్.

"అవును చిన్నబాబూ....సరిగ్గా అలాగే జరిగింది. నేను అడిగి లేదనిపించుకున్న రెండుగంటలకే వాడు పోలీసులకు నామీద చెప్పాడు" అన్నాడు.

"పోలీసులకు ఎందుకు చెప్పాడు? తన పందెపు కోడిపుంజుల్ని పంపి నీ పొగరు తగ్గించవచ్చుకదా?"

"అది అంత తేలిక కాదు చిన్నబాబూ....నాయాళ్ళు నా మీదికి వస్తే నిలబెట్టి నరికేస్తా. వంగి వంగి సలాంలు చేయడం నా పద్ధతి కాదు. అటో ఇటో తేలిపోవాల్సిందే" అతని వెనుకనుంచి ఇవతలికి రాకుండా, చాలా ధైర్యంగా చెప్పాడు జగజీత్.

చివరికంటా కాలిన సిగరెట్‌ని కిందపడేసి పాదంతో నలుపుతూ ఆలోచించడం మొదలుపెట్టాడు దీపక్.



"ఇంత దూరం వచ్చిన తర్వాత ఇప్పుడు ఏంటి బాబూ ఆలోచన? అసలు మనం ఇక్కడికి ఎందుకు వచ్చాం? ఈ గొడవ సరి అవ్వాలంటే మంచి లాయర్ దగ్గిరికి పోవాలి" అతను అలా ఆలోచిస్తుండటాన్ని చూసి, చూసి చాలా అసీజీగా అన్నాడు జగజీత్.

"ఇది లాయర్లతో జరిగేపని కాదు....మనమే ఏదో ఒకటిచేయాలి. పిచ్చిమాటలు మాట్లాడకుండా నన్ను గట్టిగా ఆలోచించనీ" అంటూ అక్కడినించి సి(మాన్ సేట్ ఆఫీసుకు దూరంగా నడిచాడు.

ఉదయం వేళల్లో స్టార్ట్ అయిన రష్ కొంచెం కొంచెంగా నెమ్మదించడం మొదలుపెట్టింది ఆ ప్రదేశంలో.

"రాత్రి పన్నెండు గంటలనుంచీ మళ్ళీ మొదలు అవుతుంది జాతర. ఇప్పుడు ఇంటికిపోయి పన్నెండింటికి వస్తాడు సి(మాన్ సేట్.... దగ్గిర వుండి మాల్‌ని ఖరీదు చేయిస్తాడు" అతని చెవిలో చెప్పాడు జగజీత్.

అతను ఆ మాటలు చెబుతూవుండగానే తన ఆఫీసులోంచి బయటికి వచ్చాడు సి(మాన్ సేట్. పొట్టిగా లావుగా గుమ్మటంమాదిరి వున్నాడతను. తన హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి తాళంచెవుల్ని తనే స్వయంగా బయటికి తీసి, తనే దగ్గిర వుండి ఆఫీసుకు తాళాలు వేయించాడు.

తనే స్వయంగా వాటిని వెనక్కి లాగి గట్టిగా పడ్డాయో పడలేదో పరీక్షించి చూసుకున్నాడు.

"మార్కెట్ బయట కారు నిలబడి వుంటుంది. ఎర్రరంగు మారుతీ కారు. అక్కడికిపోయి చూద్దామా?" దీపక్‌ని అడిగాడు జగజీత్.

"అది అవసరంలేదుగాని, ఆఫీసుకు గట్టిగట్టి తాళాలు వేయించడం దేనికి? లోపల క్యాష్‌బ్యాలెన్స్ చాలా ఎక్కువ వుంటుందా?" సాలోచనగా అడిగాడు దీపక్.

"వెయ్యి, రెండువేలు తప్ప ఎక్కువ వుండదు. పెద్దమొత్తాలైతే చెక్కులు రాస్తాడు. ఇవ్వాళమాత్రం కొంచెం విచిత్రంగానే వుంది ఇది.

వరకు తనే తాళాలు వేయించేవాడు. ఇవాళ లాగిచూసినట్టు ఎప్పుడూ చూడలేదు.”

* * * *

ఖాళీ కూరగాయల గంపలు, గోనెసంచులు, ఇంకోపక్క కుళ్ళిపోయి గుట్టలు గుట్టలుగా పడివున్న టొమేటోలు, బంగాళాదుంపలు, ఖంగారు ఖంగారుగా వున్నది సిమ్రాన్ సేట్ ఆఫీసు వున్న ప్రదేశం.

ఆఫీసును క్లోజ్ చేసి అతను అవతలికిపోయిన వెంటనే, తాము కూడా ఇవతలికి వచ్చేశారు అంతవరకూ అక్కడ కూర్చునివున్న ముఠా మేస్త్రీలు.

“మనం ఒకసారి ఆ ఆసిసులోపలికి పోయిరావాలి....ఎవరికీ తెలియకూడదు. తెలిస్తే నీతోపాటు నేను కూడా దొంగనే అవుతాను....వీలుపడుతుందా?” ఉన్నట్లుండి ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా అన్నాడు దీపక్.

“ఆఫీసు లోపలికి పోయిరావాలా? అయ్యబాబోయ్....ఆ తాళాల్ని తెరవాలంటే చాలా కష్టపడాలి....అందరూ చూస్తుండగా ఆ పనిచేయడం” అంటూ మాటల్ని మధ్యలోనే ఆపేశాడు జగజీద్.

“ఏంటి ఆగిపోయావ్? చిరునవ్వుతో అడిగాడు దీపక్.

”బయటికి మహాబలిష్టంగా కనిపించినా పైన అంతా పెద్ద డొల్ల....ఉత్తరం వైపున అస్బెస్టాస్ రేకులు పగిలిపోయివున్నాయి. వర్షం వస్తే నీళ్ళు లోపలికి జారకుండా వారంరోజుల క్రితం నేనే రెండు టార్పాలిన్ గుట్టల్ని అడ్డంపెట్టి, గాలికి ఎగిరిపోకుండా రాళ్ళు వుంచాను” మెరుస్తున్న కళ్ళతో చెప్పాడు జగజీత్.

“వెరీగుడ్....అయితే ఆలస్యం అనవసరం....ఆ రేకుల్ని పక్కకు లాగి లోపలికి పోదాం....ఎవరూ చూడకుండా జరిగిపోవాలి పని” హుషారుగా అన్నాడు దీపక్.

“లోపలికి పోయి ఏం చెయ్యాలో చెప్పండి చేసుకువస్తాను. మీరు బయట నిలబడివుండండి.”

“నథింగ్ డూయింగ్. లోపలికెళ్ళిన తర్వాతగాని ఏం చేయాలో నాకు తోచదు. నీతోపాటు నేనూ రావాలి. ఎవరికంటా పడకుండా పని



పూర్తి అయిపోవాలి. ఎలాగో బాగా ఆలోచించు” అంటూ నిలుచున్న ప్రదేశం దగ్గిర్నుంచి కాస్తంత ఇవతలికి వచ్చాడు దీపక్.

హోల్‌సేల్ మార్కెట్ ఏరియా చివరిభాగం అది. పనికిరాకుండా పోయిన గోనెసంచులతో, వెదురు గంపలతో పెద్ద డంపింగ్ యార్డుమాదిరి కనిపిస్తోంది.

ఆ ఏరియాని చూసిన కొద్దిక్షణాలకు దీపక్ మనసులో మెదిలిం మరో కొత్త ఆలోచన.

“సపోజ్! మనం ఈ చెత్తకు నిప్పుపెడితే ఏమవుతుంది?” పక్కకు తిరిగి జగజీత్‌ని అడిగాడు.

“మంటలు పెద్దవి కాకపోతే ఫరవాలేదు. పెద్దవి అయితే, హోల్‌సేల్ ఆఫీసులన్నీ అంటుకుంటాయి. పోలీసులు, ఫైరింజన్లు వచ్చేయడం జరుగుతుంది.”

“మంటలు పెద్దవి అవుతుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరు....మీ ముఠామేస్త్రీలందరూ వచ్చి ఆర్పడానికి ట్రై చేస్తారు. నీళ్ళు కూడా అందుబాటులోనే వున్నట్లున్నాయి” డంపింగ్ గ్రౌండ్ పక్కనే వున్న పెద్ద వాటర్‌ట్యాంక్‌ని గమనిస్తూ అన్నాడు దీపక్.

* * * *

“ఇప్పుడు ఈ మాటలు ఎందుకు చిన్నబాబూ? ఆ చెత్తాచెదారం అంటుకుంటే మహాదరిద్రంగా వుంటుంది। మనం ఇక్కడ నిలబడటం చాలా కష్టం అవుతుంది” అతని చేతిని పట్టుకుని అవతలికి తీసుకుపోవడానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు జగజీత్.

“నేను వెళ్ళి సిమ్రాన్ సేట్ ఆఫీసు దగ్గిర వుంటాను. నువ్వు ఈ చెత్తకు నిప్పు అంటించి వచ్చేయ్....” అంటూ అతని చేతికి తన లైటర్‌ని అందించి వెళ్ళిపోయాడు దీపక్. అతను అలా ఎందుకు చెబుతున్నాడో జగజీత్‌కి అర్థంకాలేదు. అర్థంచేసుకోవడానికి ప్రయత్నంచేస్తూ నెరావీగా అక్కడే నిలబడివుంటే, తన గుట్టురట్టు అవుతుందని భయంవేసి, చెత్త గుట్ట వెనుకభాగంలోకి పోయాడు. వెదురు గంపలు ఎక్కువగా వున్న ప్రదేశంలో, లైటర్‌ని వెలిగించి ఒక గంపను అంటించాడు.

గప్పుమని పైకి లేచింది మంట. పాములా మెలికలు తిరుగుతూ

మరికొన్ని గంపలను ముట్టడించింది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెనక్కి తిరిగి దీపక్ వెళ్ళిన దిశలో పరుగుతీశాడు జగజీత్. అతను సిర్మాన్ సేట్ ఆఫీసు దగ్గిరికి పోవడం, చెత్తగుట్ట దగ్గిర గందరగోళం చెలరేగడం ఒక్కసారే జరిగింది.

"పనీపాటా లేని బద్మాష్ ఎవడో సిగరెట్‌నో, బీడీనో గుట్టమీదికి విసిరేశాడు. మంటలు పెద్దవి అవుతున్నాయి రండి....రండి" అని కేకలు కూడా వినవచ్చాయి.

"వెరీగుడ్....ఈ గందరగోళంలో మనల్ని గురించి ఎవరూ ఆలోచించరు....కమాన్" అంటూ జగజీత్‌ని హెచ్చరించాడు దీపక్. ఆఫీసు వెనుక భాగంలో టైట్‌గా తలుపులు వేసివున్న ఒక కిటికీ అంచుమీద కాలుపెట్టి పైకిలేచాడు దీపక్. ఏటవాలుగా వున్న ఆస్‌బెస్టాస్ రేకుల్ని గట్టిగా పట్టుకుని పైకి ఎగ్రబాకాడు.

రెండుక్షణాలు ఆలస్యంగా అతని మాదిరిగానే రేకులమీదికి చేరుకున్నాడు జగజీత్.

తనే స్వయంగా సర్దిపెట్టిన టార్పాలిన్ ముక్కల్ని తొలగించి వాటి కిందవున్న సిమెంట్ రేకుల్ని పక్కకు లాగేశాడు జగజీత్. కింద ఏమున్నదీ చూసుకోను కూడా చూసుకోకుండా ఆఫీసులోకి దూకాడు.

అతని మాదిరి గాకుండా, సిమెంట్ రేకులకు ఆలంబనగా వున్న ఇనుప పైపుల్ని పట్టుకుని చాలా నెమ్మదిగా లోపలికి జారాడు దీపక్. కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్‌దందాలు చేసే సేట్‌జీల ఆఫీసులు ఎలా వుంటాయో, అచ్చం అలాగే వుంది లోపలిభాగం.

పెద్ద రాతిపేదిక....దానిమీద మెత్తటి పరుపు....సుఖంగా కూర్చోవ దానికి పెద్దపెద్ద దిళ్ళు....గుమాస్తాల కోసం చెక్కబల్లలు....గోడలకు రకరకాల దేవుళ్ళ క్యాలెండర్లు.

*   *   *   *

"సిర్మాన్‌సేట్ కూర్చునేది ఇక్కడే....ఇదిగో చేతికి అందేటట్లుండే అలమరా...." అంటూ దీపక్‌కి ఒక ఐరన్ బీరువాను చూపించాడు జగజీత్.

"దాన్ని తెరవడం దీవల్ల సాధ్యం అవుతుందా? చుట్టూ చూస్తూ



అడిగాడు దీపక్.

"తను లేని సమయంలో ఇక్కడ డబ్బుల్ని దాచడు....అందుకని తాళం వేయడు...." అంటూ హ్యాండిల్ని పట్టుకుని ఆ బీరువాని తెరిచాడు జగజీత్.

"ఓ.కే....ఇందులో మనకి కావాల్సినదీ, అవసరమైనదీ ఏదీలేదు... వెరీగుడ్...." అంటూ ఇంకోసారి చుట్టూచూసి, పెదవులు కొరుక్కున్నాడు దీపక్.

"మనకి కావాల్సింది ఏమిటి చిన్నబాబూ, దేనికోసం వెతుకుతున్నాం" అడిగాడు జగజీత్. రెండుక్షణాలు ఆలోచించి, సిర్మాన్ సేట్ కూర్చునే ప్రదేశంలోని పరుపును ఇవతలికి లాగిపడేశాడు దీపక్. ఆశ్చర్యంగా చూసిన జగజీత్, అదిరిపడ్డాడు ఒక్కసారిగా.

పరుపు కింది భాగంలోని రాతిపేదిక మధ్యలో చిన్నసైజు చెక్కపెట్టె పట్టేంత డిప్రెషన్ క్రియేట్ చేయబడి వుంది. ఆ డిప్రెషన్‌లో ఒక దానిమీద ఒకటిగా పేర్చబడి వున్నాయి పదిలక్షల విలువచేసే కరెన్సీ కట్టలు.

"అయ్యబాబోయ్.... అన్నీ అయిదువందల కట్టలే. ముంబయి మార్కెట్‌వాలాలు తెచ్చి ఇచ్చిన డబ్బులే అయివుంటాయి ఇవి. ఇంటికి తీసుకుపోకుండా ఇక్కడ అందరికీ కనిపించేటట్లు ఎందుకు దాచిపెట్టడం?" గుండెలమీద చేయివేసుకుంటూ అస్పష్టంగా అన్నాడు జగజీత్.

"ఆ సిర్మాన్ సేట్ ఇక్కడ డబ్బుల్ని దాచిపెట్టినట్టు మీరు ఎలా ఊహించగలిగారు చిన్నబాబూ?" డిప్రెషన్‌లో వున్న నోట్లకట్టలు తడిమి చూస్తూ ఇంకో ప్రశ్న వేశాడు.

"ముంబయినించి వచ్చినవాళ్ళు సిర్మాన్ సేట్‌కి డబ్బుల్ని ఇవ్వడం నువ్వు చూశావ్. నీ డబ్బుకోసం పేచీ పెట్టుకుని గొడవ చేశావ్. నీ పొగరు అణిచేందుకు అతను పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడు.

రిపోర్ట్ ఇచ్చిన తర్వాత ఈ డబ్బుల్ని తను తనవెంట ఎక్కడికి తీసుకుపోయినా, ఎవరో ఒకరు గమనించడం జరుగుతుంది. తను తప్పుడు రిపోర్ట్ ఇచ్చినట్టు పోలీసులకు తెలిసిపోతుంది. అలా జరగకూడదనే అతను ఇక్కడ దాచిపెట్టాడు. పోలీసులు గట్టిగా అడిగితే, తన అల

మరలో ఏమీలేవని చెప్పడంకోసం దానికి తాళం కూడా వేయకుండా వదిలేశాడు. మీ సిమ్రాన్ సేట్ చాలా తెలివైనవాడు" తాపీగా చెప్పాడు దీపక్.

"వాడు ఎంత తెలివైనవాడయినా, మీ ముందు ఎందుకూ పనికిరాడు చిన్నబాబూ. మీ తెలివితేటలముందు వాడు బలాదూరే. ఇప్పుడు ఏం చేద్దాం? ఈ డబ్బును తీసుకుపోయి పోలీసులకు అప్పచెపుదామా?" ఆత్రుతగా అడిగాడు జగజీత్ దీపక్‌ని.

"ఈ డబ్బుమీద మనం చెయ్యివేసిన మరుక్షణం దొంగలమయి పోతాం. ముట్టుకోవద్దు. ముందు ఇక్కడినించి బయటికి వెళ్ళిపోవాలి" అంటూ వేదికమీదినించి లేచాడు దీపక్. పక్కకు లాగిన పరుపును యధాప్రకారం సరయిన స్థలంలోకి జరిపి, ఏ మార్గంనుంచి అయితే లోపలికి వచ్చారో అదే మార్గంగుండా రేకులషెడ్ పై భాగంలోకి చేరుకున్నారు ఇద్దరూ.

# 3

చెత్తగుట్టల మీద చెలరేగిన మంటల్ని ఎంతో కష్టంమీద కంట్రోల్ చేయగలిగారు అక్కడ గుమికూడిన ముఠాకూలీలు, వారి మేస్త్రీలు.

సైరన్లను మోగించుకుంటూ అప్పుడే అక్కడికి చేరుకుంటున్నాయి రెండు ఫైరింజన్లు.

"అంతా అయిపోయిన తర్వాత తాపీగా రావడం వీళ్ళకి బాగా అలవాటయింది....వీళ్ళు ఎప్పుడూ ఇంతే చిన్నబాబూ...." షెడ్ పైభాగం మీదినించి కిందికి దూకడంలో సాయం చేస్తూ దీపక్‌తో అన్నాడు జగజీత్.

"వీధుల్లో ట్రాఫిక్ చాలా రద్దీగా వుండే సమయం ఇది....వాళ్ళ తప్పుకాదు...." చేతులకు అంటిన మట్టిని దులుపుకుంటూ ఇవతలికి వచ్చి చెప్పాడు దీపక్.

ఒక కరెంట్‌పోల్ దగ్గిర నిలబడి, సెల్‌ఫోన్‌ని బయటికి తీశాడు.



"హల్లో....ఎవరు?" అంటూ వినవచ్చింది ఎస్.పి. కోదండపాణి గారి కంఠం.

"నేను దీపక్‌ని మాట్లాడుతున్నాను అంకుల్....సురేంద్రగారి మనవడిని...."

"నువ్వు ఎవరివో వివరాలు చెప్పడం ఇప్పుడు అవసరమా? నీ పేరు వినగానే నువ్వు ఎవరి మనవడివో నేను తెలుసుకోలేనని అనుకుంటున్నావా? నీకు ఇంకా చిన్నతనం పోలేదు....ఏంటి విషయం?" చిన్నగా నవ్వుతూ అన్నాడు ఎస్.పి. కోదండపాణి.

"జగజీత్ అని నాకు స్నేహితుడు ఒకతను వున్నాడు. అతను మోండా మార్కెట్‌లో ముఠాకూలీ...." అంటూ చెప్పడం మొదలుపెట్టాడు దీపక్.

"చెప్పిందే చెప్పి ప్రాణాలు తీయకు. ఆ జగజీత్ స్నేహితుడు యాదగిరిని మావాళ్ళు ఇంకా వదిలిపెట్టలేదా? ఏదీ ఫోన్ ఒకసారి ఆ ఎస్సయ్‌కి ఇవ్వు...." వున్నట్లుండి సీరియస్ అవుతూ అన్నాడు ఎస్.పి.

"అదికాదు అంకుల్.... యాదగిరిని ఎప్పుడో వదిలిపెట్టేశారు....ఇప్పుడు నేను ఫోన్‌చేసింది అందుకు కాదు....జగజీత్‌మీద తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఆ సిమ్రాన్ సేట్ ఏం చేశాడంటే-" అంటూ హోల్‌సేల్ వ్యాపారుల గదుల దగ్గిర తాము చేసిన ఎడ్వెంచర్‌ని, చూసిన దృశ్యాన్ని వివరంగా చెప్పాడు దీపక్.

"మైగాడ్....ఆ డబ్బు తన దగ్గిరే వుంచుకుని తప్పుడు రిపోర్ట్ ఇచ్చాడా? యూ డూ వన్‌థింగ్....నువ్వు అక్కడే వుండు. నేను వెంటనే బయలుదేరివస్తున్నాను...." అంటూ కనెక్షన్ కట్‌చేశాడు ఎస్.పి. కోదండపాణి.

"చిన్నబాబూ.... చిన్నబాబూ.... డేంజర్.... యమడేంజర్.... మార్కెట్ తగలబడబోయినట్టు తెలిసింది కాబోలు....సిమ్రాన్‌సేట్ పరిగెత్తుకుంటూ వస్తున్నాడు" అల్లంతదూరంలో వేగంగా దూసుకువస్తున్న మారుతీకారును చూపిస్తూ చెప్పాడు జగజీత్.

* * * *

వేగంగా వచ్చిన మారుతీలోనుంచి మరింత వేగంగా కిందికి దూకి,

పరిగెత్తుకుంటూనే తన ఆఫీసు దగ్గిరికి పోయాడు స్క్రమాన్ సేట్. వణుకుతున్న చేతులతో తాళాలు తీసి లోపలికి గెంతాడు.

"పరుపును పక్కకు జరిపి డిప్రెషన్లో వున్న నోట్లకట్టల్ని చూసుకుంటాడు. ఇక వెనుకాముందూ చూసుకోడు. వాటన్నిటినీ హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని ఇంటికి తీసుకుపోతాడు" మార్కెట్ ముఖద్వారం దగ్గిర నిలబడి, స్క్రమాన్ సేట్ కదలికల్ని క్లోజ్‌గా వాచ్‌చేస్తూ కామెంట్ చేశాడు దీపక్.

"అయ్యయ్యో....అలా జరిగితే ఎలా చిన్నబాబూ? ఇంతవరకూ మనం పడిన కష్టం అంతా మట్టికొట్టుకుపోతుంది" ఆందోళనగా అంటున్న జగజీత్ భుజంతట్టి, ముందుకు నడవమని సైగచేశాడతను.

"ఎస్.పి. అంకుల్ ఇక్కడికి రావడానికి ఇంకా కొంచెం టైమ్ పట్టవచ్చు. అంతవరకూ అతను తన ఆఫీసులో నుంచి చిన్నపాటి చీపురుపుల్లను కూడా అవతలికి తీసుకుపోకూడదు....ఎలా మేనేజ్ చేస్తావ్...." అని అడిగాడు.

"నాకు ఆలోచన తట్టడంలేదు. మీరెలా చెపితే అలాగే చేస్తాను. త్వరగా చెప్పండి" తొందరచేశాడు జగజీత్.

"వెళ్ళు....స్క్రమాన్ సేట్ దగ్గిరికి పోయి ఇంకోసారి గొడవ పెట్టుకో....అతను పోలీసుల్ని పిలిచేదాకా ఊరుకోవద్దు...." తన ఆలోచన ఏమిటో అప్పుడు చెప్పాడు దీపక్.

మంచిచెడుల గురించి ఏమాత్రం ఆలోచించలేదు జగజీత్....వింటి నుంచి వెలువడిన బాణం మాదిరి ముందుకు దూసుకుపోయాడు.

"దొంగకేసు బనాయించి నన్ను పోలీసులకు పట్టించాలని ప్లాను వేస్తావా? బైటికి రా స్క్రమాన్ సేట్....బైటకి రా" ఆఫీసు ముందు తొడ చరుస్తూ బిగ్గరగా అరిచాడు.

పెద్దవి కాబోయిన పంటల్ని మొదట్లోనే గమనించి మార్కెట్‌ని పెద్ద ప్రమాదం నుంచి రక్షించగలిగినందుకు ఒకరినొకరు అభినందించుకుంటూ, ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు ముఠాకూలీలు, మేస్త్రీలు.

జగజీత్ అరుపులు వినబడి అదిరిపడి చూశారు అందరూ....పరుగులాంటి నడకతో స్క్రమాన్ సేట్ ఆఫీసు దగ్గిరికి వచ్చి గుంపుగా నిలబడ్డారు.



"బయటికి రా స్క్రమాన్ సేట్....త్వరగా రా...." అక్కడ గుమిగూడినవారందర్నీ చూసి మరింతగా రెచ్చిపోతూ ఇంకాస్త బిగ్గరగా అరిచాడు జగజీత్.

"అరే నోరుమూసుకో....స్క్రమాన్ సేట్‌కి కోపం వస్తే మనిషి కాదు. నీ ఒళ్ళు హూనమైపోతుంది" ముందుకు అడుగువేసి, చాలా సౌమ్యంగా జగజీత్‌ని సముదాయించడానికి ట్రైచేశాడు ఒక ముఠా కూలీ.

"వాడికి కోపం వస్తే నాకేంటి? నేను చేయని దొంగతనాన్ని నామీద రుద్దాడు—ఇంతకంటె ఎక్కువ ఇంకా ఏం చేస్తాడు? బయటికి రమ్మను....ఇవాళ అటోఇటో...." పళ్ళు కొరుకుతూ అరిచాడు జగజీత్

*　　*　　*　　*

లోపలినుంచి స్క్రమాన్ సేట్ సైగను అందుకున్నారు కాబోలు.... పిడికిళ్ళు బిగిస్తూ ముందుకు కదిలారు అక్కడే వున్న అతని మేస్త్రీలు ముగ్గురు.

"నా ఒంటిమీద చెయ్యిపడిందంటే, నాయాళ్ళలారా మీకు నూకలు చెల్లిపోయినట్లే....మీకు ధైర్యం వుంటే పోయి పోలీసుల్ని తీసుకువచ్చుకోండి....వెళ్ళండి...." చూపుడువేలితో వారిని బెదిరిస్తూ అన్నాడు జగజీత్.

"నిజమే....స్క్రమాన్ సేట్ రిపోర్ట్ ఇచ్చాడుగదా....వాళ్ళు జగజీత్ కోసం వెతుకుతున్నారు కదా....వీడు ఇక్కడే వున్నట్టు తెలిస్తే వెంటనే వచ్చేస్తారు...." అన్నాడు గుంపులో నిలబడివున్న మేస్త్రీ ఒకతను.

"అరే....అలా దేబ్యముఖాలు వేసుకు నిలబడతారేమిటి బే? పోలీసుల్ని పిలవమని వాడే మీకు చెపుతున్నాడు....అలాగే పిలవండి....వాళ్ళు వచ్చి నడుములు విరగదీస్తే గాని బుద్ధిరాదు....వెళ్ళి పోలీసులకు ఫోన్ చేయండి" వున్నట్లుండి అన్నాడు ఇంకో మేస్త్రీ....అక్కడ వున్న వారందరికీ నచ్చాయి కాబోలు ఆ మాటలు, తలలు ఊపి తమ మద్దతును తెలియజేశారు కొంతమంది.

"అలాగే—అలాగే చేయండి. అదే మంచి పద్ధతి" అని అరిచారు మరికొంతమంది. ముందుకు రాలేక ఎక్కడివాళ్ళక్కడే ఆగిపోయారు స్క్రమాన్ సేట్ మేస్త్రీలు. తలల్ని పక్కకు తిప్పి ఆఫీసు లోపలికి చూశారు.

ఫర్దర్‌గా వాళ్ళకు ఏం చెప్పాలో తనకు తోచనట్టు చిరాకుగా తల విదిలించాడు సిమ్రాన్‌సేట్.

రెండు క్షణాలు ఆలోచించి, "అలాగే పిలవండి. వాళ్ళు వచ్చేలోపల వీడు పారిపోకుండా గట్టిగా పట్టుకోండి" అని సలహా కూడా ఇచ్చాడు.

"పారిపోవాల్సిన ఖర్మ నాకు పట్టలేదు సేటూ....పోలీసుల్ని చూసి భయపడేంత పిరికివాడిని కాదు....వాళ్ళు వచ్చేటంతవరకూ ఇక్కడినించి ఒక్క అడుగు కూడా అవతలకు వెయ్యను" అంటూ సరిగ్గా ఆఫీసు గుమ్మానికి అడ్డంగా నేలమీద చతికిలపడ్డాడు జగజీత్.

"వీడు మాట్లాడేది నాకు అర్థంకావడంలేదు. వీడి మాటలు వింతగా వున్నాయి. వీడికి ఇంత ధైర్యం ఎక్కడినించి వచ్చింది?" తమలో తాము గుసగుసలు చెప్పుకోవటం మొదలుపెట్టారు గుంపులోని కూలీలు.

* * * *

వేదికమీది పరుపును పక్కకు లాగడానికి సిమ్రాన్ సేట్ రెడీ అవుతున్న సమయంలో ప్రారంభం అయినట్టుంది గొడవ. ఆ పని చేయలేకపోయాడు కాబోలు. కాలుగాలిన పిల్లిమాదిరి ఆఫీసులో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు సిమ్రాన్ సేట్.

సిమ్రాన్‌సేట్ ఆఫీసులోనే వున్న ఫోన్‌ని అందుకుని పోలీసులకు జగజీత్‌ని గురించి చెప్పాడు ఒక మేస్త్రీ. త్వరగా అక్కడికి రమ్మని రిక్వెస్ట్ చేశాడు.

రెండు నిముషాల్లో కాదుగాని, పన్నెండు నిముషాల తర్వాత బ్రహ్మాండంగా దూసుకువచ్చింది పోలీస్‌జీప్.

కిరాతకుడివంటి ఎస్సయ్ అందులోనుంచి కిందికి దూకుతాడనీ, జగజీత్ జుట్టుపట్టుకుని నడుములు విరిగిపోయేటట్టు కొడతాడని ఆశించిన అక్కడి జనాలందరికీ ఆ సమయంలో నిరాశే మిగిలింది.

ఎస్సయ్ దిగలేదు జీప్‌లోనుంచి. ఏకంగా ఎస్.పి.సాబ్ స్వయంగా కిందికిదిగి, ఠీవిగా ముందుకు వచ్చాడు.

గబాగబా పైకిలేచి వినయంగా నమస్కారం చేశాడు జగజీత్. "నువ్వు పోయి జీప్‌లో కూర్చో" ముక్తసరిగా అతనికి చెప్పాడు ఎస్.పి. సాబ్. రెండవసారి చెప్పించుకోవడం తనకు అలవాటులేనట్టు మూడు అంగల్లోపోయి జీప్‌లో దూరిపోయాడు జగజీత్.



"అతను దొంగతనం చేశాడని మీరు కంప్లెయింట్ ఇచ్చారు అవునా?" లోపలికివెళుతూ సిమ్రాన్‌సేట్‌ని అడిగాడు ఎస్.పి.సాబ్.

"అవునుసాబ్...."తడబడకుండా వుండటానికి ట్రైచేస్తూ ఒప్పుకున్నాడు సిమ్రాన్‌సేట్.

"వెరీగుడ్....పదిలక్షలు పోవడం అంటే మాటలుకాదు. అతని ముఖం చూస్తుంటే అంత సొమ్మును దొంగతనం చేయగల మనిషి మాదిరిగా కనిపించడం లేదు.

ఒకవేళ ఎక్కడయినా పెట్టి మరిచిపోయారేమో ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి" ఆఫీసు చుట్టూ చూస్తూ సౌమ్యంగా చెప్పాడు ఎస్.పి సాబ్.

"పదిలక్షలు సార్....పది రూపాయలుకాదు పెట్టినచోటు మరిచిపోవడానికి. పైకి పెద్ద అమాయకుడి మాదిరి కనిపిస్తున్నాడుగాని, వాడు వట్టి బడాచోర్....దొంగతనం చేసింది వాడే. నాకు వాడిమీదనే అనుమానం. ఖచ్చితమైన కంఠంతో స్పీడ్‌గా చెప్పాడు సిమ్రాన్.

"ఆల్‌రైట్....ఆల్‌రైట్....దొంగతనం జరిగిన మాట వాస్తవం. ఓ.కే...." అంటూ తన వెనకే వచ్చిన ఎస్సయ్ ఒకతనికి సైగచేశాడు ఎస్.పి. సాబ్.

"వెతకండి....ఒకసారి ఈ ఆఫీసునంతా వెతకండి" అంటూ పక్కకు జరిగి నిలబడ్డాడు.

"దొంగిలించిన బద్మాష్‌ని మీరు మీ జీప్‌లో కూర్చోబెట్టారు. వాడి దగ్గిర వెతకాలి, వాడి ఇంటి దగ్గిర వెతకాలి. అలా చేయకుండా ఇక్కడ వెతకడం ఏమిటి సార్?" ఆందోళన నిండిన కంఠంతో అడిగాడు సిమ్రాన్ సేట్.

"వేలిముద్రలు దొరుకుతాయ్. దొంగతనం చేసిన వాళ్ళ జాడలు కూడా మాకు తెలుస్తాయి. మీరు దయచేసి నోరు మూసుకోండి" అంటూ అతన్ని ఇవతలికి లాగి ఎస్సయ్‌కి మరోసారి సైగ చేశాడు ఎస్.పి.

నిర్మొహమాటంగా వేదికమీది పరుపును బర్రునలాగి అవతల పడవేశాడు ఎస్సయ్.

రాతి అరుగు మధ్యలోని డిప్రెషన్‌ని, అందులో వున్న నోట్ల కట్టల్ని చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు.

"నావే....అవి నావే...." అని అరవాలని అనుకున్నాడు సిప్రమాన్ సేట్. ఎస్.పి. సాబ్ తనవంక చూసిన చూపును గమనించేసరికి నోటిలోని మాట నోటిలోనే వుండిపోయింది. ముఖంమీద చెమటలు కళ్ళల్లోకి, బుగ్గలమీదికి జారడం మొదలుపెడుతుండగా, కాళ్ళల్లో ఓపికలేనట్టు కింద కూర్చుండిపోయాడు.

# 4

మూడు ఫుట్‌బాల్ కోర్టులు కలిపితే ఎంత వెడల్పుగా వుంటాయో, అంతకు రెట్టింపు విశాలంగావుండే ఆవరణ మధ్యన కట్టబడిన పాతకాలపు రాజమహల్‌వంటి బిల్డింగ్ అది. పచ్చటి మొక్కలు, ఎత్తయిన చెట్లు, కనులకు ఆహ్లాదాన్ని కలిగించే పూపొదలు, ఆ పొదలమీది పువ్వుల కోసం ఎగబడుతున్న సీతాకోకచిలుకలు, తేనెటీగలు, తుమ్మెదలు. పాతకాలపు వాతావరణమే ఇప్పుడు కూడా అక్కడ కనిపిస్తోంది.

15 అడుగుల ఎత్తువున్న ఇనుపగేటు దగ్గిర నిలబడి, చిన్నగా కునికిపాట్లు పడుతున్నాడు వాచ్‌మేన్ వహీద్ భాయ్. గేటుపక్కనే వున్న చిన్న చెక్కల షెడ్లో నుంచి టెలిఫోన్ మోత వినబడేసరికి, అటు పరిగెత్తాడు.

"మేము మైదాన్‌పూర్ వెళ్ళడంలేదు. మధ్యలోనే మా ప్రయాణం కాన్సిల్ అయింది. తిరిగి ఇంటికి వచ్చేస్తున్నాం. గేటుతెరువ్" ఖంగు మంటూ వినవచ్చింది డ్రయివర్ రాంసింగ్ కంఠం.

రిసీవర్‌ని ఫోన్‌మీద పడేసి, తూనీగమాదిరి గేటు దగ్గిరికి తిరిగి వచ్చాడు వహీద్. పదిమంది బలం కలిగిన వస్తాదులు బలవంతంగా నెడితే తప్ప అవతలకు జరగనన్నట్లుగా కనిపించే ఆ ఇనుపతలుపుల్ని చాలా తేలికగా తెరిచి అటెంషన్లో నిలబడ్డాడు.

అతను గేటు తెరవడం, రాంసింగ్ నడుపుతున్న ఖరీదయిన కారు



వేగంగా దూసుకువచ్చి గేటును క్రాస్‌చేయడం ఒకేసారి జరిగింది.

*   *   *   *

మళ్ళీ మోగింది చెక్కల షెడ్లో వున్న టెలిఫోన్.

"వహీద్‌భాయ్....నేను లాయర్ దామోదరాన్ని మాట్లాడుతున్నాను. పెద్దబాబుగారు మైదాన్‌పూర్‌నించి తిరిగి వచ్చారా?" అడిగింది ఒక కంఠం.

"పెద్దబాబుగారు రావడం అయితే తిరిగి వచ్చారు....ఖాళీగా వున్నారో, వేరే పనులేమైనా చేసుకుంటున్నారో నాకు తెలీదు. మీరు లోపలికి ఫోన్‌చేయడం చాలా మంచిది" అంటూ, ఈసారి అవతలి మాటల్ని వినిపించుకోకుండా ఫోన్ పెట్టేశాడు వహీద్.

గేటు దగ్గిరికిపోయి తలుపుల్ని మూయబోతుండగా, మోతలుచేస్తూ వచ్చి అక్కడ ఆగింది ఒక ఆటో.

కనులు చిట్లించి అటుకేసి చూసి, అప్రయత్నంగా చిరునవ్వు నవ్వేశాడు వహీద్.

అలసిపోయినట్లు అతి నెమ్మదిగా ఆటోలోనుంచి దిగాడు దీపక్. తన ప్యాంటుజేబులో నుంచి వాలెట్‌ని తీసి వహీద్ మీదికి విసిరాడు.

"ఇతను ఇంకా చాలాచోట్లకు పోవాలి.... మన జగజీత్ ఎస్.పి. అంకుల్ ఆఫీసు దగ్గరే వున్నాడు. అతని పని అయిపోయేదాకా ఆగి, అతన్ని వాళ్ళ కాలనీదగ్గిర వదిలిపెట్టాలి. ఎంత అడుగుతాడో తెలుసుకో. అడిగినంతా ఇచ్చేయ్" అంటూ ముందుకు అడుగులు వేశాడు.

"చిన్నబాబూ....మీ బుక్స్ ఏమయిపోయాయి?" అడిగాడు వరిశీలనగా చూస్తూ వహీద్.

తన బుక్స్‌ని గురించి అప్పుడు గుర్తుకువచ్చింది దీపక్‌కి. "అవును కదూ....వాటిని మధ్యాహ్నం క్యాంటీన్లోనే వదిలేసివచ్చాను. ఎక్కడికీ పోవు. రేపువెళ్ళి తీసుకోవచ్చు" అంటూ ఆగకుండా వెళ్ళిపోయాడు.

*   *   *   *

చెక్కల షెడ్లో నుంచి ఫోన్‌మోత వినవచ్చేసరికి మరోసారి అటు పరిగెత్తాడు వహీద్.

"లాయర్ దామోదరంగారు వస్తున్నారు. గేటు తెరిచివుంచు....

అన్నట్టు వహీద్ భాయ్....ఒక్క విషయం...." అంటూ ఆగింది అవతలి కంఠం.

"చెప్పు పీటరూ....త్వరగా చెప్పు....ఏంటా విషయం?" ఆసక్తి నిండిన కంఠంతో అడిగాడు వహీద్.

"దామోదరంగారి మేనకోడలు శృతి మేడమ్ కూడా వస్తోందిట.... అమెరికాలో ఏదో పెద్ద చదువు చదివి మొన్ననే ఇక్కడకు తిరిగి వచ్చిందిట....

ఆ పిల్లను మన దీపక్ బాబుకి ఇచ్చి నిఖాచేయాలని పెద్దబాబుగారు అనుకుంటున్నారు. నువ్వు ఎలర్ట్‌గా వుండు. ఆ పిల్లను జాగ్రత్తగా గమనించు. ఎందుకు చెబుతున్నానో తెలిసిందా?" అడిగింది పీటర్ కంఠం.

ముఖమంతా నవ్వులమయం అయిపోతుండగా, చిన్నగా గంతులు వేశాడు వహీద్.

"చిన్నబాబు ముక్కుకు తాడు వెయ్యాలనే ఆలోచన వచ్చిందన్న మాట! బాగుంది....చాలా బాగుంది" అంటూ ఫోన్‌పెట్టి గేటుదగ్గిరికి పరిగెత్తాడు.

సిటీ వెలుపల సురేంద్రగారికి పెద్ద పెద్ద ఫామ్‌హౌస్‌లు మూడో నాలుగో వున్నాయి....వాటిల్లో చమన్‌గూడా ఫామ్‌హౌస్‌నించి ప్రతిరోజూ ఆ బిల్డింగ్‌లో వున్నవారి అవసరాల కోసం పెద్ద పెద్ద కాన్లనిండా పాలు పంపించటం మైసయ్య డ్యూటీ.

చెక్క్ల షెడ్లోనుంచి వహీద్ గేటు దగ్గిరికి వస్తున్న సమయంలోనే పెద్ద మినీలారీలో పాలకాన్లను పెట్టుకుని వేగంగా వచ్చాడు అతను.

"అరే మైసయ్యా....మన లాయర్ దామోదరంగారింటికి జున్ను పాలు పంపిస్తూ వుంటావు గదా....ఆళ్ళ ఇంటిని గురించి నీకు ఏమైనా ఎరికుందా?" తనను చూసి మినీలారీని గేట్లోనే ఆపిన మైసయ్యని అడిగాడు వహీద్.

"ఇంటిని గురించి ఎరికా? అంటే ఏంటి వహీదూ? నువ్వు ఏం తెలుసుకోదలుచుకున్నావో వివరంగా చెప్పు....చుట్టుదారి ప్రశ్నలు వేస్తే నాకు తలకాయనెప్పి" అన్నాడు మైసయ్య.

"ఓరి నీ తెలివి దొంగల్దోల....ఇంటిని గురించి ఎరిక అంటే,



దామోదరంగారి ఇంట్లో ఎవరెవరు వుంటున్నారో, వాళ్ళ పద్ధతులు ఏంటో వివరాలు" అంటూ తన ప్రశ్నను వివరించి చెప్పాడు వహీద్.

"వాళ్ళ వివరాలతో ఇప్పుడు నీకు అవసరం ఎందుకు వచ్చింది? సురేంద్రసాబ్‌కి తెలిస్తే నీ ముక్కలు విరగేయిస్తడు. దామోదరం సాబ్ అంటే ఆయనకి మహా అపేక్ష....ఇద్దరూ చిన్నతనం నుంచి మంచి దోస్తులు" అన్నాడు మైసయ్య.

"అవును మరి....ఆ సంగతి మాకు తెలియకపోవటం వల్లే నిన్ను అడిగాం....నీయవ్వ.... నిన్నగాక మొన్న పెద్దబాబుగారి దగ్గిర పనిలో చేరినవాడివి నువ్వు. నలభై రెండు సంవత్సరాలనించి ఈడ వుంటున్నా నేను....దామోదరంగారి గురించి నువ్వు నాకు చెప్పేదా?" తలను కాస్త ముందుకు వంచి, కనుకొలకుల్లోనుంచి అతని వంక మహా క్రూరంగా చూస్తూ అన్నాడు వహీద్.

పోట్లాడటానికి సిద్ధం అవుతున్న బాక్సర్ పప్పీ మాదిరి అతని ముఖం కనిపించేసరికి నవ్వు ఆగలేదు మైసయ్యకి. తెల్లటి దంతాలన్నీ బయటికి కనిపించేటట్లు గలగలా నవ్వేశాడు అతను.

"అరె బేవకూఫ్.... దామోదరంగారి మేనకోడలు.... శృతి మేడమ్‌ట....ఇప్పుడు ఇక్కడికి వస్తోందిట....చిన్నబాబుకు ఆ అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చేయాలనే మాట బయటికి వచ్చింది" తను కూడా నవ్వేస్తూ అసలు విషయాన్ని బయటపెట్టాడు వహీద్.

"శృతిమేడమా? అవును నిజమే....పదిరోజుల క్రితం జున్నుపాలు తీసుకుని నేనే వాళ్ళ ఇంటికి పోయినా....ఆ బిడ్డ అప్పటికి అమెరికానించి రాలేదు....ఆ రోజునో, మర్నాడో వస్తదని దామోదరంగారి భార్య చెప్పినట్టు గుర్తు....ఆ అమ్మాయి గురించి అంతకంటే నాకు ఏమీ తెలియదు వహీదూ....మన పీటర్‌కి తెలిసే వుంటుంది" అంటూ క్లచ్ మీదినించి కాలును తీసి లారీని ముందుకు పోనిచ్చాడు మైసయ్య.

డడడడమని మోతలు చేస్తూ వస్తున్న ఆ వెహికిల్‌ని అల్లంత దూరంలో వుండగానే గమనించి బిల్డింగ్ పక్కభాగంలో వున్న ఒక ఎంట్రన్స్ ముందుకు వచ్చాడు వంటహాలును పర్యవేక్షించే అవతారం.

"బాగున్నావా అవతారం? నీ బ్లడ్‌ప్రెషర్ కంట్రోల్ అయిందా?"

లారీని ఆ ఎంట్రన్స్ దగ్గిర ఆపి, విండోలోనుంచి బయటికి చూస్తూ అడిగాడు మైసయ్య.

"రోజూ ఎవరెవరో వచ్చి కాన్లను దింపిపోతుండే వాళ్ళు. ఇవ్వాళ నువ్వు వచ్చావేంటి?" తన అసిస్టెంట్స్ ఇద్దరిని పిలిచి, మినీలారీలోనుంచి రెండు కాన్లను అన్‌లోడ్ చేయిస్తూ అడిగాడు అవతారం.

"జెర్సీ ఆవులకి దాణా అయిపోయింది, మార్కెట్‌కి వెళ్ళాలి.... అయ్యగారు మైదాన్ పూర్లో ఏవో పొలాలు తీసుకోవాలని అనుకుంటున్నట్లు తెలిసింది....ఆ విషయాలు మాట్లాడాలి....అందుకే నేనే వచ్చా" అంటూ ఇంజన్ ఆఫ్ చేసి స్టీరింగ్ ముందునుంచి క్రిందికి దూకాడు మైసయ్య.

"గెస్టులు ఎవరో వస్తున్నార్ట.... పెద్దబాబుగారు పెద్దహాల్లో వున్నారు" పాలకాన్లను కిచెన్ దగ్గిరికి మోయిస్తూ చెప్పి వెళ్ళిపోయాడు అవతారం.

పాంటుజేబులోనించి హేండ్‌కర్చీఫ్‌ని తీసి ముఖం తుడుచుకున్నాడు మైసయ్య. వెనుక జేబులో వున్న దువ్వెనతో క్రాఫ్ సరిచేసుకున్నాడు. షర్టు బటన్స్ సరిగ్గా వున్నాయో లేవో సరిచేసుకుంటూ మెయిన్ హాలు దగ్గిరికిపోయాడు.

రెండు మూడు గంటలకి ఓసారి చాయ్ తాగటం సురేంద్ర సాబ్‌కి మహా అలవాటు. పీటర్ తీసుకువచ్చి ఇచ్చిన చాయ్ కప్పును చేతుల్లో పట్టుకుని ఒక పెద్ద విండో దగ్గిర నిలబడి వున్నాడాయన.

"అయ్యగారూ! నమస్కారం!" హాలు ఎంట్రన్స్ ముందు నిలబడి చిన్న కంఠంతో పలుకరించాడు మైసయ్య.

చిన్నగా తలతిప్పి అతనివంక చూశాడు సురేంద్రసాబ్. సూదంటు రాళ్ళవంటివి ఆయన కళ్ళు. క్షణంలో సగంకూడా పూర్తిగాకముందే "ఎక్కడ పడ్డావ్! మోకాలుదగ్గిర పాంటు అంతగా చిరిగిపోయింది?" అని అడిగాడు.

అరంగుళం మేర ప్రత్యక్షం అయిన పాంటుమీది చిరుగును అప్పుడు మాత్రమే గమనించాడు మైసయ్య. "ఇదా బాబుగారూ! ఇది ఇందాక మన జెర్సీ ఆవు- దానికి మీరు ఝాన్సీ అని పేరు పెట్టారే....అది కొమ్ములతో ఒక నెట్టు నెట్టింది. అదిగో....అప్పుడు చిరిగిపోయినట్లుంది. నేను చూసుకో



లేదు...." ఆ చిరుగును దాచిపెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ గబగబా అన్నాడు.

"చేసే పనిమీద శ్రద్ధ వుంటే ఇటువంటి పొరపాట్లు జరగవు. ఝాన్సీ ఎలా వుంది?" ఖాళీ కప్పును కాస్తంత దూరంలో నిలబడిన పీటర్ చేతికి అందించి, హాలు మధ్యలో వున్న మెత్తటి సోఫాలో కూర్చుంటూ అడిగాడు సురేంద్రసాబ్.

"ఝాన్సీ సూపర్‌గా వుంది అయ్యగారూ....కాని మన వాతావరణానికి ఆ జాతి ఇమడదనిపిస్తోంది....పది లీటర్ల పాలకోసం మనం పెద్ద పెద్ద ఖర్చులు భరించటం అనవసరమనిపిస్తోంది" వినయంగా చెప్పాడు మైసయ్య.

"నిజం చెప్పావ్....నాకు కూడా అలాగే అనిపించింది. అయినా మోజుపడి తీస్కొ వచ్చాం. ఇప్పుడు అవతలికి పంపించాలంటే మనసు రావటంలేదు. ఏం చేస్తే బాగుంటుందో నువ్వే ఆలోచించి చెప్పు" అంటూ పీటర్ అందించిన లావుపాటి సిగార్‌ని వెలిగించుకున్నాడు సురేంద్రసాబ్.

"ఇప్పటికిప్పుడు మనం ఏదీ చేయవద్దు సాబ్....ఇంకో నెలా రెండు నెలల్లో అది ఈనకు వస్తుంది. అప్పుడు ఆలోచించుకోవచ్చు.... మీరు ఒకసారి పీటర్‌కి చెప్పి ఆ దాణా ఫాక్టరీకి ఫోన్ చేయించాలి.... పోయిన వారం వాళ్ళు పంపిన దాణా క్వాలిటీ బాగోలేదు....ఇంకోసారి ఇలా జరిగితే పద్ధతిగా వుండదని కొంచెం గట్టిగా వార్నింగ్ ఇవ్వాలి" అన్నాడు మైసయ్య.

సురేంద్రసాబ్ పెదవి విప్పి ఒక్కమాట కూడా చెప్పకముందే, తన దగ్గిర వున్న నోట్‌పాడ్ మీద అతని మాటల్ని వ్రాసుకున్నాడు పీటర్.

"చాలా రోజుల తర్వాత వచ్చావ్....భోజనం చేసి వెళ్ళు....మీ చిన్నబాబుకు కనిపించావా? మొన్ననో అటుమొన్ననో నీ గురించి తను అనుకోవటం నేను విన్నాను....ఎందుకో నాకూ తెలియదు ఒకసారి కనిపించి వెళ్ళు" అన్నాడు సురేంద్రసాబ్.

"చిన్నబాబుకు కనిపించకుండా నేను వెళ్ళను అయ్యగారూ....ఆ

బాబుకు కూడా ఝాన్సీ అంటే మహా ప్రేమ....తేడా ఏదైనా వచ్చిందంటే నన్ను గుంజకి కట్టి ఝాన్సీని నామీదికి ఉసికొల్పుతానని గట్టిగా చెప్పాడు" అన్నాడు మైసయ్య.

గుబురుమీసాలు సురేంద్రసాబ్‌వి....క్షణంలో పదోవంతుకాలం ఆ మీసాల చాటున తళుక్కున మెరిసి వెంటనే మాయమైపోయిందా చిరునవ్వు.

"అలాగే చెయ్యి....నువ్వు వెళ్ళి ముందు చాయ్ తాగు. ఏంటీ ఆలోచిస్తున్నావ్....నాతో ఇంకేమైనా చెప్పాలా?" అతను కదలకుండా అలాగే నిలబడివుండటాన్ని గమనించి ఆప్యాయంగా అడిగాడాయన.

"అవును అయ్యగారూ....మీరు మైదాన్‌పూర్ పొలాలు కొనాలని అనుకుంటున్నట్టు తెలిసింది. ఆ మాట నిజమో కాదో తెలుసుకోవాలని వచ్చాను" మాటల్ని మహా జాగ్రత్తగా వెతుక్కుంటూ అడిగాడు మైసయ్య.

"మనల్ని గురించి ఏదైనా మాట బయటికి వస్తే అది అబద్ధం ఎలా అవుతుంది? డెఫినెట్‌గా నిజమే అవుతుంది. మైదాన్‌పూర్‌లో పొలాల్ని కొనాలని అనుకుంటున్నాను. కాని ఆ ఓనర్ అబూదాబినించి ఇవాళ రావాల్సినవాడు ఇంకా రాలేదంట. సగందూరం వెళ్ళి వెనక్కి వచ్చేశాం" అన్నాడు సురేంద్రసాబ్.

"ఇంక అటుకేసి వెళ్ళకండి సాబ్! అబూదాబి వెళ్ళినవాడు వట్టి దొంగరాస్కెల్! మనకి అమ్మచూపిన ఆ పొలాల్ని ఇంతకుముందే ముంబయి సేట్ ఒకతనికి అమ్మేశాడు. హార్ట్‌ఎటాక్ వచ్చి ఆ సేటు ట్రీట్‌మెంట్ కోసం అమెరికా పోయాట్ట. ఇప్పట్లో తిరిగిరాడని అంటున్నారు. వాడు లేని సమయంలో వీడు మనల్ని ఆ తకరారాలోకి ఇరికించేయాలని ప్లాన్ వేసినట్టున్నాడు" గబగబా చెప్పాడు మైసయ్య.

ప్రశాంతంగా కూర్చునివున్న సురేంద్రసాబ్ ముఖంలో ఒక్కసారిగా ప్రత్యక్షం అయింది కోపం.

"వేరే ఎవరికో అమ్మిన పొలాల్ని ఇంకోసారి నాకు అంటకట్టాలని చూశాడా? రాస్కెల్! వాడిని ఊరికే వదిలిపెట్టకూడదు. కాళ్ళు, చేతులు తీయించాలి" అంటూ పీటర్‌కేసి చూశాడు ఆయన.



"వాడు అబూదాబినించి రాగానే మనం మన వహీద్‌ని పంపిద్దాం సాబ్! చిటికెలో పని పూర్తి అవుతుంది" వెంటనే చెప్పాడు పీటర్.

సురేంద్రసాబ్ ముఖంలో ప్రత్యక్షం అయిన కోపం వెంటనే మాయం అయిపోయింది. వహీద్‌కి కోపం చాలా ఎక్కువ. వాడి కాళ్ళు చేతులతోపాటు నడుము కూడా విరగగొట్టి పర్మినెంట్‌గా పనిష్మెంటు ఇచ్చివస్తాడు. మన దామోదరంతో చెప్పి ఏదో ఒకటి చేయిద్దాం. నువ్వు వహీద్‌ని మాత్రం రెచ్చగొట్టకు" అంటూ సిగార్‌ని యాష్‌ట్రేలో పడవేసి, గోడలమీద ఒక ప్రత్యేకమైన ప్లేస్‌లో తగిలించివున్న వాల్‌క్లాక్ వైపు చూశాడాయన.

ఎప్పుడో నూటయాభై సంవత్సరాల క్రితం ఆయన తాతగారు మోజుపడి విదేశాలనుంచి తెప్పించుకున్న క్లాక్ అది.

రిపేర్ అనేది లేకుండా అప్పటినించి నిర్విరామంగా పనిచేస్తూనే వున్నది. ఒక్క సెకన్ కూడా తేడా లేకుండా టైమ్‌ని చూపిస్తూనే వున్నది.

"దామోదరం వచ్చే టైమ్ అయింది. నువ్వు వెళ్ళు" అంటూ మైసయ్యకు పర్మిషన్ ఇచ్చి సోఫాలోనుంచి లేచాడు.

ఆయన తనవైపు చూడకపోయినా నమస్కారం చేసి వెనక్కి పరిగెత్తాడు మైసయ్య. లోపలి గదుల్లో ఒక రోజ్‌వుడ్ వరాగాను శుభ్రం చేస్తున్న మరియమ్మతో "చిన్నబాబు ఎక్కడ?" అని అడిగాడు.

"పైన పెద్దగదిలో ఏదోఒకటి చేస్తూవుంటాడు. పోయి వెతుక్కో" వంచిన తల ఎత్తకుండా సమాధానం చెప్పింది ఆమె.

పరుగులాంటి నడకతో మెట్లుఎక్కి పై గదుల దగ్గిరికి పోయాడు మైసయ్య. వెంటనే కనిపించాడు దీపక్. తన గదిలో కంప్యూటర్ ముందు కూర్చుని ఎవరితోనో చాట్ చేస్తున్నాడు.

"లోపలికి రావచ్చా చిన్నబాబూ?" అడిగాడు మైసయ్య.

తలతిప్పి చూశాడు దీపక్. వెంటనే కాంతివంతం అయింది అతని ముఖం. "నువ్వు రావటానికి పర్మిషన్ ఎందుకు మైసయ్యా? రా లోపలికి" కంప్యూటర్‌ని వదిలేసి అతనికి ఎదురుగా వస్తూ అన్నాడు.

అప్రయత్నంగా తన షర్టు మడతల్ని సరిచేసుకుని గదిలోకి

ఎంటర్ అయ్యాడు మైసయ్య.

"ఎల్లుండి గంగారం దగ్గిర జాతర. రెండురోజుల ముందుగానే గుర్తుచేయమని మీరు చెప్పారు" అటెంషన్‌లో నిలబడుతూ చెప్పాడు.

"నేను రేపు సాయంత్రం ఫామ్‌హౌస్‌కి వచ్చేస్తాను. ఎల్లుండి తెల్లవారగానే గంగారం వెళ్ళిపోదాం. ఆ జాతరలో కర్రసాము స్పెషల్ ఎట్రాక్షన్ అని చెప్పావు కదూ?" ఉత్సాహంగా అన్నాడు దీపక్.

"కర్రసాము వుంటుంది చిన్నబాబూ! స్పెషల్ ఎట్రాక్షన్ అది కాదు. కళ్ళకు గంతలు కట్టుకుని కత్తిని తిప్పటం స్పెషలు.... దాడీవాలా అని తొంభై ఏళ్ళ ముసలోడు....మన తలమీద పెట్టిన నిమ్మకాయని కళ్ళు మూసుకుని కత్తితో రెండుగా నరుకుతాడు. బీహార్‌నించి వచ్చి గంగారంలో సెటిల్ అయ్యాట్ట చాలాకాలం క్రితం. మనం అతన్ని కలిసి మాట్లాడదాం" అన్నాడు మైసయ్య.

"కత్తులు, కర్రలు అంటే తాతగారు ఊరుకోరు. జాతర్లకి వెళ్ళటం అంటే ఆయనకి ఇష్టంవుండదు. నువ్వు ఈ మాట ఎవరికీ చెప్పకు. తాతగారికి తెలిసిందంటే నా పని అవుట్....నాతోపాటు నీ పని కూడా అవుట్ అయిపోతుంది" చిరునవ్వుతో చెప్పాడు దీపక్.

"ఆ మాట నాకు తెలుసు చిన్నబాబూ! అందుకే గేటుదగ్గిర వహీద్ క్కూడా చెప్పలేదు. రేపు సాయంత్రం మీకోసం ఎదురుచూస్తూ వుంటాను" అంటూ వెనుదిరిగి మెట్లకేసి పరిగెత్తాడు మైసయ్య.

పాంటుజేబులోనుంచి సిగరెట్ పాకెట్‌ని బయటికి తీశాడు దీపక్. సిగరెట్‌ని వెలిగించుకోకముందే అడుగుకో మూడుమెట్లు ఎక్కుతూ పైకి వస్తూ కనిపించాడు గార్డెనర్ గండయ్య.

"కావేరి కాంటీన్లో మీరు వదిలేసిన పుస్తకాలు తీసుకువచ్చాను చిన్నబాబూ! మైసయ్య మహా హుషారుగా వచ్చిపోతున్నాడు. గంగారం జాతర గురించి మీకు చెప్పాడా? మిమ్మల్ని అక్కడికి తీసుకుపోతానని అన్నాడా?" తీసుకువచ్చిన పుస్తకాల్ని ఒక టేబుల్‌మీద పెడుతూ, చాలా కాజువల్‌గా అడిగాడు గండయ్య.

ఉలికిపాటును చాలా నేర్పుగా కప్పిపెట్టుకోవటానికి విశ్వ ప్రయత్నం చేశాడు దీపక్. ఉపయోగం లేకపోయింది.



"గంగారం జాతర మహా గందరగోళంగా వుంటుంది. గొర్రెల్ని, మేకల్ని ఆఖరికి పెద్ద పెద్ద దున్నల్ని కూడా నిలబెట్టి నరికేస్తూవుంటారు. ఒక మోస్తరు గుండెధైర్యం కలిగినోళ్ళు ఎవరూ పదినిముషాలు కూడా అక్కడ నిలవలేరు. మైసయ్య ఎన్ని చెప్పినాసరే, మీరు మాత్రం అక్కడికి వెళ్ళకండి" సీరియస్‌గా ముఖం పెడుతూ చెప్పాడు గండయ్య.

"గంగారం జాతర అంటే ఏమిటో నువ్వు ఇప్పుడు చెప్పావ్.... మైసయ్య నోటివెంట ఒక్కమాట కూడా రాలేదు. తెలిసీ తెలియని మాటలు నువ్వెందుకు మాట్లాడతావ్?" కోపంగా చూడటానికి ప్రయత్నిస్తూ అన్నాడు దీపక్.

"ఆ జాతర గురించి మైసయ్య ఏమీ చెప్పలేదంటే నమ్మటానికి నా చెవిలో పువ్వులు ఏమీ లేవు. మీకు ఒక విషయం తెలుసా? ఎల్లుండి ఆ జాతర్లో అక్కడి అమ్మవారికి బలియిచ్చే నాలుగో జీవం మనదే. మన ఫసలీగూడా ఫామ్‌హౌస్‌లో పెంచే పెద్ద పొట్టేలుకి ఎల్లుండితో నూకలు చెల్లిపోతాయ్....ఆ మైసయ్యే తీసుకుపోయి పెద్దబాబుగారి పేరుమీద బలి ఇప్పిస్తాడు...." ఈ మాటని కూడా చాలా కాజువల్‌గా బయటపెట్టాడు గండయ్య.

"ఫసలీగూడా ఫామ్‌హౌస్‌లో వుండే పెద్ద పొట్టేలును బలిస్తారా? జాతర మొదటిరోజున జరిగే బలుల్లో నాలుగో బలి మనదా? ఇంతవరకూ నాకు ఈ మాట ఎందుకు తెలియలేదు? జాతర్లంటే తాతగారికి అసహ్యం అనే అనుకుంటున్నాను....ఎల్లుండి ఆయన కూడా జాతర చూడటానికి వస్తారా?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"తాతగారు రారు బాబూ! అమ్మగారు, నాన్నగారు చనిపోయినప్పటి నించీ ఆయన గుళ్ళకీ, గోపురాలకీ పోవటం మానేశారు. గంగారం జాతర్లో బలి ఇవ్వటం అనే ఆచారం ఇప్పటిదికాదు. మీ ముత్తాతగారి టైమ్‌నుంచీ వరుసగా వస్తోంది. అందుకని ఆయన వెళ్ళకుండా వేరే మనిషిని పంపిస్తారు" చిన్న కంఠంతో చెప్పాడు గండయ్య.

అతన్ని ఇంకా ఇంకా మాట్లాడించి గంగారం జాతర గురించి, ఆ జాతరమీద తాతగారి అభిప్రాయాల్ని గురించి వివరంగా తెలుసుకోవాలని అనుకున్నాడు దీపక్. అయితే అందుకు తగిన సమయం మాత్రం అతని

లక్షించలేదు.

"అయ్యబాబోయ్! మాటల్లోపడి నేను టైమ్‌ని చూసుకోలేదు. ఇప్పుడు తాతగారి దగ్గిరికి ఆ లాయర్ దామోదరంగారు, ఆయన మేనకోడలు శృతి మేడమ్ వస్తారట. సంపంగి పూలంటే ఆ బిడ్డకి చాలా ఇష్టంట. పూసిన పూలన్నీ కోసి సిద్ధంచేయమని తాతగారు ఇందాక ఎప్పుడో చెప్పారు. మర్చిపోయాను" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి క్రిందికి పరిగెత్తాడు గండయ్య.

శృతి మేడమ్ ఎవరో దీపక్‌కి అర్థంకాలేదు. దామోదరం అంకుల్ ఎప్పుడూ ఇంతే. ఏ మాట మాట్లాడినా, ఏ పని మొదలుపెట్టినా క్రైమ్ స్టోరీలో మాదిరి సస్పెన్స్ మెయింటైన్ చేస్తాడు. ఆయనకి ఒక మేనకోడలు వున్న సంగతే మనకి తెలియదు. ఆవిడగారు ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నట్టు? తనలో తను అనుకుంటూ, మెట్ల దగ్గిరికి వచ్చి, "మరియమ్మా....! ఓ మరియమ్మా....!" అని క్రిందికి చూస్తూ పెద్దగా పిలిచాడు.

భారీ శరీరం మరియమ్మది. మెట్లు ఎక్కటమంటే చాలా శ్రమతో కూడుకున్న పని. అయినా సరే పరుగులాంటి నడకతో పైకి వచ్చేసింది.

"నాన్నగారూ....ఏం కావాలి? చాయ్ తీసుకురానా?" ఆయాసంతో మాటలు తడబడుతుండగా ఆప్యాయంగా అడిగింది.

"ఇప్పుడు నిన్ను పడుతూ లేస్తూ పైకి రమ్మని ఎవరు పిలిచారు? కిందినుంచే సమాధానం ఇవ్వచ్చుగదా" విసుగునిండిన కంఠంతో అన్నాడు దీపక్.

"మీరు అలా కోపంగా చూస్తే ఎలా నాన్నగారూ....మీరు పిలిచిన మరుక్షణం నేను వచ్చితీరాలి....చెప్పండి ఎందుకు పిలిచారో?" పక్కనే వున్న టేబిల్ మీది ఒక నాప్‌కిన్‌ని తీసి అతని ముఖంమీద స్వేద బిందువులను మెత్తగా వత్తుతూ అడిగింది మరియమ్మ.

"దామోదరంగారి వెంట ఎవరో శృతి మేడమ్ వస్తోందిట కదా....ఎవరావిడ?" అడిగాడు దీపక్.

ముసిముసిగా నవ్వి, అతని బుగ్గల్ని తట్టింది మరియమ్మ! "శృతి మేడమ్....పేరు చాలా బాగుంది కదూ? పేరును వినగానే మనిషిని చూడాలని అనిపిస్తోంది కదూ?" అని అడిగింది.



"స్నానంచేసి రెడీ అవండి....వాళ్ళు వచ్చే టైమ్ అయింది" అంటూ చేతిలోని నాప్‌కిన్‌ని టేబిల్‌మీద పడేసి తాపీగా క్రిందికి వెళ్ళిపోయింది.

ఎప్పుడు ఏ విషయాన్ని గురించి అడిగినా అప్పటికప్పుడు అన్ని వివరాలతో సమాధానం చెప్పే మరియమ్మ ఆ రోజు అసంపూర్తి ఇన్ఫర్మేషన్ ఇచ్చి హేపీగా వెళ్ళిపోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది దీపక్‌కి.

ఈ శృతి మేడమ్ ఎవరో, అసలు ఎందుకు ఇక్కడికి వస్తోందో మనకు తెలియాలి' అని తనలో తాను అనుకుంటూ, బాత్‌రూమ్ వైపు అడుగులు వేశాడు.

స్నానంచేసి డ్రెసప్ అయ్యే సమయానికి, మెయిన్‌గేటు దగ్గిర్నించి మోతలుచేస్తూ లోపలికి దూసుకువచ్చింది ఒక టొయోటో కారు.

తన గది కిటికీ దగ్గిర నిలబడి అటుకేసి పరిశీలనగా చూశాడు దీపక్. పోర్టికోకి కొంచెం అవలగా ఆగిందా కారు. డోర్ తెరుచుకుని నాజూకుగా క్రిందికి దిగింది ఒక మెరుపుతీగె.

ఊపిరి ఆగిపోయిన ఫీలింగ్ దీపక్‌ని ఆవరించుకున్నది.

* * * *

"బాబూ! చిన్నబాబూ! రెడీగా వున్నారా? తాతగారు కాలింగ్....యువర్ ప్రెజెన్స్ నీడెడ్ ఇమ్మీడియట్లీ." పరుగులాంటి నడకతో పైకి వచ్చిన పీటర్ హెచ్చరించేసరికి, తనను ఆవరించుకున్న అదోరకమైన మైకంలోంచి బయటపడుతూ మెట్లు దిగాడు దీపక్.

తనలో తను నవ్వుకుంటూ అతన్ని మధ్య హాలులోకి పాస్‌చేశాడుపీటర్.

ముందుకు పోయి లాయర్‌సాబ్‌కి విష్‌చేశాడు దీపక్.

దీపూ! దిసీస్ మై నీస్....పేరు శృతి. అమెరికాలో ఇంపీరియల్ డెకరేషన్ చదువు ఏదో చదివింది" అంటూ తన పక్కనేవున్న మెరుపుతీగెను అతనికి పరిచయం చేశాడు లాయర్‌సాబ్.

"హలో !అయామ్ దీపక్!" అంటూ మెరుపుతీగెను పలుకరించాడు దీపక్.

"మీ పేరు నాకు తెలుసు. నాపేరు అంకుల్ మీకు చెప్పివుంటారు"

అంటూ సోఫాలోనుంచి లేచింది మెరుపుతీగె. "మీ గార్డెన్‌లో సంపెంగ చెట్లు చాలా వున్నాయట. నాకు సంపెంగ పూవులంటే చాలా ఇష్టం. ఒక సారి వాటి దగ్గిరికి వెళ్ళివద్దామా?" నదురూ బెదురూ లేకుండా సూటిగా అడిగింది.

ఆమె స్పీడ్‌ని గమనించి కొంచెం ఖంగారుపడ్డాడు దీపక్. తన తాత గారి ఫీలింగ్స్ ఎలా వున్నాయోనని ఆయనవంక ఓరగా చూశాడు.

"వెళ్ళరా. వెళ్ళి మన గండయ్యతో చెప్పి పూలు కోయించు" స్పోర్టివ్‌గా చెప్పాడు సురేంద్రసాద్.

* * * *

"ఇంత అందమైన గార్డెన్‌ని నేను అమెరికాలోకూడా చూడలేదు" గుండెల మీద చెయ్యి వేసుకుంటూ కామెంట్ చేసింది శృతి మేడమ్.

"ఈ గార్డెన్ ఇంత అందంగా వుండటానికి కారకుడు మా గార్డెనర్ గండయ్య. చిన్నపిల్లల్ని పెంచినట్లు ఈ చెట్లని, మొక్కల్ని పెంచుతు న్నాడు. నువ్వు మెచ్చుకోవాలంటే అతన్నే మెచ్చుకో" అంటూ దూరంలో వున్న గండయ్యకు చేయి ఊపాడు దీపక్.

ఆ సైగను అందుకోగానే ఆఘమేఘాలమీద అతని దగ్గిరికి వచ్చే యాలిగండయ్య. వినయంగా నమస్కారం చేసి చేతులు కట్టుకుని నిలబ డాలి. అలాంటి పనులేవీ చేయకపోగా, అసలా సైగే కన్పించనట్టు ఎక్కడ నిలబడినవాడు అక్కడే అలాగే వుండిపోయాడతను.

"అతను ఏం చేస్తున్నాడు? చేయెత్తి పిలిచినా కూడా రావడంలేదే మిటి?" ఆశ్చర్యంగా అడిగింది.

"గండయ్యా...." బిగ్గరగా పిలవబోయి చటుక్కున ఆ పిలుపును నోటిలోనే ఆపేసుకున్నాడు దీపక్. "అతని ప్రవర్తన నాకు కొంచెం విచిత్రంగా కనిపిస్తోంది. అతను అసలు మనవైపు తలను కూడా తిప్పడం లేదు" అంటూ ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు.

"ఆగండి దీపక్. నేనూ వస్తున్నాను. మీలా స్పీడ్‌గా పరిగెత్తడం నాకు చేతకాదు. కాస్తంత ఆగండి" అని అంటూ తనూ పరుగు మొదలు పెట్టింది.

పదేపది క్షణాల్లో గండయ్యను చేరుకున్నాడు దీపక్. "నీకు అసలు



బుద్ధి వుందా? నీ గురించి నేను ఎంతో గొప్పగా చెపుతుంటే బుద్ధూమియా మాదిరి ఉలుకు పలుకు లేకుండా నిలబడిపోతావా? ఏంటది? ఏం చేస్తున్నావ్?" విసుగునిండిన కంఠంతో అంటూ అతని భుజాన్ని పట్టుకుని ఇవతలికి లాగబోయాడు.

"వెళ్ళిపొండి చిన్నబాబూ.... వెనక్కి వెళ్ళిపొండి....ముందుకు రావద్దు" భయంనిండిన కంఠంతో ఖంగారు ఖంగారుగా అన్నాడు గండయ్య.

అప్పుడు అర్థం అయింది దీపక్‌కి అసలు కారణం.

ఒత్తుగా పూసిన సంపంగిపువ్వుల వాసనకు పరవశించిపోతున్నట్టు రెండు జానల వెడల్పున పడగలు విప్పి మహా ఉద్వేగంగా ఆడుతున్నాయి రెండు తాచుపాములు. తమ ఏకాంతానికి భంగం కలిగించిన గండయ్య మీదనే చూపును నిలిపి ఒళ్ళు జలదరించేటట్లు బుస కొడుతున్నది వాటిలో ఒకటి.

"మైగాడ్.... పాములు.... ఈ... సిటీ మధ్యభాగంలో ఇటు వంటి పాములు కనిపించడం కూడా వింతగానేవుంది. అవేం పాములు? వాటికి విషం వుంటుందా?" రెండు క్షణాలు ఆలస్యంగా ఆ ప్రదేశాన్ని చేరుకున్న శృతిమేడమ్ అడిగింది మరింత ఆశ్చర్యంగా.

సమాధానం ఇచ్చే అవకాశం దీపక్‌కి లభించలేదు. నేల అదిరిపోయే టట్లు అడుగులువేస్తూ వచ్చిన దీపక్‌ని చూసి మరింత స్పీడ్‌గా తలలు ఊపడం మొదలుపెట్టాయి ఆ పాములు. ఇప్పుడు వచ్చిన శృతిమేడమ్‌ని చూసేసరికి ఇంకా అధికమైపోయింది వాటి ఆగ్రహం.

వంట ఇంట్లో కుక్కర్ విజిల్ వేసినట్లు చెవులు చిల్లులుపడేలా శబ్దంచేస్తూ అమాంతం గాలిలోకి ఎగిరింది ఆ రెండు పాముల్లో ఒకటి.

* * * *

మెరుపుకంటె వేగంగా కదిలాడు దీపక్. కుడిచేత్తో గండయ్య భుజాన్ని పట్టుకుని బలంగా అవతలికి నెట్టాడు. ఎడమచేత్తో శృతిమేడమ్ నడుమును చుట్టి, ఎగిరి దూకాడు ఆపోజిట్ దిశలోకి.

సూటిగా వచ్చి గండయ్యమీదనో, అతనిమీదనో, గట్టిగా మాట్లా డితే శృతిమేడమ్‌మీదనో పడి, కసిగా కాటువేయాల్సిన ఆ జాతినాగు

పాము దబుక్కున పడిపోయింది నేరుగా నేలమీద.

"దూరంగా వెళ్ళిపో గండయ్యా....దూరంగా వెళ్ళిపో" అని గండయ్యను మాటలతో హెచ్చరిస్తూ తను పట్టుకున్న శృతిమేడమ్‌ని కూడా బలంగా అవతలకి నెట్టాడు దీపక్. అంతటితో ఆగలేదతను.

అతి వేగంగా తను ధరించి వున్న షర్టును ఊడతీసి, వలమాదిరిగా ఆ పాము మీదికి విసిరాడు. కిందపడిన వెంటనే శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుని, ఇంకోసారి ఎటాక్ చేయటానికి సిద్ధం అవుతుంది అది.

అనుకోనివిధంగా వచ్చి మీదపడిన షర్టును విదిలించుకోవడానికి విఫల ప్రయత్నం చేసింది.

ఎడమచేతిని ముందుకు జాచి, షర్టుకింద కదులుతున్న దాని తలను ఒడిసిపట్టుకున్నాడు దీపక్.

"కర్రను అందుకో....శృతీ....నీ పక్కనే వుంది. దాన్ని ఇటు విసిరెయ్" తలతిప్పి చూడకుండానే శృతిమేడమ్‌ని హెచ్చరించాడు దీపక్.

అతను అవతలికి నెట్టినప్పుడు తూలుకుంటూ, మెత్తగా వున్న ఒక క్రోటన్ గుబురుమీద పడిందామె. చేతులకు అంటిన మట్టిని దులుపుకుంటూ లేచి నిలబడుతోంది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తనకు దగ్గర్లో కనిపించిన ఒక పొడవాటి కర్రను అతని మీదికి విసిరింది.

సంపెంగచెట్టుకింద మిగిలిపోయిన రెండోపాము మీదినించి చూపుల్ని కొంచెం కూడా పక్కకు తిప్పకుండా, కుడిచేతిని జాచి, నేర్పుగా కర్రను ఒడిసిపట్టుకున్నాడు దీపక్. అతన్ని, అతని చేతిలోని ఆయుధాన్ని చూసి దూరంగా పారిపోవడానికి ప్రయత్నం చేయాల్సిన ఆ పాము, తన ఆగ్రహం మరింత అధికం అయిపోయినట్లు బుసకొడుతూ ఇంకాస్త పైకి లేపింది పడగని.

"వచ్చెయ్ దీపక్....వెనక్కి వచ్చెయ్. నాకు భయంగా వుంది వచ్చెయ్" వణుకుతున్న కంఠంతో, బిగ్గరగా అరిచింది శృతిమేడమ్. ఆ శబ్దం పామును ఇంకా ఇంకా రెచ్చగొట్టింది. ఆవిరితో నడిచే రైలింజన్ మాదిరి దారుణమైన శబ్దాన్ని వెలువరిస్తూ అది కూడా వేగంగా గాలిలోకి ఎగిరింది దీపక్ మీద పడటానికి.

"చిన్నబాబూ....దూకండి....వెనక్కి దూకండి. వెనక్కి...."



జీరబోయిన కంఠంతో గట్టిగా అరిచాడు అవతలి పక్కనుంచి గార్డెనర్ గండయ్య.

వెనక్కి దూకలేదు దీపక్.

చేతిలోని కర్రను వేగంగా కదిపి, గాలిలోకి లేచిన ఆ పాము నడుముమీద ఒక్క దెబ్బ కొట్టాడు.

కదలికలకు అత్యంత అవసరమైన ప్రదేశంలో పడింది కాబోలు ఆ దెబ్బకు, చటుక్కున కింద పడిపోయింది ఆ పాము. తిరిగి తల ఎత్తి తన వంక క్రూరంగా చూసే అవకాశం దానికి ఇవ్వలేదు దీపక్. కర్రను మరింత ముందుకు జాచి, దాని తలకు బెత్తెడు దూరంలో మెడమీద అనించి బలంగా నేలకేసి అదిమాడు.

రైలింజన్ మాదిరి శబ్దాలు చేయడం మానుకోలేదా పాము. అతని మీదికి దూకి అటో ఇటే తేల్చుకోవాలన్న కోరికను కూడా వదులుకోలేదు.

తన మెడమీద పడిన కర్రమూలకంగా తలను ఎత్తలేకపోయింది అది. కనీసం రెండు అంగుళాల దూరం కూడా అవతలికి జరగలేకపోయింది.

* * * *

"గండయ్యా....ఇటువచ్చి ఈ కర్రను పట్టుకో" అంటూ గండయ్యను పిలిచాడు దీపక్. పాముల్ని చూసినప్పటినించీ చెమటలు కక్కుతూనే వున్నాడు గండయ్య. అయినాసరే, అతనిదగ్గిరికి వచ్చి కంపిస్తున్న చేతులతో అతనిదగ్గిర వున్న కర్రను పట్టుకున్నాడు.

ఎడమచేతిలో ఇరుక్కుపోయివున్న మొదటి పాముతోపాటు, కర్ర ఒత్తిడికి కదల్లేకపోతున్న రెండో పామును కూడా పట్టుకుని గాలిలోకి లేపాడు దీపక్.

"ఇవి జాతిపాములు చిన్నబాబూ....ఎప్పుడూ లేనిది మన గార్డెన్‌లోకి ఎలా వచ్చాయో నాకర్థంకావడంలేదు. ఇప్పుడు ఏంచేద్దాం?" ఆశ్చర్యంగా అడిగాడు గార్డెనర్ గండయ్య.

"ఏంచేస్తే బాగుంటుందో నువ్వే చెప్పు. ఆలస్యం చేయకు. తాత

గారు మనకోసం వెయిట్ చేస్తూవుంటారు. త్వరగా వెళ్ళకపోతే ఆయనే ఇక్కడికొచ్చేస్తారు" చేతులచుట్టూ మెలికలు తిరుగుతున్న ఆ పాముల్ని పరిశీలనగా చూస్తూ అన్నాడు దీపక్.

"అవేవో రబ్బరుపాముల మాదిరి అంత దగ్గరగా పెట్టుకుని ఆలోచనలు చేస్తున్నారా? వాటిని చంపేయండి....త్వరగా....త్వరగా" వారికి దూరంగా జరుగుతూ హెచ్చరించింది శృతిమేడమ్.

కనురెప్పలు లేని కళ్ళతో తదేకంగా తనవంకే చూస్తున్న ఆ పాములు రెండింటినీ, అలాగే పట్టుకుని పాతిక అడుగులు అవతలికి పోయాడు దీపక్.

కుడిచేతిలో వున్న పామును ముందుగా ఎదుటవున్న క్రోటన్స్ మీదికి విసిరేశాడు. ఎడమచేతిలో వున్నదాన్ని కుడిచేతిలోకి మార్చుకుని దాన్ని కూడా మొదటిపాము పడిన ప్రదేశంలోకి విసిరికొట్టాడు.

"అవి....తాచుపాములు....పగబట్టి మళ్ళీ నీ మీదికే వచ్చేస్తాయి. చంపకుండా వదిలిపెట్టి నువ్వు చాలా పెద్ద తప్పు చేశావ్...." అస్పష్టంగా అంది ఆ దృశ్యాన్ని రెప్పవాల్చకుండా చూసిన శృతిమేడమ్.

"అమెరికా వెళ్ళి వచ్చినదానివి నువ్వు....అమెరికా మాటలు మాట్లాడాలి. పాములు పగబట్టడం పట్టి మూఢనమ్మకం. చావు తప్పినందుకు సంతోషిస్తూ అవి దూరంగా పారిపోతాయి. ఇకమీదట ఈ చుట్టుపట్ల ఎక్కడా కనిపించవు" చేతుల్ని దులుపుకుంటూ అన్నాడు దీపక్.

"అలాగా! అయితే ఇందాక అవి మనమీదికి ఎందుకు ఎగబడ్డాయి? మనల్ని చూసి ఎందుకు పారిపోలేదు?" సూటిగా అడిగింది శృతిమేడమ్.

తడుముకోకుండా సమాధానం ఇవ్వబోయి ఆఖరిక్షణంలో ఆగిపోయాడు దీపక్.

"నేను చెప్పడం బాగోదు....మా గండయ్య చెపుతాడు. చెప్పు గండయ్యా....అవి ఇందాక నీమీదికి, నామీదికి ఎందుకు ఎగబడ్డాయి? అడిగాడు దీపక్.

తను కూడా నోరు తెరిచాడు గండయ్య సమాధానం చెప్పడానికి, అంతలోనే చటుక్కున మాటను మింగేశాడు.

"అదీ....ఒక్కోసారి వాటికి పిచ్చికోపం వచ్చేస్తుంది. ఆ సమ



యంలో మనమీదికి నిస్సంకోచంగా ఎగబడతాయి. దీపక్‌బాబు కొట్టిన దెబ్బలకి వాటికి బుద్ధి వచ్చింది. ఇక పొరపాటునకూడా అవి ఇటుకేసి రావు.

మన ప్రహరీకి అవతలగావున్న ఫ్యాక్టరీ మూతబడి చాలాకాలం అయింది. బహుశా ఆ శిథిలాల్లో కాపురంపెట్టి సరదాగా ఇక్కడికి షికారుకు వచ్చివుంటాయి. అంతకంటే కారణం నాకేమీ కనిపించడంలేదు" అంటూ శృతిమేడమ్ రియాక్షన్‌కోసం ఎదురుచూడకుండా, సంపంగిపొదల దగ్గిరికి పోయాడు.

"నాకు పువ్వులు వద్దుకాని ముందు నువ్వు వెనక్కి వచ్చెయ్....ఆ పాములు మళ్ళీ వెనక్కి రావచ్చు" ఆందోళనగా అంది శృతిమేడమ్.

"రావు. ఇకమీదట అవి పొరపాటునకూడా ఇక్కడికి రావు....నువ్వు భయపడాల్సిన అవసరంలేదు" అంటూ తనుకూడా ఆ పొదల దగ్గిరికి పోయాడు దీపక్.

బెత్తెడు వెడల్పున విచ్చుకుని వున్నాయి ఆ పొదలమీది పువ్వులు. మనస్సును మెలిపెట్టే లెవెల్లో మధురమైన వాసనల్ని వెదజల్లుతున్నాయి.

తన భుజంమీది టవల్‌ని నేలమీద పరిచి, రెండుకిలోల బరువుండే పువ్వుల్ని గుట్టగా పోశాడు గండయ్య.

* * * *

"ఏంటి చిన్నబాబూ? షర్టు తీసేశారేంటి? ఏమయింది?" గార్డెన్‌లోకి ఎంటర్ అయ్యే ద్వారం దగ్గిర నిలబడి ఆశ్చర్యంగా అడిగాడు పీటర్. పాముమీదికి విసిరిన షర్టును తిరిగి ధరించడం ఇష్టంలేక, గార్డెన్‌లోనే వదిలేసి వస్తున్న దీపక్ గతుక్కుమన్నాడు ఆ మాటల్ని వినేసరికి.

అతను షర్టులేకుండా పట్టి బనియన్‌తో వున్న సంగతిని మొట్టమొదటిసారిగా గమనించింది పక్కనే నిలబడివున్న శృతిమేడమ్.

ఎందుకో ఒక్కసారిగా ముంచుకు వచ్చేసిందామెకు సిగ్గు. తలవంచుకుని రాకెట్ మాదిరి పీటర్ పక్కనుంచి హాల్లోకి దూసుకుపోయింది.

"ఏమైంది చిన్నబాబూ? ఏమైంది?" తన ఆశ్చర్యం రెట్టింపు అవ్వుతుండగా ఇంకోసారి అడిగాడు పీటర్.

"అయన్నేం అడుగుతావ్....నన్ను అడుగు నేను చెపుతా. ఇవాళ

మన గార్డెన్‌లో మొట్టమొదటిసారిగా నేను ఒక మొగాడిని చూశా.... మొగాడంటే మొగాడుకాదు....మొనగాడు. జమిలి తాచుపాముల్ని...." అంటూ మొదలుపెట్టబోయాడు వెనుకే వస్తున్న గండయ్య.

"నువ్వు నోరుమూసుకోకపోతే నాలుక తెగి కిందపడిపోతుంది. సొల్లువాగుడు ఆపి ఆ పూలు తీసుకుపోయి హాల్లోపెట్టు. నోరు తెరిచావంటే నీ మర్యాద దక్కదు" కోపంగా అతనికి వార్నింగ్ ఇచ్చాడు దీపక్.

"నేను డ్రెస్ ఛేంజ్‌చేసుకు వస్తా. తాతగారు అడిగితే గార్డెన్‌లో బురద మీదపడిందని చెప్పు" అని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి ఆ ద్వారంలోనుంచి కాకుండా ఇంకో మార్గంలో నుంచి మేడమీదికి పరిగెత్తాడు దీపక్.

గుప్పుగుప్పున సువాసనల్ని వెదజల్లుతున్న సంపంగిపూలను తీసుకుపోయి హాల్లోని టీపాయ్‌మీద గుట్టగాపోశాడు గార్డెనర్ గండయ్య.

"తీసుకో తల్లీ....ప్లాస్టిక్ కవర్‌లో పెట్టిస్తాడు పీటర్....తెల్లవారే వరకూ వుంటుంది వాసన" అంటూ పీటర్‌వంక చూశాడు సురేంద్రసాబ్.

"చిన్నబాబు డ్రెస్ ఛేంజ్ చేసుకువస్తామని చెప్పారు సాబ్. రెండు నిముషాల్లో వచ్చేస్తారు" తడుముకోకుండా సమాధానం చెప్పాడు పీటర్.

సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చేశాడు దీపక్. "క్షమించాలి....చెమటలు పట్టి షర్టు అసహ్యంగా తయారయింది. అందుకే ఛేంజ్ చేసుకోవడానికెళ్ళాను" అంటూ తాతగారిపక్కనే కూర్చున్నాడు.

చురుకుగా అతని ముఖంలోకి చూసింది శృతిమేడమ్. ఏ పరిస్థితుల్లోనూ అసలు విషయం బయటికి చెప్పవద్దన్నట్లు తలను కొంచెంగా అడ్డం తిప్పాడు దీపక్.

అతనివంకా, సురేంద్రసాబ్‌వంకా మార్చి మార్చి చూసి "నాకు ఇంతవరకూ ఎవరూ టీ ఇవ్వలేదు. కనీసం మంచినీళ్ళను కూడా ఆఫర్ చేయలేదు" అంది సడన్‌గా.

అటెంక్షన్‌లో నిలబడివున్న పీటర్ తన పాదాలకింద ఎవరో బాంబు పెట్టినట్టు అదిరిపడ్డాడు ఒక్కసారిగా.

* * * *

"క్షమించాలి మేడమ్....అదీ అసలు....ఏమయిందంటే" అంటూ పీటర్ తడబడుతున్న మాటలతో సిచ్యుయేషన్‌ని ఆమెకు తెలియచేయబోతుండగా, అందమయిన సిల్వర్ ట్రేలో టీ కప్పుల్ని, వాటర్ గ్లాసెస్‌ని పెట్టుకుని లోపలికి వచ్చింది వంటమనిషి అవతారం భార్య సీతమ్మ.



"ఇందాక ఒకసారి తీసుకువచ్చాను మేడమ్. మీరు మా చిన్నబాబుతో కలిసి తోటలోకి వెళ్ళిపోయారు. ఇప్పుడు వేడివేడిగా తీసుకువచ్చాను. తాగండి" అంటూ ఆమె చేతికి అందించింది.

వాటర్ గ్లాసును ఖాళీచేసి, టీకప్పును పెదవులకు ఆనించుకుంటూ, "అసలు తాచుపాములు మనుషులమీదికి ఎందుకు ఎగబడతాయి?" అని లాయర్ దామోదరాన్ని అడిగింది శృతిమేడమ్.

"పాముల గురించి, పులుల గురించి మీ దామోదర్ అంకుల్ ఏం చెపుతాడమ్మా? నన్ను అడుగు చెబుతాను.

కేరళ, మైసూర్ అడవుల్లో కింగ్‌కోబ్రాలను కూడా చూశాను నేను. ప్రాణాలకు హానికలుగుతుందని భయంవేస్తే, పాములు మన మీదికి ఎగబడతాయి" నవ్వుతూ చెప్పాడు సురేంద్రసాబ్.

"వాటిజోలికి పోకపోయినా వట్టిగా దూరం నుంచి చూసినా ఎగబడతాయా? మన మనుషుల మాదిరి రెండు పాములు కలిసి ఒకేసారి ఎటాక్ చేస్తాయా?" టీని సిప్‌చేస్తూ ఇంకో ప్రశ్న వేసింది.

"వాటిజోలికి పోకపోతే అవి పొరపాటున కూడా మనమీదికి రావు. అవి మనల్ని ఎటాక్ చేశాయంటే వాటికి డెఫినిట్‌గా భయం కలిగి వుంటుంది" నమ్మకంగా చెప్పాడు సురేంద్రసాబ్.

"అరే భాయీ....నువ్వు చెప్పేది ఒక పాముగురించి. మా శృతి రెండు పాముల గురించి అడుగుతోంది. నాకు తెలియక అడుగుతున్నాను రెండు పాములు అసలు ఒకేచోట ఎందుకు వుంటాయి?" ఉన్నట్లుండి వాళ్ళ సంభాషణలో కల్పించుకున్నాడు లాయర్ దామోదరం.

"రెండుపాములు ఒకేచోట కనిపించడం చాలా అరుదు. అవి జత కట్టడానికి అలా ఒకచోటికి చేరతాయి. ఆ సమయంలో అవి మహాఉద్రేకం మీద వుంటాయి. తమను డిస్టర్బ్ చేయడానికి వచ్చినవారిమీద పూనకం వచ్చినట్లు విరుచుకుపడతాయి. ఆ టైమ్‌లో తప్పించుకోవడం చాలా కష్టం.

వాటిని గురించి తెలిసినవాళ్ళు ఎవరూ ఆ సమయంలో వాటి సమీపంలోకి పోనేపోరు" ఖంగుమంటున్న కంఠంతో చెప్పాడు సురేంద్ర

సాబ్.

ఆమాట వినగానే "తాతగారూ....నాకు చిన్నపని ఒకటి వుంది. ఒక్కసారి మేడమీదికి వెళ్ళి రెండు నిముషాల్లో తిరిగివచ్చేస్తాను" చటుక్కున అన్నాడు దీపక్ సోఫాలోనుంచి లేచి నిలబడుతూ.

"అతిథుల్ని ఎదురుగా పెట్టుకుని అవతలికిపోవడం మర్యాదకాదు. నీ పనులు తర్వాత....ముందు కూర్చో" చనువుగా అతన్ని హెచ్చరించాడు దామోదరం.

ముసిముసి నవ్వులు నవ్వడం మొదలుపెట్టింది శృతిమేడమ్.

ఆమెవంక కొంచెం కోపంగా చూసి సోఫాలో కూలబడ్డాడు దీపక్.

* * * *

"అదిసరే....మాట్లాడుకోవడానికి బోలెడు టాపిక్కులుండగా, ఈ పాముల గోల ఎందుకు వచ్చింది?" కుతూహలంగా శృతిని అడిగాడు సురేంద్ర సాబ్.

"అదీ....ఆ టాపిక్ ఎందుకు వచ్చిందంటే...." అంటూ ఆమె మొదలుపెట్టబోతుండగా, హాలు ఫ్లోరింగ్ అదిరిపోయేటట్లు అడుగులు వేస్తూ వచ్చింది మరియమ్మ.

"ఇదిగో పీటరూ....నువ్వు వెంటనే మన సిద్ధాంతిగారికి ఫోను చెయ్యి....అర్జెంటు....ఆలస్యం చేయకు...." అని పీటర్‌కి చెప్పి, సురేంద్ర సాబ్ ఎదుటికి వచ్చింది.

"అయ్యగారూ....చెప్పాపెట్టకుండా వచ్చినందుకు మీరు నన్ను క్షమించాలి. ఇందాక తోటలో నాన్నగారు జమిలిపాముల్ని చేతుల్తో పట్టుకుని అవతలికి విసిరేశార్ట....అవి కలిసివుండగా అక్కడికి పోయి గండయ్యని కాపాడటం కోసం వట్టి చేతులతోనే వాటిని పట్టుకున్నార్ట.

జమిలి పాముల జోలికి పోవడం అరిష్టం....వెంటనే శాంతి చేయించాలి....మన ఇంటిచుట్టూ మంత్రించిన అక్షతలు జల్లించాలి...." ఫుల్‌స్టాప్, కామాలు లేకుండా ఏకబిగిన చెప్పేసింది.

అంతవరకూ మౌనంగా వున్న శృతికి కలిగింది భయం, అలా పెరిగి, ఇలా పెరిగి ఆ మాటలు అవాంఛనీయ పరిస్థితుల్ని క్రియేట్ చేస్తాయేమోనని.



"మామయ్యా....మీరు ఊరుకోండి. తాతయ్యగారి ట్రబుల్‌ని అర్థం చేసుకోండి. ఇప్పుడున్న సమస్య ఒకటి అయితే మీరిద్దరూ ఇంకో సమస్యను గురించి మాట్లాడుకుంటున్నారు....దయచేసి మీరిద్దరూ కాస్సేపు కామ్‌గా వుండండి...." పెద్ద కంఠంతో సడెన్‌గా జరుగుతున్న సంభాషణలోకి ఎంటర్ అయిందామె.

మాటలు రాని రబ్బర్‌బొమ్మలా కనిపించే ఆమె, అలా మాట్లాడటాన్ని చూసి ఆశ్చర్యంతో ఒక్కసారిగా కామ్ అయిపోయారు వారిద్దరూ.

"ఇప్పుడున్న సమస్య ఈ హీరోగారు చేసిన పనికి సంబంధించింది. ఈయనగారు పట్టుకున్న ఆ పాములు మళ్ళీ వెనక్కి రాకుండా మంత్రమో, తంత్రమో ఏదో ఒకటి చేయించాలి. అంతేనా?" మరియమ్మ వైపు, దీపక్‌వైపు చూస్తూ అడిగింది శృతి.

* * * *

తన మాటలు ఎటువంటి ఉత్పాతాల్ని సృష్టిస్తాయోనని భయం భయంగా చూస్తున్న మరియమ్మకు ప్రాణం లేచివచ్చినట్లు అయింది.

"అంతే తల్లీ....సరిగ్గా అంతే" అంటూ తల వూపింది.

"ఆల్‌రైట్....అయితే మనం వెంటనే మూవ్ అవుదాం...." అంటూ పీటర్‌వైపు తిరిగింది శృతి. "సిద్ధాంతిని పిలిపించడానికి ఏమైనా ప్రాబ్లెమా? ఆయన వెంటనే ఇక్కడికి రావడానికి వీలుపడదా?" అని అడిగింది.

"మనం పిలిస్తే రావడానికి వీలుపడదని చెప్పడానికి ఆయనకి ఎన్ని గుండెలు? ఇప్పుడే పిలుస్తాను...." అంటూ తన దగ్గిర వున్న ఫోన్‌ని బయటికి తీశాడు పీటర్.

"ఇప్పుడు సిద్ధాంతిగారు ఇక్కడికి వస్తారు. విషయం అంతా విని ఆయనే ఏదో ఒక మార్గాన్ని చూపిస్తాడు. అక్కడితో మన సమస్య ఎండ్ అయిపోతుంది. ఈమాత్రందానికి అనవసరమైన మాటలు ఎందుకు మాట్లాడుకోవడం?" సురేంద్రసాబ్‌ని ఉద్దేశించి, తన మామయ్యతో అంది శృతి మేడమ్.

పెద్దపులిలా ఉరిమిఉరిమి చూస్తున్న సురేంద్రసాబ్ ముఖంలోని కోపం చటుక్కున మాయమై, ఆ స్థానంలో ప్రత్యక్షమైందొక చిరునవ్వు.

తను కూడా పెద్దగా నవ్వేశాడు లాయర్ దామోదరం.

మన సంగతి తెలియదు ఈ పిల్లకి. తను అనవసరంగా ఖంగారు పడింది" స్నేహితుడితో అన్నాడు.

"కంగారుపడటం పక్కనపెట్టు.... ఈ పరిస్థితిని చక్కగా హేండిల్ చేసింది. తన స్టయిల్ నాకు బాగా నచ్చింది" మెచ్చుకోలుగా శృతివంక చూస్తూ నవ్వు ముఖంతో అన్నాడు సురేంద్రసాబ్.

నాళ్ళిద్దరూ మళ్ళి పెద్దపెద్ద మాటలు ఎక్కడ స్టార్ట్ చేస్తారోనన్న అనుమానంతో కనులు చిట్లించి చూస్తున్న శృతికి వెంటనే ముంచుకు వచ్చింది సిగ్గు....ఎర్రబడిన ముఖాన్ని చటుక్కున పక్కకు తిప్పుకున్నదామె.

"మేడమ్....సిద్ధాంతిగారు వరంగల్‌లో వున్నారట. రేపు ఉదయం గాని సిటీలోకి రాలేరుట...." మాట్లాడటం పూర్తిచేసుకుని ఆమెకే రిపోర్టు చేశాడు పీటర్.

పీటర్ దగ్గిర వున్న ఫోన్‌ని తనకు ఇవ్వమని సైగచేసింది శృతి. లైనులోనే వున్న సిద్ధాంతిగారితో తను మాట్లాడింది. రెండు నిముషాలతరువాత ఫోన్‌ని ఆఫ్‌చేసి పీటర్‌కి ఇచ్చేస్తూ, "జమిలిపాములను చూసిన తర్వాత కూడా ఒక మనిషి బతికివున్నాడంటే, అది డెఫినెట్‌గా అదృష్టమేనని ఆయన చెపుతున్నాడు. ఇంటిచుట్టూ ఉప్పు స్ఫటికాలను జల్లించమని అంటున్నాడు" అని చెప్పింది.

"ఉప్పు స్ఫటికాలా?" అవేమిటి?" అడిగాడు లాయర్.

"ఉప్పే మామయ్యా....మనం వంటల్లో వాడుకునే ఉప్పు. పాములకు అదంటే ఎలర్జీట....ఉప్పు జల్లిన ప్రదేశంలోకి అవి రాలేవుట...." అందామె,

కుతూహలంగా చూస్తున్న సురేంద్రసాబ్ తృప్తికరంగా తల వూపాడు. "ఆ పనేదో వెంటనే చేయించు....మిగిలిన మాటలు రేపు సిద్ధాంతిగారు వచ్చినతర్వాత చూసుకుందాం" అని మరియమ్మకి చెప్పాడు.

శాంతులు, హోమాలు పేర్లు చెప్పి ఇల్లంతా ధూంధాం చేసేస్తారని, అద్భుతమైన పండుగ ప్రకటించబడుతుందనీ ఎంతో ఆశించింది మరియమ్మ.



అటువంటిదేమీ లేకుండా సీదాగా మాటలు ముగిసిపోవడంతో తీవ్రమైన అసంతృప్తి కలిగిందామెకు.

"అలాగే చేయిస్తాను అయ్యగారూ....నేనే స్వయంగా జల్లుతాను. ముఖ్యంగా నాన్నగారి గది దగ్గిర దట్టంగా జల్లాలి. ఏదిఏమయినా నాన్నగారికి దుడుకుతనం చాలా ఎక్కువ అయిపోతోంది, అది తగ్గాలి...." అంటూ వెళ్ళిపోయింది మరియమ్మ అక్కడినించి.

ఆమెవంక కోపంగా చూడబోయిన దీపక్‌తో, "ఏరా! ఏంటీ చూస్తున్నావ్? కోపం వచ్చిందా? పాడుపనులు చేయకముందే ఆలోచించుకోవాలి....చేశాక ఎవరు ఏ మాట వాడినా, భరించడం చేతకావాలి, ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయకు. చేస్తావా?"

"చెయ్యను తాతగారూ...." అన్నాడు దీపక్.

"ఏమ్మా....మావాడి గురించి నీ అభిప్రాయం ఏమిటి?" ఎటువంటి హెచ్చరికా లేకుండా వున్నట్లుండి అడిగాడు సురేంద్రసాబ్.

* * * *

అదిరిపడినట్లు కనుల్ని పెద్దవిచేసింది ఆమె. అయోమయంగా లాయర్‌వైపు చూసింది.

"సురేంద్రపాబ్ ముసలివాడు అయిపోతున్నాడు. ఒక్కోసారి తను ఏం మాట్లాడతాడో తనకే తెలియనట్లు ప్రవర్తిస్తాడు. నువ్వు ఖంగారు పడకు....తన మనవడి ప్రవర్తన సరిగ్గా వుందని అనుకుంటున్నావో లేదో తెలుసుకోవడానికి అలా అడిగాడు. అంతకంటే మరేమీ లేదు...." నవ్వుతూ అన్నాడు లాయర్.

సైలెంట్‌గా వున్న సురేంద్రపాబ్ ముఖంలో మరోసారి రోషం ప్రత్యక్షం అవడానికి సిద్ధంగా వున్నట్లు వెంటనే గమనించింది శృతి మేడమ్.

"మీ మనవడిని గురించి పూర్తిగా తెలియకుండా నేనేమీ చెప్పదలుచుకోలేదు, కొన్నిరోజులు ఆగండి. ఆ తర్వాత చెప్పమంటే చెపుతాను" అంటూ వున్నట్లుండి సోఫాలోనుంచి లేచింది ఆమె.

"కాలేజీ క్లాస్‌మేట్ ఒకామె నన్ను కలుసుకోవడానికి వస్తానని ఫోన్ చేసింది....మనం మాట్లాడుకోవాల్సిన మాటలు పూర్తి అయిపోయాయి

కదా....ఇంటికి వెళ్ళిపోదాం" అంటూ ఎనౌన్స్ చేసింది.

"అప్పుడే వెళ్ళిపోతానని అంటావేంటి తల్లీ....ఇవాళ మీరు నాతో కలిసి భోజనం చేస్తున్నారు....భోజనం తర్వాతే మీరు వెళుతున్నారు. అంతే...." ఖచ్చితమైన కంఠంతో చెప్పాడు సురేంద్రసాబ్.

ఆయన గమనించకుండా లాయర్‌కి సైగచేసిందామె.

"నిజమే....నాకూ పని ఒకటి వుంది. రేపు ఎప్పుడైనా ఇంకోసారి వచ్చి తీరికగా భోజనం చేస్తాం. ఇవాల్టికి మమ్మల్ని వదిలెయ్" అంటూ తనూ లేచి నిలబడ్డాడు లాయర్.

వదలడం తనకు ఇష్టంలేదన్నట్లు ముఖంపెట్టి, ఇంకేదో మాట్లాడబోతున్న సురేంద్రసాబ్ చెవిలో, "వెళ్ళనీయండి సార్ అడ్డు చెప్పకండి" అన్నాడు పీటర్.

ఆ మాటలు అర్థంకాలేదు ఆయనకి.

"ఒక్క నిముషం....ఇప్పుడే వచ్చేస్తా. మా పీటర్ నాతో ఏదో చెప్పదలుచుకున్నాడు" అంటూ గబగబా ఆ హాలు చివరిభాగంలో వున్న విండో దగ్గిరికి వెళ్ళారు.

"అర్థంకాకపోవడానికి ఇందులో మీకు తెలియని విశేషం ఏమీలేదు సార్. పెళ్ళిమాటలు మాట్లాడుకునేటప్పుడు కతికితే అతకదని అంటారు. ఆ ఉద్దేశ్యం మనసులో వుంచుకున్నందువల్లే లాయర్‌సాబ్ భోజనాలు వద్దని అంటున్నారు....నిజం కూడా అదేకదా!" ఆయనకి దగ్గిరిగా నిలబడి రహస్యంగా అన్నాడు పీటర్.

సుప్రసన్నంగా మారిపోయింది సురేంద్రసాబ్ వదనం. "మంచి మాట....భలే సమయానికి చెప్పావ్, నిజమే....కతికితే డెఫినెట్‌గా అతకదు. వాళ్ళు వెళ్ళిపోవటమే బెస్ట్" అంటూ నవ్వుముఖంతో వెనక్కి వచ్చాడు.

* * * *

"ఏంటో సురేంద్రగారు మాంచి ఖుషీమీద వున్నట్లున్నారు...పీటర్ దూరంగా తీసుకుపోయి చెవిలో ఏం చెప్పాడో!" తనలో తను అనుకుంటున్నట్లుగా పైకే అనేశాడు లాయర్ దామోదరం.

"ఏమీ చెప్పలేదు. ఇంకో నెలా రెండునెలల్లో విందుభోజనాలు



ఎలాగూ పెట్టాలి. ఇప్పుడే ఎడ్వాన్సుగా భోజనపు ఖర్చు దండగ అంటున్నాడు. అంతే" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు సురేంద్రసాబ్.

ఒక్కముక్క కూడా అర్థంకాలేదు శృతి మేడమ్‌కి. "విందుభోజనాలు, ఎడ్వాన్స్ ఖర్చులు ఇవన్నీ ఏమిటి మామయ్యా?" హాల్లోనుంచి పోర్టికో దగ్గిరికి పోతుండగా రహస్యంగా అడిగింది లాయర్‌ని.

"నాకు కూడా అర్థంకావడంలేదమ్మా...అర్థంలేని మాటలు మాట్లాడే మనిషి కాదు మా సురేంద్ర. మరిప్పుడు ఎందుకు మాట్లాడాడో!" తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు తల విదిలిస్తూ చెప్పాడు లాయర్.

తాతగారితోపాటు పోర్టికోమెట్లమీద నిలబడి ఆయనకి, శృతి మేడమ్‌కి చేయి వూపాడు దీపక్.

"నాకో చిన్నపని వుంది తాతగారూ....టూ టవున్ దగ్గిరికి పోయి రావాలి. త్వరగా వెళ్ళి త్వరగా వచ్చేస్తాను" అంటూ ఆయన సమాధానం కోసం ఎదురుచూడకుండా అటునుంచి అటే గేటు దగ్గిరికి దారితీశాడు.

"కారు తీసుకుపో....చీకటివేళ లెఫ్ట్‌రైట్లు వద్దు" అతను వినిపించుకోవడంలేదని తెలిసినా బిగ్గిరిగా చెప్పాడు.

పెద్దపెద్ద అడుగులువేస్తూ గేటు దగ్గిరికి వెళ్ళిపోతున్న దీపక్ వెనుకే వేగంగా కారును కదిలించాడు రాంసింగ్.

"ఎక్కండి చిన్నబాబూ....తాతగారు లోపలికి పోలేదు. మెట్లమీదే వున్నారు" డోర్ తెరిచి పట్టుకుంటూ చెప్పాడు.

"నేను ఎక్కను....నాకు కారు వద్దు....నువ్వు వెనక్కి వెళ్ళిపో" చిరాకుగా అన్నాడు దీపక్.

"అయ్యబాబోయ్....అలాంటి మాటలు మాట్లాడకండి. పెద్దబాబుగారు విన్నారంటే నేను అన్యాయమయిపోతాను. ముందు మీరు కార్లో కూర్చోండి" స్టీరింగ్ ముందునుంచి దిగుతూ అన్నాడు రాంసింగ్. అనడమేకాదు, చెయ్యి పట్టుకుని బలవంతంగా కార్లోకి నెట్టాడు.

"అరే బేవకూఫ్....మనిషన్న తర్వాత ఒంటికి కాస్తంత శ్రమ అవసరం. అస్తమానం కార్లో తిరిగితే కాళ్ళల్లో దమ్ము తగ్గిపోతుంది. అవిటివాళ్ళయిపోతారు....చిన్నబాబును వదిలెయ్" ఒక పక్కగా నిలబడి వున్న వహీద్ వెంటనే సలహా ఇచ్చాడు అతనికి.

"నువ్వు నోరుమూసుకో. నీ సలహాలు పెద్దబాబుగారికి చెప్పు. నాకు అవసరంలేదు" అంటూ డోర్స్‌ని క్లోజ్‌చేసి కారును వేగంగా పోనిచ్చాడు రాంసింగ్.

## 5

ఎప్పుడు రమ్మంటే అప్పుడు రెండో ఆలోచన లేకుండా పోలీస్ స్టేషన్లో హాజరు అవడం జరుగుతుందని హామీపత్రం రాసిచ్చి, కానిస్టేబిల్స్ అందరికీ బిర్యానీ పొట్లాలు తెప్పించి యిచ్చి, రాత్రి ఎనిమిదిగంటల సమయంలో రోడ్డుమీదికి రాగలిగాడు సిమ్రాన్ సేట్.

"తప్పుడు రిపోర్టులిచ్చి పోలీసుల టైమ్ వేస్ట్‌చేశారనే పాయింట్ మీద కేసును పెట్టమని ఎస్.పి.సాబ్ చెప్పాడు. మీరు ఏదోలా ఆ సాబ్‌ని మేనేజ్‌చేసుకోండి. కేసు గీసు లేకుండా బైటపడవచ్చు" రోడ్డుమీదికివచ్చి రహస్యంగా అతనికి చెప్పాడు స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబిల్.

వందరూపాయల కరెన్సీనోట్లను రెండింటిని అతనికి అందిస్తూ "మరి జగజీత్‌గాడి సంగతేంటి?" అని అడిగాడు తండ్రిని ఇంటికి తీసుకుపోవడానికి వచ్చిన సిమ్రాన్ సేట్ కొడుకు.

"వాడా? ఆ సురేంద్రసాబ్ మనవడు కల్పించుకోకుండా వున్నట్లయితే ఈపాటికి కాళ్ళులేని అవిటివాడైపోయి వుండేవాడు....ఇప్పుడు వాడిని ఏమీ చేయలేం. వేరే ఏదైనా సందర్భం వచ్చినప్పుడు పట్టుకోవాలి" అన్నాడు హెడ్‌కానిస్టేబిల్ సాలోచనగా.

"అదికాదు హెడ్డుగారూ....ఎస్.సి.సాబ్‌ని మేనేజ్‌చేసి మేము కేసు లేకుండా చేసుకుంటాం. అప్పుడు వాడు చూస్తూ వూరుకుంటాడా? ఆ సురేంద్రసాబ్ మనవడిని మళ్ళీ తీసుకుని స్టేషన్‌కి వస్తే?" అడిగాడు.

"వస్తే మీ పని మళ్ళీ మొదటికి వస్తుంది. అందుకే చెప్పుతున్నా.... మీరు ఆ జగజీత్‌ని కూడా మేనేజ్ చేసుకోండి."

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అరె సాబ్...వాడు ఒట్టి ముతాకూలీ....మూడొందలు ముఖంమీద పడేయండి. పెంపుడుకుక్క మాదిరి తోక వూపుకుంటూ మీ వెనకాల తిరుగు



తాడు. అట్లాంటి వాళ్ళని డబ్బుల్తోనే కొట్టాలి....మార్కెట్‌లో పెద్దపెద్ద వ్యాపారాలు చేసే సేటులు మీరు. ఈమాత్రం తెలియదా?" వెటకారంగా అన్నాడు హెడ్‌కానిస్టేబిల్.

"సరేసరే....అలాగే చేస్తాం....పద పద" అంటూ కొడుకును తొందరపెట్టి కారు దగ్గిరికి నడిపించాడు సిమ్రాన్ సేట్.

కారులో కూర్చున్న మరుక్షణం అతని ముఖంలో తొంగిచూసింది ఉద్రేకం. "ఎస్.పి.సాబ్‌ని ఎలా మేనేజ్ చేయాలో మన లాయర్‌ని అడుగుదాం. ఆ జగజీత్‌ని ఊరికే వదలకూడదు. జీవితంలో మొట్టమొదటిసారిగా పోలీస్‌స్టేషన్‌కి రప్పించాడు. వాడి అంతం చూసి తీరాల్సిందే" పళ్ళు బిగపడుతూ కచ్చి నిండిన కంఠంతో అన్నాడు.

"అలాగే డాడీ.... ఆ విషయాన్ని కూడా లాయర్‌గారితో మాట్లాడదాం" కారును కదిలిస్తూ అన్నాడు కొడుకు.

"ఈ విషయం లాయర్‌కి తెలియకూడదు. లేనిపోని తలనొప్పులు తెచ్చి తలమీద పెట్టుకోవద్దని అంటాడు. నువ్వు ఒకపని చెయ్యి... సీతాఫల్‌మండి కట్టెల అడితీ దగ్గిరికి పోనీ" అన్నాడు సిమ్రాన్ సేట్.

దృష్టినంతా రోడ్డుమీద లగ్నంచేసి, కారును సీతాఫల్‌మండి సమీపంలోకి తీసుకుపోయాడు అతని కొడుకు.

చీకటిపడిన తర్వాత కస్టమర్స్ కోసం ఎదురుచూసే అలవాటు లేదు కాబోలు, అడితీ మెయిన్‌గేటును మూసేశాడు ఓనర్. గుట్టలు గుట్టలుగా పడేసివున్న కట్టెపుల్లల మధ్య, తన టేబిల్‌ముందు కూర్చుని, ఆరోజు అమ్మకాల్ని సరిచూసుకుంటున్నాడు ఓనర్.

గేటుదగ్గిర కారును ఆపి, తండ్రితోపాటు లోపలికి ఎంటర్ అయ్యాడు సిమ్రాన్ సేట్ కొడుకు.

వారిని చూడగానే "అరే సేట్‌జీ.... ఆవో....బహుత్ దిన్ హోగయా హమ్ దోనో మిల్‌కే" పెద్దకంఠంతో సాదరంగా ఆహ్వానించాడు అడితీ ఓనర్.

"నీతో ఒక పెద్ద పని పడింది. సురేంద్రసాబ్ అంటే ఎవరో నీకు తెలుసుకదూ?" సూటిగా అసలు విషయంలోకి వచ్చేశాడు సిమ్రాన్‌సేట్.

"సురేంద్రసాబ్ తెలియకపోవడానికి నేను గాంవాలాని కాదు.

"ఆయనతో మీకు పనేంటి?" ఆశ్చర్యంగా సిమ్రాన్ సేట్‌ని అడిగాడు కట్టెల అడితీ ఓనర్.

* * * *

అతను చూపించిన కుర్చీమీద కూర్చుని, అతనికి మాత్రమే వినబడేటట్లు తన బాధంతా, దీనగాథనంతా ఏకరువుపెట్టాడు సిమ్రాన్ సేట్.

"ఆ జగజీత్‌గాడి కాళ్ళు విరిగిపోవాలి. వాడితోపాటు ఆ సురేంద్రంబ్ మనవడి తల పగిలిపోవాలి. ఎంత ఖర్చయినా పరవాలేదు. పని వెంటనే పూర్తి అవ్వాలి" అంటూ తన నిర్ణయాన్ని కూడా వినిపించాడు.

"ఇట్టాంటి పెద్దపెద్ద పనులు చేయగలవాళ్ళు మనకి తెలిసినంత వరకూ ఇద్దరే ఇద్దరు వున్నారు. ఒకడు నన్నీభాయ్..." అన్నాడు అడితీ ఓనరు.

"నన్నీభాయ్ దగ్గిరికి నేను పోను. రెండోమనిషి ఎవరో చెప్పు" అన్నాడు సిమ్రాన్ సేట్.

"అయితే మనం గోవిందగాడినే కాంటాక్ట్ చేద్దాం. మనిషి నమ్మకస్తుడే...కానీ ఖరీదు మాత్రం చాలా ఎక్కువ" అన్నాడు అడితీ ఓనర్.

కొడుకు దగ్గిర్నించి పాతికవేల కరెన్సీనోట్లను తీసుకుని అతని చేతికి అందించాడు సిమ్రాన్ సేట్. "ఎంత ఖర్చయినా పరవాలేదు. పని వెంటనే పూర్తి అయిపోవాలి. వాళ్ళ తిక్క వదిలిపోయినట్లు వార్తలు పేపర్లలో రావాలి" అంటూ కుర్చీలోనుంచి లేచాడు.

సిమ్రాన్ సేట్‌తోపాటు గేటుదాకా వచ్చి సాదరంగా వీడ్కోలు పలికాడు అడితీ ఓనర్. ఈసారి గేటును పూర్తిగా క్లోజ్‌చేస్తూ, "అరే గోవిందా? ఓరి గోవిందా? ఏం చేస్తున్నావు వే?" అని బిగ్గిరిగా పిలిచాడు.

అడితీకి అవతలిపక్కన వరుసల్లో పేర్చివున్నాయి కొన్ని బొగ్గుల బస్తాలు. వాటి చాటునుంచి అతని ముందుకు కదిలివచ్చింది ఒక రఫ్ పర్సనాలిటీ.

"సిమ్రాన్‌సేటు మనకి బాగా కావాల్సినవాడు. బాగా డబ్బులున్నవాడు. అయినాసరే నీ గురించి చాలా గొప్పగా చెప్పి ఉబ్బేశాను.

అతను చెప్పిన పనిచేయ్. నీకు ఎంత కావాలంటే అంత ఆ సేటు దగ్గిర వసూలు చేస్తాను" అంతకుముందు తన చేతుల్లోకి వచ్చిన పాతికవేలల్లో పదివేలు మినహాయించుకుని, పదిహేను అతని చేతుల్లో పెడుతూ చెప్పాడు అడితీ ఓనర్.



వికారంగా కనిపించే తన ముఖం మరింత వికారంగా తయారయ్యేటట్టు ఒక నవ్వు నవ్వి ఆ డబ్బును భద్రంగా తన దుస్తుల్లో దాచుకున్నది ఆ పర్సనాలిటీ.

"రేపు రాత్రికిగానీ, ఎల్లుండి ఉదయంగాని పని పూర్తయిపోతుందని ఆ సేటుకు చెప్పు. రెండు లక్షలు రెడీగా పెట్టుకోమని కూడా చెప్పు" అంటూ వెనుతిరిగి బొగ్గుబస్తాల చాటుకు వెళ్ళిపోయింది.

## 6

వర్ధమాన్ థియేటర్ వెనుకభాగంలో వున్నటువంటి ఒక మీడియం సైజు బార్‌లో దీపక్ రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు అతని ఫ్రెండ్స్.

"వాడు ఇవాళరాడు. వాళ్ళతాత వాడిని ఎదురుగా కూర్చోబెట్టుకుని ఏదో క్లాసు పీకుతూ వుండివుంటాడు. వాడికోసం వెయిట్‌చేయడం శుద్ధ దండగ. మనం కానిచ్చేద్దాం" అరనిముషం తర్వాత చాలా అసహనంగా అన్నాడు ఒకతను.

"వస్తానని చెప్పిన తర్వాత తను తప్పకుండా వస్తాడు. ఇంకో పది నిముషాలు వెయిట్ చేయడంవల్ల మనకు వచ్చే నష్టం ఏమీలేదు" అన్నాడు మరో ఫ్రెండ్.

"అదుగో....వచ్చేశాడు. వాడికి నిజంగా నూరేళ్ళ ఆయుష్షు" పక్కనేవున్న కిటికీలోనుంచి బార్ ముందుభాగంలో వుండే రోడ్డుకేసి చూస్తూ అన్నాడు ఇంకో ఫ్రెండ్.

రాయంచమాదిరి వయ్యారంగా ఆ రోడ్డులోకి ఎంటర్ అయింది రాంసింగ్ నడుపుతున్న కారు. నిశ్శబ్దంగా వచ్చి బార్ గేటుముందు ఆగింది.

"ఇదేంటి చిన్నబాబూ! ఇట్టాంటిచోట్లలో మకాం పెట్టడం ఏంటి?

ఇది పద్ధతికాదుగదా....మనం ఇటువంటి ప్రదేశాలలోకి రావడం–" అంటూ ఏదో చెప్పడం మొదలుపెట్టబోయిన రాంసింగ్‌ని చూపులతోనే నోరు మూయించాడు దీపక్.

"నా ఫ్రెండ్స్ నాకోసం ఎదురుచూస్తూ వుంటారు. నేను రావడం ఆలస్యం అవవచ్చు. నువ్వు ఇంటికి వెళ్ళిపో" విసురుగా అంటూ కిందికి దిగాడు.

"మిమ్మల్ని ఇక్కడ ఒంటరిగా వదిలి నేను ఇంటికి పోయేదిలేదు. నేను ఇక్కడే వుంటాను. మీరు మీ దోస్తులతో మాట్లాడి రండి" అంటూ కారును కదిలించి ఒకపక్కగా పార్క్‌చేశాడు రాంసింగ్.

ఆ కారువంకా, తనవంకా విచిత్రంగా చూస్తున్న బార్ వాచ్‌మేన్ గురించి పట్టించుకోకుండా లోపలికి పోయాడు దీపక్.

* * * *

"ఇక్కడ....మేము ఇక్కడ వున్నాం. ఇటు వచ్చేయ్" అని ఫ్రెండ్స్ పిలిచేసరికి, వాళ్ళ టేబిల్ దగ్గిరికి పోయాడు. "ఇవాళ మనం సీరియస్‌గా మాట్లాడాల్సిన విషయం వుంది కాబట్టి హెవీడోసులు అనవసరం. లైట్‌గా ముగించడం చాలా బాగుంటుంది" వెయిటర్‌ని పిలిచి, బీర్లకు ఆర్డర్ ఇస్తూ చెప్పాడు మొదటి ఫ్రెండ్.

"ఏరా దీపకూ! నువ్వు ఎక్కడికిపోయినా ఆ డ్రయివర్ రాంసింగ్ నీకు తోకమాదిరి వెనకాల రావల్సిందేనా?" నవ్వుతూ దీపక్‌ని అడిగాడు రెండో ఫ్రెండ్.

అతను అన్న మాటలకు చిన్నగా నవ్వి బార్‌లో వున్న కస్టమర్స్‌ని గమనించడంలో బిజీ అయిపోయాడు దీపక్.

"మన దినేష్‌గాడు నీ హెల్ప్ కావాలని అంటున్నాడురా. ఇవాళ ఈ పార్టీ అరేంజ్ చేసింది అందుకే.... మందు కాస్తంత కడుపులో పడితే సిగ్గుపడకుండా బాధలు బయటికి చెప్పుకోవచ్చుట" అతని భుజంమీద చెయ్యివేస్తూ అన్నాడు మొదటి ఫ్రెండ్.

శామ్‌గా తలవంచుకు కూర్చున్న దినేష్‌వైపు చూశాడు దీపక్ ప్రశ్నార్థకంగా.



"చెప్పరా చెప్పు.... ఏంటీ నీ ప్రాబ్లమ్?" అంటూ ప్రాంప్ట్ చేశాడు.

"నషీలీకి వాళ్ళ ఇంట్లో సంబంధాలు చూస్తున్నార్ట.... నిన్న సాయంత్రం నా దగ్గిరికి వచ్చి గోలగోల చేసింది. వేరే ఏరియా పిల్లను చేసుకుంటానంటే మా డాడీ ఒప్పుకోవడంలేదు. కాళ్ళు విరిచేస్తానంటు న్నాడు" చిన్న కంఠంతో చెప్పాడు దినేష్.

"నషీలీతో అప్పు వ్యవహారం మొదలుపెట్టేటప్పుడే నీకు నేను చెప్పాను....ఇది వర్కవుట్ అవదని. నా మాట కాదని నువ్వు ప్రొసీడ్ అయిపోయావ్. ఇప్పుడు అంతగా గింజుకున్నందువల్ల ఉపయోగం ఏముం టుంది?" వెయిటర్ తీసుకువచ్చిన బీర్‌ని సిప్‌చేస్తూ అడిగాడు దీపక్.

బిక్కముఖం పెట్టి మిగిలిన స్నేహితుల వంక దీనంగా చూశాడు దినేష్.

"అరే....దీపక్....అలా కుండ బద్దలుకొట్టడం భావ్యంకాదురా.... మంచికో, చెడుకో మనవాడు చాలా దూరం వెళ్ళిపోయాడు. వర్షంలో తడవ డాలు, చలిమంటలు కాగటాలు, ఎవరికీ తెలియకుండా యాదగిరిగుట్టకి పోయి రెండురోజులు ఎంజాయ్ చేయడాలు అన్నీ అయిపోయాయి.

ఇప్పుడు ఏదయినా జరిగితే ఆ పిల్ల ఉరి పోసుకుంటానని ఏడుస్తోం దిట. నువ్వే ఏదైనా దారి చూపించు" బతిమాలుకుంటున్నట్టు చెప్పాడు రెండో ఫ్రెండ్.

విపరీతమైన దాహం వేసినప్పుడు మంచినీళ్ళు తాగినట్టు రెండు బీరుగ్లాసుల్ని ఖాళీచేశాడు దీపక్.

"అరేయ్! హాట్‌డ్రింకులు ఏవయినాసరే గటగటా పుచ్చుకోవడం చాలా తప్పుట. బీరయినా, బ్రాందీ అయినా ఏదయినా ఒక్కసారిగా వచ్చే స్తుందిట కిక్కు" ఉంగారుగా చెప్పాడు మూడో ఫ్రెండ్. ఆ మాటలు తనకి వినిపించనట్టు మూడోగ్లాసును అందుకుని- "నువ్వు నషీలీని పెళ్ళి చేసుకోవాలి.... పెద్దవాళ్ళు ఏమన్నా లెక్కచేయవు. అంతేనా?" అడిగాడు దీపక్ దినేష్‌ని.

"లెక్కచేయడమంటే....అదీ...." అంటూ ఏమీ చెప్పలేక తల

వంచుకున్నాడు దినేష్.

"అదేరా....నేను అడిగే విషయం అదే. ప్రేమించడం అనేది మీ డాడీ నీకు యిచ్చే పాకెట్‌మనీతో మేనేజ్ చేసుకునే వ్యవహారం. పెళ్ళి అనేది నెలనెలా ఒక ఫిక్స్‌డ్ ఖర్చుకు సంబంధించిన పని. పాకెట్‌మనీతో సంసారం గడవదు. అర్థం అయిందా?" అతని ముఖంలోకి సూటిగాచూస్తూ అడిగాడు దీపక్. ఏడుపుముఖం పెట్టేశాడు దినేష్.

"అయిందానికీ కానిదానికి ఏడ్చే మగవాళ్ళని ఆడవాళ్ళు ఎవరూ నమ్మరని మా డ్రైవర్ రాంసింగ్ అంటూ వుంటాడు. నువ్వు ఏడుపు ఆపి నిబ్బరంగా మాట్లాడు. నషీలీని పెళ్ళిచేసుకోవడం మీ డాడీకి ఇష్టంలేదు. తనమాట వినకుండా నువ్వు ఆ పిల్లని చేసుకుంటే, చేసుకున్న క్షణం నుంచీ నువ్వు తన కొడుకువి కాదని, తన ఇంట్లో నువ్వు వుండటానికి వీలుపడదనీ హెచ్చరించి వుంటాడు. అవునా?" సూటిగా అడిగాడు దీపక్.

అవునన్నట్లు తల వూపాడు దినేష్.

"మీ డాడీ నిజంగా చాలా గొప్పవాడు. ఇంకో రెండేళ్ళు గడిస్తే తప్ప నీ చదువు పూర్తికాదు. తన మాట వినకపోతే, నీ చదువుకు అయ్యే ఖర్చు తను భరించడం మానేస్తాడు. నువ్వు నషీలీని పోషించాలంటే చదువుమాని ఏదైనా ఉద్యోగం చూసుకోవాలి. ఆ పిల్లకూడా తన చదువును గాలికి వదిలేసి నీతోపాటు అష్టకష్టాలు పడాలి."

* * * *

"ఒరేయ్! హెల్ప్ చేస్తావని, ఏదైనా సలహాచెపుతావని నిన్ను పిలిస్తే, గుండెలు పగిలిపోయే మాటలు చెపుతావేమిటిరా?" అంటూ దీపక్‌ని వారించడానికి ట్రైచేశాడు మొదటి ఫ్రెండ్. అతనివంక కోపంగా చూసి నోరు మూయించాడు దీపక్.

"మనం ఏపని చేసినా అది పెద్దవాళ్ళ అంగీకారం పొందిన పని అయివుండాలి. అలా అవకపోతే మనకి కష్టాలు తప్పవు. మనమీద పెద్దవాళ్ళు ఎన్నో ఆశలు పెట్టుకుని వుంటారు. వాటికి విఘాతం కలగబోతున్నదని తెలిసిన మరుక్షణం వాళ్ళు మనకు శత్రువులే అవుతారు.

నేను నీకు చెప్పదలుచుకున్నది ఒక్కటే. నీకు నషీలీ కావాలంటే



మీ నాన్నని వదిలి రోడ్డున పడాలి....మీ నాన్నని వదలడం ఇష్టంలేకపోతే నషీలీని మర్చిపోవాలి. యామై క్లియర్? కరెక్టుగా చెప్పానా?" అని అడిగాడు దినేష్‌ని.

అవునని తలవూపాడు దినేష్.

"ఓ.కే. ఒక విషయం ఫైనల్ అయిపోయింది. ఇక ఇప్పుడు నీకు ఫ్రెండ్‌గా మాట్లాడతాను. నువ్వు ప్రేమించిన అమ్మాయినే పెళ్ళిచేసుకు తీరాలని కోరుకునే వాళ్ళల్లో నేను మొదటివాడిని. తన తల్లిదండ్రులను కాదని వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా ఆ పిల్ల నిన్ను చేసుకోవడానికి సిద్ధపడుతున్నదా?" అడిగాడు దీపక్.

ఆ మాటలకు అవుననే తల వూపాడు దినేష్.

"ఆల్‌రైట్....దగ్గిరవుండి మీ పెళ్ళి నేను చేయిస్తాను. ఇంకా నావల్ల ఏ సహాయం కావాలో అడిగితే, ఆ ప్రకారం చేసేస్తాను. హ్యాపీయేనా?"

అంతకుముందు అతను ఎంత కరుకుగా మాట్లాడినా, బిక్కముఖం పెట్టడం తప్ప బ్రేక్‌డౌన్ కాలేదు దినేష్. ఇప్పుడు అతను చెప్పిన మాటల్ని వినేసరికి చేతిలోని గ్లాసును టేబిల్‌మీదపెట్టి బావురుమన్నాడు.

చుట్టుపక్కల కూర్చున్న కస్టమర్స్ అందరూ వింతగా చూడటం మొదలుపెట్టడం గమనించి గబగబా అతన్ని ఊరడించాడు మొదటి ఫ్రెండ్.

"నీ గుండెలమీదవున్న కొండని ఒక్కమాటతో ఎగరకొట్టేశాడు వాడు. సంతోషించాల్సిందిపోయి చిన్నపిల్లాడి మాదిరి ఏడుస్తావేంటిరా? అందరూ చూస్తున్నారు. కళ్ళు తుడుచుకో" అంటూ మందలించాడు.

"రేపు నువ్వు నషీలీతో చెప్పు....మంచి పురోహితుడిని చూసి ముహూర్తం పెట్టించు. యాదగిరి గుట్టమీద పెళ్ళి, హనీమూన్‌కి బెంగుళూరు వెళ్దరుగాని.

ఎంత ఖర్చవుతుందో వివరంగా చెబితే రేపు సాయంత్రం డబ్బులు ఇస్తాను. ఓ.కే.నా?" వెయిటర్‌ని పిలిచి ఇంకా కొన్ని బీర్లకు ఆర్డర్ ఇస్తూ చెప్పాడు దీపక్.

కళ్ళను తుడుచుకుని, నిదానుగా కూర్చున్నాడు దినేష్. "నాకు

ఉద్యోగం కూడా కావాలిరా. ఎట్టి పరిస్థితిలోను నషీలీని నేను కష్టపెట్టదలుచుకోలేదు. పెళ్ళిచేసుకోవటానికి ముందుగానే ఉద్యోగంలో చేరిపోతాను. హనీమూన్‌కి నా సంపాదనలోనుంచే ఖర్చులు పెట్టుకుంటాను" ధైర్యం నిండిన కంఠంతో అన్నాడు.

"శహబాష్....అదీ అసలయిన మాట. ఇప్పుడు నువ్వు అసలయిన మగాడివి అనిపించావు. ఉద్యోగం సంగతి తరువాత ఆలోచిద్దాం. రేపెల్లుండిలలో ఒకసారి నేను మీ డాడీతో మాట్లాడి చూస్తాను. సంప్రదింపులతోనే ఈ సమస్య పరిష్కారం అవ్వొచ్చు. అలా కానిపక్షంలో మనం అనుకున్న పద్ధతిలో ప్రొసీడ్ అయిపోదాం" అంటూ వున్నట్లుండి కొంచెం తూలాడు దీపక్.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు అతని ఫ్రెండ్స్.

"అరేయ్! మాటల్లోపడి ఎనిమిది బీర్లు గబగబా తాగేవావ్....తాగింది చాలు, ఇక వద్దు. ఇంటికి పోదాం" అంటూ అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా వెయిటర్‌కి బిల్ తీసుకురమ్మని సైగచేశాడు దినేష్.

"ఎనిమిది బీర్లు మనకి ఒక లెక్కలోవి కావు. ఇంకో బీర్ తీసుకుంటే తొమ్మిది అవుతాయి. బిల్లు క్యాన్సిల్" అంటూ అభ్యంతరం చెప్పబోయాడు దీపక్.

అతని భుజాలచుట్టూ చేతులు చుట్టి బలవంతంగా బయటికి తీసుకువచ్చాడు మొదటి ఫ్రెండ్.

ఒకపక్కగా పార్క్‌చేసివున్న కారుదగ్గిర నిలబడి బీడీ కాల్చుకుంటున్నాడు రాంసింగ్. బయటికి వస్తున్న దీపక్‌ని చూడగానే బీడీని అవతలకు విసిరి పరుగులాంటి నడకతో వాళ్ళకి ఎదురువచ్చాడు.

"మంచినీళ్ళు తాగినట్టు తాగేశాడు. కొంచెం మత్తు ఎక్కువయింది" దీపక్‌ని రాంసింగ్‌కి హ్యాండోవర్‌చేస్తూ చెప్పాడు మొదటి ఫ్రెండ్.

"ఏం తీసుకున్నారు చిన్నబాబూ? బ్రాందీనా? రమ్ము తీసుకున్నారా?" దీపక్‌ని అతిజాగ్రత్తగా కారుదగ్గిరికి నడిపిస్తూ అడిగాడు రాంసింగ్.

"రమ్ముకాదు, బ్రాందీకాదు. వట్టి బీరు. మాటల్లోపడి ఏమీ తినలేదు. వట్టిగా పుచ్చుకునేసరికి కొంచెం అప్‌సెట్ అయింది పరిస్థితి" తనను



కంట్రోల్‌చేసుకోవడానికి ట్రైచేస్తూ చెప్పాడు దీపక్.

"పదిమందికి పదిమాటలు చెప్పాల్సినవాళ్ళం మనం. ముష్టి మూడు బీర్లు పుచ్చుకోగానే ఇలా తూలిపోవడం ఏమిటిబాబూ?" అతన్ని జాగ్రత్తగా వెనకసీట్లో కూర్చోబెడుతూ అన్నాడు రాంసింగ్.

"ముష్టి మూడు బీర్లుకాదు, ఎనిమిది."

రాంసింగ్ తప్పును సరిదిద్దాడు దీపక్.

"ఎనిమిదికాదు....ఎనభై అయినాసరే సురేంద్రసాబ్ మనవడంటే అవతలివాళ్ళు కళ్ళు తిరిగి కిందపడిపోవాలి. మందుకొట్టడం కూడా ఒక పెద్ద ఆర్టు చిన్నబాబూ. మంచి అలవాటు కాదు అది.

అయినాసరే దాన్ని మనం ఓడించాలంటే అసలు తాగడం అంటే ఏమిటో, ఎలా తాగాలో నేర్చుకోవాలి. మీరు మన గండయ్యతో మాట్లాడండి. వాడు ఇట్టాంటి విషయాల్లో స్పెషలిస్టు" అంటూ కారును స్టార్ట్‌చేసి మెయిన్‌రోడ్డు వైపు పోనిచ్చాడు రాంసింగ్

* * * *

"తాగడం ఎలాగో నేర్చుకోమని నాకు చెపుతున్నావా? ఈ సంగతి తాతగారికి తెలిస్తే నీ పని అవుట్ అయిపోతుంది" నవ్వుతూ అన్నాడు దీపక్.

"మీ అమ్మగారు, నాన్నగారు బతికివున్న రోజుల్లో మీ తాతగారు కూడా అప్పుడప్పుడు మందు పుచ్చుకుంటూ వుండేవాళ్ళు. గోదావరిజిల్లాల్లో ఆయనకి ఎవరో ఫ్రెండ్స్ వుండేవాళ్ళు. ప్రత్యేకంగా బట్టీ వేయించిన నాటుసారాని వాళ్ళు అప్పుడప్పుడు తీసుకువచ్చి మీ తాతగారికి ఇస్తూవుండేవాళ్ళు. దానిపేరు ఏమిటోవుంది. నాకు గుర్తుకురావడంలేదు" అన్నాడు రాంసింగ్.

"ప్రత్యేకంగా బట్టీవేయించిన కాపుసారా అయితే, దానిపేరు చిగురు అయివుంటుంది. చాలా బాగుంటుందని విన్నాను. మన గండయ్యకి తెలుస్తుందా?"

"అడుగుతాను చిన్నబాబూ! అడిగి మీకు చెబుతాను. కాస్సేపు కళ్ళుమూసుకుని పడుకోండి....మాట్లాడకండి" అంటూ కారు వేగాన్ని మరింత పెంచాడు.

విమానంలా వేగంగా ప్రయాణంచేసి వారి బిల్డింగ్‌ని చేరుకున్నది కారు. అల్లంతదూరంలో వుండగానే హారన్ మోతను గుర్తుపట్టి గేటుతెరిచాడు వహీద్.

"తాతగారు చిన్నబాబుకోసం వెయిటింగ్ చేస్తున్నారు. ఇంకా నిద్రపోలేదు. హాల్లోనే కూర్చునివున్నారు" కారుని ఆపమని సైగచేస్తూ విండో దగ్గిరికివచ్చి రాంసింగ్‌తో చెప్పాడు వహీద్. వెనకసీట్లో కళ్ళుమూసుకుని మగతగా పడుకున్న దీపక్ వంక చూసి- "అయ్యబాబోయ్.... ఏంటిది?" కంగారుపడుతూ అడిగాడు.

"ఏంటిది అని నన్ను అడిగితే నేనేం చెపుతాను? ఇప్పుడే వస్తానని చెప్పి ఆ దరిద్రపుగొట్టు బార్‌లోకిపోయి తెలివి తప్పేదాకా తాగి వచ్చాడు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ముందుగా తెలిసినా, ఏదో ఒక విధంగా ఆపి వుండేవాడిని. ఈ సీన్ పెద్దబాబు చూస్తే కొంపలు అంటుకుంటాయి. ఇప్పుడు ఏం చేయడం?" వాపోయాడు రాంసింగ్.

"నువ్వు ఏపని చేసినా ఇలాగే చేస్తావు. అయినా మన చిన్నబాబు ఈమధ్య రానురాను మతి కొంచెం మందగిస్తోంది. చెప్పాచెయ్యకుండా ఇట్టాంటి పనులే ఏవో ఒకటిచేసి తన పీకలమీదికి తెచ్చుకోవడం అలవాటు అవుతోంది" తలమీదవున్న చిన్నసైజు టోపీని తీసి, తలబరుక్కుంటూ అన్నాడు వహీద్.

"అలవాటో గిలవాటో ఏదో ఒకటి....అయిపోయినదానికి ఇప్పుడు గింజుకుంటే ఏముంటుంది ఉపయోగం? ఇప్పుడు చేయాల్సింది ఏమిటో ఆలోచించు. కారు హారన్‌మోత పెద్దబాబుకు వినబడే వుంటుంది. వాకిట్లోకి వచ్చారంటే మన పని మటాష్!" అన్నాడు రాంసింగ్.

"తొందరపెట్టి చంపమాకు, ఆలోచించుకోనీ....చిన్నబాబును నువ్వు గెస్ట్‌హౌస్‌కి తీసుకువెళ్ళిపోతే బాగుంటుంది. నేను వెళ్ళి అయన తన ఫ్రెండ్స్ రూమ్‌లోనే వుండిపోయారని పెద్దబాబుతో చెప్పివస్తా" ఉన్నట్లుండి అన్నాడు వహీద్.

"అట్టాంటి పప్పులు పెద్దబాబుగారి దగ్గర ఉడకవ్...రాత్రంతా బయటే వుండిపోవాలంటే ముందుగానే ఆయనకు చెప్పాలి. చెప్పకపోతే అనుమానం వచ్చేస్తుంది" అనడం మొదలుపెట్టాడు రాంసింగ్. అంతలోనే



గేటుపక్కన షెడ్లో వున్న ఫోన్ గణగణమని మోతలు చేయడంతో అటు పరిగెత్తాడు వహీద్.

"కారు వచ్చిన సవ్వడి పెద్దబాబుగారికి వినిపించింది. ఏమిటి ఆలస్యం? చిన్నబాబు ఇంకా రావడంలేదెందుకని?" ఖంగ్‌మంటూ వినవచ్చింది పీటర్ కంఠం.

చలిజ్వరం వచ్చినట్టు కంపించింది వహీద్ చెయ్యి. "ఇదిగో పీటరూ....అసలు విషయం చెప్పనా" అంటూ కార్లో వున్న దీపక్ పొజిషన్ గురించి చెప్పేశాడు.

"అయ్యబాబోయ్....తాగివచ్చాడా? తాతగారు తనకోసం భోజనం చేయకుండా ఎదురుచూస్తున్నారు. ఆయనకి సమాధానం చెప్పడం ఎలా?" వహీద్, రాంసింగ్ కంటె ఇంకా ఎక్కువగా ఖంగారుపడుతూ అడిగాడు.

"ఎలా చెపుతావో, ఏం చెపుతావో మాకు తెలియదు. మేము చిన్నబాబును పోర్టికో దగ్గిరికి తీసుకువచ్చేస్తున్నాం" అన్నాడు వహీద్.

"వద్దు....పోర్టికో దగ్గిరికి వద్దు. దక్షిణం వైపున్న ఎంట్రన్స్ దగ్గిరికి తీసుకురండి" వున్నట్లుండి స్టడీ అయిన కంఠంతో నెమ్మదిగా చెప్పాడు పీటర్.

రిసీవర్‌ని ఫోన్‌మీద పడేసి కారు దగ్గిరికి పరిగెత్తాడు వహీద్. కారు బ్యాక్‌డోర్ తెరిచి, రబ్బర్‌బొమ్మను ఎత్తుకున్నట్లు దీపక్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

"నువ్వు పోర్టికో దగ్గిరికి వెళ్ళిపో....పెద్దబాబుగారు అడిగితే, దక్షిణం పక్కనుంచి మేడమీదికి వెళ్ళిపోయాడని చెప్పు" అంటూ పరుగులాంటి నడకతో పీటర్ చెప్పిన వైపు బయలుదేరాడు వహీద్. నెమ్మదిగా కారును కదిలించి పోర్టికో దగ్గిరికి పోయాడు రాంసింగ్.

* * * *

"రాంసింగ్....నువ్వేనా? చిన్నబాబు వచ్చాడా లేదా?" వెంటనే వినవచ్చింది సురేంద్రసాబ్ కంఠం.

"వచ్చాడయ్యా....పక్క గుమ్మంలోనుంచి మేడమీదికి వెళ్ళారు. చిటికెలో కిందికి వచ్చేస్తానని అన్నారు. ఇందాక తన దోస్తుల దగ్గిర చాయ్ తాగుతుంటే కప్పు ఒలికి షర్టు ఖరాబైంది" పోర్టికో మెట్లమీద నిలబడి

లోపల హాల్లోకి తొంగిచూస్తూ సమాధానం యిచ్చాడు రాంసింగ్.

"త్వరగా రమ్మని చెప్పు....ఆకలి వేస్తోంది. వాడికోసం చాలా సేపటినుంచి ఎదురుచూస్తున్నాను" విసుగ్గా ఇంకో మారు అన్నాడు సురేంద్రసాబ్.

హాల్లోకి ఎంటర్ కాలేదు రాంసింగ్. తాను కూడా దక్షిణం పక్క నుంచి వేగంగా మేడమీదికి పరిగెత్తాడు.

"పెద్దబాబుకి ఆకలి వేస్తోందిట. త్వరగా తీసుకురమ్మని చెప్పారు" అంటూ కంగారుగా దీపక్ గదిలోకి ఎంటర్ అయ్యాడు రాంసింగ్. ఎప్పుడు వచ్చాడోగాని, గార్డెనర్ గండయ్యతోపాటు వంటమనిషి అవతారం కూడా ఆ గదిలోకి వచ్చేశాడు.

"రెడీయా? బాత్‌టబ్‌లో వాటర్ రెడీయేనా?" దీపక్‌ని బెడ్‌మీద నుంచి పైకి లేపుతూ గండయ్యని అడుగుతున్నాడు పీటర్.

"రెడీ....కాని నీళ్ళు చాలా చల్లగా వున్నాయి. ఈ నీటిలో మునిగితే రేపు పొద్దుటికల్లా చిన్నబాబుకి జలుబు, పడిశం డెఫినిట్టు" బాత్‌టబ్‌లో చేయిపెడుతూ చెపుతున్నాడు గండయ్య.

"హెల్ప్‌చెయ్యి వహీదూ....కాస్తంత గట్టిగా పట్టుకుని హెల్ప్ చెయ్యి" అని వహీద్‌ను హెచ్చరిస్తూ, రాంసింగ్ చూస్తుండగానే దీపక్‌ని తీసుకుపోయి దభీమని బాత్‌టబ్‌లో పడేశాడు పీటర్. ముఖంమీద ఎవరో లాగిపెట్టి కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు దీపక్.

"చల్లటి నీళ్ళు తగిలినా సరిగ్గా లేవడంలేదు. ఏం తాగాడు?" రాంసింగ్‌కేసి అనుమానంగా చూస్తూ అడిగాడు గార్డెనర్ గండయ్య.

"తాగడమా పాడా....ఫ్రెండ్స్‌తో కలిసి ముష్టి మూడు బీర్లు కాటోలు పుచ్చుకున్నట్టున్నాడు" విసుగునిండిన కంఠంతో చెప్పాడు రాంసింగ్.

"మూడు కాదు....ఎనిమిది....ఎన్నిసార్లు చెప్పినా మళ్ళీ మళ్ళీ మొదటికి వచ్చేస్తావేమిటి?" టబ్‌లోనుంచి తల ఎత్తి కోపంగా చూడటానికి ట్రై చేస్తూ అన్నాడు దీపక్.

"ఓ.కే....ఓ.కే....ఎనిమిది బీర్లు పుచ్చుకున్నారు. మాకు అర్థం అయింది. మన గండయ్య ఏకలగా మూడులీటర్ల కాపుసారా తాగి కదల



కుండా నిలబడతాడు. తాగడం అంటే అలా వుండాలి. ఇలా తల్లకిందులు అయిపోకూడదు...." అతని తలను ఇంకోసారి నీళ్ళలో ముంచి పైకి లేపుతూ అన్నాడు పీటర్. అలా చేసినందుకు అతనిమీద విరుచుకుపడలేదు దీపక్.

"హాయిగా పడుకోనీయకుండా ఈ గొడవ ఏమిటి పీటరూ?" అని అడిగాడు దీపక్.

"మీకు గొడవమాదిరిగానే కనిపిస్తుంది. మాకు గుండెలు గొంతుల్లోకి వచ్చేస్తున్నాయి. అవతల తాతగారు మీకోసం వెయిటింగ్. ఇంకా భోజనం చేయలేదు...." ఇంకోసారి తలను ముంచడానికి రెడీ అవుతూ చెప్పాడు పీటర్.

* * * *

తాతగారు తనకోసం వెయిటింగ్ అనే మాట చెవుల పడేసరికి, కరెంట్‌షాక్ కొట్టినట్లయింది దీపక్‌కి.

పీటర్‌తో పనిలేకుండా తానే గబాగబా మూడుసార్లు తలను నీళ్ళల్లో ముంచి లేపాడు.

"ఎలా వుంది చిన్నబాబూ? ఆల్‌రైటేనా?" ఆత్రుతగా అడిగాడు గార్డెనర్ గండయ్య.

"కాస్తంత ఆల్‌రైటే....పూర్తిగా కాదు. మగత ఇంకా కంటిన్యూ అవుతోంది" టబ్‌లోనుంచి నెమ్మదిగా లేచి నిలబడుతూ చెప్పాడు దీపక్.

"పీటరూ? ఓయ్ పీటరూ? పెద్దాయన పిలుస్తుండు....నాన్నగారిని తొందరగా కిందికి రమ్మని చెప్పు" మెట్ల కిందినించి మరియమ్మ కంఠం పెద్దలౌడ్‌స్పీకర్లోనుంచి వినబడినట్టు వినవచ్చింది.

ఆందోళనగా చూసిన రాంసింగ్‌వంక చూసి, తల విదిలించాడు పీటర్.

"మనకి కనీసం ఇంకో పది నిముషాలయినా టైమ్ కావాలి..." అంటూ ఒక పక్కగా నిలుచున్న అవతారం వైపు తిరిగాడు. "నువ్వే....నువ్వే ఏమైనా చెయ్యి....పెద్దబాబు పదినిముషాలవరకూ ఏమీ మాట్లాడకూడదు" అంటూ ఆర్డర్ యిచ్చాడు.

"భోజనం చెయ్యాలని అనుకున్నాక రెండు క్షణాల ఆలస్యాన్ని

కూడా పెదబాబు భరించలేడు. ఇవాళ నాపని రాంభజనే" అంటూ కిందికి పరిగెత్తాడు.

"ముందు నువ్వు చిన్నబాబు డ్రెస్‌ని వూడదీసెయ్" పీటర్‌తో చెప్పాడు ఏదో నిర్ణయానికి వచ్చిన వహీద్.

"ఆగండి....ఆగండి....నేనే వూడదీస్తాను. మీరు ఆగండి" అని దీపక్ అరుస్తున్నా వినకుండా ప్యాంటు, షర్టు, బనీను అన్నీ వూడలాగాడు పీటర్.

పట్టి అండర్‌వేర్‌తో నిలబడిపోయిన దీపక్‌ని అమాంతం చేతుల్లోకి ఎత్తుకుని విశాలంగా వున్న బెడ్ మీద బోర్లాపడేశాడు వహీద్.

తన రెండుచేతులతో నమస్కారం చేస్తున్నట్టు ఒకటిగా చేర్చి, అతని వెన్నుమీద అలవోకగా తట్టడం మొదలుపెట్టాడు. "మీరా కాళ్ళను మర్దనా చేయండి. రాంసింగ్, నువ్వు చేతుల్ని కదిలించు" అంటూ మిగిలిన వారందరికీ ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చాడు.

తన ఒంటిమీద వైబ్రేటర్స్ నిలబడినట్టు ఒక్కసారిగా వణికి పోయాడు దీపక్. "చాలు. ఇక చాలు....నా మగత వదిలిపోయింది. ఐయామ్ ఆల్‌రైట్" అని అరిచాడు మూడు నిముషాల తర్వాత.

వార్డ్‌రోబ్‌లోనుంచి ఖరీదైన నైట్‌డ్రెస్‌ని తీసి బెడ్‌మీద పెట్టాడు పీటర్. మెత్తటి టర్కీటవల్‌తో ఒళ్ళు, తల శుభ్రంగా తుడిచి, "మేము కిందికి పోతున్నాం. రెండు నిముషాల్లో డ్రసప్ అయిపోవాలి" అని చెప్పాడు.

ఎలక్ట్రిక్ తరంగాలు ఒంటినిండా ప్రవహిస్తున్న సెన్సేషన్ కలిగింది దీపక్‌కి. "వచ్చేస్తున్నాను...ఒక్క నిముషం చాలు" అంటూ తడి అండర్‌వేర్‌ని అవతలకు విసిరేసి చకచకా డ్రసప్ అయ్యాడు.

గది బయట రెడీగా వున్నాడు గండయ్య. "చిన్నబాబూ...ఒకేచోట నిలబడవద్దు. ఏ వస్తువు వంకా పరీక్షగా చూడవద్దు. ఎక్కువగా మాట్లాడ వద్దు" అని జాగ్రత్తలు చెపుతూ అతని వెనుకే మెట్లు దిగాడు.

అడుగు అడుగు చొప్పున మెట్లు దిగి, డైనింగ్‌హాల్లోకి దీపక్ ఎంటర్ అయ్యేసరికి, విసురుగా అటూ ఇటూ పచార్లు చేస్తూ కనిపించాడు



సురేంద్రసాబ్.

* * * *

"ఏమయింది తాతగారూ! వాట్ హేపెన్డ్?" ఏమీ తెలియనట్లు అమాయకంగా అడిగాడు.

"ఈ అవతారానికి రానురాను బద్దకం ఎక్కువ అయిపోతోంది. సాంబారు డిష్‌ని తీసుకువచ్చి సరిగ్గా నా కుర్చీమీద పడేశాడు. కుర్చీ అంతా ఖరాబు అయింది. వాడిది వట్టి మట్టిబుర్ర. బుద్ధి, జ్ఞానంలేని దొంగ రాస్కెల్" కోపంగా చెప్పాడు సురేంద్రసాబ్.

ఇంకో డిష్‌లో సాంబార్ నింపుకువస్తూ, ఓరగా దీపక్‌వంక చూసి, నొసలు ఎగరవేశాడు అవతారం.

"రాత్రిపూట నాకు సాంబార్ అవసరంలేదు. నీకు ఎన్నోసార్లు చెప్పాను....అయినా నువ్వు వినిపించుకోవడంలేదు" అతనిమీద విరుచుకు పడుతూ తన ప్లేస్‌లో సెటిల్ అయ్యాడు దీపక్.

ఖరాబయిన కుర్చీని అవతలికి జరిపి, ఇంకో కుర్చీని ఆ ప్లేస్‌లో పెట్టాడు పీటర్. సురేంద్రసాబ్ సెటిల్ అయిన తర్వాత అవతలికి జరిగాడు.

"మన దామోదర్ మేనకోడలు శృతిని చూశావుకదూ? నీకు ఏమనిపించింది?" తన ప్లేటును ముందుకు జరుపుకుంటూ దీపక్‌ని అడిగాడు సురేంద్రసాబ్.

"ఏమనిపించడం ఏమిటి తాతగారూ?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"అదేనోయ్! ఆ పిల్ల బాగుందనిపించిందా? అందంగా వున్నట్లు కనిపించిందా?" చిరునవ్వుతో క్వశ్చన్ చేశాడు సురేంద్రసాబ్.

"ఐ థింక్ షీ ఈజ్ ఆల్‌రైట్! ఫరవాలేదు. అందం అంటే పెద్ద అందగత్తె ఏమీకాదు. అంతకంటె అందంగా వున్నవాళ్ళు మా కాలేజీలో-" భోజనం చేయడం మానుకుని ఉపన్యాసం ఇవ్వడం మొదలుపెట్టాడు దీపక్.

రెడీగానే వున్నాడు పీటర్.

"చిన్నబాబూ! ముందు భోజనం చేయండి. తాతగారు అడిగిన ప్రశ్న

అదికాదు....మీరు ముందు ప్లేటువంక చూసుకోండి" చిన్న కంఠంతో అతన్ని హెచ్చరించాడు.

"ప్లేటువంక చూడాల్సిన అవసరం ఏముంది? చీకట్లోనయినా మన చెయ్యి ప్లేటులోకే పోతుంది. చిన్నప్పటినుంచీ...." అంటూ అతనికేసి తిరిగాడు దీపక్.

"ముందు భోజనం చేయండి చిన్నబాబూ! భోజనం చేసిన తర్వాత మాట్లాడవచ్చు" తనుకూడా పీటర్‌కి సహాయంగా వస్తూ హెచ్చరించాడు అవతారం.

"ఏమిటీ అందరూ కలిసి అదేపనిగా నాకు సలహాలు ఇస్తున్నారు? నేను ఇంకా చిన్నపిల్లాడినే అనుకుంటున్నారా?" కోపంగా చూస్తూ వెంటనే అడిగాడు దీపక్.

* * * *

ఒక్కక్షణం....ఒకే ఒక్కక్షణం తను భోజనం చేయడాన్ని ఆపి, అతనివంక నిశితంగా చూశాడు సురేంద్రసాబ్. "నువ్వు చిన్నపిల్లడివి కాదు. కానీ నీ పద్ధతి ఇవ్వాళ చిన్నపిల్లడి మాదిరిగానే వున్నది.... ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీకి పోయివచ్చావా?" కనుబొమలు ముడివేస్తూ అడిగాడు.

వాటర్‌టబ్‌లో పడినప్పుడు ఉలిక్కిపడినట్లు మరోసారి ఉలిక్కిపడ్డాడు దీపక్. "అదికాదు తాతగారూ! అసలు ఏమైందంటే...." అని సమాధానం చెప్పడానికి ప్రైచేశాడుగాని, వినిపించుకోలేదు సురేంద్రసాబ్.

"తిండి తిను. రోజురోజుకీ నీ అల్లరి హద్దులు దాటిపోతోంది. అలస్యంచేస్తే నువ్వు ఎందుకూ పనికిరాకుండా పోతావ్. దామోదర్ మేనకోడలు శృతి నాకు బాగా నచ్చింది. ఆ పిల్లతో నీ పెళ్ళి. ఈ మాట నీకు చెప్పడం కోసమే ఇంతసేపు కూర్చున్నాను. భోజనంచేసి త్వరగా పడుకో. మజ్జిగ కాస్త ఎక్కువ తాగు" అంటూ రెండే రెండు నిముషాల్లో తన భోజనాన్ని ముగించుకొని టేబిల్ ముందునుంచి వెళ్ళిపోయాడాయన.

"నెత్తీనోరు కొట్టుకుని చెప్పాము అధికంగా మాట్లాడవద్దని. అయినాసరే అలాగే చేశావు. మేము పడిన కష్టం అంతా వృధా అయింది" తన మాటలు బైటికి వినిపించవని నిశ్చయమయ్యాక దీపక్‌తో అన్నాడు



పీటర్.

"అధికంగా ఏం మాట్లాడాను? ఆ దామోదరంగారి మేనకోడలు శృతి మేడమ్, చాలా అందంగా వుంటుందా? అంతకంటే అందగత్తెలు ఇంకా ఎవరూ వుండరా?" అతని ముఖంలోకి చూస్తూ అన్నాడు దీపక్.

అవతారం అంతకుముందే రెడీచేసి వుంచిన మజ్జిగ గ్లాసును అందుకుని బలవంతంగా అతని చేతిలో పెట్టాడు పీటర్. "తిన్నది చాలు. మజ్జిగ తాగి పైకి లేవండి. కదలకుండా పడుకుంటే తెల్లారిన తర్వాత తెలుస్తుంది మీరు మాట్లాడింది ఏమిటో....తాగండి" అంటూ ఇంకాస్త బలవంతంగా మజ్జిగ తాగించాడు.

దీపక్ అనుమతి తీసుకోకుండానే అతని చేతిని పట్టుకుని శుభ్రం చేశాడు అవతారం.

"పదండి....మీ గది దగ్గిరికి పదండి" అంటూ కుర్చీలోనుంచి లేపి పీటర్‌కి అప్పగించాడు.

"నాకు నిద్రరావడంలేదు. కాస్సేపు హాల్లో కూర్చుంటాను" అంటున్న దీపక్‌ని బలవంతంగా పైకి తీసుకుపోయి బెడ్‌మీద పడుకోబెట్టాడు పీటర్.

"గుడ్‌నైట్ చిన్నబాబూ! హ్యాపీ డ్రీమ్స్!" అంటూ విష్‌చేసి తను బయటికి వచ్చేశాడు.

* * * *

"ఎప్పుడూ లేనిది నాన్నగారు తాగి తలకుపోసుకుని, తాతగారితో మాటలు పడ్డారు. ఈ పద్ధతి బాగోలేదు. నాకు చాలా బాధగా వుంది" ఉదయం ఏడు గంటల సమయంలో కాఫీకప్పును తెచ్చి దీపక్ చేతికి అందిస్తూ అన్నది మరియమ్మ.

"ఆగు. తాతగారితో మాటలుపడ్డానా? ఏమని? చెప్పు" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"ఏమని పడ్డారో మీరే గుర్తుచేసుకోండి నాన్నగారూ! ఇంతకీ ఆ శృతి మేడమ్‌ని గురించి ఏమాలోచించారు? ఆ పిల్ల మీకు నచ్చిందా?" ముఖంమీద పడిన అతని జుట్టును ఆప్యాయంగా వెనక్కి నెడుతూ అడిగింది మరియమ్మ.

"శృతి మేడమ్ నాకు నచ్చడం ఏమిటి?" మరింత ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"రామాయణం అంతావిని రాముడికి సీత ఏమవుతుందని అడగద్దు. శృతి మేడమ్‌ని మీకు ఇచ్చి పెళ్ళిచేయాలని తాతగారు అనుకుంటున్నారు. రాత్రి మీకు చెప్పారు. గుర్తుకువచ్చిందా?" అడిగింది మరియమ్మ.

కాఫీకప్పును ఖాళీచేసి అవతలపెడుతూ అరచేత్తో నుదురు రుద్దుకున్నాడు దీపక్.

"రాత్రి ఏం జరిగిందో, ఏం మాట్లాడానో నాకు సరిగ్గా గుర్తుకు రావడంలేదు. ఒకసారి పీటర్‌ని పైకి పంపించు" అని మరియమ్మకు చెప్పాడు దీపక్.

"పీటర్ రాడు. పెద్దయ్యగారు ఎక్కడికో బయటికి పంపారు. మీరు స్నానంచేసి రెడీ అవండి. టిఫిన్ టైమ్ అవుతోంది. తాతగారు మళ్ళీ కోపంచేస్తే బాగోదు" అంటూ ఖాళీకప్పును తీసుకుని కిందికి వెళ్ళిపోయింది ఆమె. రాత్రి పార్టీనుంచి బయలుదేరిన తర్వాత జరిగినదేమిటో గుర్తుచేసుకోవడానికి ట్రైచేస్తూ గబగబా తను రెడీ అయ్యాడు దీపక్.

"ముష్టి మూడు బీర్లు తాగినందుకే ఇంత గలాటా చేశారు. గట్టి సరుకును రెండుగుక్కలు పుచ్చుకుంటే ఏమైపోతారు మీరు?" మెట్లకింద నిలబడివున్న గండయ్య వెంటనే అడిగాడు అతన్ని చూసి.

"ముష్టి మూడుకాదు. ఎనిమిది...." అనాలోచితంగా సమాధానం ఇచ్చాడు. వెంటనే ఏదో జ్ఞప్తికి వచ్చినట్టు అక్కడే ఆగిపోయాడు దీపక్.

"నాకు చిగురు తాగాలని వుంది.... ఇవాళ సాయంత్రం నేను మైసయ్య దగ్గిరికి పోతున్నాను. తాతగారితో చెప్పి నువ్వుకూడా నాతోపాటు వచ్చెయ్....చిగురు దొరికితే తీసుకురా" అని చెప్పి, అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా మెయిన్ హాల్లోకి ఎంటర్ అయ్యాడు.

* * * *

లావుపాటి సిగార్‌ని వెలిగించుకుని, అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు సురేంద్రసాట్. "లేచావా? ఆర్ యూ ఆల్‌రైట్?" అతన్ని చూడగానే అడిగాడు.

"ఐయామ్ ఆల్‌రైట్ తాతగారూ! రాత్రి ఫ్రెండ్స్‌తో కలిసి చిన్న



పార్టీ చేసుకున్నాం. కొత్త కావడంవల్ల కాస్తంత అప్‌సెట్ అయ్యాను" ఆయన అడగకముందే తను చేసిన పనిని అన్యాపదేశంగా వెల్లడి చేశాడు.

"ఆల్‌రైట్! అప్పుడప్పుడు అయితే పరవాలేదు. అదే అలవాటుగా మారితేనే ప్రమాదం....టిఫిన్ చేద్దాం" అంటూ డైనింగ్ రూమ్‌లోకి దారి తీశాడు తాత.

అవతారం తీసుకువచ్చిన ఇడ్లీలమీదా, పెసరట్లమీదా దాడిచేసినంత పనిచేశాడు దీపక్.

"అట్లు అదిరిపోయాయి అవతారం.... అల్లప్పచ్చడి అమోఘం" అంటూ మెచ్చుకున్నాడు.

"మంచి వచ్చినా, చెడు వచ్చినా మీతో వేగడం మహా కష్టం. మిమ్మల్ని చేసుకునేది ఎవరోగాని. బతుకంతా కత్తిమీద సాము చేస్తూనే వుండాలి" చిన్న కంఠంతో ఎత్తి పొడిచాడు అవతారం.

సురేంద్రసాట్‌కి చేరనే చేరాయి ఆ మాటలు. "నిజం చెప్పావు అవతారం. వీడు వట్టి వెధవ....వీడికి బుద్ధి రావాలంటే దామోదరం మేనకోడలువంటి పిల్లను తీసుకురావాల్సిందే...." నవ్వుతూ చెప్పి, టిఫిన్ ముగించాడాయన.

"తాతగారూ! సాయంత్రం నేను మన మైసయ్య దగ్గిరికి పోదామని అనుకుంటున్నాను" ఆయన వెనుకే అడుగులువేస్తూ అన్నాడు దీపక్.

"గంగారం జాతర చూడడానికి ప్రోగ్రాము చేశారా మీరిద్దరూ"? నిర్మొహమాటంగా అడిగాడు సురేంద్రసాట్.

నివ్వెరపోయి నోటమాట లేకుండా నిలబడిపోయాడు దీపక్. 'తను చెప్పకుండానే తన ఆలోచన ఆయనకు ఎలా తెలిసింది?' అనుకున్నాడు.

"అదేపనిగా ఆశ్చర్యపడకు...ఆ మైసయ్య నీతో మాట్లాడడానికి వచ్చినప్పుడే నాకు అర్థమైంది. జాతర్లో ఆ బలులు ఇచ్చే దృశ్యాలు చాలా ఘోరంగా వుంటాయి, నువ్వు చూడగలవా?" అడిగాడు సురేంద్రసాట్.

"నేను చిన్నపిల్లాడిని కాదుగదా తాతగారూ?" కొంచెం ఫీలవుతూ సమాధానం యిచ్చాడు దీపక్.

“నాకు అనుమానంగానే వుంది...అయితే నువ్వు ఒకపని చెయ్యి” అంటూ అతనికిచెప్పి, “గండయ్యా...” అని గట్టిగా పిలిచాడు సురేంద్రనాథ్.

మూడు అంగల్లో ఆయన ఎదుటికి వచ్చి నిలబడ్డాడు గండయ్య. “వహీద్‌ని పిలువ్...నువ్వు, వహీదు చిన్నబాబువెంట ఫామ్‌హౌస్‌కి వెళ్ళండి” అని ఆర్డర్ పాస్ చేశాడు.

నవ్వులమయం అయిపోయింది గార్డెనర్ గండయ్య ముఖం. “అలాగే అయ్యగారు... అలాగే పోతాము...చిన్నబాబు సాయంత్రంగాని బయలుదేరరు... ఈలోపల నేను వహీదుకుచెప్పి రెడీగా వుంటాము” అంటూ గేటు దగ్గిరికి వేగంగా పరుగుతీశాడు.

అడుగుకు మూడుమెట్లు ఎక్కుతూ తన గది దగ్గిరికి చేరుకున్నాడు దీపక్. గంగారం జాతరకు పోయేందుకు తాతగారు అంత సులభంగా పర్మిషన్ ఇస్తారని అతను ఏమాత్రం అనుకోలేదు.

“నాన్నగారికి కాలేజీ టైమవుతోంది, బయల్దేరుతున్నారా లేదా?” అంటూ మరియమ్మ తన వెనుకే ప్రత్యక్షమవడంతో-

“చిన్న పిల్లాడికి చెప్పినట్టు ప్రతిరోజూ నాకు చెప్పాలా? కాలేజీకి టైము అవుతోందని నాకు తెలియదని అనుకుంటున్నావా?” కోపంగా చూస్తూ అడిగాడు.

“మా కళ్ళకు నాన్నగారు ఎప్పుడూ చిన్నపిల్లడి మాదిరిలాగానే కనిపిస్తారు. లేచిన దగ్గిర్నించీ నూట యాభైసార్లు గుర్తు చేస్తే తప్ప స్కూలుకు బయలుదేరేవాళ్ళు కారు. మీరు మర్చిపోయినా నేను మర్చిపోలేదు” తెల్లటి దంతాలన్నీ బయటికి కనిపించేలా నవ్వుతూ అంది మరియమ్మ.

మటుమాయమైపోయింది దీపక్ ముఖంలో ప్రత్యక్షమైన కోపం. “నిజమే మరియమ్మా...అప్పుడే కాదు, ఇప్పుడు కూడా నువ్వే నాకు గుర్తు చేయాలి...ఇప్పుడేకాదు ఎప్పుడూ గుర్తుచేస్తూ వుండాలి” ముందుకు ఒంగి ఆమె భుజంమీద తలపెట్టుకుంటూ ఆర్తిగా అన్నాడు.

“నేను బాధపడిపోతానని నాన్నగారు అలా అంటున్నారుగాని, అ మూడుముళ్ళు పడిన తర్వాత మేము గుర్తు చేయడాలు వుండవు. గుర్తు



చేసినా ఊరుకోరు...” అతని తల నిమిరి నుదుటిమీద ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంటూ చెప్పింది మరియమ్మ.

“నాకు ఊహ తెలిసిన క్షణంనుంచీ నువ్వే నా బాగోగులు చూసుకుంటున్నావు. అమ్మ అంటే ఎలా వుంటుందో నాకు తెలియదు. నాకు తెలిసిన అమ్మవు నువ్వొక్కదానివే...ఏదైనా సంగతిని గురించి నాకు గుర్తు చేసే అధికారం నీదే. మూడుముళ్ళు కాదు...ముప్పై ముళ్ళు పడ్డాక కూడా ఏమీ మారదు....” అంటూ తన టేబిల్ దగ్గిరికిపోయి ఆ రోజు తీసుకుపోవాల్సిన బుక్స్ తీసుకుని కాలేజీకి వెళ్ళిపోయాడు.

అతను మాట్లాడిన మాటల్ని విన్నవెంటనే ఉప్పొంగుకు వచ్చాయి కన్నీళ్ళు మరియమ్మకి. అవి దీపక్ కళ్ళ పడకుండా చటుక్కున తలను పక్కకు తిప్పుకుని, పెద్ద పెద్ద అడుగులతో కిందికి వచ్చేసిందామె.

డైనింగ్‌టేబుల్‌ని శుభ్రపరిచి, అప్పుడే అటుగా పోతున్న అవతారం భార్య సీతమ్మ చూడనే చూసింది.

“ఏమిటిది మరియమ్మా? ఏంటా కన్నీళ్ళు? చిన్నబాబు ఏమయినా అన్నాడా?” గబగబా దగ్గిరికి వస్తూ సాదరంగా అడిగింది ఆమె.

“చిన్నబాబు చిన్నచిన్న మాటల్ని మానేసి ఇవాళ చాలా పెద్దమాటే అన్నాడు. తనకు తెలిసిన అమ్మను నేను ఒక్కదాన్నేట...నేనే తన అమ్మనుట” గద్గద స్వరంతో చెప్పింది మరియమ్మ.

“బాబు మనసు బంగారం...అటువంటి మాటలు ఆ బాబు నోటివెంట తప్ప ఇంకెవరి నోటివెంటా రావు. చిన్నప్పటినుంచీ అతన్ని పెంచి పెద్ద చేసినందుకు నీకు మంచి ఫలితం కనిపించింది. నువ్వు చాలా అదృష్టవంతురాలివి” మెరుస్తున్న కళ్ళతోచెప్పి, తన పెనిమిటిని పిలుస్తూ అవతలిగదిలోకి పరిగెత్తింది సీతమ్మ- మరియమ్మ మాటల్ని అతని చెవిలో వేయడానికి.

* * * *

అవతలి గదిలో కనిపించలేదామెకు తన పెనిమిటి. వంటగదిలో అసిస్టెంటుకు చకచకా ఆర్డర్స్ పాస్‌చేస్తూ అగుపించాడు. “చికెన్ అంటే

సరితమ్మగారికి సరిపడదు. సో...చికెన్ గికెన్ జాన్తానై...మటన్ చేద్దాం. దాంతోపాటు మరేదైనా డిష్ చాలా అవసరం. బాగా ఆలోచించి నాకు చెప్పండి" అంటూ వెనుతిరిగి చూశాడు.

తను ఏం చెప్పడానికి వచ్చిందో మరిచిపోయింది సీతమ్మ. "అవునూ...సరితమ్మ అంటున్నావేంటి? మటన్ ఫ్రై ఎవరికీ?" అని అడిగింది ఆత్రంగా.

"ఓసినీ...ఇంకా నీకు తెల్వదా? ఇప్పుడో ఇంకో అరగంటకో సరితమ్మ వస్తోందిట. ఫోన్ వచ్చింది. పెద్దబాబుగారు చాలా హ్యాపీగా వున్నారు. నువ్వు గమనించలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు తన భార్యని.

గిరుక్కున వెనుతిరిగి మధ్య హాలు దగ్గిరికి వచ్చింది సీతమ్మ. ఎవరికో ఫోన్‌చేసి, అవతలి వారినుంచి వినవచ్చిన సమాధానం తనకు నచ్చలేదు కాబోలు, ముఖం ముటముటలాడించుకుంటూ సీరియస్‌గా కని పించాడు అప్పుడే ఎక్కడినుంచో వచ్చిన పీటర్.

"ఇదిగో పీటరూ...నా పెనిమిటి ఏదో అంటున్నాడు నిజమేనా. ఆ సరితమ్మ-" అంటూ తన మాటని మధ్యలోనే ఆపేసింది సీతమ్మ.

"అవును... సరితమ్మ నిజంగానే వస్తోంది. రైలు ఇంకో పది నిము షాల్లో స్టేషన్‌ని చేరుకుంటుందిట. కారు పంపాలి...రాంసింగ్ చిన్నబాబును కాలేజీకి తీసుకుపోయాడు. గండయ్యగాడు ఇంట్లో ఎక్కడా కనిపించటం లేదు" చిరాకుగా అన్నాడు పీటర్.

"ఈ మాత్రందానికి అంత చిరాకు దేనికి పీటరూ? నువ్వే వెళ్ళి రావచ్చుగా" తాపీగా చెప్పింది సీతమ్మ.

ఉరిమిచూసినంత పనిచేసి చకచకా హాల్లోకి వెళ్ళిపోయాడు పీటర్. "అయ్యగారూ...నేను సరితమ్మకోసం స్టేషన్‌కిపోయివస్తా...మన మారుతీ వ్యాన్‌ని తీసుకుపోతున్నా" అంటూ సురేంద్రసాబ్‌కిచెప్పి, అటునుంచి అటే పోర్టికోలోకి వెళ్ళిపోయాడు.

"సరితమ్మ వస్తోందా? సీతమ్మా నిజమేనా? నిజంగానే వస్తోందా?" గబగబా రావడంవల్ల ఆయాసపడిపోతూ సీతమ్మ దగ్గిరికి వచ్చి అడిగింది మరియమ్మ.

"అవును మరియమ్మా...నిజంగానే వస్తోందిట. ఇంకో అరగంటలో



ఇక్కడ ప్రత్యక్షం అవుతుంది..." ఉదాసీనంగా చెప్పి అవతలికి బయలు దేరింది సీతమ్మ.

"అరగంటలో వచ్చేస్తుందా? ఇప్పుడు ఇక్కడ ఏం ముంచుకు పోతోందని వస్తోంది? నిన్ను, నన్ను, అవతారాన్ని పీడించుకుతినడానికి వస్తోందా?"

తనలో తను అనుకుంటున్నట్లు పైకే అంటూ ఆమెను అనుస రించింది మరియమ్మ.

కిందటిసారి వచ్చినప్పుడు గండయ్య నెత్తిమీద పెద్ద కుంపటి పెట్టి వెళ్ళింది. ఈసారి కొడుకుతో సహా వస్తోందిట. ఇప్పుడు ఎవరి నెత్తి పచాళించడానికో!" దీర్ఘాలు తీస్తున్నట్టుగా సన్నటి కంఠంతో సాగదీసింది సీతమ్మ.

* * * *

"పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడకుండా నోళ్ళు మూసుకోండి మీరు ఇద్దరూ. సరితమ్మ అంటే పెద్దబాబుకి ఒక్కగానొక్క కూతురు. ఇది ఆమె పుట్టిల్లు.

తండ్రి ఇంట్లో తండ్రికి ఎన్ని అధికారాలుంటాయో, ఆమెకు కూడా అన్నే వుంటాయి. కిందటిసారి వచ్చినప్పుడు ఆమె అడిగిన పువ్వుల్ని సర యిన టైముకి కోసి తీసుకురాలేకపోయాడు మన గండయ్య.

అందుకని అతనిమీద అగ్గిగుగ్గిలం అయిపోయింది ఆ బిడ్డ. యజ మానులు చెప్పిన కార్యాన్ని తు.చ. తప్పకుండా సరయిన టైముకి చేసి చూపించాల్సిన పనివాళ్ళం మనం.... వాళ్ళకి మనమీద కోపం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే" అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇచ్చాడు వంటవాడు అవతారం.

"చెప్పిన పనిని సరయిన టైముకి ఎందుకు చేయలేదో, ఆలస్యానికి కారణం ఏమిటో అని అడగాల్సిన బాధ్యత వాళ్ళకి మాత్రం లేదా? నోటికి వచ్చినట్టు మాట్లాడ్డమేనా?" రోషంగా అడిగింది సీతమ్మ.

"నోటికి వచ్చినట్లు ఎవరు మాట్లాడారు? ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు అవతారం.

"ఎవరు మాట్లాడారో, ఎప్పుడు మాట్లాడారో తెలియనట్టు ముఖం

పెడతావేంటి? కిందటిసారి ఆ బ్రహ్మరాక్షసి ఇక్కడికి వచ్చినప్పు అదేగా జరిగింది?"

చిన్నబాబు కాలేజీలో ఏదో ఫంక్షన్ వుందని చెప్పి, మన గార్డెన్‌లో వున్న పూలన్నిటినీ కోసుకురమ్మని గండయ్యకు ఫోన్‌చేసి చెప్పాడు చెపుతున్నప్పుడు ఈ సివంగి హాల్లోనే వున్నది. ఆ మాటల్ని తనకూ విన్నది.

తీరా గండయ్య పూలుకోసుకుని కార్లో చిన్నబాబు దగ్గిరికి వె ముందు ఆర్డర్ పాస్‌చేసింది తనకు పువ్వులు కావాలని....చిన్నబాబు ఎదు చూస్తుంటాడని, అక్కడినించి వచ్చిన తర్వాత కోసి ఇస్తానని గండయ చెప్పాడు. అంతే! పిడుగులుపడి బిల్డింగ్ కూలిపోయినట్లు గోల మొద పెట్టింది ఈ అమ్మవారు. పాపం గండయ్య.... అదృష్టం బాగుండి తట్టు గలిగాడు" ఆరోజు సంఘటనను గుర్తుచేసుకుంటూ చెప్పింది సీతమ్మ.

"ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటి?" చిరాకుగా అడిగా అవతారం.

"ఏమీలేదు. ఆవిడగారు ఇక్కడ ఎన్ని రోజులుంటుందో తెలియ వున్నన్నిరోజులు మనం ఒళ్ళు దగ్గిరపెట్టుకుని బతకాలి. ముఖ్యంగా చి బాబును గురించి మహా ఆరాతీస్తుంది. మరియమ్మ కూడా మహా జాగ్ర వుండాలి" అంటూ ముగించింది సీతమ్మ.

"నా సంగతి నీకు తెలుసుగా సీతమ్మా! నన్ను ఎన్ని మాటల మన్నా పడతాను. నా చిన్నబాబు జోలికి వస్తేమాత్రం చంపి పారేస్తా ఆ తర్వాత నన్ను జైల్లోపెట్టినా పరవాలేదు" అంటూ విసవిసా అక్క నించి వెళ్ళిపోయింది మరియమ్మ.

"ఇదిగో సీతా! ఈ నాలుగురోజులు నువ్వు మరియమ్మని ఒకక కనిపెట్టుకుంటూ వుండు. ఆ సరితమ్మ చూపు మంచిదికాదు. చిన్నబాబు వడి ఒకటే ఏడుపు ఏడుస్తుంది. ఆ పద్ధతి మరియమ్మకి ఏమాత్రం నచ్చ కోపం వచ్చిందంటే ఎంతటి మాటైనా తేలిగ్గా అనేస్తుంది. పెద్దబాబుగా తెలిస్తే బాధపడతారు. నువ్వు మరియమ్మను కాచుకోవాలి" చిన్న కంఠ తన భార్యకు చెప్పాడు అవతారం.

"ఆ మాట నువ్వు నాకు పనికట్టుకుని చెప్పాలా? నాకు తెలి



అవన్నీ నేను చూసుకుంటా. ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు ఆ గయ్యాళి నీమీద పడకుండా నువ్వు చూసుకో. పెద్దబాబు మాదిరి వండి వడ్డించినదాంతో తృప్తిపడదు. వంకలు పెడుతుంది" అంటూ ఇవతలకు వచ్చేసింది సీతమ్మ.

సరిగ్గా అప్పుడే ఆమెను పిలిచాడు మధ్యహాల్లో కూర్చునివున్న సురేంద్రసాబ్.

"ఇదిగో సీతమ్మా! అమ్మాయి వస్తోంది. దిష్టి తీసేయడానికి ఏర్పాట్లు చూడు. తనతోపాటు తన కొడుకును కూడా తీసుకువస్తోంది" దగ్గిరికి రాగానే తన మనసులోని మాటను బయటపెట్టాడాయన.

"అమ్మాయిగారితోపాటు ఆ బాబుకు కూడా తీసేస్తాను అయ్యగారూ దిష్టి. కాలేజీలు నడుస్తున్న రోజులు ఇవి. చదువు మానుకుని ఆ బాబు ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లో?" అంటూ తన మనసులోని అనుమానాన్ని బయటపెట్టింది సీతమ్మ.

"అవన్నీ మనకి తెలీవు. వస్తోందిగదా.... తనే చెపుతుంది. చిన్నబాబు వెళ్ళిపోయాడా?" అడిగాడాయన.

"ఎప్పుడో వెళ్ళిపోయాడు. ఇప్పటిదాకా ఎందుకు వుంటాడు? మధ్యాహ్నం కాలేజీకి వంటకూడా అయిపోవస్తోంది" అంటూ వెనుతిరగబోయి, ఆగిపోయింది సీతమ్మ. వేగంగా వచ్చి పోర్టికోలో ఒక టాక్సీ ఆగడమే అందుకు కారణం.

"కట్టకట్టుకుపోయేందుకు కావాల్సినంతమంది పనివాళ్ళు ఇక్కడ తగలబడ్డారు. ఒక్కళ్ళంటే ఒక్కళ్ళుకూడా స్టేషన్‌కి రాలేదు. మా నాన్న మంచితనాన్ని అలుసుగా తీసుకుని ఆడింది ఆటగా, పాడింది పాటగా చలామణీ అయిపోతున్నారు. వరుసపెట్టి పనిలోనుంచి తీసేయాలి అందరినీ.... అప్పుడుగాని బుద్ధిరాదు" వచ్చీ రావడంతోనే పెద్ద కంఠంతో పనివాళ్ళందరినీ ఆడిపోసుకుంటూ ఆ టాక్సీలోనుంచి దిగింది సురేంద్రసాబ్ యొక్క ఏకైక కుమార్తె సరితాదేవి.

కాస్తంత ఊపిరి పీల్చుకుని ఆమె మరోసారి తిట్లవర్షం కురిపించకముందే, గేటు దగ్గిర్నించి పరిగెత్తుకుంటూ వచ్చాడు వహీద్. లోపలినుంచి తన అసిస్టెంట్స్‌తో అవతారం అక్కడ ప్రత్యక్షం అయ్యాడు. మూడు

సూట్‌కేసులు, రెండు ఎయిర్‌బ్యాగ్‌లు, రెండు పెద్ద పెద్ద ప్లాస్టిక్ సంచుల్ని తీసుకువచ్చింది సరితాదేవి.

"నీకోసం పీటర్ స్టేషన్‌కి వచ్చాడమ్మా! నువ్వు ప్రయాణం పెట్టుకోగానే ఫోన్‌చేసి వుండాలి. ప్రయాణం ఆఖరు కాబోతుండగా ఫోన్ చేస్తే, సమయానికి మనవాళ్ళు సిద్ధంగా వుండకపోవచ్చు. లోపలికిరా తల్లీ!" సింహద్వారం దగ్గిరికి వచ్చి అప్యాయంగా మాట్లాడాడు సురేంద్ర సాబ్ ఆమెను శాంతపరుస్తున్నట్టుగా.

ఐదు అడుగుల ఏడు అంగుళాల ఎత్తున్న తన కొడుకు సోహన్ వంక కోరగా చూసింది సరితాదేవి.

"బొమ్మరాయిమాదిరి అలా కదలకుండా నిలబడిపోయావేమిటి? వెళ్ళి తాతగారికి నమస్కారం చెయ్యి....అయన ఆశీర్వాదం తీసుకో" అంటూ కమాండ్ చేసింది.

*    *    *    *

ఠెంగున కదిలి గబగబా మెట్లుఎక్కి, సురేంద్రసాబ్ పాదాలను తాకాడు సోహన్. "నన్ను ఆశీర్వదించండి తాతయ్యా! మీ మాదిరిగా పెద్ద పేరు తెచ్చుకోవాలని నా కోరిక" అంటూ తన మనోరథాన్ని వెల్లడించాడు.

"మీరంటే వాడికి వల్లమాలిన అభిమానం. మా ఆయన తరఫు బంధువులు ఎంతోమంది వున్నారు. వాళ్ళని పట్టించుకోడు వీడు. ఎప్పుడు చూసినా నైజాం తాతయ్య దగ్గిరికి పోదాం....నైజాం తాతయ్యతో మాట్లాడదాం అంటూ ఒకటే నస....భరించడం నావల్ల కాదనిపించి తీసుకువచ్చేశాను. వాడిని ఒక దారిలో పెట్టాల్సిన బాధ్యత ఇక మీదే.... వాడి భారం ఇకనుంచీ మీరు మోయాల్సిందే!" అంటూ ముందుకొచ్చింది సరితాదేవి.

పంటఇంట్లోకి పోయి దిష్టితీయడానికి అవసరమైన సామగ్రిని తీసుకు వస్తోంది సీతమ్మ.

"ఈ బాబు భారం ఇకనుంచి పెద్దబాబుదా? అంటే అర్థం ఏమిటి? ఈయనగారు ఇక్కడే మకాం పెడ్తాడనా?" సరితాదేవి లగేజీని లోపలికి తీసుకువస్తున్న తన పెనిమిటిని అనుమానంగా అడిగింది.

"నోరుమూసుకుని నీ పనేదో నువ్వు చూసుకో. వెధవ మాటలు



మాట్లాడబోకు" చికాకుగా అంటూ లోపలికి వెళ్ళిపోయాడు అవతారం. హాల్లోకి ఎంటర్ కాబోతున్న సరితాదేవిని సింహద్వారం దగ్గిరే ఆపి, దిష్టి తీసింది సీతమ్మ. ఆవిడగారి బిడ్డడికి కూడా తీసింది.

"కిందటిసారి చూసినప్పటికంటె లావుగా తయారయ్యావ్.... మా నాన్నగారి తిండి బాగా పంటబడ్తోందన్నమాట....బాగుంది" వెటకారంగా అంటూ హాల్లోవున్న సోఫాల్లో ఒకదాంట్లో కూలబడింది సరితాదేవి.

సిల్వర్ ట్రేలో చల్లటి నీళ్ళు తీసుకువచ్చాడు అవతారం. ఇంకో ట్రేలో సెగలు వెలువడుతున్న చాయ్ కప్పులతో వచ్చింది మరియమ్మ.

"ఓహో ....మరియమ్మా....నువ్వు పనిమానేసి బయటికి వెళ్ళిపోయి వుంటావని అనుకున్నా....మానేయలేదన్నమాట....బాగుంది. చాలా బాగుంది" ఇంకోసారి తన అభిప్రాయాన్ని వెల్లడించింది సరితాదేవి.

తల వంచుకుని వేగంగా ఇవతలికి వచ్చేసింది మరియమ్మ. ఆ రోజు రెండవసారి బుగ్గలమీదికి జారాయి కన్నీళ్ళు. "పట్టించుకోబోకు.... మనకి మన పెద్దబాబు ముఖ్యం....చినబాబు ముఖ్యం. మిగిలిన వాళ్ళందరూ ఎందుకూ పనికిరానివాళ్ళు. వాళ్ళ మాటల్ని అసలు మనం వినిపించుకోవాల్సిన అవసరంలేదు" ఆమె భుజం తడుతూ అనునయంగా అన్నది సీతమ్మ.

"చూడు....వచ్చి పది నిముషాలు అయిందోలేదో....ఎలా దాష్టీకం మొదలుపెడుతుందో....స్నానం చేయాలని అంటుంది. నీళ్ళు వేడిగావుంటే, చన్నీళ్ళు చేస్తానంటుంది. చన్నీళ్ళే అంటే వేడినీళ్ళు తోడలేదేమని అరుస్తుంది. ఈవిడతో వేగడం చాలా కష్టం" అంటూ కళ్ళు తుడుచుకుని లోపలిగదుల్లోకి వెళ్ళింది మరియమ్మ.

"సీతమ్మా....ఆ మరియమ్మ ఏం చేస్తోంది? స్నానం చేయాలి.... బాత్‌రూమ్‌లో నీళ్ళు రెడీగా పెట్టమను" హాల్లోనుంచి అరిచింది సరితాదేవి.

"నువ్వు అరవాల్సిన అవసరంలేదు తల్లీ. మరియమ్మకి నీ గురించి పూర్తిగా తెలుసు....ఏర్పాటు చేస్తూ వుంటుంది" చిన్నగా చెప్పాడు సురేంద్రసాబ్.

*    *    *    *

"సీతమ్మా....మా అబ్బాయికి మేడమీది గదిని రెడీచెయ్" అంటూ సీతమ్మకి ఆర్డర్ ఇచ్చింది సరితాదేవి.

"మేడమీది గదులన్నీ చిన్నబాబు వాడుకుంటున్నారు—" ముందుకు వచ్చి చెప్పబోతుండగా చేయి ఎత్తి ఆపేశాడు సీతమ్మని, సురేంద్ర సాబ్.

"మేడమీది గదులు వద్దు. కిందనే దక్షిణం పక్క గదులు సిద్ధం చెయ్" అని చెప్పాడు.

"అదిగో చూశావా....వచ్చి ఇంత సేపు అయింది. మన చినబాబును గురించి ఒక్క మాటైనా అడిగిందా?" వెనక్కి వస్తూ, తన పెనిమిటితో మాట్లాడింది సీతమ్మ.

"ఓరినాయనో....మీ ఆడవాళ్ళకు ఆడిపోసుకోవడం తప్ప ఇంకో పనంటూ ఏమీ వుండదు కాబోలు....ఆవిడగారు అడగకపోతే చిన్నబాబుకు వచ్చే నష్టం ఏమీ లేదుగాని, ముందు నువ్వు నోరు మూసుకుని అవతలికి పో" విసురుగా అరిచినంత పనిచేశాడు అవతారం.

మూతిని మూడువంకర్లు తిప్పి, దక్షిణం పక్క గదుల్ని సిద్ధం చేయడానికి రెడీ అయింది సీతమ్మ.

"దీపక్‌గాడు ఏడి? కనిపించడంలేదేమిటి?" వున్నట్లుండి సురేంద్ర సాబ్‌ని అడిగింది సరితాదేని.

"వాడు ఇప్పుడు ఎందుకు కనిపిస్తాడు? కాలేజీటైముకదా ఇది....అవును తల్లీ, నీ కొడుకు ఏం చదువుతున్నాడు?" అడిగాడు సురేంద్ర సాబ్.

"వాడికి చదువుమీద అంతగా ఇంట్రెస్టులేదు నాన్నగారూ....వ్యాపారం ఏదో చేస్తాడంట. అలాంటి వ్యవహారాల్లో తనకి అనుభవం లేదని, మీ దగ్గిరికి తీసుకుపొమ్మని మా ఆయన చెప్పారు. మీరే వాడిని ఆదుకుని పెద్దవాడిని చెయ్యాలి....ఈ మాట చెప్పడంకోసమే వచ్చాను నేను" అసలు విషయం చెప్పింది సరితాదేవి.

"చదువుకోవాల్సిన వయసులో వ్యాపారం ఏమిటమ్మా?" ఆశ్చర్యంగా అడిగాడు సురేంద్రసాబ్.

"మీరు ఏం చెబితే అది చేస్తాను తాతగారూ....చదువుమీద నాకు



ఇంట్రెస్టులేదు. బిజినెస్ చెయ్యాలనే వుంది. మీరు కాదంటే మీ ఇష్టం వచ్చిన కాలేజీలో చేర్పించండి. చదువుకుంటాను" వెంటనే అన్నాడు సోహన్.

"ఇష్టంలేని పనులు చేయడం అనవసరం. స్నానంచేసి రిలాక్స్ అవండి....సాయంత్రం మాట్లాడుకుందాం" అంటూ సోఫాలోనుంచి లేచారు సురేంద్రసాబ్.

తను కూడా సోఫాలోనుంచి లేచి నిలబడింది సరితాదేవి. ఆయన తన రూమ్‌లోకి వెళ్ళిపోయిన తర్వాత కొడుకువైపు చూసి అదోమాదిరి నవ్వింది.

"నేను వ్యాపారం చెయ్యడం తాతయ్యకి ఇష్టంలేనట్టు కనిపిస్తోంది" చిన్న కంఠంతో అన్నాడు సోహన్.

"ఆయన అట్లాగే అంటాడు....వెయ్యి ఎకరాలదాకా వుంది ఆయన భూమి....రియల్ ఎస్టేట్ వ్యాపారంచేస్తే ఇంతకు ఇంత సంపాదించుకోవచ్చు....నువ్వు జాగ్రత్తగా మేనేజ్ చెయ్యి....చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యాలి" అంటూ తమకు కేటాయింపబడిన గదులకేసి దారి తీసింది ఆమె.

## 7

పంచిన తల ఎత్తకుండా సీరియస్‌గా నోట్స్ రాసుకుంటున్న దీపక్ దగ్గిరికి పరుగులాంటి నడకతో వచ్చారు పదిమంది స్టూడెంట్స్.

"అరే దీపక్ భాయ్....ఇంకా ఇక్కడే కూర్చున్నావేంటి బే? స్ట్రయిక్ చేస్తున్నాం మనం. గేటు బయటికి వెళ్ళిపోవాలె" అతని చెయ్యి పట్టుకుంటూ హెచ్చరించాడు ఒక స్టూడెంట్.

"స్ట్రయిక్ చేస్తున్నామా? ఎందుకు?" అడిగాడు దీపక్.

"ఫస్ట్ ఇయర్ పోరగాడిని ఉట్టిపుణ్యానికి తిట్టాడు మన పి. డి. సారు....గ్రౌండ్‌లో నుంచి బయటికి పొమ్మని ఒంటిమీద చెయ్యివేసి వెనక్కి నెట్టాడు."

"పి.డి. సార్ అలాంటివాడు కాదు. ఆయన ఏదైనా మాట అంటే అందుకు కారణం ఏదో వుండే వుంటుంది. అదేమిటో తెలుసుకోకుండా-" అని అనునయంగా చెప్పబోతున్న దీపక్ చేతిని పట్టుకుని మరింత బలంగా ముందుకు లాగాడు ఆ స్టూడెంట్.

"పి.డి.సారు ఎలాంటివాడో నీకూ నాకూ అనవసరం. కాలేజీ ఎగ్గొట్టడానికి మంచి ఛాన్సు దొరికింది....సంపూర్ణ థియేటర్లో కొత్త సినిమా వచ్చింది. మేం పోతున్నాం. నువ్వు కూడా రావాలి" అంటూ అతని నోట్సుల్ని తీసుకుని బయటికి పరిగెత్తాడు మరో స్టూడెంట్.

తనమాట ఎవరూ వినిపించుకోరని అర్థం అయింది దీపక్‌కి. "మీరు వెళ్ళి సినిమా చూసిరండి....నాకు ఒక అర్జంట్ పని వుంది" అంటూ వారిని ఒప్పించి, తన నోట్సులు తను తీసుకున్నాడు దీపక్.

"మేము అటుపోయాక నువ్వు మళ్ళీ క్లాసులో దూరకు....మాట అంటే మాటే....మనం అంతా ఒకే మాటమీద నిలబడి వుండాలి" అంటూ హెచ్చరికలుచేసి, తమదారిన తాము వెళ్ళిపోయారు అతని దోస్తులు.

గుంపులు గుంపులుగా కాలేజీ గేటుదగ్గిర గుమిగూడుతున్న స్టూడెంట్స్‌ని గమనిస్తూ, ఎదురుగావున్న రోడ్డుని నెమ్మదిగా క్రాస్ చేశాడు దీపక్.

పి.డి.సార్‌తో గొడవ ఎప్పుడు జరిగిందో తెలీదుగాని, అప్పుడే పెద్ద పెద్ద అట్టలమీద రకరకాల స్లోగన్స్‌ని ప్రింట్ చేయించి తీసుకువచ్చారు స్ట్రయిక్‌ని ఆర్గనైజ్ చేస్తున్న లీడర్స్. పెద్ద పెద్ద గొంతుకలతో కాలేజీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

"అనవసరంగా స్ట్రయిక్ చేస్తున్నారు....అసలు జరిగింది ఏమిటో తెలీకుండా...." మరోసారి తన పక్కనే వున్న స్టూడెంట్‌తో చెప్పబోతూ ఆఖరి క్షణంలో ఆ మాట తనలోనే అదిమేసుకున్నాడు దీపక్.

తళతళ మెరిసిపోతున్న కారు ఒకటివచ్చి అతనికి దగ్గర్లో ఆగింది. తళుక్కుమంటూ అందులోనుంచి దిగి అతనివంక చూసి అందంగా నవ్వింది శృతి మేడమ్.

ఆమెను చూస్తూనే "హల్లో....ఈ టైములో ఇలా రోడ్లు పట్టుకు తిరుగుతున్నావేమిటి?" అని అడుగుతూ ఆమెకేసి అడుగు కదిపాడు దీపక్.



సరిగ్గా అప్పుడే అటుగా వెళుతూ అతన్ని బలంగా ఢీకొట్టాడు ఒక దృఢకాయుడు.

తూలి, ముందుకు పడిపోబోయి, ఆఖరి క్షణంలో బ్యాలెన్స్ నిలబెట్టుకున్నాడు దీపక్.

తనను ఢీకొట్టిన మనిషివంక కాస్త సీరియస్‌గానే చూసాడు.

"ఏంటీ చూస్తున్నావ్. కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడవడమే కాకుండా రివర్స్ గేర్‌లో పోట్లాడడానికి వస్తున్నావా?" తనదారిన తను వెళ్ళిపోకుండా కోపంగా అడిగాడా మనిషి.

అతన్ని ఎప్పుడూ చూసి వుండకపోవడంతో, రియాక్ట్ అవలేదు దీపక్.

"నేను కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడవడంలేదు. మీరే చూసుకోకుండా వచ్చి మీదపడ్డారు....ఇట్సాల్‌రైట్....మీరు వెళ్ళిపొండి" అని శృతివైపు తిరిగాడు.

వెళ్ళిపోలేదు ఆ మనిషి. "గుండెలు పగిలిపోయేటట్లు ఢీకొట్టడమే కాకుండా, ఏమీ జరగనట్టు అవతలికి వెళ్ళిపొమ్మంటావా? పొగరు బలిసిపోయింది బే నీకు....కండకావరంతో కళ్ళు మూసుకుపోయాయి...." అంటూ పిడికిలి బిగించి దభీమని కొట్టాడు భుజంమీద.

తగిలివుంటే భుజం విరిగిపోయినంత బాధతో విలవిలలాడిపోయి వుండేవాడు దీపక్. తను అవతలికి వెళ్ళిపొమ్మని చెప్పినా, ఆ మనిషి అలా చేయకుండా నోరుపారేసుకోవడం మొదలుపెట్టగానే ఎలర్ట్ అయిపోయాడతను. నేర్పుగా పక్కకు జరిగి భుజంమీద పడబోతున్న దెబ్బను త్రుటిలో తప్పించుకున్నాడు.

"ఏమిటీ గోల? ఇతను ఎవరు? ఎందుకు అలా రెచ్చిపోతున్నాడు?" ఏమీ అర్థంకాక ఆశ్చర్యంగా చూస్తూ అతన్ని అడిగింది శృతి మేడమ్.

ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పే అవకాశం దీపక్‌కి లభించలేదు. పిడికిటిపోటునుంచి అతను తప్పించుకున్న వెంటనే, మరింత వికృతంగా తయారయింది ఆ మనిషి ముఖం. పళ్ళు పటపటమని కొరుకుతూ, ఒక అడుగు ముందుకు వేసి, చేతిని విసిరాడు బలంగా.

ఎంత ప్రయత్నించినా ఆ దెబ్బ నుంచి తప్పించుకోవడం అసాధ్యం అయిపోవటంతో, వెనక్కి తూలి వెల్లకిలా పడ్డాడు దీపక్ ఫుట్‌పాత్ మీద.

"అయ్యయ్యో....ఏమిటిది? ఏమిటి ఈ దురాగతం? ఆగండి...." ఆందోళన నిండిన కంఠంతో తన భయాన్ని వెల్లడిస్తూ ముందుకు అడుగు వేసింది శృతి.

"రండిరా....త్వరగా రండి....రండి" భుజంమీది నించి వెనక్కి చూస్తూ ఎవరినో పిలిచాడు దీపక్‌ని ఎటాక్ చేసిన మనిషి. బిలబిలలాడుతూ వచ్చేశారు మరో పదిమంది ఆగంతకులు. వచ్చీరావడంతోనే దీపక్‌ని చుట్టుముట్టి తమ బూటుకాళ్ళతో ఫుట్‌బాల్‌ని తన్నినట్లు భీకరంగా తన్నడం మొదలుపెట్టారు.

"ఆగండి....ఆగండి" ఆందోళనతో కంపించిపోయి అరిచింది శృతి మేడమ్ మరోసారి.

తనే స్వయంగా వారిలో ఒక ఆగంతకుడి షర్టును పట్టుకుని వెనక్కి లాగడానికి ట్రై చేసింది.

పళ్ళు బిగించి ఎర్రటి కళ్ళతో మహా వికృతంగా చూస్తూ రబ్బర్ బొమ్మను విదిలించినట్టు ఆమెను విదిలించిపారేశాడు ఆ వ్యక్తి.

తూలుకుంటూ వెనక్కిపోయి తన కారును ఆసరాగా చేసుకుని, పడిపోకుండా నిలబడగలిగింది శృతి.

ఆ దృశ్యాన్ని చూసి కంగారుగా స్టీరింగ్ ముందునుంచి దిగాడు ఆమె కారు డ్రయివర్.

"అమ్మా....దెబ్బతగిలిందా?" అని అడుగుతూ ఆమె దగ్గరకి వచ్చాడు కంగారుగా.

"నాకేమీ తగలలేదు. ముందు వాళ్ళని ఆపేయ్. దీపక్‌ని చంపేస్తున్నారు" భయంతో గొంతు గద్గదమవుతుండగా అతనికి చెప్పింది శృతి మేడమ్.

"అరేయ్...ఆగండిడా...ఆగండి....ఆగిపోండి... ఎవరనుకున్నార్రా అతను? సురేంద్రసాబ్ మనవడు. ఆగిపోండి" అని అరుస్తూ ముందుకు అడుగువేశాడా డ్రయివర్. శృతి మేడమ్‌కి పట్టిన గతే అతనికి కూడా



పట్టింది. అతను బ్యాలెన్స్ సరిచేసుకుని నిటారుగా నిలబడే సమయానికి అంతం అయిపోయిందా గలాటా.

ఒకేసారి వెనక్కి తిరిగి చిటికెలో మటుమాయం అయిపోయారు ఆ ఆగంతకులు.

బూటుకాళ్ళ దెబ్బలు చాలా బలంగా తగిలాయి దీపక్‌కి. కిందనించి లేచే అవకాశం లభించకపోవడంవల్ల చేతకానివాడిలా తన్నులు తిన్నాడు అతను.

"దీపక్....దీపక్....ఎలా వుంది దీపక్? ఆర్ యూ ఆల్‌రైట్?" ఆందోళనగా అడుగుతూ అతని దగ్గరకిపోయి అతికష్టంమీద పైకి లేపింది శృతిమేడమ్.

"డాక్టర్ దగ్గరకిపోదాం. వెంటనే వెళ్ళిపోదాం" అంటూ అతన్ని తన కారు దగ్గరకి నడిపించింది.

కారు దగ్గరకి రావడమైతే వచ్చాడుగాని లోపల కూర్చోవడానికి నిరాకరించాడు దీపక్. "ఐ యామ్ ఆల్‌రైట్....భరించలేని దెబ్బలు ఏవీ తగలలేదు. మావాళ్ళు స్ట్రయిక్‌చేస్తున్న మూడ్‌లోవున్నారు. వెనక్కి చూడలేదు. చూసివుంటే కథ ఇంత దూరం వచ్చేదికాదు" కాలేజీ గేటుమీదే దృష్టిని నిలిపి గొంతులు చించుకుంటున్న తమ స్టూడెంట్స్ వంక చూస్తూ అన్నాడు.

నిజమే....ఎర్రబడిన ముఖాలతో గొంతులు చినిగిపోయేట్టు అరుస్తున్న స్టూడెంట్స్‌లో ఒక్కళ్ళు కూడా వెనక్కి చూసుకోవడంలేదు.

"నీళ్ళు తాగు....మంచినీళ్ళు తాగు" అంటూ వెనక సీట్లో వున్న ఒక వాటర్ బాటిల్‌ని దీపక్ చేతిలోపెట్టి, తన సెల్‌ఫోన్‌ని బయటికి తీసింది శృతి.

"ఫోన్ ఇప్పుడు ఎవరికి?" వాటర్ బాటిల్‌ని పెదవులకు ఆనించుకోబోతూ అడిగాడు దీపక్.

"మా మామయ్యకి....ఉట్టిపుణ్యానికి వచ్చి రాక్షసుల మాదిరి కలబడిన ఆ డర్టీ రోగ్స్‌ని ఊరికే వదిలిపెట్టకూడదు. వాళ్ళని నిలువునా నరికి పారేయాలి" అంటూ గబగబా నెంబర్‌ని ప్రెస్ చేయబోయిందామె.

వాటర్ బాటిల్‌ని వదిలేసి అర్జెంటుగా ఆమెను అడ్డుకున్నాడు దీపక్.

"వద్దు....ఫోన్ చేయవద్దు" అంటూ ఆమె చేతుల్లోంచి ఫోన్‌ని లాగేసుకున్నాడు.

"దెబ్బలు తిన్నట్టు మా మామయ్యకి తెలిస్తే పరువులు పోతయ్యని భయమా?" సీరియస్‌గా అడిగింది.

*   *   *   *

"అటువంటిది ఏమీ లేదుగాని, ఈ సంగతిని ఇక్కడితో వదిలెయ్. మీ మామయ్య వెళ్ళి మా తాతగారికి చెపుతాడు. ఆయన నన్ను కాలేజీ మాన్పించి ఇంట్లో కూర్చోపెమంటాడు. మా తాతగారికి ఇట్టాంటి పనులు ఎందుకో నచ్చవు. హీ విల్ బి వెరీ సీరియస్....అర్థం అయిందా?" అంటూ డోర్‌ని తెరిచిపట్టుకుని ఆమెను ఎక్కమని సైగచేశాడు దీపక్.

"మీ తాతగారంటే అంత భయం వున్నవాడివి, ఇట్లాంటి నాస్టీ సిచ్యుయేషన్స్‌లో చిక్కుపడకూడదు. ఎట్‌లీస్ట్ డాక్టర్ దగ్గరకైనాపోదాం" కార్లో కూర్చుంటూ అన్నది శృతి మేడమ్.

"అవసరంలేదు మేడమ్....ఐయామ్ క్వయిట్ ఆల్‌రైట్....నువ్వు వెళ్ళిపో" అంటూ డోర్‌ని క్లోజ్‌చేసి డ్రయివర్‌కి సైగ చేశాడు దీపక్. అక్కడినించి ఎప్పుడు వెళ్ళిపోదామా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు శృతిమేడమ్ డ్రయివర్. రెండోసారి చెప్పించుకోకుండా, ఒక్కసారిగా కారును ముందుకు దూకించాడు.

అది దృష్టిపథంనుంచి దూరం అయిపోయేదాకా నిఠారుగానే నిలబడ్డాడు దీపక్. ఆ తరువాత నెమ్మదిగా ఫుట్‌పాత్ మీద కూలబడ్డాడు. అప్పుడు కూడా అతన్ని గురించి పట్టించుకోలేదు అతని క్లాస్‌మేట్స్. తమ గొడవలో తాము బిజీగా వుండిపోయారు.

ప్యాంటుజేబులో నుంచి సెల్ బయటికి దీశాడు దీపక్. పాడైపోయి కనిపించింది అది. గుర్తు తెలియని ఆగంతకులు తన్నిన తన్నుల ధాటికి ఎందుకూ పనికిరాకుండాపోయింది అతని సెల్‌ఫోన్.

విసుగ్గా ముఖంపెట్టి విసిరి అవతలకు కొట్టాడు దీపక్ దాన్ని. ఆగంతకుల దెబ్బలకు పలుగులతో పొడిచినట్లు పోటెత్తిపోతున్న కాళ్ళు చేతుల్ని అతి బలవంతంమీద కదిలించి ఫుట్‌పాత్ మీదినించి లేచాడు.

# 8

మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అదేపనిగా మోగడం మొదలుపెట్టిన టెలిఫోన్ దగ్గరకి, పీటర్‌కంటె ముందుగా వెళ్ళి రిసీవర్‌ని తీసుకున్నది అక్కడే మెయిన్ హాల్లో కూర్చుని వున్న సరితాదేవి.

"హల్లో....నేను సురేంద్రగారి అమ్మాయి సరితను మాట్లాడుతున్నాను. మీరు ఎవరు?" అని అడిగింది.

అవతలివైపునుంచి వినవచ్చిన మాటల్ని చాలా శ్రద్ధగా వింది. సీరియస్‌గా వుండే ఆమె ముఖంలో చిన్న చిన్న మొలకనవ్వులు ప్రత్యక్షం అవడం హాలు ఎంట్రన్స్‌లోనే ఆగిపోయిన పీటర్‌కి కనిపించింది.

"ఎవరు మేడమ్? మీ ఫ్రెండ్స్ ఎవరైనా చేశారా?" క్యాజువల్‌గా అడిగాడు ఆమె కోపంగా చూస్తే తలవంచుకుని అవతలకు వెళ్ళిపోవడానికి రెడీ అవుతూ.

"మా ఫ్రెండ్స్ కాదు. మీ అయ్యగారి ఫ్రెండ్స్....లాయర్ దామోదరం. ఇందాక మీ చిన్నబాబుని అతని కాలేజీ దగ్గర ఎవరో రౌడీలు చితక్కొట్టి చింతకాయపచ్చడి చేశార్ట. ఆయన మేనకోడలు శృతి కళ్ళెదుటే జరిగిందిట అది. అతను ఇంటికి వచ్చాడా అనడుగుతున్నాడు" అంటూ అది ఏదో చాలా తేలికపాటి ఇన్ఫర్మేషన్ అన్నట్లు సోఫాదగ్గరకి పోయింది సరితాదేవి.

ఝల్లుమన్నాయి పీటర్ గుండెలు. హార్ట్‌ఎటాక్ వచ్చినట్లు చెమటలు ప్రత్యక్షం అయ్యాయి అతని ముఖంమీద. "చిన్నబాబుని రౌడీలుకొట్టారా? కాలేజీ దగ్గరా? శృతి మేడమ్ చూస్తూ వుండగానేనా?" అని అడుగుతూ రెండు అంగల్లో ఫోన్ దగ్గరకి వచ్చాడు.

"అవును పీటరూ....ఆ శృతి మేడమ్ అందంగా వుంటుందా? ఆ పిల్లకు పెళ్ళైందా?" అడిగింది సరితాదేవి.

ఆ మాటలు తనకు వినబడనట్టు ఫోన్‌ని తీసుకుని గబగబా దామోదరం నెంబర్ని ప్రెస్ చేయబోయాడు.

"అడిగినదానికి సమాధానం చెప్పవేంటి? ఇప్పుడు ఫోన్ ఎవరికి

చేస్తున్నావ్?" వున్నట్టుండి పీటర్ మీద గయ్యిమని అరుస్తూ అడిగింది సరితాదేవి.

"దామోదరంగారికే మేడమ్....చిన్నబాబూ ఇప్పుడు...." అనబోయాడు పీటర్.

"దామోదరంగారికా? ఎందుకు? ఆయన చెప్పింది నేను విన్నాను కదా....మళ్ళీ ఫోన్‌చేసి డబ్బులు తగలబెట్టడం దేనికి? పెట్టెయ్....ఫోన్ పెట్టెయ్...." మరింత స్పీడ్‌గా పీటర్‌మీద అరిచింది సరితాదేవి.

చటుక్కున రిసీవర్‌ని ఫోన్‌మీద పడేసి, తన చెవుల్ని తనే నమ్మలేనట్టు ఆమెవంక ఆశ్చర్యంగా చూశాడు.

"మా నాన్నగారి మంచితనం మీకు చేతకానితనం మాదిరి కనిపిస్తోంది....గాదెకింద పందికొక్కుల మాదిరి ఇల్లుగుల్ల చేస్తున్నారు.... చెట్టంత మనిషిని నేను చెప్పిన మాటలకు విలువలేదు....మళ్ళీ ఫోన్ చేస్తార్ట....వీడి అబ్బసొమ్ము ఫోన్ బిల్లులు కట్టడానికి ఇక్కడ కుప్పలు పోసి వుంది" భక్తిపాటల క్యాసెట్ మాదిరి కంటిన్యూ అవడం మొదలు పెట్టింది సరితాదేవి కంఠం.

చెవులు మూసుకోవాలన్న కోరికను అతి బలవంతంగా అదుముకుంటూ, హాలు వెలుపలికి పరిగెత్తాడు పీటర్.

"ఎక్కడికి పోతున్నావ్? ఆగు....నాపాటికి నన్ను వాగుకుంటూ వుండమని నీదారిన నువ్వు పోతున్నావా? డర్టీ రోగ్ ఆగు" ఖంగుమంటున్న కంఠంతో అరిచింది.

ఆగలేదు పీటర్....అలా చేయడంవల్ల ఆ తరువాత చాలా ఇబ్బందిని ఫేస్ చేయాల్సి వస్తుందన్నమాటే అతని మనస్సులోకి ఎంటర్ కాలేదు.

"గండయ్యా....ఒరేయ్ గండయ్యా...." అని అరుస్తూ పోర్టికో మెట్లు దిగాడు పీటర్.

పోర్టికోని అనుకుని వున్న క్రోటన్ గుబుర్లను మరికాస్త అందంగా కట్ చేస్తున్నాడు గండయ్య.

"ఏంటి పీటరూ....ఏంటి కథ? సరితమ్మ కర్రపట్టుకుని వెంటపడు



తోందా?" చేస్తున్న పనిని ఆపకుండా నవ్వుతూ అడిగాడు గార్డెనర్ గండయ్య.

"ఓరినీ నవ్వు నువ్వూ....అవతల కొంపలు అంటుకుపోతున్నాయి. చిన్నబాబును కాలేజీ దగ్గిర ఎవరో కొట్టిపారేశార్ట....ఎక్కడున్నాడో తెలియదుట" అంటూ తన జేబులోనించి సెల్‌ని బయటికి తీశాడు పీటర్.

అతనిలాగా అటూ ఇటూ చూడలేదు గండయ్య. చేతిలో వున్న క్రోటన్స్ కత్తెరను అవతలకు విసిరికొట్టి, "రాంసింగూ....అరేయ్ రాంసింగూ....కారు తియ్యి....కమాన్" అంటూ గారేజి దగ్గిరికి పరిగెత్తాడు.

కారును శుభ్రంగా తుడిచి, దీపక్‌కి క్యారేజీ తీసుకువెళ్ళడంకోసం సిద్ధంగా నిలబడి వున్నాడు రాంసింగు....గండయ్య అరుపుల్ని వినగానే గబుక్కున స్టీరింగ్ ముందుకు దూకి, కారును కదిలించాడు.

నెమ్మదిగా రావాల్సిన కారు రయ్యిమని దూసుకువస్తూ వుండటాన్ని చూసి, గేటుకు అడ్డంగా నిలబడ్డాడు వహీద్. "ఎక్క....చిన్నబాబును ఎవరో కొట్టార్ట కాలేజీ దగ్గిర...." డోర్‌ని తెరిచిపట్టుకుంటూ గట్టిగా అరిచాడు వెనుక సీట్లో వున్న గండయ్య. గేటును మూయాలన్న మాటను కూడా మరిచిపోయి ఎగిరి దూకాడు వహీద్ అతని పక్కకి, "పోనీ...." అని ఆజ్ఞాపిస్తూ.

పళ్ళు బిగించి యాక్సిలేటర్‌ని అడుగుకంటా అదిమి పట్టుకున్నాడు రాంసింగ్. గాల్లో ఎగురుతున్నట్టు ప్రయాణం ప్రారంభించింది కారు.... ఇరవై రెండు నిముషాల తర్వాత కాలేజీ ముందు ఆగింది.

"అడుగు....చిన్నబాబు ఫ్రెండ్స్ ఎవరైనా వుంటే ఎక్కడున్నాడో అడుగు" గండయ్యని కారులోనుండి బయటికి నెడుతూ చెప్పాడు వహీద్.

అరిచి అరిచి గొంతులు నొప్పి పుట్టేసరికి, ఎవరికి వారు తలా ఒక పక్కకుపోయి నిలబడుతున్నారు ప్రొటెస్ట్ చేస్తున్న విద్యార్థులు.

"దీపక్‌ని మేము చూడలేదు....ఎక్కడ వున్నాడో మాకు తెలియదు...." గండయ్య తమ దగ్గిరికి వచ్చేసరికి, సాలోచనగా చెప్పారు వారిలో కొందరు,

"కాదు....అదుగో....అక్కడ వున్నాడు....అదుగో...." వున్న

ట్లుండి దూరంగా వున్న ఒక ఇరానీ హోటల్‌ని చూపిస్తూ చెప్పాడు అప్పుడే అటుగా వచ్చిన ఇంకో స్టూడెంట్.

రంయ్‌మంటూ ఆ ఇరానీ హోటల్ వైపు పరిగెత్తాడు గండయ్య. రాకెట్ మాదిరి అతన్ని అనుసరించింది రాంసింగ్ నడుపుతున్న కారు.

"దెబ్బలు తగిలాయి. కాదని అనడంలేదు....కానీ భరించలేనంతగా ఏమీ తగలలేదు. మా స్టూడెంట్స్ ఎవరైనా గమనిస్తారేమోనన్న భయంతో గబగబా తన్ని అవతలికి వెళ్ళిపోయారు.... అందువల్లే నేను సేఫ్ అయ్యాను" ఇరానీ హోటల్‌లో ఒక పక్కగా కూర్చుని వున్న దీపక్ నెమ్మదిగా జరిగింది చెప్పాడు వహీద్‌కి.

అతని భుజాల్ని, పక్క ఎముకల్ని మెత్తగా వత్తి చూస్తూ, "ఇంత బతుకూబతికి ఇంతెనకాల పడిపోయినట్టు, ఆళ్ళెవరో ముక్కూ ముఖం తెలియనివాళ్ళతో తన్నులు తినడం ఏమిటి దీపక్‌బాబూ....అందులోనూ శృతి మేడమ్ చూస్తుండగా, మన పరువు మట్టిపాలయిపోయింది" అన్నాడు వహీద్ కొంచెం బాధగా.

"శృతిమేడమ్ చూసినందువల్లొచ్చిన నష్టం ఏమీలేదు. నష్టం అంటూ వస్తే ఆవిడగారి మామయ్యవల్ల వస్తుంది. ఆయన ఫోన్‌చేసి తాత గారికి చెప్పేస్తాడు. లేదా తనే స్వయంగా ఇంటికి వచ్చి సవివరంగా రికార్డు వేస్తాడు....అదీ నా బాధ....తాతగారు నా టాప్ లేపేస్తారు" వహీద్ చూపుడు వేలు నడుముమీద ఒక ప్రదేశంలో పడేసరికి బాధగా నొసలు విరుస్తూ అన్నాడు దీపక్.

"ఆ మాట నిజమే....తన్నులు తినకముందు ఆలోచించుకోవాల్సిన విషయాలు ఇవి. తిన్న తర్వాత కాదు....వెన్నుపూస ఎనిమిదో బోన్ కొంచెంగా వాచింది. వేడినీళ్ళు కాపడంపెడదాం....రేపు ఉదయం ఆ[illegible]దంతో కొద్దిగా మసాజ్ చేస్తాను" అంటూ వెనక్కి జరిగి నిటారుగా నిలబడ్డాడు వహీద్.

"నొప్పిపుట్టే దెబ్బలే....డామేజ్‌చేసే దెబ్బలులేవు" అంటూ రాంసింగ్‌కీ, గండయ్యకి చెప్పాడు. "అయినాసరే ఒకసారి మన డాక్టర్‌గారి దగ్గిరికిపోయి రావడం బాగుంటుంది. పెద్దబాబుగారికి ఈ విషయం తెలిసిన వెంటనే ఆయన చెప్పేది అదే" అన్నాడు రాంసింగ్.



"అవసరంలేదు రాంసింగూ....వేడినీళ్ళతో స్నానంచేస్తే అన్ని నొప్పులూ సర్దుకుంటాయి. వహీద్ చెబుతున్నారుగా పెద్దవి ఏవీ లేవని. మన డాక్టర్‌గారికీ వహీద్‌కంటే ఎక్కువ తెలుసా?" అన్నాడు దీపక్.

రెండు అంగుళాలు విస్తరించినట్లయింది ఆ మాటల్ని వినేసరికి వహీద్ ఛాతీ. "అది సరే చిన్నబాబూ....రాంసింగ్ చెప్పినట్టు ఎందుకైనా మంచిది ఒకసారి మీరు డాక్టర్ దగ్గిరికి పోయిరావడం బెస్ట్. అరేయ్.... తీసుకుపో" అంటూ రాంసింగ్‌కి చెప్పాడతను.

"తీసుకుపో అంటున్నావ్? నువ్వురావా?" అయోమయంగా అడిగాడు రాంసింగ్.

"వస్తాను బే....ఇక్కడ నాకు చిన్నపని ఒకటి వుంది. ఇంకో అర గంటలో వస్తాను. నువ్వు, గండయ్య వెళ్ళండి" అంటూ హోటల్ వెలుపలికి బయలుదేరాడు వహీద్.

"పదండి చిన్నబాబూ....మనం డాక్టర్ దగ్గిరికిపోయి, అటునుంచి ఇంటికిపోదాం" కుర్చీలో వున్న దీపక్ భుజాన్ని పట్టుకుని పైకిలేపుతూ అన్నాడు రాంసింగ్.

## 9

దీపక్ ముందుగా ఊహించినట్లే మూడున్నర అవుతుండగా మొదలయింది ఆ గోల.

శృతిమేడమ్‌ని వెంటబెట్టుకుని ఏకాయెకిన సురేంద్రనాథ్ దగ్గిరికి వచ్చేశాడు లాయర్ దామోదరం. జరిగినదంతా కళ్ళకు కట్టేటట్లు వివరించి చెప్పాడు.

"అయ్యో....అయ్యో....సురేంద్రగారి మనవడు వీధిరౌడీలతో రోడ్డుమీద తన్నులుతినడం అంటే ఎంత పరువుతక్కువ! కాలేజీలో చదవడానికని పోయి ఇలాంటి చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడా? నాశనం అయిపోయింది ఈ ఇంటిపరువు" విపరీతమైన బాధతో గుండెలు బాదుకుంటూ కామెంట్ చేసింది సరితాదేవి.

* * * *

చిరాకుగా ఆమెవంక చూసి, దీపక్ వైపు తిరిగాడు సురేంద్రసాబ్. "నీకు లక్షసార్లు చెప్పాను....రౌడీలతో పరిచయాలు, ఇట్లాంటి పరిణామాలకే దారితీస్తాయని చెప్పినప్పుడు తల వూపుతావ్. నీకు బుద్ధిలేదు" ఒక్కొక్క మాటను పట్టిపట్టి ఉచ్చరిస్తూ కసురుకున్నాడు.

"అదికాదు తాతగారూ....అసలు జరిగింది ఏమిటో కాస్త వినండి" అంటూ సురేంద్రసాబ్‌ని కూల్‌డౌన్ చేయడానికి ట్రై చేశాడు దీపక్.

"నేను వినను. వినాల్సింది ఏమిటో దామోదర్ నోటివెంట విన్నాను. ఇవాల్టినుంచీ నువ్వు అసలు బయటికి పోవద్దు. కాలేజీ లేదు గీలేజీ లేదు. ఇంట్లోనే వుండు.... అంతే" ఖచ్చితమైన కంఠంతో ఎనౌన్స్ చేశాడు సురేంద్రసాబ్. ఆ మాటలు వింటూనే తన మామయ్య పక్కన మౌనంగా కూర్చునివున్న శృతిమేడమ్ ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయింది విపరీతమైన ఆశ్చర్యం.

"అదేంటి సార్! జరగరానిది ఏదో ఒకసారి జరిగితే, పూర్తిగా కాలేజీ మాన్పిస్తారా? కాలేజీ మానితే మరి చదువు?" కనుల్ని పెద్దవిచేసి అడిగింది.

"వాడు కాలేజీలో చదివి ఒరగబెట్టేది ఏమీలేదు. చదవకపోతే ఇప్పుడు వచ్చే నష్టమూ ఏమీలేదు. అరే....బయటికి పోయినవాడు తిన్నగా ఇంటికి వస్తాడనుకుంటే అలా రాడు. ఏరోజుకారోజు ఈ టెన్షన్‌ని భరించడం అసాధ్యమైపోతోంది. సో! రేపట్నుంచి కాలేజీ బంద్" మరోసారి ఖచ్చితంగా చెప్పాడు సురేంద్రసాబ్.

"పిచ్చిమాటలు మాట్లాడకు సురేంద్రా! అనవసరమైన తగాదాలు వద్దని చెప్పు. మా శృతి అంటున్నది నిజమే. చదువు మానకూడదు" ఆ గోలకు మూలకారకుడైన లాయర్ దామోదరం సడెన్‌గా ప్లేటు ఫిరాయించి దీపక్ తరఫున మాట్లాడటం మొదలుపెట్టాడు.

"ఎవరు ఎన్ని చెప్పినా నేను వినదలుచుకోలేదు.... దయచేసి ఈ టాపిక్‌ని వదిలేయండి" ఖంగుమంటున్న కంఠంతో అందరికీ చెప్పి "పోరా....పోయి మరియమ్మతో వేడినీళ్ళ కాపడం పెట్టించుకో. పో!" అని దీపక్‌వైపు తిరిగి కసురుకున్నాడు సురేంద్రసాబ్.

శృతి మేడమ్ ఎదుట ఆయన తనను మరీ చిన్నపిల్లాడిని అదిలించి



నట్టు అదిలించడం దీపక్‌కి నచ్చనిమాట యదార్థం. అయితే అందుకు నిరసనను తెలియచేయలేదతను. తలవంచుకుని తన గదిలోకెళ్ళిపోయాడు. వేడినీళ్ళగిన్నెను దగ్గిరపెట్టుకుని పమిటిచెంగుతో కళ్ళు వత్తుకుంటూ వెయిట్ చేస్తోంది మరియమ్మ.

"వద్దు వద్దన్నకొద్దీ తాతగారికి నచ్చని పనులు చేసి పెద్ద పెద్ద మాటలు పడుతున్నారు నాన్నగారు. కాస్తంత నెమ్మదిగా వుండచ్చుకదా!" అంటూ అతనికి పరిచర్యలు స్టార్ట్‌చేసింది మరియమ్మ.

* * * *

కింద హాల్లో సీరియస్‌గా వున్న సురేంద్రసాబ్‌ని ఓరకంట గమనించుకుంటూ లాయర్ దామోదరంతో మాటలు మొదలుపెట్టింది సరితాదేవి.

"ఇదుగో....నా కొడుకు సోహన్!" అంటూ తన కొడుకును పరిచయం చేసింది.

"చిన్నపిల్లల ముందర వాళ్ళని గురించి మాట్లాడటం తప్పే అయినా మావాడి గురించి చెప్పకుండా వుండలేకపోతున్నాను. తగాదాలు, కొట్లాటలు అంటే మావాడికి పరమ చిరాకు....మన స్టేటస్‌కి తగినట్టు గంభీరంగా వుండటమే వాడికి ఇష్టం. దిష్టి తగులుతుందని అనడంలేదు గానీ, మావాడు చూడచక్కని పర్సనాలిటీ.... దీపక్ కంటే రెండింతలు రంగు ఎక్కువే" శృతి మేడమ్ వంక చూస్తూ తన కొడుకును గురించి చెప్పింది.

"మనం బయలుదేరదాం మామయ్యా!" సోఫాలోనుంచి లేస్తూ దామోదరంతో అన్నది శృతిమేడమ్.

సురేంద్రసాబ్ వంక చూసి చేయివూపి హాల్లోనుంచి వెలుపలికి వచ్చాడు లాయర్ దామోదరం.

"వద్దు వద్దన్నకొద్దీ తీసుకువచ్చావు....ఆ దీపక్, బతుకు దుర్భరం చేసిపెట్టావ్" కార్లో కూర్చుంటూ దామోదరంమీద నిష్ఠూరం వేసింది శృతీ మేడమ్.

"దుర్భరం చేశానా? అలాంటిదేమీలేదు....రేపు ఈపాటికి సురేంద్ర కోపం తగ్గిపోతుంది. వెంటనే అన్ని విషయాలూ మామూలైపోతాయ్!"

అన్నాడు.

బార్లా తెరిచివున్నది గేటు....కరెన్సీ నోటుమీద గాంధీతాత వా
మార్కులా కనపడీ కనపడకుండా గేటుపక్కనే వుండాల్సిన వహీద్
పించకపోవడం శృతీమేడమ్‌కి కాస్తంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఎక్కడికి పోయాడు?" వెనక్కి చూస్తూ అడిగింది.

"ఎవరు? వహీదేనా? తనంతటి పహిల్వాన్ తమ దగ్గర పనిచే
డగా చిన్నబాబుమీద చేయివేసినవాళ్ళు తప్పించుకుపోవడమా? వా
వెతుకుతూ వుండివుంటాడు. పాపం" క్యాజువల్‌గా చెప్పాడు లాయ

"పాపం ఏమిటి?" అడిగింది శృతి మేడమ్.

"పాపం కాక మరేమిటి? వహీద్ కదిలాడంటే పరిస్థితి కంపు
అయిపోయినట్టే. దీపక్‌మీద కలబడినవాళ్ళు ఎవరోగాని పాపం....
బతుకులు తెల్లారిపోయినట్టే" అన్నాడు దామోదరం.

* * * *

కాలేజి మెయిన్ ఎంట్రన్స్‌కు వందగజాల దూరంలో రో
అవతలిపక్కన వుండే పాన్‌బడ్డీ దగ్గిరికి పోయి ఒక సోడా
వహీద్.

"ఇందాక మధ్యాహ్నం కాలేజీ కుర్రాళ్ళు గోలగోలగా అరు
ప్పుడు వాళ్ళెవరికీ తెలియకుండా ఒక గొడవ జరిగింది. నువ్వు చూశా
సోడా డబ్బులు చెల్లిస్తూ చాలా కాజువల్‌గా అడిగాడు బడ్డీ ఓనర్‌ని.

మధ్యాహ్నం బడ్డీ మూసి అన్నం తినటానికి పోయాను. ఇ
ముందే మళ్ళీ తెరిచాను. ఆ గొడవ ఏమిటో నాకు తెలియదు" అ
చెప్పి, తన పనుల్లో తను బిజీ అయిపోయాడు అతను.

అక్కడినించి కదిలి ఇంకోపక్కన వున్న ఒక చెప్పులషాపు
రికి పోయాడు వహీద్, లోపలికివెళ్ళి అక్కడ పనిచేసే సేల్స్‌మ
గాని, ఓనర్‌నిగాని క్వశ్చన్ చేద్దామని. ఆ షాపు ఎదుట ఒక పక్క
కూర్చునివున్న బూట్సు పాలిష్‌చేసే కుర్రాడి దగ్గిరికిపోయి మా
దించాడు.

"అవును సాబ్! చూశాను....పాపం.... దీపక్‌బాబు.... అ
విధంగా భలేగా దెబ్బతిన్నాడు." జరిగింది కళ్ళకు కట్టినట్టు వర్ణించి చె



అన్నాడు ఆ కుర్రాడు.

"అది సరే భాయి....దీపక్‌బాబు దెబ్బలు తినటంవరకూ ఓ.కె....
మరి ఆ దెబ్బలు కొట్టింది ఎవరో నీకు తెలుసా?" అసలు విషయాన్ని
సూటిగా అడిగాడు వహీద్.

"వాళ్ళు ఎవరో నాకు తెలియలేదు. ఒకసారి చూస్తే మర్చిపోవటం
జరగదు. కాని ఇంతకుముందు ఎప్పుడూ వాళ్ళని చూడలేదు" నిర్మొహ
మాటంగా చెప్పేసుకున్నాడు ఆ కుర్రాడు.

"పట్టపగలు నడిరోడ్డుమీద ఒక కాలేజీ స్టూడెంట్‌ని డబడబా బాద
గల మొనగాళ్ళు ఈ సిటీలో ఎవరున్నారు భాయీ? ఇక్కడ చాలా విచి
త్రంగా వుంది" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అంటూ వెనక్కి
తిరిగాడు వహీద్.

"ఇదిగో సారూ! ఒక్క మాట....మీరు పరువుతక్కువ అని అను
కోకపోతే, అదిగో, ఆ బడ్డీదగ్గిర వున్న కుంటి ముసలాడిని అడిగి
చూడండి" ఉన్నట్లుండి అతనికి ఒక క్లూ అందించాడు పాలిష్ కుర్రవాడు.

గప్పున రైజ్ అయింది వహీద్ మూడ్.... క్షణంకూడా ఆలస్యం
చేయకుండా వడివడిగా అడుగులు వేస్తూ, అతను చూపించిన బడ్డీ దగ్గిరికి
పోయాడు.

"పాపం....దీపక్‌బాబు....అప్పుడప్పుడు ధర్మం చేస్తూ వుంటాడు.
అప్పుడప్పుడు కాదు. వారానికి ఒకటి రెండుసార్లు....ఆ రెండుసార్లు పావలా
అర్ధా ఇచ్చాడు. కడుపు నిండుగా నాస్తా చేసేందుకు కావాల్సిన పది రూపా
యల్ని తంగుస నా పళ్ళెంలో పడవేస్తాడు. పాపం.... అనవసరంగా ఆ
గోవిందు గాడితో తన్నులు తిన్నాడు. ఎందుకో నాకు తెలియదు" వహీద్
తన దగ్గిరికి వచ్చింది దేనికో తెలుసుకున్న వెంటనే తనకు తెలిసిన మేటర్
బయటపెట్టాడు బడ్డీచాటున కూర్చునివున్న కుంటి బిచ్చగాడు.

"గోవిందుగాడా? వాడెవడు?" ఆశ్చర్యంగా అడిగాడు వహీద్.

"వాడే సారూ! ఆ సీతాఫల్‌మండీ కట్టెల అడితీ దగ్గిర కూర్చుంటూ
వుంటాడు. వట్టి బలాదూర్....ఎంగిలిచేత్తో కాకినికూడా అదిలించడు. వట్టి
పిసినారి!" గోవిందు గురించి ఇంకో ఇన్ఫర్మేషన్‌ని అందించాడు ఆ కుంటి
బిచ్చగాడు.

బడ్డీ దగ్గర్నించి కదిలి ఇవతలికి వచ్చేశాడు వహీద్. దూరంలో వున్న ఒక ఆటోని పిలవబోతుండగా, అప్పుడే అటుగా వచ్చిన ఒక సిటీ బస్‌లోనుంచి కిందికి దూకి అతని దగ్గిరికి పరిగెత్తుకు వచ్చాడు మోండా మార్కెట్ జగజీత్.

"చిన్నబాబు ఎక్కడ వున్నాడు? కాలేజీలో వున్నాడా? అర్జంటుగా ఒకసారి కలుసుకోవాలి" అని అతనికి చెప్పి. ఎంట్రన్స్‌వైపు పరిగెత్తబోయాడు జగజీత్.

చటుక్కున చేయిచాచి అతన్ని కదలకుండా ఆపేశాడు వహీద్. "విషయం ఏమిటో చెప్పు. చిన్నబాబు ఇంటికి వెళ్ళిపోయాడు. కాలేజీలో లేడు."

"మా మార్కెట్‌లో సిమ్రాన్‌సేటు....నామీద దాదాగిరి చేయించబోయాడు....వాడు నన్ను కొట్టించటానికి సీతాఫల్ మండీ దగ్గిర్నించి ఎవరో రౌడీల్ని తీసుకువచ్చాడు. అదృష్టం బాగుండి ఆ సంగతి కాస్తంత ముందు తెలియటంవల్ల నేను తప్పించుకున్నాను....నేను దొరకలేదన్న కచ్చతో వాళ్ళ దీపక్‌బాబు మీదికి వస్తారేమోనని నాకు భయంగా వుంది. ఆ మాట చెప్పటం కోసమే వచ్చాను."

సీతాఫల్‌మండీ ప్రసక్తి రెండవసారి కూడా వినరావటంతో నొసలు ముడిపేస్తూ, ఆటోని పిలిచాడు వహీద్. "వస్తావా సీతాఫల్‌మండీ పోయొద్దాం" అంటూ జగజీత్‌ని అడిగాడు.

"నువ్వు పిలవటం నేను కాదని అనటం....భలేవాడివి వహీదూ... పద పోదాం" అంటూ తను కూడా ఆటోలో కూర్చున్నాడు జగజీత్.

వేగంగా కదిలింది ఆటో....అరగంట తర్వాత సీతాఫల్‌మండీ సెంటర్లో ఆగింది.

"నువ్వేదో మొనగాడిని పంపుతావని అనుకున్నాను....ఆ జగజీత్‌గాడు తప్పించుకున్నాడు. నేను చూస్తూ వుండగానే రోడ్డుమీదికి పరిగెత్తి మటుమాయం అయిపోయాడు....పైసలు వదిలాయి నాకు. పనిమాత్రం పూర్తికాలేదు." టెలీఫోన్ రిసీవర్ పగిలిపోయే శృతిలో పెద్దగా అరిచిన సిమ్రాన్‌సేట్ గొంతువిని, విసుగ్గా తల విదిలించాడు కట్టెల అడితీ ఓనర్.



"జగజీత్ సంగతి రేపు డెఫినెట్టుగా తేల్చేస్తామని చెప్పు....ఆ కాలేజీ స్టూడెంట్ దీపక్ భరతం పట్టేశాం. నడుములు విరిగిపోయి, హాస్పిటల్‌కి పోయి వుంటాడు...." ఒక పక్కగా కూర్చుని వున్న గోవింద వెంటనే కామెంట్ చేశాడు.

మధ్యమధ్యగా ఆ మాటల్ని సిమ్రాన్‌సేట్‌కి వినిపించలేదా అడితీ ఓనర్. "సగంపని పూర్తి అయింది. మనం అనుకున్న డబ్బులో సగం వెంటనే పంపండి. మిగిలిన సగం పని అంతా అయిపోయిన తర్వాత పంపిద్దురుగాని....ఆ సురేంద్రసాబ్ మనవడి నడుములు జారిపోయాయి...." ఉత్సాహంగా చెప్పాడు.

"మీరు అతని నడుములు జారిపోయాయని అంటున్నారు. వాడు మామూలుగా నడుచుకుంటూ ఎముకల డాక్టర్ దగ్గిరికి పోవడం మా ముఠా కూలీలు కొందరు చూసి నాకు చెప్పారు" నిర్మొహమాటంగా ఆ మాటల్ని ఖండించాడు సిమ్రాన్‌సేట్.

"ఎముకల డాక్టర్ దగ్గిరికి వెళ్ళబట్టిండంటే ఎంతోకొంత డామేజీ అయినట్టేకదా అర్థం....మనం మాట్లాడుకున్నది డామేజీలు చేయడంవరకే. కాళ్ళీల్ని గల్లంతు చేయటాన్ని గురించి మాత్రం ఖచ్చితంగా కాదు.... అవునా?" కోరగా అడిగాడు అడితీ ఓనర్.

ఇష్టంలేకపోయినా ఆ మాటల్ని వప్పుకోవాల్సి వస్తున్నట్టు గంభీరంగా చిన్న సౌండ్ చేశాడు సిమ్రాన్ సేట్.

"జగజీత్‌గాడిని మాత్రం గట్టిగా ఏసేయాలి....నెలరోజులపాటు వాడు బెడ్డు దిగకూడదు. అలా చేస్తేనే పైసలు ఇస్తా. లేకపోతే త్వరగా ఇవ్వను" అంటూ కనెక్షన్‌ని కట్‌చేసేశాడు.

చిన్నగా నవ్వి రిసీవర్‌ని ఫోన్‌మీద పెట్టేశాడు అడితీ ఓనర్. నువ్వు ఇక్కడే వుండు. నేను మార్కెట్‌కిపోయి పైసలు అడిగి తీసుకు వస్తాను. బద్ధకిస్తే, సిమ్రాన్ సేట్ తను కూడా బద్ధకించగలడు" అంటూ ఎంట్రన్స్‌కేసి రెండు అడుగులు వేశాడు.

మూడో అడుగు పడకముందే గింగిరాలు తిరుగుతూవచ్చి అతని ముఖానికి తగిలింది పెద్ద కట్టెపేడు ఒకటి.

"చచ్చిపోయానో....నేను చచ్చిపోయానో" అని అరుస్తూ వెనక్కి

పడిపోయాడు అడితీఓనర్.

"అరె భాయీ....ఏంటిది? ఏం జరిగింది??" అని ఆశ్చర్యంగా అడుగుతూ అతని దగ్గిరికి జంప్ చేశాడు గోవింద.

ఫెడీమని అతని ముఖంమీద కూడా పడింది ఇంకో కట్టెపేడు. కళ్ళముందు పంచరంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అవుతున్నట్లు అనుభూతిని పొందుతూ, వెనక్కితూలాడు అతను.

"మా చిన్నబాబుతో గొడవపడతారా మీరు? సురేంద్రసాబ్ మన పడిని కొట్టి హేపీగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చోగలమని అనుకున్నారా?" అంటూ హాసకం వచ్చినట్టు చిందులువేస్తూ ప్రత్యక్షం అయ్యాడు వహీద్.

"వీడే....నన్ను కొట్టడానికి వచ్చిన రౌడీలకు లీడర్ వీడే...." బిగ్గిరిగా అరిచాడు అతని వెంటే ప్రత్యక్షం అయిన జగజీత్.

"చూడు....ఎక్కడయినా కిర్సనాయిలు వుంటే ఇక్కడకుతెచ్చి ఈ కట్టెలమీదపోయి. ఇవాల్టితో వీడు, వీడి వ్యాపారం ఖతమ్ అయిపోవాల్సిందే...." అని అతనికి చెపుతూ, తన చేతిలో వున్న కట్టె పేడుప గిర్రుగిర్రున తిప్పాడు వహీద్.

పారిపోవటానికి ట్రై చేశాడు గోవింద. నడుములు విరిగిపోయేటట్టు, ముఖం పగిలిపోయేటట్టు నిర్దాక్షిణ్యంగా బాదేశాడు వహీద్.

గుంపులు గుంపులుగా పోగయ్యారు ఆ గోలను గమనించిన పౌరులు చాలామంది. ధైర్యంచేసి అతన్ని ఆపటానికి ప్రయత్నించారు వారిలో కొంతమంది.

"అడుగు ముందుకువేస్తే అందర్నీ నరికిపారేస్తాను. ఖబడ్దార్...." ఖంగుఖంగుమంటున్న కంఠంతో అరుస్తూ కదం తొక్కాడు అతను.

అడితీ ఓనర్ కూర్చునే ప్రదేశంలో జగజీత్ కి కనిపించింది నాటుసారాతో నింపబడి వున్న బాటిల్ ఒకటి.

లాట్లు లాట్లుగా పేర్చివున్న బొగ్గుల బస్తాలమీద, కట్టెపుల్లలమీద తీర్థం చిలకరించినట్టు చిలకరించాడు అతను. అటూఇటూ చూసి కామ్‌గా అగ్గిపుల్ల అంటించాడు.

"మంటలు....బాబోయ్...మంటలు...నాఅడితీ నాశనం అయిపోతోం



నాయనోయ్" అని అరుస్తూ, అతిప్రయత్నం మీద రోడ్డుమీదికి పరిగెత్తాడు అడితి ఓనర్.

"పోలీస్ పోలీస్.... పోలీసుల్ని పిలవండి...." అని హెచ్చరించాడు గుంపుగా నిలబడిన పౌరుల్లో ఎవరో ఒకతను.

భగభగలాడుతున్న కట్టె పేడును ఒకదాన్ని తీసుకుని, ఆ కంఠం వినవచ్చిన వైపుకు విసిరాడు వహీద్.

గొల్లున అరిచి చట్రాతిమీద కొట్టిన చిల్లపెంకుల మాదిరి చెల్లాచెదురు అయిపోయారు అందరూ.

అరగంట తరువాత మోతలు చేసుకుంటూ వచ్చింది అక్కడికి ఒక ఫైరింజను....అప్పటికే మూడొంతులు నాశనం అయిపోయింది అడితీ. మరో అరగంట తరువాత సైరన్ మోగించుకుంటూ వచ్చింది పోలీస్‌వాన్.

మసిబొగ్గులుగా మారిపోయిన కట్టెపేళ్ళ లాట్లకు దూరంగా, అడితి వెనక భాగంలో వారికి కనిపించాడు గోవింద.

అడవి జంతువులు మీదపడి తీవ్రంగా గాయపరిచినట్లు గుర్తుపట్టటానికి వీలులేకుండా తయారైపోయి వుంది అతని అవతారం.

"నా దోస్తులు కొందరు సబ్జీమండీలో సారావ్యాపారం చేసుకుంటూ వుంటారు. వాళ్ళకు కూడా నాకు పట్టిన గతే పడుతుంది. తొందరగాపోయి వాళ్ళని కాపాడండి సార్....కాపాడండి...." తనను పలుకరించిన ఇన్స్పెక్టర్‌కి చెప్పి స్పృహ కోల్పోయాడు అతను.

తమ వాన్‌లో వున్న వైర్‌లెస్‌సెట్‌ని యాక్టివేట్‌చేసి, అతను చెప్పిన వ్యక్తుల గురించి సబ్జీమండీ స్టేషన్‌కి రిపోర్టు చేశాడు ఆ ఇన్స్పెక్టర్.

"అలాగే....అలాగే చూస్తాం సార్....ఇప్పుడే వాళ్ళకి ప్రొటెక్షన్ ఏర్పాటు చేస్తాం." అంటూ వాగ్దానం చేశాడు ఆ మెస్సేజిని అందుకున్న కానిస్టేబిల్ ఒకతను.

గాయపడిన గోవింద్‌ని, అడితీ ఓనర్‌ని సీతాఫల్ మండీ పోలీసులు హాస్పిటల్‌కి తీసుకుపోయేసరికి, సబ్జీమండీనించి కూడా వచ్చి అక్కడ ఆగింది ఇంకో పోలీస్ వాన్.

"మేము వెళ్ళేసరికి బాగా ఆలస్యం అయింది. ఎవరో ఇద్దరు రౌడీలు వచ్చి వీళ్ళని చావగొట్టి చెవులుమూసి వెళ్ళిపోయారట....వాళ్ళు ఎవరో చెప్పమంటే వీళ్ళు చెప్పటంలేదు. బాగా భయపడిపోతున్నారు" సీతాఫల్ మండీ ఇన్స్పెక్టర్ కి చెప్పాడు ఆ స్టేషన్ ఇన్‌ఛార్జి.

"వాళ్ళు ఎవరో నీకు తెలుసుగదూ....పేర్లు చెప్పు. అరెస్టుచేస్తాం" గోవిందని అడిగాడు సీతాఫల్ మండీ ఇన్స్పెక్టర్.

గోవిందు మాట్లాడలేదు. అడితీఓనర్ అసలు పెదవులే విప్పలేదు. తమకు దెబ్బలు బలంగా తగిలాయని చెప్పటమైతే చెప్పారుగాని, ఎవరి కారణంగా తగిలాయో పొరపాటున కూడా బయట పెట్టలేదు.

## 10

"వచ్చాడా? వహీద్ వచ్చాడా?" ఆరుగంటల సమయంలో అప్పటికి పదోసారో పన్నెండోసారో గండయ్యని పైకి పిలిచి మరీ అడిగాడు దీపక్.

"వెళ్ళినపని చిన్నదికాదు....మన దమ్ము ఎలాంటిదో అవతలి వాళ్ళకు తెలియచెప్పాలి....ఆలస్యం అవుతుంది.... తొందరపడకూడదు" చాల్లా కూల్‌గాచెప్పి గబగబా కిందికి వచ్చేవాడు గండయ్య.

"చీకటిపడితే వాళ్ళ తాతగారు అబ్జక్ట్ చేస్తారు....చీకటి పడకముందే మేము బయలుదేరటం బాగుంటుంది" వేడివేడి చాయ్ కప్పుతో పైకి వచ్చిన మరియమ్మతో అన్నాడు దీపక్.

"వహీద్ రాకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏముంటుంది నాన్నగారు? ఒంటరిగా బయటికి పోతే, ఆ రౌడీలు మళ్ళీ వచ్చి మీద పడతారని భయమా?" నవ్వుతూ అడిగింది మరియమ్మ.

కోపంగా చూడబోయి ఆఖరిక్షణంలో ఆమె సూచనను అర్థంచేసుకున్నాడు దీపక్. "సరయిన సమయంలో సరయిన మార్గాన్ని చూపించటం నీకు మాత్రమే చేతనవుతుంది....నువ్వు నిజంగా గ్రేట్" అని మెచ్చుకుంటూ టీ తాగటం మొదలుపెట్టాడు.



అతని వార్డ్‌రోబ్ దగ్గిరికి పోయి రెండు మూడు రోజులకు అవసరం అయిన డ్రెసెస్‌ని అన్నిటినీ ఒక ఎయిర్‌బేగ్‌లో సర్దింది మరియమ్మ.

"గంగారంలో కొలువుండే పోచమ్మతల్లి మహా శక్తివంతమైన దేవతంట....మనసుపెట్టి కోరుకుంటే ఎట్టాంటి కోరికలనైనా ఇట్టే తీర్చేస్తుందంట....నాన్నగారు ఏమని కోరుకోబోతున్నారో!" ఎయిర్‌బేగ్‌ని అతనికి అందిస్తూ అడిగింది.

"మా మరియమ్మకి వళ్ళు తగ్గి ప్రాణం హాయిగా వుండాలని కోరుకుంటా....బి.పి. కూడా తగ్గిపోవాలని నమస్కారం చేస్తా" అంటూ గబగబా కిందికి బయలుదేరాడు దీపక్.

"నాన్నగారూ....మీ అత్తమ్మ హాల్లోనే వుంది....జాగ్రత్త" అతనికి మాత్రమే వినబడేటట్లు హెచ్చరించింది మరియమ్మ.

మెట్లు దిగి హాల్లోకి ఎంటర్ అయిన వెంటనే అతనివంక ఆశ్చర్యంగా చూసింది సోఫాలో కూర్చుని వున్న సరితాదేవి.

"తాతగారు గదిలో లేరు. తోటలో వాకింగ్ చేస్తున్నారు...." ఆయన గదివైపు తిరిగిన అతన్ని హెచ్చరించింది.

వాకింగ్ చేసేటప్పుడు ఎవరయినా డిస్టర్బ్ చేస్తే తాతగారికి కోపం వస్తుంది. నేను మన మైసయ్య దగ్గిరికి పోతున్నానని చెప్పు....ఇప్పటికే ఆలస్యం అయిపోయింది...." ముఖద్వారంవైపు కదులుతూనే చెప్పాడు దీపక్.

"ఆలస్యం అయితే వచ్చే నష్టం ఏమీలేదు. తాతగారు తిరిగి వచ్చిన తర్వాత చెప్పి వెళ్ళు. అసలు నిన్ను రోడ్డుమీదికి పోవద్దని మధ్యాహ్నం స్ట్రిక్ట్‌గా చెప్పారు. మరిచిపోయావా?" అడిగింది సరితాదేవి.

ఆ మాటలు అసలు తన చెవులకు చేరనట్లు బయటికి వెళ్ళిపోయాడు దీపక్. అతన్ని చూసిన వెంటనే దూరంగా నిలబెట్టి వున్న కారును పోర్టికోలోకి తీసుకువచ్చాడు రాంసింగ్.

"అది వద్దు. నేను, సోహన్ ఇద్దరమూ బిర్లామందిర్ కి పోవాలని అనుకుంటున్నాం. ఇంకోటి తీసుకుపో...." సోఫాలోనుంచి లేచి గుమ్మం దాకా వచ్చిన సరితాదేవి వెంటనే హుకుం జారీ చేసింది.

"ఆవిడగారు అలా అంటూనే వుంటుంది. మీరు కూర్చోండి చిన్న బాబూ" పెదవుల కదలిక బయటికి కనిపించకుండా దీపక్‌ని హెచ్చరించాడు రాంసింగ్.

రెండో ఆలోచన లేకుండా కారెక్కాడు దీపక్. క్షణం కూడా ఆలస్యం అవకుండా బాణం మాదిరి ముందుకు కదిలింది కారు.

నాసికాపుటాలు పెద్దవిచేసి, దెబ్బతిన్నపాములా చిన్నపాటి ఛీత్కారము చేసింది సరితాదేవి.

"ఏమిటమ్మా అది? ఎవరిమీద నీ కోపం?" దక్షిణంవైపు ద్వారంలోనుంచి లోపలికి వస్తూ సాదరంగా అడిగాడు సురేంద్రసాబ్.

"మీరు దీపక్‌ని బాగా గారాబం చేసి చెడగొట్టేస్తున్నారు నాన్నగారూ....వాడు ఎందుకూ పనికిరాకుండా పోకముందే తీసుకుపోయి ఏదో ఒక హాస్టల్లో పెట్టేయండి. పెద్దవాళ్ళు చెప్పే మాటల్ని వాడు వినిపించుకోవటం లేదు. ఇంట్లోనుంచి కదలవద్దని మీరు చెప్పారు. మీకు చెప్పను కూడా చెప్పకుండా బయటికి వెళ్ళిపోయాడు" రంయ్‌రంయ్‌మంటూ మాటల్ని వదిలింది సరితాదేవి.

"కుర్రాళ్ళు అంతేనమ్మా....కాలేజీలో చదివే కుర్రాళ్ళకు ఆమాత్రం స్వేచ్ఛ వుండితీరాలి....వాడు గంగారం జాతరకు పోతున్నాడు. వెంట గండయ్యని, మన వహీద్‌ని ఇద్దర్నీ వెళ్ళమని చెప్పాను. మధ్యాహ్నం తనకు తగిలిన దెబ్బల్ని తలుచుకుని మూలుగుతూ కూర్చోకుండా హాయిగా బయటికి పోవటం నిజంగా నాకు బాగా నచ్చింది" అంటూ తన గదివైపు వెళ్ళిపోయాడాయన.

ఫ్లోర్‌ని పాదంతో తన్నినంత పనిచేసి సోఫాలో కూలబడింది సరితాదేవి.... "మరియమ్మా....ఓ మరియమ్మా....మా అబ్బాయి ఏం చేస్తున్నాడో చూడు—" అంటూ బిగ్గరగా పిలిచింది.

పెద్దపెద్ద అడుగులు వేస్తూ దక్షిణం పక్క గదుల దగ్గిరికి పోయింది మరియమ్మ.

విశాలంగా వున్న ఒక గదిలో ఖరీదయిన ఒక టి.వి. ముందు కూర్చుని డి.వి.డి. ప్లేయర్లో ఏదో డిస్క్‌ని పెడుతున్నాడు సోహన్.



మరియమ్మ అడుగుల చప్పుడును వినగానే, ఆ డిస్క్‌ని దిండు కింద దాచేశాడు.

"బాబుగారూ....మీ అమ్మగారు పిలుస్తున్నారు....హాల్లో వున్నారు" ద్వారం దగ్గిర నిలబడి అతనికి చెప్పింది మరియమ్మ.

"వస్తున్నానని చెప్పు....నువ్వు వెళ్ళు" విసుగు నిండిన కంఠంతో విసురుగా అన్నాడు సోహన్.

చిన్న ముఖంతో అవతలకి వెళ్ళిపోయింది మరియమ్మ. ఆమె దూరంగా వెళ్ళిపోయిందని నిశ్చయం అయిన తర్వాత, సోఫా దిండు క్రింద దాచిన డిస్క్‌ని తీసి తన సూట్‌కేస్‌లో పెట్టేసాడు సోహన్.

ముఖం మీద పడుతున్న జుట్టును నీట్‌గా దువ్వుకుంటూ హాల్లోకి పోయాడు.

"నాన్నగారూ...మీ మనవడు, నేను బిర్లామందిర్‌కి వెళ్ళివస్తాం....మీ పేరుమీద అర్చన చేయించాలని చాలా రోజుల్నించీ అనుకుంటున్నా" సోఫాలోనుంచి లేస్తూ సురేంద్రసాబ్‌కి వినపడేలా బిగ్గరగా చెప్పింది సరితాదేవి.

"అర్చనలు గిర్చనలు నాకు వద్దు. వెళ్ళాలని అనిపిస్తే మీరు వెళ్ళిరండి....పోండి" విసుగ్గా వినవచ్చింది ఆయన కంఠం.

ఆశ్చర్యంగా చూసిన కొడుకు భుజం తట్టి అదోమాదిరిగా నవ్వింది సరితాదేవి.

"ఆయన అలాగే అంటూవుంటారు. అలాగని మనం చేయదలుచుకున్న పనిని మానుకోకూడదు....పద పోయివద్దాం" అంటూ ముఖద్వారంవైపు కదిలింది.

ఎదురు చెప్పేందుకు సరైన అవకాశం లభించకపోవటంవల్ల, మౌనంగా అనుసరించాడు కొడుకు.

"పెద్దకారును చిన్నబాబు తీసుకుపోయాడు....రాంసింగ్ కూడా తనతోపాటు వెళ్ళాడు....డ్రయివర్ ఎవరూ లేరు" పోర్టికోలో నిలబడి చుట్టూ చూస్తున్న సరితాదేవితో చెప్పాడు అప్పుడే వస్తున్న పీటర్.

"నువ్వు వున్నావ్‌గా....వేరే కారు తీసుకురా...." హుకుం జారీ చేసింది సరితాదేవి.

"అలాగేనమ్మా....పెద్దబాబుగారికి చెప్పి ఇప్పుడే వచ్చేస్తాను" అన్నాడు పీటర్.

"చెప్పాల్సిన అవసరం లేదు....గుడికి పోతున్నామని నేను చెప్పాను....గుడికి కాలినడకన పోతామా? నాన్నగారికి తెలుసు" అంటూ అతన్ని అడ్డుకున్నది ఆమె.

ఎదురు చెప్పటం చేతకాలేదు పీటర్‌కి. రెండో మాట మాట్లాడకుండా దూరంగా గారేజ్‌లో వున్న వ్యాన్‌ని తీసుకువచ్చి పోర్టికోలో నిలబెట్టాడు.

"ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చిపోయినట్టు ఆఖరికి ఈ డొక్కు కార్లో గుడికి వెళ్ళాల్సి వచ్చిందన్నమాట. సురేంద్రసాబ్ కూతురు ఈ కార్లో వచ్చిందని ఎవరికైనా తెలిస్తే ఎంత పరువుతక్కువో" తనలో తను గొణుగుతుంటూ లోపల కూర్చుంది సరితాదేవి.

ఒక అరగంట తరువాత ఆమె కోరుకున్న ప్రదేశంలో వాన్‌ని ఆపాడు పీటర్. క్రిందికి దిగలేదు సరితాదేవి. అతను దిగి, తనవైపు డోర్‌ని తెరిచి పట్టుకున్న తర్వాతనే హుందాగా కాలు కిందపెట్టింది.

"అమ్మా....ఆ లాయర్‌గారి మేనకోడలు కూడా వచ్చింది" వున్నట్లుండి ఆమెను హెచ్చరించాడు సోహన్.

తళుక్కుమని మెరిసే తారకమాదిరి కార్లో నుంచి దిగి, వెండిపూలసజ్జలో తీసుకువచ్చిన పూజాద్రవ్యాల్ని మరోసారి సరిచూసుకుంటోంది శృతి, డోరుదగ్గరే వినయంగా నిలబడివున్న పీటర్‌ని వెంటనే తమకు దగ్గరలో వున్న కొబ్బరికాయల దుకాణం దగ్గరకి తరిమింది సరితాదేవి.

"మంచి కొబ్బరికాయలు మూడో నాలుగో తీసుకురా. పూలు మర్చిపోకు. మనం కార్లో వచ్చామని గమనించి వుంటే రేటు ఎక్కువగా చెప్తారు. సరిగ్గా బేరం చెయ్" అని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చింది. డబ్బులు మాత్రం ఇవ్వలేదు.

రోజువారీ ఖర్చులకోసం మీ తాతయ్య పీటర్‌కి ఓ పదివేల రూపాయలు నెలనెలా ఇస్తారు. నాకు తెలుసు. వాటిలోనుంచి తీసుకువస్తాడు. మరేం పరవాలేదు" ప్రశ్నార్థకంగా చూసిన తన కొడుక్కి చెపుతూ ముందుకు అడుగువేసింది సరితాదేవి.

"హల్లో, ఆంటీ....మీరు కూడా గుడికి వచ్చారా?" ఆమెను చూడగానే ఆశ్చర్యంగా అడిగింది శృతి మేడమ్.



"అదేంటమ్మా! అలా ఆశ్చర్యంగా అడిగావేంటి? మేము గుడికి రామని నీకు ఎవరయినా చెప్పారా?" నవ్వుతూ ప్రశ్నించింది సరితాదేవి.

"అబ్బే....అదికాదు ఆంటీ....సురేంద్ర తాతయ్యగారు గుళ్ళకి గోపురాలకి వెళ్ళడం మానేశారని మామయ్య చెప్పారు. అందుకని అలా అడిగాను" అంటూ తను పొరపాటుగా మాట్లాడినందుకు నొచ్చుకుంటున్నట్లు ముఖంపెడుతూ అన్నది శృతిమేడమ్.

"మా నాన్నగారు ఇలాంటి పనులు మానేసిన మాట నిజమే. అయితే ఇవాళ మా దీపక్‌గాడు చావుదెబ్బలు తిని వచ్చాడు గదా....దేవుడి దయవల్ల పర్మినెంట్ డామేజీ ఏదీజరగలేదు. ఇదుగో మా....వాడు పెట్టిన ప్రోగ్రాం ఇది. బిర్లామందిర్‌లో పూజచేయిద్దాం....వాడికి పూర్తిగా రిలీఫ్ దొరకాలి అంటూ బలవంతంగా బయలుదేరదీయించాడు. మావాడు వయసులో చిన్నవాడైనా పెద్దవాళ్ళకంటే ఎక్కువగా వుంది భక్తి....పూజలకని పునస్కారాలకని డబ్బులు తగలేస్తూ వుంటాడు" తన కొడుకు వంక మురిపెంగా చూసుకుంటూ చెప్పింది సరితాదేవి.

"అలాగా....వెరీ నైస్ టు హియర్ దట్...." అంటూ ముందుకు అడుగువేసింది శృతిమేడమ్.

* * * *

పరుగు పరుగునవచ్చి పీటర్ అందించిన పూజాద్రవ్యాలను జాగ్రత్తగా పరిశీలించి తీసుకుని శృతి మేడమ్‌ను అనుసరించింది సరితాదేవి.

"నేను చిల్లర తీసుకురావడం మర్చిపోయాను. హుండీలోను, హారతిపళ్ళెరంలోను వేయడానికి పీటర్‌ని అడిగి తీసుకో" లోగొంతుకతో కొడుక్కి చెప్పింది.

కాబూలీవాలా మాదిరి పీటర్‌ని పట్టుకుని ఆమె ఆదేశాల్ని అక్షరాలా అమలులోపెట్టాడు సోహన్.

"గుడికి బయలుదేరుతున్నామని చెప్పగానే నువ్వు చిల్లరడబ్బులు దగ్గర వున్నాయో లేదో చూసుకోవాలి. ఇంతకాలంగా మా తాతయ్యగారి దగ్గర పనిచేస్తున్నావ్....ఆమాత్రం తెలియదా?" అరిందా మాదిరి అడిగి,

తనుకూడా తల్లి మార్గాన్ని అనుసరించాడు.

వాళ్ళువెళ్ళగానే "వీళ్ళు గుడికిపోతుంటే నేను చిల్లర డబ్బుల్ని పోగేసుకుని సిద్ధంగాపెట్టుకోవాలా? ఇంకానయం వీళ్ళకి బదులు దేవుడి నన్ను నమస్కారం చేయమని అనలేదు" తాపీగా తన దగ్గరకి వచ్చి శృతి మేడమ్ డ్రయివర్‌తో అన్నాడు పీటర్.

"పీటరన్నా....వీళ్ళు నిజంగానే మన దీపక్‌బాబుకి చుట్టా నంటావా?" సందేహం కలిగినట్టు తల విదిలిస్తూ అడిగాడు ఆ డ్రయివర్.

"ఓరినీ....నీకు అటువంటి అనుమానం ఎందుకు వచ్చింది?" ఆశ్చ ర్యంగా అడిగాడు పీటర్.

"నక్కకు, నాగలోకానికి వున్నంత డిఫరెన్స్ కనిపిస్తోంది. దీపక్ బాబు ఏ పని చేసినా హుందాగా వుంటుంది. ఆ బాబు ఒకటి రెండుసార్లు తనదగ్గర చిల్లరలేకపోతే పక్కవాళ్ళ దగ్గర తీసుకోవడాన్ని నేను కళ్ళారా చూశాను. అది రాయల్‌గా వుంది....కాని వీళ్ళ పద్ధతి మాత్రం ఏం బాగా లేదు" అన్నాడు ఆ డ్రయివర్.

"దీపక్‌బాబు పులిబిడ్డ....బెంగాల్ టైగర్‌కి మనవడు. అయ్యగా రూటే డిఫరెంట్" సరితాదేవి కూడా ఆ బెంగాల్ టైగర్‌కి బిడ్డే అన్న విషయాన్ని మరిచిపోయినట్లు తన చిన్నబాస్‌ని మెచ్చుకున్నాడు పీటర్.

* * * *

ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్ అంటూ పాటలు పాడింది అతని జేబులోని మొబైల్. స్విచ్‌ని ఆన్‌చేసి చెవులకు ఆనించుకోగానే, "అయి యింది పీటరూ....ఎందుకయినా మంచిది లాయర్‌సాబ్‌కి ఫోన్ చేసి ఫల్‌మండీ ఠాణామీద కన్నేసి వుంచమను. ఆ దొంగనాయాళ్ళకి చెంది అడితీని అవుట్‌చేసేశాం" హుషారుగా వినవచ్చింది వహీద్ కంఠం.

తనే స్వయంగా ఆ అడితీని నాశనం చేసినంత ఆనందం కలిగింది పీటర్‌కి. "ఓకే వహీద్ భాయ్....అవన్నీ నాకు వదిలెయ్. నువ్వు వెంటనే మన మైసయ్య దగ్గరకి క్లోసైపో....చిన్నబాబు బయలుదేరి చాలాసేపయి యింది. డబ్బులున్నాయా నీ దగ్గర?" గబగబా అడిగాడు.

"చిన్నబాబు వెనకాల వెళుతుండగా నాకు డబ్బులతో అవసరం ఎందుకు వస్తుంది? నాతోపాటు మోండా మార్కెట్ జగజీత్‌ని కూడా



తీసుకుపోతున్నా. వాడు నాకు సాయం చేశాడు" సాభిప్రాయంగా చెప్పాడు వహీద్.

"దీపక్‌బాబు విషయంలో వేలుపెట్టినవాళ్ళు ఎవరైనాసరే మనకి బాగా గుర్తుండిపోతారని చెప్పు. అది మంచైనా చెడైనా ఏదయినా సరే" తడుముకోకుండా అన్నాడు పీటర్.

"అచ్ఛా....అయితే నేను మైసయ్య దగ్గరకి జంప్ అవుతాను. పెద్ద బాబుగారికి చెప్పలేదు. ఆయన...."

అనుమానంగా అంటున్న వహీద్‌ని మధ్యలోనే కట్‌చేసేశాడు పీటర్. "అవన్నీ నేను చూసుకుంటానని చెప్పానుకదా....నాకు వదిలెయ్. చిన్నబాబుని మాత్రం జాగ్రత్తగా వెనక్కి తీసుకురా...ఇవాళ జరిగినటు వంటి ఇన్సిడెంట్ ఇంకొక్కటి జరిగితే....ఆ బాబు పర్మినెంట్‌గా ఇంట్లోనే కూర్చోవాల్సి వస్తుంది. పెద్దబాబు వెరీ సీరియస్" అంటూ ఫోన్‌ని ఆఫ్ చేసి ఒక పక్కగా వున్న చాయ్ బడ్డీ యజమానికి చేయి ఊపాడు.

ఆ సైగ గమనించడంతోటే తెల్లటి కప్పుల్లో చకచకా చాయ్ నింపి పరిగెత్తుకుంటూ వచ్చి అతనికి, శృతి మేడమ్ డ్రయివర్‌కి ఇచ్చాడు బడ్డీ ఓనర్.

"ఇంతకీ దీపక్‌బాబు ఎలా వున్నాడు? బాబు బాగున్నాడా? ఏంచేస్తు న్నాడు?" నవ్వుతూ అడిగాడు.

"ఏం చేస్తాడు భాయీ....తిని కూర్చుంటూవుంటాడు. మస్తుగా పైసలున్న మనిషి. అంతకంటె ఇంకేం చేస్తాడు?" అడిగాడు శృతి మేడమ్ డ్రయివర్.

"నువ్వు తప్పుమాట్లాడినవ్ భాయీ....దీపక్‌బాబు అట్లాంటోడు కాదు. తనదగ్గర మస్తు పైసలున్నాసరే....మామూలుగానే వుంటాడు. ఆ బాబు పద్ధతే వేరు" అంటూ ఖాళీకప్పుల్ని, పీటర్ ఇచ్చిన పైసల్ని తీసు కుని వెళ్ళిపోయాడు హోటల్ ఓనర్.

"గుళ్ళోకి పోయిందికూడా సురేంద్రసాబ్ మనవడే....దీపక్‌బాబుకి ఆయనకీ తేడా ఏంటి?" గుడివైపు తల ఊపుతూ అన్నాడు డ్రయివర్.

"ఆడా? ఆడు కూతురు బిడ్డ....దీపక్‌బాబుది వారసత్వం....చెట్టు మీద పండిన పండు....అళ్ళు రాలిపోయిన కాయలు" కళ్ళెగరేస్తూ చెప్పాడు

పీటర్.

"నాకు అర్థంకాలేదు" అయోమయంగా పీటర్ వంక చూస్తూ అన్నాడు డ్రయివర్.

తన మాటలకు అర్థాన్ని వివరించి చెప్పే అవకాశం పీటర్ కి లభించ లేదు. గుడి దగ్గరనుంచి పెద్ద పెద్ద కేకలు, అరుపులు వినరావడమే అందుకు కారణం.

"ఏంటో జరిగింది....రష్ కొంచెం ఎక్కువగా వుండేసరికి పాకెట్ మార్ గాళ్ళు ఎవరో రెచ్చిపోయి జేబులు ఖాళీచేసి వుంటారు" నిర్లక్ష్యంగా అన్నాడు శృతి మేడమ్ డ్రయివర్.

* * * *

అంతలోనే అటుకేసి వచ్చేసింది చిన్న గుంపు. అందరికంటె ముందున్నాడు సరితాదేవి కొడుకు సోహన్.

"శృతి మేడమ్ మెడలో గొలుసును కట్ చేసి ఇటుగా పారిపోయి వచ్చాడు ఎవడో....మీరేమయినా చూశారా?" చుట్టూ చూస్తూ పీటర్ని అడిగాడు.

పీటర్ ఇంకా ఏ సమాధానం చెప్పకముందే, చాయ్ బడ్డీ దగ్గర నిలబడి చాయ్ కోసం వెయిట్ చేస్తున్న ఒక కుర్రాడిమీద పడింది సోహన్ చూపు.

"వాడే....గొలుసును తెంపిన బద్మాష్ వాడే" అని అరుస్తూ నాలుగు అంగల్లో బడ్డీ దగ్గరకి పోయి ఆ కుర్రాడి జుట్టును గట్టిగా పట్టుకున్నాడు.

"తొందరపడకు సోహన్....పోలీసులకు ఫోన్ చేస్తే వాళ్ళే వచ్చి విచారణ చేస్తారు. నువ్వు తొందరపడి అతని మీద చెయ్యిచేసుకోకు" ఒక్క క్షణం వెనకాలగా వచ్చిన శృతిమేడమ్ వెంటనే అతన్ని వారించ డానికి ట్రైచేసింది.

వినిపించుకోలేదు సోహన్. వెర్రివాడి మాదిరి అరుస్తూ ఆ కుర్రా డిని కిందికి నెట్టి పాదాలతో పిచ్చి పిచ్చిగా తన్నడం మొదలుపెట్టాడు.

"నాకేమీతెలియదు. నన్నేమీ చేయకండి. అసలు నేను గుళ్ళోకి రాలేదు. పొద్దుటినుంచీ ఇక్కడే వున్నాను" చేతులు జోడిస్తూ వేడుకున్నాడు ఆ కుర్రాడు.



అయినా సోహన్ తన దూకుడును అలాగే కంటిన్యూ చేయడాన్ని గమనించి, "పీటరూ....ఆ కుర్రాడి గోల యదార్థమే. నేను వచ్చినదగ్గిర్నించీ వాడు ఇక్కడే వున్నాడు. గుడివైపు పోలేదు" అన్నాడు శృతి మేడమ్ డ్రయివర్.

"వాడు నీకు తెలుసా?" అడిగాడు పీటర్."

"నాకే కాదు నీకు కూడా తెలుసు. ఒక్కసారి వాణ్ణి సరిగ్గా చూడు. ఒకటీ రెండుసార్లు ఇక్కడికి వచ్చినప్పుడు నీ కారును కూడా క్లీన్ చేసి వుంటాడు."

వెంటనే ఫ్లాష్ అయింది పీటర్ కి, శృతిమేడమ్ డ్రయివర్ చెప్పిన మాటల్లో అసత్యం ఏమీలేదు. గుడి దగ్గిరికి వచ్చిన కార్లను క్లీన్ చేసి, డ్రయివర్లుగాని, ఆ కార్ల ఓనర్లుగాని ఏమిస్తే అది పుచ్చుకుని బతుకుతూ వుంటాడు ఆ కుర్రవాడు. అది అతని జీవితం.

"శృతిమేడమ్ చూస్తున్నారని మా సోహన్ బాబు ఎగస్ట్రాలు చాలా చేస్తున్నట్టు అనిపిస్తోంది" అంటూ గబగబా ముందుకుపోయి పిచ్చిగా కొడుతున్న సోహన్ ని అతి బలవంతంగా వెనక్కి లాగాడు పీటర్.

"ఈ కుర్రాడు మనకి తెల్సినవాడే....ఇతను దొంగతనం చేసి వుండడు. మీరు కొంచెం నిదానించడం బాగుంటుంది" అంటూ శాంతింప చేయడానికి ట్రైచేశాడు.

"వెతుకు....వాడి జేబులు వెతుకు...." అతిగా ఆవేశపడటంవల్ల ఆయాసం అధికమై రొప్పుతూ చెప్పాడు సోహన్.

అతను కొట్టిన దెబ్బల కారణంగా కళ్ళు తేలవేయడానికి సిద్ధంగా వున్న ఆ కుర్రాడ్ని పైకిలేపి అతని పాకెట్స్ అన్నింటినీ చెక్ చేశాడు పీటర్.

"గొలుసు వాడిదగ్గిర వుండివుండదు సార్....కొట్టేయగానే పక్కనే వున్న తన దోస్తులు ఎవరికో అందించి వుంటాడు. ఇంకో రెండు తగిలిస్తే గాని, ఆ దోస్తులు ఎవరనే మాట బయటికి రాదు" గుంపుగా నిలబడిన జనంలో నుంచి ఉచిత సలహా ఒకటి ఇచ్చాడు ఒక పెద్దమనిషి.

* * * *

పిడికిలి బిగించి మరోసారి ముందుకు కదలబోతున్న సోహన్ ని,

అతి ప్రయత్నంమీద ఆపాడు పీటర్.

"కళ్ళు తేలవేయడానికి సిద్ధంగా వున్నాడు వీడు. ఇంకో దెబ్బ ఒంటిమీద పడితే ఖచ్చితంగా పడిపోతాడు. మనం హాస్పిటల్లో చేర్చి సేవ చేయాల్సివస్తుంది. మీరు కొంచెం ఆగండి" అంటూ తన సెల్‌నుంచి ఎవ రికో ఫోన్‌చేశాడు.

ఫోన్ పెట్టేసిన పదే పది నిముషాల్లో అక్కడ ప్రత్యక్ష అయ్యాడు ఒక పోలీస్ కానిస్టేబిల్.

"మీరు స్టేషన్‌కి వచ్చి రిపోర్టు రాసి ఇవ్వండమ్మా....వీడు దొం తనం చేసివుండడు. వీడు నాకు బాగా తెలుసు. అసలు దొంగ వేరే ఎవరో అయివుంటారు" నిస్త్రాణగా నిలబడివున్న ఆ కుర్రవాడిని తన బైక్‌మీ ఎక్కించుకుంటూ శృతిమేడమ్‌కి చెప్పాడు కానిస్టేబిల్.

"అంటే అర్థం ఏమిటి? వాడిని అవతలకు తీసుకుపోయి కాపా వదిలేస్తావా? " వేడిగా అడిగాడు సోహన్.

చురుకుగా అతనివంక చూడబోయిన కానిస్టేబిల్‌తో, "సురేంద్ర సాబ్ కూతురి బిడ్డ అతను" అన్నాడు పీటర్ గబగబా.

"అలాగా....అయితే సరే....మీకు కావాల్సింది దొంగిలింపబడి మీ గోల్డ్‌చైన్. అంతేకదా....స్టేషన్‌కి వచ్చి ఎస్.ఐ. గారితో మాట్లాడండి" అంటూ ఆ తర్వాత మాటలను వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు,

"ఎంతో కష్టపడి దొంగని పట్టుకున్నాడు నా బిడ్డడు. వాడు నిజంగా పెద్ద ఫైర్‌బ్రాండ్. దీపక్‌గాడి మాదిరిగా వాళ్ళతో వీళ్ళతో దెబ్బలుతినడం వాడికి అలవాటు లేదు" శృతిమేడమ్ పక్కన నిలబడి సన్నగా కామెంట్ చేసింది సరితాదేవి.

"కమాన్ శృతీ....నీ గొలుసు ఎక్కడికీపోదు....దొరికితీరుతుంది. ఐనా ఆఫ్టారిల్ ఒక చిన్న గొలుసుకోసం అంత టెన్షన్ పడాల్సిన అవసరం ఏముంది?" హుందాగా శృతి మేడమ్‌తో అన్నాడు సోహన్.

"అది నా చిన్నప్పుడు మా బామ్మ నాకు బహుమతిగా ఇచ్చింది. అది దగ్గిర లేకపోతే నాకు పిచ్చిపట్టినట్టు అనిపిస్తుంది" చిన్న కంఠంతో ప్రాబ్లెమ్‌ని చెప్పింది శృతిమేడమ్.

"అలాంటి పిచ్చి నమ్మకాలు మనకి మంచివికావు. ఎసీపే....



నులకి చెప్పాం కదా....దర్శనం చేసుకున్న తర్వాత స్టేషన్‌కి పోయి వద్దాం....కమాన్" అంటూ ఆమె చేతిని పట్టుకుని గుడికేసి బయలుదేరదీయ డానికి ప్రయత్నంచేస్తూ అన్నాడు సోహన్.

బలవంతంగా చేతిని వదిలించుకున్నది శృతిమేడమ్. "నాకు మూడ్ పాడైపోయింది. ఇవాళ ఇక దర్శనానికి రాలేను. మీరు వెళ్ళిరండి" అంటూ తమ డ్రయివర్‌కి సైగచేసి కారు దగ్గిరికి వెళ్ళిపోయింది.

"నువ్వు కొంచెం నెమ్మదిగా మాట్లాడివుంటే బాగుండేది, జరిగిన దానికి ఆ పిల్ల నిజంగానే అప్‌సెట్ అయినట్టు కనిపిస్తోంది" అంటూ తను కూడా తమ కారు దగ్గిరికి నడిచింది సరితాదేవి.

"అదేంటి? మనం గుళ్ళో తాతయ్య పేరుమీద అర్చన చేయించాలి గదా?" ఆశ్చర్యంగా అడిగాడు సోహన్.

"రేపు ఎప్పుడైనా వచ్చి చేయిద్దాం. నాకు కూడా మూడ్ అవుట్ అయింది" అంటూ కారు ఎక్కింది సరితాదేవి.

సోహన్ కూడా రాగానే స్టీరింగ్‌ముందు కూర్చుని కారును కదిలించాడు పీటర్. వేగంగా నడపడం మొదలుపెట్టాడు.

*     *     *     *

"వహీద్‌ని గండయ్యని మాత్రమే వెంటబెట్టుకుని పొమ్మని తాత గారు చెప్పారు. నీ గురించి చెప్పలేదు. ఆయనకి తెలియకుండా నువ్వు కూడావచ్చేశావ్. నీకు రోజులు మూడిపోయాయి" గండయ్య తీసుకు వచ్చిన సిగరెట్ పాకెట్‌లోనుంచి సిగరెట్‌ని తీసి వెలిగించుకుంటూ రాంసింగ్‌ని భయపెట్టాడు దీపక్.

"తాతయ్యగారితో తిట్లుతినడం అలవాటే చిన్నబాబూ....అయినా నేను వచ్చింది ఎవరితో?

చిన్నబాబుకు తోడుగా వెళ్ళాల్సి వచ్చిందని చెబితే తాతయ్య గారు కామ్ అయిపోతారు. ఒక్కమాట కూడా మాట్లాడరు" హుషారుగా. చెప్పాడు రాంసింగ్.

"ఈ వహీద్ ఏమైపోయాడో తెలియడంలేదు. వీడి కోసం ఎదురు చూస్తూ ఇక్కడేవుంటే చీకటిపడిపోతుంది. అక్కడ ఆ మైసయ్యకి బీ.పీ. పెరిగిపోతుంది" చిరాకుగా అంటూ డోర్ తెరుచుకుని ఫ్రంట్‌సీట్లోనించి

దిగాడు గండయ్య.

*   *   *   *

"వెళ్ళిరండి చిన్నబాబూ. మన వహీద్ వచ్చేసరికి లేట్ అవవచ్చు ఊరికే కూర్చోవడం దేనికి? ఒకసారి కనిపించి హల్లో అని వచ్చేయండి" ముసిముసినవ్వులు నవ్వుతూ దీపక్‌కి చెప్పాడు రాంసింగ్.

"సమ్‌థింగ్ రాంగ్ విత్ దట్ గర్ల్....చాలా మూడీగా చా గ్లూమీగా వుంది. ఎందుకో?" సాలోచనగా అన్నాడు దీపక్.

"ఎందుకో ఎందుకో అనుకుంటూ సస్పెన్స్ దేనికి బాబూ....వె అడిగితే సరిపోలా?" నోరు విప్పాడు గండయ్య.

నథింగ్ డూయింగ్....కారును కదిలించు" సడన్‌గా ఆర్డ ఇచ్చాడు దీపక్.

రెండోసారి చెప్పించుకోకుండా కారును ముందుకు దూకించా రాంసింగ్. ఎంతో దూరం పోకముందే గణగణలాడింది అతని సెల్‌ఫో

"మేము గుల్షన్ దర్గా దగ్గిర వున్నాం. మమ్మల్ని పికప్ చేసుకో అంటూ వినవచ్చింది వహీద్ కంఠం.

"గుల్షన్ దర్గా....వహీద్‌కి కర్రసాము నేర్పిన గురువుగారు ఆ దర్గా దగ్గిరే వుంటారు. వీలు దొరికినప్పుడల్లా తన దగ్గిరికిపోయి సలా చేసివస్తూ వుంటాడు" అంటూ యాక్సిలేటర్‌ని అదిమాడు రాంసింగ్.

"నేను అనకుండా మేము అంటాడేమిటి వహీద్?" సందేహ వ్యక్తం చేశాడు గండయ్య.

"తనతో ఇంకెవరో వుండివుంటారు. మాటవరసకి అలా వుంటాడు...." దృష్టినంతా డ్రయివింగ్‌మీదే కేంద్రీకరిస్తూ చెప్పా రాంసింగ్.

*   *   *   *

చీకటి పడిపోయింది వాళ్ళు గుల్షన్ దర్గాదగ్గిరికి పోయేసరికి. రో మీదే నిలబడి కనులు చిట్లించుకు చూస్తున్న వహీద్ ముఖం ఒక్కసా నవ్వులమయం అయిపోయింది వెనుకసీట్లో వున్న దీపక్‌ని చూసి.

"మీ జగజీత్‌గాడు ఇవాళ చాలా సాయం చేశాడు. మిమ్మల్ని ము కున్న ఆ గోవిందాగాడు జగజీత్ చేతిలో చావుదెబ్బలు తిన్నాడు"



జీత్‌తోపాటు ముందుసీట్లోకి జొరబడుతూ చెప్పాడు వహీద్.

వినయంగా నమస్కారం చేసిన జగజీత్‌వంక సాదరంగా చూశాడు దీపక్. "గంగారం జాతరకి పోతున్నాం. నువ్వు కూడా రావచ్చు" పక్కన చోటుచూపిస్తూ చెప్పాడు.

"జాతరకి వస్తా బాబూ....నేను కూడా ముందే కూర్చుంటా.... మీరు విశాలంగా కూర్చోండి" అంటూ గండయ్య, వహీద్‌లతోపాటు తను కూడా ముందుభాగంలోనే ఇరుక్కుని కూర్చున్నాడు.

"ఒక్కొక్కళ్ళు వందకేజీల బరువున్నట్లున్నారు. కారు కదలడం లేదు. ఇవాళ ఫ్రెంట్ టైర్లు మటాషే...." అంటూ యాక్సిలేటర్‌ని అదిమాడు రాంసింగ్.

*   *   *   *

"మీకు అసలు బుద్ధిలేదు. తెల్లవారకముందే మనం బయలుదేరాలి అంటే పెందలాడే పడుకోవాలి. తిండి తినేది ఎప్పుడు? నిద్రపోయేది ఎప్పుడు?" చమన్‌గూడా ఫామ్‌హౌస్ దగ్గిర నిలబడి రాంసింగ్‌ని చూడగానే గయ్‌మని అరిచాడు మైసయ్య.

"అది సరేగాని నువ్వు ఏర్పాట్లు అన్నీ చేశావా?" కిందికి దిగుతూ అడిగాడు దీపక్.

"ఎప్పుడో అయిపోయాయి చిన్నబాబూ....గండయ్యగాడు పంపిన చిగురు ఇంతకుముందే వచ్చింది రండి....రండి" అంటూ వాళ్ళనందరినీ వెంటబెట్టుకుని లోపలికి తీసుకుపోయాడు మైసయ్య.

ఫామ్‌హౌస్‌లో పనిచేసే పిల్లల దగ్గర్నించి పెద్దలదాకా వరుసలో నిలబడి వెయిట్ చేస్తున్నారు దీపక్‌కోసం. అతను సమీపంలోకి రాగానే చేతులెత్తి నమస్కారాలు చేశారు. విశాలమైన కాటేజీ మాదిరి నిర్మించబడిన ఒక రేకులషెడ్డుముందు నేలను శుభ్రంచేసి, కళ్ళాపిజల్లి ముగ్గులతో అలంకరించారు వాళ్ళు. పెద్ద టేబిల్‌వేసి కంఫర్టబుల్‌గా వుండే కుర్చీని దానిదగ్గిర పెట్టారు.

ఆ ప్రదేశానికి కాస్తంత అవతలగా ఒక గుంజకి కట్టివేయబడి వుంది బలిష్ఠమైన పొట్టేలు ఒకటి. పసుపు కుంకాలు, వేపమండలు, దాని అవతారాన్ని కొంచెం భయంకరంగానే ఎక్స్‌పోజ్ చేస్తున్నాయి.

"బలిపొట్టేలు బాబూ....మనతో తీసుకుపోదాం" అంటూ దీపక్‌ని టేబిల్ దగ్గిర కూర్చోబెట్టాడు మైసయ్య.

"జాతర సందర్భంగా మనవాళ్ళందరికీ తలా ఐదొందలు బోనస్ ఇచ్చెయ్" అంటూ టేబిల్‌మీద సిద్ధంగా వున్న గ్లాసును చేతుల్లోకి తీసుకున్నాడు దీపక్.

"జాగ్రత్త బాబూ....తాగడానికి మహా మెత్తగా వుంటుంది. నిమ్మకాయనీళ్ళు తాగినట్టే అనిపిస్తుంది. లోపలికి పోయింతర్వాతగాని తనెవరో మనకి తెలియదు" తమవారందరికీ తలా ఒక గ్లాసు ఇచ్చి, తను ఇంకో గ్లాసును పుచ్చుకుంటూ హెచ్చరించాడు గండయ్య.

అతని మాటలు నిజమే అనిపించాయి దీపక్‌కి.

నిమ్మరసం మాదిరిగానే హాయిగా గొంతులోకి వెళ్ళిపోయింది గ్లాసులోని ద్రవపదార్థం.

అరగ్లాసు కూడా పూర్తికాకముందే వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టు అనిపించింది. ఎంతోదూరం పరిగెత్తగలనన్నట్లు ఏదో తెలియని కాన్ఫిడెన్స్ అతనికి కలిగింది.

ఓరకంట అతన్నే గమనించుకుంటున్న గండయ్య వున్నట్లుండి "ఇక చాలు బాబూ....ఇకచాలు....ఇంక ఆపేయండి" అన్నాడు.

"ఆపేయాలా? ఎందుకు ఆపేయాలి?" ఆశ్చర్యంగా గండయ్యని అడిగాడు రాంసింగ్.

"పెద్దబాబు భోజనంచేసే వేళ అయింది. తను భోజనం చేసే సమయంలో చిన్నబాబు దగ్గిర లేకపోతే ఆయనకి తినబుద్ది కాదు....

ఎక్కడ వున్నారో ఫోన్‌చేసి విషయం ఏమిటో కనుక్కుంటారు. ఇప్పుడో ఇంకో రెండు నిముషాల తర్వాతనో పీటర్ దగ్గిర్నించి ఫోన్ వస్తుంది" తను మాట్లాడిన మాటలకు అర్థాన్ని ఓపికగా వివరించి చెప్పాడు గండయ్య.

అతని మాటలు ముగియడం రాంసింగ్ దగ్గిర వున్న ఫోన్ గణగణలాడటం ఒకేసారి జరిగాయి.

"మీకు ఎవరికీ చింతాకయినా బుద్ధిలేదు. కాలేజీ దగ్గిర జరిగిన గొడవలో చిన్నబాబు ఫోన్ పాడయిపోయిందని మీకు తెలుసు. దాన్ని వెతికి



వెనక్కి తీసుకువచ్చి వేరే ఫోన్‌ని ఏర్పాటు చేయాలి. మీలో ఎవరయినా ఆ ఆలోచన చేశారా? తలలు ఊపుకుంటూ గంగిరెద్దుల మాదిరి వెనకాల వెళ్ళిపోవడమేనా?" ఖంగు ఖంగుమంటూ వినవచ్చింది పీటర్ కంఠం అవతలినుండి.

"కళ్ళుభాయీ....నిన్ను వదిలిపెట్టి మేమందరం చిన్నబాబు వెనకాల వచ్చేశామని నీకు కడుపు మండిపోతోంది. మాకు ఆలోచన రాలేదు. రాకపోవడం నిజంగా తప్పే....మరి నీ బుర్ర ఏం చేస్తోంది? నిద్రపోతోందా?" నెమ్మది నెమ్మదిగా పుచ్చుకుంటున్నా సరే. గండయ్య సేకరించిన చిగురు తన ప్రభావాన్ని చూపించడం మొదలుపెట్టేసరికి, కాస్తంత స్పీడ్‌గానే మాట్లాడాడు రాంసింగ్.

"నిజం మాట్లాడావ్....నన్ను ఒక్కడిని ఇక్కడ ఈ సరితమ్మ రాక్షసి దగ్గిర వదిలేసి కామ్‌గా మాయం అయిపోయారుకదరా మీరందరూ. నిజంగానే నా కడుపు ఉడికిపోతోంది. అద్సరేగాని, చిన్నబాబును తాతయ్యగారితో మాట్లాడమని చెప్పండి. ఆయన డైనింగ్ టేబిల్ ముందు భోజనానికి కూర్చుని ఫోన్‌లో మాట్లాడటానికి వెయిటింగ్" అన్నాడు.

తాగింది ఓ అరగ్లాసు కూడా లేకపోయినా, అప్పటికే ముద్దముద్దగా రావడం మొదలుపెడుతున్నాయి దీపక్ నోటివెంట మాటలు. "తాతగారు వెయిటింగా? నాతో చెప్పకుండా మీరు సోది చెప్పుకుంటున్నారా? ఫోన్ ఇటివ్వు" అంటూ దురుసుగా లాక్కున్నాడు రాంసింగ్ దగ్గిర వున్న ఫోన్‌ని.

* * * *

డైనింగ్‌హాల్ వెలుపల నిలబడి మాట్లాడుతున్నాడు పీటర్. పరుగు పరుగున లోపలికిపోయి సురేంద్రసాబ్‌కి తన దగ్గిర వున్న ఫోన్‌ని అందించాడు.

సెల్‌ఫోన్‌లోనించి అస్పష్టంగా వినవస్తున్న దీపక్ కంఠాన్ని వినగానే మిలమిల మెరిసిపోవడం మొదలుపెట్టాయి సురేంద్రసాబ్ కళ్ళు.

"నువ్వు ఇంకా భోజనంచేసి వుండవు. నాకు తెలుసు. ఆ గండయ్యగాడు నా బెడ్‌రూమ్ బీరువాలో వుండాల్సిన చిగురు బాటిల్స్ రెండింటిని మాయం చేసేశాడు. అది చాలా పవర్‌ఫుల్....వెంటనే అన్నం తినేయ్"

గంభీరమైన కంఠంతో సలహా ఇచ్చాడు.

"గండయ్య మీ బెడ్‌రూమ్‌లోకిపోయి చిగురు బాటిల్స్ దొంగిలించాడా? నిజమేనా నాన్నగారూ....నిజమేనా?" అన్నట్లు ముందుకు ఒంగుతూ చాలా వేగంగా ఆశ్చర్యంగా అడిగింది సరితాదేవి.

"గండయ్య దొంగిలించడం నిజంకాదు మేడమ్....బహుశా చిన్నబాబు టేస్ట్ చూడటం కోసం తీసుకురమ్మని చెప్పివుంటాడు. చిన్నబాబు చెప్పిన తర్వాత ఆ పని జరగకపోతే ఆయనకి మహా చెడ్డకోపం వచ్చేస్తుంది...." అంటూ గండయ్యని సేవ్ చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాడు పీటర్.

"తోడుదొంగలు మీరందరూ....ఆ దీపక్‌గాడు తిరిగి వచ్చిన తర్వాత వాడికి, మీకు కలిపి ఒకేసారి బుద్ధి చెపుతాను. అమాయకుడినిచేసి మా నాన్నగారిని ఆటలాడించేస్తున్నారు మీరందరూ....మీ పని అయిపోయింది" ఖచ్చితమైన కంఠంతో ఎనౌన్స్ చేసింది ఆమె.

పీటర్‌కి, సరితాదేవికి మధ్య ఎంతో సీరియస్‌గా జరుగుతున్న ఆ సంభాషణను కొంచెంగా కూడా పట్టించుకోలేదు సురేంద్రసాబ్ ఫోన్ మాట్లాడుతూ.

"ఎర్లీగా పడుకుంటే ఎర్లీగా లేవవచ్చు. మీరు గంగారం వెళ్ళేసరికి ఎనిమిది అవవచ్చు. బలి తతంగం పూర్తిఅయిపోయిన వెంటనే గుడి దగ్గర్నుంచి ఇవతలకి వచ్చేయండి. ఒక్క క్షణం కూడా అక్కడ ఆగకూడదు. అర్థం అయిందా?" ఫోన్‌ని చెవికి, భుజానికి మధ్యన ఇరికించుకుని, ఎదుట వున్న ప్లేటులో చేయిపెడుతూ, దీపక్‌కి సూచనలు ఇచ్చాడు సురేంద్ర సాబ్.

బిగపట్టి వుంచిన ఊపిరి తేలికగా వదులుతూ తన ప్లేటును ముందుకు జరుపుకున్నాడు సోహన్.

"వహీద్‌కి చెప్పి మధ్యాహ్నం తగిలిన దెబ్బలు ఎలా వున్నాయో చూడమను. అవసరం అయితే ఆయిల్‌తో మసాజ్ చేయించుకో. జాతర్లో ముక్కూ ముఖం తెలియని కేడీలు చాలామంది వుంటారు. అనవసరంగా ఎవరితోనూ మాటలు పెంచుకోకు. ఇక వుంటాను" అంటూ ఫోన్‌ని పీటర్ వైపు జాపాడాయన.



"హల్లో చిన్నబాబూ! అప్పుడే ఫోన్ పెట్టేయకండి. గండయ్యగాడు చాలా చెడ్డపని చేశాడు....తాతగారి బెడ్‌రూమ్‌లోనుంచి చెప్పాపెట్టకుండా చిగురు బాటిల్స్‌ని తీసుకువచ్చేశాడు. తాతయ్యగారు అయితే ఏమీ అనుకోలేదు. కానీ మీ అత్తమ్మ మాత్రం ఆ ఇష్యూని చాలా పెద్దది చేయడానికి సిద్ధంగా వుంది. ఎందుకు చెబుతున్నానో మీకు అర్థం అయిందా?" ఫోన్‌ని చెవికి ఆనించుకుని, అవతలి గదిలోకి వెళ్ళిన తర్వాత చల్లగా అసలు విషయాన్ని బయటపెట్టాడు పీటర్.

అవతలినించి వినవచ్చిన సమాధానం తనకు తృప్తిని కలిగించినట్టుంది. హ్యాపీగా నిట్టూర్చి, మెయిన్‌గేటు దగ్గిరికి వెళ్ళిపోయాడు వాచ్‌మేన్ డ్యూటీ చేయడానికి.

* * * *

సురేంద్రసాబ్ ముందుగానే ఊహించి చెప్పినట్టు ఎనిమిది గంటలు దాటిన పన్నెండు నిముషాలకు గాని జాతర దగ్గిరికి వెళ్ళలేకపోయాడు దీపక్.

"దెబ్బలు తగిలిన తర్వాత మొట్టమొదటి నిద్ర ప్రశాంతంగానే వుంటుంది చిన్నబాబూ! నిద్రలేచిన తర్వాతగాని వాటి ఎఫెక్ట్ కనిపించదు" అని అంటూనే వున్నాడు వహీద్. అతను అన్నట్టుగానే తెల్లవారుఝామున మైసయ్య వచ్చి నిద్రలేపినప్పుడు బెడ్‌మీదినించి కాలు కిందపెట్టలేకపోయాడు దీపక్.

"నాకు ఏదో అయిపోతోంది. వహీద్‌ని పిలువ్" అంటూ మైసయ్యకి చెప్పాడు.

అంతకుముందే నిద్రలేచి ప్రయాణానికి రెడీగా సిద్ధమై వున్నాడు వహీద్. రెండే రెండు అంగల్లో బెడ్ దగ్గిరికి వచ్చి, చిన్నపిల్లడిని లేపినట్టు నడుముకింద రెండు చేతులు పోనిచ్చి బెడ్‌మీదినించి లేపాడు.

"గోరువెచ్చటి నీళ్ళతో స్నానంచేస్తే రిలీఫు వస్తుంది చిన్నబాబూ! మీరేమీ ఖంగారుపడకండి....ముఖం తర్వాత కడుగుదాం, ముందు స్నానం చేయండి" అంటూ తనే దగ్గరుండి స్నానం చేయించాడు. ఆరు నిముషాల్లో ఫ్రెష్ అయ్యాడు దీపక్. డ్రెస్ చేంజ్ చేసుకుని, బ్రేక్‌ఫాస్ట్‌కి సిద్ధం అయ్యాడు.

పోటీలుపడి వంటలు చేశారు ఫామ్‌హౌస్‌లో పనిచేసేవాళ్ళ భార్యామణులు. మైసయ్య నెత్తీనోరు కొట్టుకుని చెపుతున్నా వినకుండా దీపక్ దగ్గ[illegible] వచ్చేశారు.

"మోహమాటాలు వద్దు చిన్నబాబూ! ఈ అద్దమయిన చెత్తనంతా తింటే కడుపు చెడుతుంది. మోహమాటపడకుండా వద్దని చెప్పండి" వెనక నిలబడి రహస్యంగా దీపక్‌ని హెచ్చరించాడు గండయ్య.

"నోరుమూసుకుని నీ పనేదో నువ్వు చూసుకో" అని అరిచి కసురుకుని, తన ఎదుట పెట్టబడిన ప్రతి ప్లేటులోని పదార్థాన్ని రుచిచూశాడు దీపక్. ఆ రుచిని నిర్మొహమాటంగా మెచ్చుకున్నాడు.

"చిన్నబాబంటే చిన్నబాబే.... మంచి, మన్నన తెలిసిన మనిషి.... మైసయ్య పట్టి మూర్ఖుడు" తమలో తాము చెప్పుకున్నారు ఆడవాళ్ళందరూ.

"చిన్నబాబూ! రెడీ! వ్యాన్‌ని స్టార్ట్‌చేశాం. మీరు వచ్చి కార ఎక్కండి" అంటూ మైసయ్య పెద్దగా పిలవడంతో అటుకేసి వెళ్ళా దీపక్.

పాలక్యాన్లను తీసుకుపోయే మినీ లారీమీద పొట్టేలును ఎక్కించి గండయ్య, మైసయ్య, ఇంకో నలుగురు ఫామ్‌హౌస్ పనివాళ్ళు నిలబడి వున్నారు.

"వ్యాన్ వెనకాల వస్తుంది చినబాబు! మనం ముందు వెళ్ళిపోదాం" తమ కారును తీసుకొచ్చి దీపక్ ముందు నిలబెడుతూ చెప్పాడు రాంసింగ్.

"మనం కారులో వద్దు. పొట్టేలుతోపాటు లారీలోనే వెళదాం" అంటూ అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా రెండు అంగల్లోపో లారీ వెనుక భాగంలోకి చేరుకున్నాడు. అతను మనస్సు మార్చుకునే ప్రసక్తి లేదని రాంసింగ్‌కి తెలుసు కాబట్టే అతిగా ఆలోచించకుండా కారును అక్కడే వదిలేశాడతను. వహీద్‌తో సహా తనుకూడా లో ఎక్కాడు.

"జై బోలో పోచమ్మ తల్లికీ!" అని బిగ్గరిగా అరిచి లారీని ముందుకు కదిలించాడు మైసయ్య. చెవులు చిల్లులుపడే స్థాయిలో పోచమ్మతల్లికి జై జై చెప్పారు లారీమీది ఫామ్‌హౌస్ పనివాళ్ళు.

లారీ మెయిన్‌గేటును దాటి రోడ్డుమీద రెండు కిలోమీటర్ల దూర



కూడా పోకముందే జాతర చూడాలని ముచ్చటపడుతున్న జనం మరో పాతికమంది లారీ వెనుకభాగంలో కిక్కిరిసి నిలబడ్డారు.

అందరితోపాటు అత్యుత్సాహంగా అరిచి కేకలుపెడుతున్న దీపక్‌ని ఆపడం వహీద్‌కి చేతకాలేదు, గండయ్య వల్లకాలేదు. ఇక రాంసింగ్ మాటయితే మొదట్లోనే చెల్లుబడి కాలేదు.

* * * *

"చిన్నబాబూ! కర్మ్మార్‌గూడా దగ్గిర తాటికల్లు మహా రుచిగా వుంటుంది తెలుసా? ముంతెడు గొంతులోకి పోతే యమ హుషారొస్తుంది. గంగారం జాతరకు పోయినోళ్ళు కర్మ్మార్‌గూడా కల్లును రుచిచూడందే వెనక్కి రారు" చిన్నగా దీపక్ చెవిలో ఊదాడు మధ్యలో లారీఎక్కిన జనంలోనించి ఒక మనిషి.

"ఆ చోటు రాగానే చెప్పు" హుషారుగా చెప్పాడు దీపక్. మరో అరగంటలో రానే వచ్చేసింది ఆ చోటు.

పెద్ద పెద్ద కుండల్లో కల్లు నింపుకుని కల్లు తీసే సమయంలో ఉపయోగించే యూనిఫామ్‌ని మార్చుకోనుకూడా మార్చుకోకుండా రోడ్డుపక్కన నిలబడి వున్నారు అనేకమంది గీత కార్మికులు.

"శుభ్రం వుండదు....శుచి అసలు కనిపించదు. వద్దు బాబు" ఆందోళన నిండిన కంఠంతో పెద్దగా అరిచినంత పనిచేశాడు గండయ్య. అతన్ని మింగేసేటట్టు ఒక చూపు చూసి లారీని ఆపించాడు దీపక్.

"మావాళ్ళు ముచ్చట పడుతున్నారు. కావల్సినంత పోసేయండి" అంటూ ఆ కార్మికులకు ఆర్డర్ ఇచ్చాడు.

లారీ ఆగిన మరుక్షణం కిందికి దూకి కల్లుకుండల మీదికి ఎగబడ్డారు జనం. పదే పది నిముషాల్లో మూడొంతుల సరుకును ఖాళీచేసి లారీమీదికి చేరుకున్నారు.

ప్యాంటుజేబులోనుంచి వాలెట్‌ని తీసి మైసయ్యకి అందించాడు చినబాబు.

"మీరు....మీరు పుచ్చుకోలేదేంటి చిన్నబాబూ?" ఆశ్చర్యంగా అడిగాడు మైసయ్య ఖాళీఅయిన సరుకును లెక్కకట్టి గీతకార్మికులకు పేమెంట్ ఇస్తూ.

"నాకు ఆ టేస్ట్ అస్సలు నచ్చదు. ఎప్పుడో సెవన్త్‌క్లాస్‌లో వుండగా ఒకసారి తాగాను అంతే....వాంతి వచ్చినట్టు అయింది" చెప్పాడు దీపక్.

"అది మన సిటీ కాంపౌండ్స్‌లో దొరికే సరుకు అయివుంటుంది. ఆ టేస్ట్ కొందరికి నచ్చదు. ఇదే అసలు సిసలు కల్లు.... చెట్ల మీదినించి దిగడం, మన గొంతుల్లోకి పోవడం.... తేడాలు వుండవు" అన్నాడు మైసయ్య.

ఆ సంభాషణను కంటిన్యూ చేయడం ఇష్టంలేక లారీని కదిలించమని చెయ్యి ఊపాడు దీపక్. అధిక ప్రసంగం చేయలేదు మైసయ్య కూడా. అతి వేగంగా నడిపి గంగారం పొలిమేరల్లో ఆపాడు.

చెట్లకింద నిలబడి వారికోసమే ఎదురుచూస్తున్నట్లు, అతి వేగంగా పరిగెత్తుకొచ్చారు అరడజనుమంది డప్పులవాళ్ళు.

"సురేంద్రసాబ్ పొట్టేలుకు మేమే దారిచూపిస్తూ వుంటాం.... మమ్మల్ని కాకుండా వేరేవాళ్ళని పిలిపిస్తే మేము ఊరుకోము" అంటూ తమంతట తామే డప్పులు మోగించడం మొదలుపెట్టారు.

డప్పులమీద దరువు మొదలు అవడం, దీపక్‌తోపాటు వచ్చిన వాళ్ళందరికీ టీ.పిలు పెరగడం ఒకేసారి స్టార్ట్ అయింది. చిందులు తొక్కడం, ఈలలు వేయడం మొదలుపెట్టారు. మైసయ్య లారీలో తీసుకు వచ్చిన పసుపును, గులాంని పొట్టేలుమీదా, దీపక్‌మీదా వెదజల్లుతూ గుడి దగ్గిరికి ప్రయాణమయ్యారు.

కోలాహలంగా వుంది గుడి ప్రాంగణం. కిటకిటలాడిపోతున్నారు భక్తులు. కొమ్ముబూరల మోత, డప్పుల శబ్దంతో తలలు గిర్రున తిరిగి పోతున్నాయి.

"రెండు బలులు అప్పటికే అయిపోయాయట....మనం మంచి టైముకే వచ్చాం. పదండి చిన్నబాబు...." అంటూ పొట్టేలును, దీపక్‌ని గుడి ముందుకు తీసుకుపోయాడు లోపలికిపోయి వచ్చిన మైసయ్య. దీపక్ చూస్తూ వుండగానే మూడో జీవం కూడా బలి యివ్వబడింది.

"సురేంద్రసాబ్ వంతు వచ్చింది. సురేంద్రసాబ్ పంపిన జీవం కావాలి...." కాపుసారా మత్తు తలదాకా ఎక్కిన పంబల మనిషి పెద్దగా అరిచాడు.



తమ పొట్టేలు కొమ్ములను బలంగా పట్టుకుని ముందుకు నడిపించాడు దీపక్. బ్రహ్మాండమైన వేటకత్తిని పట్టుకుని రాక్షసుడి మాదిరి నిలబడ్డ పంబల మనిషికి పొట్టేలును అప్పచెప్పబోతుండగా-

"ఇది మా వంతు....ఇప్పుడు బలి మా వంతు....ఆపండి....ఆ బలిని ఆపేయండి...." అంటూ వినవచ్చింది ఒక కంఠం. అదిరిపడి అటు చూశాడు పంబల మనిషి.

గంగారం గ్రామానికి పదిమైళ్ళ దూరంలో వుండే కుందారం గ్రామ పటేలు చకచకా ముందుకు వచ్చి బలంగా నెట్టేశాడు దీపక్ తీసుకు వచ్చిన పొట్టేలును.

"అయ్యా....దొరగారూ! తరతరాలుగా వస్తున్న ఆచారం. ఇప్పుడు మార్చడం పోచమ్మ తల్లికి ఇష్టం వుండదు" తడబడుతున్న కంఠంతో అతనికి నచ్చచెప్పడానికి ట్రైచేశాడు పంబల మనిషి.

* * * *

"తరతరాలుగా వస్తోందా? ఎలా వస్తోంది? ఎక్కడో పట్నంలో కూర్చుని పెద్ద దివాన్ బహదూర్ మాదిరి ఎవరితోనో జీవాన్ని పంపిస్తే అది ఆచారం ఎలా అవుతుంది? అదేమీ కుదరదు. స్వయంగా వచ్చిన వాళ్ళకే ఆచారం. ఇప్పుడు నాలుగోబలి మాదే....మార్చడానికి వీలులేదు" నిక్కచ్చిగా చెప్పాడు పటేలు.

"ఎక్కడో కూర్చుని ఎవరు పంపించారు బే? నీ కళ్ళు పూడుకు పోయాయా? జీవాన్ని తీసుకువచ్చిన దీపక్‌బాబు నీ కళ్ళకు కనిపించడం లేదా?" ఉన్నట్లుండి ముందుకు వస్తూ అడిగాడు మైసయ్య.

రక్తం పులిమినట్టు ఎర్రబడిపోయింది కుందారం గ్రామ పటేల్ వదనం. "కళ్ళు పూడుకుపోయాయని అంటావా? ఫామ్‌హౌస్‌లో పేడ తట్టలు మోసుకుని బతికే బద్మాష్‌గాడివి నువ్వు. నన్నే వెక్కిరిస్తావా?" అంటూ ఛాచిపెట్టి కొట్టాడు అతని చెంపమీద.

తగలలేదు ఆ దెబ్బ. తగిలి వుంటే మైసయ్య చెంప పగిలిపోయి వుండేది. తనకు తెలియకుండానే కదిలి ఆ చేతిని తన ఎడమచేత్తో అడ్డుకున్నాడు దీపక్.

"మైసయ్య మాటలు కొంచెం కటువుగానే వున్నాయి. అందుకు మీరు క్షమించాలి. మా తాతగారి తరపున నేను స్వయంగా వచ్చాను. నాలుగో బలి మాకు వదిలేయండి. ఆచారం అని అందరూ అంటున్నారు. ఇప్పుడు అది తప్పడం దేనికి?" అనునయంగా అడిగాడు.

"తప్పటం గిప్పటం జాన్తానై....ఇప్పుడు మా జీవాన్నే బలి ఇవ్వాలి....అసలు ఆచారాన్ని గురించి నీకేం తెలుసని మాట్లాడుతున్నావ్? ఈ బలి మాదే...." మరింత కటువుగా అంటూ పంబల మనిషి చేతుల్లో నుంచి వేటకత్తిని తాను తీసుకోవటానికి ప్రయత్నించాడు పటేల్. అతని మాటలు ముగించడం, దీపక్ పిడికిలి అతని ముఖానికి కనెక్ట్ అవటం ఒకేసారి జరిగింది.

"ఇంకొక్కసారి నోరు విప్పితే నీ నాలుక తెగి పోచమ్మ కాళ్ళ దగ్గిర పడుతుంది" రెండో దెబ్బ వేయడానికి రెడీ అవుతూ హెచ్చరించాడు.

పెదవులు చీరుకుపోయి ఎర్రటి నెత్తురు చుబుకం మీదికి జారటం మొదలుపెట్టేసరికి, విపరీతమైన కోపంతో వెర్రిగా అరిచాడు పటేల్.

"రండిరోయ్....వచ్చి వీడిని వేసేయండిరోయ్" అని బిగ్గరగా అరిచాడు.

వాళ్ళు మరింత బిగ్గరగా అరుస్తూ ముందుకు దూసుకువచ్చారు. అతనితోపాటుగా వచ్చిన కుందారం గ్రామ ప్రజలు దగ్గిర దగ్గిరగా వంద మంది.

* * * *

ఒక్క క్షణంలో ఒకే ఒక్క క్షణంలో బీభత్సంగా మారిపోయింది అక్కడి భక్తి వాతావరణం.

పోచమ్మతల్లికి వందనాలు చేస్తున్న ఆడా మగ అందరూ భయంతో దూరంగా పరుగులు తీశారు.

తను ఏం చేస్తున్నాడో తనకే తెలియని పిచ్చికోపానికి లోనై దీపక్ తనూ ఓ గణాచారి మాదిరిగానే చిందులు తొక్కడం మొదలు పెట్టాడు.

చుట్టూ చేరి తాము తీసుకువచ్చిన కర్రలతో అతని తల పగలగొట్టడానికి



దానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారు కుందారం గ్రామస్థులు. రెండో పక్కనుంచి వారిని చీల్చుకుంటూ ముందుకొచ్చేశాడు వహీద్.

"నేను ఇక్కడే వున్నా చిన్నబాబూ....వేసేయండి బద్మాష్ అందర్నీ....ఎవర్నీ వదిలిపెట్టద్దు" అంటూ బిగ్గరగా అరిచాడు. అతనికి రెండు అడుగులు అవతలనించి దొమ్మిలోకి దూరారు గండయ్య, మైసయ్య, రాంసింగ్‌లు.

వారి వెనుకనుంచి పరిగెత్తుకుంటూ వచ్చారు వారితోపాటు లారీలో వచ్చిన జనం అందరూ.

మీదికి వచ్చిన ఇద్దరు కుందారం గ్రామస్థుల్ని పిడికిటిపోట్లతో పక్కకు నెట్టి, పంబల మనిషి దగ్గర వున్న వేటకత్తిని తను లాగేసుకున్నాడు దీపక్.

"రండి....రండి....పోచమ్మతల్లికి ఇవ్వాళ మామూలు బలి కాదు. నరబలే...." అంటూ పటేల్ మీదికి జంప్ చేశాడు. అయిపోయి వుండేవాడే పటేలు. అక్కడికక్కడ తల తెగి కిందపడిపోయి వుండేవాడు. ఆ సమయంలో అనుకోకుండా స్టార్ట్ అయిన ఆ గలాటాని అరక్షణం ఆలస్యంగా అర్థంచేసుకున్న గంగారం గ్రామపెద్దలు హడావుడిగా వచ్చి అడ్డు పడటంవల్ల అతని ప్రాణాలు దక్కాయి. కర్రల దెబ్బకు పదిమంది తలలు పగిలాయి. గండయ్య ముక్కు ముఖానికి అతుక్కుపోయింది.

బలి ఇవ్వబడిన జీవాల నెత్తురుతో తడిసి వున్న వేటకత్తిని అతి బలవంతంగా దీపక్ చేతుల్లోనుంచి లాగేసుకున్నారు ఆ గ్రామపెద్దలు.

"జరిగింది ఏదో జరిగిపోయింది. ఇప్పుడు అయిపోయినదానికి ప్రతీకారాలు వద్దు. ఆనవాయితీ ప్రకారం కార్యక్రమాన్ని ముగిద్దాం" అంటూ అతన్ని అవతలికి నెట్టుకుంటూ తీసుకుపోయారు.

"అరేయ్....అవతలికి రారా....ఈ గ్రామందాటి నువ్వు బయటికి వెళ్ళలేవురా" అని దీపక్‌ని బెదిరించాడు కుందారం గ్రామ పటేల్.

"నీయవ్వ....సైతాన్‌కీ బచ్చే....ఈ గ్రామం ఏమిటి బే? అవసరం అయితే ఈ గ్రామాన్నే దాటి మా వూరికిపోతాం. దమ్ముంటే అడ్డం నిలబడు" భీమసేనుడి మాదిరి తొడ చరుస్తూ సవాల్ విసిరాడు వహీద్.

"ఊరుకోండి....మీరందరూ నోళ్ళు మూసుకుని గమ్మున వుండండి.

ఎగస్ట్రాలు ఎవరూ మాట్లాడొద్దు. అరేయ్....బలి మనిషి ఎవరు? బలిఇచ్చే మనిషి ఎవరు?" గొంతు చినిగిపోయే శృతిలో అరిచాడు పోచమ్మ గుడి ధర్మకర్త అయినటువంటి గంగారం గ్రామపెద్ద ఒకతను.

మధ్యలో నిలబడితే వాళ్ళు వీళ్ళు అందరూ కలసి తన తల పగల గొడతారేమోనన్న భయంతో దూరంగాపోయి నిలుచున్న పంబలమనిషి వెంటనే వచ్చేశాడు.

దీపక్ దగ్గిర్నించి గ్రామపెద్ద తీసుకున్న కత్తిని తిరిగి తన స్వాధీనపరుచుకుని అమ్మవారి ముందు నిలుచున్నాడు బలివ్వడానికి సిద్ధంగా.

"కోరుకోండి చినబాబూ....అమ్మవారిని ఏదైనా కోరిక కోరు కోండి" వెంటనే దీపక్ చెవిలో వూదాడు మైసయ్య.

"మనం ప్రత్యేకంగా కోరుకునేవి ఏమీ లేవు. తాతగారు హ్యాపీగా వుండాలి. ఆయన ఆరోగ్యం హ్యాపీగా వుండాలి. అంతే...." అంటూ తల వంచి ఎదురుగా వున్న పోచమ్మతల్లికి నమస్కారం చేశాడు దీపక్.

గంగాళం మాదిరి నోరు తెరిచి గుండెలు అవిసిపోయేటట్లు ఒక అరుపు అరిచాడు పంబల మనిషి. కత్తిని రెండు చేతులతోనూ పైకి ఎత్తి ఫెడీమని పొట్టేలు మెడమీద ఒకే ఒక్క వేటు వేశాడు. "పోచమ్మ తల్లీ జై...." గొంతులు చినిగిపోయేటట్లు గట్టిగా అరిచారు జనం.

ఒకే ఒక్క దెబ్బకు తెగి అవతల పడిపోయింది పొట్టేలు తల చిక్కని ఎర్రటి రక్తం పిచికారితో విరజిమ్మినట్టు ఆ ప్రదేశమంతా పరుచు కుంది.

కత్తికి అంటిన రక్తాన్ని బొటనవేలితో తీసి దీపక్ ముఖానికి పులి మాడు పంబలమనిషి. "జయం మీదే....పోచమ్మతల్లి ఆశీర్వాదాలు మీవే.... వెళ్ళిరండి సాబ్....మమ్మల్ని మాత్రం మరిచిపోకండి" అంటూ మరో బలి జీవాన్ని ముందుకు తీసుకురమ్మని సైగచేశాడు.

జాతర అయిపోయిన తర్వాత మా మైసయ్య దగ్గిరికి వచ్చి కని పించు. నిన్ను సంతోషపెట్టి వంపిస్తాడు" అంటూ అతనికి చెప్పి గండయ్య, రాంసింగ్, వహీద్‌లతో కలిసి ఆలయం వెలుపలికి వచ్చాడు దీపక్.

"పదండి చిన్నబాబూ....కర్రసాము చూసొద్దాం" అంటూ దీపక్ చెయ్యిపట్టుకుని జాతర సంరంభంలోకి హుషారుగా తీసుకుపోయాడు



వహీద్.

రంగుల రాట్నాలు తిరుగుతున్నాయి. బుడగలు గాలిలో ఎగురు తున్నాయి. చిరుతిళ్ళు, ఐస్‌క్రీములు అమ్మేవాళ్ళ అరుపులు, బొమ్మల దుకాణాల ముందు బేరాలు....కన్నులపండుగగా వుంది ఆ ఎట్మాస్ఫియర్.

ఆ సందడి మధ్యభాగంలో గుంపుగా పోగుపడిన జనం చూస్తూ వుండగా కర్రసాము ప్రదర్శిస్తున్నాడు బీహార్‌నుంచి వచ్చిన దాడీవాలా. తన మనిషి ఒకతని తలమీద నిమ్మకాయల్ని పెట్టి తన పొడవాటి కత్తితో మధ్యకు తెగనరుకుతున్నాడు.

"చూడండి చిన్నబాబూ....అతని కాన్‌సన్‌ట్రేషన్‌ని చూడండి. అతనయినా, మనమయినా ఇటువంటి విషయాల్లో కాన్‌సన్‌ట్రేషన్ ముఖ్యం. బాగా గమనించండి" దీపక్ చెవిలో నెమ్మదిగా ఊదాడు వహీద్.

0 * * *

కనులు చిట్లించి తదేకదీక్షతో చూస్తున్న దిపక్‌ని గమనించాడు దాడీవాలా శిష్యుడు ఒకతను.

"ఏంటి పట్నంబాబూ....ఈ పని నువ్వు చేయగలవా? మీకు అంత దమ్ముందా?" కొంచెం వెక్కిరింపుగా, వెటకారంగా అడిగాడు దీపక్‌ని.

అతను ఒక్కడే అలాగే అడిగి వుంటే పట్టించుకుని వుండేవాడు కాదు దీపక్. అతని మాటలు బరిలో నిలబడి వున్న మరికొంతమంది శిష్యులకు వినబడి వాళ్ళు కూడా వెటకారంగా నవ్వారు. ఆ మాటలు విన బడిన పౌరులు కూడా కొంతమంది వింతగానే చూశారు.

"అరే దొంగనాయాళ్ళలారా....ఎవరని అనుకుంటున్నారుబే.... పట్నంలో వుండే సురేంద్రసాబ్ మనవడు ఇతను. మాటలు జాగ్రత్తగా రానీయండి" అని కోపంగా ఎదురుపలకబోతున్న గండయ్య నోటిని తన చేయిపెట్టి గట్టిగా అదిమాడు దీపక్.

"మనం ఎవరమో వీళ్ళకు తెలియాలంటే వీళ్ళ ఛాలెంజిని ఒప్పు కోవాలి. అదే బెటరు" అంటూ వున్నట్లుండి ముందుకు ఒక్క అడుగు వేశాడు.

"అయ్యబాబోయ్....మీరు ఆగండి....ఆగిపొండి" ఖంగారుగా ఆప డానికి ప్రయత్నం చేశాడు గండయ్య.

ఆగలేదు దీపక్. సూటిగా పోయి దౌడీవాలా దగ్గిర వున్న కత్తి కోసం చెయ్యిజాచాడు.

తకధిమి తకధిమి అంటూ గుండెలు జలదరించేసట్లు డప్పులు మోగిస్తున్న జనం ఈ సంఘటనతో కంగుతిన్నట్లయి, మోగించడం ఆపేశారు.

అప్పటివరకు సందడి సందడిగా వున్న ఆ ప్రదేశం ఒక్కసారిగా నిశ్శబ్దంతో నిండిపోయింది.

"నువ్వు పట్నంనించి వచ్చినవాడివి. ఈ విద్యను చూపించగలవా?" ఆశ్చర్యంగా అడిగాడు దౌడీవాలా.

"విద్యలు చూపించడానికి పల్లెల్లోనే వుండాల్సిన అవసరంలేదు. పట్నం వాళ్ళకు కూడా వుంటాయి తెలివితేటలు" అంటూ కత్తిని తనంతట తనే అతని చేతుల్లో నించి తీసుకున్నాడు దీపక్.

"ఒక్క దెబ్బకే ఛాన్సు....గురితప్పితే మావాడి తల మధ్యకి తెగుతుంది. మీరు సరాసరి పోలీస్ ఠాణాలోకి వెళ్ళిపోతారు" హెచ్చరించాడు దౌడీవాలా.

"గురి తప్పదు. నిమ్మకాయ నెత్తిమీద పెట్టండి" గంభీరంగా అన్నాడు దీపక్.

*　　　*　　　*　　　*

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది. ఊపిర్లు బిగపట్టేశారు జనం. అంతకుముందు వరకూ ఎంతో దమ్ముగా నిలుచున్న దౌడీవాలా శిష్యుడి ముఖంలో ప్రత్యక్షం అయింది విపరీతమైన భయం. అయినాసరే లావుపాటి నిమ్మకాయని నెత్తిమీద పెట్టుకుని కదలకుండా రాతిస్తంభం మాదిరి నిలబడ్డాడతను.

"కాన్సన్‌ట్రేషన్ చిన్నబాబూ....కళ్ళు కొద్దిగా మూసుకుని ఖచ్చితంగా గురిచూడండి" దీపక్ వెనకాల నిలబడి స్థిరమైన కంఠంతో చెప్పాడు వహీద్.

కత్తికి తలకి మధ్యవున్న దూరాన్ని జాగ్రత్తగా చూసుకున్నాడు దీపక్. అతను తల ఊపగానే మందపాటి వస్త్రాన్ని అతని కళ్ళకు గంతలుగా కట్టాడు దౌడీవాలా.

మరింత అధికం అయిపోయింది అక్కడ నిలబడిన వారిలో



ఉత్కంఠ....అందరి గుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలయింది. స్ట్రెయిట్‌గా జాచి పట్టుకున్న కత్తిని నెమ్మదిగా పైకి ఎత్తాడు దీపక్.

"ఎత్తు గుర్తుందిగా చిన్నబాబూ....దెబ్బకొట్టగానే వెనక్కి గుంజండి. అంతే...." మరోసారి దీపక్ వెనుకనుంచి చిన్నగా హెచ్చరించాడు వహీద్.

గుండెలనిండా వూపిరి పీల్చుకుని వున్నట్లుండి కత్తిని కిందికి దించాడు దీపక్. టెన్షన్‌ని భరించడం అసాధ్యమైపోయింది దౌడీవాలా శిష్యుడికి. కంటికి కనిపించనంత వేగంతో కత్తి కిందికి దిగడం మొదలు పెట్టగానే, గావుకేక బిగ్గరగా అరిచి, అవతలికి దూకాడు.

"ఖడ్‌జావ్....నువ్వర్‌కీ బచ్చే....ఖడో...." ఖంగారుగా హెచ్చరించాడు దౌడీవాలా.

"చిన్నబాబూ....స్టాప్....స్టాప్" అతనికంటే పదింతలు ఖంగారు పడుతూ దీపక్‌ని ఉద్దేశించి అరిచాడు వహీద్.

రయ్‌మంటూ కిందికి వాలుతున్న కత్తిని సడెన్‌గా ఆపి, స్టిఫ్‌గా పట్టుకు నిలబడ్డాడు దీపక్.

దౌడీవాలా శిష్యుడు తప్పించుకున్నాడు. అతని తలమీది నిమ్మకాయ మాత్రం తప్పించుకోలేకపోయింది.

కత్తి అంచు దానికి తగిలిన సమయంలో అవతలికి జంప్‌చేశాడు దౌడీవాలా శిష్యుడు. అదే సమయంలో కత్తి గమనాన్ని పూర్తిగా నిలిపి వేశాడు దీపక్.

మధ్యభాగం వరకూ తెగి, కత్తికే టైట్‌గా పట్టుకుపోయి అందరికీ కనిపించింది నిమ్మకాయ.

*　　　*　　　*　　　*

"అయ్యబాబోయ్....ఇది చాలా విచిత్రం....విడ్డూరం. ఇట్లాంటిది నేను ఇంతకుముందెప్పుడూ చూడలేదు" గుండెలమీద చేతులు వేసుకుంటూ అన్నాడు దౌడీవాలా. చప్పట్లు ఈలలతో మార్మోగిపోతోంది ఆ ప్రదేశం. దీపక్ గెలుపు తమ గెలుపే అయినట్టు చిందులు తొక్కడం మొదలు పెట్టారు అక్కడే వున్న జనం.

"ఎవరివి బాబూ నువ్వు? నీ గురువు ఎవరు?" దీపక్ భుజాల్ని

పట్టుకుంటూ సాదరంగా అడిగాడు దౌడీవాలా.

"మా చినబాబు ఎవరో తెలీదా? సురేంద్రసాబ్ మనవడు" వెంటనే చెప్పాడు విపరీతమైన గర్వంతో వుప్పొంగిపోతున్న గండయ్య దౌడీవాలాతో.

కనులు చిట్లించాడు దౌడీవాలా....ఆ పేరును గుర్తుచేసుకోవడా ప్రయత్నించాడు.

"నీకు గుర్తురాదు....గుర్తువచ్చే పేరు చెప్పనా. నిబ్బరంగా ని బడు" నవ్వుతూ అన్నాడు వహీద్.

"నిబ్బరంగా నిలబడాలా? అంత గొప్ప పేరు ఇంకోటి వుంది! ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాడు దౌడీవాలా.

"పాతిక సంవత్సరాలక్రితం ఇదే జాతరలో నీకు, కుందారం గ్రామస్థులకీ కర్రసాము వ్యవహారంలో మాట తేడా వచ్చింది. కత్తులుపట్టుకుని కుందారం గ్రామం మొత్తం నీ బుర్ర పగలగొట్టడానికి కదిలివచ్చింది. పాతికమంది తలలు పగలకొట్టి, మరో పాతికమందిని ఒంటిచేత్తో అవతలికి తరిమి నిన్ను, నీ బేవార్స్ శిష్యుల్ని కాపాడాడు ఒక పెద్ద మనిషి....గుర్తున్నాడా?" చిరునవ్వు చిందిస్తూ అడిగాడు వహీద్.

"గుర్తుండకపోవడం ఏమిటి భాయీ? ఇప్పుడు కూడా ఇంకా కళ్ళల్లో మెదులుతోంది ఆ రోజు జరిగిన సంఘటన. తలుచుకుంటుంటే ఇంకా ఒళ్ళు జలదరిస్తూనే వుంది. జగదీష్‌బాబు....పోచమ్మతల్లికి బలిజీవాన్ని తీసుకువచ్చిన పట్నందొర...." అరమూసిన కళ్ళతో ఆ రోజును తలచుకుంటూ చెప్పాడు దౌడీవాలా.

"అవును కదూ....ఆ జగదీష్‌బాబు కొడుకే ఈ చిన్నదొర....బాగా చూడు" అన్నాడు వహీద్.

* * * *

ముఖంమీద ఎవరో చాచిపెట్టికొట్టినట్టు అదిరిపడి అరడుగు దూరం అవతలికి జరిగాడు దౌడీవాలా. దీపక్ దగ్గిర తీసేసుకున్న కత్తిని అమాంతం అవతలికి విసిరి, అతని పాదాలకు నమస్కారం చేయబోయాడు.

"అరెరే....ఏమిటిది? మీ వయస్సువాళ్ళు నాకు నమస్కారం చేయడం ఏమిటి?" అంటూ ఎగిరివెనక్కి దూకాడు దీపక్ అతని



దూరంగా.

"జగదీష్‌బాబు నెత్తురు మీలో వుండబట్టే కత్తిని చేతుల్లోకి తీసుకోగలిగారు. మేము ముందుగానే గమనించకపోవడం మాది తప్పు.... పులి కడుపున పులే పుడుతుంది" చేతులు జోడిస్తూ అన్నాడు దౌడీవాలా.

"పులీ లేదు, మేకా లేదు. అనవసరమైన మాటలు మాట్లాడబోకండి. ఏదో సరదాపడి మీ బరిలోకి దిగాను. మా వహీద్ పక్కన వుండబట్టి ధైర్యం చేయగలిగాను. అంతకన్నా ఇంకేమీలేదు" అంటూ, అక్కడ నిలబడటం ఇష్టంలేక వేగంగా ఇవతలికి వచ్చేశాడు దీపక్.

"దొంగనాయాళ్ళకి జీవితమంతా గుర్తుండిపోయేటట్టు చేశావ్ చిన్నబాబూ! నాయాళ్ళకి ఇక నిద్రపట్టదు.... నోళ్ళు తెరుచుకోవు" తమను ఛాలెంజ్ చేసిన దౌడీవాలా శిష్యులను గుర్తుచేసుకుంటూ అన్నాడు గండయ్య.

కర్రసాము జరిగే ఏరియా దగ్గిర్నించి సూటిగా ఒక ఐస్‌క్రీమ్ బండి దగ్గిరికి దారితీస్తున్న దీపక్‌కి ఎందుకో అనుమానం వచ్చింది. "వహీదూ! ఆ ఆడమనిషి చూడు. అదేపనిగా మనవంకే చూస్తోంది.... ఎవరై వుంటుందో వెళ్ళి తెలుసుకో" దూరంలో నిలబడివున్న ఒక స్త్రీని వహీద్‌కి చూపిస్తూ చెప్పాడు.

అటుకేసి తిరిగాడు వహీద్. ఆమెను తమ దగ్గిరికి పిలవడానికి నోరు తెరిచాడు.

మాట బయటికి రాకముందే వడివడిగా అడుగులు వేస్తూ తనే వారి దగ్గిరికి వచ్చిందామె.

"కుందారం గ్రామపెద్ద జనాల్ని పోగుచేస్తున్నాడు.... బీదర్ నించి ఎవరో రౌడీల్ని రప్పిస్తున్నాడు. చిన్నబాబు! మీరు వెంటనే ఇంటికి వెళ్ళిపొండి" దగ్గిరికి వస్తూనే గబగబా చెప్పి, గబగబా అవతలికి వెళ్ళిపోయింది.

"ఎవరు? ఆమె ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

ముసిముసి నవ్వులు నవ్వాడు వహీద్. మెరుస్తున్న కళ్ళతో దీపక్ వంక ఒకసారి చూసి, చటుక్కున తల పక్కకు తిప్పుకున్నాడు రాంసింగ్.

"ఆమె ఎవరో మీకు తెలుసని నాకు అర్థం అయింది. మర్యాదగా చెప్పకపోతే ఊరుకునేదిలేదు...." కోపంగా వారిద్దరినీ హెచ్చరించాడు

దీపక్.

"కోపం దేనికి చిన్నబాబూ! ఆ రోజుల్లో అంటే మీ నాన్నగారు ఈ జాతరకి వస్తున్న రోజుల్లో జాతర సందర్భంగా ఇక్కడ గాన బజా కార్యక్రమాలు జరిగేవి. అవంటే మీ నాన్నగారికి మహా ఇష్టం. వచ్చినప్పుడల్లా ఈమెతో కూర్చుని గంటలకొద్దీ పాటలు పాడించు కునేవాళ్ళు.... అదీ విషయం. నాన్నగారు పోయిన తర్వాత ఇక్కడ ఆ కార్యక్రమాలు కూడా రద్దయిపోయాయి" చెప్పాడు వహీద్.

* * * *

జనంలో కలిసి మటుమాయం అయిపోయింది ఆ స్త్రీ. ఆమె వెళ్ళి వైపే చూస్తూ, ముందుకు అడుగువేసి, పొరపాటుగా ఒక యువతిని ఢీకొట్ట బోయాడు దీపక్.

"చూసి నడువ్ అల్లుడూ! కళ్ళుమూసుకుని నడిస్తే పొరపాట్లు జరి గొడవలు అయిపోతాయి. కాస్తంత ఎదుట ఏం వుందో చూసుకో" అంటూ మృదువుగా అతన్ని మందలించాడు ఆ యువతి పక్కనేవున్న మధ్యవయ స్కుడు ఒకతను.

తన తప్పును గమనించి నాలుక కరుచుకుంటూ ఆ యువతికి నమ స్కారం చేయబోయాడు దీపక్.

"మనలో మనకి నమస్కారాలు ఎందుకురా అల్లుడూ! జాతరనించి ఇంటికి వెళ్ళేటప్పుడు ఒక్కసారి మా ఊరికి రా. ఈ అమ్మాయి నా కూతురు. పెళ్ళికూడా నిశ్చయం అయింది. ఇంకో పదిరోజుల్లో వుంది పెళ్ళి. పట్నంవచ్చి తాతగారికి శుభలేఖ ఇస్తాను" అతన్ని ఆప్యాయం రంగా అన్నాడు ఆ మనిషి. ప్రశ్నలు నిండిన చూపులతో మళ్ళీ వహీద్ వంక చూశాడు దీపక్.

"ఆయన మీ నాన్నగారికి మంచి ఫ్రెండు. ఇద్దరూ కలిసి ఒకే కాలేజీలో చదువుకున్నారు. కుందారం పక్క ఊరు" చెప్పాడు వహీద్. నిర్మొహమాటంగా ఆ మనిషికి నమస్కారం చేశాడు దీపక్.

"నీ పద్ధతి నాకు నచ్చింది అల్లుడూ! సంబంధం కుదిరి పెళ్ళి నిశ్చయం అయిపోయింది కాబట్టి మాట్లాడకూడదుగాని, నిన్నే నా అల్లుడిగా చేసుకునివుంటే ఎంతో బాగుండేది. పెళ్ళికి నువ్వు తప్పకుండా రావాలి.



ఇందాక దౌడీవాలా దగ్గిర నీ దూకుడు చూశాను. చాలా గర్వంగా వుంది" అంటూ అతని భుజంతట్టి అవతలికి వెళ్ళిపోయాడు ఆ మనిషి.

"మీ నాన్నగారికి ఈ చుట్టుపట్ల చాలామంది స్నేహితులు వున్నారు చిన్నబాబూ! నువ్వు జాతరకి వచ్చావని తెలిస్తే అందరూ కట్టకట్టుకుని వచ్చే స్తారు నిన్ను చూడటానికి" అంటూ దీపక్‌ని ఐస్‌క్రీమ్ బండి దగ్గిరికి తీసుకపోయాడు వహీద్.

ఒకరి వెనుక ఒకరుగా అక్కడ ప్రత్యక్షం అయిన తనవారందరికీ ఐసులు ఇప్పించాడు దీపక్. రెండు ఐసుల్ని తను తీసుకున్నాడు.

"అక్కడ మైసయ్య పంటలు పూర్తిచేయించి, అమ్మవారికి నైవేద్యం పెట్టించి వుంటాడు. నెమ్మదిగా పోదాం.... ఇప్పటికే ఆలస్యం అయింది" అంటూ మళ్ళీ ఆలయం దగ్గిరికి దారితీశాడు గండయ్య. అతను చెప్పినట్లు గానే పేటను పండించి, అమ్మవారి భాగాన్ని అమ్మవారికి సమర్పించి తిరిగి వచ్చాడు మైసయ్య.

"దౌడీవాలాని గురించి మీకు చెప్పింది నేను. అటువంటిది నేను దగ్గిర లేకుండా అక్కడ మీరు బరిలోకి దిగడం ఏమీ బాగోలేదు. నాకు చాలా బాధగా వుంది" దీపక్‌ని చూడగానే చిరుకోపంతో అన్నాడు.

* * * *

చిన్నగా నవ్వి, ఒక చెట్టుకింద కూర్చున్నాడు దీపక్. విస్తరిని అతని ముందుంచి, అమ్మవారి ప్రసాదాన్ని ముందుగా అతనికి వడ్డించాడు మైసయ్య.

మొదటి ముద్దను ఎత్తి నోటిలో పెట్టుకోబోతుండగా. పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అక్కడికి వచ్చాడు ఆలయ ధర్మకర్తల్లో ఒకతను. వచ్చి రావడంతోనే "మీరు తిరుగు ప్రయాణం వచ్చిన దారిలో చేయకండి.... చుట్టూ తిరగడం అయినాసరే, సిద్దిపేట మీదుగా వెళ్ళండి" ముందుకు ఒంగి దీపక్ చెవిలో ఊదాడు.

"చుట్టుదారిన వెళ్ళాలా? ఎందుకని?" ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ అడిగాడు దీపక్.

"ఎందుకు ఏమిటి అనే ప్రశ్నలు వేసే సమయం కాదు ఇది. ముందు మీ తిండి కార్యక్రమం తొందరగా ముగించి ప్రయాణం మొదలుపెట్టండి.

అంతే" కటువైన మాటలతో మరోసారి చెప్పి, ఎంత హడావుడిగా వచ్చాడో, అంతే హడావుడిగా వెళ్ళిపోయాడా ధర్మకర్త.

ప్రశ్నలు నిండిన కనులతో వహీద్ వైపు చూశాడు దీపక్.

"నాకు అర్థం అయింది. మీరు ముందు భోజనం చేయండి. మనం ఎంత త్వరగా ఇక్కడినించి బయలుదేరితే అంత మంచిదని అనిపిస్తోంది" అంటూ రెండే రెండు నిమిషాల్లో తన విస్తరిని ఖాళీచేశాడు వహీద్.

ఒకరి తర్వాత ఒకరుగా ప్రసాదం అరగించడానికి అక్కడ ప్రత్యక్షం అయిన తమ జనానికి అందరికీ చాలా ఓపికగా వడ్డించాడు మైసయ్య.

"మేము వేరే పనిమీద సిద్ధిపేట వెళ్ళి, అక్కడినించి చుట్టూతిరిగి ఇంటికి చేరుకుంటాం. మీరెవరూ మాతో పెట్టుకోవద్దు. మీ దారి ఏదో మీరు చూసుకోండి" పేరు పేరుగా అందరికీ చెప్పి ఒప్పించాడు.

"మీ గోల ఏమిటో నాకు అర్థంకావడంలేదు. ఎందుకు మనం సిద్ధిపేట వెళ్ళడం?" అప్పటికీ అసలు విషయం అవగతం కాకపోవడంతో విసుగ్గా అన్నాడు దీపక్.

"మీకు అర్థంకాకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏమీలేదు. దయచేసి కాస్సేపు గమ్మున నిలబడండి. మమ్మల్ని ఖంగారుపెట్టకండి" మెత్తగా అయినా చాలా ఖచ్చితంగా చెప్పి, నిముషాలమీద ప్రయాణానికి సిద్ధం అయ్యాడు మైసయ్య. తమ లారీని ఆలయం దగ్గిరికి తీసుకువచ్చి, దీపక్ని క్యాబిన్లో కూర్చోబెట్టాడు.

అంతకుముందు వట్టి చేతులతోనే వచ్చారు అక్కడికి వాళ్ళందరూ ఇప్పుడు స్వయంగా వెళ్ళి, జాతరలో విక్రయిస్తున్న బొణాకర్రల కట్టలు రెండింటిని తీసుకువచ్చి లారీలో పడవేశాడు గండయ్య.

"వాళ్ళు....ఆ కుందారం గ్రామస్థులు మనల్ని ఎటాక్ చేయబోతున్నారా?" అప్పటికి అసలు విషయాన్ని గ్రహించి నెమ్మదిగా అడిగాడు దీపక్.

"చేస్తారో, చేయరో సరిగ్గా తెలియదు మనకి. అయినాసరే ముందు జాగ్రత్త తీసుకుంటున్నాం. అవసరం లేకపోతే వీటిని మన పామ్హౌస్లో పారేద్దాం. ఒక పక్కన పడివుంటాయి" అంటూ మైసయ్యకి సైగచేశాడు



వహీద్.

వెంటనే ఇంజన్ని స్టార్ట్చేసి లారీని వేగంగా ముందుకు కదిలించాడు మైసయ్య.

* * * *

"దీపక్ ఇంట్లో లేడా? గంగారం జాతరకి వెళ్ళాడా? మరి నాకు ఎందుకు చెప్పలేదు....చెపితే నేను కూడా తనతోపాటు జాతర చూడటానికి వెళ్ళేదాన్ని కదా!" సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటికివచ్చి, మరియమ్మతో అన్నది శృతిమేడమ్.

"దీపక్ లేకపోతే ఇప్పుడు వచ్చిన నష్టం ఏముంది? మా సోహన్ వున్నాడుగా....నీకు మంచి కంపెనీ ఇస్తాడు. ఇద్దరూ కలిసి ఏదైనా సినిమాకు వెళ్ళండి" వెంటనే చెప్పింది హాల్లో కూర్చుని వున్న సరితాదేవి.

అంతటితో ఆగలేదామె. పెద్ద కంఠంతో కొడుకు సోహన్ను కూడా పిలిచింది.

ఎందుకనో ముఖం చిట్లించింది శృతిమేడమ్. "సినిమా చూడటం ఇప్పుడు నాకు ఇష్టంలేదు. ఇంకోసారి ఎప్పుడయినా చూస్తాను" అంటూ మరియమ్మ తీసుకువచ్చిన టీకప్పును టీపాయ్ మీద పెట్టి వెళ్ళిపోవడానికి సోఫాలో నుంచి లేచింది.

"ఇప్పుడే వచ్చి అప్పుడే వెళ్ళిపోతున్నావేమిటమ్మా? దీపక్ లేకపోయేసరికి బోర్ కొట్టిందా?" తన గదిలోనించి వస్తూ సాదరంగా పలకరించాడు సురేంద్రసాబ్.

గబగబా ముందుకుపోయి ఆయన పాదాలకు నమస్కారం చేసింది శృతి మేడమ్.

"బోర్ కొట్టడంకాదు....దీపక్కి నిన్న తగిలిన దెబ్బలు ఎలా వున్నాయో అడుగుదామని వచ్చాను....అంతే" అంటూ అలాగే నిలబడింది.

"అటువంటి దెబ్బలు వాడికి ఒక లెక్కలోవికాదు తల్లీ....చూడటానికి సుతిమెత్తగా కనిపిస్తాడుగాని, వాడిది అంతా వాడి నాన్న పోలిక. వట్టిమొండి బండ" అంటూ చటుక్కున తన మాటల్ని ఆపాడు.

వెంటనే తలను పక్కకు తిప్పుకున్నాడు.

మర్యాద అనే పదానికి అర్థం తెలీని మనిషిలా, మరొక్కమాట కూడా మాట్లాడకుండా మళ్ళీ తన గదిలోకి వెళ్ళిపోయాడు. సురేంద్ర సాబ్.

సురేంద్రసాబ్ ఎందుకలా చేశారో, అలా ఎందుకు జరిగిందో శృతి మేడమ్‌కి ఏం అర్థంకాలేదు. నివ్వెరపడి అలాగే నిలుచుండిపోయింది ఆమె.

* * * *

"కొడుకు గుర్తుకొచ్చివుంటాడు....చచ్చిపోయి చాలాకాలమైనా గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసుపాడైపోతుంది అయ్యగారికి.

ఇంకో గంట, గంటన్నరవరకూ ఎవరితోను మాట్లాడరు. అసలు గదిలోనుంచి బైటికిరారు" చిన్నకంఠంతో పక్కకు వచ్చి శృతి మేడమ్ చెవిలో ఊదింది మరియమ్మ.

"కొడుకా? కొడుకంటే దీపక్ తండ్రేకదా?" కుతూహలం నిండిన కంఠంతో అడిగింది శృతి మేడమ్.

"అవును తల్లీ....చిన్నబాబు తండ్రే....ఆయన పేరు జగదీష్‌బాబు. పిటపిటలాడే వయసులో భార్యతోసహా కారు యాక్సిడెంట్‌లో చనిపోయాడు....పెద్దబాబుకు తీరని బాధ. ఇప్పటికి కూడా కోలుకోలేదు" చెప్పింది మరియమ్మ.

గంటన్నరదాకా గదిలోనుంచి బయటికి రాడని అనుకున్న సురేంద్రసాబ్, అప్పుడే ఇవతలికి రావడం శృతిమేడమ్‌కి కనిపించింది.

"వెళ్ళిరాతల్లీ....వయసులో వున్నవాళ్ళు తమ వయసువాళ్ళ కంపెనీనే ఇష్టపడతారు. సోహన్‌తో కాస్సేపు అలా అలా షికారుకు నిశ్చింతరంగా నువ్వు వెళ్ళిరావచ్చు. మీ మామయ్యకు నేను ఫోన్‌చేసి చెప్తాను" చిరునవ్వుతో ఆమెను ఎంకరేజ్ చేశాడు సురేంద్రసాబ్.

పోర్టికోలో నిలబెట్టివున్న శృతిమేడమ్ కారు దగ్గర నిలబడి అసహనంగా హారన్ మోగించాడు సోహన్.

"నేను వచ్చిన పని ఒకటి. ఇప్పుడు నేను చేస్తున్నది మరొకటి. నేను చేయాల్సిందేమిటో నేనే డిసైడ్ చేసుకోవాలి. నా ప్రోగ్రాములను వేరేవాళ్ళు డిసైడ్ చేయడం నాకు నచ్చదు" చిన్న కంఠంతో మరియమ్మకు చెప్పి, చకచకా కారు దగ్గిరికిపోయింది శృతిమేడమ్.



విలాసంగా నిలబడి కారు డోర్‌ని తెరిచిపట్టుకున్నాడు సోహన్. ఆమె ఎంటర్ కాగానే, తను పక్కనే కూర్చుంటూ, "పోనీ....ముందుగా స్కైలైన్ రెస్టారెంట్ దగ్గిరికి పోనీ" అంటూ డ్రైవర్‌కి ఆదేశాలు ఇచ్చాడు.

ఇంట్లో డ్యూటీలకు అటెండ్ కావడంకంటె గేటు దగ్గిర వాచ్‌మెన్ డ్యూటీ చేయడమే చాలా బాగున్నట్లు అటెన్షన్‌లో నిలబడి శృతి మేడమ్‌కి శాల్యూట్ చేశాడు పీటర్.

చిన్న చిరునవ్వు ఒకటి కనపడీ కనపడనట్టు ఆమె పెదవులమీద ప్రత్యక్షమై వెంటనే మాయమైపోయింది.

"ఎటుగా పోతున్నారు మేడమ్....మీరు ఎక్కడికి పోవాలని అనుకుంటున్నారు?" కారు డ్రైవర్‌కి సైగచేసి కారును ఆపించి ఆమెను అడిగాడు పీటర్.

"అది నీకు అవసరమా? ఎటుపోతున్నామో, ఎక్కడికి పోతున్నామో నీకు చెప్పి తీరాలా?" క్షణం కూడా ఆలస్యం చేయకుండా గంయ్‌మని అరిచినట్లు అడిగాడు సోహన్.

"ఐయామ్ సారీ సర్....స్కైలైన్ రెస్టారెంట్‌కి వెళ్ళే దారిలో వెళుతున్నారేమోనని అడిగాను. అడగడం తప్పే....ఐయామ్ వెరీ వెరీ సారీ" నొచ్చుకుంటున్నట్లు ముఖం దించుకుంటూ నెమ్మదిగా అన్నాడు పీటర్.

అనవసరంగా ఉద్రేకపడుతున్న సోహన్‌వంక చురుకుగా చూసింది శృతిమేడమ్. "అటే వెళుతున్నాం. ఆ రెస్టారెంట్‌కే....ఎందుకు పీటర్? అటు ఏదైనా ప్రాబ్లమా?" అనునయంగా అడిగింది శృతిమేడమ్.

"ఇందాక మూడుగంటల టైములో అక్కడ ఏవో గొడవలు స్టార్టు అయ్యాయట. వన్‌ఫార్టీఫోర్ సెక్షన్ పెట్టారట. ఆ రెస్టారెంట్ కూడా క్లోజ్ చేసినట్టు నాకు తెలిసింది" గబగబా చెప్పాడు పీటర్.

"గొడవలు జరిగాయా? మైగాడ్....అనవసరంగా అటుపోయి లేనిపోని రిస్కులో పడేవాళ్ళం. థాంక్యూ....థాంక్యూ వెరీమచ్ పీటర్. మేము ఇంకో రెస్టారెంట్‌కి పోతాం" అన్నది శృతిమేడమ్.

"పీటర్ ఓవరాక్షన్ చేస్తున్నాడు. అన్ని విషయాలు తనకే తెలిసినట్లు మాట్లాడతాడు. అతను చెప్పిందాంట్లో అక్కడ సగం కూడా వుండదు. స్కైలైన్ రెస్టారెంట్ క్లోజ్ అవడమనే ప్రసక్తిలేదు. వన్‌ఫోర్త్ ఫ్లోర్ కాదు. యాకంగా కర్ఫ్యూ పెట్టినా అది నడుస్తూనే వుంటుంది" అంటూ డ్రైవర్‌తో, "స్కైలైన్‌కి పోనీ" అని చెప్పాడు సోహన్.

శృతిమేడమ్ వైపు చూశాడు డ్రైవర్. ఆమె దగ్గిర్నుంచి ఎటువంటి అబ్జెక్షన్ రాకపోవడంతో కారును ముందుకు పోనిచ్చాడు.

సోహన్ చెప్పిందే యదార్థమని వెంటనే నిరూపితమయింది. కామ్‌గా వుంది స్కైలైన్‌కి వెళ్ళే రోడ్డు. పీటర్ చెప్పిన గందరగోళ పరిస్థితులు ఏవీ కనిపించడంలేదు.

"నేను ముందే చెప్పాను కదా....పీటర్‌ది ఓవరాక్షన్ అని. అసలు అటువంటి వాళ్ళ మాటలు మనం వినిపించుకోకూడదు. అఫ్టరాల్ మా తాత గారి దగ్గిర అసిస్టెంటు ఉద్యోగం. కానీ మా తాతగారి ఎస్టేటుకు తనే మేనేజర్ మాదిరి మాట్లాడుతూ వుంటాడు.

నాకే గనుక అధికారం వుంటే అతన్ని ఎప్పుడో ఉద్యోగంలో నుంచి పీకిపారేసివుండేవాడిని" అంటూ రెస్టారెంట్ ముందు కారు దిగి, శృతిమేడమ్ కూడా దిగేవరకూ డోర్‌ని అలాగే తెరిచిపట్టుకున్నాడు.

వీధులన్నీ ప్రశాంతంగానే వున్నాయి. వీధుల్లో తిరిగే జనం కూడా యథావిధిగానే తమ తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు.

రెస్టారెంట్ మెయిన్‌డోర్ దగ్గిర వున్న వాచ్‌మెన్ స్టిఫ్‌గా నిలబడి శాల్యూట్ చేశాడు ప్రశాంతంగానే.

యువతరానికి అత్యంత ప్రీతిపాత్రమైన ప్లేస్ స్కైలైన్ రెస్టారెంట్. అందులో పనిచేసే వెయిటర్స్ దగ్గిర్నుంచి, మేనేజర్ వరకూ అందరూ యూత్‌ఫుల్ పర్సనాలిటీలే.

ఎప్పుడు చూసినా విపరీతమైన రద్దీతో కిటకిటలాడుతూ వుండే ఆ ప్లేసు ఎందుకో ఇప్పుడు ఖాళీగా నిశ్శబ్దంగా కనిపిస్తోంది.

"వాటీజ్ ది మేటర్ మేన్? వాట్ హేపెన్డ్?" ఖాళీగా వున్న టేబిల్స్‌వైపు చూస్తూ ఆర్డర్ తీసుకోవడానికి వచ్చిన జంటిల్మెన్‌ని అడిగాడు సోహన్.



సర్....ఎప్పుడూలేనిది మా వీధిలో అనవసరమైన గలాటాలు జరిగాయి. మేమంటే గిట్టనివాళ్ళకి ఇది మంచి అవకాశంగా కనిపించింది. మా రెస్టారెంట్‌ని నాశనం చేయడానికి ట్రై చేశారు...." వినమ్రంగా చెప్పాడతను.

"మీ బిజినెస్‌ని దెబ్బతీసే ప్రయత్నం జరిగితే, పోలీసుల్ని పిలిపించి వ్యవహారం ఏమిటో సెటిల్ చేసుకోకుండా రెస్టారెంట్‌ని ఎందుకు నడిపిస్తున్నారు?" కూల్‌గా అడిగింది.

"రెస్టారెంట్‌ని క్లోజ్‌చేస్తే మా పరువు పోతుంది మేడమ్. మా ప్రిస్టేజ్ దెబ్బతింటుంది. అయితే మమ్మల్ని అభిమానించి వచ్చే మా వాల్యుబుల్ కస్టమర్స్‌కి ఇబ్బంది కలగడం మాకు ఏమాత్రం ఇష్టంలేదు.

అందుకే ఈ గొడవ చల్లారేవరకూ ఇక్కడికి రావద్దని ముందుగానే హెచ్చరికలు చేస్తున్నాం. మీరు కూడా త్వరగా మూవ్ అయిపోతే మాకు ఎంతో సంతోషంగా వుంటుంది" ముఖంమీది చిరునవ్వు మాసిపోకుండా బహుమర్యాదగా చెప్పాడు ఆ వ్యక్తి.

"వీళ్ళు కూడా పీటర్‌లా ఎగస్ట్రాలు మాట్లాడుతున్నారు. రోడ్డు ప్రశాంతంగా వుంది....వీళ్ళు చెపుతున్నంత ప్రమాదం ఏదీలేదు" చిరాకుగా అన్నాడు సోహన్. తనకు, శృతిమేడమ్‌కి ఐస్‌క్రీమ్ ఆర్డర్ ఇచ్చాడు.

ఆర్డర్ ఇచ్చిన మరుక్షణం వారి ముందుకొచ్చింది ఐస్‌క్రీమ్. దానితో పాటు హ్యాండ్‌గ్రెనేడ్స్ మాదిరి విసురుగా వచ్చి లోపలపడ్డాయి పెద్దపెద్ద గులకరాళ్ళు. ఖణేల్ ఖణేల్‌మని వికృతశబ్దాలు చేస్తూ పగిలిపోవడం మొదలు పెట్టాయి రెస్టారెంట్ చుట్టూవున్న అందమైన గ్లాసెస్.

"కమాన్ మేడమ్....కమాన్" అంటూ పరిగెత్తుకువచ్చాడు రెస్టారెంట్ మేనేజర్. శృతిమేడమ్‌ని కుర్చీలోనుంచి లేపి ఒక సేఫెస్టు ప్లేసులోకి తీసుకుపోయాడు.

అతను తనను అలా చేయిపట్టుకుని తీసుకుపోనందుకు, అవతలకు రమ్మని తనని పేరుపెట్టి పిలువనందుకు ఎంతగానో ఫీలవుతూ వారి వెనుకే పరిగెత్తాడు సోహన్ కూడా. అప్పటికే సూటిగావచ్చి అతని వెన్నుమీద

పడ్డాయి రెండు గులకరాళ్ళు. అడ్డంవచ్చిన రెండు అద్దాల్ని పగలగొ
కొని మరీ రావడంవల్ల వాటి వేగాన్ని కోల్పోయాయి అవి. అందు
చురుక్కుమనడంతప్ప, పెద్దదెబ్బ ఏదీ అతనికి తగలలేదు.

అయినాసరే, వెన్ను విరిగిపోయినట్టు గంయ్ గంయ్‌మని అరవ
మొదలుపెట్టాడు అతను.

"సోహన్.... ప్లీజ్....కంట్రోల్ యువర్ సెల్ఫ్....కంట్రో
అతని బిహేవియర్‌ని చూసి ఖంగారుపడుతూ గబగబా కూల్‌డౌన్ చే
డానికి ప్రయత్నం చేసింది శృతిమేడమ్. కూల్‌డౌన్ అవలేదు సోహ
రానురాను వాయిస్ మరింతగా పెద్దదయిపోయింది.

"దిసీజ్ అన్‌ఫర్‌గివబుల్....ట్రబుల్ స్టార్టయినప్పుడు ముందుగ
రెస్టారెంట్‌ని క్లోజ్ చేసుకోవాలి. ఏమీ జరగనట్టు డోర్లు బార్లాతెరిచి, ల
లికి వచ్చిన తర్వాత రాళ్ళతో కొట్టించడం దిసీజ్ వెరీబ్యాడ్....ఈ విషయ
నాకు తెలిసిన వాళ్ళందరికీ చెప్తాను. ఈ రెస్టారెంట్‌కి రావడం వేస్టేకాదు.
ప్రమాదం కూడా."

చేతులు పట్టుకుని ఆ మేనేజర్ తనను బతిమాలడతాడని. కామెం
చేయడాన్ని మానుకోమని అర్థిస్తాడని అనుకున్న అతని ఆలోచన దా
దారుణంగా తప్పిపోయింది.

"ఇటురండి మేడమ్....రెస్టారెంట్ వెనకాల మా వెహికిల్ ట
పార్క్‌చేసివుంది. మీరు సేఫ్‌గా అందులో అవతలికెళ్ళిపోండి. మ
డ్రయివర్‌కిచెప్పి మీ కారును తర్వాత పంపిస్తాం. డ్యామేజి ఏదైనా జరి
వుంటే అదికూడా మేమే రిపేర్ చేయించి పంపుతాం.

మీకు కలిగిన ఈ అసౌకర్యానికి మేము చాలా బాధపడుతున్నాం"
అంటూ శృతిమేడమ్ చేయి పట్టుకుని రెస్టారెంట్ వెనుక ద్వారంగుండా
ఒక సన్నపాటి సందులోకి తీసుకుపోయాడు.

అటునుంచి కూడా ఎటాక్ జరిగితే వెహికిల్‌ని వదిలి దూరంగా
పారిపోవడానికి రెడీగా నిలబడివున్నాడు రెస్టారెంట్‌కి చెందిన ట్రీపీలర
నడిపేడ్రయివర్.

"ఈమె లాయర్ దామోదర్‌గారి మేనకోడలు. లాయర్‌సాబ్
మనకి రెగ్యులర్ కస్టమర్. ఈమెను జాగ్రత్తగా తీసుకుపోయి ఇంటిదగ్గ



దించు" అతన్ని చూడగానే ఎలర్ట్ చేశాడు రెస్టారెంట్ మేనేజర్.

గబుక్కున డోర్ తెరిచి స్టీరింగ్ పక్కనే శృతిమేడమ్‌ని కూర్చో
బెట్టాడు ఆ డ్రయివర్. సోహన్ కూడా ఎక్కగానే డోర్‌నిమూసి తను
స్టీరింగ్ తీసుకున్నాడు.

స్టీరింగ్ వెనుక వినాయకుడి బొమ్మ వుంది....ప్రతిరోజూ దానికి
పూజచేసి కుంకుమతో అలంకరించే అలవాటు అతనికి వున్నట్టు అర్థమైంది
శృతిమేడమ్‌కి.

ఆ వినాయకుడి బొమ్మ వెనుకే ఒక చిన్నఫోటో చక్కటి ఫ్రేములో
చూడముచ్చటగా నిలబెట్టబడి వుంది.

"ఎవరిది? ఆ ఫోటో ఎవరిది?" ఆశ్చర్యంగా అడిగింది.

"అదా? అది దీపక్‌బాబుది మేడమ్....దీపక్‌బాబు అంటే సురేంద్ర
సాబ్ మనవడు....ఒకసారి ఆటో నడుపుతుండగా యాక్సిడెంట్ అయింది
నాకు. దాదాపుగా చచ్చిపోయాననే అనుకున్నాను. ముక్కూముఖం తెలి
యకపోయినా, నా భార్య రోడ్డునపడి ఏడుస్తుంటే చూసి నాకు సహాయం
చేశాడు దీపక్‌బాబు.

పాతికవేలు ఖర్చుపెట్టి నన్ను కాపాడి, ఈ ఉద్యోగం ఇప్పిం
చాడు" ఉత్సాహంగా చెప్పాడు డ్రయివర్.

* * * *

చుట్టూవున్న ప్రమాదాన్ని పూర్తిగా మర్చిపోయింది శృతిమేడమ్.
ఎందుకనో ఆమె ముఖం అదొకరకమైన కాంతితో మిలమిల మెరిసి
పోయింది. ఆమెతోపాటు డ్రయివర్ మాటల్ని సోహన్ కూడా విన్నాడు.
ముడ్డ కట్టినట్టు ముడుచుకుపోయింది అతని ముఖం.

"భూశావుగా....దీపక్ ఎప్పుడూ ఇంతే. తాతగారి డబ్బులను ఇష్టం
వచ్చినట్టు దానధర్మాలు చేసేస్తూ వుంటాడు....ఇంకో పది పన్నెండు సంవ
త్సరాలు గడిస్తే చేతిలో కేవలం చిప్పమాత్రమే వుంటుంది. డబ్బులు
వుండవు" నిర్మోహమాటంగా చెప్పాడు.

అతనివంక చురుకుగా చూసింది శృతిమేడమ్. అంతే. ఒక్కమాట
కూడా మాట్లాడలేదు.

స్పీడ్‌గా కదిలింది వెహికిల్. రెండేరెండు క్షణాల్లో ఆ వీధిని వదిలి

మరో వీధిలోకి వెళ్ళిపోయింది.

"ఆర్ యూ ఆల్‌రైట్? సురేంద్ర చెప్పాడు నువ్వు సోహన్‌తో బయటికి వెళ్ళావని....స్కైలైన్ రెస్టారెంట్ గగ్గోలుగా వుందట...." పోర్టికోలోనే నిలబడి వున్న లాయర్ దామోదరం హ్యాపీగా నిట్టూరుస్తూ అన్నాడు శృతిమేడమ్‌ని చూసి. ఆటోని మెయిన్‌గేటు దగ్గరే ఆపి, అవతలికి పంపించి, కాలినడకన లోపలికి వెళ్ళింది శృతిమేడమ్. పోర్టికోలో జరిగింది అంతా చెప్పింది.

"థ్యాంక్‌గాడ్....ఆ రెస్టారెంట్ స్టాఫ్ అందరూ మంచి మర్యాద తెలిసినవాళ్ళు. నువ్వు నా మేనకోడలివని తెలియకపోయినా, వాళ్ళు నిన్ను అదే మర్యాదతో ఇంటికి పంపించి వుండేవాళ్ళు....ఆ సోహన్ ప్రవర్తన నాకు నచ్చలేదు" ఇంట్లోకి దారితీస్తూ అన్నాడు లాయర్‌సాబ్.

"మన కారు తర్వాత వస్తుంది. బహుశా గులకరాళ్ళ దెబ్బకి అద్దాలు పగిలిపోయి వుంటాయి" అన్నది శృతిమేడమ్ లోపలికి వెళ్ళిపోతూ.

"హెల్ విత్ దోజ్ అద్దాలు....అవి డ్యామేజి అయితే కొత్తవి వేయించుకుందాం. నువ్వు సేఫ్‌గా ఇంటికి రాగలిగావ్. ఐయామ్ హ్యాపీ" అన్నాడు లాయర్‌సాబ్.

"అతను....ఆ దీపక్....అతనికి ఈ సిటీలో ఆల్‌వాక్స్ ఆఫ్ లైఫ్‌లో ఫ్రెండ్స్ వున్నట్టు అనిపిస్తోంది. యామై రైట్?" అడిగింది శృతిమేడమ్.

"అలా అంటున్నావేంటమ్మా?" ఆశ్చర్యంగా అడిగాడు లాయర్ దామోదరం మేనకోడలిని.

త్రీవీలర్ డ్రయివర్ గురించి అతనికి వివరంగా చెప్పింది శృతిమేడమ్.

"దీపక్ వెరీ రేర్ కుర్రాడు....బహుశా కోటిమందిలో అతనిలాంటివాడు ఒక్కడు కూడా మనకి కనిపించకపోవచ్చు" అరమూసిన కనులతో తన్మయత్వంగా అన్నాడు లాయర్‌సాబ్.

"మరి చదువు సంగతి ఏమిటి మామయ్యా? అతను చదువును నెగ్లెక్ట్ చేసి కేవలం జనంకోసమే బతుకుతున్నట్లు నాకు అనిపిస్తోంది. అసలు కాలే



జీకి తిన్నగా వెళుతున్నట్టు కన్పించడంలేదు" అంది శృతి.

లాయర్ దామోదరం ముఖంలోని తన్మయత్వం కాస్తా ఆశ్చర్యంగా మారిపోయింది.

"అలా అంటున్నావేంటి తల్లీ....అటువంటిది ఏమీలేదు. దీపక్ డెఫినిట్‌గా కాలేజీకి వెళ్తున్నాడు.

ఫస్ట్‌ర్యాంక్ రాకపోయినా, మంచిమార్కులు వస్తాయి....అతనిలాంటి బ్యాక్‌గ్రౌండ్ వున్న కుర్రాడికి అదిచాలు...." అంటూ ఇంకా ఏదో చెప్పాలని అనుకుని, ఆఖరిక్షణంలో ఆగిపోయినట్టు ముఖం పెట్టాడు.

"ఏమిటి మామయ్యా....నాకు ఏదో చెప్పాలని అనుకుని ఆగిపోయావ్....ఏమిటది?" క్షణం కూడా ఆలస్యం చేయకుండా అడిగింది శృతిమేడమ్.

"చెప్పాలని అనుకోవడం కాదు తల్లీ....సడెన్‌గా నా మదిలోకి ఒక ఆలోచన వచ్చింది. అయితే అది నీకు నచ్చుతుందో లేదో అని అనుమానం కూడా వచ్చింది" ఆప్యాయంగా శృతిమేడమ్ తలనిమురుతూ అన్నాడు!

ఆ మాటలకు అందమైన శృతిమేడమ్ ముఖం మరింత అందంగా మారిపోయింది.

"నువ్వు ఏదయినా ఆలోచన చెపితే అది అవతలి వాళ్ళకు డెఫినిట్‌గా నచ్చుతుందని అందరూ అంటూ వుంటారు. నా విషయంలో మాత్రం వేరేగా ఎందుకు అనుకోవాలి? చెప్పు మామయ్యా....నీ ఆలోచన ఏమిటో నాకు చెప్పు" అంటూ ప్రాంప్ట్ చేసింది.

"ఏమీలేదు తల్లీ....దీపక్‌ని గురించి మాట్లాడుకుంటున్నాం కదా... సురేంద్రసాబ్‌కి వున్న ఆస్తులు అన్నిటికీ అతనే వారసుడు....అంతే దాదాపు నూటపాతిక కోట్లకు పైగా వున్న భూములకు, బిల్డింగులకు యజమాని....బ్యాంక్ బ్యాలెన్సుల సంగతి వేరే చెప్పవలసిన అవసరంలేదు. ఏ బ్యాంక్‌లో ఎంత వుందో ఆడిటర్స్‌కి మాత్రమే తెలుసు....తనకి కూడా సరిగ్గా తెలియదు...."

"నీ మనసులోకి వచ్చిన ఆలోచన గురించి చెప్తావని అనుకుంటే,

ఇప్పుడు ఆ పెద్దమనిషి ఆస్తుల గురించి, అంతస్థుల గురించి చె తున్నావ్. ఆ విషయాలు ఇప్పుడు మనకి అవసరమా?" అని అడిగ శ్రుతి మేడమ్.

గుంభనంగా నవ్వుతూ, "అవసరమే తల్లీ....అవన్నీ నీకు తె యాలి....ఎందుకంటే రేపు వాటన్నిటినీ మేనేజ్ చెయ్యాల్సిన అవస రావచ్చు....ముందుగానే వాటిని గురించి ఒక అవగాహనకి వస్తే తర్వాత ఇబ్బందులు ఫేస్ చేయాల్సిన పని వుండదు" అన్నాడు.

"నువ్వు నాకు మతిపోగొట్టే మాటలు చెపుతున్నావ్....నువ్వు చె మాటల్లో ఒక్కటీ నాకు అర్థంకావడంలేదు" మరింత చిరాకుగా అంది శ్రు మేడమ్.

"మతిపోగొట్టడం కాదమ్మా....నా ఆలోచనను మాటల్లో చెప్ప ఎలాగో తెలీడంలేదు. అందుకే అసలు విషయాన్ని వదిలి వేరేవేరే వి యాల్ని ప్రస్తావిస్తున్నాను" అంటూ క్షణకాలం మౌనంగా వుండిపోయా లాయర్‌సాబ్. ఉన్నట్లుండి తల ఎత్తి ఆమె ముఖంలోకి చూస్తూ-

"దీపక్‌ని నువ్వు పెళ్ళిచేసుకుంటే ఎలా వుంటుంది? నాకైతే చా బాగుంటుందనిపిస్తోంది....మరి నీకు?" అని సూటిగా అడిగేశాడు శ్రు మేడమ్‌ని.

*           *           *           *

ఒక్కసారిగా షాక్‌తిన్నట్లు ముఖంపెట్టింది శ్రుతిమేడమ్. "వా ఆర్ యూ టాకింగ్ అంకుల్? అటువంటి ఆలోచన అస్సలు నాకు రాలేదు నిన్నకాక మొన్న పరిచయం అయిన అతనితో నాకు...." అంటూ న న్‌గా మాటల్ని ఆపేసింది.

"చూడు శ్రుతీ....దిసీజ్ నాట్ అమెరికా....అక్కడ పెళ్ళికిముం అమ్మాయిలు, అబ్బాయిలుచేసే డేటింగ్ పద్ధతి ఇక్కడవుండదు. నూటి తొంభై వివాహాలు మాలాంటి ముసలివాళ్ళు అరేంజ్‌చేసేవే అయ వుంటాయి.

సురేంద్రసాబ్ గురించి ఆయన ఖాన్‌దానీ గురించి నాకు పూర్తిగా తెలిసివుండటంవల్ల దీపక్‌ని నువ్వు చేసుకుంటే బాగుంటుందని అని పించింది. బట్ ది డెసిషన్ ఈజ్ ఎంటైర్లీ యువర్స్...సురేంద్రసాబ్‌తో



విధ్యమందడం అంటే మా సోషల్ స్టేటస్ ఇప్పుడున్న దానికంటే వంద రెట్లు అధికం అవడం కిందికి వస్తుంది.

అందానికి అందం, చదువుకు చదువు, ముఖ్యంగా దీపక్ వినయ విధేయతలు, అవతలి మనిషిలోని ఆర్తిని గమనించి అందుకు తగిన విధంగా సహాయం చేయాలనే అతని ఆర్ద్రత నాకు బాగా నచ్చాయి.

నేను చెప్పాల్సింది చెప్పాను. నీకు కూడా నచ్చితేనే ఈ పెళ్ళి జరుగుతుంది. ఇందులో బలవంతం అంటూ ఏమీ లేదు. జస్ట్...నామనసులో ఫ్లాష్ అయిన ఆలోచన ఇది....అంతే" ఆమె పక్కనే కూర్చుంటూ అను నయంగా చెప్పాడు లాయర్ దామోదరం.

"ఇంతవరకూ ఇటువంటి థాట్ నాకు రాలేదు. అసలు ఇంతవరకూ అతన్ని ఈ యాంగిల్‌లో నేను పరిశీలించలేదు. ఐ వాన్ట్ సమ్ టైమ్.... నాకు వ్యవధి కావాలి....అతన్ని నేను ఇంకా లోతుగా అబ్జర్వ్ చేయాలి. అతనికి మనకి తెలియని హ్యాబిట్స్ ఏమయినా వున్నాయేమో తెలుసు కోవాలి. అసలు మ్యారేజ్‌మీద అతనికి వున్న అభిప్రాయం ఏమిటో బయ టికి రావాలి...." అంది శ్రుతిమేడమ్.

"దీపక్ జీవితం తెరిచివున్న పుస్తకంవంటిది శ్రుతీ....అతని దగ్గిర మనకి తెలియని హ్యాబిట్స్ అంటూ ఏమీలేవు....అతని పద్ధతి అంతా సురేంద్రసాబ్ పద్ధతే....హీ స్మోక్స్....బట్‌నాట్ విగరస్లీ....మందు పుచ్చుకుంటాడు....నాట్ రెగ్యులర్లీ....ఫ్రెండ్స్‌తో పిచ్చి పిచ్చి తిరుగుళ్ళు తిరుగుతాడు....నాట్ విత్ గర్ల్‌ఫ్రెండ్స్.

ఆడవాళ్ళంటే అతనికి వున్న గౌరవం నిజంగా సూపర్.... సురేంద్రసాబ్ ఇంట్లో పనిచేసే మరియమ్మ, సీతమ్మ వాళ్ళిద్దర్నీ అడుగు... నీకే తెలుస్తుంది" ఎంతో నమ్మకంగా చెప్పాడు లాయర్‌సాబ్.

"మరియమ్మతో మాట్లాడాను మామయ్య....అబ్బో.... అతను మనిషి కాదంటుంది....దేవలోకంలోనుంచి దిగి వచ్చిన దేవుడు మాదిరిగా మాట్లాడుతుంది" చిరునవ్వుతో చెప్పింది శ్రుతిమేడమ్.

"చిన్నతనం నుంచీ తనే అన్నీ అయి అతన్ని పెంచింది. తన కడుపున పుట్టిన బిడ్డల్ని కూడా అంత ప్రేమగా పెంచి వుండదు. దీపక్ వ్యక్తిత్వంలోని హుందాతనం ఆ పెంపకంవల్ల వచ్చిందే."

"ఓ.కే. మామయ్యా....ఐ విల్ థింక్ ఓవర్ దిస్ పీ... ఈలోగా నువ్వు తొందరపడి తాతయ్యగారి దగ్గిరో, అక్కడ పని... పీటర్ దగ్గిరో మాట జారకు.దీపక్‌ని నేను ఇంకా బాగా స్టడీ చేసిన తర్వా వాత నా డెసిషన్ చెపుతాను....ఆ తరువాత నువ్వు ప్రొసీడ్ అవవచ్చు" అంది శృతిమేడమ్.

"వెరీగుడ్ తల్లీ....నాకు తృప్తిగా వుంది. నువ్వు ఇండియాలో సెటిల్ అవ్వాలనుకుంటున్నావని, ఇండియన్‌నే పెళ్ళి చేసుకోవాలన్నది అభిప్రాయమనీ మీ ఫాదర్ నాకు చెప్పాడు....నీ డెసిషన్ ఏమిటో నా... చెప్పిన తర్వాత నేను ఆయనకి ఫోన్ చేస్తాను. అంతవరకూ ఆయనతో కూడా ఈ విషయం గురించి మాట్లాడను" అంటూ సోఫాలోనుంచి లే... ఆమె భుజం తట్టాడు. తన ఆఫీస్‌రూమ్‌లో ఫోన్ మోగడంతో అటకే వెళ్ళిపోయాడు.

మెయిన్‌హాల్లోనుంచి తనకు ఎలాట్ చేయబడిన బెడ్‌రూమ్‌వై... అడుగులు వేసింది శృతిమేడమ్.

"ఏదో చిన్న సహాయాన్ని పొందిన ఆ త్రీ వీలర్ డ్రయివ... దగ్గిర కూడా దీపక్ ఫోటో వుంది. అతన్ని మ్యారేజ్ చేసుకోవాల్సిన నా... దగ్గిర మాత్రం లేదు. ఇటీజ్ వెరీ వెరీ ఫన్నీ...." బెడ్‌మీద వాలిపో... అనుకుంది.

# 11

సాయంసమయం దాటిపోయింది దీపక్ బృందం సిద్దిపేట... హద్దుల్లోకి ఎంటర్ అయ్యేసరికి. అదేపనిగా ప్రయాణం చేయడంవల్ల మినీలారీ ఇంజన్ వేడెక్కి, రేడియేటర్‌లోనుంచి పొగలు రావడం మొద లైంది.

"ఆగిపోవడం బెస్టురా రాంసింగూ....మొండిగా నడిపిస్తే వ... దారిలో దుకాణం పెట్టేస్తుంది. డెఫినిట్లు....ఈ రాత్రికి ఇక్కడే ... పోదాం" లారీని పక్కకు తీసి ఒక చెట్టుకింద ఆపిస్తూ అన్నాడు వహీద్.

"నేను కూడా అదే అనుకుంటున్నాను. ఇక్కడి పోలీసులు ...



చలాక్‌గా వుంటారు! అనవసరమైన గొడవలు జరిగితే చావకొట్టి లాకప్ లోకి నెట్టేస్తారు. ఇక్కడ వుండగా మనజోలికి వచ్చే ధైర్యం ఎవరికీ వుండదు" తన అభిప్రాయాన్ని వెల్లడించాడు మైసయ్య.

నెమ్మదిగా లారీ దిగి మైసయ్య దగ్గిర దాచివుంచిన సిగరెట్ ప్యాకెట్‌లోనుంచి సిగరెట్‌నితీసి వెలిగించుకుంటూ ఒక పక్కగా నిల బడ్డాడు దీపక్. అప్పుడు అలా తాపీగా నిలబడినప్పుడు గుర్తుకువచ్చాడతనికి జగజీత్.

"ఏడి? ఏమైపోయాడు? గంగారంలో అడుగుపెట్టిన క్షణంనుంచీ మన మధ్యలో లేడు."

"గంగారంలో అడుగుపెట్టిన దగ్గిర్నించీ కాదు చిన్నబాబూ.... గుళ్ళో గోల మొదలయిన క్షణం నుంచీ నేనే వాడిని దూరంగా నిల బెట్టాను. మీకు సరిగ్గా తెలియదు. వాడు చూడటానికి మెత్తగా కనిపించినా, లోపల చాలా కరకుతనం, కసాయితనం నిండివుంది. కోపాన్ని అణుచుకో లేక ఎవరినైనా పొడిచేస్తే కొంపలు అంటుకుంటాయి. అందుకే దూరంగా నిలబడి ఆ కుందారం బద్మాష్‌లను గమనించుకోమని చెప్పాను. మన మందరం ఎవరిమో వాళ్ళకి తెలుసు. వాడిని గురించి మాత్రం ఎవరికీ తెలి యదు" నవ్వుతూ చెప్పాడు మైసయ్య.

"ఈ మాట నువ్వు నాకు ముందుగానే చెప్పివుండాల్సింది. మనతో కలిసి జాతర చూడాలని వచ్చినవాడిని మనకు దూరంగా నిలబెట్టడం నాకు ఏమాత్రం నచ్చలేదు" నిర్మొహమాటంగా అన్నాడు దీపక్.

"ఏదయినా మంచి హోటల్లో బాబుకు వసతి ఏర్పాటుచేసి, మనం రోడ్డుమీద లారీలో పడుకుందాం" చెప్పాడు గండయ్య.

"మసీదు సెంటర్లో మంచి హోటలుంది అక్కడ రూములు కూడా చాలా బాగుంటాయి" తనకు తెలిసిన మాటను బయటపెట్టాడు మైసయ్య.

"ఆల్‌రైట్! మసీదు సెంటర్‌కే పోదాం చిన్నబాబూ! లోపల కూర్చోండి" ఆపేసిన లారీని స్టార్ట్ చేయడానికి బయలుదేరుతూ అన్నాడు రాంసింగ్.

"కూర్చుని కూర్చుని కాళ్ళు పట్టేశాయి. నువ్వు లారీని తీసుకుపోయి హోటల్ దగ్గిరుండు. మేము నెమ్మదిగా నడుచుకుంటూ వస్తాం. సిద్దిపేట

రావడం ఇదే మొదటిసారి కదా....ఎలావుంటుందో చూస్తా" అంటూ నెమ్మదిగా నడక మొదలుపెట్టాడు దీపక్.

*　　*　　*　　*

ఒకరి తర్వాత ఒకరుగా అతని వెనుక అడుగులు వేశారు మిగిలిన వాళ్ళు. లారీని స్టార్ట్‌చేసి వేగంగా ముందుకు తీసుకుపోయాడు రాంసింగ్. నాలుగే నాలుగు నిమిషాల్లో ఎంత వేగంగా వెళ్ళాడో అంతే వేగంతో లారీని వెనక్కి తీసుకువచ్చేశాడు.

"ఏమయిందిబే? ఎవరయినా కనిపించారా?" అనుమానంగా చూస్తూ అడిగాడు వహీద్.

లారీ వెనుకభాగంలో పడవేసిన బాణాకర్రల కట్టల దగ్గిరకి జంప్ చేయబోయిన గండయ్య, మైసయ్యలను వెంటనే వారించాడు రాంసింగ్.

"చెప్పేది వినకుండా ఊరికే హైరానా ఎందుకు పడతారు? తూర్పు బజారు మొదట్లో మన జగజీత్ నిలబడి మన కోసమే ఎదురుచూస్తున్నాడు. వాడు చిన్నబాబుకు అక్కడ వసతి ఏర్పాటు చేశాడంట.... ఏం చేశాడో, ఎలా చేశాడో నేను అడగలేదు. వెనక్కి వచ్చేశాను" లారీని రైట్‌గా టర్న్ కొట్టించి, వచ్చిన దారినే వాళ్ళ టౌన్‌లోకి వెళ్ళేందుకు రెడీచేస్తూ చెప్పాడు రాంసింగ్.

"జగజీత్‌గాడు వసతి ఏర్పాటుచేస్తే ఇంకా ఆలోచన ఎందుకు? పదండి పోదాం" అంటూ ముందు దీపక్‌ని క్యాబిన్‌లోకి ఎక్కించి, బాడీలో నిలబడ్డారు మిగిలినవాళ్ళు. దడదడమని మోతలుచేస్తూ కదిలింది లారీ.

రెండే రెండు నిముషాల్లో వారికోసమే ఎదురుచూస్తున్న జగజీత్ దగ్గిర ఆగింది.

"ఇదిగో ఈ వీధిలోనే....పది అడుగులు వేస్తే వచ్చేస్తుంది. రండి. త్వరగా రండి" అంటూ తాను నిలుచున్న ప్రదేశం వెనుకభాగంలో వున్న వీధిలోకి దారితీశాడు జగజీత్.

"నీయవ్వ....ఇది దీపక్‌బాబులాంటి మనిషి అడుగు పెట్టాల్సిన చోటేనా? నీకసలు బుద్ధి, జ్ఞానం వున్నాయా? నీ దిమాక్ ఖరాబయి పోయిందా?" కనులు ఎర్రచేసి కొట్టడానికి పోయినట్టు అతనివైపు స్పీడ్‌గా పోయాడు వహీద్.



"చిన్నబాబు అడుగుపెట్టకూడదా? వీధి చాలా బాగుంది. ఇళ్ళుకూడా చాలా శుభ్రంగా వున్నాయి. నీ అభ్యంతరం ఏంటి?" చుట్టూ చూస్తూ అడుగుతున్న గండయ్య నోటిని వెంటనే అదిమేసి, తన నెత్తిమీద తనే టపటపా చరుచుకున్నాడు మైసయ్య.

"తప్పు నాదే వహీదు. వీధిని చూడగానే గుర్తుపట్టాల్సింది. పట్టలేక పోయాను. ఇది సంసారులు నివసించే ప్రదేశం కాదు. ఇట్లాంటి చోటుల్లోకి పోయామని తెలిస్తే తాతగారు ముందు మమ్మల్ని, తర్వాత మిమ్మల్ని చంపేస్తారు. వెనక్కి తిరగండి" అంటూ దీపక్ చెయ్యిపట్టుకుని మెయిన్‌రోడ్డు మీదికి లాగడానికి ట్రైచేశాడు.

విసిరికొట్టి వదిలించుకున్నాడు దీపక్ అతని చేతిని.

*　　*　　*　　*

"జగజీత్ మనల్ని ఎందుకు ఇక్కడికి రమ్మన్నాడో పూర్తిగా తెలుసుకోకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడకండి. అసలు విషయం ఏమిటో అతన్నే అడగండి" అంటూ జగజీత్‌వైపు తిరిగి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇది ఎట్లాంటి వీధో నాకు తెలియదు చిన్నబాబూ! ఇంతకుముందు ఎప్పుడూ నేను ఇటుగా రాలేదు.

"జాతర్లో ఐస్‌క్రీములు తినడానికి మీరు పోతున్నప్పుడు ఒక ఆడ మనిషి మీతో మాట్లాడింది, గుర్తుకువచ్చిందా?" అడిగాడు జగజీత్.

తమను వెంటనే ఇంటికి వెళ్ళిపొమ్మని హెచ్చరించిన ఆడమనిషి ముఖం దీపక్ కళ్ళముందు ప్రత్యక్షమైంది. ఆమె చెప్పిన మాటలు కూడా గుర్తుకువచ్చాయి.

"అవును. ఆ కుందారం బద్మాష్‌లు ఎక్కడినించో రౌడీలను కూడా పిలిపిస్తున్నట్లు చెప్పింది.

ఇప్పుడు ఆమెను గురించి మాట్లాడటం దేనికి?" అర్థంకానట్లు అడిగాడు.

"మీరు గనుక వచ్చినదారినే వెనక్కి వెళ్ళకుండా ఇటుగా ప్రయాణం చేసేట్టయితే, ఇక్కడికి వచ్చేసరికి చీకటి పడుతుందని ఆమె నాకు చెప్పింది.

చీకటిపడిన తర్వాత ప్రయాణాన్ని కంటిన్యూ చేయడం మంచిది

కాదని, ఈ రాత్రికి తన ఇంట్లోనే బస ఏర్పాటు చేస్తానని అంది. అందుకే ముందుగా వచ్చి ఇక్కడ మీకోసం నిలబడ్డాను" వున్న విషయాన్ని బయట గొంతు లేకుండా బైటపెట్టాడు జగజీత్.

"ఆ ఇల్లు నీకు తెల్సా?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"అప్పుడెప్పుడో చాలా సంవత్సరాలక్రితం చూశాను. అప్పటికి నువ్వు ఇంకా పుట్టలేదు. మీ అమ్మగారికి కడుపులో కూడా పడలేదు. మీ డాడీ పైలాపచ్చీస్ వయసులో వున్నారు" అంటూ చకచకా కదిలాడు వహీద్.

వీధి మధ్యలోవున్న ఒక బొమ్మరిల్లువంటి అందమైన చిన్న ఇంటి ముందు ఆగాడు.

అతను మిగిలినవాళ్ళతో కలిసి వస్తున్న సంగతిని ముందుగానే గమనించింది కాబోలు పెద్ద ఇత్తడిబిందెతో చల్లటినీటిని ఇంటిముందు సిద్ధంగా వుంచింది జాతర్లో దీపక్‌ని పలకరించిన ఆడమనిషి.

"కాళ్ళు, ముఖాలు కడుక్కోండి. ఎండనపడి వచ్చారు. అందరి ముఖాలు వడిలిపోయి వున్నాయి" అని అందరికీ చెపుతూ, ముందుగా తనే శుభ్రమైన చెంబుతో నీటిని ముంచి దీపక్‌కి అందించింది.

గ్రామాల్లో తప్ప సిటీలో కనిపించని ఆ సంప్రదాయం దీపక్‌కి వెంటనే మంచిగా అనిపించింది.

తను ధరించివున్న ఖరీదైన పాదరక్షల్ని అవతల వదిలి ముఖం, కాళ్ళు, చేతులు శుభ్రపరుచుకున్నాడు.

కనపడీకనపడని సువాసనలు వెదజల్లుతున్న టర్కీటవల్‌ని అతనికి అందించింది ఆ స్త్రీ. "ముఖం తుడుచుకో చిన్నబాబూ! లోపలికి రా" చనవుగా చెపుతూ అతన్ని లోపలికి తీసుకుపోయింది.

ఇల్లు చిన్నదే అయినా, సింపుల్‌గా, చూడముచ్చటగా అలంకరింపబడి వుంది.

"మీవాళ్ళు ముందు గదిలో కూర్చుంటారు. నువ్వు బెడ్‌రూమ్‌లో కూర్చో" అంటూ అక్కడినించి ఇంకో గదిలోకి తీసుకుపోయిందామె.

* * * *

విశాలమైన డబుల్‌కాట్....శుభ్రంగా వున్న బెడ్‌షీట్లు, బెడ్



దూరంగా నిలబెట్టివున్న కూలర్....కిటికీలకు అందమైన సిల్కు తెరలు.... ఉన్నట్లుండి ఏదో తెలియని కంగారు మొదలైంది దీపక్ హృదయంలో.

"ఇక్కడ వద్దు. నేనుకూడా ముందు గదిలోనే కూర్చుంటాను" అంటూ గిరుక్కున వెనుతిరగబోతుండగా, ఎదుటి గోడమీద వున్న ఫోటో అతనికి కనిపించింది.

"అది....మా డాడీ ఫోటో.... ఇక్కడికి ఎలా వచ్చింది?" అయోమయం, ఆశ్చర్యం కలగలిసిన చూపులతో చూస్తూ ఆమెను అడిగాడు దీపక్. తెల్లటి పల్వరుస బయటికి కనిపించేలా ఫక్కున నవ్వి, ఇవతలి గోడమీది ఇంకో ఫోటోని కూడా చూపించింది ఆ స్త్రీ.

అక్కడ కూడా దీపక్‌కి కనిపించింది అతని డాడీ ఫోటో. అయితే ఆయన పక్కన ఇప్పుడు తన ఎదురుగా వున్న స్త్రీమూర్తి కూర్చుని వుంది.

"మా డాడీ....నువ్వు....నువ్వు.... మీరు.... మీరు" ఏమని సంబోధించాలో తెలియకపోవడంతో కొంచెం తొట్రుపాటుకు గురి అయ్యాడు దీపక్.

"అవును చిన్నబాబూ! మీ డాడీకి, నాకు సంబంధం వుండేది ఆ రోజుల్లో. ఈ ఇల్లు ఆయన కట్టించి ఇచ్చిందే. ఈ శరీరంలో వున్న ప్రాణం కూడా ఆయన చేసిపోయిన ఏర్పాట్ల మూలకంగా నిలబడి వున్నదే. మా పరిచయం ఎంతోకాలం సాగకపోయినా నా జీవితం మొత్తం ఆయనకే అంకితం అయిపోయింది. ఆయనతో గడిపిన మధురక్షణాల్ని, రోజుల్ని గుర్తుకుతెచ్చుకుంటూ హాయిగా బతికేస్తున్నాను" చేతులెత్తి దీపక్ తండ్రికి నమస్కారంచేస్తూ చిన్న కంఠంతో చెప్పింది ఆమె.

ఏం మాట్లాడాలో, ఆ మాటలకెలా స్పందించాలో దీపక్‌కి అర్థం కాలేదు. "మా డాడీ మీకు బాగా పరిచయమంటున్నారు. ఇప్పుడు మీకు ఏమైనా ప్రాబ్లెమ్స్ వుంటే నాకు చెప్పండి. నేను సహాయం చేస్తాను" పదిక్షణాల తర్వాత గొంతు పెకల్చుకుని నెమ్మదిగా అన్నాడు.

"మీ డాడీ దయవల్ల నాకు రోజులు హాయిగా గడిచిపోతున్నాయని ఇందాకే చెప్పాను. ఆయన కడుపున పుట్టిన నీకు అతిథ్యం ఇవ్వడం నాకు ఎంతో సంతోషంగా వుంది. బెడ్‌మీద పడుకుని కాస్సేపు రెస్టతీసుకో....

మొహమాటపడకు....అది మీ డాడీ కొనిపెట్టిన డబుల్ కాట్. ఈలోగా నేను వంట ప్రయత్నాలు చేస్తాను" అంటూ ఇంకో గదిలోకి వెళ్ళిపోయిందామె.

*   *   *   *

బెడ్ మీద కొదిక్షణాలపాటు కూర్చున్నాడు దీపక్. పడుకోవాలని అనిపించకపోవడంతో లేచి ముందు గదిలోకి వచ్చాడు. ఎవరికీ కనిపించకుండా తన దుస్తుల్లో దాచుకున్న ఒక మందు బాటిల్‌ని ఓపెన్‌చేసి అప్పుడే కార్యక్రమం మొదలుపెట్టబోతున్నాడు గండయ్య. దీపక్‌ని చూడగానే ఆ బాటిల్‌ని వెనకాల దాచేసుకున్నాడు.

"కొత్తచోటు కావడంవల్లనేమో. ఎక్కడా కూర్చోబుద్ధికావడంలేదు. ఏదైనా సినిమాకు పోయివద్దామా?" ముందు గదిలో వున్న ఒక ఖాళీ కుర్చీని ఆక్రమిస్తూ మైసయ్యవంక చూస్తూ అడిగాడు దీపక్.

"ఆరున్నర దాటిపోయింది చిన్నబాబూ. ఈపాటికి ఆటలు మొదలైపోయివుంటాయి" వాచివంక చూసుకుంటూ చెప్పాడు మైసయ్య.

"ఊరి బయట ఒక హాలు వుంది. ఏడుగంటలకుగాని ఆట మొదలుకాదు. ఒకవేళ సినిమాకి వెళ్ళాలనిపిస్తే ఆ హాలుకే వెళ్ళండి. బాగానే వుంటుంది" వంటగదిలో నుంచి వారి మాటల్ని ఆలకించి వెంటనే చెప్పింది వారికి ఆతిథ్యం ఇచ్చిన ఆడమనిషి.

వహీద్‌వంక చూశాడు దీపక్.

"కొత్తచోటు....మన వెనకాల ఒక ప్రాబ్లెమువుంది. ఆరుబయట ఏమరుపాటుగా వుండడం ఏమంత మంచిగా అనిపించడంలేదు" సాలోచనగా అన్నాడు వహీద్.

"మరి ఏంచేద్దాం! నాకు ఇక్కడ కూర్చోవాలని అనిపించడంలేదు" అన్నాడు దీపక్.

"అలా అయితే ఇక తప్పేదేముంది పదండి పోదాం" అంటూ మైసయ్యవైపు, గండయ్యవైపు సాభిప్రాయంగా చూశాడు వహీద్.

"రెడీగానే వున్నాం. మరేం ఫరవాలేదు. అందరమూ ఒకేచోట కూర్చోవద్దు. చిన్నబాబు దగ్గర నువ్వు కూర్చో. నీకు ముందు కూర్చుంటా. గండయ్యగారు, రాంసింగ్ ద్వారం దగ్గిర వుంటారు. జగజీత్‌ని హాలు బయటే వుంచేద్దాం" వెంటనే చెప్పాడు మైసయ్య.



"మనం హ్యాపీగా సినిమా చూస్తుంటే తను హాలు బయట కుక్కకాపలా కాయడం నాకు నచ్చడంలేదు" అతని మాటకు అడ్డు తగిలాడు దీపక్.

"నువ్వు అధికంగా మాట్లాడకు చిన్నబాబూ....ప్రస్తుతం మనం చేయాల్సిన పని అదే. అంతగా కావాలంటే ఇంటికివెళ్ళిన తర్వాత వాడికి ఏకంగా నాలుగు సినిమాలు చూపిద్దాం. పదపద" అంటూ హడావుడిగా అతన్ని కుర్చీలో నుంచి లేపాడు వహీద్.

"ఇదుగోనమ్మా....మేము బయలుదేరుతున్నాం" వంటఇంటివైపు తిరిగి బిగ్గిరిగా చెప్పాడు మైసయ్య.

"సినిమా అయిపోగానే నేరుగా ఇంటికే వచ్చేయండి. దారిలో చిరుతిళ్ళు అవీ తినకండి. చిన్నబాబుకోసం మటన్ కబాబులు చేస్తున్నా" సమాధానం ఇచ్చింది లోపల వున్న స్త్రీమూర్తి.

"ఈ బొమ్మని మనం భరించలేమేమోనని నాకు భయంగా వుంది చిన్నబాబూ" టిక్కెట్స్ తీసుకురావడానికి సిద్ధపడుతూ అన్నాడు మైసయ్య.

"భరించడం, భరించలేకపోవడం తర్వాత. ఏదో ఒక కాలక్షేపం కావాలి. త్వరగా వెళ్ళు" అంటూ బాల్కనీవైపు అడుగులు వేయబోయాడు దీపక్. రెండు గజాలదూరం కూడా పోకముందే ఆపేశాడు వహీద్.

"అవసరమైతే అర్జంటుగా అవతలికి వెళ్ళిపోవాలి మనం. బాల్కనీ మెట్లనీ మనకి ఇబ్బందిగా తయారవుతాయి. కిందే కూర్చుందాం" అంటూ చెయ్యిపట్టుకుని కుర్చీక్లాసులోకి లాక్కుపోయాడు. ఆ విషయం తెలియని మైసయ్య బాల్కనీ టిక్కెట్లే తీసుకొచ్చాడు.

"అదేంటిసార్....పైకేపొండి. ఇక్కడ మీకు సుఖంగా వుండదు" అంటూ సలహా ఇవ్వబోయిన గేట్‌మేన్‌ని తన, కోరచూపులతో నోరు మూయించాడు వహీద్.

"మా ఇష్టం వచ్చినచోట కూర్చుంటాం. గట్టిగా మాట్లాడితే బెంచి క్లాసులోకో, నేల బల్లలదగ్గిరికో పోతాం. నీకు ఏమైనా అభ్యంతరమా?" అని అడిగాడు.

"నాకేం అభ్యంతరంలేదు సారూ....టిక్కెట్లు తీసుకున్నారుకదా... ఇప్పటికిప్పుడు వెనక్కి తిరిగి ఇంటికి వెళ్ళిపోతామని చెప్పినా నేను ఏమీ అనుకోను. వెళ్ళండి. పోయి మీ ఇష్టంవచ్చినచోట కూర్చోండి."

సీరియస్‌గా ముఖంపెట్టి వారిని లోపలికి పంపుతూ లోగొంతుకతో చెప్పాడు ఆ మనిషి.

హాలు ఎదుట వున్న ఒక చిన్న కిళ్ళీబడ్డీ దగ్గిర తన బిచాణావేశాడు జగజీత్. "లోపలికి పోలేదేంటి బాబూ?పోస్టర్లు చూసేసరికి భయంవేసిందా?" నవ్వుతూ అతన్ని అడిగాడు బడ్డీ యజమాని. అతనికి సమాధానంగా ఓ చిన్న చిరునవ్వు నవ్వి, హాలు చుట్టుపట్ల వున్న పరిసరాల్ని గమనించడంలో బిజీ అయిపోయాడు జగజీత్.

అరగంట....గంట....గంటన్నర గడిచిపోయింది.

సినిమా ఇంటర్వెల్ టైమ్ అయిపోయినా కూడా హాల్లోనుంచి ఎవరూ బయటికి రాకపోవడంతో అతని ఆశ్చర్యానికి అంతులేకుండాపోయింది.

"ఇంటర్వెల్ వేయడం దండగనుకుని వుంటారుబాబూ....కలెక్షన్లు లేవుకదా. యాకంగా ఇంటికెళ్లే కొడతారుకాబోలు...."తను కూడా కొద్దిగా ఆశ్చర్యపడుతూ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు బడ్డీ యజమాని. వెల్లడిస్తూనే హాలుకు ఎడమపక్కన వున్న ఒక పెద్ద బిల్డింగ్‌వైపు చూసి సడెన్‌గా చిన్న విజిల్ వేశాడు.

ఎలర్ట్ అయిపోయాడు జగజీత్. "ఏమిటి భాయీ? ఏమైనా విచిత్రం కనిపించిందా?" అని అడుగుతూ కనులు చిట్లించి తనూ అటుకేసి చూశాడు.

బిల్డింగ్ చాటున లారీని ఆపి, పుట్టలోనుంచి వెలువడుతున్న చీమల మాదిరి గబగబా రోడ్డుమీదికి వస్తున్నారు యాభైమంది దృఢకాయులు.

వాళ్ళు ఎవరో, ఎందుకు అలా గుంపుగా వస్తున్నారో, ఖచ్చితంగా తెలిసేటంతవరకూ ఆగలేదతను.

"భూతమో, పిశాచమో వెంటపడి తరుముతున్నట్టు అతి వేగంగా హాల్లోకి పరుగులుతీశాడు జగజీత్.

"ఏయ్ అగు....ఎవరు నువ్వు? ఏంటీ పరుగు?" అంటూ అడ్డం రాబోయిన గేట్‌మెన్‌ని అల్లంత దూరంలో పడిపోయేటట్టు నెట్టి, కుర్చీ



ల్లోకి తొంగిచూశాడు. గురకపెట్టి నిద్రపోతున్నాడు గండయ్య. అతని అడుగుల చప్పుడు విని ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

"వహీదూ....వచ్చేస్తున్నారు. యాభైమందిదాకా వున్నారు. మనం ఇక్కడికి వచ్చిన సంగతి వాళ్ళకు ఎలా తెలిసిందో నాకు అర్థంకావడం లేదు" ఖంగారుగా అరిచాడు జగజీత్. చుట్టలుచుట్టుకుని విశ్రాంతిగా పడుకున్న తాచుపాము, ఒక్కసారిగా పైకిఎలా లేస్తుందో అలాగే కుర్చీలో నుంచి లేచాడు వహీద్.

"దీపక్‌బాబుతో నువ్వు వెనుకనుంచి వెళ్ళిపో....మేము ఆ దొంగ నాయాళ్ళ సంగతి తేల్చుకుని వెనుకగా వస్తాం" అని చెపుతూ హాలు వెలుపలికి జంప్‌చేశాడు.

మినీ లారీ సరిగ్గా థియేటర్ ముఖద్వారం దగ్గిరే పార్కుచేసి రాంసింగ్ వచ్చాడు. జగజీత్‌ని చూడగానే రాకెట్ మాదిరి పోయి, బాడీలో దాచిన బాణాకర్రల కట్టల్లో నుంచి కర్రల్ని తీసుకుని వెనక్కి వచ్చేశాడు.

సరిగ్గా అదే సమయంలో హాలు ముందుకు వచ్చారు జగజీత్‌ని గమనించిన జనం.

"హాల్లోనే వుంటాడు. ఇంటర్వెల్ కూడా కొట్టలేదు. వెళ్ళండి.... త్వరగా వెళ్ళండి"అంటూ వారికి డైరెక్షన్స్ ఇచ్చాడు అంతవరకూ హాలుకు కొంత దూరంగా ఓ చెట్టునీడలో నిలబడి వున్న ఒక మనిషి.

"దొంగనాయాలు....వాళ్ళమీద మనం జగజీత్‌ని కాపలా పెట్టినట్టే వాళ్ళు కూడా మనమీద వీడిని నిఘా పెట్టినట్టున్నారు. అతణ్ని గమనించు కోలేపోవడం మనది తప్పు" అంటూ రాంసింగ్ తీసుకువచ్చిన బాణాకర్రల్లో ఒకదాన్ని తను తీసుకున్నాడు వహీద్.

*　　*　　*　　*

ఎప్పుడూ అటువంటి గుంపును గమనించి వుండలేదుకాబోలు. ఖంగారుగా బయటికి వచ్చారు తమ తమ గదుల్లో కూర్చునివున్న థియేటర్ సిబ్బంది. "ఆగండి....దయచేసి ఆగండి. విషయం ఏమిటో చెప్పండి" అంటూ నిలువరించడానికి ప్రయత్నించారు.

"పోచమ్మగుళ్ళో మా గ్రామాన్ని చులకనచేసి మాట్లాడిన బద్మాష్

# అతను



మధుబాబు

పిరికివాడిలా పారిపోయివచ్చి ఇక్కడ కూర్చున్నాడు. వారి తల పోవాల్సిందే. వాడి ప్రాణంపోయి తీరాల్సిందే" అంటూ అతివేగంగా బాల్క వైపు పరిగెత్తాడు గుంపును లీడ్‌చేస్తున్న కుందారం గ్రామపటేల్. మంది అతన్ని అనుసరించారు. మిగిలిన వారందరూ మిగిలిన క్లాసుల పరిగెత్తారు.

ఎంట్రన్స్‌కి ఆరు అడుగుల దూరంలో నిలబడిన వహీద్, గిర్రునతిప్పి బలంగా మోదాడు ముందుగా వచ్చిన ఒక వ్యక్తి మీద.

కొద్దిగా గురితప్పింది బాణాకర్ర. తలమీద పడాల్సింది పడింది. తను పట్టుకుని వున్న వేటకొడవలిని వదిలేసి. భుజం విరిగిపో నట్టుగా బాధపడుతూ నేలమీద చతికిలపడిపోయాడు.

"రండిరా దొంగనాయాళ్ళలారా....రండి....మా దీపక్ వేసేసేటంత మొనగాళ్ళా మీరు? రండి" అని రంకెలుపెడ్తూ దూకారు రాంసింగ్, మైసయ్య.

"వచ్చేయండి బాబూ....మీరు వచ్చేయండి నా మాట వినండి" బతిమాలుతూ దీపక్‌ని అతిబలవంతంగా థియేటర్ వెనుక భాగంలో చిన్నగేటు దగ్గిరికి తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నాడు జగజీత్.

అయిష్టంగానే అతనివెంట నడుస్తున్నాడు దీపక్. గేటును పించి, గేటు అవతలవున్న మట్టిరోడ్డుమీదికి పోబోతూ, ఎందుకో వెనక్కి చూశాడు.

చీకట్లో చిందులాటలు జరిగితే, ఆ గొడవతో సంబంధంలేని కూడా దెబ్బలు తగులుతాయన్న భయంతో థియేటర్ చుట్టూవున్న టినీ వేయించారు థియేటర్ సిబ్బంది. ఒక్కసారిగా వెలిగిన ఆ కాంతిలో వహీద్‌మీద దొంగదెబ్బ పడకుండా కాపలాగా గండయ్య తలకు దెబ్బ తగలడం అతనికి కనిపించింది. శరీరంలో రక్తమంతా ఒక్కసారిగా వేడెక్కిన అనుభూతి కలిగింది దీపక్‌కి.

గిరుక్కున వెనుతిరిగి వేగంగా లోనికి పరిగెత్తుకుంటూ శాడు.

నలుగురి తలలు పగలగొట్టేశాడు అప్పటికే వహీద్.



పూనకం వచ్చినవాళ్ళల్లా చిందులు తొక్కుతున్న కుందారం గ్రామస్థుల మధ్యలోనుంచి సుడిగాలి మాదిరి దూసుకువచ్చాడు దీపక్....ఏంచేయబోతున్నాడో వహీద్‌కి అర్థంకాకముందే, అతని చేతిలోని బాణాకర్రను తను లాగేసుకున్నాడు.

"సురేంద్రపాల్ మనవడిని దీపక్‌ను ఇక్కడ వున్నాను. దమ్ముగల బద్మాష్‌లెవరో ముందుకురండి....నిజంగా మీకు దమ్మే గనకవుంటే నాతో తలపడండి" గొంతు పగిలిపోయే శృతిలో పొలికేక పెట్టాడు.

అతని సేఫ్టీమీద అప్పటివరకూ తనకున్న అనుమానాలన్నిటినీ మర్చిపోయాడు వహీద్. "అదీ చిన్నబాబూ....దెబ్బకొట్టడం ఒక్కటే ముఖ్యంకాదు. దెబ్బలు ఏ రేంజ్‌లో కొట్టబోతున్నామో అవతలివాళ్ళ గుండెలు జలదరించే పద్ధతిలో చెప్పాలి....అదే పద్ధతి....అలాగేచెయ్యి" అంటూ తను బాల్కనీ మెట్లకేసి పరిగెత్తాడు.

బాల్కనీ అంతా కలియచూసి ముందుగా మెట్లు దిగివస్తున్నాడు కుందారం గ్రామ పటేల్.

అతన్ని వదిలేశాడు వహీద్. అతని వెనకాలగా వస్తున్న గుంపు మీద బ్రహ్మరాక్షసుడి మాదిరి కలబడ్డాడు.

* * * *

"కొట్టు నరుకు చంపు...." అనే గావుకేకలతో దద్దరిల్లిపోయింది బాల్కనీ.

ప్రొజెక్టర్ వుండే గదిలోకి వినిపించాయి అరుపులు....అదిరిపడి సినిమాను ఆపేశాడు ప్రొజెక్టర్‌ని ఆపరేట్ చేసే మనిషి.

"పోలీసుల్ని పిలవండి....పోలీసులకు ఫోన్ చేయండి" అని అరిచారు ఎవరో. ఆ మాటలు వినబడటంతో తెలిసివచ్చింది థియేటర్ సిబ్బందికి. అప్పటికప్పుడు పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేశారు వాళ్ళు.

మరో పది తలలు పగిలిపోయాయి ఈలోపల. బాల్కనీ మెట్లుదిగి బయటికి వచ్చిన పటేల్ భుజాల్ని విరిగిపోయేటట్టు కొట్టి కిందికి నెట్టేశాడు దీపక్.

అతని తలను కూడా పగల కొట్టడంకోసం బాణాకర్రను ఎత్తబోతుండగా, కేకలు పెట్టుకుంటూ థియేటర్ ఆవరణలోకి వచ్చేశారు ఆ చుట్టు

పట్ల తిరుగుతున్న జనం. వారిని చూసేసరికి థియేటర్ సిబ్బందికి కూడా వచ్చేసింది ధైర్యం. అందరూ కలిసి దీపక్‌ని వెనక్కి నెట్టేశారు.

ఆ తరువాత బాల్కనీలో వీరంగం వేస్తున్న వహీద్‌ని కూడా ఆపేశారు. తరువాత కుర్చీ క్లాసుదగ్గర తొక్కిసలాటను నిలుపుదల చేశారు.

"మీకు మీకు తగాదాలుంటే మీ ఇళ్ళదగ్గిరా, మీ ఊళ్ళదగ్గిరా తేల్చుకోండి. చంపుకోండి. మా సిటీలోకి వచ్చి మా మధ్యలో తన్నులాడుకుంటే మాత్రం మేము సహించేదిలేదు. మర్యాదగా కర్రలు కిందపడేయండి" అంటూ అందరి దగ్గిరా వున్న ఆయుధాలను అతి బలవంతంగా లాగేసుకున్నారు.

చూస్తూ చూస్తూ వుండగానే అధికం అయిపోతున్నది వారి సంఖ్య.

చోటుగాని చోటులో అంతమంది మాటను కాదని అంటే ఏం జరుగుతుందో వహీద్‌కి తెలుసు.

"ఆఖరి క్షణంలో వచ్చి అంతా సర్వనాశనం చేసేశారు వీళ్ళు. కాదు కూడదని అంటే వీళ్ళతో కూడా తగవు స్టార్ట్ అవుతుంది. వెళ్ళిపోదాం" అంటూ దీపక్‌ను మినీలారీలో కూర్చోబెట్టాడు అతను.

ఆర్గ్యుమెంట్ స్టార్ట్‌చేస్తే తమకు కూడా అమర్యాద జరుగుతుందని అర్థమై, తనుకూడా అటువంటి డెసిషనే తీసుకున్నాడు కుందారం గ్రామ పటేల్.

"పదండిరా పోదాం....ఈ దొంగనాయాళ్ళు ఇవ్వాళ్టికి తప్పించుకున్నామని సంతోషిస్తున్నారు. స్టేషన్‌కిపోయి రిపోర్టు ఇద్దాం" అంటూ గాయపడిన తనవాళ్ళని మూడు టాంగాల్లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరదీశాడు. ఆ టాంగాలు ఎంతోదూరం పోకముందే మూడు మోటార్ బైక్స్ మీద నలుగురు కానిస్టేబిల్స్‌తో థియేటర్ దగ్గిర ప్రత్యక్షమయ్యాడు ఒక ఇన్స్‌పెక్టర్.

థియేటర్ సిబ్బంది చెప్పింది అంతావిని, అప్పుడే కదలబోతున్న దీపక్ వాళ్ళ మినీలారీని అడ్డగించి, అటునుంచి అటే స్టేషన్‌కి తీసుకుపోయాడు.

# 12

"తాతగారూ....తాతగారూ....మీరు పొద్దున్న టీవీ చూశారా?" ఉదయం ఏడుగంటల సమయంలో డైనింగ్ హాల్లోకి వచ్చిన సురేంద్ర సాబ్‌ని అడిగాడు సోహన్.

నిద్ర చాలనట్టు, రాత్రంతా అసలు నిద్రేపోనట్టు ఎర్రబడి వున్నాయి సురేంద్రసాబ్ కళ్ళు.

"టీవీ చూసే అలవాటు నాకు లేదు....నువ్వు నోరు మూసుకో" చిరాకుగా సమాధానం ఇచ్చి, "పీటర్ ఎక్కడ వున్నాడో పిలుచుకురా" అని ఆర్డర్ వేశాడు.

"అలాగే తాతగారూ....వెంటనే పిలుచుకువస్తాను" అని వినయంగా సమాధానం ఇచ్చి డైనింగ్‌హాల్లోనుంచి బయటకి వచ్చాడు సోహన్.

మెయిన్‌హాల్లో మెత్తటి కుంచెను తీసుకుని, అందరూ కూర్చునే సోఫాలను శుభ్రంగా దులుపుతోంది మరియమ్మ. "పోయి పీటర్‌ని పిలుచుకురా. అర్జెంట్‌గా రమ్మని చెప్పు. వెళ్ళు...." హుకుం జారీ చేశాడు అతను. కుంచెను కిందపడేసి పరుగులాంటి నడకతో, పోర్టికోలోకి,అక్కడి నుంచి మెయిన్‌గేటు దగ్గిరికి పోయింది మరియమ్మ. గేటుదగ్గర సెల్‌ఫోన్లో ఎవరితోనో అతి సీరియస్‌గా మాట్లాడుతున్నాడు పీటర్.

"ఇన్స్‌పెక్టర్ ఏగస్త్యాస్త్రిలు మాట్లాడుతున్నాడా? కుందారం గ్రామ పటేల్ అతన్ని మచ్చిక చేసుకుని, మనమీదే కేసులు పెట్టించాడా? చిన్నబాబును బయటికి వదిలే ప్రసక్తి లేదంటున్నాడా? ఆల్‌రైట్....నువ్వు కంగారుపడకు. నేను ఏదోఒకటి చేసేస్తాను" అంటూ ఫోన్‌ని కిందికి దించి మరియమ్మకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"పెద్దబాబు నిన్ను దీసుకురమ్మన్నారట. అర్జెంటుట...." అతనికి చెప్పింది మరియమ్మ.

"పెద్దబాబు అర్జెంటు అన్నారంటే విషయం ఆయనకు తెలిసిపోయి వుంటుంది....ఈవాళ నాకు చీవాట్లు దెపినిట్లు" అంటూ పరుగు పరుగున బిల్డింగ్‌లోకి వచ్చాడు.

మెయిన్ హాల్లోనే అసహనంగా నిలబడి వున్నాడు సోహన్.

"వెంటనే రమ్మని కబురుచేస్తే ఏమిటీ ఆలస్యం? నీకు కొవ్వు ఎక్కువ అయిపోయింది" అంటూ గిరుక్కున వెనుతిరిగి డైనింగ్ హాల్లోకి పోయాడు.

"తీసుకువచ్చాను తాతగారూ పీటర్‌ని" అంటూ సురేంద్రసాబ్‌కి రిపోర్ట్ చేశాడు సోహన్.

సీతమ్మ తీసుకువచ్చి ఎదురుగా పెట్టిన టిఫిన్‌ప్లేటువంక గాని, పక్కనే వున్న కాఫీమగ్‌వంక గాని చూడటంలేదు సురేంద్రసాబ్. అర మూసిన కళ్ళతో ఏదో దీర్ఘాలోచనలో వున్నాడు. సోహన్ రిపోర్టును విన గానే కనులు తెరిచి, పీటర్ వంక చూశాడు.

"జరిగింది ఏమంత పెద్ద ఇన్సిడెంట్ కాదు సార్....మీరు ఒక్క సారి మన ఎస్.పి.గారికి ఫోన్‌చేస్తే చిటికెలో సాల్వ్ అయిపోతుంది. అసలు అక్కడ జరిగింది ఏమిటంటే...." దగ్గిరికి వచ్చి చిన్నకంఠంతో చెప్పబోయాడు పీటర్.

డైనింగ్ టేబిల్‌మీద పెట్టిన న్యూస్‌పేపర్ని అతని ముఖంమీదికి విసిరికొట్టాడాయన.

"పద్దెనిమిది పేజీల పేపర్లో ఎక్కడా చోటులేనట్టు సరిగ్గా ముందు పేజీలోనే ముద్రించారు ఈ వార్తని. నా పరువుపోయింది. నా మనవడు వీధి తగాదాల స్టేజినించి ముఠా తగాదాల స్టేజికి చేరుకోవడం నాకు తల తీసేసి నట్టుగా అనిపిస్తోంది. నేను ఎవరికీ ఫోన్ చేయను. వాడు ఆ స్టేషన్లోనే పడి గిలగిలా కొట్టుకోవాలి.... నువ్వుగాని ఎవరికైనా ఫోన్‌చేస్తే నీ కాళ్ళు కూడా విరిచేస్తాను. అర్థం అయ్యిందా?" కోపంగా అన్నాడు సురేంద్ర సాబ్.

తన ముఖంమీద పడిన న్యూస్‌పేపర్ని జాగ్రత్తగా మడతలుపెట్టి మళ్ళీ డైనింగ్‌టేబిల్‌మీద పెట్టాడు పీటర్.

"కోపం వద్దు సార్....సిద్ధిపేటలో చిన్నబాబు చాలా ఇబ్బంది పడుతూ వుంటాడు. మీరు ఒక్కసారి ఎస్.పి.గారికి ఫోన్‌చేసి...." అంటూ మాటలు మొదలుపెట్టేసరికి, అతను మడతపెట్టి టేబిల్‌మీద పెట్టిన పేపర్ని తిరిగి అతని మీదికే విసిరేశాడు సురేంద్రసాబ్.

• • • •



"చెప్పిన మాటనే పదే పదే చెప్పే అలవాటు నాకు లేదని నీకు తెలుసు. వద్దు వద్దన్నకొద్దీ బయటికి పోయి లేనిపోని తకరారుల్లో తల దూర్చడం మీ చిన్నబాబుకు చాలా ఎక్కువ అయిపోయింది. అసలు వాడి ముఖం చూడాలంటేనే నాకు అసహ్యం కలుగుతోంది. వెళ్ళు, వెళ్ళి నీ పని చూసుకో....వెళ్ళు" ఖంగుమంటున్న కంఠంతో గర్జించినంత పనిచేశా రాయన.

తల వంచుకుని వెనక్కి జరిగాడు పీటర్.

"వెళ్ళమంటే అలాగే నిల్చుంటావేం? తాతగారు చెప్పింది అర్థం కాలేదా? ఏ పనైనా చేసేముందు తాతగారి మర్యాదకు దెబ్బ తగులు తుందేమోనని ఆలోచించాల్సిన అవసరం వాడికి లేదా? ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తే తాతగారు బాధపడతారని తెలియదా?

రోజు రోజుకీ వాడికి తాతగారంటే భయం భక్తి రెండూ లేకుండా పోతున్నాయి. చోటుగాని చోటులో వీధి రౌడీ మాదిరి ప్రవర్తించి పోలీస్ స్టేషన్‌లోకి పోవడమంటే ఎంత నామర్దా? అదేపని నా కొడుకు చేసివుంటే గనుక నేనే స్వయంగా స్టేషన్‌కిపోయి తల నరికి పారేసేదాన్ని....ఛీ.... ఛీ...." వెంటనే అందుకున్నది డైనింగ్ టేబిల్‌కి అవతలి పక్కన కూర్చుని వున్న సరితాదేవి.

"నిజమే పీటరూ....అమ్మ మాటల్లో అబద్ధంలేదు. ఒకసారి స్కూల్లో మా మాస్టారు లెక్కలు తప్పు చేసినందుకు రెండు పిరియడ్లు బెంచీమీద నిలబెట్టారు. మా అమ్మ స్కూలుకొచ్చి, పరువు తీసేశానని అందరిముందు నా చెంపలు వాయించింది" ఆ సంఘటన అంతకుముందే జరిగినట్టు చెంపలు తడుముకుంటూ చెప్పాడు సోహన్. ఆ సంభాషణ వినడం ఇష్టంలేనట్టు చివాలున కుర్చీలోనుంచి లేచాడు సురేంద్రసాబ్.

"అయ్యయ్యో....కనీసం కాఫీ అయినా తాగండి తాతగారూ.... బుద్ధిలేని ఆ దీపక్‌గాడి మూలకంగా మీరు మనసు పాడుచేసుకోవడం అనవసరం" అంటూ ముందుకు వచ్చాడు సోహన్.

అదే సమయంలో రంయ్‌మంటూ వచ్చి పోర్టికోలో ఆగింది లాయర్ దామోదరం కారు. "సురేంద్రా....పేపర్ చూశావా?" లోపలికి వస్తూ పెద్దగా ప్రశ్నించాడు.

ఉబికివస్తున్న కోపాన్ని అణిచిపెట్టుకోవడం చేతకాలేదు సురే
సాబ్‌కి.

"పేపర్ మాట నా దగ్గిర ఎత్తొద్దు....ఆ ఇడియట్ గురించి
నాకు ఏమీ చెప్పవద్దు" అంటూ గర్జించాడు.

"అదేమిటి సురేంద్రా? అక్కడ లాకప్‌లో వున్నది నీ మను
దారినపోయే దానయ్యకాదు. అతని ప్రవర్తన మీద నీకేమయినా అ
తృప్తి వుంటే, దాన్ని తరువాత తీరికగా అతను ఇంటికి వచ్చిన త
వెల్లడించవచ్చు. ముందుగా అతన్ని బయటికి తీసుకురావాలి. నేను
సిద్ధిపేట వెళుతున్నాను. నువ్వు కూడా వస్తావేమోనని అడగ
వచ్చాను" తొణుకుబెణుకు లేకుండా తన అభిప్రాయాన్ని వెల్లడి
లాయర్‌సాబ్.

ఆ మాటలకు సురేంద్రసాబ్ సమాధానం ఇవ్వకముందే
కల్పించుకున్నది సరితాదేవి.

"వద్దు వద్దన్నకొద్దీ పోయి పరువుతక్కువ పనులు చేస్తు
ఛండాలుడి గురించి ఎక్కువగా మాట్లాడుకోవడం అనవసరం అన్న
గారూ. వాడు వట్టి వెధవ. రెండు రోజులపాటు ఆ పోలీసుల చే
చావు దెబ్బలు తింటేగాని వాడికి సరిగ్గా బుద్ధిరాదు. నాన్నగారు చెప్పు
సెంట్‌పర్సెంట్ కరెక్టు. మీరు వాడికోసం వెళ్ళవద్దు" వెనుకా ము
చూసుకోకుండా గడగడా చెప్పేసిందామె.

ఆశ్చర్యం నిండిన కళ్ళతో ఆమెవంక ఒకసారి చూసి
లించాడు లాయర్‌సాబ్.

"ఎందుకంత ఆశ్చర్యం? సరిత ఇప్పుడు మాట్లాడకూడని
ఏమని మాట్లాడింది? తను చెప్పింది కరెక్టేగా!" ఉన్నట్లుండి అ
సురేంద్రసాబ్.

థౌజండ్ క్యాండిల్ బల్బుమాదిరి గప్పున వెలిగిన సరిత
ముఖాన్ని, ఆమె కొడుకు వదనాన్ని చూసి గాఢంగా నిట్టూర్చాడు లా
సాబ్.

"రాత్రి మూడుగంటల సమయంలో నాకు సిద్ధిపేటనించి ఎవరో



మనిషి ఫోన్‌చేసి అక్కడ జరిగింది ఏమిటో చెప్పింది. ఆ మాట నీ చెవిన కూడా వేద్దామని అనుకున్నాను. నువ్వు ఏదీ వినిపించుకోకుండా ఇష్టం వచ్చినట్టు ఒక అభిప్రాయానికి వచ్చేస్తున్నావు" నిష్ఠూరం వేస్తున్నట్టు నిరసన ధ్వనిస్తున్న కంఠంతో అన్నాడు.

"ఆడమనిషి ఫోన్ చేసిందంటే, ఆ దీపక్‌గాడి అల్లరి ఇంకా ఇంకా చాలాదూరం వెళ్ళిపోతున్నట్టు లెక్కే. వాడు తగాదాల స్టేజిని దాటి ఆడ వాళ్ళతో సంబంధాలు పెట్టుకునే పొజిషన్‌కి ఎదిగిపోయినట్టే. అలాంటివాడి విషయంలో ఇక జాలితలవడం అనవసరం.

అన్నయ్యగారూ! వాడి విషయంలో ఇప్పుడు కఠినంగా వ్యవహరించకపోతే, తరువాత చాలా బాధలు పడాల్సివస్తుంది" మాటలకోసం తడుముకోను కూడా తడుముకోకుండా గడగడా చెప్పేసింది సరితాదేవి.

పదిక్షణాల తరువాత కూడా సురేంద్రసాబ్ నోట్లోనుంచి మాటలు బయటికి రాకపోవడంతో, "నీ అభిప్రాయం కూడా ఇదేనా సురేంద్రా?" అని అడిగాడు లాయర్‌సాబ్. చురుకుగా ఒక చూపు చూసి, డైనింగ్‌హాల్లోనుంచి తన గదిలోకి వెళ్ళిపోయాడాయన.

* * * *

అదే సమయంలో మోతలుచేస్తూ వచ్చి గేటుముందు ఆగిందొక ఆటో. ఆశ్చర్యంగా అటుచూసిన పీటర్ కళ్ళకు, ఆటోలోనుంచి చటుక్కున కిందికి దిగి, ఆటోని అవతలికి పంపించేస్తున్న శృతిమేడమ్ కనిపించింది.

"హల్లో మేడమ్.....ఇది చాలా ఆశ్చర్యం. మీరు ఇంత పొద్దున్నే బయలుదేరి ఇక్కడికి రావడం...." తన మనసులోని అలజడిని అతి బలవంతంగా అదుముకుంటూ ఆమెకు ఎదురువెళ్ళాడు పీటర్.

"ఆశ్చర్యాలు పడటం కాదు....ముందు అర్జెంటుగా నాకు ఒక వెహికిల్ కావాలి. అరేంజ్ చెయ్" సీరియస్‌గా ముఖంపెడుతూ చెప్పింది శృతి మేడమ్.

"అర్జెంటుగా వెహికిలా? అదేంటి మేడమ్? మీ మామయ్యగారి కారుకేమైంది? ఇంతకుముందేకదా ఆయన ఇంటికొచ్చింది?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"మామయ్య కారును ఉపయోగించుకోవడానికి వీలులేని పరిస్థితి ఎట్టి పరిస్థితిలోను తనని సిద్దిపేట వెళ్ళొద్దని మీ పెద్దబాబుగారు స్ట్రిక్ట్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చార్టకదా....అందుకని తన కారును ఆయన ఇవ్వడు" ఎంతో ఓపికగా చెప్పింది శృతిమేడమ్.

"ఆయన సిద్ధిపేట వెళ్ళకపోవడానికి, మీరు సిటీలో తిరగడానికి సంబంధం ఏమిటి?" మరింత అయోమయంగా అడిగాడు పీటర్.

"సిటీలో తిరగడానికి కాదు. మీరెవరూ మీ చిన్నబాబును గురించి పట్టించుకోవడంలేదు. అతని కర్మానికి అతన్ని వదిలేసి, అసలు ఏం జరిగిందో తెలుసుకోనుకూడా తెలుసుకోకుండా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. అందుకే నేను సిద్ధిపేట వెళ్ళదలుచుకున్నాను. అసలు అక్కడ ఏం జరిగిందో తెలుసుకుని, అతన్ని బెయిల్‌మీదైనా బయటికి తీసుకువస్తాను" చెప్పిందామె.

* * * *

పోతున్న ప్రాణాలు తిరిగి వచ్చినట్టు, నీటిలో మనిషి పోతున్నప్పుడు పక్కనే పెద్ద చెక్కముక్క కనిపించినట్టు వెలిగిపోయింది పీటర్ ముఖం.

"ఒక్క నిముషం మేడమ్, ఒకే ఒక్క నిముషంలో వచ్చేస్తాను. మీరు షెడ్డులో కూర్చోండి. లోపల వున్న సరితామేడమ్ చూస్తే బాగోదు" అంటూ రివ్వున వెనక్కి వచ్చాడు. బిల్డింగ్ పక్కభాగంలో వున్న గ్యారేజీలోకి పోయి, శుభ్రంగా తుడిచి రెడీగా నిలబెట్టివున్న గ్రీన్‌కలర్ అంబాసిడర్‌ని స్టార్ట్‌చేశాడు.

ముందు గదిలోకి ఏదో పనిమీద వచ్చిన సరితాదేవి వెంటనే గమనించింది ఆ శబ్దాన్ని.

"ఏమిటది? ఎందుకు కారు?" పోర్టికో మెట్లమీదికి వస్తూనే కరుకుగా అడిగింది పీటర్‌ని.

"కార్బొరేటర్‌లో ఫాల్టు వస్తోంది మేడమ్! రన్నింగ్‌లో వున్నట్టుండి ఆగిపోతోంది. ఇంజన్ ఆయిల్‌కూడా అనవసరంగా లీకవుతోంది. మెకానిక్ మనిషిని పంపించాడు.... రిపేర్ చేయించేస్తే ఒక పని అయిపోతుంది. సాయంత్రం మీరు బయటికి బయలుదేరే సమయానికి రెడీ అవు



తుంది" అంటూ ఆమెకు నమ్మకం కలగడానికి, ఒకసారి తనంతట తనే ఇంజన్‌ని ఆపి, రీస్టార్ట్ చేశాడు పీటర్.

"ఎప్పుడు చూసినా ఒకటే రిపేర్లు. మిమ్మల్ని, ఆ మెకానిక్కుల్ని పోషించడానికే మా నాన్నగారి ఆస్తి హారతి కర్పూరం అయిపోతోంది" అక్కసుగా అంటూ లోపలికి వెళ్ళిపోయింది సరితామేడమ్.

అప్పటివరకు బిగపట్టివుంచిన ఊపిరిని తేలికగా బయటికి వదులుతూ, అంబాసిడర్‌ని మెయిన్‌గేటు దగ్గిరికి తీసుకువచ్చాడు పీటర్.

గేటు మూసినప్పుడు వహీద్ కూర్చునే షెడ్డులో అసహనంగా నిలబడివున్నది శృతిమేడమ్.

"మేడమ్! మీరు రవీనా బజారుదగ్గిర జమలయ్య మెకానిక్‌షెడ్ దగ్గిరికి వెళ్ళండి. నేను వాడికి ఇప్పుడే ఫోన్‌చేసి చెపుతాను. కత్తుల్లాంటి కుర్రాళ్ళు, డ్రయివింగ్ బాగా తెలిసినవాళ్ళు వాడిదగ్గిర చాలామంది వున్నారు. ఎవరో ఒకరిని మీకు అప్పగిస్తాడు. శ్రమ లేకుండా మీరు ప్రయాణం చేయవచ్చు" కారును ఆమెకు అప్పగిస్తూ, తన ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు పీటర్.

అవతలినించి వినవచ్చిన సమాధానం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించినట్టు ఫీలవుతూ హ్యాపీగా నిట్టూర్చాడు పీటర్.

"ఏమిటి సంగతి?" ఇంజన్‌ని స్టార్ట్‌చేసి చూస్తూ అడిగింది శృతిమేడమ్.

"వాళ్ళని, వీళ్ళని పంపించడం అనవసరం. నేనే స్వయంగా తీసుకుపోతానని ఆ జమలయ్యగాడు అంటున్నాడు మేడమ్! వాడు మహాముదురు. అవసరం అయితే పోలీసుస్టేషన్‌లో మొండిగా మాట్లాడి అయినా పని పూర్తిచేయగలడు" అన్నాడు పీటర్.

"అతనికి....ఆ జమలయ్యకి మీ చిన్నబాబు ఫేస్‌చేస్తున్న ప్రాబ్లెమ్ ఏమిటో తెలిసిపోయిందా?"

"వాడికేమిటి మేడమ్? సిటీలో మా పెద్దబాబుగారికి తెలిసినవాళ్ళందరికీ అర్థమైపోయి వుంటుంది. ఈ న్యూస్‌పేపర్ వాళ్ళు సామాన్యులుకాదు. పెద్దబాబును గురించి తెలియనివాళ్ళకి కూడా పూర్తిగా తెలిసిపోయేటట్టు చాలా వివరంగా రాశారు" చెప్పాడు పీటర్.

సానుభూతి సూచకంగా తల ఆడించి, అంబాసిడర్‌ని ముందుకు దూకించింది శృతిమేడమ్.

మెయిన్‌రోడ్లను అధిగమించి, ఆమె రఫీనా బజారు దగ్గరికి చేరేసరికి, ఆమె కోసమే ఎదురుచూస్తున్నట్టు అసహనంగా నిలబడి వున్నాడు మెకానిక్ జమలయ్య.

"అమ్మా! మీరు వెనకాల హ్యాపీగా కూర్చోండి. నిద్రవస్తే హాయిగా నిద్రపోండి....నిద్ర లేచేసరికి సిద్దిపేట చేర్చే పూచీ నాది" అని చెప్పి స్టీరింగ్ తీసుకుని, కారును ముందుకు కదిలించాడు.

* * * *

"సారీ మేడమ్! వాళ్ళని వదిలిపెట్టడం అంటూ జరగదు. కుందారం గ్రామపటేల్ స్వయంగా వచ్చి రిపోర్ట్ రాసిచ్చాడు. పెద్ద కేసు.... శిక్ష చాలా భయంకరంగా వుంటుంది" కారుదిగి లోపలికి వచ్చి, దీవక్‌ని గురించి ఎంక్వయిరీ మొదలుపెట్టిన మరుక్షణం చాలా సిన్సియర్‌గా శృతిమేడమ్‌కి చెప్పాడు ఎస్సై.

"శిక్ష చాలా భయంకరంగా వుండే నేరం చేసినప్పుడు వెంటనే కేసును కోర్టుకు పంపించకుండా తాత్సారం ఎందుకు చేస్తున్నారు? ఎప్పుడో నిన్న రాత్రి ఎర్లీ అవర్స్‌లో జరిగిన నేరం.... ఇప్పుడు టైమ్ ఎంత అయింది?" సీరియస్‌గా అడిగింది శృతిమేడమ్.

ఆ మాటలకు వెంటనే అఫెండ్ అయ్యాడు ఎస్సై.

"ఎప్పుడు ఏం చేయాలో మాకు బాగా తెలుసు. ముక్కూ మొహం తెలియనివాళ్ళు ఎవరెవరో వచ్చి మాకు చెప్పాల్సిన అవసరం లేదు" క్రూరంగా ఆమెవంక చూస్తూ కరుకుగా హెచ్చరించాడు.

"ఆల్‌రైట్ సర్! మీరు కుందారం గ్రామ పటేల్ చెప్పిన వెర్షన్ పట్టుకుని ప్రొసీడ్ అవుతున్నారు. అసలు ఆ సినిమాహాలు దగ్గర ఏం జరిగిందో మీరు విచారించడంలేదు. నేను ఇప్పుడే వెళ్ళి గంగారం గ్రామ పెద్దల్ని అందరినీ తీసుకువస్తాను. ఇక్కడ జరిగిన తగాదాకు మొదట బీజం కుందారం గ్రామంలో పోచమ్మతల్లి జాతర్లో పడిందిట. వాళ్ళు వచ్చి మీకు కంప్లయింట్ ఇస్తారు...." అంటూ గిరుక్కున వెనక్కి తిరిగింది శృతిమేడమ్.



"అది తల్లీ....అలా అడుగు.... రాత్రి పన్నెండు గంటల్నించీ మేము నెత్తీనోరు కొట్టుకుంటున్నా వీళ్ళు ఏమీ పట్టించుకోవటంలేదు" హుషారుగా అన్నాడు లాకప్ తలుపుదగ్గిరికి వచ్చి నిలబడిన గండయ్య.

బయటికి వెళ్ళిపోయే ఆలోచనను విరమించుకుని "నేను ఒకసారి వాళ్ళతో మాట్లాడాలి. పర్మిషన్ ఇవ్వడానికి వీలుపడుతుందా?" ఎస్సైని అడిగింది శృతిమేడమ్.

కాదుకూడదంటే, ఆమె ఎలా రియాక్ట్ అవుతుందో అర్థంకాక, అయిష్టంగానే తల వూపాడు ఎస్సై.

లాకప్ దగ్గిరికి వచ్చిన శృతిమేడమ్‌వంక ఆప్యాయంగా చూశాడు గండయ్య. "తల్లీ....మీకు సినిమాహాలు దగ్గిర జరిగింది ఏమిటో ఎలా తెలిసింది?" అని అడిగాడు అతని వెనుకే నిలబడివున్న మైసయ్య.

"మీకు ఈ సిటీలో ఆతిధ్యం ఇవ్వడానికి సిద్ధపడిన మనిషి నాకు పరిచయం అయింది. మిమ్మల్ని బయటికి తీసుకురావడానికి రాత్రినించీ ప్రయత్నాలు చేస్తోందిట. మా మామయ్యకు ఫోన్‌చేసి విషయం చెప్పినప్పుడు నేను కూడా అక్కడే వున్నాను....సిటీలోకి రాగానే తన ఫోన్ నెంబర్‌కి రింగ్‌చేసి మాట్లాడాను.

మీరందరూ ధైర్యంగా వుండండి. సాయంత్రంలోగా బయటికి వస్తారు" అంటూ వారందరి భుజాలమీదుగా లోపలికి చూసింది శృతి మేడమ్. కటికనేలమీద పడుకుని గాఢంగా నిద్రపోతూ కనిపించాడు దీవక్.

"ఎలా పట్టింది నిద్ర? అసలు ఈ వాతావరణంలో అతను అంత నిబ్బరంగా ఎలా నిద్రపోగలుగుతున్నాడు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"మా చిన్నబాబు పద్దతే అంత తల్లీ....వున్నా లేకపోయినా, తిన్నా తినకపోయినా పిసరంత కూడా చెక్కుచెదరడు....ఏదైనా అయితే చూసుకోవడానికి మేము పక్కనే వున్నామన్న భరోసా...." చెప్పాడు రాంసింగ్.

అతనివంకా, మిగిలినవాళ్ళవంకా ఒకసారి విచిత్రంగా చూసి, స్టేషన్ బెలుపలికి వెళ్ళింది శృతిమేడమ్.

స్టేషన్ వెలుపల ఆమెకోసం వెయిట్ చేస్తోంది ఫోన్‌లో పరిచయం

అయిన దమయంతి.

"వట్టొట్టి మాటలతో ఈ ఎస్సై మనదారికి రాడు....మనం గంగా వెళ్ళి పోచమ్మతల్లి ధర్మకర్తల్ని మనవెంట తీసుకువద్దాం...." అంబాసి డోర్‌ని తెరిచిపట్టుకుంటూ శృతిమేడమ్‌కు చెప్పింది దమయంతి.

"అంత శ్రమ అవసరంలేదు. ఇక్కడ మా మామయ్య దగ్గ జూనియర్‌గా పనిచేసిన లాయర్ ఒకతను వున్నాడు. అతనికి ఫోన్ చే తర్వాతే నేను బయలుదేరి వచ్చాను....అతను మేజిస్ట్రేట్ దగ్గిరికి పో మాట్లాడి వస్తానని చెప్పాడు" అంటూ అక్కడున్న పెద్దచెట్టు కిందకిపో నిలబడింది శృతిమేడమ్.

"సినిమా చూసి వచ్చాక తింటాడని దీపక్ బాబుకోసం బోలెడ్న వంటలు చేశాను. అవన్నీ వేస్ట్ అయిపోయాయి. స్టేషన్‌కి తీసుకొస్తే ఆక లేదు తిననవి అన్నాడు....మనం ఇంటికి పోదాం తల్లీ....ఆ జూనియ వచ్చేలోపు ముఖం కడుక్కుని కొంచెం ఫ్రెష్ అవవచ్చు" ఎండ మికి ఎర్రగా కందిపోయిన శృతిమేడమ్ ముఖాన్ని చూస్తూ చెప్పింది ద యంతి.

"ఇప్పుడు ఫ్రెషప్ అవకపోతే నా అందానికి వచ్చిన నష్టం లేదు. మా మామయ్య అసిస్టెంటు వచ్చేస్తాడు...." అన్నది శృతిమేడ

* * * *

ఆమె అన్నట్లుగానే మరో రెండు నిముషాల తర్వాత తన స్కూట మీద హడావుడిగా రానే వచ్చాడు ఆ లాయర్. వస్తూనే స్టేషన్లో పోయాడు.

"వట్టి మాటలతో దారికి రావడంలేదని చెప్పి గట్టిగా మాట్లా టానికి లాయర్‌ని తీసుకొచ్చారా?" వెటకారంగా అడిగాడు ఎస్సై. వెళ్ళ వచ్చిన శృతిమేడమ్‌తో.

"గట్టిగానో, వట్టిగానో మీతో మాట్లాడాల్సిన అవసరం మాకు మేజిస్ట్రేటుగారికి విషయమంతా చెప్పాము. గంగారం జాతర స్పెషల్ డ్యూటీ చేయడానికి వెళ్ళిన ఫోర్త్‌టౌన్ ఎస్సైగారికి కుంద గ్రామ పటేల్‌మీద రిపోర్టు ఇవ్వడ ఎప్పుడో జరిగిపోయింది.

మర్యాదగా మీరు మా వాళ్ళని వదిలిపెట్టకపోతే ఫోర్త్‌టౌన్‌వా



కుందారం గ్రామపటేల్‌ని, అతనితోపాటు దొమ్మీకి వచ్చినవాళ్ళని అందరినీ అరెస్ట్‌చేసి సరాసరి కోర్టుకు తీసుకుపోతారు....బాగా ఆలోచించుకుని ఏం చేయాలో మీరే నిర్ణయించుకోండి" ఖంగుమంటున్న కంఠంతో చెప్పాడు లాయర్.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? వీళ్ళని ఉట్టిపుణ్యానికి వదిలేసి ఇంటికి వెళ్ళిపొమ్మని మేము చెప్పాలనా?" కోపంగా అడిగాడు ఎస్సై.

"ఉట్టిపుణ్యానికి మీరు వదలాల్సిన అవసరంలేదు. కేసు బుక్ చేయండి. కోర్టులో ప్రజెంట్ చేయండి. కోర్టునించి వారెంట్ వచ్చిన వెంటనే వీళ్ళు సరాసరి కోర్టుకు వచ్చేస్తారు. ఇవిగో ముందస్తు బెయిల్ పేపర్లు మేజిస్ట్రేట్‌గారు కన్విన్స్ అయ్యారు. సరిగ్గా వున్నాయో లేవో చూసుకోండి" అంటూ కొన్ని కాయితాల్ని టేబిల్‌పై పడవేశాడు లాయర్. కరెక్టుగానే వున్న వాటిని చూసిన తర్వాత ఏం మాట్లాడాలో ఎస్సైకి అర్థం కాలేదు.

"వీళ్ళతో సంతకాలు పెట్టించుకుని వదిలేయండి" అంటూ తన స్టాఫ్‌కి ఆర్డర్ ఇచ్చాడు. ఒకరి తరువాత ఒకరుగా వచ్చి తనకు నమస్కారాలు చేసిన రాంసింగ్‌ని, వహీద్‌ని, మైసయ్యని భుజంతట్టి పరామర్శించాడు లాయర్. గండయ్య భుజంమీద చెయ్యివేసి, అందరికంటే వెనుకగా వచ్చిన దీపక్‌కి నమస్కారం చేశాడు.

"థాంక్యూ వెరీమచ్ లాయర్‌గారు....మీ మేలు మర్చిపోలేను ఎప్పటికీ" అన్నాడు దీపక్.

"నాదేముంది బాబూ....ఈ కేసు వివరాలన్నీ నాకు చెప్పిన ఈ దమయంతిది అసలు కష్టం....మా లాయర్ సాబ్ మేనకోడలు శృతిమేడమ్ నాకు ఫోన్ చేయకముందే ఈవిడ నన్ను కాంటాక్ట్ చేసింది. గంగారం కబురుచేసి కాయితాలు రెడీ చేయడానికి ఆలస్యమైంది" అంటూ దమయంతిని చూపించాడు లాయర్.

తనకంటే ముందుగా అతన్ని బయటికి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేసిన దమయంతిని చూసి అసూయపడలేదు శృతిమేడమ్.

"అన్ని విషయాలు నాకు ఒక్కదానికే తెలుసన్నట్లు ప్రవర్తించాను. దయచేసి నన్ను క్షమించండి" అంటూ ఆమె దగ్గిరికిపోయి నిలబడింది.

తను, తన వాళ్ళందరూ అంత తేలికగా బయటికి రావడానికి కారణం దమయంతి అని తెలిసిన వెంటనే, క్షణం కూడా సంకోచించలేదు దీపక్. సూటిగా ఆమె దగ్గిరికి పోయాడు. తను ఏంచేయబోతున్నాడో ఆమెకు, మిగిలినవారికి అర్థం అయ్యేలోపుగా, ముందుకు వంగి ఆమె పాదాలకు నమస్కారం చేశాడు.

ఆశ్చర్యపోయింది శృతిమేడమ్. నివ్వెరపోయింది దమయంతి.

"ఇదేంపని బాబూ....నువ్వు నాకు నమస్కారం చేయడం ఏమిటి?" అతని భుజాలు పట్టుకుని గబగబా పైకి లేపుతూ కంగారుగా అడిగింది.

"నమస్కారం చేయించుకునే అర్హత మీకు వుంది. చేయడంవల్ల నా ఆయుష్షు పెరుగుతుందేగాని తగ్గదు....నాకు బాగా ఆకలిపేస్తోంది...." ఆమె ముఖంలోకి చూసి చిరునవ్వు నవ్వుతూ అన్నాడు దీపక్.

ఆ రెండు మాటలకీ హడావుడి పడిపోయింది దమయంతి. "ఇంటికి పోదాం....అందరం ఇంటికిపోయి అక్కడ అవసరమైతే హోటల్‌నించి క్యారేజీలు తెప్పించుకుందాం....పదండి" అంటూ స్టేషన్ వెలుపలికి దారి తీసింది.

* * * *

లాకప్‌లోనుంచి బయటికి వచ్చిన తర్వాత దీపక్ ఒక్కసారి కూడా తనవంక చూడకపోవడాన్ని, మాట్లాడకపోవడాన్ని బాగా గుర్తుపెట్టుకోవాలనే నిర్ణయానికొచ్చి, పడిపడిగా అంబాసిడర్ దగ్గిరికి అడుగులు వేసింది శృతిమేడమ్. కారు దగ్గిరికిపోయి డోర్ తెరవబోతుండగా, నాలుగు అంగల్లో ఆమెను సమీపించాడు దీపక్.

"థ్యాంక్స్ శృతీ....తాతగారు నా గురించి పట్టించుకోవద్దని మీ మామయ్యకు చెప్పాక కూడా, నువ్వు నా కోసం ఇక్కడిదాకా రావడం నేను జన్మలో మర్చిపోలేను. ఐ లైక్ యువర్ గట్స్...." అభిమానపూర్వకంగా చూస్తూ అన్నాడు ఆమెకు మాత్రమే వినిపించేటట్టు.

"నేను వచ్చిచేసింది ఏమీలేదు. నేను చేద్దామని అనుకున్నవన్నీ మీ దమయంతి ముందుగానే చేసేసింది....అవునూ....ఇంతకీ ఆమె ఎవరు? నీకెలా పరిచయం?" స్త్రీ సహజమైన క్యూరియాసిటీ ఆమెలో అధికం అయిపోవడంతో, వుండబట్టలేక అడిగేసింది శృతిమేడమ్.



"దమయంతి ఎవరని అడుగుతున్నావా? ఒక్క పావుగంట ఆగితే నీకే తెలిసిపోతుంది....తొందరపడకు" అంటూ ఆమెను అంబాసిడర్లో కూర్చోబెట్టి, తను కూడా కూర్చున్నాడు. స్టేషన్ దగ్గిరే నిలబెట్టిన లారీలో ఎక్కారు మిగిలినవారందరూ. దమయంతిని క్యాబిన్లో కూర్చోబెట్టుకుని, వేగంగా నడిపాడు రాంసింగ్.

పది నిముషాల తరువాత దమయంతి ఇంటిముందు వెహికల్స్‌లోనుంచి దిగారు అందరూ.

"రా తల్లీ....లోపలికిరా.... వీళ్ళందరూ ముందుగదిలో కూర్చుంటారు" అంటూ చేయి పట్టుకుని శృతిమేడమ్‌ని లోపలికి తీసుకుపోయింది దమయంతి.

బెడ్‌రూమ్‌లో గోడలకున్న ఫోటోలను చూసింది శృతిమేడమ్. ఒక్క ప్రశ్న కూడా వేయకముందే ఆమె ఎవరో అర్థమై, ఆశ్చర్యంతో బ్రూప్పడిపోయింది.

ఇంటికి వచ్చిన దమయంతి వెంటనే వంటింట్లోకి పోయి వంటపాత్రలన్నిటినీ ధనాధన్‌మని మోగిస్తూ, నిముషాల మీద వంటలు చేసింది. ఖచ్చితంగా ఒకగంటా ఇరవై నిముషాల తరువాత, చక్కటి విస్తళ్ళను పరిచి అందరికీ భోజనాలు వడ్డించింది.

ముందే ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చినట్టు, దూరం దూరంగా జరిగి. దీపక్ నరసనే శృతిమేడమ్ కూర్చునే విధంగా విస్తళ్ళను అరేంజ్ చేశాడు గండయ్య. ఆ విషయాన్ని గమనించలేదు శృతిమేడమ్. మధ్యలో ఎందుకనో తలతిప్పి వాళ్ళకేసి చూసింది

వాళ్ళ కళ్ళల్లో కనిపిస్తున్న ఏదో భావం ఒక్కసారిగా ఆమె శరీరాన్ని ఝల్లుమనేటట్లు చేసింది. విపరీతమైన సిగ్గుతో ఎర్రబడిపోయాయి బుగ్గలు.

శృతిమేడమ్ వున్నట్టుండి ఏదోలా అయిపోవడాన్ని అందరికంటే ముందుగా దయమంతి గమనించింది.

"అదేంటమ్మా.... పదార్థాలన్నింటినీ అలా పక్కకు నెట్టేస్తున్నావేమిటి? వేళ తప్పిపోవడంవల్ల ఆకలి చచ్చిపోయిందా?" ఆప్యాయంగా

అడిగింది.

దమయంతి మాటలతో తన మనస్సులోని అలజడినించి బయట పడింది శృతిమేడమ్.... "వేళ తప్పిపోవడంకాదు....ఎప్పుడో చిన్నప్పుడు మా మామయ్యతో కలిసి ఒక పెళ్ళి భోజనానికి వెళ్ళాను. అక్కడ ఇప్పుడు కూర్చున్న విధంగానే, నేలమీద విస్తళ్ళు వేసి అందరినీ కూర్చోబెట్టారు.

తిరిగి ఇన్ని సంవత్సరాల తర్వాత మీ ఇంట్లో అప్పుడు కూర్చున్న విధంగానే కూర్చోవడం....నాకు ఆరోజు సీన్ గుర్తుకువచ్చింది...." అర మూసిన కనులతో ఆరోజును గుర్తుచేసుకుంటూ చెప్పింది శృతి మేడమ్.

"నువ్వు చెప్పినట్లు ఇప్పుడు పెళ్ళి భోజనాలు చేయడంలేదు మనం" అని అనబోయి, ఆఖరి క్షణంలో నేర్పుగా ఆ మాటల్ని మింగేశాడు గండయ్య.

"మనం అందరం నోటికి వచ్చిన మాటలు మాట్లాడుకుంటున్నాం. మీ చిన్నబాబు మాత్రం నోరువిప్పడంలేదు...." వున్నట్లుండి కామెంట్ చేసింది శృతిమేడమ్.

విస్తరిలోని పదార్థాలమీద దృష్టిని కేంద్రీకరించి, వాటి రుచిని ఆస్వాదించడమే తన లక్ష్యంగా భోజనం చేస్తున్న దీపక్, ఉలిక్కిపడి ఆమెవంక చూశాడు.

* * * *

"నువ్వు భోజనం చేస్తున్నావా? నిద్రపోతున్నావా?" దీపక్‌ని అడిగింది శృతిమేడమ్.

"భోజనమే చేస్తున్నాను. భోజనంచేస్తూ నిద్రపోవడమో, నిద్రపోతూ భోజనం చేయడమో నాకు అలవాటులేదు....ఎందుకు అలా అడుగుతున్నావ్?" చిరునవ్వు పెదవులమీద ప్రత్యక్షం అవుతుండగా ప్రశ్నించాడు.

"ఇక్కడ నీ పెళ్ళి గురించి, నీకు రాబోయే భార్య గురించి పెద్ద టాపిక్ నడుస్తోంది. మీ గండయ్య నార్సింగ్ నుంచి బాణాసంచా తెప్పిస్తాడు. ఔరంగాబాద్‌నించి ఏనుగు అంబారీ రప్పిస్తాట్ట. ఏం గండయ్యా! ఔరంగాబాద్‌నించేనా?" పక్కకు చూస్తూ అడిగింది శృతిమేడమ్.



"ఔరంగాబాద్‌దాకా వెళ్ళాల్సిన అవసరం లేదమ్మా. నార్కట్‌పల్లిలోనే నాకు తెలిసిన మనిషి దగ్గిర వస్తాదులాంటి ఏనుగు ఒకటి వుంది.... దాన్ని తెప్పించి అంబారీ ఏర్పాటుచేస్తాం...." సమాధానం యిచ్చాడు వహీద్.

"అదిగో....నార్కట్‌పల్లినించి వస్తుందిట ఏనుగు" చెప్పింది శృతిమేడమ్.

"అవన్నీ ఇప్పుడెందుకన్నాడు" నిర్లిప్తంగా.

"అంబారీ కట్టిన ఏనుగుమీద నువ్వు పెళ్ళికూతురింటికి పోతావుట. ఆ మాట తలుచుకుంటే నీకు థ్రిల్లింగ్‌గా అనిపించడంలేదా?" అడిగింది శృతిమేడమ్.

"ప్రస్తుతం నాకు ఏదీ థ్రిల్లింగ్‌గా అనిపించడంలేదు. ఆ కుందారం షేర్ వెక్కిరించిన వెక్కిరింపులే చెవుల్లో గింగిర్లెత్తుతున్నాయి" తినడాన్ని ముగించినట్టు విస్తరిని మడుస్తూ అన్నాడు దీపక్.

అర్థాంతరంగా అతను విస్తరి మడవడాన్ని చూసి దెబ్బతిన్న మనిషిలా విలవిలలాడిపోయింది దమయంతి.... "మాట్లాడటం ఇష్టంలేకపోతే మౌనంగా వుండవచ్చు....నోళ్ళుమూసుకోమని అందర్నీ అదిలించవచ్చు. భోజనం పూర్తికాకుండా విస్తరిని మడిచేయడం మంచి పద్ధతికాదు" అంటూ అప్పటికప్పుడు ఇంకో ఫ్రెష్ విస్తరిని తీసుకువచ్చింది లోపలినించి.

* * * *

"మీ మాటలు నచ్చక నేను భోజనాన్ని మానలేదు..... కూర బాగుంది. పచ్చడి బాగుంది. రోజూ తినేదానికంటే రెండు ముద్దలు ఎక్కువే తిన్నాను....చాలు అనిపించింది. అంతే" ఆమెకు చేయి అడ్డంపెడుతూ సిన్సియర్‌గా చెప్పాడు దీపక్.

"ఏమిటో చిన్నబాబూ....నువ్వు కూడా మీ నాన్నగారి మాదిరిగానే పట్టిమూడీ మనిషివి అయిపోతున్నావు. ఆయన కూడా ఇలాగే వున్నట్లుండి చేస్తూ చేస్తూ వున్న పనిని మధ్యలో మానేసి ఇంకేదో మాట్లాడేవాడు...." చిన్న ముఖం చేసుకుంటూ అన్నది దమయంతి.

దీపక్ భోజనం ముగించడాన్ని చూసిన మరుక్షణం తాము కూడా

లేచిపోవడానికి రెడీ అయ్యారు వహీద్, గండయ్య, రాంసింగ్, మైసయ్యలు. శృతిమేడమ్‌కి మాత్రం ఆ్రపదేశంలో నుంచి కదలడం కష్టం లేకపోయింది.

"దీపక్ తండ్రిగారి గురించి నాకు ఏమీ తెలియదు. టాపిక్ వచ్చింది కాబట్టి పూర్తిగా చెప్పండి....నాకు కొంచెం పచ్చడి కావాలి....అమెరికా వెళ్ళిన తర్వాత పచ్చళ్ళు తినడం కుదరలేదు. ఇట్లాంటివి అక్కడ నాట్ ఎవైలబుల్...." చెప్పింది దమయంతి.

చిన్నబోయిన దమయంతి ముఖం వెంటనే వెలిగిపోయింది.

"అది నేను చేసింది కాదు. చిన్నబాబు నా ఇంటికి వచ్చాడని తెలిసి రాత్రి మా చిన్నమ్మ పంపించింది. పచ్చళ్ళు తయారుచేయడంలో తను నెంబర్ వన్....ఎవరైనా ఒకసారి రుచి చూస్తే ఇక జన్మలో ఆ రుచి మర్చిపోలేరు" అంటూ పక్కనే పెట్టి వుంచిన పచ్చడి పాత్రను తీసుకుని శృతిమేడమ్ విస్తరిలో వడ్డించింది.

"నీకు ఆకలి లేకపోతే బలవంతంగా తినాల్సిన అవసరంలేదు. తినాలని అనుకుంటున్న వాళ్ళకు కంపెనీ ఇవ్వడం కనీస మర్యాద" దీపక్ వంక ఓరగా చూస్తూ కామెంట్ చేసింది శృతిమేడమ్.

"విస్తరి ముడతపెట్టానుకాని అవతలకు వెళ్ళిపోవడంలేదు....కూర్చునే వున్నాను. నీ పచ్చడిని పూర్తిగా ఎంజాయ్ చేయవచ్చు....నాకు ఎటువంటి అభ్యంతరము లేదు" అన్నాడు దీపక్.

* * * *

అందరికంటే తనే ఆఖరని గ్రహించి గబగబ తినడాన్ని ముగించింది శృతి.

"ఈ లెవల్లో ఇంకో పదిరోజులు తిన్నానంటే మీ ఇంటి గుమ్మాన్ని పడగొట్టి కొత్త గుమ్మాల్ని ఇంకా వెడల్పుగా తయారు చేయించుకోవాలి... మూడురోజులకు సరిపడా ఈ ఒక్కపూటలో లాగించేశాను" దమయంతి అందించిన టవల్‌తో చెయ్యి తుడుచుకుంటూ చెప్పింది.

"నువ్వు నా ఇంటికి వస్తూ పోతూ వుండాలేగాని, ఒక్క గుమ్మం ఏమిటి? ముందుగోడ మొత్తాన్ని పగలగొట్టి మెష్ పెట్టించేస్తాను. ఆ విషయంలో నువ్వేలాంటి అనుమానమూ పెట్టుకోవలసిన అవసరంలేదు"



అంటూ సమాధానం ఇచ్చింది దమయంతి.

విస్తళ్ళను ఎత్తి అవతలపడేశాక హాలునంతా కడిగి, తడిపోయే దాకా గుడ్డతో తుడిచాడు గండయ్య. దూరంగా జరిపిన కుర్చీలన్నిటినీ యథాస్థానంలోకి చేర్చాడు.

"చిన్నబాబూ....నిన్నటినుంచీ మీరు తాతగారితో మాట్లాడలేదు.... ఆయన ఏం చేస్తున్నారో ఒక్కసారి ఫోన్ చేసి తెలుసుకోండి" దీపక్ కూర్చున్న కుర్చీ పక్కనే గచ్చుమీద చతికిలపడుతూ చెప్పాడు వహీద్.

రెడీగా వున్నాడు మైసయ్య. తన దగ్గిర వున్న సెల్‌ని తీసి దీపక్‌కి అందించాడు.

"నెంబర్‌ని ప్రెస్ చేయగానే, "హల్లో....ఎవరు మాట్లాడేది?" అంటూ వినవచ్చింది సురేంద్రసాబ్ కంఠం.

"తాతయ్యా....నేను దీపక్‌ని" ఉత్సాహంగా చెప్పాడు దీపక్. చటుక్కున కట్" అయిపోయింది కనెక్షన్.

నివ్వెరపోయిన దీపక్ ముఖాన్ని చూసి, తాతగారు కోపంమీద వున్నట్టున్నారు. ఒంటి రెండురోజుల్లో అది తగ్గిపోతుంది. మీరేమీ ఫికర్ చేయకండి చినబాబూ" సానుభూతిగా అన్నాడు వహీద్.

"కోపం ఎవరిమీద? అసలు కోపం ఎందుకు? మీ చినబాబు ఏం చేశాడని ఆయన అలా గింజుకోవడం?" మిగిలినవారికంటె ముందుగా తను కల్పించుకుంటూ అడిగింది శృతిమేడమ్.

"చిన్నబాబు ఏదో చేశాడని కాదమ్మా....ఇలాంటి గొడవల్లో తల దూరిస్తే లేనిపోని ప్రమాదాలు ఎదురవుతాయని భయం. చెట్టంత కొడుకుని, లక్ష్మీదేవిలాంటి కోడల్ని పోగొట్టుకున్న బాధ పెద్దబాబును ఇంకా వెంటాడుతూనే వుంది. చిన్నబాబుకు కూడా అటువంటి గతే పడుతుందని ఆయన ఆవేదన....అంతకంటే ఇంకేమీ వుండదు" అనునయంగా చెప్పాడు వహీద్.

"ఐ డోన్ట్ బిలీవ్ దట్ స్టోరీ....మన అనుమానాలకంటే, మన భయాలకంటె మన ఆత్మగౌరవం చాలా ముఖ్యం.

సంగారం జాతర్లో నాలుగో జీవాన్ని బలిఇవ్వడం మీ ఆనవాయితీ, ఆచారం....ఎప్పటినించో వస్తున్న ఆ ప్రివిలేజ్‌ని మీనుంచి దూరంచేసి

తను మధ్యలో దూరడానికి ట్రై చేశాడు ఆ కుందారం గ్రామపటేల్.

మీరు ఎదురు తిరగబట్టి సరిపోయింది. అదే అనవసరమైన గొడవలు వద్దనుకుని, అతని ఆటల్ని కంటిన్యూ కానిచ్చివుంటే ఈపాటికి ఈ ఏరియా అంతా సురేంద్రసాబ్ వట్టి పిరికివాడని ప్రచారం జరిగి వుండేది.

మీ సురేంద్రసాబ్ పరువు, మర్యాద మట్టిలో కలిసిపోయి వుండేవి. ఈ మాట మీ పెద్దబాబుగారికి తోచలేదా?" ఆవేశంగా అడిగింది ఆమె.

*　　*　　*　　*

"కోపం కొంచెం తగ్గగానే పెద్దబాబుకు తప్పకుండా ఈ విషయం అర్థమై తీరుతుంది మేడమ్....అసలు ఈపాటికి ఆయన కోపంతీరి, పాతిక సార్లు తనే చిన్నబాబుకు ఫోన్‌చేసి వుండాలి...." అన్నాడు మైసయ్య.

"ఎందుకు చేయలేదు?" అడిగింది శృతి,

"ఎందుకు చేయలేదని మీరు అంత గట్టిగా అడిగితే సమాధానం ఇవ్వడం చాలా కష్టం. ఇంట్లో సరితమ్మ రాక్షసి పీఠం వేసుకుని కూర్చుని వుంది.

ఆమె చూపు మంచిదికాదు తల్లీ....అవడానికి ఆమె సురేంద్రసాబ్ కూతురే అయినా, ఎందుకనో కొంచెం కురచబుద్ధిని పెంచుకున్నది. మా చిన్నబాబు ఏంచేసినా అది ఆమెకు తప్పుగానే కనిపిస్తుంది.

రెండో ఆలోచన లేకుండా పెద్దబాబు చెవిదగ్గిరచేరి ఒకటికి నాలుగు కలిపించి చెబుతుంది. పెద్దబాబులో వున్నటువంటి దర్పం ఆమెలోలేవు వాటి బదులుగా అతిశయం ఒక్కటే వుంది" చెప్పాడు రాంసింగ్.

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి? సరితాదేవికి చిన్నబాబంటే ఇష్టం లేదు....ఏదో ఒకవిధంగా తాతగారి దృష్టిలో ఇతన్ని చెడుగా చిత్రించాలని అనుకుంటున్నదా?" అనడిగింది.

అంతవరకూ మౌనంగా వున్న దీపక్ ఒక్కసారి తలఎత్తి చూసేసరికి చటుక్కున నోటిని అదుముకుని కామ్ అయిపోయాడు రాంసింగ్.

"పీటర్‌కి ఒకసారి రింగ్‌చేసి మాట్లాడు. అసలు అక్కడ ఏం జరుగుతోందో తెలుసుకో" ఫోన్‌ని వహీద్‌కి అందిస్తూ చెప్పాడు దీపక్. చిటికెలో



నెంబర్‌ని ప్రెస్‌చేసి ఫోన్‌ని చెవికి ఆనించుకున్నాడు వహీద్.

"హల్లో...." అంటూ పలుకరించాడు పీటర్‌ని.

"నీ యవ్వ....నిన్ను, ఆ గండయ్యగాడిని, రాంసింగ్ బద్మాష్‌ని తుక్కుకింద కొట్టిపారేస్తాను. నడిసముద్రంలో ఒంటరిగా వదిలి మీరు అక్కడ హాయిగా వున్నారా?" తెరలు తెరలుగా అందరికీ వినిపించింది పీటర్ కంఠం.

"అదేపనిగా గింజుకోమాకు. మేమేమీ ఇక్కడ హ్యాపీగా లేము... ఈ దమయంతమ్మతో కలిసి మన శృతిమేడమ్ మమ్మల్ని బైటికి తీసుకొచ్చేదాకా ఆ దరిద్రపు లాకప్‌లో ఏడుస్తూ నిలబడి వున్నాం. నీ పనే హాయి....హ్యాపీగా ఇంటి దగ్గిర కూర్చున్నావ్" ఎదురు వడ్డించాడు వహీద్.

"నాకు హ్యాపీనా! ఈ సరితమ్మ రాక్షసి ఇంట్లో వుండగా హాయి ఎక్కడినుంచి వస్తుంది వహీద్. ఇదిగో....ఫోను ఒకసారి చిన్నబాబుకు ఇవ్వు. మరియమ్మ మాట్లాడుతుందిట" అన్నాడు పీటర్.

ఫోన్‌ని వెంటనే దీపక్‌కి అందించాడు వహీద్.

"నాన్నగారూ....భోజనం చేశారా?" వెనువెంటనే వినవచ్చింది మరియమ్మ కంఠం.

ఆ కంఠాన్ని వినేసరికి చిన్నపిల్లాడు సంబరపడుతున్నట్టు దీపక్ ముఖంలో రకరకాల భావాలు ప్రత్యక్షంకావడం శృతిమేడమ్‌కి కనిపించింది.

"మేము ఇక్కడ దమయంతమ్మ ఇంట్లో వున్నాం. మంచి భోజనం పెట్టింది. హ్యాపీగా తినేశాను. మరియమ్మ నువ్వు ఎలా వున్నావ్? బి.పి. మాత్రలు వేసుకుంటున్నావా?"అని అతను చాలా ఎఫెక్షనేట్‌గా అడగడం ఆమెకు బాగానచ్చింది. పీటర్ కంఠంలా మరియమ్మ కంఠం క్లియర్‌గా అందరికీ వినిపించింది.

"నా సంగతి తర్వాత మాట్లాడుకుందాం. ముందు మీరు అర్జెంటుగా ఇంటికి వచ్చేయండి నాన్నగారూ....ఇక్కడ పరిస్థితులు ఏమీ బాగోలేవు... ఎవరెవరో ఏవేవోచెప్పి తాతగారి బుర్ర తినేస్తున్నారు. అర్థమైందా?"

"అర్థం అయింది మరియమ్మ.... మేము ఇంకా స్పేషటిలో బయలు

దేరతాం....నువ్వేమీ ఖంగారుపడకు. ఫోన్ పీటర్‌కి ఇవ్వు" అన్నాడు దీపక్.

"చెప్పండి చినబాబూ....శృతిమేడమ్ హ్యాపీయేనా! ఆ జమలయ్య గాడు మేడమ్‌ని తిన్నగా అక్కడకు తీసుకువచ్చాడా....?" అడిగాడు పీటర్.

*  *  *

అతను అలా అడిగినప్పుడు జమలయ్య గుర్తుకువచ్చాడు దీపక్‌కి. అతనితోపాటు జగజీత్ కూడా జ్ఞాపకం వచ్చాడు. "వీళ్ళిద్దరూ ఏమైపోయారు?" ఫోన్‌ని అలాగే పట్టుకుని వహీద్‌ని అడిగాడు.

"జమలయ్యని హోటల్‌కి తీసుకుపోయి భోజనం పెట్టించమని నేను జగజీత్‌ని వెంటపంపించా" అన్నాడు.

"నువ్వు చేసే పనులన్నీ ఇలాగే వుంటాయి. వాళ్ళని కూడా ఇక్కడే భోజనం చేయమని చెప్పాల్సింది. వంట చేయడం కష్టమైతే అందరమూ హోటల్‌నించే తెప్పించుకు తినేవాళ్ళం. నీ పద్ధతి నాకు నచ్చలేదు" కోపంగా అంటూ తిరిగి పీటర్‌తో మాట్లాడాడు దీపక్.

"జమలయ్య ఓ..కే....శృతిమేడమ్ ఓ.కే.... మేముకూడా ఓ.కే.నే. ఇంకాస్సేపట్లో బయలుదేరి వస్తున్నాం" అని చెప్పి "పీటరూ....తాతయ్యగారు నేను ఫోన్‌చేస్తే కనెక్షన్ కట్ చేశారు" అని కూడా అన్నాడు.

"అందుకే బాబూ....మరియమ్మ గోలచేస్తోంది. మీరు త్వరగా వచ్చేయండి" అన్నాడు పీటర్.

"త్వరగా వచ్చేయాలా? అదేం కుదరదు. మీరందరూ ఇక్కడ ఇంకో రెండురోజులు వుంటున్నారు" డిక్లేర్ చేసింది దమయంతి.

"రెండురోజులుకాదు కదా కనీసం రెండుగంటలు కూడా వుండటానికి వీలుపడదు. అవతల పరిస్థితి ఏదో పరమ ఛండాలంగా తయారై వుంటుంది. పీటర్‌తోపాటు మరియమ్మ కూడా మాట్లాడిందంటే ఇంకొక్క క్షణం కూడా ఆలస్యం చేయడానికి వీలుకాదని అర్థం" అప్పనా అన్నట్లు రాంసింగ్‌వైపు చూశాడు వహీద్.

"అలా నోరు వెళ్ళబెట్టి విచిత్రంగా చూస్తూ కూర్చుంటావేమిటి? ఫో....పోయి లారీని రెడీ చెయ్...." అని ఆర్డర్ ఇచ్చాడు వహీద్.



"ఒక్కనిముషం....ఒకే ఒక్క నిముషం ఆగండి. మీ మగవాళ్ళందరూ ఇంతే. చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని నిలబడతారు. మా కాళ్ళకింద నిప్పులు పోస్తారు...." అంటూ ఇంటి వెనక్కి వెళ్ళింది దమయంతి.

ఎవరినో పెద్దకంఠంతో పిలిచింది ఆమె.

వెంటనే వచ్చాడు ఒక కుర్రాడు. పెద్ద పెద్ద ప్యాకెట్లను రెండింటిని తీసుకువచ్చి దమయంతికి ఇచ్చాడు ఖరీదయిన ప్యాంటు, షర్టు బిట్స్ వున్నాయి ఒక ప్యాకెట్‌లో.

"రాక రాక నా ఇంటికివచ్చి నా చేతిముద్ద తిన్నావు....సంతోషంగా వుంది. నా ఇంటికి వచ్చినందుకు గుర్తుగా వీటిని నువ్వు కుట్టించుకుని వేసుకోవాలి" దీపక్ చేతిలో ఆ ప్యాకెట్‌ని పెడుతూ చెప్పింది దమయంతి.

రెండో ప్యాకెట్‌ని శృతిమేడమ్ చేతిలో పెట్టింది ఆమె.

"ఇప్పుడు ఇవన్నీ ఎందుకు?" అని కామెంట్ చేయబోతూ, ఆమె కుంకుమ భరిణెను తీసుకువచ్చి నుదుట బొట్టుపెట్టేసరికి మాటల్ని మింగేసింది శృతి.

"మా చిన్నబాబుతో కలిసివచ్చావు....నాకు చాలా ఆనందంగా వుంది. నీ పెళ్ళికి నన్ను పిలిస్తే ఇంకా సంతోషంగా వుంటుంది" నర్మగర్భంగా అంటూ ఆమె తల నిమిరింది.

"ముందు మీరు మీ చిన్నబాబు పెళ్ళికి రండి. తర్వాత నా పెళ్ళికి" తనుకూడా అన్యాపదేశంగా మాట్లాడి, రోడ్డుమీదికి వచ్చేసింది శృతి మేడమ్.

పాతిక అడుగుల దూరంలో వున్న ఒక ఖాళీస్థలంలో లారీని రౌండ్ కొట్టించి, ఇంటిముందుకు తీసుకువచ్చాడు రాంసింగ్. "ఎక్కండి చిన్నబాబూ! మేడమ్‌తోపాటు క్యాబిన్‌లో కూర్చోండి" అని దీపక్‌ని లారీ దగ్గిరికి లీడ్‌చేశాడు వహీద్.

లారీలో వారు కూర్చోకముందే మోతలు చేసుకుంటూ అక్కడికి వచ్చేసింది జమలయ్య అంబాసిడర్.

"మీకు అసలు బుద్ధిలేదు. నిలువుగా కోసి వంటవండితే ఈ ఊరి జనమంతా తినడానికి సరిపోయే బాడీలు మీవి.... బుర్రలు మాత్రం చిన్నవి.

బంగారంలాంటి బండిని దగ్గిరపెట్టుకుని ఆ డొక్కు లారీలో చిన్నబాబు కూర్చోపెడుతున్నారా?" అంటూ బ్యాక్ డోర్‌ని తెర్చి పట్టుకున్నాడు జమలయ్య.

శృతిమేడమ్‌ని ముందుగా కూర్చోపెట్టి తర్వాత తను కూర్చున్నాడు దీపక్.

ముందు సీట్లో సర్దుకున్నాడు వహీద్. "వెనకాలే రండి.... మనం ఈ పొలిమేరలు దాటేంతవరకూ కొంచెం జాగ్రత్తగా వుండాలి" అంటూ లారీ ఎక్కుతున్న వారందరికీ హెచ్చరికలు చేశాడు.

వాకిట్లో నిలబడిన దమయంతికి చెయ్యివూపి, జమలయ్య భుజం తట్టాడు దీపక్.

రెండోసారి చెప్పించుకోకుండా అంబాసిడర్‌ని ముందుకు దూకించాడు జమలయ్య.

సిద్ధిపేట దాటి పన్నెండు కిలోమీటర్ల దూరం పోయేటంతవరకూ ఎలర్ట్‌గానే వున్నాడు వహీద్. ఆ తర్వాత సీటువెనక్కి వాలి గాఢమైన నిద్రలో మునిగిపోయాడు.

* * * *

"చిన్నబాబూ! చిన్నబాబూ!" అంటూ జమలయ్య చిన్నగా పిలవడంతో ఉలిక్కిపడి కళ్ళుతెరిచాడు దీపక్.

"సిటీలోకి వచ్చేశాం మనం.... లాయర్‌సాబ్ ఇంటి దగ్గిరికి పోతున్నాం. మీరు కాస్తంత మెలుకువగా కూర్చోవడం బాగుంటుంది" అని చెప్పాడు జమలయ్య.

తనుకూడా ఒక చిన్న కునుకుతీసి, అంతకు రెండు నిముషాలముందే లేచింది శృతిమేడమ్.

హ్యాండ్‌బ్యాగ్‌లోనుంచి ఒక సెంటెడ్ హ్యాంకీని తీసి కళ్ళను వత్తుకుంటోంది.

"వచ్చేశాం తల్లీ! మీ ఇంటి దగ్గిరికి వచ్చేశాం" అంబాసిడర్‌ని అతి వయ్యారంగా లాయర్‌సాబ్ ఇంటి గేటుముందుకు పోనిస్తూ ఆమెకు చెప్పాడు జమలయ్య.

డోర్ తెరుచుకుని కిందికి దిగాడు దీపక్.



"థ్యాంక్స్ ఎలాట్ శృతీ! మాకోసం నువ్వు పనికట్టుకుని అంత దూరం రావడాన్ని నేను ఎప్పుడూ మర్చిపోలేను. ఉసూరుమంటూ ఇంటికి రావాల్సినవాళ్ళం. నీ మూలకంగా హ్యాపీగా వచ్చాం" చెప్పాడు.

"ఇటీజ్ నథింగ్. లోపలికి రా. మా అత్తయ్య టీ బ్రహ్మాండంగా పెడుతుంది. తాగిన తర్వాత వెళ్ళవచ్చు" అన్నది శృతిమేడమ్.

"ఇప్పుడు కాదులే శృతీ! ముందు అర్జెంటుగా ఇంటికి పోవాలి. ఈసారి ఇంకెప్పుడయినా వచ్చినప్పుడు తాగుతాను" అంటూ ఆమెకు బై చెప్పి వడివడిగా కారు దగ్గిరికి వచ్చాడు దీపక్.

మర్యాదకోసం గేటుదగ్గిరే ఆగిపోయింది శృతిమేడమ్.

దీపక్ కారు ఎక్కబోతుండగా—

"అడుగో....వాడు ఇక్కడే వున్నాడు" అంటూ అతి వేగంగా వచ్చిన ఒక మోటార్‌బైక్ మీదినించి దిగాడు అతని ఫ్రెండ్స్‌లో ఒకతను.

"అరేయ్ కార్తీక్? ఏంటీ ఇలా? ఇంత సడెన్‌గా?" కారెక్కే ఆలోచన విరమించుకుని అతన్ని పలకరించాడు దీపక్ ఆశ్చర్యంగా.

"ఇంత సడెన్‌గా అని అడిగితే ఏం చెప్పను బాబాయ్? పరిస్థితి అలా తయారయింది. నిన్న సాయంత్రంనించి నిన్ను కలుసుకోవడానికి ట్రై చేస్తున్నాం.

ఇంటికి ఫోన్‌చేస్తే ఆవిడ ఎవరో సరితాదేవిట.... నోటికి వచ్చినట్టు తిట్టిపోస్తోంది. ఏం చేయాలో అర్థంకాక మాకు మెంటల్ వచ్చేస్తోంది" అతని చేతిని అందుకుంటూ ఆనందంగా చెప్పాడా ఫ్రెండ్.

"మెంటల్ రావడం ఏమిటిరా? అసలు ఏం జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"నిన్న ఉదయం మన దినేష్‌గాడి దగ్గిరికి పరిగెత్తుకుంటూ వచ్చిందిట నషీలీ. రేపు తనకి పెళ్ళిచూపులు ఏర్పాటు చేయబడ్డాయిట. ఇప్పటికిప్పుడు తనని ఎక్కడికైనా తీసుకుపోయి పెళ్ళిచేసుకోమంటోందట. లేకపోతే సిటీబస్సుకింద పడి చచ్చిపోతానని చెప్పిందిట.

ఆ పిల్ల లబోదిబో....అదిచూసి మనవాడు లబోదిబో.... వాళ్ళిద్దర్నీ చూసి మేము లబోదిబో....ఏం చేయమంటావో నువ్వే చెప్పు" అసలు విష

యాన్ని సూటిగా చిన్న చిన్న మాటలతో చెప్పి చేతులు దులుపుకున్నాడు ఆ ఫ్రెండ్.

"మనం ఒకసారి దినేష్‌వాళ్ళ నాన్నగారితో మాట్లాడిన తర్వాత ఏం చేయాలో డిసైడ్ చేసుకుందాం" అంటూ జమలయ్యవైపు చూశాడు దీపక్.

"షెడ్లో నాకు పనేమీ లేదు చిన్నబాబూ! మీకు అవసరం వున్నంత వరకూ నేను మీతోనే వుండగలను. నో ప్రాబ్లమ్" నిరభ్యంతరంగా చెప్పాడు అతను.

చకచకా ఆలోచించి మిగిలినవారందరికీ ఏం చేయాలో ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చేశాడు దీపక్. "మీరందరూ ఇంటికి వెళ్ళిపొండి.... తాతగారు అడిగితే నా ఫ్రెండ్స్ దగ్గిరికి వెళ్ళానని చెప్పండి" అని అన్నాడు.

"చిన్నబాబూ! ఒక్కసారి ఇంటికివచ్చి తాతగారికి కనపడి తర్వాత వెళ్ళవచ్చు. ముందు మీరు మాతోపాటు ఇంటికి వచ్చేయండి" లారీలోనుంచి దిగుతూ దీపక్‌కి సలహా ఇచ్చాడు గండయ్య.

నుదురు రుద్దుకుంటూ ఆలోచనలో పడ్డాడు దీపక్.

"అరేయ్ బాబాయ్.... నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి. సాయంత్రం ఆరుగంటల ఫ్లయిట్‌కి దినేష్‌వాళ్ళ డాడీ ఢిల్లీ పోతున్నారు. తిరిగి రావడానికి దాదాపు నాలుగైదురోజులు పడుతుందిట. ఆయనతో మాట్లాడాలంటే ఆ పని వెంటనే జరిగిపోవాలి" చిన్న కంఠంతో అతనికి చెప్పాడు అతని ఫ్రెండ్.

ఆ మాటల్ని వినేసరికి ఎండ్ అయిపోయాయి దీపక్ ఆలోచనలు. "ఆరుగంటల ఫ్లయిట్‌కి వెళుతున్నాడంటే మనం వెంటనే వెళ్ళి ఆయనతో మాట్లాడాలి. ఆలస్యం చేస్తే ఆయన ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళిపోతాడు" అంటూ రాంసింగ్‌కి సైగచేశాడు.

"నేను తర్వాత వస్తాను. మీరు వెళ్ళిపోండి. జగజీత్‌ని మార్కెట్ దగ్గిర వదిలేయండి" అంటూ అంబాసిడర్ దగ్గిరికి జరిగాడు. గేటుదగ్గిర నిలబడి ఆ హైడ్రామానంతా గమనిస్తూనే వుంది శృతిమేడమ్.

* * * *

"వాటీజ్ ది ప్రాబ్లమ్.... మీ మాటలు ఒక్కటికూడా నాకు అర్థం కాలేదు. నా సహాయం ఏమైనా కావాల్సి వుంటుందా?" ముందుకు వస్తూ మృదు మధురంగా అడిగింది.



నోరు తెరుచుకుని ఆమెవంక అలాగే చూస్తూ నిలబడిపోయిన తన ఫ్రెండ్‌ని ఆమెకు పరిచయం చేశాడు దీపక్.

"శృతీ....దీసీజ్ మై ఫ్రెండ్...." అంటూ ఆమెను కూడా అతనికి ఇంట్రడ్యూస్ చేశాడు.

"నీ ఫ్రెండ్‌ని పరిచయం చేశావ్. ఓ.కె....బట్ వాట్ ఎబౌట్ ది ప్రాబ్లమ్?" నవ్వుతూ అడిగింది.

"అది ఇక్కడ నిలబడి చెప్పడానికి టైమ్‌లేదు. ఇఫ్ యూ వాన్ట్ టు కమ్ విత్ అజ్....యూ బెటర్ సిట్ ఇన్ ది కార్" అంటూ డోర్‌ని తెరిచి పట్టుకున్నాడు దీపక్.

తను ఏం చేస్తున్నదో తనకే తెలియనంత అమోమయంగా చూస్తూ చటుక్కున కారెక్కింది శృతిమేడమ్.

"నువ్వు బైక్‌మీద వచ్చెయ్. దినేష్‌గాడి ఇంటికి రా...." అంటూ ఫ్రెండ్‌కి చెప్పి జమలయ్యకు సైగచేశాడు దీపక్.

రంయ్‌మంటూ కదిలింది అంబాసిడర్.

సరిగ్గా ఇరవైనిముషాల తర్వాత పెద్ద బంగ్లాముందు ఆగింది. దారి చూపుతూ ముందుగా వచ్చిన ఫ్రెండ్ మాత్రం, దూరంగా వెళ్ళి తన బైక్‌ని ఆపాడు.

కారుదిగి అటూ ఇటూ చూడడం, ఆలోచించుకోవడం, మాటల కోసం తడుముకోవడం మొదలైన టైమ్ కన్జూమింగ్ పనులేవీ చేయలేదు దీపక్. శృతిమేడమ్ తన వెనుక వస్తుండగా సూటిగా లోపలికి వెళ్ళిపోయాడు.

ఢిల్లీ ప్రయాణానికి లాస్ట్‌మినిట్ అరేంజిమెంట్స్ ఏవో చూసుకుంటూ వున్నాడు కాబోలు దినేష్ ఫాదర్, బిక్కమొహంతో ఒకపక్కగా కూర్చునివున్నాడు దినేష్.

సడెన్‌గా ప్రత్యక్షం అయిన దీపక్‌ని చూసేసరికి అతనికి పోతున్న ప్రాణం లేచివచ్చినట్లు అయింది.

"మీ పెళ్ళికి నషీలీ తల్లిదండ్రులు నో చెప్పినట్లేనా? అర్ యూ

మ్యార్?" అతన్ని చూడగానే అతి రహస్యంగా అడిగాడు దీపక్.

"మ్యారేరా....గొంతుపిసికి చంపేస్తామని అన్నార్ర....ఇంట్లోనించి కదిలితే కాళ్ళు విరిచేస్తామని కూడా బెదిరించార్ర...."క్షీణస్వరంతో అన్నాడు దినేష్.

"ఓ....కే....గేటు దగ్గిర కార్లో మా వహీద్ వున్నాడు. అతన్ని వెంటబెట్టుకుని నషీలీ ఇంటికి వెళ్ళి నీ వెంట తీసుకువచ్చేయ్" చెప్పాడు దీపక్.

"అరేయ్....ఆస్తిపాస్తులు లేవన్నమాటేగాని వాళ్ళ బంధువులు చాలా పవర్‌ఫుల్....మంచి పట్టుదలమీద వున్నార్ర...." భయం భయంగా అన్నాడు దినేష్.

"ఎవరు ఎలాంటి పట్టుదలమీద వున్నా డోన్ట్‌కేర్. ఆ అమ్మాయి నీతో రావడానికి రెడీ అని అంటే, నీతోపాటు తీసుకువచ్చే బాధ్యత మా వహీద్‌ది....నువ్వు ఖంగారుపడకుండా అతన్ని నీవెంట తీసుకుపో" అని చెప్పాడు దీపక్.

* * * *

రెండోమాట మాట్లాడకుండా బయటికి పరుగుతీశాడు దినేష్. అతను అలా అవతలికి పోవడం, అతన్ని పేరుపెట్టి పిలుస్తూ అతని డాడీ మేడమీదినించి కిందికి రావడం ఒకేసారి జరిగింది.

"గుడ్ ఈవినింగ్ అంకుల్....నేను సురేంద్రప్రసాద్ మనవడిని... నా పేరు దీపక్" నమస్కారంచేస్తూ తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"ఓ....మా వెధవకి క్లాస్‌మేట్‌వి కదూ? అవునూ....మావాడి లవ్ ఎఫైర్‌ని ప్రోత్సహించినవాళ్ళల్లో నువ్వూ వున్నావు కదూ?" కనుబొమలు చిట్లించి చూస్తూ కోపంగా అడిగాడు ఆ పెద్దమనిషి.

"ప్రోత్సహించాను అంకుల్....దినేష్ ఆ నషీలీని చాలా ఇదిగా ప్రేమించాడు. ఇద్దరూ కలిసి ఒక అండర్‌స్టాండింగ్‌కి వచ్చారు....ఇప్పుడు వాళ్ళని విడదీయడం పద్ధతిగా వుండదు. ప్లీజ్ అంకుల్....మీరు ఈ పెళ్ళికి ఒప్పుకుంటే వాడు చాలా హ్యాపీగా ఫీల్ అవుతాడు" అనునయంగా అన్నాడు దీపక్.



"హ్యాపీ గీపీ జాన్తానై....వాడు ఆ పిల్లను చేసుకుంటే ఈ ఇంట్లో వుండటానికి వీల్లేదు. నా కంఠంలో ప్రాణం వుండగా నేను ఒప్పుకోను. శుభ్రంగా చదువుకోమని మిమ్మల్ని కాలేజీకి పంపిస్తే, అక్కడ మీరు చేసేది ఈ పనులా?

మీకు బుద్ధిలేదు. చింతబరికెలు తెప్పించి చావబాదితేగానీ మీకు బుద్ధి రాదు" అంటూ దీపక్ వెనుక నిలబడి వున్న శృతిమేడమ్‌ని చూశాడు ఆయన.

"ఈ పిల్ల ఎవరు? నువ్వు కూడా మావాడిలా అవ్వాడావా?" కనుబొమలు ముడివేసి చూస్తూ అడిగాడు.

సిగ్గుతో కమిలిపోయింది శృతిమేడమ్ ముఖం.

ఆమె నోటినుంచి ఎలాంటి మాటా బయటికి రాకముందే నోరు విప్పాడు దీపక్.

"ఈమెను నేను లవ్వాడలేదు....లాయర్ దామోదర్‌గారి మేనకోడలు....పేరు శృతి....అమెరికానుంచి వచ్చింది" అంటూ పరిచయం చేశాడు.

"నువ్వు చెప్పమ్మా....ఇదే మీ అమెరికాలో అయితే ఇపుడు మావాడు చేస్తున్న పనిని గురించి...." చాలా స్పీడ్‌గా మాటలు కంటిన్యూ చేయబోయి సడెన్‌గా ఏదో గుర్తుకు వచ్చినట్లు మాటల్ని మింగేశాడు దినేష్ ఫాదర్.

"అవునంకుల్.... అమెరికాలో ఇటువంటి సిచ్యుయేషన్ ఎదురయితే పిల్ల తల్లిదండ్రులు, పిల్లాడి తల్లిదండ్రులు ఎదురుచెప్పడానికి వీలులేదు.

ఎవరిని చేసుకోవాలో, ఎప్పుడు చేసుకోవాలో నిర్ణయించుకునే హక్కు అక్కడి పిల్లలకు వుంటుంది. పెద్దవాళ్ళ అబ్జెక్షన్స్‌ని ఎవరూ లెక్కచెయ్యరు" కూల్‌గా చెప్పింది శృతిమేడమ్.

"ఓ....ఈ మాటలు నాకు చెప్పడానికి వచ్చావా నువ్వు? బాగుందమ్మా....చాలా బాగుంది. రేపు నువ్వు కూడా అంతేనా?" ఎర్రబడిన ముఖంతో అన్నాడు దినేష్ ఫాదర్.

"అంతే అంకుల్! నాకు ఇష్టంలేని మనిషితో నా వివాహం జర

గదు. నేను ఇష్టపడిన మనిషితోనే నా పెళ్ళి జరగడానికి ఎవరు అభ్యంతర పడినా ఐడోన్ట్ టాలరేట్....” స్థిరమైన కంఠంతో చెప్పింది శృతిమేడమ్.

“ఐ టూ డోన్ట్ టాలరేట్ దిస్ మేటర్....మావాడు ఆ పిల్లని చేసుకోవడానికి ఒప్పుకోను. నా మాటని కాదని వాడు చేసుకుంటే, ఇప్పటి కిప్పుడు మెడ పట్టుకుని బయటికి గెంటేస్తాను. నా ఆస్తిలో చిల్లిగవ్వకూడా యివ్వను. చదువు మానుకుని వాడు వీధులవెంట అడుక్కుతినాల్సిందే” చాలా కోపంగా డిక్లేర్ చేశాడు దినేష్ ఫాదర్.

“వయసులో పెద్దవారు గనుక, మీరు చెపుతున్న మాటల్ని వేరే వినాల్సి వస్తోంది అంకుల్. మీరు బయటికి గెంటేసినంతమాత్రాన దినేష్ జీవితం నాశనమైపోదు. అతని చదువు పూర్తయ్యేటందుకు అవసరమైన డబ్బు నేను యిస్తాను. అతను నషీలీని పెళ్ళిచేసుకుని కాపురం పెట్టడానికి రామంతపూర్‌లో వున్న మా అపార్ట్‌మెంట్స్‌లో ఒక అపార్ట్‌మెంట్ ఇస్తాను.

దినేష్ చాలా తెలివైనవాడు. చదువు పూర్తి అయిన మరుక్షణం వాడికి ఏదో ఒక ఉద్యోగం వచ్చేస్తుంది. వాడు హ్యాపీగా వుంటాడు.

అనవసరమైన పట్టుదలకిపోయి మీరు అన్‌హ్యాపీగా మారకండి....వాడి మనస్సును బట్టి ఆలోచించండి....ప్లీజ్ అంకుల్....ఈ పెళ్ళికి ఒప్పుకోండి....” రెండు అడుగులు ముందుకువేసి చాలా వినయంగా అర్థించాడు దీపక్.

ఏదో అనడానికి నోరు తెరిచాడు దినేష్ ఫాదర్....అంతలోనే పెద్దగా వినిపించింది ఆయన మేడమీది గదిలో వదిలివచ్చిన సెల్‌ఫోన్ మోత. గిరుక్కున వెనుతిరిగి మేడమీదికి వెళ్ళిపోయాడు ఆయన.

“ఆయన ఒప్పుకోడు. హి ఈజ్ ఎడమెంట్....” చిన్న కంఠంతో దీపక్‌కి చెప్పింది శృతిమేడమ్.

“ఎడమెంట్‌గా కనిపిస్తున్నాడుగాని, దినేష్‌గాడంటే ఆయనకి ఎంతో ప్రాణం....మనం ఇంకో పావుగంటపాటు మస్కాకొట్టాలి....ఆయన తప్పకుండా ఒప్పుకుంటాడు” చిరునవ్వు చిందిస్తూ చెప్పాడు దీపక్.

“నీకానమ్మకం వుందేమో....నాకుమాత్రం లేదు” నిష్కర్షగా తన



అభిప్రాయాన్ని వెల్లడించింది ఆమె.

పదినిముషాలు....పావుగంట....అరగంట గడిచిన తర్వాత కూడా పైనించి కిందికి రాలేదు దినేష్ ఫాదర్. ఫోన్‌లో మాట్లాడటాన్ని ముగించ లేదు.

మెయిన్‌గేటు దగ్గిర కారు ఆగిన శబ్దం వినిపించడంతో అటుకేసి చూసిన శృతిమేడమ్‌కి దినేష్ కనిపించాడు. అతని వెనకాలే వస్తున్న ఒక పుత్తడిబొమ్మ కూడా కనిపించింది.

“మైగాడ్....నషీలీ అంటే ఆ పిల్లేనా?” తన కనుల్ని తనే నమ్మలేనట్లు చూస్తూ దీపక్‌ని అడిగింది.

“శృతీ! నీకు కళ్ళు చెదిరిపోయాయి కదూ? నమ్మబుద్ధి కావడం లేదుకదూ?” నవ్వుతూ అడిగాడు దీపక్.

లోపలికి వచ్చాడు దినేష్.

“మీ వహీద్‌ని వెంటతీసుకుపోకుండా వున్నట్లయితే ఇవాళ నా పని ఖతమ్ అయిపోయి వుండేది. కర్రలు, కత్తులతో పాతికమంది నన్ను కొట్టడానికి వచ్చారు. వహీద్‌ని చూసేసరికి అందరూ ఒకేసారి కామ్ అయిపోయారు” లోపలికి వస్తూనే దీపక్ చేయిపట్టుకుని సంతోషంగా చెప్పాడు.

“వచ్చేశాను భయ్యా....ఇక ఇంటికి తిరిగివెళ్ళడం జరగదు. దినేష్ గనుక నన్ను పెళ్ళిచేసుకోకపోతే, ఇక చచ్చిపోవడం ఒక్కటే మార్గం” తడికళ్ళతో చెప్పింది వెనుకగా వచ్చిన పుత్తడిబొమ్మ నషీలీ.

“శృతీ....ఈమే నషీలీ” అంటూ పరిచయం చేశాడు దీపక్.

బేలగా చూస్తున్న ఆ బంగారుబొమ్మను ఆప్యాయంగా దగ్గిరకి తీసుకుంది శృతి. అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చినట్టు తల ఊపి-

“ఇంత అందమైన కోడలు ఇంట్లోకి వస్తుంటే కాదు కూడదని అనడం దినేష్ ఫాదర్ చేస్తున్న పెద్ద తప్పు.

ఇండియా అంతా గాలించినా ఆయనకు ఇటువంటి కోడలు దొరకదు. ఆయనకు ఇష్టంలేకపోతే నేను ఒకపని చేస్తాను. వీళ్ళిద్దరికీ వీసా, పాస్‌పోర్టులు సిద్ధంచేయించు. నాతోపాటు అమెరికా తీసుకుపోయి ఏదో ఒక

జాబ్‌లో జాయిన్ చేయిస్తాను" అంటూ డిక్లేర్ చేసింది.

"వీసాలు, పాస్‌పోర్టులు అనసరంలేదు శృతీ....ఇంతవరకూ నషీ దినేష్ ఫాదర్ చూడలేదు....చూస్తే క్షణాలమీద మారిపోతుంది మనస్సు" నవ్వుతూనే చెప్పాడు దీపక్. అతను ఆ మాటల్ని ఫినిష్ చేసిన మరు క్షణంలో మేడమీదినించి కిందికి వచ్చాడు దినేష్ ఫాదర్.

తన కొడుకు పక్కనే నిలబడి వున్న నషీలీని చూసేసరికి, శృతి మేడమ్‌కంటే వందరెట్లు ఎక్కువగా ఆశ్చర్యపోయాడు.

"నషీలీ అంటే ఈ పిల్లే అంకుల్....మీవాడు ప్రేమించిన ఈమెనే...." అంటూ పరిచయం చేశాడు దీపక్.

పరిచయం చేయడంతో ఆగలేదతను. చేతిని వెనక్కి పోనిచ్చి నషీలీ చేతిని మృదువుగా తట్టాడు. అతని సైగ అర్థంఅయింది నషీలీకి గబుక్కున ముందుకు వచ్చి, ఆయన పాదాలకు నమస్కారం చేసింది.

"మీ దినేష్ మనస్ఫూర్తిగా తనని ప్రేమిస్తున్నాడు అంకుల్. తను కూడా తన తల్లిదండ్రుల్ని ఎదిరించి ఇంట్లోనుంచి వచ్చేసింది. పెద్దవాళ్ళు మీరు. పెద్దమనసుతో ఆలోచించి ఎస్ చెప్పండి" అంటూ ఇంకోసారి అర్థించిన దీపక్‌వంక చాలా ప్రసన్నంగా చూశాడు ఆయన.

"అందమైన కోడల్ని తెచ్చుకోవాలని నేను అనుకున్నాను....ఈమెకంటె అందమైన పిల్లను వెయ్యి జన్మలు ఎత్తినా తీసుకురాలేను....వెనకా ముందు చూసుకోకుండా, వివరాలు తెలుసుకోకుండా తొందరపడ్డాను... మీరందరూ కూర్చోండి....ఇప్పుడే వస్తాను" అంటూ మళ్ళీ మేడమీదికి బయలుదేరబోయాడు.

"ఎక్కడికి అంకుల్?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"నా ఢిల్లీప్రయాణం వాయిదా వేసుకోవాలి....ఈ పిల్లకు సంబంధించిన పెద్దవాళ్ళకు ఇష్టంలేదని చెబుతున్నారు గదా....ఆలస్యం చేయకుండా ఈరోజు రాత్రికే పెళ్ళి జరిపించేద్దాం...." అంటూ కొడుకువైపు తిరిగి "ఫోన్‌చేసి అమ్మను త్వరగా రమ్మని చెప్పు. తను ఎవరో ఫ్రెండ్‌కి ఒంట్లో బాగోలేదంటే చూడటానికెళ్ళింది. త్వరగా రమ్మని చెప్పు" అంటూ చాలా వేగంగా పైకి వెళ్ళిపోయాడాయన.

శృతిమేడమ్‌కి ఒక సోఫాని చూపించి, తను ఇంకో సోఫాలో కూలబడ్డాడు.



పదే పది నిముషాల్లో కిందికి వచ్చేశాడు దినేష్‌ఫాదర్. సోఫాల పక్కనే వున్న ల్యాండ్ ఫోన్‌ని అందుకుని ఎవరెవరికో ఫోన్లు చేయడం మొదలుపెట్టాడు.

దినేష్‌తోపాటు లోపలికిపోయి అందరికీ వాటర్‌గ్లాసెస్, అప్పటికప్పుడు తను కాచిన టీ తీసుకువచ్చి ఇచ్చింది నషీలీ.

"బాగుంది టీ....చాలా బాగుంది...." అని మెచ్చుకుంటూ టీ తాగుతున్న ఫాదర్‌వంక ఆనందంగా చూస్తున్న దినేష్‌కి సైగచేసి, సోఫాలోనుంచి లేచాడు దీపక్.

"పెళ్ళి ఎక్కడో డిసైడయ్యాక ఫోన్ చెయ్యి. నేను ఇంతవరకూ ఇంటికి పోలేదు. ఒకసారి వెళ్ళి డ్రెస్ మార్చుకుని వస్తాను" అంటూ శృతివైపు చూశాడు.

"ఒక్క నిముషం ఆగు...." అంటూ ఫోన్ పెట్టేసి, ఖాళీ టీ కప్పును టీపాయ్‌మీద పెట్టి, "మరి మీ ఇద్దరి పెళ్ళి ఎప్పుడు? మీరు కూడా లవ్‌బర్డ్సేనా?" అని అతన్ని, శృతిని అడిగాడు దినేష్ ఫాదర్.

దినేష్ ఫాదర్ మాటల్ని విని శృతి మళ్ళీ సిగ్గుపడటం మొదలుపెట్టకముందే, "అటువంటిదేమీలేదు అంకుల్....షి ఈజ్ జస్ట్ మై ఫ్రెండ్ ఓన్లీ....ఇప్పుడప్పుడే పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం నాకులేదు...." అంటూ గబగబా బయటికి దారితీశాడు దీపక్.

అంబాసిడర్ డోర్‌ని తెరిచిపట్టుకుని రెడీగా వున్నాడు జమలయ్య.

"చిన్నబాబూ....పీటర్ ఇప్పుడే ఫోన్ చేశాడు. మీరు అర్జెంటుగా ఇంటికి వెళ్ళిపోవాలి....అక్కడ ఏదో గొడవ చాలా సీరియస్‌గా మొదలైందిట...."అంటూ రిపోర్ట్ చేశాడు.

శృతిని లోపల కూర్చోబెట్టి తను కూడా ఎంటర్ అవుతూ వహీద్ వంక చూశాడు దీపక్.

"అర్థంకాలేదు చిన్నబాబూ....నేను చిన్న పనివుండి అవతలకి పోయినప్పుడు వచ్చింది ఫోన్....ఎలాగూ ఇంటికే పోతున్నాం కాబట్టి ఆ విషయాన్ని గురించి నేను గట్టిగా ఆలోచించలేదు" చెప్పాడు వహీద్.

"నన్ను మెయిన్‌రోడ్డుమీద దింపితే ఆటోలో వెళ్ళిపోతాను....

ఇంటిదాకా తీసుకుపోతే టైమ్‌వేస్ట్...." అంటూ దీపక్ త్వరగా ఇంటి పోవడానికి మార్గాన్ని చూపించింది శృతి.

"నిన్ను ఇంటిదగ్గిర దిగబెడితే ఇప్పుడు వచ్చే నష్టం ఏమీలేదు.... యూ డోన్ట్‌వర్రీ...." అంటూ కారును కదిలించమని జమలయ్యకు సైగ చేశాడు దీపక్.

పదిక్షణాలు ఆగి మళ్ళీ సంభాషణ మొదలుపెట్టాలని అనుకుందిగాని వేగంగా వస్తున్న ఆటో ఒకటి అంబాసిడర్‌కి ఎదురుగా వచ్చి, సడన్ బ్రేకుతో ఆగిపోయేసరికి, ఆమె అటెంక్షన్ అటుకేసి డైవర్ట్ అయిపోయింది.

"అయ్యబాబోయ్....గండయ్యగాడు...చిన్నబాబూ....మీ గండయ్యగాడు" అంటూ దీపక్‌కి చెప్పాడు జమలయ్య.

ఆటోలోనుంచి కిందికి దిగి, అర్జెంటుగా అంబాసిడర్ దగ్గిరికి వచ్చేశాడు గండయ్య.

"చిన్నబాబూ....అర్జెంట్.... అవతల కొంపలు అంటుకుపోతున్నాయి....వన్‌టౌన్‌నుంచి ఎవర్నో పిల్లను తీసుకువచ్చేశారంట కదా.... ఆ పిల్ల బంధువులందరూ తాతయ్యగారి దగ్గిరికి వచ్చిగోలగోలచేస్తున్నారు. తాతయ్యగారు యమ సీరియస్...." వస్తూనే రిపోర్ట్ చేశాడు.

ఝల్లుమంది దీపక్ ఒళ్ళు.

"వాళ్ళే అయివుంటారు చిన్నబాబూ....ఆ నషీలీ బంధువులే అయివుంటారు. తాతగారిని గురించి బాగా తెలిసిన బద్మాష్‌లు ఇద్దరు ముగ్గురున్నారు వాళ్ళల్లో...." కామ్‌గా చెప్పాడు ముందు సీట్లో కూర్చునివున్న వహీద్.

అనవసరమైన ఆలోచనలతో టైమ్‌ని వేస్ట్ చేయలేదు దీపక్. "నువ్వు మేడమ్‌ని ఇంటిదగ్గిర దించి, మా గండయ్యకి కారును అప్పగించు....నేను, వహీద్ ఆటోలో వెళ్ళిపోతాం...." అంటూ జమలయ్యకి చెప్పాడు.

"అయామ్ సారీ శృతీ....నిన్ను దారిమధ్యలో వదిలేసి వెళ్ళిపోతున్నందుకు ఏమీ అనుకోకు. అక్కడ ఏదో గొడవ. వెరీ సీరియస్ అయివుంటుంది. సీరియస్ కాకపోతే గండయ్య నాకోసం ఇలా ఆటోలో రాడు" అని శృతికి చెప్పి, అంబాసిడర్లోనుంచి ఆటోలోకి మారాడు.



'నేను కూడా రావచ్చా?' అని అడగబోయి ఆ మాటల్ని తనలో తను అతి బలవంతంగా అదిమేసుకుంది శృతిమేడమ్. "ఏంటిది? నిన్నా మొన్నటివరకూ ఇతను ఎవరో కూడా నాకు తెలియదు. పరిచయం అయి రెండురోజులు కూడా కాలేదు. ఇతనితోపాటే చక్కర్లు కొట్టాలని, ఇతను ఎక్కడికి పోయినా, నేనూ ఫాలో అవ్వాలని ఎందుకు అన్పిస్తోంది? అసలు నాకేమైంది?" తనను తాను ప్రశ్నించుకుంటూ అంబాసిడర్లో నేవుండిపోయింది.

కారుకు అడ్డంగా ఆగిపోయిన ఆటో గిరుక్కున టర్న్ కొట్టి వచ్చిన దారినే వేగంగా వెనక్కి వెళ్ళిపోయింది.

ఒంటరిగా మిగిలిపోయిన శృతిమేడమ్‌ని పావుగంట తర్వాత వాళ్ళ ఇంటిదగ్గిర డ్రాప్‌చేశాడు జమలయ్య.

# 13

"నువ్వు ఒట్టి ఇర్రెస్పాన్సిబుల్ రాస్కెల్‌వి....నీకు బాధ్యతలేదు. మర్యాదలేదు. పెద్దవాళ్ళు చెప్పిన మాటలమీద గౌరవం లేదు...." ఎర్రబడిన ముఖంతో చాలా గట్టిగా అన్నాడు సురేంద్రసాబ్.

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు తాతగారూ....మీ మాటని నేను ఎప్పుడు కాదని అన్నాను?" లోగొంతుకతో అడిగాడు దీపక్.

"వేలెడంత కూడా లేవు....తాతగారి మాటలకు ఎదురుచెబుతున్నావు....అది కాదని అనడం కాదా?" మధ్యలో కల్పించుకుని అంది వరితాదేవి.

"అత్తయ్యా! దయచేసి నువ్వు కల్పించుకోవద్దు. ఇది నీకు సంబంధించిన విషయం కాదు. అసలు జరిగింది ఏమిటో నీకు తెలియదు" సడెన్‌గా ఆమెవైపు తిరిగి చాలా సీరియస్‌గా చెప్పాడు దీపక్.

"చూశారా నాన్నగారూ? మీరన్నదే నిజం. వీడికి పెద్దలంటే గౌరవం లేదు" తండ్రికేసి తిరుగుతూ చెప్పింది.

సురేంద్రసాబ్ వదనం మరింత ఎర్రబడింది కోపంతో. "వీడు ఒట్టి వెధవ....తల్లీ తండ్రీ లేని పిల్లాడని చెప్పి గారాబంగా పెంచితే, చేసేవన్నీ వదుపుతక్కువ పనులే....వీడిని ఇలా వదిలేస్తే సరిపోదు....బుద్ధివచ్చే ట్టు చేయాల్సిందే...." గొంతును పెంచి డిక్లేర్ చేశాడు.

"గారాబంగా పెంచడం అని చిన్నగా చెబుతారేంటి నాన్నగారూ.... గుండెలమీద పెట్టుకుని పెంచారు....ఫలితం ఏమైంది? చిల్లర తగాదాలు.... చపకబారు ఆడవాళ్ళ ఇళ్ళకు వెళ్ళడాలు....అన్నెం పున్నెం ఎరగని ఆడ పిల్లల్ని కిడ్నాప్‌చేసి బలవంతపు పెళ్ళిళ్ళు చేయడాలు....మంచివాళ్ళకాబట్టి ఆ పిల్ల తల్లిదండ్రులు మీ దగ్గిరికి వచ్చి తమ గోడు చెప్పుకువెళ్ళారు. అదే పోలీస్‌స్టేషన్‌కి పోయివుంటే?" నాన్‌స్టాప్‌గా చెప్పింది సరితాదేవి.

"అన్నెం పున్నెం ఎరగని ఆడపిల్లకాదు. నషీలీ మేజర్....తన ఇష్టం వచ్చిన పనిని చేయడానికి తగిన వయస్సులో వుంది. తను నా ఫ్రెండ్ దినేష్‌ని ప్రేమించింది....తనని పెళ్ళిచేసుకోవడం అంటూ కుదరకపోతే చచ్చిపోతానని ఖచ్చితంగా చెప్పింది. దినేష్‌కి కూడా ఆ పిల్లనే చేసుకోవాలని వుంది. అందుకే వహీద్‌ను పంపించి ఆ పిల్లను తీసుకు వచ్చాను....ఇందులో తప్పేం వుంది? దినేష్‌కంటే మంచి సంబంధం ఆపిల్ల తల్లిదండ్రులు తీసుకురాగలరా?" వేడిగా అడిగాడు దీపక్.

"ఆ మాట చెప్పడానికి నీకు అధికారం ఏముంది? అసలు ఈ వ్యవహారంలో నువ్వు కలుగచేసుకోవడం దేనికి?" కోపంగా అడిగాడు సురేంద్రసాబ్.

"అదేంటి తాతగారూ? దినేష్ నా ఫ్రెండ్....నా ఫ్రెండ్ వ్యవహారంలో నేను కల్పించుకోవడం తప్పు ఎలా అవుతుంది?" ఆశ్చర్యంగా అడిగాడు దీపక్.

"ఒక్క తప్పుకాదు....నీ పనేదో నువ్వు చూసుకోకుండా గూండా మాదిరి ఆడపిల్లల్ని ఎత్తుకురావడం డెఫినెట్‌గా తప్పే....నీకు బుద్ధిలేదు... నిన్ను వదిలిపెడితే ఊళ్ళో నన్ను తల ఎత్తుకోకుండా చేస్తావు....నీలాంటి వాడు నా ఇంట్లో వుండటానికి వీలులేదు. గెటవుట్ ఫ్రమ్ మై ప్లేస్.... వెళ్ళిపో....ఇంకెప్పుడూ నీ ముఖం నాకు చూపించకు."

అంతవరకూ జరిగిన మాటల యుద్ధంలో గెలుపు తనదే అవుతుందని ఎంతో ధీమాగా వున్న దీపక్ నెత్తిమీద ఒక్కసారిగా పిడుగు పడినట్లు అయింది.

"తాతగారూ....ఏం మాట్లాడుతున్నారు మీరు? నేను ఇంట్లో నుంచి వెళ్ళిపోవాలా?" తనేమైనా తప్పుగా విన్నానేమోనని ఆశ్చర్యంగా అడిగాడు.



"ఎస్....గెటవుట్ ఫ్రమ్‌హియర్....ఇకమీదట నీ గురించిన ఆలోచనలతో బ్లడ్‌ప్రెషర్‌ని పెంచుకోవడం నావల్లకాదు. ముందు నా ఎదుటినుంచి అవతలికి వెళ్ళిపో."

నిర్ఘాంతపడి నిలిచిపోయిన దీపక్‌మీద అప్పటికప్పుడు అమితమైన ప్రేమ పుట్టుకువచ్చినట్టు తండ్రి దగ్గిరకి జరిగింది సరితాదేవి

"తనుచేసిన తప్పేమిటో తనకు తెలియాలన్న ఉద్దేశ్యంతో నేను కూడా మీ మాదిరిగా నోటికి వచ్చినట్లు మాట్లాడాను....కాని ఏకంగా వాడిని ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మని అనడం పద్ధతికాదు. తన పద్ధతి మార్చుకుంటాడేమో అడగండి....ఇటువంటి పనులు ఇకముందు చేయనని ప్రామిస్ తీసుకోండి. వాడు మీ మనవడు....మీ దగ్గిర పెరిగినవాడు. వాడిమీద ఇంత కోపం మంచిదికాదు" అనునయంగా చెప్పింది.

కొంచెంగా శాంతించాడు సురేంద్రసాబ్.

"ఆల్‌రైట్....ఆ పిల్ల పేరేమిటి?"

"నషీలీ—నా ఫ్రెండ్ పేరు దినేష్...." తడుముకోకుండా వెంటనే చెప్పాడు దీపక్.

"మీ ఫ్రెండ్ పేరు నేను అడగలేదు....ఆ నషీలీని తీసుకుపోయి వాళ్ళ తల్లిదండ్రులకి అప్పజెప్పి తప్పయిపోయిందని చెంపలు వేసుకురా...."

"నషీలీని వెనక్కి పంపించడం ఇంపాజిబుల్....ఇంకో గంటా గంటన్నరలో దినేష్‌కి, తనకి పెళ్ళి...."

"పొరపాటున కూడా అది జరగడానికి వీలులేదు. ఆ పిల్లని వాళ్ళ ఇంటికి తీసుకుపోవాల్సిందే."

"సారీ తాతగారూ....ఆ పిల్ల ఇక వెనక్కిపోదు. దటీజ్ ఫైనల్" అన్నాడు దీపక్.

సుప్రసన్నంగా మారబోతున్న సురేంద్రసాబ్ ముఖం వున్నట్లుండి మళ్ళీ విపరీతమైన కోపంతో కందగడ్డలా తయారైపోయింది. "చూడు.... గుండెలమీద పెట్టుకుని పెంచానని గుర్తుచేశావ్. నా మాటకి ఎట్లా ఎదురు చెబుతున్నాడో చూడు.... ఒట్టొట్టి మాటలతో వీడికి బుద్ధిరాదు. వీడు

ఇంకొక్కక్షణం ఈ ఇంట్లో వుండటానికి వీలులేదు. వెంటనే బయటికి పొమ్మని చెప్పు" అంటూ సరితాదేవివైపు చూశాడు సురేంద్రసాబ్.

అంతవరకూ ఓ పక్కగా కామ్‌గా నిలబడి ఆ సంభాషణ వింటున్న సోహన్‌వైపు చూసింది సరితాదేవి.

"తాతగారు అంత ఓపికగా ఒకటికి పదిసార్లు చెబుతుంటే అలా మొండిగా మాట్లాడతావేంటి? ముందు మర్యాదగా ఆ పిల్లని తీసుకుపోయి తన అమ్మానాన్నల దగ్గిరికి చేర్చు" రెండు అడుగులు ముందుకువేసి నెమ్మదిగా దీపక్‌కు చెప్పాడు సోహన్.

"నీకు తెలియదు. నువ్వు అనవసరంగా మాట్లాడబోకు—" విసుగు నిండిన కంఠంతో అతన్ని వారించాడు.

"ఏంటోయ్ నాకు తెలియంది? ఏంటి నీకు తెలిసింది? నాకంటె చిన్న వాడివని నెమ్మదిగా మాట్లాడుతుంటే అర్థంకావడంలేదా? రెండు తగిలితే గాని నీ బుద్ధి మారదా?" చాలా ఎగ్రెసివ్‌గా అడిగాడు సోహన్.

కంట్రోల్ చేసుకోవడం దీపక్‌కి చేతకాలేదు. తనేం చేస్తున్నాడో తనకే తెలియని పిచ్చికోపంలో మునిగి ఫెడీమని కొట్టాడు అతని చెంప మీద.

కొరడా మోగినట్టు వినవచ్చింది పెద్దశబ్దం. నిటారుగా నిలుచున్న వాడు కాస్తా వెనక్కితూలి ఒక సోఫాదగ్గిర వెల్లకిలా పడిపోయాడు సోహన్.

"చంపేశాడు....నా కొడుకును ఈ వెధవ చావకొట్టేశాడు....వీడికి రౌడీబుద్ధులు ఒంటినిండా వచ్చేశాయి. వీడు మారడు...." పెద్దపెద్ద శోకాలు తీస్తూ తన కొడుకు దగ్గిరికి పరిగెత్తుకుంటూ వెళ్ళింది సరితాదేవి.

"పీటర్....పీటర్....ఎక్కడున్నావ్?" ఖంగుమంటున్న కంఠంతో పిలిచాడు సురేంద్రసాబ్. అక్కడే పది అడుగుల దూరంలో నిలబడి వున్నాడు పీటర్. రెండుఅంగల్లో ఆయన ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"పంపించెయ్....వీడిని ముందు ఇంట్లోనుంచి పంపించెయ్.... ఇంకొక్క క్షణం కూడా వీడు నా ఇంట్లో వుండటానికి వీలులేదు" ఖచ్చితమైన కంఠంతో ఆర్డర్ పాస్ చేసేశాడు సురేంద్రసాబ్.

"అయ్యగారూ....తొందరవద్దు....కాస్తంత నిదానంగా ఆలోచించండి—చిన్నబాబుది తప్పే.... ఏదో—" అనునయించబోయాడు పీటర్.



"వాడిని వెనకేసుకొచ్చేవాళ్ళు కూడా బయటికి వెళ్ళిపోవచ్చు.... నాకెలాంటి అభ్యంతరమూ లేదు."

ఠక్కున మూతబడిపోయింది పీటర్ నోరు.

సోఫాలోనుంచి లేచి విసురుగా తన గదిలోపలికి వెళ్ళిపోయాడు సురేంద్రసాబ్. ఆయన అటు వెళ్ళగానే చిన్నపాటి శబ్దాలుచేస్తూ పోర్టికోలో ఆగింది లాయర్ దామోదరం కారు.

డోర్ తెరుచుకుని కారులోనుంచి కిందికి దిగిన మొదటి క్షణంలోనే అక్కడి పరిస్థితి ఏమిటో అర్థమైపోయింది లాయర్‌సాబ్‌కి.

"హల్లో ఎవ్రీబడీ....అందరూ కుశలమేనా? నేను లోపలికి రావచ్చా?" ముఖద్వారం దగ్గిర నిలబడి బిగ్గిరిగా అన్నాడు. అవతలివైపు నుంచి ఒక్కళ్ళుకూడా మాట్లాడలేదు. అయినాసరే అందుకు ఏమీ ఫీల్ కాకుండా తనంతట తనే లోపలికివచ్చి, ఒక సోఫాలో సెటిల్ అయ్యాడు.

లాయర్‌సాబ్ వెనుకే వచ్చింది శృతిమేడమ్. లోపలికి వచ్చిన వెంటనే దీపక్‌వైపు చూశాయి ఆమె కాటుక కళ్ళు.

విపరీతమైన ఎగ్జయిట్‌మెంట్.... దాన్ని మించిన ఏదో తెలియని బాధ. చాలా దారుణంగా వడిలిపోయింది దీపక్ ముఖం. కనపడీ కనపడ నట్లు అతిసన్నటి కన్నీటిపొర అతని కళ్ళను కవర్ చేస్తున్నట్టుంది.

కత్తిపట్టుకుని పోచమ్మగుళ్ళో కదంతొక్కిన మనిషేనా ఇతను? సిద్దిపేట్ సినిమాహాల్లో జాణాకర్రతో బుర్రలు పగలగొట్టబోయిన డేరింగ్ డాషింగ్ హీరోయేనా?

ఒకదాని తరువాత ఒకటిగా ఆమె మనస్సులోకి అడుగుపెట్టాయి రకరకాల అనుమానాలు.

సోఫాలో సెటిల్ అయిన లాయర్‌సాబ్‌కి తెలియలేదు అవి.... ఆయనమాత్రం తన పద్ధతిలో తను అక్కడి వాతావరణాన్ని క్లియర్‌చేసే పనిలో బిజీ అయిపోయాడు.

"మీ ఫ్యామిలీ లాయర్‌ని నేను వచ్చేశాను. మీరు మీ కంప్లయింట్స్ అన్నింటినీ నా దగ్గిర చెప్పండి — పరిష్కారమార్గం నేను చూపిస్తాను"

తన గదిలోకి వెళ్ళిపోయిన సురేంద్రకు వినిపించేటట్లు బిగ్గరిగా అన్నాడు.

"వీడు....వీడు పట్టి జులాయిగా మారిపోయాడు....నాన్నగారు... నేను..అందరం చూస్తుండగానే నా కొడుకుమీద కలబడి చావకొట్టాడు" వి రీతమైన కోపంతో రిపోర్టు చేసింది సరితాదేవి.

"ఒంటరిగా వున్న వ్యక్తిమీద కలబడటమే పెద్దనేరం. కలబడ టంతో ఆగకుండా చెయ్యి చేసుకోవడం ఇంకా పెద్దనేరం—ఇండియన్ పీనల్ కోడ్‌లో రకరకాల సెక్షన్ల ప్రకారం యాభై రూపాయల జరిమానా వేయవచ్చు. పదిరోజులనుంచీ నెలరోజులదాకా జైలుశిక్షకు కూడా విధింప వచ్చు—అయితే ఇందులో ఎవరికీ సులభంగా అర్థంకాని ఒక మెలిక వుంది" సీరియస్‌గా ముఖంపెడుతూ చెప్పాడు లాయర్‌సాబ్.

"ఏంటది?" అక్కసుగా అడిగింది సరితాదేవి.

లాయర్‌సాబ్ ఆ సమయంలో అక్కడ ప్రత్యక్షం అవడం ఆమెకి ఎంతమాత్రమూ ఇష్టంలేదని వెంటనే అర్థం అయిపోయింది శృతిమేడమ్‌కి.

"కలబడటానికి, కొట్టడానికి మూలకారణమైన 'ఇంటెంట్' ఏమిటి అని మనం ఆలోచించాలి. అసలెందుకు కలబడ్డాడు? కలబడినవాడు అంత టితో ఆగకుండా ఎందుకు కొట్టాడు? అవతలి మనిషి ఇతన్ని ఏమైనా ప్రవోక్ చేశాడా? ఇతని ఆత్మగౌరవం దెబ్బతినే మాటలు ఏమైనా మాట్లాడాడా?"

సూటిగా స్ట్రెయిట్‌గా వున్న ఆ మాటల్లో దాగుకునివున్న ప్రమా దాన్ని వెంటనే పసికట్టింది సరితాదేవి.

"అబ్బెబ్బే.... అలాంటిదేమీ జరగలేదు అన్నయ్యగారూ! దీపక్ గాడు ఈమధ్య మరీ బరితెగించేశాడు. చిన్నంతరం పెద్దంతరం వాడికి తెలి యడంలేదు. ఎవరినిపడితే వాళ్ళని కొట్టడానికే తయారవుతున్నాడు. గంగారం జాతర్లో కొట్టాడు.... సిద్ధిపేట్‌లో ఎవర్నో చావబాది పోలీస్ స్టేషన్లోకి పోయాడు. అసలు వాడి పద్ధతిలోనే మార్పు వచ్చేసింది" అంటూ టోటల్‌గా దీపక్ మంచివాడు కాదు అని నిరూపించడానికి ట్రైచేసింది.

"ఓ.కె....ఓ.కె.... ఇప్పుడు ఇంకా బాగా అర్థమైంది. దీపక్‌కి చెయ్యివాటం బాగా అలవాటైంది. అందుకని అతనికి శిక్షపడాలి అని మీరు అనుకోవడంలో తప్పేమీ కనిపించడంలేదు. ఒకసారి ఈ ఇంటి యజ



మానిని గదిలోనుంచి బయటికి పిలిస్తే, నా అభిప్రాయం చెప్పి వెళ్ళిపోతాను" కూల్‌గా అన్నాడు లాయర్‌సాబ్.

"నీ అభిప్రాయం నీ దగ్గిరే వుంచుకో. ఇప్పుడు నిన్ను ఎవరూ అడగలేదు" క్షణంకూడా ఆలస్యం చేయకుండా వినవచ్చాయి సురేంద్రసాబ్ మాటలు.

లాయర్‌సాబ్ గొంతును వినగానే తన గది గుమ్మం దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు ఆయన అపసర సమయంలో ఆప్తుడు ఎవరో వచ్చినట్లు కొంచెంగా తేటపడివుంది ముఖం....అది శృతిమేడమ్‌కి కనిపించింది.

"సోహన్ చిన్నపిల్లాడు....దీపక్ అతనికంటే చిన్న. వాళ్ళిద్దరూ కొట్టుకోవడం, తగవులాడుకోవడం చాలా సహజం. వాళ్ళని గురించి మీకు ఎందుకు వర్రీ?" ఆయన్నే సూటిగా అడిగాడు లాయర్ దామోదరం.

తగవులను గురించి, తన్నులాటలను గురించి ఇప్పుడెవరు మాట్లా డారు? అసలు విషయం అదికాదు. వీడు పట్టి వెధవ....ఇవాళ వీడు చేసిన పని ఏమిటో తెలిస్తే నువ్వే వాడిని ఇంట్లోనుంచి బయటికి పంపేయమని సలహా ఇస్తావ్" అంటూ తమ గందరగోళానికి మూలకారణాన్ని వివరంగా తెలియజేశాడు సురేంద్రసాబ్.

అంతా విని సాలోచనగా తల ఊపాడు లాయర్‌సాబ్. "నషీలీని వాళ్ళ ఇంట్లోనుంచి పెద్దవాళ్ళకు ఇష్టంలేకుండా బయటికి తీసుకురావడం మానవత్వపరంగా చూస్తే తప్పు. న్యాయపరంగా, చట్టపరంగా తప్పుకాదు. ఆ పిల్ల మేజరేకదా? తన ఇష్టంవచ్చిన పద్ధతిలో తన ఇష్టంవచ్చిన వాడి దగ్గిరికి వెళ్ళవచ్చు. నో అబ్జెక్షన్. ఇందులో మీరు తలలు పట్టుకోవాల్సిన అవసరం ఏముంది?" అని అడిగాడు.

"ఈ మాట చెప్పడంకోసం వచ్చావా నువ్వు?" అడిగాడు సురేంద్ర సాబ్.

"మరింకే మాట చెప్పాలని నువ్వు ఆశిస్తున్నావ్?"

"నషీలీ తాత నాకు బాగా తెల్సు. ఆస్తిపరులు కాకపోయినా పరువు మర్యాదలు కలిగిన కుటుంబం. వాళ్ళు నా దగ్గిరికొచ్చారు. ఆ పిల్లను వాళ్ళింటి దగ్గిర దింపమంటే ఈ రాస్కెల్ వీలుకాదని అంటున్నాడు."

"ఓ.కె. అప్పుడు నువ్వేమన్నావ్?"

"ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మన్నాను. ఎందుకంటే నా పరువు బజారుకెక్కే పనులు చేసేవాళ్ళతో నాకు సంబంధం వుండటం నాకు ఇష్టంలేదు."

"ఓ.కె. దానికి దీపక్ ఏమంటున్నాడు?"

"ఏమీ అనడంలేదు. ఎప్పుడో అవతలికి వెళ్ళిపొమ్మని చెబితే, బొమ్మలా ఇంకా ఇక్కడే నిలబడి వున్నాడు."

"సురేంద్రా! బీ రీజనబుల్! ఇది వాడి ఇల్లు.... వాడిని ఇంట్లోనించి పొమ్మనే హక్కు" అని లాయర్‌సాబ్ సర్దిచెప్పబోతుండగా, కల్పించుకున్నది సరితాదేవి. "వాడి ఇల్లు ఎలా అవుతుంది అన్నయ్యగారూ? ఇది మా నాన్నగారి ఇల్లు. తల్లిని, తండ్రిని ఎప్పుడైతే చంపుకున్నాడో అప్పుడే వాడికి అధికారం పోయింది. వాడి నాన్నకంటే పెద్దదాన్ని నేను. ఇప్పుడు నాదే అధికారం.... పరువుతక్కువ పని చేసినందుకు వాడు వెళ్ళిపోవాల్సిందే."

ఆమె మనసులో వున్న అసలు ఉద్దేశ్యం అంత ప్లెయిన్‌గా బైటికొచ్చేసరికి విపరీతమైన ఆశ్చర్యంతో నోటమాట రానట్టు మౌనంగా వుండిపోయాడు లాయర్‌సాబ్.

"ఇదిగో దామోదరం! ఈ శషభిషలు అనవసరం. నేను చెప్పినట్లు చేస్తే వాడీ ఇంట్లో వుండవచ్చు. అడుగు వాడిని" ఖంగుమంటున్న కంఠంతో సురేంద్రసాబ్ హెచ్చరించేసరికి, తన ఆశ్చర్యంనుంచి బయటపడ్డాడు. దీపక్‌వైపు తిరుగుతూ ప్రశ్నార్థకంగా చూశాడు.

"అది కుదరదు అంకుల్! నషీలీకి, నా ఫ్రెండ్‌కి ఈ రాత్రికే పెళ్ళి. ఆ పిల్లని వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళి అప్పజెప్పడం నా చేతుల్లో లేదు" అంత ఎగొనీలోను తన పరిస్థితిని క్లియర్‌గా ఎత్తి చూపించాడు.

"పీటర్!" పెద్దగా పిలిచాడు సురేంద్రసాబ్.

దగ్గిర్లోనే వున్నాడు పీటర్. రెండు అడుగులు ముందుకేసి వినయంగా ముందుకు వంగాడు.

"వాడిని బయటికి పంపించు. ఇంకొక్క క్షణంకూడా వాడు నా కళ్ళ ముందు కనిపించడానికి వీల్లేదు. పుష్ హిమ్ అవుట్!" వృద్ధసింహం మాదిరి గర్జించాడాయన. అంతవరకూ ఎంతో అణకువగా, ఎంతో ఒద్దికగా నిలబడివున్న దీపక్‌లో వున్నట్లుండి ఒక పెద్ద మార్పు వచ్చేయడం శృతి



మేడమ్‌కి కనిపించింది.

"మామయ్యా! దీపక్‌ని కంట్రోల్‌చెయ్....హీ ఈజ్ గోయింగ్ టు డూ సమ్‌థింగ్ డ్రాస్టిక్...." కంగారుగా లాయర్‌సాబ్ చెవిలో ఊదింది.

లాయర్‌సాబ్ నోరు విప్పకముందే ఆమె భయపడినంతా జరగనే జరిగింది.

"బయటికి పో.... అవతలికి పో అని అదేపనిగా చెప్పేస్తున్నారు. ఏం బయటికి పోలేననా? పోయి బతకలేననా? మీరు పెడుతున్న నాలుగు మెతుకులకోసం ముష్టివాడిలా మీ ఎదుట వుండాల్సిన అవసరం నాకులేదు. పీటర్‌ని పిలిచి నన్ను బయటికి పుష్ చేయించాల్సిన పనిలేదు. నేనే వెళ్ళిపోతున్నా" పిడుగుల్లాంటి మాటలు మాట్లాడుతూ గిరుక్కున వెనుతిరిగాడు దీపక్.

రక్తంలేనట్లు తెల్లగా పాలిపోయింది పీటర్ ముఖం. దూరంలో నిలబడివుంది మరియమ్మ. ఆ సమయంలో తను మాట్లాడితే తన యజమానికి కోపం వస్తుందని తెలిసికూడా "నాన్నగారూ! ఆగండి.... కోపంలో మీరు ఏం మాట్లాడుతున్నారో మీకే తెలియడంలేదు. ఆగండి. తాతగారిని క్షమాపణ అడగండి" అంటూ అతన్ని ఆపడానికి ప్రైత్నిచేసింది.

"నువ్వూరుకో మరియమ్మా! నీకేమీ తెలియదు. మవ్వు మధ్యలో కల్పించుకోకు" అంటూ ఆమె చేతుల్ని విదిలించి మేడమీదికి వెళ్ళిపోయాడు దీపక్.

చూస్తూ చూస్తూ వుండగానే చిరుగాలి కాస్తా తుఫాను గాలిగా మారిపోయినట్టు, వున్నట్టుండి అసహ్యాకరమైన డైమన్షన్స్‌కు చేరుకున్న ఆ పరిస్థితిని చూసి విలవిలలాడిపోయింది శృతిమేడమ్. "మామయ్యా! డూ సమ్‌థింగ్...." అంటూ లాయర్‌సాబ్‌ని అర్థించింది.

ఆమె అలావేడుకోవాల్సిన అవసరం లేకుండానే వేగంగా సురేంద్రసాబ్ దగ్గిరికి పోయి, "నువ్వుకూడా చిన్నపిల్లాడి మాదిరి ప్రవర్తిస్తావేమిటి? వాడిని ఆగమని చెప్పు" అన్నాడు లాయర్ దామోదరం.

"నాకు కాదు....ఆ మాట వాడికి చెప్పు. ఆ పిల్లను వాళ్ళ అమ్మానాన్నల దగ్గిరికి తీసుకుపోయి అప్పగించిన తర్వాత ఈ ఇంట్లోకి రమ్మని చెప్పు" అంటూ తనుకూడా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఈ విషయంలో మీరు కల్పించుకోకండి అన్నయ్యగారూ! నాలు రోజులు గడిస్తే ఏడ్చుకుంటూ వాడే తిరిగి వస్తాడు. చుట్టూ వందమంది ప వాళ్ళను పెట్టుకుని మహారాజుమాదిరి పెరిగినవాడు....ఒంటరిగా బయటి పోతే ఒక్క క్షణం కూడా ఆగలేడు. రేపు ఈపాటికల్లా వచ్చి వాడే శ గారి కాళ్ళమీదపడి క్షమించమంటాడు.... చూస్తూ వుండండి" అంది సరి దేవి.

ఆ మాటల్లో ఎంతో కొంత నిజం వున్నదనే అనిపించి మౌనంగా తల ఊపాడు లాయర్ సాబ్.

"సమయం, సందర్భం కాకపోయినా, మనసు వుండబట్టలేక ఒ మాట అడగదల్చుకున్నాను. అడగమంటారా అన్నయ్యగారూ?" దీర్ఘం తీస్తూ అంది.

"ఏమిటమ్మా అది?" అడిగాడు లాయర్ సాబ్.

"ఏదైనా నా మనసులోకి వచ్చిందంటే, దాన్ని దాచిపెట్టుకుని పై వేరే మాటలు మాట్లాడే అలవాటు నాకు లేదు. శృతి నాకు బాగా నచ్చింది. మావాడికి ఇంకా బాగా నచ్చింది. మీకూ అంగీకారమైతే, మా వాళ్ళ పిలిపిస్తాను. దగ్గర్లో మంచి ముహూర్తం చూసి పెళ్ళి చేసేద్దాం....కట్న కానుకల విషయంలో నాకు ఎటువంటి పట్టింపులూ లేవు...." గడగడా చెప్పేసింది సరితాదేవి.

ఆ మాటలు విన్న శృతిమేడమ్ తన చెవుల్ని తనే నమ్మలేకపోతున్నట్లు బ్లాంక్ ఫేస్ పెట్టింది.

ఆశ్చర్యం కలిగినా, వెంటనే తమాయించుకున్నాడు లాయర్ సాబ్.

"ఇంతకుముందు కూడా ఒకసారి మీకు చెప్పినట్టు నాకు గుర్తు. శృతి పెళ్ళి విషయంలో నాకు ఎటువంటి అధికారమూ లేదు....ఆమె అమ్మా నాన్నల్ని అడగాలి అని...." ముక్తసరిగా అన్నాడు.

"అదే నేనూ చెపుతున్నాను అన్నయ్యగారూ....వాళ్ళతో మాట్లాడండి...వీలైతే ఓసారి ఇండియా రమ్మని చెప్పండి. సురేంద్రసాబ్ కూతురితో వియ్యం అంటే కాదని అనరు. మా నాన్నగారి స్టేటస్ ఏమిటో వాళ్ళకి తెలిసే వుంటుంది" సగర్వంగా చెప్పిందామె.

గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు సురేంద్రసాబ్....



తలుపులవంకా, దీపక్ వెళ్ళిన మార్గంవంకా, సరితాదేవివంకా ఒకసారి చూసి సోఫాలోనుంచి లేచాడు లాయర్ దామోదరం.

"నేను దగ్గరవుండి కూడా ఇటువంటి సన్నివేశాన్ని ఆపలేకపోవడం చాలా బాధగావుంది. వెళ్ళివస్తాను" అంటూ పోర్టికోలోకి వచ్చి కారెక్కాడు.

"ఎవరిది తప్పు?" చిన్నగా అడిగింది శృతిమేడమ్ ఆయన పక్కనే కూర్చుంటూ.

"ఇద్దరిదీ తప్పే....రెండూ రెండే. హాట్ హెడ్స్....చింతగింజల్ని విసురుకున్నట్టు చకచకా మాటల్ని విసురుకున్నారు. చాలా బాధగా వుంది నాకు" కనులు మూసుకుంటూ అన్నాడు లాయర్ సాబ్.

* * * *

ఖచ్చితంగా ఇంటికి చేరుకున్న ఒక గంట తర్వాత ఆమెను రూమ్‌లోనుంచి బయటికి పిలిచాడు లాయర్ సాబ్. "ఫోన్ వచ్చింది శృతీ! దీపక్ నీతో మాట్లాడతాడట" లాండ్ ఫోన్ వైపు చూపిస్తూ చెప్పాడు.

ఝల్లుమంది శృతిమేడమ్ ఒళ్ళు....వెచ్చటి ఆవిర్లు మెడమీదినించి ముఖంలోకి ఎగబాకుతున్న సెన్సేషన్.

"దీపక్ నాకు ఫోన్ చేయడం ఏమిటి? తన తరపున నన్ను వాళ్ళ తాతగారితో మాట్లాడమని రిక్వెస్ట్ చేయడానికా?" అయోమయంగా అడిగింది.

"తినబోతూ రుచులు అడగటం అంటే ఇదే....హీ ఈజ్ వెయిటింగ్...." అంటూ మళ్ళీ ఫోన్‌వైపు చేయి చూపించాడు లాయర్ దామోదరం.

"హల్లో శృతీ....అర్ యూ ఫ్రీ?" రిసీవర్ పట్టుకోగానే వినవచ్చింది దీపక్ కంఠం.

"ఎందుకు?" ఎలర్ట్ అవుతూ అడిగింది.

"నానక్‌రామ్ కళ్యాణమండపంలో మా దినేష్‌కి, నషీలీకి పెళ్ళి....దినేష్ ఫాదర్ నిన్ను పిలవమని మరీ మరీ చెప్పాడు....వస్తావా?"

"ఇంటిదగ్గిర మీ తాతగారు ఆ పిల్లను తీసుకుపోయి...." అంటూ మొదలుపెట్టబోయిన ఆమెను వెంటనే-

"కమాన్ శ్రుతీ....జరిగింది ఏమిటో దగ్గరవుండి మరీ చూశావు.... పరిస్థితి ఎంత సీరియస్సో మీ మామయ్యకంటే నీకే ఎక్కువగా తెలుసు. మరి తెలిసి కూడా మవ్వు మొదటికి వచ్చేస్తావేంటి?" అంటూ కట్ చేశాడు.

"అదికాదు దీపక్....ఇది నీ ఫ్యూచర్ కి సంబంధించిన విషయం అయింది. ఇప్పుడు మీ తాతగారు నిన్ను ఇంట్లోనుంచి వెళ్ళగొడితే, నీ చదువు ఎలాగనుకుంటున్నావు?" సిన్సియర్ గా అడిగింది శ్రుతిమేడమ్.

"లెట్ దట్ చదువు గో టు హెల్....ముందు మన ఎదురుగా వున్న వ్యవహారం గురించి ఆలోచిద్దాం....నువ్వు వస్తున్నావా, రావడం లేదా?" సీరియస్ గా అడిగాడు.

రిసీవర్ ని అలాగే పట్టుకుని లాయర్ సాబ్ వైపు చూసింది శ్రుతి మేడమ్.

"వెళ్ళిరా....పిలుస్తుంటే నో చెప్పడం డీసెన్సీ కాదు" అన్నా డాయన.

"నేను వెళితే తన మనవడితో జట్టుకట్టానని తాతగారు పీమీద కేకలుపెడితే?" అంది.

"సురేంద్ర కేకలు, అరుపులు నాకు మామూలే....అయినా వెళ తోంది నువ్వు. నేను కాదు....నా మీద తనకి అధికారం వుండచ్చు, నీ మీద లేదుగా...."

ఎందుకనో చాలా సంతోషం అనిపించింది శ్రుతిమేడమ్ కి. "అర గంటలో బయలుదేరతాను. ఓ.కె.నా?" రిసీవర్లో దీపక్ ని అడిగింది.

"అరగంట కాకపోతే గంట టైము తీసుకో....పెళ్ళి ఎప్పుడో రాత్రి పదకొండుగంటలకి....అన్నట్టు ఒక చిన్న సజెషన్. అది కూడా నీకు ఇష్టమయితేనే...." కొంచెం తడబడుతూ ఆఖరిమాటను అన్నాడు దీపక్.

"సజెషనా? వాటీజ్ ఇట్?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"ఇందాక మా ఇంటికి, అదే మా తాతగారింటికి వచ్చినప్పుడు చీర కట్టుకు వచ్చావ్. యూ లుక్ వెరీ బ్యూటిఫుల్ ఇన్ దట్....చీర నీకు చాలా బాగున్నట్టు నాకు అనిపించింది....ఇక్కడ వున్న మోడ్రన్



డ్రెస్సుల్లో నువ్వు చీరలో వస్తే అందరికీ డిఫరెంట్ గా కనిపిస్తావ్....బాగా ఆలోచించు" అంటూ రిసీవర్ ని పెట్టేశాడు దీపక్.

వంద ఫ్లోరోసెంట్ లైట్లు ఒకేసారి వెలిగించినట్లు కాంతివంతం అయిపోయింది శ్రుతిమేడమ్ ముఖం.

ఆ మార్పును వెంటనే పసికట్టేశాడు లాయర్ సాబ్. "ఏంటమ్మా... కొంపదీసి ఫోన్లో నీకు ఐ లవ్ యూ గాని చెప్పేశాడా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అంతకంటే ఎక్కువే చెప్పేశాడు మామయ్యా....చీర కట్టుకుంటే నేను బ్యూటీఫుల్ గా వుంటానని అన్నాడు....అక్కడ అంత గొడవ జరుగుతున్న సమయంలో కూడా అతను నా డ్రెస్ ని అబ్జర్వ్ చేశాడంటే... చాలా విచిత్రంగా వుంది" అదోరకమైన తన్మయత్వంలో మునిగిపోతున్న శ్రుతిమేడమ్....సమాధానం యిచ్చింది.

"దటీజ్ దీపక్....మా సురేంద్ర కూడా అంతే....మాట్లాడే టాపిక్ ఒకటి అయితే, అబ్జర్వ్ చేసేది మరోటి అవుతూ వుంటుంది....హీ ఈజ్ ఎ నైస్ కిడ్...."

"మరి వాళ్ళ ప్రాబ్లమ్ సంగతేంటి మామయ్యా? నీ మాటల్నిబట్టి చూస్తుంటే దీపక్ ఇప్పట్లో ఇంటికి పోవడం కష్టమని అనిపిస్తోంది.... నసీరీ పెళ్ళి కూడా అయిపోతోంది. ఆ పిల్లని వాళ్ళ తల్లిదండ్రులకి అప్ప గించడం అనే మేటర్ అవుటాఫ్ క్వశ్చన్."

"దీపక్ ఇంట్లోనుంచి బైటికి వచ్చేస్తే, తిండికి. చదువుకి డబ్బుల్లేక తంటాలుపడిపోతాడని నీ వుద్దేశ్యమా?"

"ఎగ్జాక్ట్లీ....అదే నా అనుమానం."

"దీపక్ గురించి నీకు పూర్తి వివరాలు చెప్పలేకపోవడం నాదేతప్పు. ఇంట్లోనుంచి వెళ్ళగొట్టి, ఒక్కపైసా కూడా సురేంద్ర దీపక్ కి ఇవ్వక పోయినా, అతని స్టాండర్డ్ ఆఫ్ లివింగ్ లో చిన్నమార్పు కూడా రాదు."

"అదే ఎలా అని అడుగుతున్నాను. దీపక్ లా బిజినెస్ సామాన్య మైంది కాదు.....కనీసం రోజుకి వెయ్యిరూపాయలైనా అతని ఖర్చులకి సరిపోవు."

"వెయ్యి కాదమ్మా....నాకు తెలిసి అతను రోజుకి రెండుమూడు వేలు ఖర్చుపెట్టిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి ఏకమొత్తంగా పాతిక, యాభై వేలు ఎడమచేత్తో ఎవరెవరికో ఇచ్చిన సీన్స్ కూడా నాకు గుర్తున్నాయి."

"అవునుకదా....మరి అతని మెయింటెనెన్స్ ఎలా?"

"మెయింటెనెన్స్ ఏమిటమ్మా? ఇటీజ్ నథింగ్.... సురేంద్ర అతనికి యిచ్చేదేంటి? యాక్సిడెంట్‌లో చనిపోయేనాటికి దీపక్ అమ్మగారి పేరున నాలుగుకోట్ల యాభై లక్షల రూపాయలు ఫిక్స్‌డ్ చేసివున్నాయి. అవి ఆమె పుట్టింటివారు ఇచ్చిన స్త్రీధనం....వాటిమీద చెయ్యివేసే హక్కు సురేంద్రకి లేదు. ఆమె కడుపున పుట్టిన దీపక్ మాత్రమే ఆ డబ్బుకు వారసుడు.

ఇప్పుడు చెప్పు....బయటికి వచ్చేసినంతమాత్రాన అతనికి వచ్చిన నష్టం ఏమైనా వుందా?"

"అతనికి ఈ విషయం తెలుసా?" ఆశ్చర్యంగా ముఖంపెట్టి అడిగింది శృతిమేడమ్.

"తెలీదు" అన్నాడు లాయర్‌సాబ్.

లాయర్‌సాబ్ సమాధానం విన్న శృతిమేడమ్ ముఖంలో రకరకాల భావాలు వెంట వెంటనే ప్రత్యక్షం అయ్యాయి.

"ఏంటమ్మా శృతీ? నేను చెప్పకూడని మాట ఏదో చెప్పినట్టు ఒక్కసారిగా అలా అయిపోయావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు లాయర్‌సాబ్.

"తన చేతికి ఎంత దొరికితే అంత ఖర్చుపెట్టేయడమేతప్ప, ఆ డబ్బు ఎక్కడినించి వస్తోందో, ఎలా వస్తోందో దీపక్‌కి తెలియదని నాకు అర్థం అయింది. మనీ మేనేజ్‌మెంట్‌ని గురించి అతనికి కొంచెంగా కూడా అవగాహన లేదని స్పష్టమవుతోంది. ఇది మంచి అలవాటు కాదు. భవిష్యత్‌లో చాలా ప్రాబ్లెమ్స్ క్రియేట్ అవుతాయి" సాలోచనగా చెప్పింది శృతిమేడమ్.

"ఎగ్జాక్ట్‌లీ కరెక్ట్. దటీజ్ ది ఓన్లీ వీక్‌నెస్ విత్ దట్ బోయ్! ఒక విధంగా ఆలోచిస్తే అది అతని తప్పుకాదు.... అతన్ని ఆ విధంగా పెంచి



పెద్దచేసిన మా సురేంద్రదే. ఒట్టిగా కాదమ్మా! రాజకుమారుడిలా పెంచాడు" అన్నాడు లాయర్‌సాబ్.

"మనీ మేనేజ్‌మెంట్‌ని గురించి తెలీని మనిషిని చేసుకుంటే నేను సుఖపడగలనా?" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అంది.

"వై వర్రీ? ఇంట్లోనుంచి బయటికి వచ్చేశాడుగా? ఇక ఇప్పుడు అతనేం చేస్తాడో అబ్జర్వ్ చేద్దాం. దెన్ వుయ్ విల్ టేక్ ది డెసిషన్.... ఓ.కె?" అన్నాడు లాయర్‌సాబ్.

పదిక్షణాలపాటు సీరియస్‌గా ఆలోచించి, "అతని మమ్మీ తరపున వచ్చే డబ్బును గురించి నీ అంతట నువ్వు బయటపెట్టబోకు. రేపటినుంచీ అతని ఎగ్జిస్టెన్స్ ఎలావుంటుందో నేను క్లోజ్‌గా గమనిస్తాను" అంది శృతిమేడమ్.

"ఓ.కె మైడియర్! పీకలమీద కత్తిపెట్టినా నేను నోరు తెరవను.... అంతగా అవసరం అని నువ్వేమైనా ఫీలైతే, నీ నోటితో నువ్వే చెప్పు. బైదివే....ఆ డబ్బుకు సంబంధించిన కాయితాలన్నీ మనదగ్గిరే వున్నాయి. అతను వచ్చి ఒక డిక్లరేషన్‌మీద చిన్న సంతకం పెడ్తేచాలు హీ విల్ బీ ఎ మల్టీమిలియనీర్!" అన్నాడు.

సాలోచనగా తలవూపి తన గదిలోకి వెళ్ళిపోయింది శృతిమేడమ్. సరిగ్గా నలభై రెండు నిముషాల తర్వాత కనులు మిరుమిట్లుగొలిపే కాస్ట్‌లీ పట్టుచీర కట్టుకుని, డైమండ్స్ పొదిగిన ఒకే ఒక నెక్లెస్‌ని ధరించి బయటికి వచ్చింది. "ఇప్పుడు సరితాదేవి నిన్ను గనుక చూడటం జరిగితే, ఈ ఇంటి ముందు టెంట్ వేసేసి కూర్చుంటుంది. సోహన్ విషయంలో ఎస్ ఆర్ నో చెప్పేదాకా నన్ను, నిన్ను వదిలిపెట్టదు. ఐ యామ్ ష్యూర్ ఆఫ్ ఇట్!" మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు లాయర్‌సాబ్.

"దట్ సోహన్! అందంగానే వుంటాడు....బట్ హీ ఈజ్ ఎ బిగ్ బోర్....తనో పెద్ద ధనవంతుడిననీ, తనను మించినవాడు ఈ ప్రపంచంలోనే లేడని అనుకుంటూంటాడు" అంటూ పోర్టికోలోకి వెళ్ళింది శృతిమేడమ్.

రెడీగానే వున్నాడు డ్రయివర్. ఆమె లోపల కూర్చోగానే ప్రశ్నార్థకంగా చూశాడు.

"నానక్‌రామ్ కళ్యాణమండపానికి పోదాం. అంతకంటే ముందు ఏదైనా గిఫ్ట్‌షాపుకి పోనీ!" అంది శృతి.

"టైమ్ అయిపోయిందమ్మా! షాపులు మూసేసి వుంటాయ్" అంటూ రోడ్డుకు అటూ ఇటూ వున్న షాపులమీద ఒక కన్ను పెట్టి డ్రయివ్ చేశాడతను.

అతని మాటలే కరెక్ట్ అయ్యాయి. కళ్యాణమండపం దగ్గిరికి వచ్చేసిన తర్వాత కూడా ఓపెన్‌గా వున్న షాపు ఒక్కటికూడా శృతికి కనిపించలేదు.

"ఏదో ఒక గిఫ్ట్ తీసుకుపోకుండా అక్కడికి వెళ్ళడం ఎంబ్రాసింగ్‌గా వుంటుంది" చిరాకుగా అంది.

* * * *

అటువంటి సిచ్యుయేషన్స్‌లో తను నోరు తెరవడం అంత మంచిది కాదని అనుకున్నాడు కాబోలు, సైలెంట్‌గా వుండిపోయాడు డ్రయివర్. కారు కళ్యాణమండపం ఎదుట ఆగిన మరుక్షణం పరిగెత్తుకుంటూ వచ్చారు నలుగురు యువకులు.

"మేము దినేష్ స్నేహితులం. మీరు వస్తారని మా దీపక్ చెప్పాడు. వాడు సెకండ్ ఫ్లోర్‌లో వున్నాడు" అంటూ ఆమెను వెంటబెట్టుకుని అటు తీసుకుపోయారు.

ఖరీదైన మోడ్రన్ డ్రెసెస్ ధరించి చక్‌చక్‌మని అటూ ఇటూ తిరుగుతున్న అనేకమంది దినేష్ బంధువుల్ని చూస్తూ సెకండ్ ఫ్లోర్‌లోకి పోయింది శృతిమేడమ్.

గ్రౌండ్‌ఫ్లోర్‌నుంచి మొదలయింది ఆమెను అబ్జర్వ్ చేయడం... ఎదురుపడినవారందరూ, ఆడ మగ తేడా లేకుండా అలాగే చూస్తూండిపోయారు.

'ఈ సిచ్యుయేషన్‌ని చాలా బాగా ఎసెస్‌చేశాడు దీపక్.... నీ అందాన్ని అతను ప్రతి యాంగిల్‌లోనుంచి క్లోజ్‌గా అబ్జర్వ్ చేశాడు.... అవునా కాదా?' సెకండ్‌ఫ్లోర్‌లో అడుగు పెట్టబోతున్న క్షణంలో అడిగింది ఆమె అంతరాత్మ.

అందుకామె ఏదో ఒక సమాధానం చెప్పుకోకముందే, ఆమెను చూసి



గబగబా వచ్చాడు దీపక్.

అందంగా తయారై రమ్మని ఆమెకు సలహా ఇచ్చిన ఆ పెద్దమనిషి, తను మాత్రం సాదాసీదా టీషర్ట్‌తో, ఆర్డినరీ జీన్స్‌ప్యాంట్‌లో వుండటం శృతిమేడమ్‌కి నచ్చలేదు.

"నా వార్డ్‌రోబ్‌లో వున్న సరుకసంతా బయటికితీసే ఓపికలేక, చేతికి అందిన డ్రెస్‌తో బయటికి వచ్చేశాను. నా గురించి, నా డ్రెస్‌గురించి ఇప్పుడు ఆలోచించకు. నువ్వు నషీలీ దగ్గిర నిలబడాలి. ఆ పిల్ల తరపున మనమే పెళ్ళి పెద్దలం...." అంటూ ఆమె సమాధానం ఇవ్వకముందే, చాలా చనువుగా శృతిమేడమ్ చెయ్యిపట్టుకుని ఒక గదికేసి తీసుకుపోయాడు.

చటుక్కున దీపక్ చేతిని విదిలించి, పక్కకు జరగాలని వెంటనే అనిపించినా, ఎందుకనో ఆ పని చేయలేకపోయింది శృతిమేడమ్.

ఏదో ఒకటి చేయడమో, లేక ఏదైనా మాట అనడమో జరిగిపోవాలని ఆమె అనుకోకముందే పెళ్ళికూతురున్న రూమ్‌లోకి ఎంటరైపోయింది. పదిమంది ఫ్రెండ్స్‌మధ్య కూర్చునివుంది నషీలీ. చుట్టాలు, బంధువులు, తల్లిదండ్రులు ఎవరూ తన దగ్గిర లేరనే బాధ కొట్టొచ్చినట్టు కనిపిస్తూనేవుంది ఆమె ముఖంలో.

దివినుంచి భువికి దిగివచ్చిన దేవకన్య ఎలా వుండాలని అందరూ అనుకుంటూ వుంటారో అచ్చు అలాగే వుంది ఆమె రూపం.

శృతిని చూసేసరికి, ఆప్తురాలిని చూసిన ఫీలింగ్‌తో కుర్చీలోనుంచి లేచిందామె....

"కట్టుబట్టలతో వచ్చేశానుగదా.... దీపక్ తెప్పించాడు ఈ డ్రెస్‌ని. ఇవిగో....ఈ నగలుకూడా అతను తెచ్చిచ్చినవే" అంటూ ఆమె మెడలో వున్న ఒక చెయిన్‌ని, చేతి గాజుల్ని శృతిమేడమ్‌కి చూపించింది.

* * * *

సుమారు యాభై అరవై వేలు ఖరీదుచేసే విలువున్న ఆ నగల్ని చూసిన శృతిమేడమ్ మనసులో మళ్ళీ ఎంటరైంది మనీ మేనేజ్‌మెంట్ ప్రశ్న.

"నువ్వు ఇక్కడ ఛార్జ్ హ్యాండోవర్ చేసుకో. నేను ఒకసారి

దినేష్‌గాడి దగ్గిరికి పోయివస్తా....కబురుమీద కబురు పెడుతున్నాడు వాడు" అంటూ అక్కణ్నుంచి అవతలికి పోబోయాడు దీపక్.

సడన్‌గా తన ప్రాబ్లెమ్ గుర్తుకువచ్చింది శృతిమేడమ్‌కి. "నాకు నువ్వు హెల్ప్ చేయాలి....షాపులన్నీ క్లోజ్ అయిపోయాయి. నేను గిఫ్ట్ ఏదీ తీసుకురాలేదు" అతని దగ్గిరికిపోయి చిన్న కంఠంతో చెప్పింది.

నుదురు రుద్దుకుంటూ రెండుక్షణాలు ఆలోచించి, "కమాన్.... మనకి అట్టే టైమ్‌లేదు. తొందరగా వచ్చేయాలి" అంటూ మళ్ళీ ఆమె చెయ్యిపట్టుకుని గబగబా లిఫ్ట్‌వైపు తీసుకుపోయాడతను.

కావాలని అలా పట్టుకుంటున్నాడో, అనాలోచితంగా ఆ పని చేస్తున్నాడో తర్కించుకోవడం మొదలుపెట్టింది శృతి.

"మా రాంసింగ్ వచ్చివుంటే ఎంతో బాగుండేది.... తను రాలేదు. కొంచెం ఇబ్బందిగానే వుంది" పార్కింగ్ ఏరియాలోకి తీసుకుపోతూ అన్నాడు దీపక్.

"మా కారుంది....నో ప్రాబ్లమ్" అని అనబోతూ చటుక్కున ఆ మాటల్ని ఆపేసింది శృతిమేడమ్. ముఖమంతా నవ్వులమయం చేసుకుని.... రాంసింగ్ ఎదురుగా రావడమే అందుకు కారణం.

అతన్ని చూసేసరికి దీపక్ ముఖం ఆమె ఊహించినట్టుగానే ఒక్కసారిగా కాంతివంతం అయింది.

"శృతి ఇక్కడికి వచ్చేటప్పుడు మ్యారేజ్ గిఫ్ట్ తీసుకురావడం మర్చిపోయిందిట. షాపులన్నీ క్లోజ్ అయిపోయాయి. ఇప్పుడు మనం ఏం చేయాలి?" తన అలవాటు ప్రకారం అతన్ని సలహా అడిగాడు దీపక్

"గిఫ్ట్ తీసుకోవాలా? అయితే మనం గిరాబ్‌చంద్‌కి ఫోన్‌చేద్దాం చిన్నబాబూ....దగ్గిరవున్న బెస్ట్ మెటీరియల్‌లోనుంచి సెలక్ట్‌చేసి తనే తీసుకువస్తాడు" అంటూ తన సెల్‌ని బయటికి తీయబోయాడు రాంసింగ్.

చటుక్కున అతన్ని ఆపేశాడు దీపక్.

"గిరాబ్‌చంద్ తాతగారికి దోస్తు. తాతగారి ఇన్‌ఫ్లుయెన్స్ ఇకమీదట నాకు వద్దు. నేనే ఏదో ఒకటి చేస్తాను" అంటూ ముందుకు అడుగు వేశాడు.

శృతిమేడమ్ ఎక్కివచ్చిన కారుదగ్గరికి పోవాలని అతని ఉద్దేశ్యం.



"నేను నా ఫ్రెండు దగ్గిర అంబాసిడర్‌ని అరువు తీసుకుని వచ్చాను చిన్నబాబూ—మీరు ఇలా మాట్లాడతారని నాకు తెలుసు—నాతో రండి" అంటూ మెయిన్‌గేటుకు దగ్గిరిగా ఆపివున్న ఒక పాత అంబాసిడర్ దగ్గిరిగా ఆపివున్న ఒక పాత అంబాసిడర్ దగ్గిరికి అతన్ని లీడ్ చేశాడు రాంసింగ్.

గట్టిగా ఒక దెబ్బకొడితే, కొట్టిన మరుక్షణం డిస్‌మాంటిల్ అయిపోయేటట్టు కనిపిస్తున్న ఆ పాత అంబాసిడర్‌లో కూర్చోవడం కాస్త నామోషీ అనిపించినా, దీపక్‌నుంచి ఎటువంటి అభ్యంతరం వెలువడకపోవడంతో మౌనంగా వుండిపోయింది శృతిమేడమ్.

"పాతికవేలే చిన్నబాబూ దీని ఖరీదు—ఇంకో పాతిక పెడితే రాజహంసమాదిరి తయారుచేయొచ్చని మన జమలయ్యగాడు చెప్పాడు—కావల్సిన మెటీరియల్ అంతా తన దగ్గిర వుందని అన్నాడు. డబ్బులు ఇప్పటికిప్పుడు ఇచ్చేయ్యాల్సిన అవసరంలేదుట. వాయిదాల పద్ధతిలో నెమ్మదినెమ్మదిగా తీర్చుకోవచ్చుట" నర్మగర్భంగా చెప్పాడు రాంసింగ్, కారును ముందుకు కదిలించి రోడ్డుమీదికి పోనిస్తూ.

"జమలయ్య అలాగే చెపుతాడు....తన దగ్గిరికి వచ్చినవాడిని ఉట్టిచేతులతో వెనక్కి పోనియ్యడు. ఇంతకీ మనం ఎక్కడికి పోతున్నాం?" అన్నాడు దీపక్.

"అప్పుడెప్పుడో మనం సెకండ్‌షో సినిమా చూసివస్తూ గార్డెన్‌రెస్టారెంట్ దగ్గిర యాక్సిడెంట్ అయిన మనిషిని చూశాం....కేర్ హాస్పిటల్లో చేర్చాం. మీరు బ్లడ్‌కూడా ఇచ్చారు" ఒకటొకటిగా కొన్ని వివరాల్ని దీపక్‌కి గుర్తు చేయడానికి ప్రయత్నించాడు రాంసింగ్.

"అవును....మహబూబ్ నగర్‌నించి వచ్చిన మల్లేశం....అతనికి ఏదో ఫ్యాన్సీషాపు వుందని చెప్పిన గుర్తు" గుర్తుకుతెచ్చుకుంటూ చెప్పాడు దీపక్.

"అతనే చినబాబూ....ఇప్పుడు ఆ షాపు చాలా పెద్దది అయింది" అంటూ సడెన్‌గా ఒక మలుపులోకి ఎంటరై, మీడియమ్‌సైజు దాబాముందు కారాపాడు రాంసింగ్.

కారు హారన్ని గట్టిగా అదిమాడు. చటుక్కున వెలిగాయి దాబా

ముందుభాగంలోని లైట్లు. లుంగీని సవరించుకుంటూ ఒక క్యారెక్టర్ బయటికి వచ్చింది.

"మల్లేశం భాయ్....మా దీపక్‌బాబు వచ్చిండు" కారుదిగి అతనికి చెప్పాడు రాంసింగ్.

ఒక్క ఉదుటున కారు దగ్గిరికి వచ్చి, దీపక్ ముందు చేతులు జోడించాడు ఆ మనిషి.

"లోపలికి రండిబాబూ....ఒక్కసారి లోపలికి రండి" అంటూ ఎంతో మర్యాదగా ఆహ్వానించాడు.

"మా దీపక్‌బాబుకు టైములేదు. నీ దగ్గిర మంచి మ్యారేజ్ గిఫ్టులు వుంటే చూడు....అర్జెంట్" అతనికి చెప్పాడు రాంసింగ్.

"మ్యారేజి ఎక్కడ?" అడిగాడు మల్లేశ్.

"నానక్‌రామ్ కళ్యాణమండపంలో"

"మీరు వెళ్ళి అక్కడే వుండండి బాబూ. నేను షాపుకివెళ్ళి నాలుగైదురకాలు ఏవైనా మంచి గిఫ్టులు తిసుకువస్తా. సెలక్టు చేసుకుందురుగాని" అంటూ వెనక్కి తిరిగి ఇంట్లోకి పరిగెత్తాడు ఆ మనిషి.

"మంచి సరుకుంటుంది చినబాబూ....ధరకూడా న్యాయంగానే వుంటుంది" అని దీపక్‌కి చెబుతూ కారును వెనక్కి తిప్పాడు రాంసింగ్.

*   *   *   *

దారి మధ్యలో శృతిమేడమ్‌కి వచ్చేసింది ఒక అనుమానం. "నువ్వు మీ చిన్నబాబు దగ్గరికివస్తున్నట్టు మీ పెదబాబుగారికి తెలుసా?" అనిఅడిగింది.

"తెలియదు మేడమ్...."

"తెలిస్తే గొడవ చేస్తారేమో!"

"చెయ్యరు మేడమ్...." కాన్ఫిడెంట్‌గా సమాధానం చెప్పాడు రాంసింగ్.

"ఎందుకు చెయ్యరు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"ఎందుకంటే....మా చిన్నబాబుకీ డ్రయివర్ అవసరంకదా. అందుకని అక్కడ పని మానుకుంటున్నట్టు పీటర్‌కిచెప్పి వచ్చేశా. రేపు పొద్దున్నే ఆ మాట పెద్దబాబుకుచెప్పి, నాకు రావల్సిన జీతభత్యాల్ని పంపించేస్తాడు"



కూల్‌గా చెప్పాడు రాంసింగ్.

నివ్వెరపోయింది శృతిమేడమ్ ఆ మాటల్ని వినేసరికి.

కట్టుబట్టలతో బయటికి వచ్చేశాడు దీపక్. జేబులో పైసలున్నాయో లేవో కూడా తెలియడంలేదు....ఎక్కి తిరగడానికి అసలు మోటర్‌బైక్ కూడా వున్నట్టు కనిపించడంలేదు. ఇప్పుడు చేతులూపుకుంటూ వచ్చేశాడు రాంసింగ్....ఎలా అర్థంచేసుకోవాలి ఈ సంఘటనని?

దీపక్ రియాక్షన్ మాత్రం ఇంకోవిధంగా వుండేసరికి, తన ఆలోచనల్ని తనలోనే అదుముకుని అతనికేసి చూసింది ఆమె.

"నువ్వు చేసిన పని ఏం బాగోలేదు రాంసింగ్. తాతగారు చాలా ఇబ్బంది పడతారు...." కనులు చిట్లిస్తూ కొంచెం విసుగ్గా అన్నాడు దీపక్.

"ఆయన పడే ఇబ్బందికంటే మీరు పడే ఇబ్బందే ఎక్కువ చినబాబూ....రేపు ఈపాటికి నాలాంటోళ్ళని నలుగుర్ని తీసుకొచ్చి పనిలో పెట్టుకుంది మీ అత్తమ్మ. మరేం ఫరవాలేదు...." ఓపికగా చెప్పాడు రాంసింగ్.

"మనకి కారు లేదుగదా...." అన్నాడు దీపక్.

"అందుకేగదా చినబాబూ....ఈ బుజ్జిదాన్ని తీసుకొచ్చింది....నల్లకైపేట చెప్పాడు నా దోస్తు.

పాతికవేలకు బేరం అడి తీసుకొచ్చేశా....రేపో ఎల్లుండో పీలు చూసుకుని జమలయ్య దగ్గిరికి తీసుకుపోతే సూపర్‌గా తయారవుతుంది" అన్నాడు.

"పాతికవేలైనా పేమెంట్ ఎలా చేయాలి రాంసింగ్....నా దగ్గిర ఇప్పుడు ఇంకో పదివేలే వున్నాయి. రెండుమూడు రోజుల్లో పేమెంట్ చేస్తానని చెప్పి నషీలీకి గాజులు, పెళ్ళిబట్టలు తీసుకున్నాను. ఆ బాకీకూడా డ్యూ అవుతోందికదా" సీటువెనక్కి వాలి కూర్చుని, నుదురు రుద్దుకుంటూ అన్నాడు దీపక్.

"నగలకీ, చీరలబాకీ మీరు చూసుకోండి చిన్నబాబూ....కారు బాకీ వచ్చేపోంది. నా దోస్తును ఒక పదిరోజులు ఆగమని చెప్పా. ఇంకో పదిరోజులైనా వాడు ఆగుతాడు. మనకి కారు వుండాలి—లేకపోతే చాలా

ఇబ్బంది" హుషారుగా చెప్పాడు రాంసింగ్.

అతని భరోసాని చూస్తుంటే ఉక్కిరిబిక్కిరి అయినంత ఆశ్చర్య పడింది శృతిమేడమ్.

"నా దగ్గిర డబ్బులు వున్నాయి. అవసరం అనుకుంటే ఎంత కా లన్నా నేను ఇవ్వగలను" నెమ్మదిగా దీపక్‌తో చెప్పింది శృతిమేడమ్.

"అవసరంలేదు శృతీ....ఈ బాకీలు నథింగ్—రేపు నేను ఏదో ఒకటి ఆలోచిస్తాను" అంటూ ఆమెకుచెప్పి, "రాంసింగ్—మనకి ఇల్లు కావాలి. రావడమైతే పెద్ద మొనగాడిలా బయటికి వచ్చేశా—ఎక్కడ వుండాలో తెలియడంలేదు" అని రాంసింగ్‌తో చెప్పాడు.

"మా ఇంటికి రావచ్చు. మేడమీద గదులన్నీ ఖాళీగానే వున్నాయి" వెంటనే చెప్పింది శృతిమేడమ్.

"అవసరంలేదు మేడమ్. రామంతపూర్లో నాలుగు అపార్ట్‌మెంట్లు ఖాళీగానే వున్నాయి. కాని అవి పెద్దబాబుగారివి కాబట్టి వెళ్ళడం మర్యాద అనిపించుకోదు. ఆయన పట్టించుకోకపోయినా చిన్నబాబు అత్తమ్మగారు గోలగోల చేసేస్తుంది. ఆమె దగ్గిర మా పరువు పోవడం మాకుఇష్టంలేదు" అంటూ క్షణం ఆలోచించి.

"చిన్నబాబూ—మీరు మీ దోస్తులు కలిసి కంబైన్డ్‌గా చదువుకోవడానికి శాలిని అపార్ట్‌మెంట్ అద్దెకు—" అంటూ మాట ఆపాడు రాంసింగ్.

చిన్నగా నవ్వి సీట్లో నిదారుగా కూర్చున్నాడు దీపక్. "ఎస్—నేను కూడా అదే అనుకుంటున్నా. హ్యాపీగా అక్కడ సెటిల్ అయి పోవచ్చు" అంటూ శృతిమేడమ్‌వంక చూశాడు.

"మా ఇంటికి రావడానికి ఏమిటి నీకు అభ్యంతరం?" శృతిమేడమ్ అడిగింది.

"బాగుండదు శృతీ—ఎక్కడా చోటు దొరకనట్టు నా లాయర్ దగ్గరికి పోయావా అని తాతగారు వెక్కిరించవచ్చు—" ఓపికగా చెప్పాడతను.

అందుకు శృతిమేడమ్ సమాధానం రెడి చేసుకోకముందే, కళ్యాణ మండపం దగ్గిరికి, వచ్చేసింది కారు. దీపక్‌కోసం ఎదురుచూస్తున్నట్టు



చీడతలదండు మాదిరి వచ్చేశారు అతని ఫ్రెండ్స్. "మాహూర్తం దగ్గిరికి వచ్చేసిందిట....దినేష్‌గాడు గోల నషీలీ అయితే ఏడుపు ఒకటే తక్కువ. ఎక్కడికి పోయావురా బాబూ?" అంటూ అతని పక్కనే వున్న శృతిని చూసి ఫర్దర్‌గా మాటలు మింగేశారు.

పెద్దపెద్ద అడుగులు వేస్తూ లోపలికి పోయాడు దీపక్. అతను చెయ్యిపట్టుకుని తనను లీడ్‌చేస్తాడేమోనని ఊపిరి బిగబట్టింది శృతి. అతను పట్టుకోలేదు....ఎందుకనో కొద్దిపాటి నిరాశ కలిగింది.

"పెళ్ళికూతుర్ని తీసుకురండి...." అని అరుస్తున్న పురోహితుడి దగ్గిరికిపోయి నిలబడ్డాడు దీపక్. దినేష్ తల్లిగారితో కలిసి నషీలీని తీసుకు వచ్చింది శృతి.

"ఏం తల్లీ....మా పద్ధతిప్రకారం చేస్తున్నాం ఈ పెళ్ళి....నీ అభిప్రాయాన్ని అడగటం మర్చిపోయాం....ఇప్పటికైనా మించిపోయిందిలేదు. రిజిస్ట్రార్‌గారిని తీసుకువచ్చాం. సంతకాలు పెట్టి దండలు మార్చుకుంటానంటే మాకు ఓ.కే....ఆలోచించి చెప్పు...." పీటలమీద కూర్చోకముందే నషీలీని అడిగాడు దినేష్‌ఫాదర్. సమాధానం ఇవ్వడానికి తడబడి, దీపక్ వైపు చూసిందామె.

ఇప్పటికిప్పుడు ఒంటరిపిల్లను చేసి చెప్పుచెప్పంటూ వెంటపడితే ఏం చెపుతుంది అంకుల్....తనకి టైమ్ కావాలి....ఉయ్ విల్‌డూ వన్ థింగ్....మీ పద్ధతి ప్రకారం దినేష్ చేయాల్సిన పనుల్ని చేయించండి....తను దండలు మార్చుకుంటుంది....వాళ్ళిద్దరూ ఒకటయ్యాక ఏ పద్ధతిని అనుసరించాలో వాళ్ళే నిర్ణయించుకుంటారు" ఆమె తరపున చాలా బోల్డ్‌గా చెప్పాడు దీపక్.

రెండో మాట మాట్లాడకుండా దూరంగా వున్న రిజిష్ట్రార్‌ని దగ్గిరికి పిలిచి, దండలు మార్పించాడు దినేష్ ఫాదర్. సంతకాలు చేయించి, కొడుకుని, కోడల్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

"దీపక్....నా గిఫ్ట్ రాలేదు" అభినందనల పర్వం స్టార్ట్ అవుతుండగా సడెన్‌గా గుర్తుచేసింది శృతి.

"అదుగో....రాంసింగ్ వెయిట్‌చేస్తున్నాడు" అంటూ ఆమెను ఒక కార్నర్‌లోకి తీసుకుపోయాడు.

నాలుగు ప్యాకెట్లను మాత్రమే పట్టుకువచ్చాడు రాంసింగ్. "వీటిలో మీకు నచ్చింది సెలక్ట్ చేసుకుని, మిగిలిన ప్యాకెట్లు తెల్లారిన తర్వాత రిటన్ చేయమన్నాడు మల్లేశం" అంటూ వాటిని చూపించాడు.

కళ్ళు తిరిగిపోయేటంత ఖరీదైన బహుమతులు కావు అవి....ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేయబడిన ఆర్డినరీ ఆర్ట్ ఐటమ్‌లు. ప్యాకెట్లను ఓపెన్ చేసిన వెంటనే ఆమె కళ్ళను ఆకట్టుకుంది ఒక ఐటమ్. తన ఒళ్ళో తల పెట్టి పడుకున్న యువకుడి ముఖంలోకి అమితమైన ఆరాధనతో చూస్తోందొక యువతి....గుండెల్ని పట్టి మెలిపెట్టే మధురమైన భావన ఆ ఆర్ట్ పీస్‌లో సుస్పష్టంగా కనిపిస్తోంది. చూపుల్ని పక్కకు తిప్పుకోనివ్వకుండా నిలబెట్టేస్తోంది.

"ఐ లైక్ ఇట్....ఇంత తక్కువ ధరలో ఇటువంటి ఐటమ్ దొరుకుతుందంటే నమ్మబుద్ధికావడంలేదు. నషీలీ దినేష్‌ల పెళ్ళికి ప్రజెంట్ చేయదగిన సూపర్ గిఫ్ట్ ఇదొక్కటే" అంటూ ఆ ప్యాకెట్‌ని సెలక్ట్ చేసింది.

ఆరితేరిన పేకర్ మాదిరి చకచకా ఆ ప్యాకెట్‌ని గిఫ్ట్ పేపర్లో అందంగా బిగించేసి, శుభాకాంక్షలు తెలిపే క్లిప్‌ని పిన్ చేసేశాడు రాంసింగ్.

"దీనికి పేమెంట్ చెయ్యాలిగదా...." తన హ్యాండ్‌బ్యాగ్‌ని తెరవబోతూ అడిగింది శృతిమేడమ్.

"రేపు ఇవ్వవచ్చు....ఇప్పుడు వద్దు" అంటూ సాభిప్రాయంగా దీపక్ వైపు చూశాడు రాంసింగ్. అతను తల ఊపడంతో తను మాట్లాడిన మాటలు కరెక్ట్ అయినట్లు సంతోషిస్తూ, బయటికి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు నీకున్న బాధల్లో నా గిఫ్ట్‌కి పేమెంట్ కూడా తోడవడం నాకు ఇష్టంలేదు" వాళ్ళ చూపుల్లో వున్న అర్థాన్ని వెంటనే పసిగట్టి కోపంగా అంది శృతిమేడమ్.

తల తెగినవాడికి తలనొప్పి వస్తే ఎలా వుంటుంది శృతీ?" నిర్వికారంగా అన్నాడు దీపక్.

ఒక్కసారిగా ఎందుకో ఝల్లుమంది శృతిమేడమ్ శరీరం. తల్లిగారితో గొడవపడటం, ఇంట్లోనుంచి బయటికి వచ్చేయడం మొదలైన



విషయాలన్నిటినీ అతను సీరియస్‌గా తీసుకోవడంలేదనే అనుకుంటున్నది ఆమె అప్పటివరకూ....అతను మాట్లాడిన ఒక్క మాటతో ఎటువంటి బాధ అతని గుండెల్ని కెలికివేస్తోందో, తెలిసివచ్చేసరికి, ఏం మాట్లాడాలో అర్థంకాలేదామెకి.

అర్ధరాత్రి సమయంలో మెలకువ వచ్చేసరికి తన పక్కనే పడుకుని వుండాల్సిన తల్లి, తండ్రి కనిపించకపోతే నాలుగు సంవత్సరాల పసివాడు ఎలా రియాక్ట్ అవుతాడో, ఆమెకు అలాగే కనిపించాడు దీపక్.

అతన్ని కౌగిలించుకుని, అతని తలను గుండెలకు అదుముకుని ఓదార్చాలన్న కోరిక ఒక్కసారిగా ఆమెను ఆవరించుకుంది.

ఆ కోరిక ఒక్కటేకాదు. అతని మదర్ తరపునుంచి వచ్చే ఇన్‌హెరిటెన్స్ గురించి కూడా చెప్పేస్తే, దీపక్ ప్రాబ్లమ్స్ అన్నీ సాల్వ్ అయిపోతాయేమోనన్న ఆలోచన కూడా శృతిమేడమ్‌కు తగిలింది.

అంతలోనే ఆమె వెన్నుతట్టి హెచ్చరించింది వివేకం.

ఇంట్లోనుంచి బయటికి వచ్చేసిన తర్వాత అతని పద్ధతులు ఎలా వుంటాయో క్లోజ్‌గా అబ్జర్వ్ చేయడానికి తగిన ఇలాంటి అవకాశం కావాలన్నా, మళ్ళీ మరొకటి రాదు. చిన్నచిన్న అలజడులను చూసి టెంప్ట్ అయిపోకూడదు తను....స్ట్రాంగ్‌గా నిలబడాలి.

ఒకే ఒక్క క్షణంలో సినిమారీళ్ళమాదిరి చకచకా తన మనసులోకి వచ్చిన ఆ థాట్స్ అన్నింటినీ అతిప్రయత్నంమీద అదుముకుని, దీపక్‌తోపాటు నూతన వధూవరుల దగ్గిరికి వెళ్ళింది ఆమె.

మానసికమైన అలసట కారణంగా తామరాకు మాదిరి వడిలిపోయింది నషీలీ ముఖం. అయినాసరే అద్భుతంగా కనిపిస్తోంది ఆమె రూపం.

అందరూ చూస్తూండగా శృతిమేడమ్ తనకు ఇచ్చిన ప్యాకెట్‌ని, వారందరిముందే ఓపెన్‌చేసింది ఆమె.

"వావ్! వాట్ ఎ వండర్‌ఫుల్ గిఫ్ట్....ఇటీజ్ ఎ రేర్ ఆర్ట్ పీస్. రియల్లీ ఫెంటాస్టిక్....ఇటువంటి గిఫ్ట్ దొరుకుతుందేమోనని మొన్న రెండురోజులపాటు సిటీలో వున్న షాపులన్నీ తిరిగిచూశాను....ఉపయోగం లేకపోయింది. వేర్ డిడ్ యూ ఫైండ్ ఇట్?" క్షణంకూడా ఆలస్యం చేయకుండా శృతిని అడిగింది పెళ్ళికి వచ్చిన దినేష్ బంధువుల్లో ఒక టీనేజ్

గర్ల్.

తను నషీలీకి ప్రజెంట్‌చేసిన ఆ బొమ్మ అంతమందిలో ప్రత్యేకంగా గుర్తింపుపొందడం ఎనలేని సంతోషాన్ని కలిగించింది శృతిమేడమ్‌కి.

"....ఇది ఎక్కడ దొరికిందో దీపక్‌కి మాత్రమే తెలుసు. నాకు తెలియదు" అంటూ దీపక్ వైపు చూపిందామె.

"మోడ్రన్ డ్రెస్‌లో ముద్దుముద్దుగా కనిపిస్తున్న ఆ టీనేజర్ దీపక్‌ని ఇంప్రెస్ చేయలేకపోవడాన్ని క్లియర్‌గా అబ్జర్వ్‌చేసింది శృతిమేడమ్.

"ఇది మాకు బాగా తెలిసిన షాపు ఓనర్ తీసుకువచ్చి ఇచ్చాడు. ఇలాంటివి కావాలంటే అతని దగ్గిరికెళ్ళండి" అంటూ ఆ షాపు అడ్రసు కోసం తడుముకున్నాడు దీపక్.

"క్రాస్‌రోడ్స్ దగ్గిర వుంది. దివ్యా శారీ సెంటర్ పక్కన...." క్షణం కూడా ఆలస్యం చేయకుండా మాట అందించాడు. అప్పుడే వచ్చి విషయం గ్రహించి ఒక పక్కగా నిలబడిన రాంసింగ్.

ఎర్రెర్రగా లిప్‌స్టిక్ పూసిన పెదవుల్ని సున్నాలాగా చుట్టి, ఆ అడ్రస్‌ను వెంటనే తన హ్యాండ్‌బ్యాగ్‌లో వున్న నోట్‌బుక్‌మీద నోట్ చేసుకుంది ఆ టీనేజర్.

అక్కడితో ఆ టీనేజర్ గురించి పూర్తిగా మరిచిపోయాడు దీపక్. వెంటనే అక్కడ్నించి దినేష్ తల్లిదండ్రుల దగ్గిరికిపోయి, "పెద్దమనసుతో ఈ పెళ్ళికి ఒప్పుకున్నందుకు మీకు ఇంకోసారి థ్యాంక్స్ చెప్పాలని అనిపించింది అంకుల్. నషీలీ ఒంటరితనం ఫీలయితే, తన తరపున మాట్లాడేందుకు నేను, మా ఫ్రెండ్స్ అందరమూ వున్నామని చెప్పండి" అని అన్నాడు.

ఆశ్చర్యంగా చూసి, దీపక్‌ని గాఢంగా కౌగలించుకున్నాడు దినేష్ ఫాదర్.

"మీ ఫాదర్ నాకు బాగా తెలుసు. ఆ రోజుల్లో అతను కూడా ఇంతే. డేరింగ్ అండ్ డేషింగ్ హీమేన్. తను చేయదలుచుకున్న పనికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎవరైనా లెక్కచేసేవాడు కాదు.

నా అరుపుల్ని లక్ష్యపెట్టకుండా, ఓపిగ్గా నాకు నచ్చజెప్పిన నీ పేషెన్స్‌ని అప్రిషియేట్ చేస్తున్నాను. నువ్వు కాదు థాంక్స్ చెప్పాల్సింది



బంగారంలాంటి కోడల్ని నాకు అందించిన నీకు నేను చెప్పాలి. నీతోపాటు మీ ఫ్రెండ్స్‌కి కూడా...." ఆర్ద్రంగా అన్నాడు.

"అదేంటి అంకుల్....మా దినేష్‌గాడు సుఖంగా, సంతోషంగా వుండాలనేది మా అందరి కోరిక.

"సొ హి ఈజ్ హ్యాపీ....మాకు అది చాలు...." అంటూ ఇవతలికి వచ్చేశాడు దీపక్.

* * * *

దినేష్‌కి బై చెప్పాడు. నషీలీ భుజంతట్టి ధైర్యాన్నిచ్చే మాటలు రెండు మాట్లాడాడు. మౌనంగా నిలబడి కీన్‌గా అబ్జర్వ్ చేస్తున్న శృతి మేడమ్ దగ్గిరికొచ్చి నొసలు ఎగురవేశాడు.

"లేట్ అవర్స్‌లో ఈ సెర్మనీపెట్టుకోవడంవల్ల డిన్నర్ అరేంజ్‌మెంట్స్ సరిగ్గా కుదరలేదుట. నువ్వు భోజనం చేయలేదని నీ ముఖం చూస్తుంటేనే తెలుస్తోంది. ఇక్కడ వీళ్ళు సర్వ్‌చేస్తున్న కూల్‌డ్రింక్స్ తాగడం అనవసరం. నాతోపాటు ఇంటికి వస్తే భోజనం చేసేయచ్చు" అతని పక్కనే నడుస్తూ చెప్పింది శృతి.

"అవసరంలేదు శృతీ....ఆకలిలేదు. అంతగా అవసరమైతే మా రాంసింగ్ వున్నాడుగా....ఏదో ఒకటి అరేంజ్ చేస్తాడు" అంటూ సూటిగా పార్కింగ్ లాట్ దగ్గిరకి ఆమెను లీడ్‌చేశాడు.

దూరంలో వుండగానే చూశాడు కాబోలు, కారును స్టార్ట్‌చేసి, ముందుకు తీసుకువచ్చాడు లాయర్‌గారి డ్రయివర్.

"నేను నిన్ను కాంటాక్ట్ చెయ్యాలంటే ఎలా?" కార్లో కూర్చుంటూ దీపక్‌ని అడిగింది.

"నా దగ్గిర సెల్‌లేదు. మా రాంసింగ్ నెంబర్‌కి రింగ్‌చెయ్యి. నేను మాట్లాడతాను" అంటూ రాంసింగ్ ఫోన్ నెంబర్ ఆమెకు చెప్పాడు దీపక్.

గుడ్‌నైట్ చెప్పి డ్రయివర్‌కి సైగచేసింది శృతిమేడమ్.

స్పీడ్‌గా డ్రయివ్‌చేసి అర్ధగంటలో శృతిమేడమ్‌ను ఇంటికి తీసుకుపోయాడతను.

# 14

"దీపక్ బాబూ....దీపక్ బాబూ...." అంటూ శాలిని అపార్ట్‌మెంట్స్ దీపక్ బసచేసిన అపార్టుమెంట్ ఓనర్ వచ్చేసరికి ఉలిక్కిపడి చూశాడు రాంసింగ్.

"దీపక్ బాబును నిద్రలేపు. ఒక ముఖ్యమైన విషయం మాట్లాలి" ముందుగదిలో వున్న కుర్చీలో కూర్చుంటూ అతనికి చెప్పాడు ఆ పెద్ద మనిషి.

"మా చిన్నబాబు రాత్రి పడుకునేసరికి బాగా లేట్ అయింది. ఇంకో మూడుగంటలవరకూ నిద్రలేవడు" నిర్మొహమాటంగా చెప్పాడు రాంసింగ్.

"నేను ఆఫీసుకు వెళ్ళిపోవాలి. అంత సేపు వెయిట్ చేయడం నాకు కుదరదు" ముఖం ముడుచుకుంటూ చెప్పాడు అపార్ట్‌మెంట్ ఓనర్.

"కుదరకపోతే సాయంత్రం రండి. లేదా రేపు ఎనిమిదింటికి రండి. ఇప్పుడు మాత్రం దీపక్ బాబు నిద్రలేవడం జరగదు" ఖరాఖండీగా ఎనౌన్స్ చేసేశాడు రాంసింగ్.

కోపం వచ్చేసింది ఆ పెద్దమనిషికి.

స్పీడ్‌గా నోరు తెరిచాడు ఏదో అనడానికి.

"వద్దు....అనవసరమైన మాటలు మాట్లాడి ఆ తర్వాత బాధపడ వద్దు. మా చిన్నబాబుతో ఏం మాట్లాడాలనుకుంటున్నారో చెప్పండి. బాబు లేచిన తర్వాత మేము చెపుతాం" అంగుమంటూ కొత్తకంఠం వినిపించేసరికి అదిరిపడి ముఖద్వారంవైపు చూశాడతను.

ముఖానికి పట్టిన చెమటను భుజంమీది కండువాకి తుడుచుకుంటూ అతనికి కనిపించాడు గండయ్య.

"ఏరా గండయ్యా....ఏంటి పొద్దున్నే ఇలా తగలడ్డావ్? ఠాణా తగలేశారా నిన్ను?" ఆశ్చర్యంగా అడుగుతున్న రాంసింగ్‌ని ఆగమని సైగచేసి, అపార్ట్‌మెంట్ ఓనర్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు గండయ్య.

"స్టూడెంట్స్‌కి అద్దెకు ఇస్తే రెంట్ సరిగ్గా వసూలుకాదని చెప్పి, ఆరునెలల అద్దె అడ్వాన్స్‌గా నా దగ్గిర వుండాలని చెప్పాను. ఆ అమౌంట్



అయితే ఇచ్చారుగాని, రెండు నెలలనుంచీ రెంట్ ఇవ్వడంలేదు. అది ఇవ్వకపోతే వెంటనే ఖాళీ చేసేయాలని చెప్పడానికి వచ్చాను" తానెందుకు వచ్చాడో స్పష్టంగా చెప్పాడు ఓనర్.

"నీకు అద్దె కావాలి. అంతేకదా?" గంభీరంగా అడిగాడు గండయ్య ఓనర్‌వంక చూస్తూ.

"అవును....అంతే" అన్నాడతను.

"ఒక నాలుగురోజులు టైమ్ ఇవ్వు. ఇచ్చేస్తాం. ఇప్పుడు మాత్రం వెళ్ళిపో" అన్నాడు గండయ్య.

"ఇప్పటికి ఆరుసార్లు వచ్చాను. ఎవరూ సమాధానం చెప్పడంలేదు. ఆఖరిసారిగా చెపుతున్నాను. నాలుగు రోజుల తర్వాత అద్దె ఇవ్వకపోతే ఖాళీచేయాల్సిందే" కోపంగా చెప్పి విసవిసా వెళ్ళిపోయాడు ఓనర్.

"చిన్నబాబు దగ్గిర డబ్బులు తక్కువగా వున్నాయ్. వెనకాముందూ చూసుకోకుండా వ్యవధి అడిగావ్....ఇప్పుడేం చేయాలి?" అన్నాడు రాంసింగ్.

"ఏదో ఒకటి చేద్దాంగాని, నువ్వు కంగారుపడకు. చిన్నబాబు లేచేసరికి కాఫీ రెడీచేయాలి. సరుకులు వున్నయ్యా?" అడిగాడు గండయ్య.

"ఇది స్టూడెంట్స్ వుండే గది. సిగరెట్ పీకలు, చింపేసిన కాయితాలు తప్ప ఇంకేమీ లేవు....వుండవు" నొసలువిరుస్తూ చెప్పాడు రాంసింగ్.

"ఫ్లాస్కు కూడా లేదా?" అని అడుగుతూ గబగబా కిచెన్‌లోకి పోయాడు గండయ్య.

వెళ్ళిన వెంటనే కనిపించింది అతనికి సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన వెలువరుస్తున్న థర్మాస్ ఫ్లాస్కు ఒకటి. అరగంట పట్టింది అతనికి దాన్ని శుభ్రం చేయడానికి. "నేను వెళ్ళి కాఫీ తీసుకువస్తాను" అంటూ ఫ్లాస్కుతో బయటికి వచ్చాడతను.

* * * *

బయటికివచ్చి మూడు అడుగులు వేశాడో లేదో, బర్రుమంటూ వచ్చి అతని పక్కన ఆగింది శృతిమేడమ్ డ్రయివ్‌చేస్తున్న లాయర్‌సాబ్

కారు.

ఫ్లాస్కు పట్టుకుని వీరాధివీరుడిలా నిలబడిన గండయ్యనుచూసేసరికి ఆమెను ఒక్కసారిగా ఆవరించుకుంది అపరిమితమైన ఆశ్చర్యం. "ఏంటి గండయ్యా? నువ్వు కూడా పనిమానుకుని వచ్చేశావా?" అని అతనిముఖం మీదే అడిగేసింది శృతిమేడమ్

"తెల్లారి లేచినదగ్గిర్నించీ ఎవరో ఒకరు పక్కనవుండి కావల్సినవన్నీ చేతికి అందించాలి మేడమ్. ఒక్కసారిగా అలవాట్లను మార్చుకోమంటే, మారవుకదా. అందుకే పదిరోజులు సెలవుకావాలని చెప్పి వచ్చేశా" తనేదో ఘనకార్యం చేసినట్టు ఆమెకు చెప్పాడు గండయ్య.

"బాగానే వుంది. లోపల లంచ్‌బాక్స్, కాఫీ ఫ్లాస్కు వున్నాయి. తీసుకురా" అంటూ కారుదిగి అపార్ట్‌మెంట్స్ ఆవరణలోకి ఎంటర్ అయింది శృతిమేడమ్.

రెండోసారి చెప్పాల్సిన అవసరం లేకుండా,ఆమె సూచించిన సరంజామానంతా కారులోనుంచి తీసి ఆమె వెనుకే అడుగులువేశాడు గండయ్య.

"మేడమ్....చిన్నబాబు ఇక్కడ వున్నాడని మీకు ఎలా తెలుసు?" అని అడిగాడు గండయ్య.

"ఈ అపార్ట్‌మెంట్స్‌లో సెకండ్ ఫ్లోర్ అంతా మా మామయ్యదే. మీ చిన్నబాబు థర్డ్‌ఫ్లోర్ కదూ?" అంటూ లిఫ్ట్‌లోకి ఎంటర్ అయిందామె.

చేతుల్లో వున్న సామగ్రిని కిందపెట్టకుండా, గబగబా మోచేతితోనే థర్డ్‌ఫ్లోర్‌కి తీసుకుపోయే బటన్‌ని ప్రెస్‌చేశాడు గండయ్య. పదే పది క్షణాల్లో పైకి చేరుకున్నారు ఇద్దరూ.

అపార్ట్‌మెంట్ వెలుపల నిలబడివున్న రాంసింగ్ శృతిమేడమ్‌ని చూసి, దంతాలన్నీ కనబడేటట్లు నవ్వాడు.

"చిన్నబాబు ఇప్పుడే లేచాడు. రండమ్మా....లోపలికి రండి" అంటూ ఆహ్వానించాడు.

"క్లీనింగ్ ప్రాసెస్ సరిగ్గా లేకపోవడంవల్ల, మురికిగా కనిపిస్తున్న గోడల్ని, ఫ్లోరింగ్‌ని చూసి అసహ్యంగా నొసలు విరిచింది శృతిమేడమ్.

"బజారుకువెళ్ళి చీపుర్లు, ఫ్లోర్‌ని క్లీన్‌చేసే డిటర్జెంట్లు తీసుకురండి.



అర్జెంట్‌గా శుభ్రం చేయాలి. మనుషులు నివసించే ప్రదేశం మాదిరి కనిపించడంలేదు" తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియచేసింది శృతిమేడమ్.

అప్పుడే బాత్‌రూమ్‌లోనుంచి బయటికి వచ్చాడు దీపక్. ఆమెను చూడగానే అందంగా నవ్వాడు.

"బ్యాచిలర్స్ డెన్ ఇది. ఫ్యామిలీ నివసించడంలేదు. నువ్వు దగ్గిరవుండి ఇవాళ క్లీన్ చేయించినా, ఎల్లుండి మళ్ళీ ఇదేమాదిరి తయారైపోతుంది...." అంటూ వచ్చి ఆమెకు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మేడమ్ మీకు కాఫీ టిఫిన్ తీసుకువచ్చారు చిన్నబాబూ" చెప్పాడు గండయ్య.

లంచ్ బాక్స్‌తోపాటు శృతి తీసుకువచ్చిన కప్పుల్లో కాఫీ పోసి, అతనికి, ఆమెకు అందించాడు గండయ్య.

"నువ్వు, రాంసింగ్ మీరిద్దరూ కూడా తీసుకోండి. ఫ్లాస్కులో ఇంకా చాలా వుంది" అంటూ దీపక్ వంక చూసింది శృతిమేడమ్.

"కాఫీ బాగుంది. ఎవరు చేశారు?" అడిగాడతను.

"నేనే....నేను బయలుదేరే సమయానికి మా అత్తయ్య ఇంకా నిద్రలేవలేదు" చెప్పింది ఆమె.

"రియల్లీ....వెరీగుడ్" అంటూ శృతిమేడమ్‌ని ఇంకోసారి మెచ్చుకున్నాడు దీపక్.

సంతోషం కలిగింది శృతిమేడమ్‌కి.

"టిఫిన్ కూడా నేనే చేశాను. అది కూడా తిని నీ అభిప్రాయం ఏంటో చెప్పు" అంది.

"టిఫిన్ కూడా బాగానే వుంటుంది. కాఫీ సూపర్‌గా పెట్టగలిగినవాళ్ళు టిఫిన్ సూపర్‌గానే తయారుచేయగలరు.నోడౌట్ ఎబౌట్ ఇట్...."

ఇంకా ఇంకా కలిగింది శృతిమేడమ్‌కి సంతోషం.

"నీతో ఒక విషయం సీరియస్‌గా మాట్లాడాలని వచ్చాను. నువ్వు సిగరెట్ కాల్చుకోదలుచుకుంటే నిరభ్యంతరంగా కాల్చుకో....ఐ హేవ్ నో అబ్జెక్షన్" అంది శృతిమేడమ్.

* * * *

అ మాట ఆమె పెదవుల్ని దాటగానే, తన దగ్గిర వున్న సిగరెట్ ప్యాకెట్‌ని, అగ్గిపెట్టెని బయటికి తీసి దీపక్‌కి అందించాడు రాంసింగ్.

"నువ్వు ఒకసారి ఇంటికి వెళ్ళి మీ తాతగారితో మాట్లాడితే ఎలా వుంటుంది?" దీపక్ ముఖాన్ని కీన్‌గా అబ్జర్వ్ చేస్తూ అడిగింది శృతి మేడమ్.

"ఒకసారి కాదు....వందసార్లు మాట్లాడినా పరిస్థితిలో తేడా ఏమీ రాదు. పైపెచ్చు బయటికిపోయి బతకడం చేతకాక మళ్ళీ వెనక్కి వచ్చావని వెక్కిరిస్తారు" నిర్లిప్తంగా సమాధానం ఇచ్చాడు దీపక్.

"దెన్....వాట్ యువ్వార్ గోయింగ్ టు డూ....? బతకడానికి పౌరుషం ఒక్కటి వుంటే చాలదు. డబ్బు కావాలి. పోనీ నీ చదువు పూర్తి అయ్యేవరకూ ఎక్స్‌పెన్సెస్ అన్నీ మా మామయ్యని భరించమని అడిగితే?"

"సారీ శృతీ....ఒకళ్ళముందుకుపోయి నా పరిస్థితిని చెప్పుకోవడం నాకిష్టంలేదు. ఇవాళో, రేపో ఏదో ఒక పార్ట్‌టైమ్ జాబ్ వెతుక్కుంటాను. కష్టపడి పనిచేసి నా మెయింటెనెన్స్ ఖర్చులు సంపాదించుకుంటాను."

"ఆలోచనయితే ఓ.కే....బాగానే వుంది. కాని ఆచరణ ఎలా" అడిగింది శృతిమేడమ్.

"రెండురోజులు ఆగిన తర్వాత నీకే తెలుస్తుంది. నాట్‌నౌ...." అంటూ సగంవరకూ కాలిన సిగరెట్‌ని రాంసింగ్ చేతికి అందించాడు దీపక్.

అతను దాన్ని అతిజాగ్రత్తగా తీసుకుపోయి అపార్ట్‌మెంట్ వెలుపల ఒక డస్ట్‌బిన్‌లో పడేసి వచ్చాడు.

"నువ్వు ఏ పార్ట్‌టైమ్ జాబ్ చేసినా, నీ వరకూ కావాల్సిన డబ్బుల్ని సంపాదించుకోగలవు. కాని నువ్వు ఒక్కడివే కాదు" అంటూ సాభిప్రాయంగా రాంసింగ్‌వైపు, గండయ్యవైపు చూపించింది శృతి మేడమ్.

"నో ప్రాబ్లెమ్ శృతీ....ఐయామ్ ష్యూర్ దట్ ఐకెన్ మేనేజ్... యూ డోన్ట్‌వర్రీ. రేపు కాకుండా ఎల్లుండి ఒకసారి ఇక్కడికి రా. నువ్వే చూద్దువుగాని" హుషారుగా అన్నాడు దీపక్.



"నువ్వు నా గురించి ఏమనుకున్నాసరే....అదేంటో, అది ఎలా సాధ్యపడుతుందో నాకు చెప్పితీరాల్సిందే" మొండిపట్టుపడుతున్నట్లు అడిగింది.

తన ఛైర్ పక్కనే పడేసివున్న న్యూస్‌పేపర్ని పైకితీసి ఫ్రంట్ పేజీలోనే ప్రముఖంగా ప్రింట్ చేయబడి వున్న ఒక న్యూస్ ఐటమ్‌ని ఆమెకు చూపించాడు దీపక్.

"మా రాంసింగ్ తీసుకువచ్చిన కారు ఇప్పుడే జమలయ్య దగ్గిరికి పంపిస్తాను. జమలయ్య తలుచుకుంటే ఎటువంటి డొక్కు కారునయినా రేస్ కారులా తయారుచేయగలడు" అంటూ ఆ న్యూస్ ఐటమ్‌ని చదివి వినిపించాడు,

అతని మాటలను ఫాలో అవడంతో ఆగకుండా, ముందుకు వంగి తనే స్వయంగా చదివింది శృతిమేడమ్.

* * * *

అంతకుముందెన్నడూ లేనివిధంగా, సిటీ అవుట్ స్కర్ట్స్‌లో ఒక కార్లపందెం ఆర్గనైజ్ చేయబడుతోందిట ఒక ప్రముఖ లిక్కర్ కంపెనీ ఆధ్వర్యంలో.

పదివేల రూపాయల ఎంట్రీ ఫీజ్ కట్టగలిగినవాళ్ళు ఎవరైనాసరే ఆ పందెంలో పాల్గొనడానికి అర్హులట.

ఫస్ట్ వచ్చినవారికి పదిలక్షల యాభైవేలు ప్రైజ్‌మనీ, సెకండ్ ప్లేసులో వున్నవారికి ఫైవ్ లాక్స్ అండ్ ఆడ్‌మనీ చెల్లింపబడుతుందిట.

"అది....ఆ పందెం చాలా టఫ్‌గా వుండచ్చు. ఎక్కడెక్కడినించో స్పెషలిస్టులు వస్తారు. వాళ్ళ దగ్గిర నెంబర్‌వన్ వెహికిల్స్ వుంటాయి" అతని ఉత్సాహాన్ని కొంచెంగా తగ్గించడానికి ట్రై చేసింది శృతిమేడమ్.

"యూ డోన్ట్‌వర్రీ శృతీ....నేను మా రాంసింగ్ దగ్గిర డ్రైవింగ్ నేర్చుకున్నాను. చదువు లేకపోవడంవల్లతను కారు డ్రైవర్‌గా వుండిపోయాడుగాని, లేకుంటే ఈపాటికి వరల్డ్‌క్లాస్ రేసెస్‌లో నెంబర్ వన్‌గా నిలబడి వుండేవాడు. ఐయామ్ గోయింగ్ టు విన్‌దిస్" కాన్ఫిడెంట్‌గా చెప్తూ రాంసింగ్ వైపు చూశాడు దీపక్,

"నువ్వు అంత ష్యూర్ అండ్ సర్టెన్ అని అనుకుంటున్నప్పుడు

ఒకపని చెయ్యి. మా మామయ్య ఫ్రెండ్స్ దగ్గిర మంచి మంచి కార్లు వున్నాయి. వాటిలో ఒకదాన్ని సెలక్ట్ చేద్దాం. మా మామయ్య అడిగితే వాళ్ళు కాదనకుండా యిస్తారు. హౌ ఎబౌట్ ఇట్?" తను కూడా కొంచెం కాన్ఫిడెన్స్‌ని ఫీల్ అవుతూ చెప్పింది శృతిమేడమ్.

అంతవరకూ మౌనంగా వున్న రాంసింగ్ వెంటనే అడ్డుకున్నాడు ఆ మాటల్ని.

"వేరేవాళ్ళ కార్లు మనకెందుకు మేడమ్? మన అంబాసిడర్ చాలు. ఇప్పుడే జమలయ్య దగ్గిరికిపోయి ఇంజన్‌ని ట్యూన్ చేయించుకువస్తాను. ఎటువంటి పందెంలోనైనా మా చిన్నబాబే ఫస్ట్" అంటూ దీపక్ పర్మిషన్ కోసం ఆగకుండా బయటికి పరిగెత్తాడు.

"నీకు స్పెషల్ డ్రెస్ కావాలి. హెల్మెట్‌లాంటి సేఫ్టీమెటీరియల్ అవసరమవుతుంది. మరి వాటన్నిటికీ డబ్బు?" అడిగింది శృతిమేడమ్.

ప్యాంటుజేబులో వున్న కరెన్సీ నోట్లన్నిటినీ బయటికి తీశాడు దీపక్. పదివేలకు పైన రెండు మూడొందలు మాత్రమే వున్నాయి.

"పోనీ నా దగ్గిర అప్పుతీసుకో. పందెం గెలిచిన తర్వాత తీర్చ వచ్చు" అంది శృతి.

ఏమాత్రం ఆలోచించకుండా తల అడ్డంగా తిప్పాడు దీపక్.

"పదివేలు ఎంట్రీ ఫీజులకి సరిపోతాయి....ఈ మూడొందలు ప్రస్తుతం ఖర్చులకు పనికివస్తాయి. నువ్వు చెబుతున్న సేఫ్టీ మెటీరియల్ కోసం ఎక్స్‌ట్రా అమౌంట్ అవసరమవుతుంది. ఐ విల్ థింక్ ఎబౌట్ ఇట్....ఏదోకటి ఆలోచిస్తాను. ఏదోకవిధంగా మేనేజ్ చేసేస్తాను. యూ డోన్ట్‌వర్రీ...." చాలా కాన్ఫిడెంట్‌గా, చాలా కూల్‌గా శృతిమేడమ్‌తో చెప్పాడు దీపక్.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏదో ఒకటి ఆలోచించడం, ఏదోకవిధంగా మేనేజ్ చేయడం ఆల్‌మోస్ట్ ఇంపాజిబుల్ అనిపించి, అసహనంగా తల విదిలించింది శృతిమేడమ్. అతనికి కొంచెం మొండితనం, ఇంకాస్త సూటిగా చెప్పాలంటే మూర్ఖత్వం ఎక్కువేమో అని అనిపించినమాట కూడా వాస్తవమే.

"ఓ.కె. మిస్టర్ దీపక్....యూ డూ వాటెవ్వర్ యూ వాన్ట్....



నేను ఇంటికి పోతున్నాను" అంటూ సడన్‌గా కుర్చీలోనుంచి లేచిందామె.

"ప్లీజ్ శృతి....నువ్వు దగ్గిర వుంటే నాకు ఎంతో ప్రశాంతంగా, హాయిగా వున్న ఫీలింగ్ కలుగుతోంది. వైడోన్ట్ యూ స్పెండ్ సమ్‌మోర్ టైమ్ విత్ మీ? ఇంటికిపోయి నువ్వు చేయాల్సిన అర్జెంటు పనులు, ఇంపార్టెంట్ పనులు ఏమున్నాయి?" క్రాస్ కంట్రీ రేస్ వివరాలను చాలా క్లోజ్‌గా చదువుతూ అన్నాడు దీపక్.

ఆ మాటలు కావాలని అన్నాడో, లేక క్యాజువల్‌గా అన్నాడో శృతిమేడమ్‌కి అర్థంకాలేదు. అతనికి సంబంధించిన ఫీలింగ్స్‌ని అంతకు ముందు మాదిరి తనలోనే దాచిపెట్టుకోదలుచుకోలేదామె ఈసారి.

"వాట్ డూ యూ మీన్? నేను దగ్గిర వుంటే నీకు టెన్షన్ తగ్గి, హాయిగా వుండటం ఏమిటి?" కూర్చోకుండా అలాగే నిలబడి సూటిగా అడిగింది.

"నువ్వు వెరీ కాన్ఫిడెంట్.... నీ కాన్ఫిడెన్స్ నన్ను ఇన్‌స్పైయిర్ చేస్తోంది. నా ఆలోచనల్లో ఏదైనా తప్పుంటే, నువ్వు సరిదిద్దుతావన్న నమ్మకం, నన్ను చాలా డీప్‌గా ఆలోచింపచేస్తోంది. ఆ ఉద్దేశ్యంతోనే అలా అన్నాను" పేపర్‌మీదినించి చూపులు తిప్పకుండానే అన్నాడు దీపక్.

అటూ ఇటూ చూసి కుర్చీలో కూర్చుండిపోయింది శృతిమేడమ్. అలా కూర్చోవడానికి తనను ప్రాంప్ట్‌చేసిన ఫీలింగ్ ఏమిటో మాత్రం ఆమెకు అర్థంకాలేదు.

"ఓ.కె. యంగ్‌మ్యాన్....నేను దగ్గిరవుంటే నీ కాన్ఫిడెన్స్ వెయ్యింతలు అయిపోతున్నదన్న డైలాగ్ వినడానికి చాలా బాగుంది.... ఇప్పుడు చెప్పు. వాటీజ్ ది రిజల్ట్?" దీపక్‌ని సూటిగా అడిగింది శృతి.

చెయ్యిజాచి ఎవర్నో ఒకర్ని ఎంతో కొంత మొత్తం అడిగి తీసుకోకుండా అతను ఆ డైలమాలోనుంచి బయటపడటం ఇంపాజిబుల్‌గానే కనిపించింది ఆమెకు. ఆ అడిగేదేదో తననే అడగవచ్చుకదా!

* * * *

పేపర్‌మీదినించి తల ఎత్తకుండా మరో రెండు నిమిషాలపాటు మౌనంగానే వుండిపోయాడు దీపక్. ఉన్నట్లుండి తలఎత్తి ఆమెపంక చూస్తూ నవ్వాడు.

నవ్వా అది! ఝల్లుమన్నది శృతిమేడమ్ శరీరం.

ఎదురుచూడని విధంగా ఏదయినా గిఫ్ట్ తన చేతికి వస్తే చిన్నపిల్లలు ఎంత ఆనందంగా నవ్వుతారో, అచ్చం అలాగేవుంది దీపక్ నవ్విన ఆ నవ్వు.

"వాటీజ్ ఇట్? ఏదైనా థాట్ వచ్చిందా?" తనుకూడా ఆ ఎగ్జయిట్‌మెంట్ ప్రభావానికి గురవుతూ అడిగింది.

"ఎస్....క్రాస్ కంట్రీ కార్ రేసెస్ అన్నీ ప్రమోటర్స్ సహాయంతో జరుగుతాయి. ఐ నీడ్ ఎ ప్రమోటర్.... ఒక్కడంటే ఒక్కడు దొరికితే చాలు. మన ప్రాబ్లెమ్ సాల్వ్ అయిపోతుంది" అంటూ శృతిమేడమ్ సమాధానం కోసం ఎదురుచూడకుండా, "రాంసింగ్.... రాంసింగ్" అంటూ బిగ్గరిగా పిలిచాడు.

గుమ్మంపక్కనే కూర్చునివున్న గండయ్య వెంటనే లేచి అతని ముందుకు వచ్చాడు.

"రాంసింగ్ మన జమలయ్య దగ్గిరికి పోయాడు చిన్నబాబూ! పిలుచుకురానా?" అని అడిగాడు.

"వద్దు. జమలయ్య దగ్గిర మనకి బోలెడు పనివుంది. మర్చిపోయి పిలిచా" అంటూ సీరియస్‌గా ఆలోచించడం మొదలుపెట్టాడు దీపక్.

ఆ ఫోజుకూడా విపరీతంగా నచ్చేసింది శృతిమేడమ్‌కి. "ప్లీజ్ దీపక్! ఇప్పుడయినా నువ్వు నా మాటవిను.... మా మామయ్యకి బోలెడు మంది క్లయింట్స్, పెద్ద పెద్ద కంపెనీలవాళ్ళున్నారు. ఒక్క ఫోన్‌కాల్.... ఒకే ఒక్కటి.... మన పని అయిపోతుంది. యూ విల్ బి హ్యాపీ" అదేదో తన పని అన్నట్లు చాలా అర్థింపుగా అడిగింది.

* * * *

ఎవరైనా ఒక ప్రమోటర్‌ని పట్టుకుంటే తన ఫైనాన్షియల్ ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోతుందని అతను ఆలోచించడమే చాలా బాగా నచ్చింది ఆమెకు.

'స్ట్రెస్ పీరియడ్లో ఇతను తన మెంటల్ బ్యాలెన్స్‌ని కోల్పోవడం లేదు....కూల్‌గా ఆలోచిస్తున్నాడు....డెఫినెట్లీ ఇటీజ్ ఎ రేర్ ఎబిలిటీ....' అంతకుముందు అతని బిహేవియర్‌ని చూసి తను అఫెండైన విషయాన్ని



పూర్తిగా మరిచిపోతూ తనలో తను అనుకుంది.

"మీ మామయ్యని హెల్ప్ అడగడానికి నాకు ఎటువంటి ఇన్‌హిబిషన్స్ లేవు శృతీ....కాని ఇప్పుడు నేను ఆ పని చేస్తే అది మా తాతగారికి తెలిసిపోతుంది. బయటికిపోయి బతకడం చేతకాక తన లాయర్ దగ్గిర చెయ్యజాచానని ఆయన అనుకోవడం డెఫినెట్....

అది నాకు ఇష్టంలేదు.... నిన్ను అడగడానికి కూడా అదే కారణం అడ్డువస్తోంది. ప్లీజ్ ట్రై టు అండర్‌స్టాండ్ మై ఇనెబిలిటీ" వున్నట్లుండి ఆమె ముఖంలోకి చూస్తూ చాలా సాఫ్ట్‌గా చెప్పాడు దీపక్.

ఒకసారి కాదు....ఒక మాటని కాదు....వెయ్యిసార్లు, వెయ్యిమాటలు వెంటనే క్షమించేసింది శృతిమేడమ్ మనస్సు. 'బయటికి చెప్పడంలేదు గాని, నా మాటలన్నిటినీ అతను వింటున్నాడు. వాటిని గురించి చాలా డీప్‌గా ఆలోచిస్తున్నాడు....ఐ లైక్ ఇట్!' అనుకుంది.

"ఓ.కె. ఓ.కె....నీ పరిస్థితి ఇప్పుడు నాకు పూర్తిగా అర్థంఅయింది. మా మామయ్యని అడుగుదామని ఇక ఎప్పుడూ చెప్పను. మెటీరియల్ సహాయం తీసుకోవద్దు. కనీసం మాట సహాయమైనా తీసుకోవచ్చుకదా" అని తన అనుమానం వ్యక్తంచేసింది అతనితో.

"మాట సహాయం చెయ్యడానికి నువ్వు నా ఎదురుగానే వున్నావ్. దటీజ్ ఎనఫ్. మీ మామయ్య అవసరం లేదు" అంటూ మళ్ళీ ఆలోచనలు మొదలెట్టాడు దీపక్.

అతన్నోసారి నిశితంగా చూసి "గండయ్యా.... కాఫీవుందా ఫ్లాస్కులో?" అడిగింది శృతిమేడమ్.

"బోలెడంత వుంది మేడమ్! పదిమందికి సరిపడా పోసుకువచ్చారు మీరు" అంటూ గబగబా కాఫీని కప్పుల్లోపోసి ఆమెకు, దీపక్‌కి అందించాడు.

"పోయిన ఏడాది.... నేను ఎన్.సి.సి. క్యాంప్‌కి వెళ్ళినప్పుడు మా అప్పటింగ్‌ని రమాకాంత్ స్పోర్ట్స్ కంపెనీ స్పాన్సర్ చేసింది.... హార్స్ రైడింగ్‌లోను, రైఫిల్ షూటింగ్‌లోను మా బ్యాచ్ ఫస్ట్ వచ్చింది.

వాళ్ళు చాలా హ్యాపీగా ఫీల్ అయ్యారు. పేపర్లో మా ఫోటోలు కూడా వేసి చాలా హంగామా చేశారు" కాఫీని సిప్‌చేస్తూ నిదానంగా

అన్నాడు దీపక్.

"ఒక్కసారి నేను ఇంటికి ఫోన్‌చేసి మా మామయ్యతో మాట్లాడతాను దీపక్. అదికూడా నీకు అభ్యంతరం లేకపోతేనే...." వెంటనే అంది శృతిమేడమ్.

"డూ ఇట్ శృతీ! నాకు అభ్యంతరం ఏమీలేదు" అన్నాడు దీపక్ చాలా కూల్‌గా.

* * * *

తన సెల్‌ని తీసి గబగబా లాయర్‌సాబ్ నెంబర్ని ప్రెస్‌చేసింది శృతిమేడమ్.

"నీ ఫోన్‌కోసం చాలా సేపటినించి వెయిటింగ్‌రా" వెంటనే వినవచ్చింది ఆ పెద్దమనిషి కంఠం.

"మామయ్యా! రమాకాంత్ స్పోర్ట్స్ కంపెనీ నెంబర్ కావాలి. ఎమ్.డిగారి పర్సనల్ నెంబర్ అయితే మరీ మంచిది" అంది శృతిమేడమ్.

"వాడా? వాడు వట్టి వెధవ. వయసు అయితే వచ్చింది కాని, వాడివి అన్నీ కుర్రాడి బుద్ధులే. స్పోర్ట్స్ సామాను అమ్ముకుంటూ హ్యాపీగా కూర్చోరా నాయనా అంటే వినకుండా కారు రేసులనీ, టెన్నిస్ కాంపిటీషన్స్ అనీ ప్రపంచమంతా తిరుగుతూ వుంటాడు. ఇప్పుడు వాడితో నీకు పనేం వచ్చిందిరా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"పనే....ఒకటి వచ్చింది, ఫోన్‌నెంబర్ ఇస్తే చాలు.... అతనితో నువ్వు మాట్లాడాల్సిన పనిలేదు. వెరీ అర్జెంట్" అంది శృతిమేడమ్.

"ఒక్క క్షణం...." అంటూ తన దగ్గిర వున్న ఫోన్ నెంబర్లను పరిశీలించాడు. వెంటనే ఒక నెంబర్‌ని శృతిమేడమ్‌కు చెప్పాడు లాయర్ సాబ్.

థ్యాంక్స్ చెప్పి ఫోన్ కట్‌చేసింది శృతిమేడమ్.

"మా మామయ్య డెఫినెట్‌గా ఆ రమాకాంత్‌తో మాట్లాడతాడు. ఆ పని జరగకముందే మనం ప్రొసీడ్ అయిపోవాలి" అని దీపక్‌కి చెబుతూనే లాయర్‌సాబ్ ఇచ్చిన నెంబర్‌ని ప్రెస్‌చేసింది శృతి.

లాయర్‌సాబ్ ఇచ్చిన నెంబర్ పర్సనల్ నెంబర్ కావడంతో వెంటనే పలికాడు రమాకాంత్.



తను మాట్లాడలేదు శృతి....

ఫోన్‌ని దీపక్‌కి అందించింది.

"హల్లో సర్! నా పేరు దీపక్.... పోయినేడాది మీరు స్పాన్సర్ చేసిన ఎన్.సి.సి. టీమ్‌లో మెంబర్ని" తనను తను పరిచయం చేసుకున్నాడు దీపక్.

"ఓ....దీపక్....హార్స్‌రైడింగ్ స్పెషలిస్ట్.... మూవింగ్ ఆబ్జెక్ట్స్‌ని షూట్ చేయడంలో నెంబర్‌వన్.... హౌకెన్ ఐ ఫర్‌గెట్ యూ యంగ్ మ్యాన్?" అంటూ చాలా సంతోషంగా రిప్లయ్ ఇచ్చాడు రమాకాంత్.

"సర్! రేపు జరగబోయే క్రాస్ కంట్రీ కార్ రేస్‌లో నేను పార్టిసిపేట్ చేయబోతున్నాను. కెన్ యూ ప్రమోట్ మీ?" డైరెక్ట్‌గా అడిగాడు దీపక్.

మై గుడ్‌నెస్....సిమ్లానుంచి, డెహ్రాడూన్‌నించి సూపర్ డ్రయివర్స్ వస్తున్న రేస్ అది....కెన్ యూ విత్ స్టాండ్ దట్ టెన్షన్?" ఆశ్చర్యంగా అడిగాడు రమాకాంత్.

డెఫినెట్లీ సర్....నాకు ప్రమోటర్ కావాలి....ఇప్పుడు నాకున్న సమస్య అదొక్కటే,"

"గ్రాంటెడ్ యంగ్‌మ్యాన్.... గ్రాంటెడ్! మా మేనేజర్‌ని ఇప్పుడే పంపిస్తాను. నీకు ఏమేమి కావాలో అతనికి చెప్పు. ఫోటోగ్రాఫర్ కూడా వస్తాడు. ఈ సాయంత్రానికల్లా నేను పబ్లిసిటీ డిజైన్ చేసుకోవాలి, హేవ్ ఎ గుడ్‌టైం....నీ అడ్రస్ చెప్పు" చకచకా డెసిషన్ తీసుకుంటూ ఉత్సాహంగా చెప్పాడు రమాకాంత్.

తన అడ్రస్‌ను వివరంగా చెప్పి, ఫోన్‌ని ఆఫ్‌చేస్తూ శృతి మేడమ్ వైపు చూసి ఆనందంగా నవ్వాడు దీపక్.

ఎలా మేనేజ్‌చేశాడో ఎవరికీ తెలియదు. సాయంత్రం ఆరుగంటల సమయానికి ఈవెనింగ్ ఎడిషన్స్ అన్నింటిలోనూ దీపక్ ఇంటెన్షన్‌ని పెద్ద పెద్ద అక్షరాలతో ప్రింట్ చేయించాడు రమాకాంత్.

'అనుభవం లేకపోయినా పట్టుదలే తన క్వాలిఫికేషన్‌గా పందెంలో పాల్గొంటున్న డేర్‌డెవిల్ దీపక్....' అంటూ అతని ఎబిలిటీస్ అన్నిటినీ చాలా హైలెట్ చేయిస్తూ న్యూస్ ప్రచురింపచేశాడు.

అటువంటి ఔత్సాహికుల్ని ప్రోత్సహించడం తనకంపెనీ విధ్యుక్త ధర్మమని జనను గురించి కూడా చాలా గొప్పగా ప్రజెంట్ చేయించుకున్నాడు.

## 15

"తాతగారూ....తాతగారూ....ఈ న్యూస్ చదివారా? ఇంత బతుకూ బతికి ఆ దీపక్‌గాడు బజార్నపడి వాళ్ళని వీళ్ళని ముష్టిఎత్తుకుంటున్నాడు" అరున్నర సమయంలో నాలుగు న్యూస్ పేపర్స్‌ని సురేంద్రసాబ్ ఎదుట పెడుతూ కంప్లయింట్ చేశాడు సోహన్.

"వాడు వట్టి వెధవ....వాడిని గురించి నా ముందు మాట్లాడవద్దని నీకు చెప్పాను. అవతలికిపో" కరుకుకంఠంతో కసురుకున్నాడు సురేంద్రసాబ్.

"వట్టి వెధవ అని వదిలేస్తామా? ఆ రమాకాంత్‌కి ఫోన్ చేసి నీ సాయం మాకు అవసరంలేదని చెప్పండి. ఇటువంటి బుద్ధితక్కువ పనుల్ని చూస్తూ ఊరుకోవడం మంచిదికాదు. మన పరువుపోతోంది" సన్నగా అందుకుంది కొడుకు వెనకే వచ్చిన సరితాదేవి.

"పీటర్....ఎక్కడున్నావ్?" ఖంగుమంటున్న కంఠంతో పిలిచాడు సురేంద్రసాబ్.

పాతిక అడుగుల దూరంలోనే నిలబడి వున్నాడు పీటర్. గబగబా ముందుకు వచ్చాడు.

"ఆ రమాకాంత్ ఎవడో తెలుసుకుని ఫోన్‌చెయ్యి" ఆర్డర్ ఇచ్చాడు సురేంద్రసాబ్.

"రమాకాంత్ లాస్ట్ ఇయర్ మన చిన్నబాబు ఎన్.సి.సి. బ్యాచ్‌ని స్పాన్సర్ చేశాడు. అది అతని ప్రొఫెషన్....మనం కల్పించుకోవడం మంచిగా వుండదు. ఇటువంటి పోటీల్లో అటువంటివి చాలా సహజం...." నెమ్మదిగా నచ్చచెప్పడానికి ట్రైచేసిన పీటర్‌ని చూపులతోనే కాల్చివదేయాలనుకుంటున్నట్లు చూసింది సరితాదేవి.

"నీ సలహాలు ఇక్కడ ఎవరికీ అవసరంలేదు. బజారుకు ఎక్కు-



తోంది మా పరువు. నీ పరువుకాదు. పరువు అనే మాటకు అర్థం తెలీని నీలాంటివాడికి ఏది చెప్పినా అర్థంకాదు. ముందు ఫోన్ చెయ్యి" ఆ గది రీసౌండ్ వచ్చేటట్లు గంయ్యమని అరిచింది.

చిన్నబోయిన ముఖంతో రమాకాంత్ నెంబర్ని పేపర్లో చూసి గబగబా ప్రెస్ చేశాడు. రింగ్ అవగానే ఫోన్‌ని నేరుగా ఆమెకే అందించాడు పీటర్.

అవతలివైపు నుంచి రెస్పాన్స్ రాగానే తనెవరో, తన తండ్రి ఎవరో, తమ పరువు ప్రతిష్ఠలు ఎలాంటివో అతనికి వివరంగా చెప్పింది సరితాదేవి.

"దీపక్‌ని మీరు ప్రమోట్ చేయకండి....దటీజ్ ఫైనల్" అని కూడా చెప్పింది.

అవతలివైపు నుంచి వినవచ్చిన సమాధానం ఆమెకు రుచించనట్లు అప్రసన్నంగా మారిపోయింది ముఖం.

"ఆల్‌రైట్....మేము చెప్పాల్సింది మేముచెప్పాం. ఇక మీఇష్టం" అంటూ ఫోన్ పెట్టేసి తండ్రివైపు చూసింది.

"రమాకాంత్ ఎవడోగాని వట్టి మూర్ఖుడిమాదిరిగా వున్నాడు. పేపర్లో ఎనౌన్స్‌మెంట్ వచ్చేసిన తర్వాత తను చేయగలిగింది ఏమీలేదని అంటున్నాడు" ముఖం ముడుచుకుంటూ చెప్పింది.

ఉబికిరాబోయిన నవ్వుని అతి ప్రయత్నంమీద అదిమిపెట్టుకుంటూ అర్జెంటుపని ఏదో అప్పుడే జ్ఞాపకం వచ్చినట్టు ఆ గదిలోనుంచి ఇవతలికి వచ్చేశాడు పీటర్.

సరితాదేవి మాటలకు సమాధానం ఇవ్వకుండా, అక్కడినించి లేచి విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు సురేంద్రసాబ్.

"ఇప్పుడు ఏంచేయాలి మమ్మీ? పందెంలో గెలిచినవాళ్ళకి బోలెడంత డబ్బు....పొరపాటునగాని ఆ దీపక్‌గాడు గెలిచాడంటే ఇక వాడిని పట్టుకోవడం ఎవరికీ సాధ్యపడదు" మూతీగా చెప్పిన కొడుకువైపు సాలోచనగా చూసింది సరితాదేవి.

"నిన్నకాక మొన్న డ్రయివింగ్ నేర్చుకున్న ఈ వెధవ ఆ పందెంలో గెలుస్తాడని నాకు నమ్మకంలేదు. అయినాసరే ముందు జాగ్రత్తలు

తీసుకోవడంలో తప్పేమీలేదు....వాడు గెలవకూడదు. ఎలా గెలవకూడదో బాగా ఆలోచించు" అంటూ ఆదేశాలు ఇచ్చింది.

"ఆలోచిస్తాను మమ్మీ....బాగా ఆలోచిస్తాను" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు సోహన్.

ఏదో ఒకవిధంగా దీపక్‌ని దెబ్బకొట్టాలనే ఆలోచనల్లోపడి ఆ గదికి ఆవలిపక్కన ఒక రోజ్‌వుడ్ బీరువాని శుభ్రంగా తుడుస్తున్న మరియమ్మని గమనించలేదువారిద్దరూ. చేస్తున్న పనిని మధ్యలోనే వదిలేసి, నిశ్శబ్దంగా అవతలికి వెళ్ళిపోయింది మరియమ్మ.

*  *  *  *

"ఏరా....ఏంటీ....మమ్మల్ని మర్చిపోయావా?" చీకటిపడిన తరువాత ఏడుగంటలప్పుడు శృతిమేడమ్‌కి ఫోన్‌చేసి అడిగాడు లాయర్‌సాబ్.

కాఫీ ఫ్లాస్క్, లంచ్‌బాక్స్‌లు తీసుకుని ఉదయం ఎప్పుడోవచ్చింది శృతిమేడమ్.

అప్పట్నుంచి దీపక్ దగ్గర్నించి అవతలికి పోలేదు.

రమాకాంత్ పంపించిన మేనేజర్‌తో తనే మాట్లాడి స్పాన్సర్‌షిప్‌కి అవసరమైన ఎగ్రిమెంట్లను సూపర్‌వైజ్ చేసింది. ఎంట్రీఫీజ్ దగ్గర్నించి సేఫ్టీమెటీరియల్‌కి అవసరమయ్యే ఖర్చుల్ని వారి దగ్గిరే రాబట్టింది. తను వారితో వెళ్ళి ఆ సామగ్రిని కొనుగోలుచేసి తీసుకువచ్చింది.

గండయ్య వెళ్ళి పార్శిల్ చేయించుకువచ్చిన ఫుడ్‌ని దీపక్‌తోపాటు తను కూడా కింద కూర్చుని ఆరగించింది.

"అన్ని పనులూ హ్యాపీగా జరిగిపోయాయి. జమలయ్య దగ్గర్నించి కారు రావడం ఒక్కటే మిగిలిపోయింది. అది కూడా వచ్చేస్తే నాకు హ్యాపీగా వుంటుంది" చీకటిపడిన తరువాత దీపక్‌కి చెప్పింది.

అందుకు దీపక్ సమాధానం చెప్పకముందే, అపార్ట్‌మెంట్ ద్వారం దగ్గర ప్రత్యక్షం అయింది మరియమ్మ.

"మీరు ఎలా వున్నారోనని ఖంగారుపడుతూ వచ్చాను నాన్నగారూ....కాని ఇప్పుడు ఆ ఖంగారులేదు.నాకు చాలా సంతోషంగా వుంది" దీపక్ తలను రెండుచేతుల్లోకి తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ చెప్పింది మరియమ్మ.



"ఎందుకు అంత సంతోషం?" వినోదంగా చూస్తూ మరియమ్మను అడిగింది శృతిమేడమ్.

"మీరున్నారుగా....మీరు దగ్గిర వుంటే నాన్నగారికి ఎటువంటి ప్రాబ్లెమూ రాదు...." చాలా నమ్మకంగా చెప్పింది మరియమ్మ శృతిమేడమ్‌తో.

"ఇప్పుడు నువ్వెందుకు వచ్చావ్ మరియమ్మా? అక్కడ తాతగారికి ఇబ్బందికదా" అన్నాడు దీపక్.

"ఆళ్ళ ఇబ్బందులు నాకు అనవసరం. మీరు కారు నడిపేటప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి....అసలే పరిస్థితులు ఏమీ బాగోలేదు. బాగుపడే వాళ్ళని చూసి కళ్ళల్లో నిప్పులుపోసుకునే జనం చాలామంది వున్నారు. నా మాటలు అర్థమయ్యాయా నాన్నగారూ?" సాభిప్రాయంగా చూస్తూ చెప్పింది మరియమ్మ.

దీపక్‌కి అర్థంకాలేదని శృతిమేడమ్‌కి అర్థం అయింది. వివరంగా చెప్పమని అతను అడుగుతాడేమోనని కుతూహలంగా చూసింది ఆమె.

అడగలేదు దీపక్. "నాకు తెలుసు. నేను జాగ్రత్తగానే వుంటాను. నువ్వు వెళ్ళిపో" అన్నాడు.

అతనంత క్లుప్తంగా మాట్లాడటం మరియమ్మని హర్ట్ చేస్తుందేమోనని అనుకుంది శృతిమేడమ్.

కాని ఆమె అంచనా తప్పు అయిపోయింది.

"మీరు అన్నింటినీ చాలా తేలికగా తీసుకోకండి నాన్నగారూ....అతిధైర్యం అన్ని సమయాల్లోనూ పనికిరాదు. నా మాటవిని మీ చుట్టూ ఏం జరుగుతోందో కాస్త చూసుకుంటూ వుండండి....అన్నం తిన్నారా?" వున్నట్టుండీ వేరే సబ్జెక్ట్‌లోకి ఎంటర్ అయింది మరియమ్మ.

"మధ్యాహ్నం తినేశాం....ఇప్పుడు ఇంకా తినలేదు. పార్శిల్ తీసుకుని రావడానికి గండయ్య ఇంతకుముందే హోటల్‌కి వెళ్ళాడు" అన్నాడు దీపక్.

"అలాగా....అయితే మీరు కాస్సేపు బయటికిపోయి అలా అలా తిరిగిరండి" అంటూ అతని సమాధానంకోసం ఎదురుచూడకుండా, మురికిగా వున్న ఆ అపార్ట్‌మెంట్‌ని శుభ్రంచేసే పనిలోకి దిగిపోయింది మరియమ్మ.

"తనకి డస్టని చూస్తే చాలా కోపం....ఎవరుచెప్పినా వినిపించు కోదు" అంటూ శృతిమేడమ్‌ని వెంటబెట్టుకొని బయటికి వచ్చాడు దీపక్.

అదిగో....అప్పుడు వచ్చింది శృతిమేడమ్‌కి లాయర్ దామోదరు సాబ్ దగ్గిర్నించి ఫోన్.

ఒకపక్కకిపోయి పదినిముషాలసేపు సుదీర్ఘంగా మాట్లాడింది శృతి మేడమ్. "నువ్వు చాలా డీప్‌గా ఇన్‌వాల్వ్ అయిపోతున్నావురా....అంత అవసరమా?" అంతా సావధానంగా విని అడిగాడు లాయర్‌సాబ్.

"అవసరమో, అనవసరమో నాకు తెలియదు. ఐయామ్ ఇన్‌వాల్వ్‌డ్....అంతే....ఆ పందెంలో రిజల్ట్ తెలిసేవరకూ నేనుఇక్కడే వుంటాను. దట్స్ ఫైనల్" తన నిర్ణయాన్ని ఖచ్చితంగా చెప్పింది శృతి.

"ఈ నెలలో కళ్యాణమండపాలు ఏవీ ఖాళీగాలేవు. ఇందాక ఏమీ తోచక సిటీలో వున్న హైక్లాస్ ప్లేసెస్ అన్నిటినీ కదిలించి చూశాను. వచ్చే నెలదాకా ఆగాల్సిందే" కూల్‌గా అన్నాడు లాయర్‌సాబ్.

ఎర్రబడ్డాయి శృతిమేడమ్ బుగ్గలు. "ఇప్పుడు అవేమీ అవసరం లేదు మామయ్యా....రేస్ అయిన తర్వాతగాని యాక్చువల్ రీడింగ్ మనకి తెలియదు. రేపు సాయంత్రందాకా ఆగు...." అంటూ ఫోన్ పెట్టేసింది.

పార్కింగ్ ప్లేస్‌లో వున్న ఆమె కారుదగ్గిర నిలబడి ఏదో చూస్తున్నాడు దీపక్

"స్కైలైన్ రెస్టారెంట్‌కి పోయి ఐస్‌క్రీమ్ తినివద్దాం" అంటూ స్టీరింగ్‌ముందు కూర్చుంది ఆమె....అతను అవతలి పక్కన కూర్చోగానే వేగంగా కదిలించింది కారుని.

* * * *

"అన్‌ప్లెజెంట్ ఇన్సిడెంట్స్ జరిగిన ప్రదేశంలోకి మళ్ళీ రావడానికి చాలామంది ఇంట్రెస్ట్ చూపించరు. మొన్న జరిగిన సంఘటన మిమ్మల్ని హర్ట్‌చేసి వుంటుందని అనుకున్నాం. మీరు అది మనసులో పెట్టుకోకుండా రావడం మాకు చాలా ఆనందంగా వుంది" కారును రెస్టారెంట్ స్టాఫ్‌కి అప్పగించి వచ్చిన శృతిమేడమ్ దగ్గిరకి వచ్చి సంతోషంగా చెప్పారు మేనేజర్.



"దిసీజ్ దీపక్...." అంటూ దీపక్‌ని మేనేజర్‌కి పరిచయం చేయబోయింది శృతిమేడమ్.

"భలేవారే మేడమ్....దీపక్‌బాబుని మాకు పరిచయం చేయడం ఏమిటి? హీ ఈజ్ అవర్ రెగ్యులర్ కస్టమర్" అంటూ స్వయంగా తీసుకుపోయి ఒక టేబిల్ దగ్గిర కూర్చోబెట్టాడు మేనేజర్.

ఐస్‌క్రీమ్స్ ఆర్డర్ ఇచ్చింది శృతి.

"నువ్వు ఏదో ఆలోచిస్తున్నావ్" అంటూ దీపక్‌ని మాట్లాడించింది శృతి.

"నథింగ్ శృతి....రేపు రేస్ స్టార్ట్ అయ్యేలోపల ఒకసారి ఆ ట్రాక్‌ని పరిశీలించి చూడటం బాగుంటుంది. టైమ్ అట్టేలేదు.... ఐయామ్ థింకింగ్ ఎబౌట్ ఇట్....రాంసింగ్ ఇంకా రాలేదు. కారు సంగతి ఏమైందో తెలియడంలేదు" సమాధానం ఇచ్చాడు దీపక్.

"యు డోన్ట్‌వర్రీ....అన్నీ సరిగ్గా జరిగిపోతాయి. అంతగా కావాలంటే ట్రాక్‌ని చూడటానికి నా కారులో పోదాం" భరోసా ఇచ్చింది శృతి.

ఆమె మాటలు పూర్తి అవుతుండగానే, ఆ టేబిల్ దగ్గిర ప్రత్యక్షం అయ్యాడు రాంసింగ్. అతని వెనుకే వచ్చాడు జమలయ్య.

"మీరు కూడా ఇక్కడే వున్నారా? చాలా సంతోషం" అంటూ శృతి మేడమ్‌ని పలకరించి, దీపక్‌తో మాట్లాడాడు జమలయ్య. "కారు సూపర్. అక్కడక్కడా కలర్‌షేడ్ ఐతే టచప్స్ ఇస్తున్నారు మా కుర్రాళ్ళు. మీ నెంబర్ ఫార్టీఫోర్....టోటల్ ఎయిట్ వచ్చింది కారు. కారునెంబర్ కూడా టోటల్ ఎయిటే....మీ ప్రమోటర్ రమాకాంత్ అండ్ కో నేమ్‌ని వెనుకా ముందూ పెయింట్ చేసేశాం. మీరు ఒకసారి బయటికి వస్తే ట్రాక్‌ని చూసి వద్దాం" ఊపిరి కూడా తీసుకోకుండా గడగడా చెప్పేశాడు.

తన మనస్సును ఇబ్బంది పెడుతున్న టాపిక్‌కి సమాధానం దొరకడంతో హ్యాపీగా ఫీల్ అయ్యాడు దీపక్. వాళ్ళని కూర్చోమని ఐస్‌క్రీమ్స్ తెప్పించాడు.

నిలబడే ఐస్‌క్రీమ్‌ని తీసుకున్నారు వాళ్ళిద్దరూ.

"నేను కూడా మీతో వస్తున్నాను....అంతే" ఖచ్చితంగా ఎనౌన్స్ చేసి బిల్లు చెల్లించడానికి బ్యాగ్‌లో చెయ్యి పెట్టింది శృతిమేడమ్. వెంటనే ఆమెను వారించాడు రెస్టారెంట్ మేనేజర్.

"మాకు రెగ్యులర్ కస్టమర్ దీపక్‌బాబు క్రాస్ కంట్రీ కార్ రేసెస్‌లో పార్టిసిపేట్ చేస్తూండటం మాకు గర్వంగా వుంది మేడమ్.... ఉయ్ విష్‌హిమ్ బెస్టాఫ్‌లక్" అంటూ బిల్లు తీసుకోవడానికి నిరాకరించడంలో అర్థాన్ని వివరించాడు.

దీపక్ వ్యవహారాన్ని రమాకాంత్ అండ్ కో ఏ రేంజ్‌లో పబ్లిక్‌కి తెలిసేటట్టు చేస్తున్నదో మొదటిసారి అనుభవంలోకొచ్చేసరికి ఎంతో సంతోషము కలిగింది శృతిమేడమ్‌కి.

"ఉయ్ థ్యాంక్‌యూ వెరీమచ్....కేవలం వ్యాపారం మాత్రమే చూసుకోకుండా మీరు ఇటువంటి అవుట్‌లుక్ కలిగివుండటం నిజంగా చాలా గొప్పవిషయం...." అంటూ రెస్టారెంట్ మేనేజర్‌ని మెచ్చుకుంది.

"ఇవాల్టినించీ ఆ రేస్ పూర్తి అయ్యేటంతవరకూ దీపక్‌బాబుకి, ఆయనతో కలిసి పనిచేసేవారందరికీ మేమే ఫుడ్ సప్లయి చేయదలుచుకున్నాం మేడమ్. మా అసిస్టెంట్ మేనేజర్ మీతోనే వుంటాడు. మీరు తాగే వాటర్ దగ్గిర్నించి అన్ని అవసరాలనూ అతనే గమనించుకుంటాడు. దయచేసి మీరు కాదని అనకూడదు" అంటూ అప్పటికప్పుడు తమ మనిషిని ఒకతన్ని అక్కడికి పిలిపించి పరిచయం చేశాడు మేనేజర్.

రమాకాంత్ అండ్‌కో స్పాన్సర్స్‌గా అడుగుపెట్టడంవల్ల దీపక్ ట్రబుల్స్ అన్నీ తీరిపోయాయని తెలిసి కూడా ఆ ఆఫర్‌ని చూసి ఇంకా ముచ్చటపడింది శృతి.

దీపక్‌తో కలిసి రెస్టారెంట్ వెలుపల వస్తుండగా, కార్‌రేస్ వ్యవహారాన్ని స్కైలైన్ రెస్టారెంట్ ఎంత సీరియస్‌గా తీసుకుంటున్నదో ఆమెకు ప్రత్యక్షంగా కనిపించింది. పెద్ద పెద్ద బ్యానర్స్‌ని ప్రిపేర్ చేయించింది రెస్టారెంట్ యాజమాన్యం. రెండు ఫర్లాంగుల దూరంవరకూ కనిపించేలా రెస్టారెంట్ ముందుభాగంలోను. పై భాగంలోను వాటిని అరేంజ్ చేయిస్తోంది.

రమాకాంత్ అండ్‌కోతో తప్ప తను ఎవరితోనూ కార్ రేస్‌గురించి



మాట్లాడలేదని బాగా గుర్తుంది శృతిమేడమ్‌కి....కాని ముందుగానే మాట్లాడి ఒక ఎగ్రిమెంట్‌కి వచ్చినట్లు వాళ్ళు అంత త్వరగా బ్యానర్స్ ఎలా ప్రిపేర్ చేయించారో ఆమెకు అవగతం కాలేదు.

"జస్ట్‌ఎ మినిట్ దీపక్....ఒక్కసారి నేను మా ఇంటికి ఫోన్‌చేసి వస్తాను...." అంటూ దూరంగా వెళ్ళి లాయర్‌సాబ్‌కి రింగ్ చేసింది శృతిమేడమ్.

"నేను స్కైలైన్ రెస్టారెంట్ దగ్గిర్నించి మాట్లాడుతున్నాను...." అని ఆమె చెప్పగానే పెద్దగా నవ్వేశాడాయన.

"దీపక్ చేసే ప్రతి పనీ విజయవంతం కావాలని అనుకునేది నువ్వు మాత్రమే కాదురా....అతని వెనుక అతని క్షేమాన్ని కోరుకునే జనం చాలా మంది వున్నారని మర్చిపోకు....మన పీటర్ ఐడియా ఇది....

"నువ్వు, దీపక్ కలిసి పెళ్ళి చేయించారే....ఆ పెళ్ళికొడుకు తండ్రి హస్తం కూడా వుంది ఇందులో. నేను మాత్రం ఏమీ చేయలేదు" ఆమె ఎందుకు ఫోన్ చేసిందో తనకు తెల్సిపోయినట్లు గబగబా చెప్పేశాడు లాయర్‌సాబ్.

"అర్ యూ ష్యూర్? నిజంగానే నీకు ఏమీ తెలియదా?" కోరగా అడిగింది శృతిమేడమ్.

"ఐడియా నాదికాదని చెప్పానుగదా....ఆ ఐడియాని స్కైలైన్ వాళ్ళ చెవికి చేరవేసింది మాత్రమే నేను. అంతే!" అన్నాడు లాయర్ సాబ్ నవ్వుతూనే.

తన హస్తం ఏమీ లేదంటూనే, అన్ని విషయాలు ఆర్గనైజ్ చేసిన ఆయన తెలివికి నమస్కారం చేయకుండా వుండలేకపోయింది శృతి.

"ఐ లవ్ యూ మామయ్యా.... ఐ జస్ట్ లవ్ యూ వెరీమచ్.... పేర్లు తగిలిస్తున్న బ్యానర్స్‌ని చూసి దీపక్ ముఖం ఎంతగా వెలిగిపోతోందో తెలుసా?" అంటూ మెచ్చుకోలు మాటలు మాట్లాడింది.

"ఐకెన్ ఇమాజిన్....అతనికంటే ముందుగా నీ ముఖం మతాబుల మాదిరి వెలుగులు విరజిమ్ముతున్నట్టు నాకు అనిపిస్తోంది. బెస్ట్ ఆఫ్‌లక్‌రా. హ్యాపీ డ్రీమ్స్...." అంటూ లైన్‌ని డిస్కనెక్ట్ చేశాడు.

మెరుస్తున్న కళ్ళతో, చిరునవ్వులు చిందిస్తున్న ముఖంతో వెనక్కి

వచ్చిన శృతిని చూసి ప్రశ్నార్థకంగా నొసలు ఎగురవేశాడు దీపక్.

"మంచి న్యూస్ వినిపించిందా? మీ మమ్మీ డాడీ ఎవరైనా ఇండియా వస్తున్నారా?" అని అడిగాడు.

తన సంతోషం తనలోనే వుండకుండా బయటివాళ్ళకి కూడా కనిపిస్తోందన్న విషయాన్ని మొదటిసారిగా గమనించి వెంటనే జాగ్రత్త తీసుకుంది శృతిమేడమ్.

"నథింగ్ లైక్ దట్....మా మామయ్య కార్ రేస్ పూర్తి అయ్యేంతవరకూ ఇక్కడే వుండటానికి పర్మిషన్ యిచ్చాడు" అంటూ తన డ్రైవర్ కి సైగ చేసింది.

స్టీరింగ్ ని వదిలి, ఆమె దగ్గిరికి వచ్చాడతను.

"మేము ట్రాక్ ని చూసిరావడానికి వెళ్ళవస్తాం....జమలయ్య కారు నడుపుతాడు. నువ్వు ఇంటికి వెళ్ళి నా డ్రెస్‌లు కొన్ని మామయ్యగారి అపార్ట్ మెంట్ కి తీసుకురా" అని డ్రైవర్ కి ఆర్డర్ యిచ్చిందామె.

ఎదురుచెప్పకుండా కారును జమలయ్యకి హేండోవర్ చేసి, ఒక ఆటోలో అవతలికి వెళ్ళిపోయాడు డ్రైవర్.

* * * *

రేస్ ని ఆర్గనైజ్ చేసే కమిటీ ట్రాక్ కి సంబంధించిన మ్యాప్‌లను కూడా ప్రిపేర్ చేసి పార్టిసిపెంట్స్ అందరికీ అందచేసింది. అర్థరాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత ఒక మట్టి రోడ్డు దగ్గిర కారును ఆపి దీపక్ వైపు చూశాడు జమలయ్య.

"ఇక్కడినించీ అంతా గతుకులరోడ్డే....స్పీడ్ గా ప్రయాణంచేస్తే కొంపకొల్లేరవుతుంది. ఈ రోడ్లమీద హ్యాపీగా నడవగలిగింది మన అంబాసిడర్ ఒక్కటే" అంటూ చుట్టూ చూపించాడు.

పద్దెనిమిది మైళ్ళ దూరం వున్న ఆ మట్టిరోడ్డును ఆనుకుని ఒక పెద్ద కొండగుట్ట కన్పిస్తోంది.

"ధైర్యంచేసి ఆ కొండగుట్టమీదికి పోయి, అవతలి వైపుకు దిగగలిగితే, ఎనిమిదిమైళ్ళ దూరం కలిసివస్తుంది. కాని అది రిస్క్ తో కూడుకున్న పని. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా పల్టీలుకొడుతూ పక్కకు పడిపోతాం" అంటూ పరిస్థితిని చక్కగా వివరించాడు.



"స్పీడ్ ముఖ్యంకాదు చిన్నబాబూ....సేఫ్టీ ముఖ్యం....సేఫ్టీ అంటే మన సేఫ్టీకాదు....మన బండి సేఫ్ గా ట్రావెల్ చెయ్యాలి. ఈ గతుకుల్లో అర్థం పడకుండా జాగ్రత్తగా హ్యాండిల్ చేసుకుంటే చాలు....ఈ పందెం మనదే" హుషారుగా అన్నాడు రాంసింగ్.

"ట్రాక్ చూడటం అయిపోయిందా?" ఉన్నట్లుండి అడిగింది శృతి మేడమ్ ఆత్రుతగా.

"అయిపోయింది మేడమ్....ఈ డిఫికల్ట్ స్ట్రెచ్‌ని జాగ్రత్తగా క్రాస్ చెయ్యగలిగితే అవతల అంతా సూపర్...." అన్నాడు జమలయ్య రోడ్డు వైపు చూస్తూ.

"అయితే ఇక ఇంటికిపోదాం....దీపక్ విశ్రాంతి తీసుకోవాలి....ఇప్పుడు నిద్ర చెడగొట్టుకుని మెలకువగా వుంటే రేపు ఇబ్బందిపడతాడు...లెటజ్ గో బ్యాక్" అంది.

వెంటనే కారును వెనక్కి తిప్పాడు జమలయ్య. వచ్చినదానికంటె రెట్టింపు స్పీడ్ తో నడిపి మూడుగంటల ప్రాంతంలో అపార్ట్ మెంట్ దగ్గిరికి తీసుకువచ్చాడు.

ఎర్రటి అక్షరాలతో చిత్ర విచిత్రంగా పెయింట్ చేయబడివున్న అంబాసిడర్ అపార్ట్ మెంట్ దగ్గిరే వారికి కనిపించింది. జమలయ్య షెడ్లో పనిచేసే కుర్రాళ్ళు ఎటువంటి పనివాళ్ళో వెంటనే తెలిసివచ్చింది శృతి మేడమ్ కి.

అప్పుడే షోరూమ్ లో నుంచి బయటికి వచ్చిన కొత్త కారులా మెరిసిపోతోంది అది. ఇంజన్ ని స్టార్ట్ చేసి స్టీరింగ్ మీద చేతులు వేసిన వెంటనే, ఇంజన్ ఎంత పర్ఫెక్ట్ గా పనిచేస్తోందో తెలిసిపోతోంది.

"సూపర్బ్....జమలయ్యా....నీ వర్క్ నిజంగా ఫెంటాస్టిక్...." నిర్మొహమాటంగా ఆమె మెచ్చుకునేసరికి, పెట్రోమాక్స్ లైటు మాదిరి గప్పున వెలిగింది జమలయ్య ముఖం.

"నాదేముంది మేడమ్....ఘనత అంతా నా కుర్రాళ్ళది. దీపక్ బాబు పని అని చెప్పగానే దొంగనాయాళ్ళు రాక్షసులమాదిరి పనిచేశారు....మీరు మెచ్చుకోదలుచుకుంటే వాళ్ళని మెచ్చుకోండి" చాలా వినయంగా తన మాటల్ని వినిపించాడు అతను.

కారు చుట్టూ రెండు మూడు రౌండ్స్ కొట్టి, స్టీరింగ్ మీద కూర్చోబోతున్న దీపక్‌ని, అతి బలవంతంగా లోపలికి పంపించింది శృతి మేడమ్.

"నీకు నిద్ర అవసరం అని ఇందాక చెప్పాను. గో టు స్లీప్" అంటూ బెడ్‌రూమ్‌లోకి నెట్టి తలుపులు మూసింది.

వాళ్ళు స్కైలైన్ రెస్టారెంట్‌కి వెళ్ళకముందు క్లీనింగ్ కార్యక్రమం మొదలుపెట్టిన మరియమ్మ, దుమ్ము కనిపిస్తే తనకు ఎంత కోపం వస్తుందో నిజంగానే అందరికీ తెలిసే లెవెల్లో అపార్ట్‌మెంట్‌ని క్లీన్‌చేసి వెళ్ళింది.

మురికిపట్టి వెలవెలబోతున్న ఫ్లోరింగ్, తళతళలాడిపోతోంది.... అగరొత్తులు వెలిగించి వుండటంవల్ల, సువాసనలతో నిండిపోయి కనిపిస్తోంది రెండో బెడ్‌రూమ్.

తమ డ్రైవర్ అంతకుముందే తీసుకువచ్చి అక్కడ పెట్టిన సూట్‌కేసులోని తన దుస్తుల్ని చూసుకుంది శృతిమేడమ్. అయితే తిరిగి తిరిగి వుండటంతో డ్రెస్ ఛేంజ్ చేసుకునే ఓపిక లేకపోవడంవల్ల అలాగే బెడ్ మీద పడి, క్షణాల్లో నిద్రలోకి జారిపోయింది.

* * * *

"మరియమ్మా....ఓ మరియమ్మా.... ఎక్కడ చచ్చావ్?" తన స్థాయికి తగని మాటని ఉపయోగిస్తూ సరితాదేవి గట్టిగా అరిచేసరికి, అవతలి గదిలోనుంచి తొంగి చూసింది మరియమ్మ. అర్జెంటుగా ఎక్కడికో ప్రయాణం అవుతున్నట్లు కనిపిస్తోంది ఆమె వాలకం.

"పేరు పెట్టి ఇందాకటినుంచీ అరిచి కేకలుపెడుతుంటే ఎక్కడ వున్నావ్? నోరు తెరిచి సమాధానం చెప్పవేంటి? నోరేమైనా పడిపోయిందా?" కనులు ఎర్రచేసి మరియమ్మను చూస్తూ అరిచింది సరితాదేవి.

"చూడండమ్మా....నాకు అవతల బోలెడు పనులున్నాయి. మీరు చెప్పదలుచుకున్నది ఏమిటో త్వరగా చెప్పండి" ఎప్పుడూలేనిది నిర్లక్ష్యంగా మాటంగా తల ఎత్తి చూస్తూ అంది మరియమ్మ.

"ఏంటే? ఏంటే నీ తలబిరుసు? ఏంటీ ఆ చూపు?" గయ్‌మంది సరితాదేవి కళ్ళు పెద్దచేస్తూ.



"పనేంటో చెప్పమంటే ఊరికే అలా గింజుకోవడం దేనికి? చెప్పు- ఏంటి పని?" ఉన్నట్లుండి చాలా ఘాటుగా అడిగింది మరియమ్మ లెక్క చేయనట్టు.

తెరిచిన నోరు తెరిచినట్టుగానే వుండిపోతుండగా, బొమ్మమాదిరి బిగుసుకుపోయింది సరితాదేవి.

"నువ్వు....అఫ్టరాల్ ఒక పనిమనిషివి నన్ను ఏంటీ గింటీ అంటూ మాట్లాడుతున్నావా?" రెండు క్షణాల తర్వాత గొంతు పెగల్చుకుంటూ అడిగింది.

"అవును....అలాగే మాట్లాడతాను...ఏంటట? ఇంత పొద్దుపొద్దున్నే నీకు నాతో పనేంటి....?" మరింత తలబిరుసుగా బిగ్గరిగా అడిగింది మరియమ్మ.

"నాన్నగారూ....విన్నారా? ఈ చచ్చు ముఖం ఎలా మాట్లాడుతోందో మీకు వినపడుతోందా?" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి సురేంద్రనాథ్‌కి వినబడేటట్లు అరిచింది సరితాదేవి ఆవేశంగా.

"మధ్యలో పెద్దబాబును పిలవడం దేనికి?" అడిగింది మరియమ్మ.

"ఊడగొట్టించడానికి....ఇవాల్టితో నీ ఉద్యోగం అఖర్....చిప్ప పట్టుకుని నువ్వు రోడ్లవెంట...." అని అనబోతున్న సరితాదేవిని చేయెత్తి ఆపేసింది మరియమ్మ.

"నువ్వు ఉద్యోగం ఊడపీకించేదేంటి? నేనే మానేస్తున్నా....అవతల మా నాన్నగారు ఇల్లు శుభ్రంచేసే దిక్కులేక అల్లాడిపోతుంటే, నేను ఇక్కడ తీరికగా కూర్చుంటానా? నేనే ఉద్యోగం మానుకుని వెళ్ళిపోతున్నా....పెద్దబాబుగారు నిద్రలేచి కాఫీ తాగిన తర్వాత చెప్పు...." అంటూ లావుపాటి ట్రంకుపెట్టెను ఒకదాన్ని పట్టుకుని చకచకా బిల్డింగ్‌లోనుంచి బయటికి వెళ్ళిపోయింది మరియమ్మ తిరిగి చూడకుండా.

తన కళ్ళను, చెవుల్ని నమ్మలేకపోతున్నట్టు ముఖంపెట్టి ఒక సోఫాలో నిశ్చేష్టురాల్లా కూర్చుండిపోయింది సరితాదేవి.

"మమ్మీ....కాఫీ కావాలి....నాకు అర్జంట్ పని వుంది....కారు కూడా కావాలి. పీటర్‌కి చెప్పు....తాతగారి కారు తీసుకుపోతా...." అంటూ జోహన్ తన గదిలోనుంచి వచ్చాక ఈ లోకంలోకి వచ్చిందామె.

"సీతమ్మా, కాఫీ....త్వరగా తీసుకురా" తల్లినుంచి సమాధానం రాకపోయేసరికి, తనే పెద్దగా పిలిచాడు శోహన్.

ట్రేలో కాఫీ కప్పుల్ని తెచ్చి తల్లీ కొడుకులకు అందించింది సీతమ్మ. ఆమె వెనుకే హాట్‌ప్యాక్స్‌లో బ్రేక్‌ఫాస్ట్ పెట్టి డైనింగ్‌టేబిల్ మీద అరేంజి చేశాడు అవతారం.

"నాన్నగారు ఇంకా నిద్రలేవలేదు. అప్పుడే బ్రేక్‌ఫాస్ట్ రెడీ అవడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది సరితాదేవి.

"డిన్నర్ కూడా రెడీ అయిపోయింది మేడమ్....అన్నీ హాట్ ప్యాక్స్‌లో భద్రం చేశాను....శ్రమ అనుకోకుండా ఈ పూటకి మీరే పెద్ద బాబుగారికి వడ్డించండి....కొత్త వంటమనుషులు ముగ్గురు ఈ సాయంత్రానికి వస్తారు....వాళ్ళతో మాట్లాడి ఎవరు నచ్చితే వాళ్ళని పనిలో పెట్టుకోండి...." వినయంగా చెప్పాడు అవతారం.

"కొత్తవాళ్ళు వస్తారా? పనిలో పెట్టుకోవాలా? ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు? నువ్వు ఏం చేస్తావ్?" మరింత ఆశ్చర్యంగా అడిగింది సరితాదేవి.

"పుట్టిన క్షణంనుంచీ చిన్నబాబును మేమే చూసుకున్నాం మేడమ్....అన్నప్రాశన కూడా మా చేతులతో మేమే చేశాం. ఇప్పుడు ఆ బాబు ఇక్కడ లేకపోతే మాకు పని చేయబుద్ధికావడంలేదు....అందుకే పని మానుకుని వెళ్ళిపోతున్నాం...." తడుముకోకుండా చెప్పింది సీతమ్మ.

"ఎక్కడికి పోతున్నారు?" అడిగింది సరితాదేవి ఆశ్చర్యంగా.

"ఇంకా ఎక్కడికి పోతాము? ఆ బాబు దగ్గిరకే....బయటి తిళ్ళు బాబు ఒంటికి సరిపడవు....మేము దగ్గిర లేకపోతే కడుపునిండా తినను కూడా తినలేడు...." అంటూ కిచెన్ వైపు కాకుండా సరాసరి బిల్డింగ్ బయటికి పోయాడు అవతారం. పమిటచెంగును భుజాలచుట్టూ కప్పుకుంటూ అతన్ని అనుసరించింది సీతమ్మ.

"మైగాడ్ మమ్మీ....ఏమిటి ఇది? వీళ్ళంతా మనమీద సమ్మె చేస్తున్నారేమిటి?" ఆశ్చర్యంగా అడగబోతూ, మాటలను మధ్యలోనే ఆపేశాడు శోహన్. నెమ్మదిగా అడుగులువేస్తూ లోపలికి వచ్చి సరితాదేవికి నమస్కారం చేశాడు వహీద్.



"ఏంటీ నువ్వు కూడా పనిమానేస్తున్నావా?" అతను నోరు తెరవకముందే అరిచినట్టు అడిగింది సరితాదేవి.

ఆ మాటలకు వహీద్ సమాధానం చెప్పకముందే తన గదిలోనుంచి బయటికి వచ్చాడు సురేంద్రసాబ్.

"మీరు ఎవరూ లేకపోతే నేను బతకలేనని అనుకుంటున్నారా? ఏమిటి మీ ఉద్దేశ్యం?" వస్తూనే కోపంగా అడిగాడు.

"అదేమీకాదు బాబుగారూ....మీరు లేకపోతే మా బతుకులు అన్యాయమైపోతాయి గాని, మేము లేకపోతే మీకు ఇబ్బంది కలుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు" వినయంగా సమాధానం ఇచ్చాడు వహీద్.

"అయితే ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఒకళ్ళ తర్వాత ఒకళ్ళుగా అందరూ అవతలికి వెళ్ళిపోవడం దేనికి?"

"చిన్నబాబు పైకి మెత్తగా కనిపించినా లోలోపల పట్టి దుడుకు మనిషి. ఆయనకి ఇప్పుడు మా అవసరం ఎంతైనా వుంది....మేము పని మానేస్తే మళ్ళీ ఈ సాయంత్రానికల్లా మీరు మాలాంటివాళ్ళని వందమందిని పనిలో పెట్టుకోగలరు.

కాని చిన్నబాబు అలా చేయలేడు. అందుకే వెళ్తున్నాం....నమస్కారం" అంటూ సలాంచేసి, సమాధానంకోసం ఎదురుచూడకుండా వెనక్కి తిరిగాడు వహీద్.

"వాడు....ఆ పీటర్‌గాడు మీతోపాటు వస్తున్నాడా?" కోపంగా అడిగాడు సురేంద్రసాబ్. వెంటనే ప్రత్యక్షం అయ్యాడు గోడచాటున నిలబడి వున్న పీటర్.

"ఏంటి? నువ్వుకూడా పోతున్నావా?" అడిగాడు సురేంద్రసాబ్ కోపంగా.

"ఇప్పుడు పోవడం లేదు సార్....మీరు ఇంకెవరినయినా అపాయింట్ చేసుకున్న తర్వాత లెక్కలన్నీ అప్పగించి అప్పుడు పోతాను....ఫారమ్‌హౌస్ మైసయ్య కూడా ఈ మాట మీకు చెప్పమని ఫోన్ చేశాడు. మీరు మా మీద దయవుంచి ఎంత త్వరగా మమ్మల్ని రిలీవ్‌చేస్తే అంత బాగుంటుంది" వినయంగా చెప్పాడు పీటర్.

డైనింగ్ టేబిల్‌మీద వున్న కాఫీకప్పులు, హాట్‌ప్యాక్స్ అన్నీ

ఏగిరిపడిపోయేటట్టు టేబిల్‌ని బలంగా చరిచాడు సురేంద్రసాబ్! "పొండి-అందరూ పొండి....మీ చచ్చుముఖాలు ఇంకెప్పుడూ నాకు చూపించకండి.... విశ్వాసంగా పడివుంటారని అడగకముందే బోలెడు జీతాలిస్తుంటే, మీక కండకావరం పెరిగిపోయింది. ఇంకొక్క క్షణం కూడా నా కళ్ళముందు నిలబడకండి....వెళ్ళిపొండి...." అని అరిచి, తన గదిలో కెళ్ళిపోయాడు.

నోరు తెరుచుకుని బొమ్మల్లా చూస్తున్న సరితాదేవికి, సోహన్‌కి నమస్కారంచేసి, లావుపాటి తాళంచెవుల గుత్తులు నాలుగింటిని వారి ఎదుట పెట్టాడు పీటర్. "లెక్కలన్నీ కంప్యూటర్‌లో ఎక్కించాను....అవసరం అనుకుంటే నా ఫోన్‌కి రింగ్‌చేయండి....వచ్చి వివరాలు చెపుతాను" అంటూ వేగంగా బయటికెళ్ళిపోయాడు.

"ఏంటి మమ్మీ....ఇలా అయిందేమిటి?" ఆశ్చర్యంగా అడుగుతున్న సోహన్‌వంక అదోలా చూసి, "నిన్న నేను చెప్పినపని ఏమయింది?" ఆ దీపక్‌గాడు కార్లపందెంలో గెలవకూడదు" అంది సరితాదేవి.

"అంతా అరేంజి చేయడం అయిపోయింది మమ్మీ....దీపక్‌గాడు పందెంలో గెలవడం మాట దేవుడెరుగు....అసలు వాడు కాళ్ళుచేతులతో తిన్నగా ఇవతలికి రాలేడు....గట్టిగా మాట్లాడితే ప్రాణాలు కూడా దక్కకపోవచ్చు" కాన్ఫిడెంట్‌గా చెప్పాడు సోహన్.

"ఓ.కే....నువ్వు ఆ పనిమీదే వుండు....ఈలోపల నేను తాతయ్యని మన దారిలోకి తీసుకువచ్చి, ఆ లాయర్‌సాబ్‌తో మాట్లాడిస్తాను...." అంటూ లేచి సురేంద్రసాబ్ గది దగ్గిరికి పోయింది సరితాదేవి.

## 16

సిటీ చివరిభాగంలో కనిపించే విశాలమైన మైదానం కిటకిటలాడిపోతోంది. కార్ల పందేన్ని చూడటానికి వచ్చిన జనంతో....రంగురంగుల కార్లు, రకరకాల కార్లు సీతాకోకచిలుకల్లాగా, కళ్ళేలు బిగపట్టివుంచిన గుర్రాలమాదిరి వయ్యారంగా వచ్చి వరుసలో నిలబడుతున్నాయి.

ఆ వెహికిల్స్ గురించి, వాటిని నడిపే డ్రైవర్స్ గురించి వివ



రంగా చెప్పబడుతోంది మైకుల్లో....చప్పట్లు, అరుపులు, కేకలు, కేరింతలతో తమ అభినందనలను వెలుపరిస్తున్నారు అభిమానులు.

"నౌ....హియర్ కమ్స్ ది నెంబర్ ఫార్టీఫోర్....ఎ క్యూట్ అంబాసిడర్ ఆఫ్ వెరీ ఓల్డ్ మోడల్....ది ప్రైడ్ ఆఫ్ ఇండియా...." ఉన్నట్లుండి వినవచ్చింది ఎనౌన్స్‌మెంట్.

శృతిమేడమ్‌ని పక్కన కూర్చోబెట్టుకున్నాడు దీపక్....రాంసింగ్ ఒకవైపు, గండయ్య మరొకవైపు, తమ ముందుభాగంలో జమలయ్య నడుస్తూవుండగా పట్టుపావడా కట్టుకున్న చిన్నపిల్లమాదిరి తయారై వున్న అంబాసిడర్‌ని పందెం స్టార్ట్ అయ్యే ప్రదేశంలోకి తీసుకువచ్చాడు.

"గివ్ హిమ్ ఎ బిగ్ చీర్....విష్ హిమ్ బెస్టాఫ్‌లక్...." అంది మైకులోని కంఠం ఉత్సాహంగా.

అభిమానుల ఈలలు, చప్పట్లు, అరుపులతో మరోసారి మార్మోగిపోయింది ఆ ప్రదేశం,

"లోకల్ పార్టిసిపెంట్స్‌లో నాలుగో మనిషి ఈ అంబాసిడర్‌ని నడిపే దీపక్....హీ ఈజ్ ఓన్లీ ఎ స్టూడెంట్....నాట్ ప్రొఫెషనల్...." దీపక్‌ని గురించిన వివరాలను అందించి, అతని తరువాత వస్తున్న కారును గురించి చెప్పడంలో బిజీ అయిపోయాడు ఎనౌన్సర్.

"వాట్! దీపక్! టెన్షన్‌గా వుందా?" దీపక్‌వైపు చూస్తూ అడిగింది శృతిమేడమ్.

తమ ముందున్న కార్లవంక తదేకంగా చూస్తున్న దీపక్, ఒక్కసారిగా తన ఆలోచనలనుంచి బయడపడినట్లు తల విదిలించి ఆమెకేసి చూశాడు.

"ఊరికే కూర్చోవడం ఇష్టంలేక అప్పటికప్పుడు ఆలోచించి నెత్తిమీద పెట్టుకున్న పని ఇది. స్పోర్టివ్‌గా తీసుకోవాలి. గెలిచినా, ఓడినా ఇటీజ్ జస్ట్ ఎ గేమ్" అతని మీదినించి చూపుల్ని మరలించకుండా చెప్పింది శృతిమేడమ్ అతనికి ధైర్యం చెపుతున్నట్లుగా.

"ఎస్....ఇది జస్ట్ ఎ గేమ్ మాత్రమే. కాని దీన్ని గెలవాలి. గెలిచి తీరాలి. ఎవ్రీథింగ్ డిపెండ్స్ ఆనిట్" పళ్ళు బిగపడుతూ, ఆ పందేన్ని తను ఎంత సీరియస్‌గా తీసుకుంటున్నాడో చెప్పాడు దీపక్.

"ఆ టెన్షనే వద్దని అంటున్నాను దీపక్. ఇది కేవలం ఇవాళ నీ దిన చర్యలో ఒక భాగం మాత్రమే.... ఇదే నీ జీవితం కాదు...." అంది శృతి మేడమ్.

"మీరు ఫికర్ చేయాల్సిన పనిలేదమ్మా! ఏ పని మొదలుపెట్టినా టెన్షన్ వున్నట్టుగానే మాట్లాడతాడు చిన్నబాబు. పని స్టార్ట్ అయిపోగానే రిలాక్స్ అయిపోతాడు. చూస్తూ వుండండి....మీకే అర్థం అవుతుంది" డోర్ తెరిచి పట్టుకుంటూ శృతికి చెప్పాడు గండయ్య.

దీపక్ పక్కనుంచి కిందికి దిగింది శృతిమేడమ్.

అతనితోపాటు కార్లో కూర్చోవాలనే వుంది ఆమెకు. పందెం పూర్తి అయిపోయేదాకా అతన్ని అబ్జర్వ్ చేయాలనే అనిపించింది. కాని, పందెం స్టార్ట్ అయిన తర్వాత కార్లో ఇద్దరికంటె ఎక్కువమంది వుండటానికి వీలు లేదని రూల్స్. అవసరమైతే ఎలా నడపాలో, ఏదైనా బ్రేకేజి వస్తే ఎలా కూపప్ అవ్వాలో వెంటవెంటనే చెప్పగల రాంసింగ్ వెళుతున్నాడు దీపక్‌తో కలిసి....అతన్ని కాదని తను కార్లో కూర్చోవడం అంటే- డిసాస్టర్.

పందెం స్టార్ట్ అవడానికి ఇంకో పావుగంట వ్యవధి మాత్రమే వున్నదని అందరూ అనుకుంటూ వుండగా, పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వచ్చేశాడు అక్కడికి వహీద్.... అతని వెనుకే ప్రత్యక్షం అయ్యాడు పీటర్.

సీతమ్మను అపార్ట్‌మెంట్ దగ్గిర వదిలి అవతారం కూడా ఆ ప్రదేశానికి వచ్చేశాడు.

ఒక్కసారిగా కారుదగ్గిర ప్రత్యక్షమైన వారందర్నీ చూసేసరికి, ఆనందం అధికమైపోయింది దీపక్‌కి. అతనికి తెలియకుండానే నీటితో నిండి పోయాయి కళ్ళు.

"చిన్నబాబూ! మీరు ప్రయాణం చేయాల్సిన ట్రాక్‌ని గురించి నేను కొంచెం తెలుసుకున్నాను. పీటర్ ఇక్కడే వుంటాడు. గండయ్యగారితో నేను ముందుకు పోతాను. దారిమధ్యలో ఎక్కడో ఒకచోట మీకు కని పిస్తాను" అని చెప్పాడు వహీద్. అతను తల ఊపగానే గండయ్యని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" డోర్ దగ్గిర నిలబడి దీపక్‌ని అడిగింది



శృతిమేడమ్.

"ఏమీలేదు శృతీ! మా తాతగారు కూడా వచ్చివుంటే ఎంతో బాగుం డేది. పైకి కనిపించకపోయినా, ఇటువంటి పోటీలంటే ఆయనకి చాలా ఇష్టం. హైస్కూల్లోను, కాలేజీలోను నేను పార్టిసిపేట్ చేసిన గేమ్స్‌కి, పోటీలకు తప్పకుండా వచ్చేవాళ్ళు. ఇటువంటి వాటిల్లో పార్టిసిపేట్ చేయడమే గొప్ప. గెలవడం సంగతి తర్వాత.... అని నాకు ఎప్పుడూ చెపుతుండేవాళ్ళు" అన్నాడు దీపక్.

ఇంకోసారి పేరెంట్స్ కనిపించక భయంతో దిక్కులు చూస్తున్న చిన్నపిల్లాడిమాదిరి కనిపించాడు శృతిమేడమ్‌కి అతను. అతని తలను గుండెలకు అదుముకోవాలన్న కోరిక....వెన్ను నిమిరి ధైర్యం చెప్పాలన్న వాంఛ....వెంటవెంటనే కలిగాయి ఆమెకు.

అక్కడే నిలబడివుంటే, అటువంటి బలహీనమైన ఆలోచనలకు లొంగిపోతానని అనుమానం కలిగింది కాబోలు.... చటుక్కున అవతలికి జరిగిందామె.

* * * *

"చిన్నబాబూ! గెలుపు మనదే.... నిర్భయంగా నడపండి. మనల్ని మించినవాళ్ళు ఎవరూ ఈ పందెంలో నాకు కనిపించడంలేదు" వున్నట్టుండి దీపక్‌కి చెప్పాడు పీటర్. అతని మాటలకు స్టీరింగ్‌మీద చేతులు తీసి, ఒళ్ళు విరుచుకుంటూ చిన్నగా నవ్వాడు దీపక్.

సరిగ్గా అప్పుడే వినవచ్చింది ఆ ఎనౌన్స్‌మెంట్....

"గెట్ రెడీ ఎవ్రీబడీ....ఇంకో రెండు నిముషాల్లో క్రాస్ కంట్రీ కార్ రేస్ స్టార్ట్ అవుతుంది."

కారుదగ్గిర నిలబడి డ్రైవర్స్‌కి శుభాకాంక్షలు చెబుతున్న శ్రేయోభిలాషులు అందరూ ఒక్కసారిగా ట్రాక్ మీదినించి అవతలికి పరిగెత్తారు.

శృతిమేడమ్‌ని వెంటబెట్టుకుని పీటర్, అవతారం ఇద్దరూ వెనక్కి వెళ్ళిపోయారు.

అందరికీ సుస్పష్టంగా వినబడేటట్లు ఒక గన్ గర్జించింది. ట్రాక్ దగ్గిర వున్న పందెం నిర్వాహకుడు ఒకరు రేస్ జెండాని గాలిలో అటూ ఇటూ ఊపాడు.

పొగలు విడుస్తూ ముందుకు దూకాయి కార్లు. పళ్ళుబిగించి యాక్సిలేటర్స్‌ని అదుముతూ, ఒకేసారి ముందు భాగంలోకి వెళ్ళిపోవడానికి ట్రై చేశారు కొందరు డ్రైవర్లు.

"ఇప్పుడే....ఈ ఎగ్జయిట్‌మెంట్‌లోనే తల్లకిందులు అయిపోతారు కొంతమంది. ఇప్పటికిప్పుడు ముందుకు పోవడం ముఖ్యంకాదు....క్షేమంగా పోవడం ముఖ్యం" డ్యాష్‌బోర్డ్‌మీద చేతులుపెట్టి తమ ముందున్న వెహికిల్స్‌వైపు చూస్తూ దీపక్‌కి చెప్పాడు రాంసింగ్.

అతని సూచనల్ని అమలులో పెట్టాడు దీపక్.

వీణ మీటినట్టు మృదుమధురంగా సౌండ్స్ వెలువరుస్తోంది జమలయ్య ట్యూన్‌చేసిన అంబాసిడర్ ఇంజన్.

ఒక్క భాగాన్ని కూడా వదిలిపెట్టకుండా కార్లోవున్న ప్రతి పార్టునీ చెన్జ్‌చేసి తేడాలుంటే సరిచేశాడు కాబోలు.... సుతిమెత్తగా నడుస్తోంది బండి....

"అయిపోయాడు....ఆ నెంబర్ ట్వంటీవన్‌గాడు అయిపోయాడు" ఉన్నట్లుండి చెప్పాడు రాంసింగ్. అతని మాటలు పూర్తిఅవడం, ముందుకు పోవాలన్న తపనతో ర్యాష్‌గా డ్రయివ్‌చేసిన ట్వంటీవన్ నెంబర్ డ్రైవర్, తన ఎదుటవున్న కాస్ట్లీ కారును ఢీకొట్టడం ఒకేసారి జరిగింది. దబ్‌మనే శబ్దంతోపాటు, నల్లటిపొగలు, వాటివెనుకే ఎర్రటి మంటలు వెదజల్లుతూ షార్ప్‌గా పక్కకు తిరిగి, మరో రెండు కార్లను ఢీకొట్టాయి ఆ వెహికిల్స్.

"మీ లెఫ్ట్‌కి చూడండి.... రైట్‌కి కోయండి.... స్పీడు పెంచండి.... బ్రేకు వేయండి....రైట్‌కే కోయండి" ట్రాక్‌మీదినించి దృష్టిని మరల్చకుండా క్రికెట్ కామెంటరీ చెప్పినట్టు దీపక్‌కి చెప్పాడు రాంసింగ్.

ట్రాక్‌మీద గింగిరాలు తిరుగుతూ ఒక పక్కకు జారిపోతున్న వెహికిల్స్ తమ దారికి అడ్డం రాకుండా, అతను చెప్పినట్టే చేస్తూ, ముందుకు దూసుకుపోయాడు దీపక్.

"రేస్ మొదలైన మొదటి నిముషంలోనే ఆరు కార్లు హాంఫట్ అయిపోయాయి. దేవుడి దయవల్ల మనకి ఇబ్బంది ఏదీలేదు" సీట్లో సర్దుకు కూర్చుంటూ ఉత్సాహంగా చెప్పాడు రాంసింగ్.

ట్రాక్‌మీదినించి మొదటిసారిగా ఒక రోడ్డుమీదికి పోతూ, గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు దీపక్.



* * * *

రేస్ స్టార్ట్ అయిన రెండుగంటల తర్వాత మైదానం మొత్తం ఖాళీ అయిపోయింది.

"మనం కూడా ఇంటికిపోయి కొంచెం రెస్ట్ తీసుకుని వద్దాం మేడమ్....ఈ పందెం మొత్తం పన్నెండుగంటల్లో ముగుస్తుంది....మొదటి కారు రాత్రి పదిగంటల తర్వాత గాని ఇక్కడికి చేరుకోదు...." కార్లు పరిగెత్తిన వైపే చూస్తున్న శృతిమేడమ్‌కి చెప్పాడు పీటర్.

"దీపక్‌తో మనం ఫోన్‌లో మాట్లాడవచ్చా?" అని పీటర్‌ని అడిగింది శృతిమేడమ్.

"అదేమంత గొప్ప విషయం కాదుగాని, మనం చిన్నబాబు కాన్సన్‌ట్రేషన్‌ని దెబ్బతీస్తాం" అన్నాడు.

ఆ మాట నిజమనిపించి, ఫోన్‌చేసే ఆలోచనను వెంటనే విరమించుకుంది శృతిమేడమ్.

"వహీదూ....ఆటో పిలువ్...." అని వహీద్‌కి చెప్పబోతూ, మాటల్ని ఆపాడు పీటర్.

రయ్‌మని లాయర్ దామోదరం కారు దూసుకురావడమే అందుకు కారణం.

లాయర్‌సాబ్‌ని చూసేసరికి కలువపువ్వు మాదిరి విప్పారింది శృతి మేడమ్ ముఖం.

గబగబా లాయర్‌సాబ్‌కి ఎదురు వెళ్ళిపోయింది.

"వ్యవహారాలన్నీ విపరీతమైన వేగంతో కదులుతున్నాయిరా....ఈ పందెంలో పార్టిసిపేట్ చేయడం దీపక్‌కి అనవసరం" ఆమెను దగ్గిరకి తీసుకుని, నుదుటిమీద ముద్దు పెట్టుకుంటూ చెప్పాడు లాయర్‌సాబ్.

"ఏమైంది మామయ్యా?" అడిగిందామె.

"ఆస్తి పంపకాలు కూడా బయటికి వచ్చేశాయి....ఆ సరితాదేవి చాలా కర్కశంగా బిహేవ్ చేస్తోంది. సమ్‌థింగ్ ఈజ్ గోయింగ్ టు హ్యాపెన్" అంటూ పీటర్‌వంకా, వహీద్‌వంకా, అవతారం వంకా చూశాడాయన.

"నీ అంచనా ఏమిటి?" అడిగింది శృతిమేడమ్.

"అంచనాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవురా....సురేంద్ర ఆస్తిలో మూడొంతులు అతనికి వారసత్వం ద్వారా సంక్రమించిందే....ఆ మూడొంతుల ఆస్తి సరాసరి దీపక్‌కి వచ్చేస్తుంది. మిగిలింది సురేంద్ర మెయింటెనెన్స్‌కి....అది కూడా అతని తర్వాత దీపక్‌కే రావాలి. ఎటు నుంచి చూసినా దీపక్ సేఫ్‌గానే వున్నాడు."

"ఓ.కె! తర్వాత?" అడిగింది శృతిమేడమ్.

"తర్వాత గిర్వాత ఏమీ లేదు....ఈ టైమ్‌లో దీపక్ చాలా జాగ్రత్తగా వుండాలి. అతనికి ఏమయినా జరిగిన వెంటనే, ఆస్తి అంతా నెక్స్ట్ వారసురాలు సరితాదేవికి వెళ్ళిపోతుంది" అన్నాడు లాయర్‌సాబ్.

ఝల్లుమన్నాయి శృతిమేడమ్ గుండెలు.

* * * *

"చిన్నబాబూ....సుఖపడే టైం అయిపోయింది. ఇక గతుకులరోడ్డు మొదలయింది....జాగ్రత్త!" ఉన్నట్టుండి రాంసింగ్ హెచ్చరించడంతో, క్లచ్‌మీద కాలుపేసి, గేర్స్ ఛేంజి చేశాడు దీపక్,

ఏదో పెద్ద అగాధంలో పడినట్టు ఒక్కసారిగా పెద్ద కుదుపు కుదిపింది కారు. ఎగిరెగిరిపడుతూ వందగజాల దూరం పోయి స్టడీ అయింది.

"స్పీడ్‌కోసం చూసుకోవద్దు...." అని హెచ్చరించాడు రాంసింగ్.

సుమారు రెండువందల గజాల దూరం పోయిన తరువాత అతను ఆ మాటలు ఎందుకన్నాడో దీపక్‌కి ప్రత్యక్షంగా కనిపించింది.

యాక్సిల్స్ విరిగి రెండు కార్లు ట్రాక్ పక్కనే కనిపించాయి. ఫ్రంట్ టైర్లకు ఏదోఅవడంవల్ల మరో మూడు ఇంకా కొంచెం ముందుకు పోయాక అగుపించాయి.

"అందరూ తెలివిగలవాళ్ళే....రోడ్డును గురించి పట్టించుకోకపోతే ఇదిగో....ఇలాగే వుంటుంది బతుకు" అన్నాడు రాంసింగ్ వెటకారంగా.

అంతకుముందు నడిపిన స్పీడ్‌లో మూడోవంతుకు దిగిపోయారు దీపక్....అంబాసిడర్‌ని అతినేర్పుగా గతుకుల మీదినించి పోనిచ్చాదు.

రెండు కిలోమీటర్ల దూరంపోయిన తర్వాత ఎదురైంది వాళ్ళకి, చిత్తడి రోడ్డు, వర్షం కురవడంవల్లనో, పందెం నిర్వాహకులు ట్యాంకర్లతో



నీళ్ళు పోయించడం వల్లనో తడిగా మారి, పెద్ద జారుడుబల్ల మాదిరి వుంది అది.

"మన కారు బరువు ఎక్కువ....ఈ పరిస్థితికి మనం భయపడాల్సిన పనిలేదు" అన్నాడు రాంసింగ్.

అరకిలోమీటరు కూడా పోకముందే, వారికి కనిపించాయి అరడజను కార్లు. చిత్తడినేల స్వభావాన్ని అంచనా వేయలేకపోవడంతో, బురదలో దిగబడి కదలకుండా ఆగిపోయి వున్నాయి.

విషణ్ణవదనంతో తనవంక చూసిన ఆ కార్ ఓనర్సందర్నీ చూపులతోనే పరామర్శిస్తూ అంబాసిడర్‌ని అతి చక్కగా ఆ రోడ్డు దాటించాడు దీపక్.

"ఇప్పుడు స్పీడ్ పెట్టండి. మన ముందు ఇంకా పధ్నాలుగు కార్లున్నాయి" అన్నాడు రాంసింగ్.

అతనా మాట అంటుండగానే, మొట్టమొదటి చెక్ పాయింట్ వాళ్ళకి కనిపించింది.

స్టీరింగ్‌ని వదిలి పరిగెత్తుకుంటూపోయి, చెక్ పాయింట్ దగ్గిర వున్న బుక్‌మీద సంతకం పెట్టి వచ్చాడు దీపక్.

కార్లో కూర్చుని యాక్సిలేటర్‌ని బలంగా అదిమాడు.

ఇంకో రెండు కిలోమీటర్ల దూరం పోయాక వున్నట్లుండి....

"ఆపండి....ఆపండి" బిగ్గిరిగా అరిచాడు రాంసింగ్.

రెండో ఆలోచన చెయ్యలేదు దీపక్. యాక్సిలేటర్‌మీది కాలును తీసి బ్రేకుల మీద వేశాడు. కీచుధ్వనులు చేస్తూ పదిగజాల దూరంపోయి ఆగింది కారు.

సరిగ్గా....కారు ముందుభాగానికి మూడు అంగుళాల దూరంలో నుంచి దబదబమని శబ్దాలు చేస్తూ దొర్లుకుంటూ రోడ్డు అవతలిపక్కకు పోయి పడింది- పెద్ద బండరాయి.

తను బ్రేకు వేసి కారును ఆపివుండకపోయినట్లయితే, అది సూటిగా వచ్చి, కారుమీదే పడివుండేది.

అలా పడితే ఏం జరిగివుండేదో తలుచుకునేసరికి దీపక్ ముఖంమీద

ప్రత్యక్షమయ్యాయి చెమటబిందువులు. కొండదారి అది....ఘాట్‌రోడ్డు కాకపోయినా, రోడ్డుకు అటూ ఇటూ నిలువుగా ఆకాశంలోకి లేచి వున్నాయి పెద్ద పెద్ద కొండలు.

దొర్లుకుంటూ వచ్చి రోడ్డుమీద బండరాళ్ళు పడటం సహజమే అయినా, ఆ పర్టిక్యులర్ టైమ్‌లో ఆ రాయి వచ్చి పడటంమాత్రం విచిత్రమే....

నొసలు ముడివేసి తనవైపు చూసిన దీపక్‌కి ఏం సమాధానం చెప్పాలో రాంసింగ్‌కి అర్థంకాలేదు.

"జాగ్రత్తగా వుందాం. చిన్నబాబూ పోనీయండి" అనిమాత్రం అన్నాడు.

పెదవులు బిగపట్టి కారును కదిలించాడు దీపక్....సాయంత్రం అవుతుండగా రెండు. మూడు చెక్‌పాయింట్స్‌ని క్రాస్‌చేశారు వాళ్ళు.

"ఇంకా ఒక్కటే ఒక్కటి....దాన్ని కూడా దాటితే....ఇంటిదారి పట్టవచ్చు. మనముందు ఇంకా నాలుగు కార్లే వున్నాయి" సంతోషంగా అన్నాడు రాంసింగ్.

"అతను ఆ మాట అంటూ వుండగానే, "మైగాడ్....ఏంటది?" అంటూ స్టీరింగ్‌ని బలంగా పక్కకు తిప్పాడు దీపక్. గింగిరాలు తిరుగుతూ వచ్చి ఎదుట వున్న అద్దానికి తగిలింది లావుపాటి చెట్టుకొమ్మ ఒకటి.

అద్దం భళ్ళున పగిలిపోయింది. అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాడు దీపక్.

కంట్రోల్ తప్పింది కారు....రోడ్డు పక్కనే పల్లం....ఏటవాలుగా జరుగుతూ పాతిక అడుగులు కిందికి వెళ్ళిపోయి, ఒక బండరాయిని ఢీకొట్టి ఆగిపోయింది.

## 17

అష్టకలుష్టాలు పడి ఒక వంటమనిషిని సురేంద్ర ఇంటికి పంపించాడు లాయర్‌సాబ్.

సాయంత్రం అయిదుగంటల వేళలో లాయర్‌సాబ్‌కి ఫోన్‌చేసి,



"ఈ ఇంట్లో పనిచేయడం నావల్లకాదు సార్. తప్పు జరిగినా తిట్టిపోస్తున్నారు. జరగకపోయినా తిడుతున్నారు. మీరు ఇంకో మనిషిని చూసుకోండి. నేను వెళ్ళిపోతున్నా" అంటూ సమాధానంకోసం ఎదురుచూడకుండానే ఫోన్ పెట్టేశాడు అతను.

కారు తీసుకుని శరవేగంతో వెళ్ళాడు లాయర్‌సాబ్.

"దీనికంతా ఆ దీపక్‌గాడే కారణం....వాడే పనివాళ్ళను రెచ్చగొట్టి పని మానిపిస్తున్నాడు" తండ్రి వింటూ వుండగానే ఆయనకి చెప్పింది సరితాదేవి. ఆపసోపాలు పడుతూ తనే కాఫీ తయారుచేసి తీసుకువచ్చింది.

మొహమాటానికిపోయి రెండు గుటకలు వేశాడాయన. సురేంద్రసాబ్‌కి మొహమాటంలేదు కాబోలు.

"ఏడ్చినట్టుంది. ఇది అసలు కాఫీయేనా?" అంటూ కప్పును అవతలికి విసిరికొట్టాడు.

"కాస్త ఓపిక పట్టండి నాన్నగారూ....సోహన్‌ని పంపి హోటల్ నించి తెప్పిస్తాను" అంటూ సోహన్ రూమ్‌లోకి పోయింది సరితాదేవి.

ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి అప్పుడే ఫోన్ పెట్టేస్తున్నాడతను. "అయిపోయింది మమ్మీ....ఆ దీపక్‌గాడి కారు పాతిక అడుగుల పల్లంలో పడిపోయిందిట....అంబాసిడర్ అది. పైకి లాక్కురావడం వాడికి చేతకాదు. క్రేన్ ఏదయినా తీసుకుపోతేతప్ప మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టలేడు...." సంతోషంగా ఆమెకు చెప్పాడు.

ఆప్యాయంగా అతన్ని దగ్గిరికి తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుంది సరితాదేవి.

"నువ్వు తలుచుకుంటే ఏమైనా చేయగలవు....ముందు అర్జెంటుగా ఏదైనా హోటల్‌నించి కాఫీ తీసుకురా...." అంటూ అతన్ని బయటికి పంపించింది.

"సురేంద్రసాబ్ మనవడు కార్లపందెంలో పార్టిసిపేట్ చేస్తున్నాడని సిటీలో అందరూ ఎంత గొప్పగా చెప్పుకుంటున్నారు. ఒకసారి అక్కడికి పోయివస్తే ఎలా వుంటుంది?" సురేంద్రసాబ్‌ని అడుగుతున్నాడు లాయర్‌సాబ్.

"వాడి దగ్గిరికా? నేనా? చచ్చినాపోను...." మొండిగా అంటున్నాడు సురేంద్రసాబ్.

తనకు అవకాశం దొరికిన వెంటనే ఆ సంభాషణలో పాలుపంచుకుని, తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియచేయడంకోసం రెడీగా వాళ్ళ దగ్గిరకు వచ్చి కూర్చుంది సరితాదేవి.

* * * *

"ఒకటి....రెండు....ఎనిమిది....పన్నెండు...." అంటూ మొత్తం పధ్నాలుగు కార్లను లెక్కపెట్టాడు రాంసింగ్. అన్నీ వారికంటే వెనుక వున్నవే....కాస్తంత ఆలస్యమయ్యేసరికి, వారిని దాటి ముందుకు దూసుకుపోయాయి.

బండరాయిని ఢీ కొట్టడంవల్ల కారుకి ఎటువంటి డ్యామేజీ జరగలేదని నిశ్చయం చేసుకుని, రాంసింగ్ ఇచ్చిన సిగరెట్‌ని వెలిగించుకున్నాడు దీపక్. గుండెలనిండా పొగ పీల్చుకుంటూ చుట్టూ చూశాడు.

ఎక్కడినించి జారుకుంటూ వచ్చారో, ఆ ప్రదేశంలోకి కారును తీసుకుపోవడం అవుటాఫ్ క్వశ్చన్. ఏటవాలుగా అంతఎత్తు ఒకేసారి ఎక్క లేదు అది....

వెనుకనుంచి నెట్టుకుంటూ ఎక్కించడం ఇంకా కష్టం. కారు బరువు సామాన్యమైంది కాదు. తనవల్లకాదు రాంసింగ్‌వల్ల అంతకన్నా కాదు. ఇక మిగిలింది ఒకే ఒక మార్గం....కుడిచేతివైపున వున్న కొండగుట్ట.

రాత్రి ట్రాక్‌ని చూడటానికి వచ్చినప్పుడు జమలయ్య ఆ గుట్టను చూపించి చేసిన కామెంట్స్ అతని చెవుల్లో మార్మోగాయి. "కమాన్ రాంసింగ్....ఆ గుట్టమీదికిపోదాం" అంటూ కారెక్కి ఇంజన్‌ని స్టార్ట్ చేశాడు.

దారికి అడ్డుగా వున్న పెద్దపెద్ద బండల్ని తప్పించుకుంటూ, చిన్న చిన్న పొదల్ని విరగతొక్కుకుంటూ గుట్టమీదికి బయలుదేరింది కారు.

ముంగాళ్ళమీద కూర్చున్నాడు రాంసింగ్. అవసరం అయితే దీపక్‌తోసహా కిందకి దూకడానికి రెడీగా వున్నాడు. నిముషానికి నాలుగుసార్లు పక్కకు పడిపోవడానికి రెడీ అవుతున్నట్లు షార్ప్‌గా ఒరుగుతూ గుట్ట మధ్యభాగంలోకి పోయింది కారు.



"నొక్కండి....యాక్సిలేటర్‌ని నొక్కండి. గేరు మార్చద్దు" అరిచాడు రాంసింగ్.

ముందరి కాళ్ళకు బంధాలువేసిన గుర్రం ఎలా గెంతుతుందో, అలాగే ఎగిరెగిరిపడుతూ వున్నట్టుండి బర్రున ముందుకుపోయి గుట్ట పై భాగంలోకి చేరుకుంది అంబాసిడర్. "ఇక్కడ కొంతసేపు ఆగుదాం చిన్నబాబూ....కాస్తంత ఆగి ఇంజన్‌కి కొంచెం రెస్ట్‌ఇచ్చి కిందికి దిగుదాం" కళ్ళల్లోకి కారుతున్న చెమటబిందువుల్ని చేత్తో తుడుచుకుంటూ చెప్పాడు రాంసింగ్.

ఆ పని చేయడం దీపక్‌కి ఇష్టం లేకపోయింది. నయానో, భయానో, జమలయ్య పనితనంలోని సుపీరియారిటీ మూలకంగానో, ఎక్కరాని ఎత్తుకు ఎక్కింది అంబాసిడర్. ఓ.కే.అప్పుడు గనుక అక్కడ ఆగి తమ ముందున్న దారిని,దాని మంచిచెడుల్ని బేరీజు వేసుకోవడం మొదలుపెడితే, తన ధైర్యం దిగజారిపోవచ్చు. విపరీతంగా స్ట్రెయిన్ అయివున్న ఇంజన్ తిరిగి స్టార్ట్ కాకపోవచ్చు. ఎందుకు అనవసరమైన రిస్కు? ఒక్కక్షణం ఊపిరి బిగపట్టాడు.

రాంసింగ్‌కి చెప్పనుకూడా చెప్పకుండా, క్లచ్‌మీది కాలును తీసి యాక్సిలేటర్‌ని అదిమాడు దీపక్. దడదడమని శబ్దంచేస్తూ కిందికి దిగడం మొదలుపెట్టింది కారు. సగందూరం సవ్యంగానే దిగింది. ఉన్నట్లుండి ఒక బండరాయిని ఢీకొట్టి ఛెంగున గాలిలోకి లేవడంతో బ్యాలెన్స్ తప్పిపోయింది.

"జాగ్రత్త....జాగ్రత్త చిన్నబాబూ...." భయంగా అరిచాడు రాంసింగ్. అతను అరవడం, అంబాసిడర్ షార్ప్‌గా పక్కకు దొర్లడం ఒకేసారి జరిగిపోయాయి.

పాదాలను ఫ్లోర్‌కేసి అదిమి, స్టీరింగ్‌ని గట్టిగా పట్టుకున్నాడు దీపక్. అవసరం అయితే అవతలికి జంప్ చేయడానికి రెడీగా డోర్ హ్యాండిల్‌ని పట్టుకున్నాడు రాంసింగ్. ఆ డోర్ తనంతట తనే తెరుచుకోవడంతో రాక్షసహస్తం ఏదో తనను పట్టుకుని బయటికి విసిరేసినట్లు కార్లో నుంచి పోయి పడ్డాడు.

రబ్బర్ బంతిమాదిరి పల్టీలుకొడుతూ అతివేగంగా గుట్టకిందికిపోయి,

దఢేల్మని పెద్ద శబ్దంతో ఆగిపోయింది అంబాసిడర్. "చిన్నబాబూ....చిన్నబాబూ....ఎక్కడ? ఎక్కడున్నారు?" ఆందోళనతో కంపించిపోతూ బిగ్గరగా అరిచాడు రాంసింగ్. అతన్ని భయం ఆవరించింది.

సమాధానం వినిపించలేదతనికి. అంత ఎత్తునుంచి పల్టీలు కొడుతూ కిందికి జారిపోయిన తర్వాత కూడా పని చేస్తూనే వుంది అంబాసిడర్ ఇంజన్....ఆ మోతలో తన అరుపులు దీపక్‌కి వినిపించి వుండవని అనుకుంటూ, అతివేగంగా కారు దగ్గిరికి పరిగెత్తాడతను.

* * * *

"ఒక్కసారి మనం రేస్‌కోర్స్ దగ్గిరికి వెళ్ళివస్తే ఎలా వుంటుంది?" చీకటి పడిన అరగంటతరువాతపీటర్‌ని అడిగిందిశ్రుతిమేడమ్ సాలోచనగా.

"ఇంకో గంట తర్వాత వెళ్దాం మేడమ్. ఇప్పుడు అక్కడ ఎవరూ వుండరు తాపీగా చెప్పాడు పీటర్.

"ఒకపని చేయండి మేడమ్....ఊరికే కూర్చుంటే అనవసరమైన ఆలోచనలు వస్తూనే వుంటాయి. మీరు ఇంటికివెళ్ళి మీ అత్తయ్యగారితో మాట్లాడి....ఫ్రెష్‌అప్‌అయి రండి. అందరం కలిసిపోదాం" సజెస్ట్ చేశాడు గండయ్య.

రెండుక్షణాలు ఆలోచించిన తర్వాత, అదే మంచిపని అనిపించి, తన డ్రైవర్‌కి సైగచేసింది శ్రుతిమేడమ్. అతను తీసుకువచ్చిన కార్లో కూర్చుని దీపక్ అపార్ట్‌మెంట్ దగ్గిర్నించి ఇంటికి బయలుదేరింది.

మూడు ట్రాఫిక్ సిగ్నల్స్‌దాటి అవతలికి వెళ్ళేటంతవరకూ సజావుగానే జరిగింది ఆమె ప్రయాణం. విపరీతమైన రష్‌తో నిండివున్న ఒక మెయిన్‌రోడ్డును వదిలి, ట్రాఫిక్ తక్కువగా వున్న ఇంకోవీధిలోకి మరలుతుండగా, వున్నట్లుండి ఉలిక్కిపడ్డాడు ఆమె డ్రైవర్.

"ఏమిటి? ఏమైంది?" సీటుముందుకు వంగి, ఆశ్చర్యంగా చూస్తూ, అడిగింది శ్రుతిమేడమ్.

కారును పూర్తిగా ఆపి, ముందుకు చూడమని సైగచేశాడు డ్రైవర్. వారు అలా చూస్తున్న క్షణంలో మెయిన్‌రోడ్డు మీదినించి వారి కారువెనుకే ట్రాఫిక్ తక్కువగా వున్న రోడ్డుమీదికి వచ్చింది ఒక క్వాలిస్. ఓవర్‌టేక్‌చేసి సరిగ్గా వారి దారికి అడ్డంగా ఆగింది.



"హారన్ వెయ్యి....వాళ్ళు ఎవరో చూడు" విసుగునిండిన కంఠంతో ఆర్డర్ ఇచ్చింది శ్రుతిమేడమ్.

డోర్ తెరుచుకుని డ్రైవర్ కిందికి దిగబోతుండగా, పెద్దపెద్ద అడుగులు వేస్తూ వారి కారు దగ్గిరికి వచ్చారు క్వాలిస్‌లోనుంచి దిగిన ఆజానుబాహులు అరడజనుమంది. అంతా కిరాయిగూండాల్లా వున్నారు.

"ఎవరు మీరు?" అని అడిగే అవకాశం శ్రుతిమేడమ్‌కి గాని, ఆమె డ్రైవర్‌కిగాని లభించలేదు.

కిందికి దిగబోతున్న డ్రైవర్ ముఖం పగిలిపోయేటట్టు బలంగా కొట్టి, అరిచి కేకలుపెట్టకుండా నోటిని అదిమారు ఇద్దరు ఆజానుబాహులు. వెనుకడోర్‌ని తెరిచి శ్రుతిమేడమ్‌ని పట్టుకున్నారు మిగిలినవారు.

ఆ వీధిలో సంచరిస్తున్న జనానికి అక్కడ ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపుగానే క్వాలిస్‌లోకి లాగబడింది ఆమె. ముఖం పగిలి పిచ్చిచూపులు చూస్తున్న డ్రైవర్‌ని కూడా లోపలికి నెట్టి, శరవేగంతో ముందుకు దూసుకుపోయారు వాళ్ళు. అరగంట తర్వాత రోడ్డుమధ్యలో ఆగిపోయిన లాయర్‌సాబ్ కారు మెయిన్‌రోడ్డుమీద డ్యూటీలో వున్న ట్రాఫిక్ పోలీసుల దృష్టిలో పడింది.

ఎనిమిది గంటలు అవుతుండగా లాయర్‌సాబ్‌కి తెలిసింది ఆ విషయం. ఎనిమిది గంటల పదినిముషాలకు శ్రుతిమేడమ్ కనిపించడం లేదన్న వార్త గండయ్య, వహీద్, పీటర్‌లకు తెలిసి ఖంగారుపడ్డారు.

* * * *

"చిన్నబాబూ! చిన్నబాబూ!" అని పిలుస్తూ రాంసింగ్ కారు దగ్గిరికి రావడం దీపక్‌కి తెలియడమైతే తెలిసిందిగాని, వెంటనే సమాధానం ఇవ్వలేకపోయాడతను.

తలకున్న హెల్మెట్ కారణంగా సేవ్ అయింది అతని తల. పల్టీలు కొట్టడంలో డోర్‌కి పొడుచుకుని దారుణమైన 'నొప్పిని క్రియేట్ చేయడం మొదలుపెట్టింది కుడిభుజం....కుడికాలు మడమ బాగా స్ట్రెయిన్ అయినట్లు తీవ్రమైన పెయిన్. ఏమైందో తెలియదు.

"మంచినీళ్ళు.... మంచినీళ్ళు కావాలి" డోర్ దగ్గిరికి వచ్చిన రాంసింగ్‌తో అస్పష్టంగా చెప్పాడతను.

బండరాయిమాదిరి దొర్లుకుంటూ వచ్చి, సమతలంగా వున్న గుట్ట అడుగుభాగంలో, అదృష్టవశాత్తూ సరైన పొజిషన్‌లోనే చతికిలపడింది అంబాసిడర్.

రాంసింగ్ కూర్చున్నవైపు డోర్ ఊడి ఎక్కడో పడిపోయింది. డ్యాష్‌బోర్డు మీదినుంచి కిందపడిపోయిన వాటర్ బాటిల్‌ని తీసి దీపక్‌కి అందించాడు రాంసింగ్.

"దేవుడు మనల్ని చాలా దయగా చూశాడు చిన్నబాబూ! ఈపాటికి మీరు, నేను చచ్చి స్వర్గానికి వెళ్ళిపోతూ వుండాల్సినవాళ్ళం" అంటూ ఎంత ఎత్తునుంచి తాము దొర్లుకుంటూ కిందికి వచ్చారో కనులతోనే అంచనావేస్తూ అస్పష్టంగా అన్నాడు రాంసింగ్.

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం....ముందు కారెక్కు" వాటర్ బాటిల్‌ని ఖాళీచేసి అవతలికి విసురుతూ అన్నాడు దీపక్ అంత బాధ లోనూ.

అతనివంకా, కారువంకా పట్టిపట్టి చూసి. మళ్ళీ తన స్థానంలోకి చేరుకున్నాడు రాంసింగ్.

గుండెలనిండా గాలి పీల్చుకుని, గేర్‌ని మార్చాడు దీపక్. గర్‌ర్‌మని చాలా కర్ణకఠోరమైన శబ్దం చేసింది ఇంజన్. ఆగిపోతోందని రాంసింగ్ అనుకుంటూ వుండగా, పెద్ద జర్క్ ఇచ్చి ముందుకు దూకింది కారు.

యాక్సిలేటర్‌ని అదుముతూ, చాలా బాధగా నొసలు విరిచాడు దీపక్. రాంసింగ్‌కి అర్థంకాలేదు.

"ఏమైంది చిన్నబాబూ?" అడిగాడు రాంసింగ్.

"కాలు.... కుడికాలు సమ్‌థింగ్ వెరీ రాంగ్.... విరిగిపోయినంత బాధ....కళ్ళవెంట నీళ్ళు వస్తున్నాయి" పళ్ళు బిగపట్టి కారును పదిగజాల దూరంలోవున్న మట్టిరోడ్డు మీదికి ఒడుపుగా పోనిస్తూ చెప్పాడు దీపక్.

"యాక్సిలేటర్‌ని అదమగలుగుతున్నారా లేదా?" అడిగాడు రాంసింగ్ అతనివైపు సందేహంగా చూస్తూ.

"అదమలేకపోతే కారు ముందుకు ఎలా కదులుతుంది?" ఎదురు ప్రశ్న వేశాడు దీపక్.

కారు మట్టిరోడ్డుమీదికి చేరుకుని, ఎగిరెగిరిపడుతూ ప్రయాణం



మొదలుపెట్టిన తర్వాత ముఖమంతా నోరుచేసుకుని పకపకా నవ్వాడు రాంసింగ్.

"సరిగ్గా పన్నెండు నిముషాల టైమ్ వేస్ట్ అయింది చిన్నబాబూ! మీ కాలుకు జరిగిన డ్యామేజీ టెంపరరీనే.... పర్మినెంట్ కాదు.... కాలు ఫ్రాక్చర్ అయితే యాక్సిలేటర్‌ని మీరు నొక్కలేరు....టెన్షన్ పడకండి. సిటీలోకి పోగానే సరాసరి డాక్టర్ దగ్గిరికి వెళ్ళి చూపిద్దాం" అన్నాడు.

అతను ఆ మాట అన్నా అనకపోయినా, టెన్షన్ మాత్రం దీపక్‌ని వదిలిపెట్టలేదు.

"అవతలిపక్కన ఐదు నిమిషాలు, ఇవతలిపక్కన పన్నెండు నిముషాలు. టోటల్‌గా ఒక ఇరవై నిముషాలు వేస్ట్ అయినట్టే. గుట్ట ఎక్కడం వల్ల మనకి ఆదా అయిన టైమ్ ఎంతో తెలియలేదు.... అసలు మనముందు ఎంతమంది వున్నారో కూడా తెలియదు" తనలో తను అనుకుంటూ కారును వరిపాడు దీపక్.

అరగంట తర్వాత అతనికి కనిపించింది లాస్ట్ అండ్ ఫైనల్ చెక్ పాయింట్. అల్లంతదూరంలో వుండగానే, కుర్చీల్ని వదిలి గబగబా ముందుకు వచ్చారు అక్కడ నియమించబడిన పర్సనాలిటీలు....

"యువ్వార్ గ్రేట్....యువ్వార్ ఇన్ సెకండ్ ప్లేస్...." అంటూ సొట్టలుపడి, డోర్ ఊడిపోయి పరమ వికృతంగా తయారైన అతని కారును చూసి ఆశ్చర్యంగా నొసలు ఎగురవేశాడు వారిలో ఒకతను.

"చిన్న యాక్సిడెంట్....లక్కీగా బయటపడ్డాం" అంటూ అక్కడ అటెండెన్స్ వేయించుకుని కారుని ముందుకు దూకించాడు దీపక్.

"ఇప్పుడు మనకి స్పీడ్ కావాలి. స్టీరింగ్ నాకు ఇచ్చేయండి" అతని స్థానంలోకి జరిగి స్టీరింగ్ తీసుకోవడానికి రెడీ అవుతూ అన్నాడు రాంసింగ్.

"ఇంత దూరం వచ్చిన తర్వాత ఇప్పుడు ప్లేసులు మారడం వేస్ట్. అవసరంలేదు" అంటూ యాక్సిలేటర్‌ని బలంగా అదిమాడు దీపక్ పట్టుదలగా.

రెక్కలగుర్రం మాదిరి ప్రయాణం ప్రారంభించింది అంబాసిడర్. రేస్ స్టార్ట్ అయినప్పుడు ఎంత స్మూత్‌గా, సున్నితంగా పనిచేసిందో,

అందుకు ఖిన్నంగా దారుణమైన శబ్దాలు చేయడం మొదలుపెట్టింది.

రేకుడబ్బాలో గులకరాళ్ళు వేసి మోగించినట్టు డబడబమని శబ్దాలు చేస్తూ ఎనభై కిలోమీటర్ల వేగంతో ముందుముందుకు దూసుకుపోతూ వుంది.

ఖచ్చితంగా అరగంట తరువాత దీపక్‌కి కనిపించింది తనకంటే ముందున్న కారు....ఫ్రంట్ వీల్‌కి ఏదో ప్రాబ్లెమ్ వచ్చినట్టుంది....రోడ్డు పక్కకుతీసి ఇంజన్‌ని ఆఫ్ చేస్తున్నాడు ఆ కారును నడుపుతున్న వ్యక్తి.

వింటినుంచి వెలువడిన బాణంలా రయ్‌మని అతని పక్కనుంచి దూసుకుపోయింది అంబాసిడర్.

* * * *

"ఎవరు మీరు? నన్నెందుకు పట్టుకువచ్చారు? ఏం కావాలి మీకు?" సిటీ వెలుపల ఒక పెద్ద చెట్లతోపులోకి వెళ్ళిన తర్వాత, అవకాశం లభించిన వెంటనే తనను పట్టుకున్నవారిని ప్రశ్నించింది శృతిమేడమ్.

"మేము ఎవరిమో నీకు అనవసరం. అల్లరి చేయకుండా బుద్ధిగా వుంటే నీకు ఎలాంటి ప్రాబ్లమ్ రాదు" అంటూ ఆమెను కార్లోనుంచి కిందికి దించి, చెట్లతోపు మధ్యలోవున్న ఒక చిన్న రేకుల షెడ్‌లోకి తీసుకుపోయారు ఆజానుబాహులు. శిథిలం అవడానికి సిద్ధంగా వుంది ఆ షెడ్. గట్టిగా నెడితే విరిగి అవతల పడిపోయేటట్టు కనిపిస్తున్నాయి పాతకాలంనాటి గోడలు.

శృతిమేడమ్ చేతుల్ని వెనక్కి విరిచి, ఒక హ్యాండ్ కర్చీఫ్‌తో కదలకుండా పీటముడి వేశాడు ఒక ఆజానుబాహుడు. "అరవడానికి చూడకు. నోట్లో గుడ్డలు కుక్కుతాను" అని బెదిరించి, ఆమెను షెడ్లో నేలమీద కూర్చోపెట్టాడు. శృతికి డ్రైవర్ గుర్తుకువచ్చాడు.

"మా డ్రైవర్ ఏడి?" అడిగింది శృతిమేడమ్.

"వాడు కార్లోనే వున్నాడు....అక్కడే వుంటాడు" భుజంమీదినించి వెనక్కి చూసి చెప్పాడు ఆ మనిషి.

చిమ్మచీకటి.... చెట్లతోపులోచేరి కీచుగా అరుస్తున్న చిమటల శబ్దాలు....పడిపోవడానికి రెడీగావున్న రేకులషెడ్....శృతిమేడమ్‌కి ఊపిరి ఆగిపోతుందేమోననిపించేంత టెన్షన్ స్టార్ట్ అయింది. వాళ్ళు ఎవరో,



తనను ఎందుకు తీసుకొచ్చారో, ఏం చేయడానికి తీసుకువచ్చారో కొంచెం కూడా అర్థంకాకపోవడంతో, విసురుగా తల విదిలించి కిందినించి పైకి లేచి నుంచుంది.

రేకుల షెడ్‌కి సరిగ్గా యాభై అడుగుల దూరంలోనే నిలబడివుంది క్వాలిస్ కారు....సిగరెట్లు వెలిగించుకుని దాని దగ్గిర గుంపుగా ఏదో మాట్లాడుకుంటూ నిలబడివున్నారు ఆమెను తీసుకొచ్చిన వ్యక్తులందరూ.

"సరిగ్గా తొమ్మిది గంటలకి వస్తానని అన్నాడు. వచ్చేముందు రెండుసార్లు ఈలవేస్తానని కూడా చెప్పాడు" చిన్న కంఠంతో మిగిలినవారికి చెబుతున్నాడు వారిలో అందరికంటె ఎత్తుగా వున్నతను.

"ఈల శబ్దం వినబడగానే మనం ఎలర్ట్ అయిపోయి తనని ఎదిరించాలి. అంతేకదూ?" అడిగాడు మరొకడు.

రేకులషెడ్లో పడేస్తే, భయంతో బిగుసుకుపోయి, పడవేసిన ప్రదేశములోనే తను వుండిపోయినట్టు వాళ్ళు భావిస్తున్నట్టుగా అర్థమైంది శృతిమేడమ్‌కి.

ఊపిరి బిగపట్టి శబ్దం చేయకుండా మరికొంచెం ముందుకు జరిగింది. ఆమె అంత ధైర్యంగా లేచి నిలబడుతుందని అనుకోలేదు కాబోలు, ఒక్కసారి కూడా షెడ్‌వంక చూడలేదు ఆ ఆజానుబాహులు.

"ఎదిరించడంవరకే....దెబ్బలు తగిలేటట్టు కొట్టడం మాత్రం నో....తగాదా అంతా షెడ్‌ముందే జరగాలి...." అంటూ వున్నట్టుండి షెడ్‌కేసి చూసి, "ఒకసారి లోపలికి వెళ్ళి ఆమె ఏం చేస్తోందో చూడు" అని ఒకరితో చెప్పాడు వారందరికీ లీడర్ మాదిరి కనిపిస్తున్న వ్యక్తి.

చెంగున వెనక్కి గెంతి, అంతకుముందు వాళ్ళు కూర్చోబెట్టిన ప్రదేశంలోనే చతికిలపడింది శృతిమేడమ్

విరిగిపోయిన తలుపుల్ని ఎడమపాదంతో అవతలికి నెడుతూ లోపలికి తొంగిచూశాడు ఒకడు.

"నాకు దాహంగా వుంది. మంచినీళ్ళు కావాలి" అతన్ని చూడగానే ఆత్రంగా చెప్పింది శృతిమేడమ్.

"మా దగ్గిర వాటర్‌బాటిల్స్ లేవు. కాస్సేపు ఓర్చుకో....ఎక్కడినుంచైనా తెప్పిస్తాం" అని చెప్పి వచ్చినంత వేగంగానే వెనక్కి వెళ్ళి

పోయాడతను.

మూడు అంకెలు లెక్కబెట్టి మళ్ళీ లేచి నిలబడింది శృతిమేడమ్. అంతకుముందు నిలుచున్న చోటినించి ఇంకా కాస్త అవతలికి జరిగి, చాలా చిన్న కంఠంతో గుసగుసలుడుకుంటున్నారు అందరూ....

ఎంత ముందుకు వంగినా, శృతిమేడమ్‌కి కొంచెం కూడా వినిపించ లేదు వారి సంభాషణ. అంతకుముందు వినబడిన మాటల్ని మననం చేసుకుంటూ మళ్ళీ నేలమీద చతికిలబడింది. ఎవరికోసమో ఎదురుచూస్తున్నారు వాళ్ళు....ఈల వేసుకుంటూ వచ్చిన మరుక్షణం ఎదిరించడానికి రెడీగా వున్నారు....ఆ వచ్చేది ఎవరు?

తనని విడిపించడానికి తన మామయ్య ఎవరినైనా పంపిస్తున్నాడా? వీళ్ళు తనని పట్టుకున్న వెంటనే తన మామయ్యకి కబురు అందించి, బ్లాక్ మెయిలింగ్ మొదలుపెట్టారా? అసలు తనను ఎందుకు పట్టుకువచ్చినట్టు? డబ్బుకోసమేనా? ఎంత ఆలోచించినా ఆ ప్రశ్నలకు సమాధానం లభించక పోవడంతో, తీవ్రమైన నిరాశ, నిస్పృహలు ఆమెను ఆవరించుకుంది.

పట్టుబడిన తర్వాత మొట్టమొదటిసారిగా, ఆమె కళ్ళు నీటితో నిండి పోవడం మొదలుపెట్టాయి....టైమ్ గడిచినకొద్దీ ఆమె ధైర్యం దిగజారడం మొదలైంది.

* * * *

అరడజనుమంది పోలీస్ ఆఫీసర్లు, ఇంకో పన్నెండుమంది అతి ముఖ్యమైన శ్రేయోభిలాషులు, చుట్టాలు ఇంకో పదిమంది తనచుట్టూ నిలబడి వుండగా, తన ఇంటిముందు పోర్టికోలో నిలబడి ముఖంమీది స్వేద బిందువుల్ని టవల్‌కి అద్దుకున్నాడు లాయర్‌సాబ్.

"ఇది డబ్బుకోసం చేయబడిన పనే అయివుంటే ఈపాటికి మీకు వాళ్ళ దగ్గిర్నించి ఏదో ఒక కమ్యూనికేషన్ వచ్చివుండాలి....అది వస్తే మనం ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేయవచ్చు" అన్నాడు ఒక పోలీస్ ఆఫీసర్.

అందుకు లాయర్‌సాబ్ సమాధానం చెప్పకముందే వేగంగా వచ్చి ఆగింది సురేంద్రసాబ్ కారు. వెనుక సీట్లోనుంచి దిగి వడివడిగా అడుగులు వేస్తూ వచ్చాడు సురేంద్రసాబ్. ఆయన కళ్ళల్లో ఆందోళన.

"ఇదంతా ఆ దుండుడుకు రాస్కెల్ మూలంగానే వచ్చింది....వారి



దగ్గిరికిపోయి చీకటిపడేవరకూ వుండడంవల్ల ఇలా జరిగింది. నాకు చాలా బాధగా వుంది" వస్తూనే లాయర్‌సాబ్ భుజంపై చేయివేస్తూ అన్నాడు.

"దీపక్ సిటీలో లేడు....రేస్ ఎప్పుడో స్టార్టయింది....సిటీ నడిబొడ్డులో రద్దీగా వున్న ప్రాంతంలో జరిగింది. దీనితో దీపక్‌కి సంబంధం లేదు" అంత బాధలోనూ ఆయన మాటల్ని వ్యతిరేకించాడు లాయర్‌సాబ్.

"ఏదిఏమైనా పెద్ద దారుణం జరిగింది. పెళ్ళికావల్సిన పిల్లను ఎవరో ఎవరో కిడ్నాప్ చేశారని నలుగురికీ తెలిస్తే ఎంత నగుబాటు?" ఎప్పుడొచ్చిందోగాని, సురేంద్రసాబ్ వెనుకే ప్రత్యక్షం అయిన సరితాదేవి వెంటనే కల్పించుకుని తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఆమె వెనుకే వచ్చాడు సోహన్. "సిటీలో నాకు తెలిసినవాళ్ళు చాలామంది వున్నారు. అందరికి ఫోన్లు చేశాను. కాసేపు ఆగి నేను కూడా వెతకడానికి పోతాను....తెల్లారేసరికి ఎక్కడ వున్నా తీసుకువచ్చి మీకు అప్పగిస్తాను. మీరు ధైర్యంగా వుండండి" స్థిరమైన కంఠంతో లాయర్‌సాబ్‌కి చెప్పాడతను.

అయినవాళ్ళందరివంకా ఒకసారి చూసి, సురేంద్రసాబ్‌తో కలిసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు లాయర్‌సాబ్.

సరితాదేవి వాళ్ళని అనుసరిస్తూ-

"అమెరికాకి ఫోన్‌చేశారా అన్నయ్యగారూ....శృతి తల్లిదండ్రులకి ఈ విషయం తెలియచేయడం మంచిదికదా" అంది.

పోర్టికోలో నిలబడివున్న పోలీస్ ఆఫీసర్లకు, లాయర్‌గారి శ్రేయోభిలాషులకు తనను తాను పరిచయం చేసుకున్నాడు సోహన్.

"ఐ లైక్ దట్ గర్ల్....ఆమె తల్లిదండ్రులకు చెప్పి వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాను....ఇంతలోనే ఈ సంఘటన జరిగింది...." అని చెప్పి, పది నిమిషాలక్కడే నుంచుని తర్వాత రోడ్డుమీదికి పోయాడు.

"అమెరికాలో హాయిగా వున్న బిడ్డని మేమే ఇక్కడికి రప్పించాం. రప్పించకుండా వున్నా బాగుండేది....అంతా మా దురదృష్టం" పమిటె చెంగుతో కళ్ళు వత్తుకుంటున్న లాయర్‌సాబ్ భార్యవంక సానుభూతిగా చూశాడు సురేంద్రసాబ్. "నేను డి.జి.పి.గారితో మాట్లాడతాను....అవసర

మైతే ఢిల్లీ ఫోన్ చేస్తా" అంటూ వెనక్కి చూశాడు.

"అలవాటుప్రకారం పీటర్‌కోసం చూసిన చూపు అది....ఆయన నోట్లోనుంచి మాట బయటికి వచ్చిన మరుక్షణం, నెంబర్లను చూసి, ఫోన్ చేసి అవతలిపక్కన వున్న వారితో ఒక మాట మాట్లాడి, ఫోన్‌ని ఆయన చేతికి అందించేవాడు పీటర్."

"అవసర సమయంలో అంతా కట్టకట్టుకుని అవతలికి చచ్చారు.... ఇదంతా ఆ దీపక్‌గాడి మూలంగానే వచ్చింది....అసలు ఈ దారుణానికి కారకుడు వాడేనేమో అని నాకు అనుమానం కలుగుతోంది...." సురేంద్ర సాబ్ ఎవరికోసం చూశాడో గ్రహించి, చటుక్కున తూటాల్లాంటి మాటల్ని వాడింది సరితాదేవి.

ఉలిక్కిపడి ఆమెవంక చూశాడు లాయర్‌సాబ్....

"అవేం మాటలు? ఎవరైనా వింటే నగుబాటు...." అంటూ వెంటనే సరితాదేవిని వారించాడు.

"మీకు, మా నాన్నగారికి ఏమీ తెలియదు. మీరందరూ సత్యకాలం మనుషులు. వాడు పట్టి జులాయి. ఎంతకైనా తెగించే రకం....తన తండ్రి వుంచుకున్న సాని దగ్గిరికి తగుదునమ్మా అంటూ పోయివచ్చినవాడు.... వాడు మామూలోడు కాడు" తన తండ్రి దగ్గిర్నించి ఎటువంటి అభ్యంతరం రాకపోవడంతో ప్రజ్వరిల్లిపోయింది సరితాదేవి.

* * * *

"వాడి సంగతి రెండు మూడు రోజుల్లో తేల్చిపారేస్తాను. నువ్వు కాస్సేపు నోరు మూసుకో" అంటూ సరితాదేవిని వారించి, లాయర్‌సాబ్ వైపు చూశాడు సురేంద్రసాబ్ ఇప్పుడేం చేయాలన్నట్లు.

"సిటీలో వున్న పోలీస్‌స్టేషన్స్ అన్నిటికీ మెసేజ్ వెళ్ళింది. మనకి తెలిసిన అఫీసర్లందరూ ఇన్వెస్టిగేషన్ స్టార్ట్‌చేశారు. కిడ్నాపర్స్ దగ్గిర్నించి చిన్నపాటి కబురువస్తే చాలు. వెంటనే ఫాలో అయిపోతారు. ఎక్రీబడీ ఈజ్ వెయిటింగ్" అంటూ పరిస్థితిని పూర్తిగా ఆయనకి వివరించాడు లాయర్ సాబ్.

"ఓ.కే. నాతో ఏమైనా పనిపడితే వెంటనే ఫోన్‌చెయ్యి....మొహమాటం వద్దు" అంటూ సోఫాలోనుంచి లేచి సరితాదేవితో బయటికి బయలు



దేరాడు సురేంద్రసాబ్.

పోర్టికోలోకి ఎంటర్ అవడానికి ఒక రెండు క్షణాలముందు సడన్‌గా ఆగి "ఆ కారు పందెం రిజల్ట్ ఏమైంది? ఏమైనా తెలిసిందా?" అని క్యాజువల్‌గా అడిగాడు.

మైల్డ్‌గా చాలా మైల్డ్‌గా తగిలినట్టయింది లాయర్ సాబ్‌కి చిన్నపాటి కరెంట్‌షాక్. ఆయనకి తెలియకుండానే పెదవులమీదికి పరిగెత్తుకు వచ్చిందొక చిరునవ్వు.

"పదకొండు గంటలకిగాని రిజల్ట్ రాదు. టీవీలో లైవ్ ప్రోగ్రాం వుంది. చూస్తూ వుండు....నీకే తెలుస్తుంది" అని చెప్పాడు.

"వాడు పట్టి వెధవ. దేనిమీదా సరిగ్గా కాన్సన్‌ట్రేట్ చేయడు. రేసడంటే మాత్రం ప్రాణాలు పోయినా అగడు. అనవసరమైన రిస్కులు తీసుకుంటాడని నాకు అనుమానం" అంటూ ముందుకు సాగాడు సురేంద్ర సాబ్.

లాయర్‌సాబ్ భార్యతో రెండుమాటలు మాట్లాడడానికి అప్పుడే ఆగడంవల్ల సరితాదేవికి వినిపించలేదా మిత్రుల ఇరువురి సంభాషణ.

"నా మాటవిని మీరు అమెరికాకి ఫోన్‌చేసి చెప్పండి అన్నయ్యగారూ! శృతి మమ్మీ డాడీని వెంటనే వచ్చేయమనండి. వాళ్ళు వస్తే మనం సోహన్ శృతిని చేసుకోవడానికి ఇష్టపడుతున్నాడని కూడా చెప్పేయచ్చు" తండ్రి దగ్గిరికి వస్తూ లాయర్‌సాబ్‌కి చెప్పిందామె.

తెలుగుభాషలో అందరికీ తెలిసిన ఒక మొరటు సామెత వెంటనే గుర్తుకువచ్చింది లాయర్‌సాబ్‌కి ఆ మాటే రెండు నిముషాలక్రితం ఆమె నోటివెంట వచ్చివుంటే, చెంపమీద కొట్టినట్టు సమాధానం ఇచ్చివుండేవాడు. సురేంద్రసాబ్ కార్లపందెంలో దీపక్ పాల్గొనడంమీద తన అభిప్రాయాన్ని వెల్లడించడంతో, ఎంత ప్రయత్నం చేసినా కోపం రాలేదు. కామ్‌గా ఒక చిరునవ్వు నవ్వి మౌనంగా వుండిపోయాడు.

రోడ్డుమీద అసహనంగా ఎదురుచూస్తున్నాడు సోహన్. పోర్టికోలోకి వచ్చిన తాతని, తల్లిని చూడగానే చెయ్యివూపి హడావుడిగా స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

"మంచు పడుతోంది నాన్నగారూ! మీరు మంచులో నిలబడటం

మంచిదికాదు. పదండి పోదాం" అంటూ తండ్రిని రోడ్డుమీదికి తీసుక వచ్చింది సరితాదేవి.

కారుదాకా వచ్చి వీడ్కోలు పలికాడు లాయర్‌సాబ్. కారు కదిలి అవతలికి పోగానే, పోర్టికోదగ్గిర వున్న తన శ్రేయోభిలాషుల దగ్గిరికి వెళ్ళాడు.

*    *    *    *

ఎనభై అంకెని దాటి వంద దగ్గిరికి చేరుకుంది స్పీడోమీటర్‌లోని ముల్లు.

శబ్దాన్ని మించిన వేగంతో ప్రయాణంచేసే సూపర్ జెట్ విమానం మాదిరి మోతలు చెయ్యడం మొదలుపెట్టింది అంబాసిడర్.

"ఇప్పుడు గనుక ఈ రోడ్డుమీద జనం ఎవరైనా మనకి అడ్డం వస్తే...." అంటూ ఆపైన ఊహించడానికి భయపడ్డాడు రాంసింగ్.

వందని దాటింది ముల్లు. రోడ్డు కనిపించడం మానేసింది. నూటపది-నూటఇరవై.... ఆ అంకెని దాటడం మాత్రం అతనికి చేతకాలేదు. కారు రెస్పాండ్ అవకకాదు, యాక్సిలేటర్‌ని అదిమినకొద్దీ పెరుగుతోంది స్పీడు.

స్పీడ్ పెరిగినకొద్దీ భూకంపంలో చిక్కుకుపోయినట్టు కంపించి పోతూ, ఎగిరి అవతల పడిపోతున్నాయి, గుట్టమీదినించి దొర్లడంవల్ల దెబ్బ తిన్న పార్టులు.

వెనుకడోరు కూడా ఎగిరిపోయింది. డిక్కీ దానంతట అదే లేచి ఏ క్షణంలోనైనా ఎగిరిపోవడానికి సిద్ధంగా వుంది. దానంతట అదే కదిలి ముందుకు జరిగింది వెనుకసీటు. గతుకుల్లోపడి కారు జర్కులు ఇచ్చినప్పుడల్లా అటూ ఇటూ ఊగిపోతోంది.

"స్లో చేయడం మంచిది చిన్నబాబూ! పాతకారు కదా.... ఈ స్ట్రెయిన్ భరించలేకపోతోంది" రెండునిముషాల తర్వాత నెమ్మదిగా చెప్పాడు రాంసింగ్.

ఆ మాటల్ని వినిపించుకోవడం దీపక్‌కి ఇష్టంలేకపోయింది. మొండిగా అలాగే స్టీరింగ్‌ని పట్టుకు కూర్చున్నాడు. పదినిముషాల తర్వాత అతనికి అగుపించింది సిటీ ఎంట్రెన్స్‌లో పందెం నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్వాగత తోరణం. గుంపులు గుంపులుగా నిలబడివున్నారు జనం.



చప్పట్లతో, ఈలలతో, కేకలతో కేరింతలు కొడుతూ అతనికి స్వాగతం పలికారు.

"ఇట్స్ ఎమేజింగ్....చాలా గొప్ప విషయం. కారు పందేలలో ఇంతవరకూ పార్టిసిపేట్ చేయని ఒక కాలేజీ స్టూడెంట్ అందరికంటే ముందుగా సిటీలోకి ఎంటర్ కావడం రియల్లీ ఫెంటాస్టిక్...." అంటూ ఎనౌన్స్‌మెంట్లు వినిపించింది అక్కడ అరేంజిచేయబడిన మైకు.

ఏ క్షణంలో కదలకుండా నిలబడిపోతుందో తెలియని దీపక్ అంబాసిడర్ వెనుకే రయ్‌మంటూ దూసుకువచ్చాయి మరో నాలుగు రేస్ కార్లు.

"పోనీయండి చిన్నబాబూ! చావోరేవో తేలిపోవాలి.... పోనీయండి" భుజంమీదినించి వెనక్కి చూస్తూ దీపక్‌ని హెచ్చరించాడు రాంసింగ్.

నూటఇరవైని దాటిపోయింది ముల్లు. పళ్ళు బిగపట్టేశాడు దీపక్. తన బాధలన్నిటినీ మరిచిపోయాడు. బాంబర్ విమానం మాదిరి మోతలు చేస్తూ సిటీ రోడ్డుమీదికి ఎంటర్ అయింది అంబాసిడర్.

"మన వెనకాల వున్నవన్నీ మోడ్రన్ కార్లు- నాటురోడ్ల మీద అవి ఎందుకూ పనికిరాకపోయినా, ఈ రోడ్డుమీద వీరవిహారం చేస్తాయి. వాటిని వదిలించుకోవాలంటే ఇంకా స్పీడ్ కావాలి" కామెంటరీ మొదలుపెట్టిన రాంసింగ్‌వైపు చూడనుకూడా చూడలేదు దీపక్.

షార్ప్‌గా ఎడమవైపు తిరిగిన రోడ్డును వదిలి ఎటెటో వెళ్ళిపోబోయిన అంబాసిడర్‌ని అతికష్టంమీద ఆపగలిగాడు అతను. ఉండనా ఊడనా అంటున్న ఇంకో డోర్ కూడా ఎగిరి అవతల పడిపోయింది. డిక్కీ ఇంకా కొంచెం పైకిలేచి ఊగిసలాట మొదలుపెట్టింది.

రేస్ మొదలైన క్షణంనించీ అవిశ్రాంతంగా పనిచేస్తున్న అంబాసిడర్ ఇంజన్ పెద్దగా దగ్గి, తను ఆగిపోవడానికి సిద్ధంగా వున్నట్టు వార్నింగ్ ఇచ్చింది.

"తొక్కండి చిన్నబాబూ! తొక్కండి....స్పీడ్....ఇంకా స్పీడ్...." ముందుకు జరిగి డేష్‌బోర్డుని గట్టిగా పట్టుకుంటూ అరిచాడు రాంసింగ్.

నల్లటిపొగలు.... జెట్ విమానం వెనుకభాగంలోనుంచి వెలువడినట్టు

చాలా దట్టంగా వెలువడుతుండగా- రేస్ స్టార్ట్ అయిన ప్రదేశంలోకి ఎంటర్ అయింది అంబాసిడర్....ఫినిషింగ్ పాయింట్‌ని క్రాస్‌చేసిన రెండోక్షణంలో తక్కున ఆగిపోయింది ఇంజన్.

*         *         *         *

చెవులు చిల్లులు పడేటట్లు కేకలుపెడుతున్న జనం. ఛటక్ ఛటక్ మని వెలగడం మొదలుపెట్టిన కెమేరా ఫ్లాష్‌లు....గుంపుగా వచ్చి మీదపడిపోతున్న టెలివిజన్ రిపోర్టర్లు.... ముఖాలన్నీ నవ్వులమయం చేసుకుని షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి వచ్చిన నిర్వాహకులు- తాతగారు బీరువాలో దాచిపెట్టిన చిగురు బాటిల్‌ని పూర్తిగా ఖాళీచేసిన అనుభూతి దీపక్‌ని ఆవరించుకుంది.

"మిస్టర్ దీపక్! అనుభవంలేని మీరు ఈ పందెంలో ఫస్ట్‌గా రావడానికి మీ వెనుక వున్న స్ఫూర్తిఎవరు?" బిగ్గరిగా అడిగింది ఒక టీ.వీ రిపోర్టర్.

"ఈ పందెం ఒక్కటేకాదు....ఏ పందెంలో పార్టిసిపేట్ చేసినా నాకున్న స్ఫూర్తి మా తాతగారు సురేంద్ర. పందెంలో పాల్గొనడమే పెద్ద థ్రిల్లు. దాన్ని ఎంజాయ్ చేయాలి. గెలుపు ఓటముల గురించి పట్టించుకోవాల్సిన పనిలేదు....అని అంటూంటారు" నవ్వుతూ చెప్పాడు దీపక్.

"మాకు తెల్సిన విషయం ఇంకోటి వుంది. లాయర్ దామోదర్‌గారి మేనకోడలు శృతి మిమ్మల్ని బాగా ప్రోత్సహించారటకదా!" మరో ప్రశ్న వేసిందా రిపోర్టర్.

"ఎస్....షీ ఈజ్ ఏన్ ఏంజిల్.... ఆమె గనుక నాకు సపోర్ట్ ఇవ్వకుండా కామ్‌గా వుండిపోయినట్లయితే ఈ పందెంలో పార్టిసిపేట్ చేసి వుండేవాడిని కాదు" కాన్ఫిడెంట్‌గా చెప్పాడు దీపక్.

"ఇంకా....మీకు స్ఫూర్తినిచ్చినవాళ్ళు ఎవరెవరున్నారో చెపుతారా?" అడిగిందా రిపోర్టర్.

తనను ప్రమోట్‌చేసిన కంపెనీ పేరు చెప్పాడు దీపక్. స్కైలైన్ రెస్టారెంట్‌ని గురించి కూడా వివరించాడు. ఇక జమలయ్యనైతే ఆకాశంలోకి ఎత్తేశాడు.

"హీ ఈజ్ ఎ డెవిల్.... నా కారు ఇన్ని దెబ్బలు తినికూడా పందెంలో ఫస్ట్ వచ్చిందంటే అదంతా అదంతా అతని గొప్పతనమే" అని



మెచ్చుకున్నాడు దీపక్.

అందరికీ వెనుకగా నిలబడివున్నాడు జమలయ్య.

అతని కళ్ళు జలపాతాలు అయ్యాయి ఆ కామెంట్స్ వినగానే. అరగంట పైనే పట్టింది దీపక్‌కి ఆ ప్రదేశంలోనుంచి బయటపడటానికి.

నిర్వాహకులు ఇచ్చిన కప్‌ని, మొదటి స్థానానికి ఎనౌన్స్‌చేసిన ప్రయిజ్‌మనీ చెక్కుని తీసుకుని అతను డయాస్ మీదినించి దిగగానే, ఆదుర్దా నిండిన ముఖంతో అతన్ని అవతలకు తీసుకెళ్ళాడు రాంసింగ్.

"మనవాళ్ళందరూ ఏరీ?" చుట్టూ చూస్తూ అడిగిన దీపక్‌కి అసలు విషయాన్ని వివరించాడు.

*         *         *         *

తుక్కుతుక్కయిన అంబాసిడర్‌ని షెడ్‌కి తీసుకుపోవడానికి ఒకళ్ళు కాదు, ఇద్దరు కాదు- జమలయ్య షెడ్లో పనిచేసే కుర్రాళ్ళందరూ కట్టకట్టుకుని వచ్చేశారు.

"మూడు రోజుల్లో మళ్ళీ పెళ్ళికూతురి మాదిరి తయారుచేస్తాం దీపక్‌బాబు. మీరు వర్రీ అవ్వాల్సిన అవసరంలేదు. మాకు వదిలేయండి" అంటూ నెట్టుకుంటూ అవతలికి తీసుకుపోయారు.

పాతకాలపు మోరిస్ మైనర్ కారుని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రీమోడల్‌చేసి తన స్వంతానికి వాడుకుంటున్నాడు జమలయ్య.

ఆ కారుని దీపక్‌కి ఇచ్చాడు.

"మీరు త్రిభువన్ నర్సింగ్ రెస్టారెంట్ దగ్గిరికి పోండి....మనవాళ్ళందరూ దాన్ని అడ్డాగా మార్చారు. అక్కడ వెయిట్ చేస్తే అన్ని విషయాలు తెలుస్తాయి" అని కూడా చెప్పాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా మోరిస్‌మైనర్లో కూర్చున్నాడు దీపక్. దెబ్బలు బలంగా తగలడంవల్ల పోటెత్తిపోతున్న భుజాన్ని, కుడిపాదాన్ని ఎవరూ చూడకుండా అదుముకుంటూ, ఆ బాధను అతిబలవంతంగా ఓర్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

అరగంటలో అతన్ని నర్సింగ్ రెస్టారెంట్ దగ్గిరికి తీసుకుపోయాడు రాంసింగ్.

గోలగోలగా వున్నదా ప్రదేశం. టీ.వీ.లో దీపక్ గెలుపు వార్తని

విని, ఆ దృశ్యాల్ని చూసి రంకెలు పెడుతున్నారు కస్టమర్స్. కారు దిగిన వెంటనే దీపక్‌ని చుట్టుముట్టి శుభాకాంక్షలు చెప్పడం స్టార్ట్ చేశారు.

"వహీద్ ఇప్పుడే ఫోన్ చేశాడు. శృతిమేడమ్ కారు కనిపించిన ప్రదేశంలో ఏదో క్లూ దొరికిందిట...." దీపక్ చేయి పట్టుకుని అవతలికి తీసుకుపోతూ చెవిలో చెప్పాడు అందరితోపాటు తను కూడా వెతకడానికి పోకుండా రెస్టారెంట్‌లో ఆగిపోయిన పీటర్.

"మనం వెంటనే అక్కడికి పోదాం" అంటూ చటుక్కున కారెక్కాడు దీపక్.

సుమారు ఒక పావుగంటసేపు పట్టింది పీటర్ చెప్పిన ప్రదేశానికి పోవటానికి. రోడ్డుమీదే నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్న వహీద్ ఎగిరి గంతేసినంత పనిచేశాడు దీపక్‌ని చూడగానే.

"శృతిమేడమ్ సంగతి చూసుకోవడానికి మేమున్నాం మీరు ముందు డాక్టర్ దగ్గిరికి పదండి" అంటూ తొందర చేశాడు.

"నథింగ్ డూయింగ్. ముందు శృతిమేడమ్‌ని చూడాలి. తర్వాతనే డాక్టర్ దగ్గిరికి" రెఫ్యూజ్ చేశాడు దీపక్.

"శృతిమేడమ్ కారును ఒక క్వాలిస్ ఓవర్‌టేక్‌చేసి అడ్డం నిలబడిందిట. బెలూన్లు అమ్ముకునే మనిషి ఒకతను అబ్జర్వ్ చేశాడు. ఆ పాయింట్‌మీద వివరాలకోసం మన జగజీత్ వెళ్ళాడు. వచ్చేస్తూవుంటాడు" తాము తెలుసుకున్న మాటని చెప్పాడు గండయ్య.

"మనకి తెలిసిన రెంటల్ ఏజెన్సీ వాళ్ళందరికీ ఫోన్లు చేశాను చిన్నబాబూ....వాళ్ళ దగ్గిర వున్న క్వాలిస్‌లన్నీ సిటీలోనే తిరుగుతున్నాయిట" అన్నాడు పీటర్.

"శృతిని ఆ క్వాలిస్‌లో వచ్చినవాళ్ళు కిడ్నాప్‌చేసి వుంటే అందరికీ తెలిసేవిధంగా సిటీలో వుండరు, ఏదో ఒక ఒంటరి ప్రదేశంలోకిపోతారు. తమను గుర్తించకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు" సాలోచనగా అన్నాడు దీపక్.

అతని మనసులో ఏదో థాట్ స్టార్ట్ అయినట్టు గ్రహించి అడిగాడు పీటర్-

"నీ ఉద్దేశ్యం ఏమిటి చిన్నబాబూ?" అని.



"శృతిమేడమ్ కారు కనిపించిన ప్రదేశం ఎవరి అడ్డాలో వుంది?" వహీద్ వంక చూస్తూ అడిగాడు దీపక్.

ఒక్కక్షణంపాటు బ్లాంక్‌ఫేస్ పెట్టి అంతలోనే సర్దుకున్నాడు వహీద్.

"నిజంగా చిన్నబాబూ....నీ ఆలోచన అద్భుతం. ఆ ఏరియాలో తిరిగే చిచోరీగాళ్ళని కాంటాక్ట్ చేశానే కాని. అసలు మనిషిని గురించి ఆలోచించలేదు. ఈ మాట మన నర్సింగ్‌ని అడుగుదాం" అంటూ వెనక్కి తిరిగి రెస్టారెంట్ ఓనర్‌ని దగ్గిరికి పిలిచాడు.

ఎంతోసేపు ఆలోచించలేదు నర్సింగ్. "అది తోతాపురి అడ్డా.... వాడు పట్టి లఫూట్" అని వెల్లడించాడు.

"తోతాపురి అంటే మర్డర్‌కేసులో జైలుకుపోయి మొన్నామధ్య బయటికి వచ్చాడు. వాడేకదూ?" నర్సింగ్ వైపు చూస్తూ అడిగాడు వహీద్.

అవునన్నట్టు తల వూపాడు నర్సింగ్.

రెండోసారి అతను తల వూపకముందే మోరిస్ మైనర్ దగ్గిరికి జంప్ చేశారు అందరూ. దీపక్‌ని ఫ్రంట్ సీట్లో కూర్చోబెట్టి, తాము వెనకాల కూర్చున్నారు.

తన కెపాసిటీకి మించిన లోడ్ అవడంతో చాలా నెమ్మదిగా కదిలి, అరగంట తర్వాత తోతాపురి నివసించే సుబ్రమణ్యనగర్ దగ్గిర ఆగింది మోరిస్ మైనర్.

* * * *

"క్వాలిస్‌లేదు గ్వాలిస్‌లేదు. మర్యాదగా అవతలికి వెళ్ళిపోండి" పదిమంది చంచాలు చుట్టూ నిలబడి వుండగా, తమ కాలనీ మధ్యభాగంలో వున్న పార్కులో కూర్చుని మందుకొడుతూ చాలా దారుణంగా సమాధానం చెప్పాడు నలభై ఆరేళ్ళ తోతాపురి.

ఆ మాట అతని నోట్లోనుంచి వెలువడిన మరుక్షణం కంటికి కనిపించనంత స్పీడ్‌తో కదిలింది దీపక్ చెయ్యి.

లావుపాటి ముక్కు ముఖానికి అతుక్కుపోయేటంత గట్టిగా దెబ్బ తగలడంతో గావురుమని ఒక అరుపు అరిచి వెనక్కి పడిపోయాడు తోతాపురి.

పళ్ళు పటపటమని కొరుకుతూ పైకి లేవబోయిన అతని చంచాల మీద కలబడ్డారు వహీద్, గండయ్య మెరుపు వేగంతో. అంతవరకూ ఎంతో నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వున్న ఆ పార్కు ఒక్కసారిగా అరుపులతో, కేకలతో అట్టుడికిపోయింది. రెండే రెండు నిముషాల్లో ఎండ్ అయిపోయిందా తగాదా.

"అవును....క్వాలిసే....నా అడ్డాలోకి వచ్చి ఆ పిల్లను కిడ్నాప్ చేయడం కోసం పగిడీకింద రెండు లక్షలు యిచ్చారు. ఎక్కడికి తీసుకుపోయారో మాత్రం నాకు తెలియదు. ఇంకో లక్షరూపాయలు పని పూర్తి అయిన తర్వాత ఇస్తామని చెప్పారు. వాళ్ళ దగ్గర్నించి కబురు రాగానే మీకు చెపుతాను" రక్తసిక్తమైన ముఖాన్ని అరిచేతులతో అద్దుకుంటూ చెప్పాడు తోతాపురి.

"శృతిమేడమ్ క్షేమంగా వుండాలని నీ దేవుడిని ప్రార్థించుకో. ఏమైనా జరిగిందంటే నీ పీక పిసికి చంపేస్తాను" అతన్ని చాలా ఘాటుగా హెచ్చరించి, వహీద్ వైపు చూశాడు దీపక్.

"వీడిని ఊరికే వదిలిపెడితే, ఏదో ఒక విధంగా ఆ బద్మాష్‌లని హెచ్చరిస్తాడు. పోలీసులకు పట్టివ్వడమే సరైన పద్ధతి" అన్నాడు వహీద్.

"హెచ్చరించను....నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడను. అమ్మతోడు. నా దగ్గర్నించి మీకు ఎటువంటి ఇబ్బందీ రాదు" నెత్తిమీద చెయ్యి పెట్టుకుంటూ దీనంగా చెప్పాడు తోతాపురి.

"ఆ బద్మాష్‌లు ఎక్కడికి పోయారో తెలిసిన వెంటనే మనకి చెపుతానని అన్నాడు గదా....తేడా వస్తే వీడి చర్మం ఒలిచేద్దాం. ముందు సిటీ అంతా ఇంకోసారి తిరిగివద్దాం పదండి" అంటూ అందరినీ కారు దగ్గిరికి నడిపించాడు పీటర్.

"పోలీసులకి చెపితే వాళ్ళు అదనీ ఇదనీ ఆ రూలనీ ఈ రూలనీ తాత్సారంచేసి చంపుకుతింటారు. అందువల్ల మనకి నష్టమే తప్ప లాభం ఏదీ వుండదు. అందుకే తోతాపురిని వదిలేయమన్నాను" కారెక్కిన తరువాత తన అసలు ఆలోచనను అందరికి వినిపించాడు.

* * * *

"దాహం వేస్తోంది. విపరీతంగా తలనొప్పి. తట్టుకోలేకపోతున్నాను....ముందు కాసిని మంచినీళ్ళు ఇవ్వండి....తాగడానికి" ధైర్యంచేసి షెడ్ బయటికి వచ్చి తనను తీసుకువచ్చిన వాళ్ళను అడిగింది శృతిమేడమ్ పదిన్నర సమయంలో.



"నీకేకాదు....మాకు కూడా దాహంగానే వుంది. వాటర్‌కోసం మనిషి వెళ్ళాడు. నువ్వు షెడ్లోనించి బయటికి రాకు" కరకు కంఠంతో చెప్పాడు ఒక మనిషి.

తల వంచుకుని షెడ్లోకి వచ్చేసింది శృతిమేడమ్.

కార్ రేస్ ముగింపుకు వచ్చేసి వుంటుంది. పరిస్థితి సజావుగా వుండివున్నట్లయితే అందరితోపాటు తను ఆ ప్రదేశంలో నిలబడి వుండేది.

పందెం ఏమయింది? దీపక్ పరిస్థితి ఏమిటి?? సమాధానం లభించక పోగా, మనసు మరింత చికాకుకు గురి అవడంతో ,షెడ్లోనే పచార్లు చేయడం మొదలుపెట్టింది.

* * * *

పావుతక్కువ పదకొండు గంటలు అవుతున్నా, శృతిమేడమ్ జాడలు తెలియకపోవడంతో పూర్తిగా డీలాపడిపోయాడు లాయర్‌సాబ్.

"తప్పునాదే....సురేంద్ర ఎంతగా హెచ్చరించినా వినకుండా ఆ దీపక్ దగ్గిరికి పోనిచ్చాను. అందుకే ఇలా జరిగింది. దీనికి బాధ్యుడిని నేనే...." తల నొక్కుకుంటూ చాలా బాధగా అన్నాడు లాయర్‌సాబ్.

"ఇది చాలా విచిత్రంగా వుంది. డబ్బుకోసమో. ఇంకేదైనా ఉపయోగం కోసమో కిడ్నాప్ చేసివుంటే ఈపాటికి మీకు ఏదో ఒక బెదిరింపు వచ్చివుండేది. అలా జరగకపోవడం వెరీ ఫన్నీ. ఎందుకనో మాకు కూడా భయంగానే వుంది...." వెంటనే అన్నాడు లాయర్‌సాబ్ ఇంట్లో తిష్టవేసిన పోలీస్ ఆఫీసర్లలో ఒకతను.

శృతిమేడమ్‌ని అపహరించినవాళ్ళు లాయర్‌కి ఫోన్ చేసినా, వేరే పద్ధతుల్లో బెదిరింపులు పాస్‌చేసినా స్పాట్‌లో చూడటానికి అక్కడ వున్నారు వాళ్ళు.

"ఒంటిమీది నగలకోసం ఈ పని చేసివుంటారని అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే తన మెడలో సన్నపాటి చైన్ తప్ప ఖరీదయిన

సామగ్రి అంటూ ఏమీలేదు...." అన్నాడు లాయర్ దామోదరం.

శృతిమేడమ్ అందాన్ని చూసి ఎవరైనా ఆ పనిచేసి వుంటే? ఆ మాట ఆయన మనస్సులోనే కాదు. ఆఫీసర్ల మనస్సులలో కూడా మెదులుతూనే వుంది. బయటపెట్టే ధైర్యంలేక ఎవరికివాళ్ళు మౌనంగా వుండిపోయారు.

* * * *

మూడు ప్యాకెట్ల నాటుసారాని గ్లాసులో ఒంపుకుని, గటగటా తాగేశాడు జగజీత్. సారామనిషి అందించిన నిమ్మకాయపచ్చడిని వేలిమీద పెట్టుకుని నాలిక్కి రాసుకున్నాడు. కడుపులోకి వెళ్ళిన సారా. నెమ్మదినెమ్మదిగా తన ప్రభావాన్ని చూపించడం మొదలుపెట్టింది. అతని కళ్ళముందున్న ప్రపంచమంతా ఒక్కసారి గిర్రున తిరిగి, మళ్ళీ మామూలుగా మారిపోయింది.

"టేస్టుగా వుందికదూ? అయినాంపేటలో తయారయింది. అక్కెవరో చెంగల్పట్టునుంచి వచ్చి అక్కడ చెట్లతోపుల్లో బట్టీలు పెట్టారంట....భలే రంజుగా తయారుచేస్తున్నారు...." అతని ముఖంలోని భావాల్ని గమనించి నవ్వుతూ చెప్పాడు సారామనిషి.

"ఇంతోటి సరుకును తయారుచేయడానికి చెంగల్పట్టునుంచి రావాలా? మన సిటీలో ఎవరూ లేరా?" అడిగాడు జగజీత్ తడబడుతూ.

"చేసేది లఫూట్ పని. పట్టుబడితే పదినెలల జైలు, పాతికవేలు జరిమానా. సిటీలో వాళ్ళందరూ బెదిరిపోయారు. సరుకుకేమో డిమాండ్ పెరిగిపోయింది" అంటూ బయటివాళ్ళు రావడానికిగల కారణాన్ని చెప్పాడు సారా మనిషి.

"అయినాంపేట అడ్రసు ఎక్సైజ్‌వాళ్ళకి తెలియదా?" అడిగాడు జగజీత్.

"ఇప్పటివరకూ అయితే తెలియదు. ఇక ముందుముందు తెలిసిపోతుంది" అన్నాడు సారామనిషి.

తల ఊపి రోడ్డుమీదికి పోబోతుండగా వచ్చేసింది జగజీత్‌కి అనుమానం. "ఇప్పటిదాకా తెలియంది ఇకముందు ఎలా తెలుస్తుంది?" అని అతన్ని అడిగాడు,



"ఎలా తెలుస్తుందని అడుగుతావేంటి భాయీ....కట్టుబట్టలతో వచ్చి, వాళ్ళని, వీళ్ళని దేబిరించి అప్పులు తీసుకుని బట్టీలు పెట్టారు వాళ్ళు. మూడు నెలల్లో కొత్త క్వాలిస్‌ని కొని చక్కర్లు కొట్టటం మొదలుపెట్టారు. నిన్నటిదాకా ఏమీలేని వాళ్ళకి ఒక్కసారిగా క్వాలిస్‌లు కొనే తాహతు వచ్చిందంటే బయటికి పొక్కకుండా వుంటుందా?" ఎదురుప్రశ్న వేశాడు సారామనిషి. నెమ్మదినెమ్మదిగా తలకు ఎక్కుతున్న సారా మత్తు ఛటాలున దిగిపోయినట్టు జగజీత్ ముఖంనిండా చెమటలు ప్రత్యక్షమయ్యాయి.

"క్వాలిస్ కారు కొన్నారా? ఆ కారుని నువ్వు చూశావా?" అని అడిగాడు.

"చూడకుండా ఎలా వుంటాను భాయీ....అదిగో అటు చూడు...." అంటూ ఒక ఇరానీ హోటల్‌వైపు చూపించాడు. అతను తన సారా క్యాన్‌ని పెట్టుకున్న సందు దగ్గిర్నించి అరఫర్లాంగు దూరంలో వుంది ఆ ఇరానీ హోటల్. దానిముందు ఆగివుంది క్వాలిస్.

జేబులో వున్న నోటు ఇచ్చి ఇంకో సారాప్యాకెట్‌ని కొని, గ్లాసుతో అవసరం లేకుండానే మంచినీళ్ళు తాగినట్టు తాగుతూ అటుకేసి అడుగులు వేశాడు జగజీత్.

* * * *

పది వాటర్ బాటిల్స్ కొన్నాడు క్వాలిస్‌లో వచ్చిన మనిషి? పెద్ద ఫ్లాస్కునిండా వేడివేడి చాయ్ పోయించుకున్నాడు. పాతికపైగా సమోసాలు పార్శిల్ చేయించుకున్నాడు. క్వాలిస్‌కి పాతిక అడుగుల దూరంలో నిలబడి అతన్ని జాగ్రత్తగా అబ్జర్వ్ చేశాడు జగజీత్.

"ఏంటి భాయీ విశేషం?" సిగరెట్‌ప్యాకెట్స్ తీసుకుంటున్న సమయంలో అ మనిషిని చాలా చనువుగా అడిగాడు హోటల్ పక్కనే వున్న కిళ్ళీబడ్డీ యజమాని.

"సరుకు అర్జంటుగా కావాలని సోంగూడానించి కబురువచ్చింది. రాత్రంతా మేలుకోవాలి" అంటూ చెప్పి క్వాలిస్‌లో కూర్చున్నాడు ఆ మనిషి.

స్మూత్‌గా స్టార్ట్ అయింది ఇంజన్. చప్పుడు చేయకుండా టర్న్

అయింది బండి. మరుక్షణంలో వేగంగా సిటీ వెలుపలికి వెళ్ళిపోయింది క్వాలిస్.

అయినాంపేట్ ఇక్కడికి ఎంత దూరంలో వుంది భాయీ?" కిళ్ళీ బడ్డీ దగ్గిరికి పోయి ఒక బీడీకట్టను పర్చేజ్ చేస్తూ అడిగాడు జగజీత్.

"ఎందుకు?" అనుమానంగా అడిగాడు బడ్డీ ఓనర్.

"పని వుంది భాయీ....సరుకు కావాలి. ఒత్తిడిగా వుంది" రహస్యం చెపుతున్నట్టు లోగొంతుకతో చెప్పాడు.

"ఆ మాట పదిక్షణాలు ముందుగా చెప్పివుంటే హ్యాపీగా కార్లో వెళ్ళేపని. ఇప్పుడే వెళ్ళింది ఒక క్వాలిస్....బట్టీల వాళ్ళదే. ఇక్కడికి సరిగ్గా రెండు కిలోమీటర్లు క్వాలిస్ పోయిన దారికేసి చూపిస్తూ చెప్పాడు.

అక్కడినించి కదిలి, హోటల్ ద్వారం దగ్గిర బిగించి వున్న కాయిన్‌బాక్స్ దగ్గిరికి పోయాడు జగజీత్.

జేబులో నుంచి రూపాయి కాయిన్‌ని తీసి బాక్స్‌లో వేస్తూ, ఒక నెంబర్‌ని డయల్ చేశాడు.

"చెప్పవే...." అంటూ వినవచ్చింది పీటర్ కంఠం.

తనున్న ప్రదేశం పేరు చెప్పాడు జగజీత్. "తొందరగా రండి ఆలస్యం చేయద్దు" అని అన్నాడు. అంతకుమించి ఒక్కమాట కూడా మాట్లాడలేదతను. అయినా సరే అతని కంఠంలో అంతర్లీనంగా వున్న ఎగ్జయిట్‌మెంట్ పీటర్‌కి అర్థం అయింది. "పది నిమిషాల్లో వచ్చేస్తాం. నువ్వు అక్కడే వుండు" అంటూ కనెక్షన్ కట్ చేశాడు.

ఇరానీ హోటల్లో నాలుగు సమోసాలు తీసుకుని నములుతూ రోడ్డు మీదే నిలబడ్డాడు జగజీత్. కరెక్టుగా ఇరవై నిమిషాల తర్వాత పరుగులు తీస్తూ వచ్చి అతనిముందు ఆగింది జమలయ్య మోరిస్ మైనర్.

* * * *

ఎదురుచూడనివిధంగా షెడ్డులోకి వచ్చిన శృతిమేడమ్ చేతుల్ని వూడదీశాడు ఒక ఆజానుబాహుడు.

ఒక వాటర్‌బాటిల్ ఆమె చేతికి అందించాడు. సమోసాలు, టీ ఫ్లాస్కు ఆమె ముందుపెట్టాడు.



ఆకలిగా లేకపోయినా నాలుగు సమోసాలు తిని, వాటర్‌బాటిల్‌లోని నీళ్ళు తాగింది శృతిమేడమ్. ఒక పేపర్ కప్‌లో టీ కూడా సేవించింది.

"గొడవచేయకుండా కూర్చో...." అని ఇంకోసారి ఆమెను హెచ్చరించి, షెడ్లోనుంచి బయటికి వెళ్ళిపోయాడు టీ తెచ్చిచ్చిన ఆజానుబాహుడు.

కాని హ్యాండ్ కర్చీఫ్‌తో ఆమె చేతుల్ని వెనక్కి విరిచి కట్టడం మాత్రం మరిచిపోయాడు.

అతను అంతకుముందే ఎక్కడికో వెళ్ళివచ్చినట్టు గమనించడం వల్ల అతను, మిగిలినవాళ్ళు ఏం మాట్లాడుకుంటారో వినాలనే కుతూహలం అధికమయిపోయింది శృతిమేడమ్‌కి.

షెడ్‌కి దూరంగా ఆపివున్న క్వాలిస్ దగ్గిరే బైఠాయించారు వాళ్ళందరూ. లోగొంతుకలతో ఏమేమో మాట్లాడుకుంటున్నారు. వచ్చిన దగ్గిర్నించీ చీకటిలోనే కూర్చుని వుండడంవల్ల అంధకారానికి అలవాటుపడిపోయాయి ఆమె కళ్ళు.

ఆ కళ్ళను చిట్లిస్తూ మొట్టమొదటిసారి తనున్న ఆ షెడ్‌ని పరిశీలనగా చూసింది.

ఒకే ఒక కిటికీ వుంది వెనుక భాగంలో. తలుపులు లేవు.... చెయ్యివేస్తే విరిగి అవతల పడిపోయేటంత బలహీనంగా వుంది కిటికీ ఫ్రేమ్.

రెండుక్షణాలు ఆలోచించి ఆ ఫ్రేమ్‌ని పట్టుకుని గట్టిగా రెండు ఊపులు ఊపింది. వెంటనే వదులై అవతలికి జారిపోయింది అది.

గుండెలనిండా గాలిని పీల్చుకుని అతి నెమ్మదిగా ఆ కిటికీలోకి ఎక్కింది ఆమె.

చప్పుడు చేయకుండా అవతలిపక్కకు దిగింది.

చీకటిమూలంగా ఆమె షెడ్‌లోనుంచి బయటికి రాదని, వచ్చినా ముఖద్వారంలోనుంచే వస్తుందని అనుకుంటున్నారు కాబోలు-ఆమె తప్పించుకోవడాన్ని గమనించలేదు క్వాలిస్‌దగ్గిర వున్నవాళ్ళు.

పంజాబ్‌మెయిల్ మాదిరి వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకుని, దట్టంగా ఎదిగివున్న పొదల్లోకి పోయింది శృతిమేడమ్. అనుకోకుండా తప్పించుకోవడం జరిగింది. ఆ విషయం వెల్లడి కాకముందే

దూరంగా పారిపోవడం చాలా బెస్ట్....

క్వాలిస్‌లో వచ్చినవాళ్ళు ఎవరో, ఎందుకు తనను పట్టుకున్నారో, వాళ్ళ ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకోవాలని ఎంతగా అనిపిస్తున్నా, ఆగకుండా ముందుకే అడుగులు వేసిందామె. వందగజాల దూరం వెళ్ళేసరికి కనిపించింది ఒక పెద్ద తారురోడ్డు. అది ఎక్కడినించి ఎక్కడికి పోతున్నదో తెలియకుండా ఫాలోఅవడం ప్రమాదమని అర్థమై, రోడ్డుపక్కనే పొదల్లో ఆగిపోయింది.

అలా ఆగడమే చాలా మంచిదైందని వెంటనే తెలిసివచ్చిందామెకు. ఎడమ చేతివైపునుంచి వేగంగా వచ్చి ఆమెకు వంద అడుగుల దూరంలో సడెన్‌గా స్లో అయిందొక కాస్ట్లీ కారు. అది చెట్లతోపులో వున్నవారికి సంబంధించిందే అయివుంటుందని ఇంకాస్త వెనక్కి జరగబోతూ, ఉన్నట్లుండి ఉలిక్కిపడింది శృతిమేడమ్.

చెట్లతోపులో వున్నవాళ్ళకు, ఆ కారుకు ఎటువంటి సంబంధమూ వుండటానికి వీలులేదు. ఎందుకంటే అది దీపక్ తాతగారి కారు.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ కళ్ళు చిట్లించి చూసింది శృతిమేడమ్. ఇంజన్ అఫ్‌చేసి స్టీరింగ్ ముందునుంచి దిగిన పర్సనాలిటీని గమనించేసరికి కరెంట్‌షాక్ కొట్టినట్లు జలదరించింది ఆమె శరీరం. సోహన్! సరితాదేవి కొడుకు సోహన్ అతను!

తను నిలబడిన ప్రదేశాన్నంతా పరికించి చూస్తూ సిగరెట్ వెలిగించుకున్నాడు సోహన్. గబగబా నాలుగు పీల్చులు పీల్చి అవతలికి విసిరేశాడు.

పెద్దపెద్ద అడుగులు వేస్తూ తోపులోకి బయలుదేరాడు.

అతను రోడ్డుమీదే వదిలిన కారు దగ్గిరికిపోయి అక్కడినించి జంప్ అయిపోవాలన్న ఆత్రుతను అతిబలవంతంగా అదుముకుంది శృతి మేడమ్.

సోహన్ అక్కడికి ఎందుకు వచ్చాడో తెలుసుకుని తీరాలన్న కోరిక బలీయం అవడంతో, నిర్మొహమాటంగా వెనక్కి తిరిగి మళ్ళీ చెట్ల తోపులోకి పోయింది. క్వాలిస్ ఆగివున్న ప్రదేశానికి యాభైగజాల దూరంలో ఒక చెట్టు చాటున నిలబడి ముందుకు చూసింది.

"వచ్చారా? మీకోసమే ఎదురుచూస్తున్నాం. ఆలస్యంగా వచ్చారు



మీరు" నిష్ఠూరంగా అంటూ సోహన్‌కి ఎదురువచ్చాడు క్వాలిస్ వీరుల నాయకుడు.

"మీకివ్వాల్సిన అమౌంట్‌ని అరేంజి చేసుకోవడానికి లేట్ అయింది. శృతి ఎక్కడ?" అడిగాడు సోహన్.

చీకటి షెడ్‌వంక చేయి చూపించాడు ఆ వ్యక్తి.

"ఆల్‌రైట్....మీ వాళ్ళందర్నీ షెడ్‌కి దగ్గిరిగా నిలబడమని చెప్పు. ఒకళ్ళని లోపలికి పంపి శృతిని కాస్తంత బెదిరించమని చెప్పు. నేను పరిగెత్తుకుంటూ వచ్చి ఎటాక్ చేస్తాను. నన్ను కొట్టినట్టు నటించాలేగాని, నా మీద దెబ్బపడకూడదు. అర్థమైందా?"

"అలాగే....ముందు మా డబ్బు మాకు ఇవ్వండి" అన్నాడు ఆవ్యక్తి సోహన్‌వైపు చేయి చాస్తూ.

ఫ్యాంటుజేబులోనుంచి నాలుగు నోట్లకట్టల్ని తీసి అతనికి ఇచ్చాడు సోహన్ అసహనంగా.

"ఇవి చాలవు. ఇంకో రెండులక్షలు కావాలి...." వాటిని లెక్కబెడుతూ ఎనౌన్స్ చేశాడు ఆ వ్యక్తి.

"కార్లపందెంలో ఫార్టీఫోర్ నెంబర్ కారును ట్రాక్ మీదినించి అవతలికి నెట్టడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. బండరాయి దొర్లిస్తే అది గురితప్పింది. అది ప్రాణాలకు తెగించి చెట్టుకొమ్మను విసిరాడు మావాడు. ఆ దెబ్బకు అది రోడ్డుమీదినించి పల్లంలోకి పడిపోయింది. ఎవరైనా చూసి వుంటే అటునుంచి అటే సరాసరి జైలుకు పోయివుండేవాడు. ఇంకో రెండు ఇచ్చి తీరాలి మీరు" పట్టుదలగా చెప్పాడు నాయకుడు.

"వాడు ఆ దీపక్‌గాడు రేసులో గెలవకుండా వుండటంకోసం నేను మీకు మీకు డబ్బులు ఇచ్చాను. కాని వాడు పల్లంలో పడికూడా గెలిచాడు.. ఇంకా ఎందుకు ఇవ్వాలి?" కోపంగా అడిగాడు సోహన్.

"గెలవటం, ఓడటం మాకు అనవసరం....ఆ కారును పల్లంలో పడిపోయేటట్టు కొట్టమన్నారు మీరు, కొట్టాము. మా పని మేము పూర్తి చేశాము....అంతే....మరింత మొండిగా సమాధానం ఇచ్చాడు ఆ మనిషి.

"ఇది అన్యాయం...." అన్నాడు సోహన్.

"మనం చేసేవన్నీ అన్యాయాలే....అనవసరంగా మాట్లాడవద్దు.... డబ్బు ఇవ్వండి."

"ఓ.కే....నాకు కొంచెం టైమ్ కావాలి. రేపు సాయంత్రానికి రెడీ చేస్తాను. ముందు శృతిని ఇక్కడినించి తీసుకుపోవాలి" అన్నాడు సోహన్ షెడ్‌వైపు చూస్తూ.

"పని జరిగిపోయిందనిచెప్పి మాట తప్పడానికి ట్రై చేయకండి. రేపు సాయంత్రంలోగా మా డబ్బు మాకు చేరకపోతే, మీరాడుతున్న నాటకమంతా ఆ పిల్ల దగ్గిరికొచ్చి నేనే స్వయంగా చెప్పేస్తాను. గుర్తుపెట్టుకోండి" అంటూ తనవారి దగ్గిరికిపోయాడు ఆ మనిషి.

తన చెవులు తనను ఏమారుస్తున్నాయేమోనన్న అనుమానం చెట్టు చాటునవున్న శృతిమేడమ్‌కి కలిగింది.

సోహన్ చెప్పింది వింటున్నదాన్నిబట్టి పందెంలో దీపక్ గెలిచాడన్న మాట ఆమెలో అదోరకమైన ఆనందాన్ని, తృప్తిని కలిగించింది. తను కిడ్నాప్ అవడానికి కారకుడు సోహనే అని అర్థమయ్యేసరికి దారుణమైన కోపం ఆమెను ఆవరించుకుంది. తనేం చేస్తోందో తనకే తెలియని తీవ్రమైన ఆగ్రహంతో ఆమె చెట్టుచాటునుంచి సరాసరి సోహన్ దగ్గిరికి బయలుదేరబోతుండగా——

"బాబాయ్....పిల్ల షెడ్లో లేదు. వెనుక పక్కనుంచి తప్పించుకుని పారిపోయింది. రండి....రండి...." అంటూ బిగ్గిరిగా వినవచ్చింది ఒక అరుపు.

క్వాలిస్ దగ్గిర వున్న జనం అందరూ అటుకేసి పరిగెత్తడాన్ని చూసేసరికి, ముఖంమీద చన్నీళ్ళు చిలకరించినట్టు చల్లారిపోయింది ఆమె కోపం.

"వెతకండి ఎంతోదూరం ఈ చీకట్లోపోయి వుండదు. తోపునంతా గాలించండి" ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ ఇచ్చాడు క్వాలిస్ పీరుల నాయకుడు.

క్వాలిస్ దగ్గిరే నిలబడివున్న సోహన్‌లో వెంటనే చలనంవచ్చింది "నేను ఇక్కడ వుండకూడదు....ఆ శృతి నన్ను ఇలా చూడటం జరిగితే



చాలా ప్రమాదం. ఆమెను పట్టుకుని నాకు ఫోన్ చేయండి....అప్పుడు వస్తాను" అంటూ సమాధానంకోసం ఎదురుచూడకుండా హడావుడిగా రోడ్డు మీదికి పరిగెత్తాడు.

* * * *

చెట్టుచాటునుంచి తను కూడా రోడ్డుమీదికి బయలుదేరింది శృతి మేడమ్. సోహన్ కారు ఎటువైపు వెళుతుందో చూడగలిగితే తనకు డైరెక్షన్స్ తెలుస్తాయి. చెట్లతోపులోని వాళ్ళు రోడ్డుమీదికి వచ్చేసరికి తను చాలా దూరం వెళ్ళిపోవచ్చు. ఇంతలో సోహన్ పరుగులాంటి నడకతో పోయి కారును స్టార్ట్‌చేసి వచ్చిన దారినే వేగంగా వెనక్కి వెళ్ళిపోయాడు.

"అదిగో....అదిగో రోడ్డుమీదికి పోతోంది.... పట్టుకోండి.... అంటూ శృతిమేడమ్‌ని చూపించి, అందరినీ ఎలర్ట్ చేశాడు క్వాలిస్ పీరుల్లో ఒకడు.

చెమటలు పట్టేశాయి శృతిమేడమ్‌కి....కాళ్ళు, చేతులు వణకడం మొదలుపెట్టాయి. అవకాశం వున్నప్పుడే అవతలికి వెళ్ళిపోకుండా అక్కడే ఆగినందుకు తనను తాను తిట్టుకుంటూ రోడ్డుమీదికి చేరుకుంది.

"ఆగు! ఆగిపో! లేకపోతే చంపేస్తాం" అంటూ తోడేళ్ళమందలా ఆమె దగ్గిరికి వచ్చేశారు క్వాలిస్‌పీరులు.

నీళ్ళతో నిండిపోయాయి శృతిమేడమ్ కళ్ళు. ముఖాన్ని చేతులతో కప్పుకుంటూ రోడ్డుమీద నిలబడిపోతుండగా- మోతలుచేస్తూ వచ్చి ఆమెకు ఆరడుగుల దూరంలో ఆగింది, మోరిస్ మైనర్ చిన్నకారు.

* * * *

ఉలిక్కిపడి ముఖంమీది చేతులను తీసేసిన శృతిమేడమ్ దగ్గిరికి జంప్‌చేసి, "డోన్ట్‌వర్రీ శృతీ....మేం వచ్చేశాం" అంటూ అనునయించాడు దీపక్.

"చిన్నబాబూ! మీరు హాయిగా కార్లో కూర్చోండి. వీళ్ళ సంగతి మాకు వదిలేయండి" అంటూ దీపక్ పక్కనుంచి ముందుకు దూసుకుపోయాడు వహీద్.

ఎంత బిగపట్టుకున్నా ఆగకుండా తుఫాన్ మాదిరి శృతిమేడమ్‌ని కుదిపేసింది దుఃఖం. ఆమెకు తెలియకుండానే కన్నీటితో మలినమైపోయాయి బుగ్గలు. చటుక్కున రెండుచేతుల్ని జాచి ఆమెను తన దగ్గిరికి తీసుకున్నాడు దీపక్.

"ఇట్సాల్‌రైట్ శృతీ! నీకేం భయంలేదు. మేము వచ్చేశాం కదా" అంటూ అలాగే భొదివిపట్టుకుని కారు దగ్గిరికి తీసుకెళ్ళి ఫ్రంట్ సీట్లో కూర్చోపెట్టాడు.

"నువ్వు వెళ్ళద్దు....నా దగ్గిరే వుండు" అవతలికి పోబోయిన అతని చేతిని పట్టుకుని ఆపుతూ చెప్పింది శృతిమేడమ్.

"నీకేం భయంలేదు శృతీ! ఒక్క నిముషంలో వచ్చేస్తా" అంటూ ఆమె చేతిని వదిలించుకుని అక్కణ్ణించి వేగంగా ముందుకు పోబోయాడు దీపక్.

యాక్సిడెంట్‌లో దెబ్బతగిలిన కుడిపాదం సహకరించకపోవడంతో, తూలి ముందుకు పడిపోయాడు.

"మైగాడ్....ఏమైంది?" ఆందోళనగా అడుగుతూ కారుదిగి అతని దగ్గిరకి పరిగెత్తింది శృతి. అతని భుజాల్ని పట్టుకుని అతి ప్రయత్నంమీద లేపి నిలబెట్టే సమయానికి, అంతమైపోయింది అవతలగా జరుగుతున్న పోరాటం.

చెట్లతోపులోకి పారిపోయిన క్వాలిస్ వీరుల్లో నలుగురు మాత్రమే వహీద్ బృందానికి దొరికారు. వారి కారులోనే వారిని ఎక్కించి స్వయంగా నడుపుకుంటూ రోడ్డుమీదికి తీసుకువచ్చాడు గండయ్య.

పోరాటం ఎండ్ అయిన వెంటనే తన ఫోన్‌తీసి లాయర్‌సాబ్‌కి రింగ్‌చేశాడు పీటర్.

*   *   *   *

పోర్టికోలో కూడా నిలబడలేక ఏకావెకీ రోడ్డుమీదికొచ్చి నిలుచున్నాడు లాయర్‌సాబ్. మోతలుచేస్తూ వచ్చిన మోరిస్‌మైనర్ దగ్గిరికి జంప్‌చేసి, కారుదిగిన శృతిని గట్టిగా గుండెలకు అదుముకున్నాడు.



తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుని కన్నీరుపెట్టడంనించి బయట పడింది ఆమె.

"నీతో చాలా విషయాలు మాట్లాడాలి" అంటూ తనే లాయర్‌సాబ్‌ని లోపలికి తీసుకుపోయింది.

క్వాలిస్‌ని, అందులోవున్న హీరోలని లాయర్‌సాబ్ ఇంటిదగ్గిరే వున్న పోలీస్ ఆఫీసర్స్‌కి హ్యాండోవర్ చేయించాడు దీపక్. అయినాంపేట చెట్లతోపు అడ్రసుచెప్పి, తమకు దొరకకుండా పారిపోయినవారిని గురించి పూర్తి ఇన్ఫర్మేషన్‌ను వాళ్ళకి ఇచ్చాడు.

"ఎందుకు జరిగింది ఈ పని?" ఆశ్చర్యంగా అడిగాడు ఒక పోలీస్ ఆఫీసర్.

"అది మీరు ఇంటరాగేట్‌చేసి తెలుసుకోండి" అంటూ వహీద్‌వంకా, పీటర్‌వంకా చూశాడు దీపక్.

"మనం అపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోదాం చిన్నబాబూ! తెల్లవారిన తర్వాత వచ్చి లాయర్‌సాబ్‌ని పలకరిద్దాం" అన్నాడు పీటర్ దీపక్ వంక చూస్తూ.

తనను లోపలికి రమ్మని మర్యాదకోసమైనా ఒకమాట అనకుండా వెళ్ళిపోయిన శృతిమేడమ్ వింత ప్రవర్తనను తలుచుకుంటూ కార్లో కూర్చున్నాడు దీపక్.

"మైగాడ్....దిసీజ్ అన్‌బిలీవబుల్.... సరితాదేవి బ్రహ్మరాక్షసే కావచ్చు. ఆ సోహన్ వట్టి పొగరుబోతే అవవచ్చు.... వారిద్దరూ కలిసి దీపక్‌ని ఈ విధంగా దెబ్బకొట్టాలని అనుకోవడం నిజంగా అన్‌బిలీవబుల్! నిన్ను కిడ్నాప్ చేయించి, తను రక్షించినట్టు నాటకం ఆడి తద్వారా నా వైపునుంచి ఎలాంటి అబ్జెక్షను రాకుండా ప్లాన్‌వేయడం....అయ్యబాబోయ్! క్రిమినల్ ఆలోచనలకు అది పరాకాష్ట" అన్నాడు లాయర్‌సాబ్ ఆశ్చర్యంగా.

చెట్లతోపులో తను విన్న సంభాషణను పూర్తిగా వినిపించి, సోఫాలో భారంగా వెనక్కివాలి కూర్చున్న శృతిమేడమ్‌కి కూడా అలాగే అనిపించింది.

"నువ్వు ఆశ్చర్యపడటానికి నేను చెప్పలేదు. ఆ కిడ్నాపర్స్‌ని పోలీసులు రెండు ఉతికితే అన్ని మాటలూ బయటికి వచ్చేస్తాయి. సురేంద్ర గారి పరువు సరాసరి బజార్లోకి వచ్చి నిలబడుతుంది....ఏం చేయాలో ఆలోచించు" అని అన్నదామె రెండు క్షణాల తర్వాత.

ఎందుకో ఏదో అనుమానం వచ్చినవాడిలా ఆమెవంక చూస్తూ- "యువ్వార్ వెరీ పర్టిక్యులర్ ఎబౌట్ సురేంద్రగారి పరువు. కారణం ఏమిటో తెలుసుకోవచ్చా?" అని అడిగాడు లాయర్ సాబ్.

"ఇట్స్ వెరీ సింపుల్ అంకుల్! రేపు నేను ఆ ఇంటికి కోడలుగా వెళ్ళబోతున్నాను....వాళ్ళ పరువు, నా పరువు ఒక్కటే...." క్లుప్తంగా చెప్పిందామె.

ఒక్కసారిగా ముందుకు దూకి, ఆమెను అమాంతం సోఫాలోనుంచి లేపి ఆనందంతో గట్టిగా తన గుండెలకు అదుముకున్నాడు లాయర్ సాబ్.

"నీ డెసిషన్ ఏమిటో ముందునుంచీ నాకు తెలుస్తూనేవుంది. బట్ స్టిల్ చాలా ఎగ్జయిటింగ్‌గా వుంది. రేపే మీ నాన్నకి ఫోన్‌చేసి రప్పిస్తాను. ఇప్పుడు మనం ఒకసారి అర్జెంటుగా డి.జి.పిగారి దగ్గిరికి, ఇప్పటివరకూ ఇక్కడేవున్న పోలీస్ ఆఫీసర్ల దగ్గిరికి పోయిరావాలి. కమాన్" అంటూ ఆమె అలసిపోయి వున్నదనికూడా చూడకుండా బయటికి తీసుకుపోయాడు లాయర్ సాబ్.

## 18

తూర్పుదిక్కు తెల్లబడేసరికి వార్తాపత్రికలన్నిటిలోను ప్రముఖంగా ప్రింట్ చేయబడింది కారుపందెంలో దీపక్ ఫస్ట్‌గా రావడాన్ని గుర్తించిన వార్త.

రమాకాంత్ అండ్ కో అయితే, "ఉయార్ వెరీ ప్రౌడ్ ఆఫ్ అవర్ యంగ్ బ్లడ్....దీపక్ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది యువకులు మరిన్ని ఎడ్వెంచర్స్‌లో పాల్గొంటారని, అలాంటివారికి మేము ఎల్లప్పుడూ తోడుగా, నీడగా వుంటామనీ మనవి చేస్తున్నాం" అంటూ పెద్ద అక్షరాలతో ఊదరకొట్టేసింది.



ఆరోజు హోటల్‌నించి తెప్పించిన కాఫీకూడా నచ్చలేదు సురేంద్ర సాబ్‌కి. "నేను లాయర్ దగ్గిరికి పోయివస్తాను" అంటూ ఎవరి సమాధానం కోసమూ ఎదురుచూడకుండా, తన కారును తనే నడుపుకుంటూ తిన్నగా లాయర్ సాబ్ దగ్గిరికి వచ్చేశాడు.

రాత్రంతా సరిగ్గా నిద్రపోకుండా వుండటంవల్ల బాగా నలిగిపోయి వుంది శృతిమేడమ్ ముఖం.

చెప్పాపెట్టకుండా వచ్చేసిన సురేంద్రసాబ్‌ని చూడగానే ఫ్లడ్ లైటులా ప్రకాశించింది శృతి ముఖం.

ఆమె క్షేమంగా ఇంటికి వచ్చిన వార్తని తనకు వెంటనే తెలియజేయనందుకు లాయర్‌మీద ఇంతెత్తున లేచాడు సురేంద్రసాబ్. "నువ్వు వట్టి మడ్డిముఖానివి....నీకు తెలుసా?" అనికూడా అడిగాడు.

"నా మేనకోడలు క్షేమంగా ఇంటికి చేరుకున్న వార్తని నీకు ముందుగా చెప్పకపోవడం తప్పే.... ఒప్పుకుంటున్నా. మరి నీ మనవడు కార్ల పందెంలో ఫస్ట్‌వచ్చిన మాటని నువ్వు నాకు చెప్పావా? టీ.వీ.వాళ్ళు అడిగితే తనకి స్ఫూర్తి నువ్వేనని పబ్లిక్‌గా ప్రకటించాడు. మరి దీనికి ఏం సమాధానం చెపుతావ్?" అడిగాడు లాయర్ సాబ్.

"వాడు....వట్టి వెధవ" మాటల కోసం తడుముకుంటూ అన్నాడు సురేంద్రసాబ్.

"వెధవ అయినా కాకపోయినా వాడు నీ మనవడు....ఆ మాట మర్చిపోకు" అన్నాడు లాయర్ సాబ్.

"ఎలా మర్చిపోతాను? నా పెద్దరికాన్ని గౌరవించి నా దగ్గిరికి వచ్చినవాళ్ళ బాధని వాడిమూలకంగానే నేను తీర్చలేకపోయాను. ఆ మాట మర్చిపోతానా ఏమిటి?" కోపంగా అడిగాడు సురేంద్రసాబ్.

"నషీలీ గురించి నువ్వింకా మర్చిపోలేదన్నమాట" అంటూ శృతి మేడమ్ వైపు చూశాడు లాయర్ సాబ్.

సురేంద్రసాబ్‌కి చక్కటి సువాసనలు వెదజల్లుతున్న కాఫీని తెచ్చి ఇచ్చింది శృతిమేడమ్. టీపాయ్‌మీద వున్న ఫోన్‌బుక్‌ని లాయర్ సాబ్‌కి అందించింది.

"ఈ విషయం నాకు నిన్న ఉదయమే తెలిసింది. నీ దగ్గిరికి వచ్చి

చెబుదామని అనుకుంటుండగా ఒకదాని వెనుక ఇంకోటిగా పనులు....చీకటి పడ్డాక శృతి గొడవ....తీరిక లేకుండాపోయింది" అంటూ ఒక నెంబర్ చూసి, ఆ నెంబర్ కి డయల్ చేశాడు లాయర్ సాబ్.

అవతలినించి సమాధానం రాగానే-

"మీరు ఒకసారి సురేంద్రసాబ్ తో మాట్లాడండి....మీకు అన్యాయం జరిగిందనే ఆయన అనుకుంటున్నాడు...." అంటూ ఫోన్ ని సురేంద్రకి యిచ్చాడు

"హల్లో....సాబ్....నేను నషీలీ తాతయ్యని మాట్లాడుతున్నాను. మొన్న సాయంత్రం మా అమ్మాయి నషీలీ తన పెనిమిటితో, అత్తమామలతో ఇంటికి వచ్చి తనను క్షమించమని అడిగింది....మా శాహతుకు మించిన సంబంధం అది....మా బిడ్డని వాళ్ళు చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. మాకు సంతోషంగా వుంది.

అల్లుడిని, మా అమ్మాయిని మేము నాలుగురోజులు మా దగ్గరే వుంచుకుంటున్నాం. మా సమస్య తీరిపోయింది సాబ్....మీ దగ్గిరికి వచ్చి మిమ్మల్ని అనవసరంగా కష్టపెట్టినందుకు మాఫ్ చెయ్యాలి."

మాట సరిగ్గా రాలేదు సురేంద్రసాబ్ కి....తనకి సంతోషంగా వున్నట్టు ఒక మాట చెప్పి ఫోన్ పెట్టేశాడు.

"కాలం మారిపోయింది సురేంద్రా....కాలంతోపాటు మనం కూడా మారాలి. మనకాలంలో పట్టుకుని వేలాడిన ఆచారాలు, గౌరవాలు ఇప్పుడు అవుటాఫ్ ఫ్యాషన్" చిన్నగా చెప్పాడు లాయర్ సాబ్.

"నేను....నేను తప్పుచేశానా? తొందరపడ్డానా?" సన్నటి నీటిపొర కళ్ళకు అడ్డంపడుతుండగా మాటలు కొంచెం తడబడుతూ అడిగాడు సురేంద్రసాబ్.

"తప్పు చేయలేదు. తొందరపడటంమాత్రం నిజం" తడుముకోకుండా అన్నాడు లాయర్ సాబ్.

"తొందరపడితే మాత్రం తనకి బుద్ధి వుండక్కరలేదా? బయటికిపో అనగానే పెద్ద మొనగాడిలా అలా ఇల్లు వదిలి బయటికి వెళ్ళిపోవడమేనా?"

"ఓ.కే....ఓ.కె....జరిగిందేదో జరిగిపోయింది. ఒకసారి మనం



అతని దగ్గిరికి పోయి" అంటున్న లాయర్ సాబ్ మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు సురేంద్రసాబ్.

"పొరపాటున కూడా వాడి దగ్గిరికి రాను....వాడే రావచ్చుగా.... పందెం గెలిచినట్టు తనే వచ్చి నాతో చెప్పచ్చుగా....పేలెడు కూడా లేని ఆ వెధవకి అంత పట్టుదల వుంటే, పెద్దవాడిని నాకెంత వుండాలి?"

ఆయన ఆ మాట అంటుండగానే ద్వారంలో ప్రత్యక్షం అయ్యాడు పీటర్.

"నువ్వెందుకు వచ్చావ్?" అంటూ సీరియస్ గా అడిగాడు సురేంద్రసాబ్.

"సార్....చిన్నబాబు మీ దగ్గిరికి వచ్చాడు. మీరు ఇంట్లో లేరని తెలిసి చాలా బాధపడ్డాడు.

నిన్న కారు పందెంలో కొంచెం దెబ్బలు తగిలాయి. పొద్దున్న లేచేసరికి నూట నాలుగు జ్వరం వచ్చింది" గబగబా చెప్పాడు పీటర్.

చటుక్కున సోఫాలోనుంచి లేచాడు సురేంద్రసాబ్.

"జ్వరం వచ్చిందని నెమ్మదిగా చెబుతున్నావా? డాక్టర్ని పిలిచావా. లేదా?" అంటూ పోర్టికోలోకి వెళ్ళబోతుండగా, వహీద్ భుజంమీద చెయ్యి వేసి కుంటుకుంటూ ఆయనకి ఎదురువచ్చాడు దీపక్.

కొండగుట్టమీదినించి తల్లకిందులుగా పల్టీలు కొడుతున్న కార్లో నిబ్బరంగా కూర్చుని, భరించరానంత దెబ్బ తగిలినా పళ్ళు బిగించి ఓర్చుకున్న దీపక్ కళ్ళల్లో గిర్రున తిరిగాయి నీళ్ళు.

"ఐయామ్ సారీ తాతయ్యా...." అంటూ ఆయన పాదాల్ని తాకబోయాడు.

తాకకముందే ముందుకు వంగి అతన్ని కౌగిలిలో పొదువుకున్నాడు సురేంద్రసాబ్.

"నువ్వు వట్టి మట్టిముఖానివి. ఒళ్ళు కాలిపోతుంటే డాక్టర్ దగ్గిరికి పోకుండా వీధుల్లో చక్కర్లు కొడుతున్నావా? నీకు బుద్ధిలేదు...." అంటూ తీసుకువచ్చి సోఫాలో కూర్చోబెట్టాడు.

"ఫోన్ చెయ్యి....డాక్టర్ యుగంధర్ కి వెంటనే రమ్మని చెప్పు" అంటూ పీటర్ కి ఆర్డర్ యిచ్చాడు.

ఆయన తనవంక చూసిన వెంటనే ఆ పని చేయడం మొదలు పెట్టాడు పీటర్.

* * * *

"అయినాంపేట్ కాపుసారా బృందం మొత్తం పోలీసుల చేతికి దొరికిపోయింది" ఉదయం పదకొండు గంటల సమయంలో సురేంద్రసాబ్ ఇంటికి వచ్చి, హాల్లో అసహనంగా కూర్చుని ఉన్న సరితాదేవికి, సోహన్‌కి చెప్పాడు లాయర్ సాబ్.

సరితాదేవి ముఖం కళతప్పింది. సోహన్ ముఖం రక్తం లేనట్టు పాలిపోయింది.

"వాళ్ళని ఇంటరాగేట్ చేయటం మొదలుపెట్టిన పోలీసులకు దీపక్ కారు వల్లంలోకి ఎందుకు దొర్లిందో తెలిసింది. మా శృతిని ఎందుకు కిడ్నాప్ చేశారో అర్థం అయింది. ఈ సంఘటనలన్నిటికీ మూలకారకుల పేర్లు కూడా బయటికి వచ్చేశాయి" వాళ్ళ ఫీలింగ్స్‌తో పనిలేనట్టు తన మానాన తాను చెప్పుకుంటూ పోయాడు లాయర్ దామోదరం.

"సురేంద్ర నా క్లయింట్ మాత్రమే కాదు....దేవుడు నాకు ప్రసాదించిన స్నేహితుల్లో అతి ముఖ్యుడు....మీ తల్లీకొడుకుల పేర్లు బయటికి వస్తే అతని పరువుపోతుంది. అది నాకు ఇష్టంలేదు."

బిక్కచచ్చి వింటున్నారు తల్లీకొడుకులు.

"ఇప్పటివరకూ ఈ విషయాలు నాకు, మా శృతికి, పోలీసులకు తప్ప దీపక్‌కి కూడా తెలియవు....మీరు బట్టలు సర్దుకుని మీ ఊరు వెళ్ళిపోండి....ఎప్పుడైనా సురేంద్ర పిలిస్తే చుట్టంచూపుగా వచ్చి ఒక రెండు రోజులు ఆనందంగా గడపండి.

అంతకుమించి ఇంకేమైనా ఆశలు పెట్టుకుంటే మాత్రం పరిస్థితి చాలా అసహ్యంగా మారుతుంది....బాగా ఆలోచించుకోండి...." అంటూ సోఫాలోనుంచి లేచి బయటికి వెళ్ళిపోయాడు.



చలనంలేని బొమ్మలమాదిరి కూర్చుండిపోయిన తల్లీకొడుకులు చూస్తూ వుండగానే, ఒకరి వెనుక ఒకరుగా ఇంట్లోకి వచ్చారు పీటర్, గండయ్య, మరియమ్మ, అవతారం, సీతమ్మ.

"మధ్యాహ్నం రెండుగంటల ట్రైన్‌కి మీకు టిక్కెట్లు రిజర్వ్ చేయించమని లాయర్ సాబ్ చెప్పారు. చేయించమంటారా?" సరితాదేవిని అడిగాడు పీటర్.

చివ్వున సోఫాలోనుంచి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది సరితాదేవి సోహన్‌తో సహా....సుమారు ఓ అరగంట తర్వాత తమ లగేజీతో సహా బయటికి వచ్చింది.

దగ్గిరవుండి వారిద్దరినీ కారెక్కించి, గేటుదాకా సాగనంపాడు పీటర్.

* * * *

సిద్ధిపేట్‌లో శృతిమేడమ్‌కి చెప్పినట్టే ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగు ఏర్పాటు చేయించాడు వహీద్. నార్కెట్‌పల్లినించి ఏనుగును రప్పించాడు....బాణసంచా, మైకులు అరేంజి చేయించాడు.

అయిదురోజులపాటు ఊపిరి సలపనంతగా జరిగాయి ఉత్సవాలు. గంగారం చుట్టుపట్ల వున్న ఊళ్ళనించి జనం తండోపతండాలుగా వచ్చేశారు. విందులు, వినోదాలతో అయిదురోజులు సిటీలోనే వుండిపోయారు.

అవసరసమయంలో తన మనవడికి తోడుగా నిలిచేందుకు తమ ఉద్యోగాల్ని సైతం లెక్కచేయకుండా వదులుకోవడానికి సిద్ధపడిన తన వర్కర్స్ అందర్నీ, అందరిముందూ ఘాటైన మాటలతో ఇష్టం వచ్చినట్టు తిట్టి, వారి విశ్వాసానికి ప్రతిఫలంగా తన ఫారమ్‌హౌస్‌లలో మూడింటిని వాళ్ళందరికీ ఈనాంగా ఇచ్చేశాడు సురేంద్రసాబ్.

"ఈ ఇల్లు, ఈ కుటుంబం అన్నీ మీవే....నాకు కోపం వచ్చి ఎప్పుడైనా వెళ్ళిపొమ్మని అన్నాకూడా మీరు వెళ్ళిపోవాల్సిన అవసరంలేదు" అని కూడా అందరిముందూ చెప్పేశాడు.

అయిదురోజుల ఉత్సవాలతో కాలు, చెయ్యి కదిలించడానికి కూడా

ఓపిక లేనంతగా అలిసిపోయిన శృతిమేడమ్‌కి ఎంతో సంతోషం కలిగించాయి సురేంద్రసాబ్ అన్న ఆ మాటలు.

*    *    *    *

"నీ పెళ్ళికి సరితాదేవి రాలేదు. గమనించావా?" హనీమూన్‌కి వెళ్ళే రోజున రహస్యంగా శృతిమేడమ్‌ని అడిగాడు లాయర్‌సాబ్.

మౌనంగా తల ఊపింది శృతిమేడమ్.

"సురేంద్రకి తెలియదు....దీపక్‌కి కూడా తెలియనియ్యను. ఆ ఛాప్టర్ ముగిసిపోయింది" అంటూ ఆమె భుజం తట్టి వీడ్కోలు పలికాడు.

అమెరికాకో, ఐర్లాండుకో, కనీసం రామోజీఫిల్మ్‌సిటీకో వెళతారని అందరూ అనుకున్న ఆ జంట తమ కారును తామే డ్రైవ్ చేసుకుంటూ సిద్ధిపేట్ వెళ్ళిన సంగతి లాయర్‌సాబ్‌కి కూడా తెలియలేదు.

—: శు భ ం :—